UNIVERSAL
LIBRARY

OU_204174

UNIVERSAL
LIBRARY

UNIVERSITY LIBRARY

Accession No.

urned on or before the date last marked below

శ్రీమదాంధ్రభాగవతము.

ఏకాదశ, ద్వాదశ స్కంధములు.

శ్రీకృష్ణాయపరబ్రహ్మణే నమః.

అఖిలకల్మషాపహారంబగు

శ్రీమద్భాగవతము

ఏకాదశ ద్వాదశ స్కంధములు.

అంధ్రవచనము.

ఎనిమిదవ భాగము. (2347–2739)

శ్రీ చివరాజసుధాసుందరీప్రణీతము.



ఆనందనిలయప్రకాశనమువారిముద్రితము.

ఆర్. వేంకటేశ్వర్ అండ్ కంపెనీవారిచే

ప్రకటితము.

1924

(Copyright Registered.)

All Rights Reserved.

Copyright 1918—By R. Venkateshwar & Co., Madras.
This book is fully protected by an Indian and Foreign Copyright. No one will be permitted to reproduce this book in whole or in part or translate it into any other language and offer it for sale A substantial copy of the words, ideas or illustrations contained herein constitutes an infringement of a copyright, and notice is hereby given that suit will be filed in every case of infringement.

కాపీరైట్ 1918 వ సంగి ఆర్. వేంకటేశ్వర్ అండ్ కంపెనీవారు కాపీరైటుదార్లు. ఈ పుస్తకము ఇండియా కాపీరైటు చట్టమును పరదేశీయమైన కాపీరైటు చేతను సురక్షితమైనది. ఎవరుగాని యీపు స్తకమును సంపూర్ణముగాగాని లేక యిందొక భాగమునుగాని తొలువేయుగా ప్రకటించుటకును, మరియొక భాషయందు తెర్జుమా చేసి క్రియమోకు చెయ్యుటకును, హక్కు ఇవ్వబడదు. ఇందుగల పదములనుగాని భాగములనుగాని పటములనుగాని ఏమాత్రమైన కాపీచేసివాడిన అది కాపీరైటును నుల్లంఘించిన ట్లుగా చేసి అట్టివారు దావాకు లోనగుదురని దీనిచే తెలియనగును.

విషయసూచిక.

ముసలము పుట్టినకథ 2437

నారదుఁడు వసుదేవునకు విశ్వామిత్ర సంవాదమును జెప్పుట ... 2352

జనకాశ్వ సంవాదము అనుబంధము 2362

డిటో డిటో 2376

డిటో డిటో 2382

బ్రహ్మములు ద్వారకకువచ్చి శ్రీకృష్ణుని స్తుతించుట ... 2393

శ్రీకృష్ణుఁడు ఉద్ధవునకుఁ బరమోపదేశము సేయుచు నవధూత
యదు సంవాదమును జెప్పుట 2403

అవధూతయదు సంవాదము (అనుబంధము) ... 2418

డిటో డిటో 2427

భక్తియోగమును దానికంటె నులను నిర్గుణాదిసాధనములను
భగవంతుఁడు ఉద్ధవున కుపదేశించుట 2435

శ్రీకృష్ణుఁడు ఉద్ధవునకు జీవపరమాత్మస్వరూపమును నుపదేశించుట ... 2446

శ్రీకృష్ణుఁడు ఉద్ధవునకుఁ బ్రపత్తియోగమును జెప్పుట ... 2457

,, సత్త్వాదిగుణ కర్మాదులను జెప్పుట ... 2463

శ్రీ భగవంతుఁడు మోక్షపురుషార్థము తిన్నగాదప్ప మఱేదేని
గుణించినదికాదని నిర్ణయించుట 2475

సమాధిపర్యంతమగు ధ్యానయోగమునకు ముక్తియేకాక యణిమాది
సిద్ధులును ఫలములగునని చెప్పుట 2484

శ్రీకృష్ణుఁడు తన విభూతుల నుద్ధవునకుఁ జెప్పుట ... 2491

శ్రీకృష్ణుఁడు బ్రహ్మచారిగృహస్థవర్ణముల నుద్ధవునకుఁ బ్రతిపాదించుట. 2498

శ్రీకృష్ణుఁ డుద్ధవునకు వానప్రస్థాశ్రమధర్మములను జెప్పుట ... 2509
శ్రీ భగవంతుఁడు భక్తియోగమున కశక్తులగువారికి న్యాసము ముక్తి
సాధనముగాఁ జెప్పుట 2518
శ్రీకృష్ణుఁ డుద్ధవునకు భక్తిజ్ఞాన కర్మములను నందు భక్తి యతిశయ
మును నిర్ణయించుట 2526
శ్రీ భగవఁడు డుద్ధవునకు కేశశాలాదుల శుద్ధత్వాశుద్ధత్వముల
విధమును జెప్పుట 2536
శ్రీకృష్ణుఁ డుద్ధవునకుఁ ద్రవ్యముల సంఖ్యాస్వరూపములను నిర్ణ
యించుట 2548
శ్రీకృష్ణుఁడు సుఖదుఃఖములకు హేతువు మనస్సేయని యుక్తిపూర్వ
కముగా నిరూపించుట 2565
శ్రీకృష్ణుఁ డుద్ధవునకు సాంఖ్యము నుపదేశించుట ... 2581
శ్రీకృష్ణుఁ డుద్ధవునకు నిర్గుణత్వమును బ్రతిపాదించు చిత్తవృత్తియొక్క
లగు వానిని బ్రతిపాదించుట 2587
స్త్రీసంగము దూష్యమని తెలుపుటకై యైలగీతలు సాధుసంగ
ప్రభావము 2596
శ్రీ భగవంతుఁ డుద్ధవునకు భగవదారాధనక్రమమును జెప్పుట ... 2602
శ్రీ భగవంతుఁ డుద్ధవునకు జ్ఞానయోగమును మరల సంగ్రహరూప
మున నిర్ణయించుట 2612
శ్రీ భగవంతుఁ డుద్ధవునకు మరల సంగ్రహముగా భక్తియోగమును
నిర్ణయించుట 2625
బ్రాహ్మణశాపమువలన యదువులు పరస్పరము కలహించి నాశము
నొందుట. బలరామ నిర్యాణము 2636
శ్రీకృష్ణ నిర్యాణము. వసుదేవాదులు పరలోకమున కేగుట ... 2643

ఏకాదశ స్కంధము సమాప్తము.

ద్వాదశస్కంధము.

శుకుఁడు పరిక్షిత్తునకుఁ గలియుగ ప్రాదుర్భావ లక్షణములను
జెప్పుట 2653

మమకారముగల రాజులను భూమిపరిహరించుట. ఆయాయుగముల
ధర్మములు, ప్రజల వర్తనములును 2660

శుకుఁడు పరిక్షిత్తునకుఁ గల్పప్రలయముల కాలపరిమాణములను
జెప్పుట 2668

భాగవతమునకుఁ బ్రధానప్రతిపాద్యమును నిష్కర్షించి చూపుము
నుస్కం డగు విభుమును శుకులు పరిక్షిత్తునకుఁ జెప్పుట ... 2679

శుకులు పరిక్షిత్తును విడిచిపోవుట. తక్షకబ్రహ్మండై పరిక్షి మృతుఁ
డగుట. జన మేజయుఁ సర్పయాగము. వేదవిభాగప్రచారాదికము. 2682

అథర్వవేదవిభాగము 2694

మార్కండేయ చరిత్రము 2698

మార్కండేయ చరిత్రము (అనుబంధము) 2706

డిటో డిటో 2712

మహాపురుష ద్వాదశాదిత్యవ్యూహాదులను వర్ణించుటయు ... 2718

ఈ పురాణమందలి విషయానుక్రమణికయు భాగవత మాహాత్మ్యము
మొదలగునవియు 2728

శ్రీమదాంధ్ర భాగవతము

సంపూర్ణము.



శ్రీరామచన్ద్రాయ పరబ్రహ్మణేనమః.

శ్రీమదాంధ్రభాగవతము

ఏకాదశస్కంధము.

ముసలము పుట్టినకథ.

శ్రీశుకుఁడు—కృష్ణుఁడు బలరామునిని యదువులను నవుడవుడు తోడుచేసికొని, పూతన మొదలగు దైత్యులను వధించి పాండవులకును గౌరవులకును మిక్కిలి బలవంతమైన కలహమునుబుట్టించి భూమిభారమును దింపినవాఁడయ్యె. పాండవుల శత్రువులగు దుర్యోధనాదులు వారిని గపటంబగు జూదమాడించిరి, వెక్కులవమానములుచేసిరి, దుశ్శాసనునిచే వారిద్రౌపది కొప్పనుబట్టి యీడ్చునట్లు గావించిరి. మఱి విషముపెట్టుట మొదలుగా నెన్నియో చేసిరి. ఇట్లు మాటిమాటికిఁ జేయుచుండి నందఱఁ బాండవులు సయింపక కోపముగొని వారితో యుద్ధమునకుఁ బూనిరి. భగవంతుఁడా పాండవులను నిమిత్తముగాఁ జేసికొని యట్లు యుద్ధమునఁగూడిన రాజుల నొకరిచేత నొకరిని జంపించి భూభారమును హరించెను. మఱియు నతఁడు తన బాహువులచేత రక్షితులైయున్న యాదవులనుగొని భూమికి భారభూతులైన రాజుల సేనలను హతము గావించెను. అతని

స్వరూపస్వభావములనింత యంత యని కొలఁదిపెట్ట శక్యమా! ఇట్లన్నియుఁజేసి యాహారి యొకప్పుడు తఁలోఁదాను 'భూమికిఁ గలభారము తీఱిపోయిఁను నిఁకను దీఱుకున్నదనియే నాకుఁ దోఁచుచున్నది. ఏలంటిమా? యీయాదవకులసమిక్కిలి విఖ్యాతులకెవ్వరికిని సహింపశక్యముగాకున్న దే.భూమిభారమును బూర్ణముగాఁ దీర్చుట్చే యవతరించి యీ మిగత పెట్టుటతగునా! దీనికి నాశముగాని యపజయముగాని మఱి యొక్కరివలననుఁ గలుగనేరదు. ఏలఁగా నిది నన్నాశ్రయించి యున్నది నన్నాశ్రయించినవారికి నశుభమొక్కఁడింపఁ? మఱి దీని వీర్యశౌర్యాదులఁ నిధనముఁలో నిత్యముఁను బై ఏయిని బెరుఁగుచున్నవి. ఇట్టి దీనిని ద్రుంచుటకు నుపాయమేమి? ఇట్లు చేఁయుట బాఁగు. ఈ యాదవకులమునారీతోఁ గలహమున పుట్టించెదను. అపుడు వెదుఁకుపొదరుని దానితోఁ బుట్టిన యగ్నివలె, వీరితోని జగడమున వీరిని నాశముసేయుఁను అప్పుడు నెమ్మదినొంది నాస్థానమునకు నేను బోయెదను' అని యాలోచించెను. రాజా! ఆభగవంతుఁడిట్లు నిశ్చయముఁనేసికొనెను. అతఁడందఱి తోఁపలఁకొచ్చి నియమించునట్టి యీశ్వరుఁడు; తలఁచినదితోఁడనే సిద్ధించుఁనట్టి సత్యసంకల్పుఁడుఁగదా! కాఁబట్టి యీ విభుఁడు బ్రాహ్మణులశాపమును నెపముచేసికొని తన కులమును సంహరించి నాఁడయ్యెను. అతఁడు తన రూపమునకుం గల మహాసౌందర్యముఁచేత లోకమునఁగల చక్కఁదనములనెల్లఁ దిరస్కరించెను. తనకటాక్షమోక్షముల సాగసుచేతఁ దక్కిన మనుష్యుల చూపుల యందమును గ్రిందుపఱచెను. తన మధుర వచనముల చేత వానిని దలంచుకొను వారిమనస్సులనెల్లఁగొల్లగొనెను. తన

యడుగుల విలాసముచేత దానిని జూచువారు చొక్కి తక్కిన పను లేమియుఁ దోఁపకుండునట్లు గావించెను. ఇట్లు నిరతిశయ ములయిన తన సౌందర్య కిటాతోదులచేత లోకుల చూపులు మనస్సులు మొదలగు వానినెల్ల వాకర్షించి తనయొక్కనియందే నిలిచియుండునట్లు చేసినవాఁడయ్యెను. అతి మనోహరములయిన యిట్టిస్వరూపచేష్టాదులచేత నతనికీర్తి యెంతో కొనియాడందగిన దయ్యెను. ఆ యీశ్వరుఁ డీకీర్తిని భూమియం దెల్ల వ్యాపింప జేసి 'మనుష్యులు నాయీకీర్తిచేతనే సంసారమును దాటుదు రుగాక' యని తలఁచి యంతఁ దనపదమునకు వేంచేసెను' అనెను.

రాజు—'వృష్ణులంటేఱును బ్రాహ్మణులందు మిక్కిలి భక్తి గలవారు, దానతత్పరులు, నిత్యమును పెద్దలను సేవించుచుండు వారు, మఱి వారిమనస్సు లెప్పుడును గృష్ణునియందే యుండును. ఇట్టి వారికి బ్రాహ్మణశాపమెట్లు కలిగెను? ఆశాపమునకు నిమి త్తమేమి? అది యెట్టిది? ఆయాదవులందఱు నొక్కమనస్సు గలిగి యుండువారే! అట్టినాగియందు భేదమెట్లుకలిగినది? బ్రాహ్మ ణోత్తమా! ఇదంతయు నాకుఁ జెప్పుము' అనియడిగెను. శుకుఁ డు-భగవంతుఁడు కృష్ణుండు సకల సౌందర్యములును జక్కఁగాఁ బొందుపడియున్న దివ్యవిగ్రహమును దాల్చి మిక్కిలి మంగళ కరములగు కర్మముల నాచరించుచు దానిచేత విస్తారమయిన కీర్తినిగాంచి యన్నికామములును సమకూడి ద్వారవతిలో విహరించుచు నుండెను. అయిన నతనికి భూ భారమును దీర్చు పని యింకను గొంత మిగత పడియుండెను; కాన, దానినిగూడఁ దీర్చుటకుఁ దన కులమును సంహరింపఁ గోరెను. అతఁడు పుణ్య ములు గలిగించుననియుఁ దమ్మునీర్తించు లోకుల కలికిల్మష

ములనెల్ల నపహరించునవియు మిక్కిలి మంగళములయినవియు నైన కార్యములు సేయుచు వసుదేవుని గృహమున వసించియున్నపుడు, తాను గాలరూపమున సంహారము సేయువాఁడుగాన (యదుసంహారమునకై) మునులను గొందఱను ద్వారవతి దగ్గఱనున్న పిండారక మనుతీర్థమునకుఁ బోవుటకు సంకల్పించెను. ఆసంకల్పముచేతఁ బ్రేరితులై మును లాతీర్థమునకుఁ బోయిరి. విశ్వామిత్రుఁడు, అసితుఁడు, కణ్వుఁడు, దుర్వాసుఁడు, భృగువు, అంగిరసుఁడు, కశ్యపుఁడు, వామదేవుఁడు, అత్రి, వసిష్ఠుఁడు, నారదుఁడు మొదలగు మును లచటికిఁ బోయిరి. ఆప్పుడు యదుకుమారులచటఁ గ్రీడించుచుండిరి. వారపుడుజాంబవతీదేవి పుత్రుడయిన సాంబునికి స్త్రీవేషము వేయించి యామునులదగ్గఱకుఁబోయి 'తా మవినీతులయ్యును మిక్కిలి వినయముగలవారి నలె వారి యడుగులను బట్టుకొని మ్రొక్కి వారితో 'బ్రాహ్మణులారా ! ఈబిడ గర్భిణి. పుత్రుఁడు గావలెనని యువ్విళ్లూరుచున్నది. ఇటు మీఁదఁ గనఁబోవుచున్నది. కాన తానే చక్కమిమ్ము నడుగుటకు మిక్కిలి సిగ్గుపడుచుమామూలముగా నడుగుచున్నది. మీజ్ఞానదృష్టియెయో యమోఘమైనది. కనుకఁ జెప్పుఁడు. ఇది యేబిడ్డనుగనును ? కూఁతురా ? కొడుకా ?' అని యడిగిరి. ఇట్లు వారు వచింపఁగా నామునులు కోపమునొంది వారితో 'మూఢులారా! ఇదిమీకులమెల్ల నిర్మూలముసేయు నొక ముసలమును గనును' అనిరి. అది వినివారు మిక్కిలియు దిగులుపడి తోడనే సాంబునికడుపును విప్పిచూచిరి; చూడఁగా నందు నినుప ముసల మొకటి కనఁబడెను. వారు 'కట్టా! భాగ్యములు చెడి మన మిదియేమిచేసితిమి ? మనవారిదితెలిసిన ముసల

నేమందురొక్కదా ?' అని యందఱును విరవిరఁబోయి యూముస లము నెత్తికొని యిండ్లకుఁబోయిరి. వారు ముఖకులందుఁ గాంతి సొంపు మాయఁగా రాజసభకు దానిని గొనిపోయి యాదవులెల్ల వారును వినుచుండఁగా జరిగినది రాజునకుఁదెలిపిరి. అమోఘమయిన బ్రాహ్మణశాపమును విని యూముసలమును జూచి ద్వారకయందలివారెల్ల నాశ్చర్యపడి భయముచేత వడ వడ వడఁకిరి. యదురా జయినయూహ్వాకుఁ డాముసల మును జూర్ణముచేయించి సముద్రజలములందుఁ బాఱవైపించెను. అట్లు ముసలమును బొడిసేయుచుండఁగా మిగిలినయినుప సలాకనుగూడ నందు వేయించెను. అందుఁబడినయా యినుప శకలము నొకానొకచేప మ్రింగెను.అందువైచిన చూర్ణమో, యల లిటువటు నల్లలాడుచు దానిని దెచ్చి చెలియలికట్టగట్టున వైవఁగా, నది యందు నిలిచి మూఁడుమొనలుగల యొరకము లను నిడుపాటితృణవిశేషము లాయెనఁట. జాలరివాండ్రాయిను ముప్రింగినచేపను దక్కినచేపలతోడ సముద్రమునందు వల వేసి పట్టిరి. వారియం దొకజాలరి యాచేప కడుపులోనున్న లోహమును దనబాణమున కలుగుగాఁ జేసికొనెను. భగవం తుఁడు కృష్ణుఁడు కాలత్రయమునందుఁ గలుగు సకలవిషయము లను దెలిసినవాఁడుగాన యాబ్రాహ్మణశాపమును విఫలము చేయుటకు సమర్థుఁడై యుండియు నట్లుచేయ నొల్లఁడయ్యె. మఱి తాను గాలరూపమున సంహరించునట్లు సంకల్పించియుండుటచే దానికి సమ్మతించినవాఁడయ్యెను. ఇది మొదటియధ్యాయము.

నారదుఁడు వసుదేవునకు విదేహార్షభ సంవాదము చెప్పుట.

శుకుఁడు—ద్వారకానగరము గోవిందుని బాహుబలరక్షి తము. అందు నారదుఁడు కృష్ణు నుపాసించుటయందు మిక్కిలి యక్కఱగలిగి యుండుటంబట్టి మాటిమాటికివచ్చి వాసము చేయుచుండెను. రాజా! ముకుందుని చరణారవిందములు సేవిం చినవారికెల్ల మృత్యువు గలుగదు. వానిని దేవేంద్రాదులగు బ్రహ్మాదులును గొలుచుచుందురు అట్టిచరణారవిందములను నింద్రియములు (కన్నులు) గలవాఁడవ్వఁడు తెలిసినవాఁడయి నను దెలియనివాఁడయినను భజింపకుండునా? ఇక నారదుని వంటివాఁడు భజింపకుండునా? ఆదేవర్షి యొకనాఁడు వసుదేవుని గృహమునకువచ్చెను. అతఁడు నాబుషినర్చించి సుఖాసీనుం గావించి యభివాదనముచేసి యతనితో 'మహాత్మా! ఉత్తమశ్లో కుండగు భగవంతునిఁ బ్రాప్తించుటకు మీరు మార్గభూతులు గదా! మిముబోఁట్లు రాకలెల్లఁ దండ్రిరాక పుత్రునకుం బోలెఁ, దాపత్రయపీడితులై న్నిక్కుచున్న మాబోఁటి దేహధారుల కెల్లను శుభమునకే యగుచున్నవి. పర్జన్యుఁడు మొదలయిన దేవ తలచరితలు ప్రాణులకుఁ గొన్ని యెడల దుఃఖమును గొన్ని యెడల సుఖమును గలిగించుచున్నవి అచ్యుతునియందే మనస్సుగలిగి యుండు మీఁబోటి సాధువులచరిత మో యెప్పటికిని సుఖమునకే యగునుగాని దుఃఖమునకుఁగాదు. మఱియొకటి విశేషము. దేవ తలు తమ్మెవ రేవిధమునఁ గొలుతురో వారి కందులకుఁ దగిన సుఖమునే యిత్తురుగాని యంతకు మిక్కిలిగానీయరు. దేహము నీడ దానితోఁగూడఁ బొరుఁగుచును దగ్గుచును నుండునట్లు వా

రును భక్తుల కుందురు. తమబోంటి సాధువులో యట్లుగారు; దీనులయెడ నింతింతని కొలఁదిలేని వాత్సల్యము గలిగియుందురు. మహాత్మా ! నీరాకచేతనే మేము కృతార్థుల మయితిమి. అయినను నీవు వేనిచేత భగవంతునిఁ బ్రసన్నునిఁ గావించికొంటివో యాభాగవతధర్మములను వినఁ నడుగుచున్నాము. వానిని శ్రద్ధతోడ విన్నయెడ మనుష్యుఁడు సమస్త మయిన భయముల నుండి విముక్తుఁడగుచున్నాఁడుగదా ! పరమపురుషుఁడే నీకుఁ బుత్రుఁడై యుండఁగా నిట్లడిగెదవేల యందువా? ఆ యనంతుఁడు ముక్తిప్రదుఁడే. అయినను నే నతనిని దొల్లి బిడ్డలు కావలయునని కోరి యారాధించితినేకాని ముక్తికై కాదు చుమీ. ఏమిసేయుదును. ఆదేవుఁడు తన మాయచేత నన్ను మోహింపఁజేసియున్నాఁడే. ఈ సంసారసముద్రమో నానావిధములయిన దుఃఖములతోఁగూడి యన్నివిధముల భయము పుట్టించుచున్నది. ఇట్టి మహాసముద్రమును సుఖముగా దాఁటునట్లు నుపదేశింపుము' అనెను. రాజా ! బుద్ధిమంతుఁడా వసుదేవుఁడిట్లడుగఁగా నారదునకు హరిగుణములు తలంపునకువచ్చెను. అందుల కాదేవర్షి ప్రీతుండై 'సాత్వతసింహమా ! నీవిది యడుగనిళ్ళయించినది యెంతోలెస్స; జగత్తునకెల్ల నభ్యుదయము గలిగించు భాగవతధర్మముల నడుగుచున్నావే. ఇది లెస్సకాకుండునా? రాజా! భాగవతధర్మమును విన్నను, పఠించినను, చింతించినను, ఆచరించినను, అనుమోదించినను, సకలభూతద్రోహినిసయితము తోడనే పవిత్రునిఁజేయుచున్నది. అది యట్లుండనిమ్ము. భగవంతుని కథలను వినుటయుఁ గీర్తించుటయుఁ బుణ్యావహము. అట్టి పరమకల్యాణుని దేవుని

నారాయణుని నీవిపుడు నాకుఁ దలఁపించితివే ! ఇది నాకెంతో యుపకారముచుమీ. ఈవిషయమై పురాతన మైనయొకయితి హాసము నుదాహరించుచున్నారు. అది యార్షభులకును మహా త్ముఁడయిన విదేహరాజునకును జరిగిన యొకసంవాదము. స్వా యంభువమనువునకుఁ బ్రియవ్రతుఁడును వాఁడు పుత్రుఁడు. అతని కాగ్నీధ్రుఁడు పుట్టెను. అతనికి నాభియు, నాభికి ఋషభుఁడును బుట్టిరి. ఆఋషభుని, మోక్షధర్మము నుపదేశింపఁదలంచి యవ తరించిన వాసుదేవాంశముగాఁ జెప్పుదురు. అతనికి నూర్గురు కొడుకులు పుట్టిరి. వారిలవఱను వేఁదపారంగతులై యుండిరి. వారియందెల్ల భరతుఁడు జ్యేష్ఠుఁడు. అతఁడు నారాయణపరా యణుఁడు. అతని పేరిటనే యీనవర్షముభారతమన్నమని యద్భు తముగాఁ బ్రఖ్యాతినొందెను. అతఁడీభూమియందలి భోగముల నెల్ల ననుభవించి దిగవిడిచి యిలువెలువడి తపస్సుచే హరి నుపాసించుచు మూఁడుజన్మములను నాహరి పదవిని (అతని తోడిసాధర్మ్యమును) బొందెను. ఆభరతుని తమ్ములు తొంబద తొంబండ్రుగురులో నిలావస్తుఁడు మొదలుగాఁగల తొమ్మిది మంది యీభారతవర్షముచుట్టును దివతిమేరలు గలిగి యున్నతొమ్మిదిద్వీపములకు నధిపతులయిరి. ఎనుబదియొక్కండ్రు ద్విజులై కర్మతంత్రమునకుఁ బ్రవర్తకులుగా నుండిరి. తక్కిన తొమ్మండ్రును మునులయిరి. వారు జ్ఞానవైరాగ్యాదిభాగ్య సంపన్నులు; పరమార్థమును నిరూపింపను జాలినవారునై యుం డిరి. మఱియు వారధ్యాత్మవిద్యయందుఁ జక్కఁగాఁ బరిశ్రమ ముచేసియుండుటవలన దానియందుఁ బ్రవీణులుగాను దిగం బరులుగాను నుండిరి. వారు, కవి, హరి, అంతరిక్షుఁడు, ప్రబు

ద్ధుఁడు, పిప్పలాయనుఁడు, అవిర్హోత్రుఁడు, ద్రమిళుఁడు, చమసుఁడు, కరభాజనుఁడు ననఁబఁగుదురు. వారు సకలమయిన స్థావరములనును జంగమములనును దమ్మునఁ దక్కిన సమస్తమును భగవంతుని రూపముగాఁ గనుఁగొనుచు భూతలమున సంచరించుచుండిరి. వారికేచోటికిఁ బోవలయునని కోరిన నడ్డుకొంచెమైనను గలుగదు; కనుక మునులు, సిద్ధులు, సాధ్యులు, గంధర్వులు, యక్షులు, కిన్నరులు, నాగులు, మునులు, చారణులు, భూతనాథులు, విద్యాధరులు, గరుడులు, గోవులు మొదలగువాని లోకములందెల్ల, దేనియందును దగులుకొందక యిప్పటికిని సంచరించుచున్నారు. వానట్లు తిరుగుచుండి యొకానొకప్పుడు భూతిపర్వమందు మహోత్సుఁడగు దనకుఁడు నిమి ఋషులచేఁ గావింపఁబడుచున్న సత్రమునకు నైవికముగాఁ బోయిరి. రాజా ! సూర్యసమానులయిన యాకివి మొదలగు మహాభాగవతులను జూచి యజనాభుఁడగు నిమియు ఋషులును, మూర్తిమంతులయిన యాహవనీయాది మొదలగున యగ్నులును సంభ్రమమును బూని యెదుర్కొనిరి. జనకుఁడును వారు నారాయణపరాయణులని గుఱుతెఱింగి యపు డాసనములిడి వారిపగువునకుఁ దగురీతిని బ్రీతుఁడై పూజలుగావించెను. వారు తమ ప్రభచేత మిక్కిలి ప్రకాశించుచుండిరి అట్లు బ్రహ్మపుత్రులయిన భృగువు మొదలగు ఋషులకు సమానులై నట్టివారిని జనకుఁడు మిక్కిలియుఁ బ్రీతిగలిగి వినయముచే వినమ్రుఁడై యిట్లని యడిగెను. వి దేహుఁడు—'మీరు భగవంతుఁడగు మధుసూదనునికిఁ జక్కఁబోర్వదు లగుదురని నాకుఁ దోచుచున్నది. అట్టివారేని యీయజ్ఞలోకసునడుమఁ బరుగాడ నేలయందుగా? విష్ణుభ కు

లగువారు లోకములను భావనముచేయుట్టకై యంతటను సంచరించుచుందురు గదా. అది యట్లుండె. జీవకోటికి దేహములు నానావిధములు. వానిలోపల (చిక్కిలి సుకృతముచేతనే కలుగునదియు భగవదారాధనమునకు సర్వవిధముల నుపయుక్తమయినదియు నగు) మనుష్యదేహమో దుర్లభము. దుర్లభమే కాక క్షణభంగురము. అట్టిదుర్లభమయిన మనుష్యజన్మమందు వైకుంఠప్రియులగు మీబోంటివారల దర్శనమో యత్యంత దుర్లభ మని తలంచుచున్నాను. ఈసంసారమందు నరక్షణమైనను సజ్జనులతోడి సంగము మనుష్యులకు బుక్కిలియుఁ బురుషార్థము గలిగించునది. అట్టి మీబోంటి సజ్జనులతోడిసంగమము వలన మాకుఁ బరుషార్థము సిద్ధింపకుండునా ? అనఘులారా ! కాఁబట్టి, మిమ్ము నిరతిశయమయిన క్షేమమెద్దియో దానికి సాధనమెద్దియో, యడుగుచున్నారము. (భగవత్ప్రీతియె క్షేమము, భాగవతధర్మములే దానికి సాధనమగునేని) భాగవతధర్మములను మేము వినుటకుఁ దగుదుమేని చెప్పుము. అట్టి ధర్మములచేత నజుండగు భగవంతుఁడు ప్రసన్నుఁడై శరణాగతుఁడగువానికిఁ దన్ను సయిత మిచ్చుకొనుచున్నాఁడు గదే' యని యడిగెను. నారదుఁడు——వసుదేవా ! మహాత్ముఁడు నిమి యట్లడుగఁగా వారు సదస్యులతోను ఋత్విజులతోడను గూడియున్న రాజునెంతయు నభినందించి ప్రియంబున నిట్లనిరి. వారిలో నవి-'ఈజీవదశయందు నిత్యమును నచ్యుతుని పాదారవిందముల నుపాసించు చుండవలయును. దానిచేతనే *దేని వలనను భయముగలుగకుండునని తలఁచుచున్నవాఁడను.ప్రకృతి

*దేనివలనను భయము గలుగకుండునట్టి దశ ముక్కిలియె. కనుక

వికారమయిన దేహమునే యాత్మగాఁ దప్పఁదలఁచుట వలననే మనుష్యుని బుద్ధికి భయము గలుగుచున్నది. అట్టివాఁ డచ్యుతుని పాదాంబుజముల నుపాసించినచో విశ్వాత్ముఁడగు నాహరిచే నట్టిభయము సర్వవిధముల బొత్తిగా నివర్తించి వానికి మోక్షము గలుగుచున్నది. అజ్ఞులగు పురుషులకు సుఖముగాఁ బరమాత్మ లభించుకొఱకు భగవంతుఁడు (పాంచరాత్రాదుల మూలమున) చెప్పిన శ్రవణ కీర్తన స్మరణాదులైన యుపాయములే భాగవత ధర్మములని తెలియుము. రాజా! భగవంతుఁడు చెప్పిన యాయుపాయములను మనుజుఁడు చక్కఁగా ననుష్ఠించునేని, వాని కొకప్పుడును బ్రమాదమేమియుఁ గలుగదు. ఉపాయాంతర నిష్ఠులకే యట్టి ప్రమాదము చుమీ. మఱి యాభాగవత ధర్మములందుఁ గన్నులు మూసికొని పరుగిడినను, వాఁడమృగు తోఁ ట్రుపడఁడు; క్రిందను బడఁడు. మనుజుఁడు తనప్రకృతి గుణముల ననుసరించుచునే యుండునుగాని యొకప్పుడయిన నూరకుండఁడు. కాఁబట్టి వాఁడు కాయము చేతఁగాని, వాక్కుచేతఁగాని, మనస్సుచేతఁగాని, తక్కిన యింద్రియములచేతఁగాని, బుద్ధిచేతఁగాని యేయేకర్మమును లౌకికమో వైదికమో, శాస్త్రవిరుద్ధము గానిదానిని జేయుచున్నాఁడో యదియంతయుఁ బరుం డగునారాయణునికే సమర్పింపవలయును. కొందఱు జగములోని వస్తువులు బ్రహ్మాత్మకములుగావు. స్వతంత్రములైనవి యని తప్పఁదలఁతురు. అట్లు దలంచువాఁడు భగవంతునికి విముఖుఁడగును. దానివలననవానికి

ముక్తియె అత్యంతికశ్రేయము. దానికిసాధనము భగవత్సాక్షాత్కారవిషయోపాసనము. అనఁగా భాగవతధర్మము అని ఫలితము.

స్మృతి తలక్రిందై దేహమే యాత్మయని భ్రమనుగలుగును. ఇదియంతయు భగవంతుని మాయయగు ప్రకృతిచేతఁ గలుగుచున్నది. కాఁబట్టి మనుజుఁడు వేదాంతజ్ఞానము నధిగమించి గురువే దైవముగాఁదలఁచి యీమాయ నివర్తించుకొఱకు ననన్య ప్రయోజనమగు భక్తితో భగవంతుని సర్వాత్మకునిఁగా భజింపవలయును దేహమాత్మగాదు; ఆత్మయు స్వతంత్రముగాదు. అయినను జింతింపఁగా స్వప్నమందుఁ గలుగుచోరిక యస్థిరమైనను స్థిరముగాఁ దోఁచునట్లు దేహ మాత్మగాను, ఆత్మ స్వతంత్రముగాను మనస్సునకుఁ దోఁచుచుండును. కాఁబట్టి మనస్సును ననాదికర్మము ననుసరించి దేహమును నాత్మయు నొక్కటియె యని సంకల్పించుచును నాత్మ పరమాత్మకుఁ బరతంత్రముగాక స్వతంత్రమైన దని వికల్పించుచును నుండును. తెలిసినవాఁడట్టి మనస్సును నడంపవలయును. దానివలన నభయంబగు మోక్షము గలుగును. మనస్సును. నడంచుటకు నుపాయమిది. చక్రపాణియగు నిష్ణు వీలోకమం దెత్తిన యవతారములను జేసిన కర్మములను మిక్కిలి మంగళకరములైన వానిని వినుచును, నద్దేవునిఁ బ్రదిపాదించు గీతములను నామములను సిగ్గువిడిచి పాడుచును, దేహమం దాసక్తిమాని చరింపవలయును. అప్పుడు మనస్సు భగవంతునియందుఁ దగిలియుండే నిలిచియుండును. ఇట్టిస్థితము నాచరించుచు రాఁగా భగవంతుఁడు మిక్కిలి ప్రియుండగును. అట్టి ప్రియుని నామములను గీర్తించుచుండఁగా నతనియందు మిక్కుటమైన యనురాగము పుట్టును. దానిచేత వాఁడు మనస్కరఁగి, యొక్కప్పుడు భగవంతు నుద్దేశించి బిగ్గరనవ్వును; ఒక్కప్పు డది యెడతెగినా

యింతకాలము నన్ను పేక్షించినాఁడని యేడ్చును. ఒకప్పుడు సొంపు పట్టలేక బిగ్గరనార్చును; ఒకప్పుడు సంతోషముచేఁ బాడును. ఒకప్పు డాడును. ఇట్లు వాఁడు లోకముతోఁ బాటివాఁడుగాక వెఱ్ఱిగొన్నవానివలె నివియన్నియుఁ జేయుచుండును. ఆకాశమును, వాయువును, అగ్నిని, జలమును, భూమిని, జ్యోతిస్సులను, జంతువులను, దిక్కులను, వృక్షౌదులను, నదులను, సముద్రములనును మఱి యేభూతము నయినను విష్ణుస్వరూపముగాఁ దలఁచి మ్రొక్కఁవలయును; తుదకుఁ దన్నును నట్లే తలఁచి మ్రొక్కఁదగును. అన్నము గుడుచువానికి నొక్కొక్క కుడుపునందును, దుష్టియుఁ బుష్టియు నాఁకలిమానుటయు మూఁడును నేకకాలమునఁ గలుగుచున్నవి. అట్లే భగవంతుని శరణుఁబొచ్చినవానికి నీశ్వరుని స్వరూపగుణాదులను గుఱించిన తత్త్వజ్ఞానమును భక్తియు శబ్దాది నిషయములందు విరక్తియు నీమూఁడును నేకకాల మందే కలుగుచున్నవి. ఇట్లచ్యుతనిపదారవిందములను నను వర్తించి భజించుచుండు భాగవతులకు భక్తియు విరక్తియు భగవంతునిఁ గూర్చిన జ్ఞానమును గలుగుచున్నవి. పిదప వాని వలనఁ బరమంబగు శాంతియుఁ (మోక్షమును) దనంతఁ గలుగుచున్నది. భూతిద్రోహమును దిగవిడిచి భూతములందెల్ల మైత్రి గలిగి యధోక్షజుండగు భగవంతునియందు మనస్సు మిక్కిలి గాఢముగాఁ దగిలి దానివలనఁ బరిశుద్ధస్వభావుండగు వాఁడు మూఁడు లోకములను సూర్యుఁ డుదయించి పవిత్రము చేయునట్లు, తన పాదరేణువులచేఁ బావనము చేయుచున్నాఁడు' అనెను. రాజు-'భాగవతుఁ డెట్టివాఁడు చెప్పము? వానిధర్మ

మేది ? మనుష్యులలోపల వాని స్వభావమెట్టిది ? వాని యా చారమెట్టిది ? వాఁడేమిచెప్పను ? భగవత్ప్రియుండగువానిని గుఱుతుపట్టు చిన్నెలేవి ?' యని యడిగెను. అందులకు హరి యనువాఁడు 'ఎవఁడు సర్వభూతములందును దనయందును భగవంతుఁ డుండుటయుఁ బరమాత్మ డగునాభగవంతుని యందు సమస్తభూతములు నుండుటయును జూచుచున్నాఁడో యట్టివాఁ డుత్తముఁ డగుభాగవతుఁడు. మఱి యీశ్వరుఁడు సర్వశరీరకుఁడని తెలియక కేవలము దేవతయని తలఁచి యతని యందుఁ బ్రేమయు, నటనికి లోఁకువయైయుండు భాగవతుల యందుఁ జెలిమియు, నజ్ఞులయందుఁ గృపయుఁ, బగివారియందు నుపేక్షయు నెనఁడు నిలుపునో వాఁడు మధ్యముఁడు. ఎవఁడు హరిని యర్చారూపమునందు మాత్రము శ్రద్ధతోఁ బూజ సలుపుచు నతని భక్తులయందును దక్కినగోవు మొదలగు వాని యందును బూజసేయకుండునో వాఁడజ్ఞుఁడగు భక్తుఁడని చెప్పఁ బడుచున్నాఁడు. ఎవఁ డిష్టములయిన విషయములనుగాని యనిష్టములయిన విషయములనుగాని తన యింద్రియములచే ననుభవించుచున్నను నిదియంతయు విష్ణువుమాయయెయని వానిని ద్వేషింపకయును గాంక్షింపకయునుండునో వాఁడుత్తమఁడగు భాగవతుఁడు. దేహము, ప్రాణము, మనస్సు, బుద్ధి, యింద్రియములనెడు వీనికి వరుసగా నుత్పత్తి, నాశము, ఆఁకలి, భయము, తృష్ణ, శ్రమమనెడి యివిధర్మములు. పురుషుఁ డెవఁ డీసంసారధర్మములచేత, నెంతమాత్రము మోహము నొందకుండునో వాఁడు భాగవతులందు ముఖ్యుఁ డని నేను దలఁచుచున్నాను. ఎవ్వని చిత్తమునందుఁ గామములును, కర్మములును గలుగఁ బో

యెవ్వఁడు వానుదేవు నొక్కనినే యాశ్రయించియుండునో వాఁడు భాగవతోత్తముఁడు. భాగవతుని యాచారము లిట్టివి. వానిని గుఱుతెఱుంగు చిహ్నములు వినుము. ఎవ్వనికిఁ దన జన్మముచేతఁగాని కర్మముచేతఁగాని వర్ణాశ్రమములచేతఁగాని జాతిచేతఁగాని యీ దేహమం దహంభావముకలిగి చిక్కుటగలు గదో వాఁడు హరికిఁ బ్రియుఁడగును. ఎవ్వనికి నాత్మలన్నియు బ్రహ్మోత్పన్నములును జ్ఞానైకాకారములు ననియు దేహములెల్లఁ బంచకృతపరిణామనును లనియుఁ దెలియుటవలన నంతఃకరణ మన్నిటియెడ సమముగా నుండునట్లు శిక్షించి, సర్వభూతము లందును సముఁడై యుండుటవలనఁ దనవాఁడనియుఁ బరుఁడనియుఁ దనధనమనియుఁ బరుల ధనమనియుఁ దనదేహమని యుఁ బరులదేహమనియు భేదము గలుగకుండునో వాఁడు భాగవతోత్తముఁడు. అజితుఁడగు విష్ణునియందే మనస్సు నెలకొలిపియుండు బ్రహ్మాదిదేవతలకు సైత మాభగవంతుని పాదారవిందములు దుర్లభములు. ఎవ్వఁ డట్టి భగవత్పాదార విందములకంటె సారమైనది లేదని గట్టిగాఁ దలఁపుగలిగి ముల్లోకముల యైశ్వర్యము తనకిచ్చినను నిరాకరించి యాపదార విందముల భజనమునుండి యరనిమిషముకూడఁ జలింపకయుం డునో వాఁడు వైష్ణవులం దుత్తముఁడు. త్రివిక్రముఁడగు భగ వంతుని చరణనఖ మణులనుండి వెన్నెలలవంటి చల్లని కిరణ ములచే హృదయమందలి కామసంతాప మెల్లఁ దూలిపోవు చున్నది. అట్టి హృదయములందు మరల నాతాపమెట్లు గలు గును ? సూర్యునివలని తాపము చంద్రుఁడు పుట్టినపిదప నుండ నేర్చునా? భాగవతుఁ డిట్టివాఁడు. హరిని భారవశ్యముచేత

బేరుకొన్నను నతఁడు పాపసమూహమునెల్ల నాశము సేయుచుండును. అట్టి హరి తనపదారవిందములఁ బ్రేమపాశములచేఁ గట్టితాల్చియుండుటంబట్టి యెవ్వనిమ్రాసయమును విడిచియుండనేరఁడో యట్టివాఁడు భాగవతులందుఁ బ్రధానుఁ డని చెప్పఁబడును' అనెను. ఇది రెండవయధ్యాయము.

జనకార్షభసంవాదము.

(అనుబంధము)

రాజు:—భగవంతుఁడును బరుఁషుఁడు నీశుఁడు నగు విష్ణుని మాయ. మాయ లగువారినిగూడ మోహపెట్టునటి యట్టిమాయను దెలిసికొనఁగోరుచున్నారము. తాము దానిని దెల్పనెలయును. మీవచసములు హరికథామృతముతోఁ గూడియున్నవి. ఆయమృతము నెత జుఱ్ఱుచున్నను నాకుఁ దృప్తికలుగకున్నది. ఏలన నేను సంసారతాపములచేత మిక్కిలి తప్తుఁ డయినవాఁడను, మఱి మఁరణశీలుఁడను. ఇట్టి నాతాపమున కిదియౌషధముగదే! దానియెడ నెట్లు తృప్తినొందుదును' అనెను. అందులకు నంతరిక్షుఁడు 'ఆత్మ సత్త్వాదిగుణములు లేనివాఁడు, విశుద్ధుఁడుగాన వానికి శరీరసంబంధమును లేదు. మఱి వాని స్వరూపము స్వయంప్రకాశమైనది. ఇట్టివాఁడు శరీరసంబంధము నొంది గుణములకు వశుఁడై దేహమే తానని భ్రమించుచున్నాఁడు. వాని కిట్టితలక్రిందు చేయునదియె భగవంతుని మాయ. విభుఁడామాయచేతనే వివిధంబైన యీ జగమును నిర్మించెను. జాగ్రదవస్థయందుఁ బంచేంద్రియములును మన

స్సును, నస్థిరములై యాత్మకానట్టి దేహాది విషయములందు నాత్మలనియు స్థిరములనియును భ్రమము నొందుచుండును. స్వప్నావస్థయందు బాహ్యేంద్రియము గూడనివట్టి యంతఃకరణము, అస్థిరములగు స్వప్నశరీరాదులందు స్థిరములనుభ్రమము నొందుచుండును. బాహ్యాంతరజ్ఞాన మంతయు లోపించి యుండు సుషుప్తియందు వాసనలనెడుబీజములు మాత్రము శేషించియుండును. అదియును బ్రకృతిసంబంధమువలనఁ బుట్టినదే; ఈమూఁడవస్థలతోను గూడియున్న ప్రత్యగాత్మ ప్రకృతి పరిణామమయిన శరీరమును వీడినపుడు గలుగు ముక్తావస్థ, దేహసంబంధమువలనఁ గలుగు నామూఁడవస్థలును వీడిన తుర్యావస్థ యగుచున్నది. జీవుని స్వరూపము రాగాదులచేఁ గలుషితముగానందునఁ బరిశుద్ధమైనది, జాగ్రత్తు మొదలయిన యవస్థాభేదములు లేనిదిగాన యేకమైనది. జ్ఞానైకరసమయినది. అట్లయిన నాప్రత్యగాత్మకుఁ బ్రకృతిపరిణామ మగు దేహము తోడి సంబంధముచేతి, స్వప్నమందలి గజతురగాదు లస్థిరములయినను స్థిరములుగాఁదోఁచునట్లు, జాగ్రత్తు మొదలయిన మూఁడవస్థలతోఁగూడియుండున ట్లింద్రియము లంతఃకరణము మొదలగువానికిఁ దోఁచుచున్నవి; ఇట్లుతోఁచుట జ్ఞానస్వరూప మగు ప్రత్యగాత్మకానాదిపుణ్యసాపాదిక్రియలవలనఁ గలిగినఫల మేకాని మఱొకటిగాదు. ఇట్లాత్మయందు మాయాకార్యము లయిన మూఁడవస్థలు కలుగుట, దానికిఁ గర్మములవలననడుమఁ గలిగిన ఫలమేకాని స్వాభావికమైనదిగాదు. ఏలన నామూఁడవస్థలు దానికి స్వాభావికములేని యవి దానిముక్తావస్థయందును గలుగవలయును. అవి గలుగవుగాన దానికి నిత్యములు

గావు. మఱి యిప్పుడును నొకయవస్థయందు మఱియొకయవస్థ తప్పి కలియుటగలదు. అట్లై యీయవస్థ లాత్మకుఁ గలుగవచ్చును. కాన, యివి దానికిఁ స్వభావసిద్ధములు గానేరవు. స్వప్నమందలినుఖము క్రియాఫలమై యనిత్యముగానుండునట్లై యిదియు నగునని విమర్శించి యెడలఁ బురుషుఁ డిట్టి క్షుద్రసుఖములకై పాటుపడుట యుడుగుచున్నాఁడు. ఆద్యుండును మహాభుజుండు నగు పరమపురుషుఁడు సకలభూతముల కంతరాత్ముఁడై మాయాకార్యము లయినయీ పృథివ్యాదిసమష్టిభూతములచేత నెక్కువతక్కువలుగానున్న పలువిధములయిన భూతములను సృజించెను. అట్లుసృజించుటయేల? తనకుశరీరభూతములయిన జీవులు కరణకళేబరములుపడసి తన్నారాధించి ముక్తియను పురుషార్థము నొందవలయుననియె. ఇట్లీపురుషార్థసిద్ధికై పంచమహాభూతములచేత సృజించిన శరీరములందుఁ బ్రత్యగాత్మప్రవేశించి జ్ఞానకర్మేంద్రియములచేతను నంతఃకరణముచేతను దనజ్ఞానమును బదునొకండు విధముల విభజించుకొని శబ్దాదివిషయములనే కుడుచుచున్నాఁడు. కాని,పరమపురుషు నారాధింపఁడు. ప్రభుండాజీవుఁడు భగవంతునిచే, సృజింపఁబడిన యీశరీరమునే యాత్మగాఁదలఁచుచుఁ, బరమపురుషుఁ డంతర్యామియై గుణపరిణామములగు తన యింద్రియములను బ్రవర్తించునట్లు పురికొలుపఁగా, నాయింద్రియములచేత శబ్దాదివిషయములను ననుభవించుచు నై హికవిషయములయందే తగులువడి యుండును. ఇట్లు విషయములననుభవించుచుండుట పయిపయిని విషయములందుఁ దగులువడుటకు హేతువగుచున్నది. ఈసంసారమందు దేహాయగు జీవుఁడు పూర్వపూర్వదేహములం దార్జించిన కర్మ

వాసనలనుబట్టి పుణ్యపాపకర్మములను జేయుచున్నాఁడు. ఆకర్మములును ఉత్తరోత్తరదేహములను గలిగించునట్టి వాసనలతోఁ గూడినవై యుండును. అట్టికర్మము లాచరించుచు వానికిఁగల సుఖదుఃఖఫలము లనుభవించుచు మీఁద దుఃఖములు దాఁపరించుచుండు విధమున భ్రమించుచున్నాఁడు. జీవుఁడిట్లు బహుదుఃఖావహములగు దేహములను గర్మములచేతఁ బొందుచుఁ బ్రకృతిపరవశుఁడై మహాభూతిప్రళయపర్యంతము నుత్పత్తిమరణపరంపరలను బొందుచునుండును. పంచమహాభూతిప్రళయము సమీపించినప్పుడు, ఆద్యంతశూన్యుఁడగు పరమపురుషుఁడు కాలశరీరకుండై పంచభూతములచేతను శబ్దాదిగుణముల చేతను నిర్మితమయిఁ స్థూలముగా నున్నయీజగత్తును నామలోప విభాగములేక సూక్ష్మమై తమస్సునఁబడు నచిత్తును నాకర్షించుచున్నాఁడు. అప్పుడు నూఱుసంవత్సరములు మిక్కిలి దుస్సహమయిన యనావృష్టి భూమియందుఁ గలుగును. అట్టికాలమున నుష్ణము మిక్కిలియుఁ బెరిఁగినవాఁడై సూర్యుఁడు మూఁడులోకములను మిక్కిలి తపింపఁజేయును. అపుడు సంకర్షణుని ముఖాగ్నిజ్వాలలు పయికిఁ జెంగలింప వాయువునుదోడుపడఁగాఁ బాతాళము మొదలుకొని నలుప్రక్కల మంటల నిగిడించుచుఁ బెరుఁగును. పిదప సాంవర్తకములను ప్రళయకాల మేఘములసమూహము నేనుఁగుతొండములంతలు జలధారలతోనూఱుసంవత్సరములు గురియును. అంత బ్రహ్మాండము జలమందు లీనమగును. అంత నావిరాట్టు (బ్రహ్మాండము) లోపలనున్న జీవవర్గము, లీనంబయిన యాబ్రహ్మాండమును విడిచి కట్టులేని యగ్ని ముడింగియున్నట్లు తనజ్ఞానమును సంకుచితమైయుండ

సూత్రోపష్టమై తమస్సనఁబడు ప్రధానమును జొచ్చుచున్నది. అంత భూమి తన్ను నెలకొలుపునట్టి గంధమును ప్రళయ వాయువు హరింపఁగా నంతి జలమునందు లయించుచున్నది. జలమును దనరస మా వాయువు చేఁగోలుపోయి జ్యోస్సునందు లయించుచున్నది. అజ్యోతియుఁ బ్రళయతమస్సుచేతఁ దన రూపము హరింపఁబడఁగా వాయువునందు లయించుచున్నది. వాయువును దనస్పర్శమును నాకాశముహరింపఁగా నాయాకాశమందు లయించుచున్నది. ఆకాశమును దనగుణము కాలము చేత (కాలాత్మకడైన యీశ్వరునిచేత) నపహృతమగుఁగాఁగా, భూతాదియందు లయించుచున్నది. పది యింద్రియములును, మనస్సును, బుద్ధియును దమ యధిష్ఠాతలగు దేహముతోడఁ దివకుఁ గారణభూతమగు సాత్త్వికాహంకారమును బ్రవేశించుచున్నవి. ఆయహంకారము మూఁడువిధములును, దనకార్యము లతోఁగూడి, కారణభూతమగు మహత్తునందుఁ జొచ్చుచున్నవి. ఈభగవంతునిమాయ మహత్తత్త్వమునకుఁ గారణభూతమయినది. కనుక నామహత్తు దానియందుఁ బ్రవేశించుచున్నది. ఆ మాయ సృష్టిస్థితిసంహారములను జేయుట కుపయుక్తమై యిట్లు తెలుపు నలుపను మూఁడువర్ణములు (అనఁగా రజస్సత్త్వ తమస్సులను మూఁడుగుణములు) గలిగియుండును. మేము దాని (స్వరూపమును గార్యములను) వర్ణించితిమి. మఱియు నేమి వినఁగోరెదవు' అనెను.

రాజు—'జితేంద్రియులు గానివారికిఁ దరింపనలవికాని యీ భగవంతునిమాయను స్థూలబుద్ధులగుమాబోట్లు సుఖముగా నేయుపాయముచేత దాఁటుదురో మహర్షీ ! దానిని దెప్పు,

మనెను. ప్రబుద్ధుఁడు—'మనుజు లాలుమగలుగాఁ గవగూడి వర్తించుచు దుఃఖములను భోగభోక్తృకొనుటకును సుఖమును బడయుటకును, నాయాకర్మములను నారంభింతురు. కాని యా కర్మములవలన దుఃఖముపోయి సుఖముగలుగక తలక్రిందుగా దుఃఖమే పరిణమించుట గాంతురు. విత్తమును సంపాదించుట మిగులఁ గష్టము. మఱి దానిని సంపాదించుటకు మరణాంతములగు సాహసకర్మములఁ బొలుగావలయును; అది మృత్యురూపమేయగును. కనుక దానిని సంపాదించుట నిత్యమును దుఃఖమునిచ్చుచు నేయుండును. ఇట్లు విత్తముగాని మఱి గృహములు సంతానములు మిత్రులు పశువులు మొదలగునవిగానియెంతోకష్టపడి సాధించినను దుదకునస్థిమము లేకాని సుతములుగావు. కనుక వానిని సాధించినను కలుగునట్టి సుఖమేమి ? ఈలోక మందలి విత్తానుభవులనే పరలోకసుఖమును నిత్యమని కనుఁగొనవలయును. ఏలనఁగా నిది కర్మముచేత సంపాదింపఁబడినది. కనుక గర్మకృతము లెల్ల నశ్వరములే యగును. దానికి మండలేశ్వరుల సుఖమునకుంబోలె నంతశయమును ధ్వంసమును సమానమైయుండును. ఇహపరసుఖము లిట్టివిగానుండుటంబట్టి వానియందు వెగటొందియు త్తమంబగు శ్రేయస్సునుఁ దత్త్వధనమును దెలియఁగోరి వేదములందును బ్రహ్మజ్ఞానమునందును బూర్ణుండును రాగద్వేషాదులు లేమికిఁ బట్టయినవాఁడును నగు గురుపుశరణు చొరవలయును. గురువే తనకుదైవముగాఁ గల వాఁ డాగురుపుసన్నిధియందు నిష్కపటంబయిన సేవ సేయుచు భాగవతధర్మముల నభ్యసింపవలయును. ఆధర్మములచేతఁ దన్ను డిగినను నిచ్చునట్టి పరిమదాతయగు సర్వాంతరాత్ముఁడు హరి

యెంతయు సంతోషించును. ఆధర్మములను వినుము. మొదట దేహమునందును దానిని సంబంధించినవానియందు నన్నిటను సంగము లేకుండుటయును, సాధువులతోడి సహవాసమును, భూతములలో యథోచితముగా దీనులయందు దయయు సములయందు మైత్రియు, నుత్తములయం దడఁకువయును, బాహ్యాంతరములని రెండువిధములగు శౌచమును, దమతమ వర్ణములకుచితములయిన ధర్మములననుష్ఠించుటయును, దపమును, ద్వంద్వముల సహించుటయు, వేదాధ్యయనమును, మనోవాక్కాయము లొక్కరూపముగా నుండుట యనెడి యార్జవమును, ఋతుకాలములందక్కఁదక్కినయెడల స్త్రీసంగము లేకుండుట యను బ్రహ్మచర్యమును, భూతద్రోహము లేమి యనెడియహింసయు, శీత ముష్ణము సుఖము దుఃఖము మొదలగుద్వంద్వముల యందు సమత్వమును, సమస్తచేతనాచేతనములందుఁ బరమాత్మయొక్కఁడేయని కనుఁగొనుటయు, పరిగ్రహము లేమియు లేక తానొక్కండై యుండుటయు, గృహాదులం దభిమానము లేమియు, శుద్ధములగువల్కలములను ధరించుటయు, దైవవశమున లభించిన దానితో సంతుష్టినొందియుండుటయు, భగవత్ప్రతిపాదకములగుశాస్త్రములం దాదరాతిశయమును, తక్కినదేవతాంతరములయందు నిందయు, మనస్సును ప్రాణాయామములచేతను వాక్కును మౌనముచేతను నసత్యమును పలుకకుండుటచేతను, గర్మములను జేయకుండుచేతను దండించుటయు, భూతహితముగాఁ బలుకుట యనుసత్యమును, అంతఃకరణనిగ్రహ మగు శమమును, బాహ్యేంద్రియనిగ్రహ మగు దమమును, అద్భుతకర్ముండగు హరిజన్మములను గర్మములను గుణములను విను

టయుఁ గీర్తించుటయు ధ్యానించుటయు, భగవంతునికొఱకు సకలకర్మముల నర్పించుటయు యజ్ఞములను దానములను దప స్సును స్మార్తకర్మములనును వ్రతములను మఱి తనకుఁ బ్రియ మయిన దానిని బెండ్లములను బుత్రులను గృహములను బ్రాణ ములను నా పరమపురుషునకు నివేదించుటయు, కృష్ణుఁడే యాత్మనాథుఁడుగాఁ గల మనుష్యులయందు సౌహార్దమును సక్కని చరాచరములగు భూతములయందును బహుమతియు మహనీయులునుసాధువులు నగుమనుజులవలననుండి భగవంతుని యశమును బ్రస్తరము చెప్పుకొనుటయు, ఆ యశస్సునుగూర్చి పరస్పరమనురాగమును, దానినన్నభవించుటవలనఁ బరస్పరము తుష్టియు, దానివలనఁ బరస్పరము మనస్సు సధ్యాత్మికాది తాపత్రయమునుండి నివర్తించుటయు ననుమీనిఁ గనుచుటయు, నాధినములయందు భక్తివలనను బ్రేమలక్షణంబగు భక్తివల నను దేహమునందు గగ్గురుదాల్చుటయు, లోకవిలక్షణులై యచ్యుతుని దలంచుకొని యొక్కయొడ నేడ్చుచును నొక్క యొడ నవ్వుచును నొక్కయొడ నానందించుచును నొక్కయొడ నేమోమో చెప్పుకొనుచు నాడుచును బాడుచును భగవంతుని స్వరూప స్వభావాదులను బరిశీలించుచును నిట్లు పరమపురు షుని మనస్సునఁ బొంది సుఖతులై యూరకుండుటయును, ననెడి యివి భాగవతధర్మములు. ఈ భాగవతధర్మములను గనుచు నారాయణపరుఁడై నారాయణు నారాధించుటవలనఁ బుట్టిన భక్తిచేత దుస్తరంబగు మాయను నక్షయం డగువాఁడును దాఁటు చున్నాఁడు' అనెను.

జనకుఁడు:— 'నారాయణాభిధానుండును బ్రహ్మంబునగుపర మాత్ముని స్వరూపనిశ్చయమును మీరు నాకుఁ జెప్పవల యును. మీరు బ్రహ్మవిదులందు మిన్నలుగదా' యనెను. అందులకుఁ బిప్పలాయనుఁడు - 'ఎవఁ డిజగత్తునకు సృష్టిస్థితి ప్రళయములకు హేతువును, దనకుఁ గారణాంతరము లేని వాఁడును స్వప్నజాగరసుషుప్తులయందును ముక్తావస్థయందును సకలాత్మలలోను సంతరాత్ముఁడై వ్యాపించి యుండువాఁడును నగునో, ఎవఁడు దేహమును నింద్రియములనును బ్రాణములను మనస్సును మొలపుటవలన నవి మొలంగుచున్నవో, యట్టి వస్తువు రాజేంద్రా ! పరబ్రహ్మ మని తెలియుము. దానిని మనస్సు గుఱుతెఱుంగఁజాలదు. మఱివాక్కునకు నది గోచరముగాదు. మఱి కన్నును జీవుఁడును బ్రాణములును దక్కిన యింద్రియములును నా బ్రహ్మమునకు విశేషణము లైనవిగాని, అగ్నిని దాని విశేషణములగు జ్వాలలవలె, నవి యా బ్రహ్మమును బ్రకాశింపఁ జేయఁజాలవు. వేదాంతభాగమును బరమాత్మవిషయమై ప్రమాణమును 'నచక్షుషాదృశ్యతే' 'నాపి వాచా'యని గ్రాహకములగు చక్షురాదులకు నగోచరమైన దిగా బోధించుచున్నది. గ్రాహకములే యది లేదని నిషేధించు చుండఁగా నది యెట్లున్నదని ప్రతిపాదింపఁబడిన దన్నచో, ఒక వస్తువుండినచే దానిని గుఱించి 'తెలియు' దని నిషేధము సేయుట పొసఁగునుగాని లేనివస్తువునుగూర్చి యట్టి నిషేధము సిద్ధింపఁజాలదు. కనుక బ్రహ్మము లేనిచో దానిని గూర్చి బోధక ముల నిషేధమే సిద్ధింపనేరదు. కనుక నది యర్థవశముగా నున్నదనియె యేర్పడుచున్నది. సత్త్వము రజస్స్ తమస్స

నెడి మూఁడుగుణములు నర్తించునట్టి ప్రధానతత్త్వము, అది కార్యముల కెల్ల నాధారముగాన సూత్రమైనది. దానికార్యము లగు మహత్తును నహంకారమును దత్కార్యములును తత్త్వ ములుగా నిరూపించెదరు జీవుండును జ్ఞానకర్మేంద్రియముల కును విషయములకును సంబంధమువలనఁ బుట్టి సుఖదుఃఖాదుల ననుభవించు చుండుననియుఁ జెప్పదురు. ఇట్టి వగుచేత నాచేతనము లెల్ల నచింత్యశక్తియగు బ్రహ్మముగాఁ బ్రమాణ ములచేఁ దెలియుచున్నవి. మఱియు నది యూహాదిచిహ్నములకు విలక్షణమైనది. ఆత్మకుఁ బుట్టుక లేదు, చెడుఁగుటయు లేదు, తఱుఁగుటయు లేదు, కాఁ చిచ్చుటయుఁగలుగదు. అవియంతయు ననిత్యములగు దేహములకే కలుగును. ఆ త్మభూతభవిష్యద్వ ర్తమానములనెడి కాలత్రయమునుండును వర్తించుచుండును గాన నిత్యుఁడు. అది యెప్పుడు నెల్లయెడలఁ దనస్వరూపమును భాయకుండును. ఏలనఁగా నది జ్ఞానైకస్వరూపము. కన్ను చెవులు మొదలగు వానిని సంబంధించిన జ్ఞానములు పాయు చుండఁజేదా యన్నచో ప్రాణమొక్కటి ప్రాణాపానాదులయిన వృత్తిభేదములచే వికల్పితమగునట్లుగా నింద్రియజ్ఞానమును జఱుపురాదివ్యాపారముల నశేషమున వికల్పము నొందుచున్నది కాని, స్వరూపభూతమగు జ్ఞానమట్టిదిగాదు. అండజములందును జరాయుజములయందును. సుద్భిజ్జములయందును స్వేదజము లందును జీవుండు ప్రాణమూలమున ధారకుఁడై ప్రకాశించు చున్నాఁడు. ఆ జీవుఁడు నిర్వికారుఁడు. ఇట్టి యాత్మ యందఱి కును దెలియకుండుట యేలయన్నచో నిది మిక్కిలి స్పష్టముగాఁ బ్రకాశించునదిగాదు. అయిన నింద్రియసమూహము లహంకా

రాది మనోవ్యాపారములును నుడిగినపిదప శరీరమును నీడిన పిదప జీవులమగు మనకు జీవుని యథావస్థితమగు స్వరూపము ప్రకాశించిన దగును. అహంకారాది మనోవృత్తులు విరమించుట యెప్పుడందువా? దారపుత్రేషణాదులను దిగవిడిచి యబ్జనాభుని పదారవిందములందే యీషణగలిగి దానిచేతను నవిచ్ఛిన్నమగు పరమభక్తిచేతను సత్త్వాదిగుణమూలములగు పుణ్యాపుణ్య కర్మములవలన మనస్సునకుం గలుగు రాగద్వేషాది మలములను నాశముచేయవలయును. అప్పుడు నిర్మలమగు నాచేతస్సునందు నాత్మకుం గలయథార్థస్వరూపము చక్కనిచూపు గలవానికి సూర్యప్రకాశమువలెఁ, దనంతటఁ దెలియునుగా అనెను.

రాజు-'మాకు భగవదారాధనాత్మకమగు కర్మయోగమును జెప్పుఁడు. ఆకర్మయోగముచేత సంస్కృతుఁడైనవాఁడిందు భగవద్భక్తియోగమునుత్పత్తికి విరోధులయిన పుణ్యపుణ్యకర్మములనల్లఁ దూలించి బంధకములగు సకలకర్మముల నివృత్తికి హేతువయినపరభక్తిఁ బొందుచున్నాఁడుగదా. ఇట్లుడిగిన యీకర్మయోగము నూఁది మిమ్మడిగినట్లె మీతండ్రి యయిన్వాకునినిమ్ముఖమున సనకాదులగు ఋషుల నడిగితిని. ఆ బ్రహ్మపుత్రులు నాకుఁ గర్మయోగమును నిరూపింపరయిరి. అట్లు చెప్పకుండుటకుఁ గారణమేమో నుడువలయు' నని యడిగెను. ఆవిర్హోత్రుఁడు - 'కర్మము (కామ్యకర్మము) అకర్మము (జ్ఞానపూర్వకర్మము) వికర్మము (నిషిద్ధకర్మము) అని మూఁవాదము వేదోక్తముగాని లౌకికముగాదు. వేదమో యాశ్వాభిస్రయమైనది. మఱి వేదోక్తము లయినయా

కర్మాదులయందుఁ దెలిసికొనవలసిన విషయములు చెక్కులు న్నవి. కాన మిక్కిలి గహనము లగుటఁజేసి వాని పట్ల విద్వాంసులును దెలియక తడఁబడుచున్నారు. కనుక బాలుండ వగునిన్నుఁజూచి యీసనకాదులు చెప్పరయిరి. ఈవేదము హితాహితములను దెలుపునట్టిదే యైనను దానియందు 'యజే తస్వర్గకామ' యిత్యాదుల కర్థములు ప్రత్యక్షాదులకు గోచర ములు గావు; అవి పరోక్షములుగానే యుండునుగాన వాని యభిప్రాయము దెలియుట కష్టము.అయినను వైద్యుఁడు బాలు రకుఁ గండచక్కెర లడ్డు మొదలగునవి యిచ్చెదనని యాశ పెట్టి మందుఁ ద్రాగించుచున్నాఁడు. కాని యాచెప్పిన లడ్డు మొదలగువాని నియ్యక తుదకారోగ్యమును గుదుర్చుచున్నాఁ డు. అట్లు వేదమును నవాంతర ఫలములగు రంభాసంభోగాదు లిచ్చున ట్లాశకొలిపి యజ్ఞాది కర్మములను జేయునట్లు విధించు చున్నది గాని, పిదప నా చెప్పిన ఫలముల నొసంగక భక్తి యోగమూలమున బంధకములగు సకల పుణ్యపాపకర్మముల నివృత్తిరూపమగు మోక్షమునే యొసంగుచున్నది. అజ్ఞుఁ డైవఁ డింద్రియములను జయింపక వేదవిహితమైన కర్మము నాచ రింపక వేదవిరుద్ధములైన కర్మముల ననుష్ఠించుచు, నావశ్యక ములయినవాని ననుష్ఠింపకయు నుండునో వాఁడు మృత్యువు నుండి మృత్యువునే పొందుచున్నాఁడు. కాఁబట్టి వేదోక్తము లగు నిత్యనైమిత్తిక కామ్యకర్మములను నీశ్వరార్పితముగాఁ జేయుచు నాయావాని యవాంతరఫలములయందు సంగములేక యుండువాఁడు బంధకములగు సకల కర్మఫలములను నివర్తించు టకు మూలమగు జ్ఞానసంప్తిని-అనఁగాఁ గర్మయోగముచే

జ్ఞానయోగమును-బొందుచున్నాఁడు. అయినను గర్మముల కక్కఱలేని యాయవాంతరఫలము లేల శ్రుతి చెప్పుచున్న దందువా? కర్మముల ఫలము గలదను శ్రుతి యర్థవాదమే యగును (ఇది నిత్యనైమిత్తిక కామ్యరూపమగు వైదిక కర్మయోగము. ఇఁకఁ దాంత్రిక కర్మయోగమును వినుము.) అహంకార మమకారాదులు ప్రకృతిసంబంధములగు కార్యములు. అవి హృదయమునఁదగిలి భేదబుద్ధిగాకుండునట్లు ముడిగొని యుండును. పురుషుఁ డెప్పుఁడు తనహృదయమునంగల యట్టిముడిని విడిచికొనఁ గోరి తంత్రము (పాంచరాత్రము) నందుఁ జెప్పఁబడిన విధిచొప్పునను దేవునిఁ గేశవుని నారాధించునో వాఁడు, వేగళ క్రియాయోగము నిష్పన్నముకాఁగా, ప్రకృతిబంధమునుండి విడివడుచున్నాఁడు. ఆతంత్రవిధియిది. ఆచార్యునివలననానుగ్రహమొంబడసి యతఁడు చూపినపూజాప్రకారమున మహాపురుషుని మూర్తిని దన కభిమత మయినదాని నర్చింప వలయును. శుచియై యామూర్తికి నెదురుగాఁగూర్చుండి ప్రాణాయామము మొదలయినవానిని బచరించి దేహమును విశోధించి నుండి న్యాసములచేత రక్షగావించుకొని హరినర్చింపవలయును. ప్రతిమాదులయందుఁ గాని హృదయమందుఁ గాని యీశ్వరునిఁ, బూజకై యప్పటికి దొరకిన నాధనములతోఁ బూజింపవలయును. అందు మొదటఁ బూజకైన తులసీ చందన పుష్పాది ద్రవ్యములను బ్రోక్షణాదులచేతను, భూమి నూడ్చి యలుకుట మొదలగు వానిచేతను, దేహమును న్యాయా న్యాసాదుల చేతను, భగవత్ప్రతిమను మృత్తికాలేపన జలప్రోక్షణాదుల చేతను, యోగ్యములుగావించుకొని యాసనమును ప్రోక్షింప

వలయును. పిదప బాద్యము మొదలగువాని పాత్రములనేర్పఱచుకొని, సమాధిచేత బ్రతిమాదులయందు భగవంతు నావాహనముచేసి, హృదయాదిన్యాసములు గావించి మూలమంత్రముచేతను న్యాసము గావించి యీమంత్రముచేతనే యర్చింపవలయును. మఱియు నాయామూర్తిని నంగములగు హృదయాదులను నుపాంగములగు సుదర్శనాదులను నతని పరివారమును నా యా మూర్తిమంత్రముచేతనే యర్చింపవలయును. అర్ఘ్యము, పాద్యము, ఆచమనీయము మొదలయినవియును, స్నానము వస్త్రము భూషణము గంధ మాల్యాక్షతములును ధూపదీపములు నైవేద్యము మొదలయిన యుపచారముల నొసంగి భగవంతునికి నతని పరివారమునకును యథావిధిని బూజగావించి స్తోత్రములచేత స్తుతించి నమస్కరింపవలయును. అంతట దాను ధ్యానించెడి యామూర్తి తనయం దంతరాత్మయై యున్నాడని ధ్యానించుచు దానిని బూజింపవలయును. ఆ భగవంతున కర్పించిన యన్నశేషమును దాను భుజింపఁగయిఁకొని భగవంతుని కర్పించిన తులసీపుష్పాదులను సత్కారముతో శిరస్సున ధరించి యిట్లు సంపూజితుండయిన యాహరిని నతనిపట్టయిన పరమాకాశాదులకు నుద్వాసనముచేసి పూజావిధిని సమాప్తము గావింపవలయును. ఈవిధమునసే యగ్ని సూర్యుడు జలము మొదలగువానియందును నతిథులయందును హృదయమునందును సర్వాంతరాత్ముండయిన యీశ్వరుని పూజించువాఁడు చిరకాలమునసే భక్తియోగము నిష్పన్నమై కర్మబంధములనుండి విడివడుచున్నాఁడు. ఇది మూఁడవయధ్యాయము.

జనకార్షభ సంవాదము.

(అనుబంధము.)

రాజు—'హరి కర్మనశుండై కాక తన యిచ్ఛచేతనే యిం దవతరించుచున్నాడు గదా. అట్టి యవతారము లెం దేయేవి యెత్తి యేయేకర్మము లింతవఱకును జేసెనో, యిపుడు చేయు చున్నాడో, యిఁకఁ జేయఁగలఁడో, వానిని మాకుఁజెప్పుఁడు' అని యడిగెను. ద్రమిళుఁడు—భగవంతుని స్వరూప స్వభావ ము లవిచ్ఛిన్నములు. అట్టి యనంతుని గుణములు ననంతిను లయినవి గావున వాని నెనఁడు లెక్కింపఁబూనునో వాఁడు మందమతి యగును. ఏలండువాని చూమి రేణువులను బెద్దకాల మున కెట్లోకష్టపడి లెక్కించినను లెక్కింపవచ్చునుగాని వివిధ విచిత్ర శక్తులకెల్లఁ బట్టుయియుండు భగవంతుని గుణములనో యనంతిము లగుటఁబట్టి యెంతమాత్రము గణింపఁదరము గాదు. ఆదిదేవుం డగు నారాయణుఁడు తాను సృజించిన పృథివి మొదలుగాఁగల భూతములనును దక్కిన తత్త్వములనును విరాట్పురుఁడను బ్రహ్మాండరూపముగా రచించి యాపురమందుఁ దనయంశముచే ధారకుండై ప్రవేశించి యపుడు (విరాట్) పురుషుఁడను నామను నొందెను. (ఈవైరాజపురుషుఁ డవ తారములఁదెల్ల మొదటిదగును) ఆవైరాజపురుషునికి దేహ మీమాండులోకము లగును. అతని యింద్రియములచేత సమస్తజీవులకును జ్ఞానకర్మేంద్రియములు గలిగినవి. అతని జ్ఞానము తనంతటఁ బ్రసరించునదిగాని యింద్రియములతో డపే క్షించునది గాదు. అతనియూపిరియగు వాయువే దేహధారుల కెల్ల బలమును, ఓజస్సును, చేష్టలును గావించుచుండును.

ఆతఁడు తనకు లోనయినప్రకృతిగుణము లగుసత్త్వాదులను గొని యీజగత్తునకు నుత్పత్తి స్థితి లయములు గావించుటకై యాదికర్త (యుపాదానమును నిమిత్తమును) యగుచున్నాఁడు. అదియెట్లనిన—మొదట నీజగత్తును సృజించు విషయమున రజోగుణముతోఁ గూడిన బ్రహ్మయాయెను. దీనిని సంహరించుటకై తమోగుణముతోఁ గూడిన రుద్రుఁడాయెను. దీనికి స్థితి గలిగించుటకై సకలదేవతాశరీరకుండును యజ్ఞనిర్వాహకుండునయిన విష్ణుండు తానే ప్రాణమైను. నిష్టములను దొలఁగించి యిష్టములను గలిగించుటయె కదా స్థితి. త్రైవర్ణికులను వారి వారి వర్ణావర్ణాశ్రమములనుఁ దగిన ఫలములను నీవిష్ణుఁడు బొందించుచున్నాఁడు గాన, స్థితి గావించువాఁడగును. ఆద్యుండయిన యాపురుషుఁడే యిట్లు ప్రజలకు నెప్పుడు నుత్పత్తి స్థితి లయములు గావించుచుండును. ఇదివై రాజపురుషావతారము. భగవంతుఁడు ధర్మునికి దక్షునికూఁతురగు మూర్తియను దానియందు నరుఁడు నారాయణుఁ డని యిరువురుగా నవతరించెను. ఈ యవతారమునం దత్యంతమును బ్రశాంతుఁడై యుండును. బంధకములగు సకలకర్మములను నివర్తించుటకు హేతువగు జ్ఞానయోగమును నారదాదులకు నుపదేశించెను. అతఁడిప్పుడును ఋషినరులు తనయడుగులు గొలుచుచుండఁగా బదర్యాశ్రమమం దున్నాఁడు. ఇంద్రుఁడొకప్పు డితఁడు తపస్సు చేతఁ దనపదవిని గయికొనఁ గోరుచున్నాఁడేమోయని శంకించి యతని తపస్సును నాశముచేయుటకై మన్మథుని సపరివారముగాఁ బంపెను. ఆకాముఁడతని మహిమ తెలియనివాఁడు గాన యప్సరసలగణము వసంతుఁడు మందమారుతము మొద

లయిన తన బలంగమును గూర్చుకొనిపోయి యమ్మునిని నప్ప రఃస్త్రీల వాలారు చూపులనెడి వాడిబాణముల గ్రుచ్చెను. ఆ యాదిదేవుడు నిద్రుడు గావించిన యాయపరాధమును దెలిసికొనెను. అతడు డుండులకు లోనుగామికిఁ దానుధీరుండ నని కొంచెమైనను గర్వపడక తానెక్కుడ శాపమిడునో యని వడంకు చున్న యాకామాదులను జూచి నవ్వుచు 'మదనా! మారుతా! దేవతాస్త్రీలారా! భయపడకుండు. మీరు మాయాధిక్యమును గయికొనుడు. మాయాశ్రమము నశౌన్యము గావింపుడు' అనెను. శుకుడు—రాజా! ఇట్లతడు డభయమొసంగి వారితోఁ జెప్పఁగాఁ గాముడు మొదలయిన యాదేవతలు సిగ్గునఁ దలలు వాంచి యతనికిఁ దమయెడఁ గరుణపుట్టునట్లుగా 'అపరాధుల మైనను మమ్ము ననుగ్రహించుట నీయం దొకవింత గాదు. మఱి నీవు ప్రకృతిపురుష విలక్షణుఁడగు పరుండవు. కనుక గామ క్రోధాది వికారములు నిన్నుఁబొందవు. మఱి యాత్మా రాములును జితేంద్రియులు సరువా రెప్పుడును గుములుకొని నీపాదపద్మములు గొలుచుచుందురు. నీభక్తులకే కామాది వికారములు లేవనఁగా నీ కెక్కడివి? దేవతలమగు మాకిట్టి యపరాధములు చేయుట స్వభావమైయున్నది. ఎట్లనిన, నిన్ను సేవించుచుండు వారు దేవతల మగుమాపట్టయినస్వర్గమును గూడ నతిక్రమించి సర్వోత్తమమయిన నీ స్థానమును బొందు చుందురు. కాన దానికిఁ జూపోపక దేవతలు వారికిఁ బెక్కువిఘ్నము లు గావించుచుందురు. నిన్ను సేవింపని వారికో యట్టి విఘ్నము లేయరు. ఏలన సేద్యగాండ్రు రాజునకుఁ గప్పము నొసఁ గునట్లు వారు యజ్ఞమునందుఁ దమభాగములగు పురోడాశాదు

లను నా దేవతలకు బలు లర్పించుచుందురు. అయిన నా భక్తు లకు విఘ్నములు కలిగియే తీయునందువా ? అట్లుగాదు. సర్వ దేవతల కధీశ్వరుఁడవగు నీవు వారిని రక్షించుచుండుటవలన నీభక్తుఁడు విఘ్నములతలపయిని కా లిడి తొక్కఁగలఁడు చుమీ! ఆఁకలి,దప్పి, శీతము,ఉష్ణము, నిద్ర ము, గాలి, జిహ్వోప భోగములు శిశ్నోపభోగములు మొదలుగాఁగల మేమెల్ల నోక యపారసముద్ర మగుదుము. కొండఅట్టి మహాసముద్రమును దాఁటియుఁ దుదకు నిష్ఫలమయిన కోపముసకు లోనై యీవు నడుమంత ప్లవములో మునిఁగిపోయెదరు. నీట మునిఁగినవాఁడు తలపయినున్న బరువును దిగివిడుచునట్లు, వారు చేయఁదలఁచిన గాని తపస్సుచేసియుండియు, దాని నల్ల వీరికిని వారికిని శాప ములు పెట్టి వెచ్చించి * వ్యర్థముగా దిగివిడచిన వారగుదురు' అనెను. ఇట్లు కామాదులు పలుకుచుండఁగా నావిభుఁడు వారల రూపగర్వము నడంచుటకై కొండలు స్త్రీలను వారికిఁజూపెను. ఆ స్త్రీలు చక్కఁగా నలంకృతలై మిక్కిలి యమ్యతముగాఁ గనుపట్టుచుండిరి. వా రామహాత్మునకు శుశ్రూష గావించుచుం డిరి. దేవానుచరులయిన యీకామాదులు శ్రీదేవివలెఁ జక్కని రూపములు వెలుంగుచున్న యీ మెఱుంగుఁ బోండ్లను జూచి వారి రూపంపుఁ బెంపువలనఁ దమ కాంతులు డిందుపడఁ వారి దేహములనుండి గుమగుమ గుబాళించుచున్న వాసనలు సోకఁ

---

*భగవంతునియందు భక్తిలేక కేవల తపస్సును మాత్రము చేయు వారు గలరు. వారిలో కొందఱు కామమునకును కొందఱు క్రోధమునకును లోనగుదురు. కామమునకు లోనయినవారు కామోపభోగములనైన ననుభవించెదరు గాని. క్రోధపరు లది కూడలేక వ్యర్థులగుదురు గాన మిక్కిలియుం బూజ్యు లని భావము.

గాఁ బరనశులయిరి. ఆ దేవదేవేశ్వరుండు తనకుఁ బ్రణతులయి యున్నవారలను జూచి నవ్వుచు "ఈ స్త్రీలయందు మీకు నీడగు రూపుగలదాని నొఁకఁపడఁతిని గోరికొనుఁడు. అందఱును 'మాకెంతో యెక్కుడుగాని మాకీడయినది గలుగ దందురా'. అట్లైనచో మీ స్వర్గమున కలంకారముగా నేని యొక్కదానిని వరింపుఁడు" అనెను. ఆ దేవభృత్యులాభగవంతునియాజ్ఞ ను వల్లెయని యంగీకరించి యతనికి నమస్కరించి యప్సరసల యందుమిన్న యగు నూర్వశిని వరించి మున్నిడికొని దేవలోక మునకుఁ బోయిరి. వారు దేవేంద్రుని కొలువుకూటమునకుఁ బోయి యతనికి మ్రొక్కి దేవతలందఱును వినుచుండఁగా నతనితో నారాయణఋషి బలమును జెప్పిరి. ఇంద్రుఁడు విని యాశ్చర్యపడి భయమునొందెను. ఇది నరనారాయణావతారము. అచ్యుతుండగు విష్ణుండు జగత్తులకు మంగళముగావించుటకై తనకళచే హంస స్వరూపమునను, దత్తాత్రేయుఁడుగను సనందనాదులు గాను మాతండ్రియు భగవంతుఁడునగుఋషభుఁడుగను నవతరించి జీవాత్మపరమాత్మస్వరూప జ్ఞాన యోగము నుపదేశించెను. మధుపును సంహరించిన యావిష్ణువే హయగ్రీవుఁడై యవతరించి యమ్నాయములయిన వేదములను మరలఁ దెచ్చెను. ప్రళయమందు మత్స్యావతారమెత్తి మను వగుసత్యవ్రతునిని భూమినిని నోషధులను ఋషులను రక్షించెను. వరాహమై ప్రళయజలములనుండి భూమిని నుద్ధరించి హిరణ్యాక్షునిఁ బంచెను. కూర్మావతారమున నమృతమునకై పాలసముద్రమును జిలుకునపుడు తనవీఁపుపయిని మందరపర్వతమును దాల్చెను. పిదప శరణాగతుఁడయి మొఱయిడిన గజేంద్రుని

మొసలినుండి విడిపించి రక్షించెను. * వాలఖిల్యు లనుఋషులు కశ్యపునికై సమిధలు దెచ్చుచుండి గోష్పదమందుఁబడి మునింగినపుడు తన్ను స్తుతింపఁగా లేవనెత్తి యాపదనుండి విడిచిపుచ్చెను. ఇంద్రుఁడు వృత్రాసురుని వధించుటవలన బ్రహ్మహత్యనుబొందఁగా వానిని విడిపించెను. అసురయగు హిరణ్యకశిపుని గృహాంతరంబుఁజొఱబడి దిక్కులేకయుండిన దేవతాస్త్రీలను విడిచిపుచ్చెను. నృసింహుఁడై నాథుఁడుల కిభయము గావించుటకు నసురేంద్రుఁడగు హిరణ్యకశిపుని వధించెను. దేవాసుర యుద్ధమందు నింద్రాదులకొఱకు దైత్యవతులను జంపి మన్వంతరములన్నింటియందును నాయాయవతారములెత్తి లోకమును బాలించెను. వామనుఁడై యాచించినపమున బలివలన నుండి యీభూమిని హరించి దీని నింద్రాదులకు నొసంగెను. హైహయ వంశమును నాశముసేయుట కగ్నియో యన భార్గవకులమునఁ బరశురామఁడై యవతరించి యీ భూమియందు నిరువదియొకమాఱు క్షత్రియులు లేకుండునట్లు గావించెను. ఇప్పుడు సీతాపతి యగు రాముఁడై సముద్రమునందు సేతువుగట్టి దశకంఠుఁడగు రావణునిఁ జంపి వాని లంకను హతముసేసి తనకీర్తిచేత లోకముల పాపముల నెల్లఁ దూలించుచు సర్వోత్కృష్టుఁడై † వర్తించుచున్నాఁడు. అతనికి

---

* వాలఖిల్యులంగుష్ఠమాత్రశరీరులు. కశ్యపుని యాజ్ఞనుబట్టి ఇంద్రుఁడు వాలఖిల్యులు మొదలగువారు కట్టియలు దెచ్చుచుండఁగా వారిలోనుండు వాలఖిల్యులగోష్పదమందుఁబడి మునిఁగిరి. దానినిజూచియింద్రుఁడునవ్వెను. అందుఁకై వారలనికి శాపమిడి రనుకథయిట ననుసంధింపఁబడెను.

† ఇట వర్తమాన నిర్దేశముచేత రామావతారకాలమునకే యీజనకార్జునసంవాదము జరిగినదని తెలియఁబడుచున్నది.

జన్మములు గలుగవు. అయినను భూమిభారమును దీర్చుటకై యదువులందుఁ గృష్ణుఁడై జన్మించి దేవతలకుఁగూడఁ జేయ నలవిగాని కార్యములను జేయఁగలఁడు. పిదప బుద్ధుఁడై యజ్ఞ ములు సేయఁదగని దైత్యులు యజ్ఞములను గావించుచుండఁగా వారిని వేదవిరుద్ధములగు వాదములచేతి మోహపెట్టఁగలఁడు. కలియుగాంతమందుఁ గల్కియై రాజులయిన శూద్రులను జంపఁగలఁడు. మహాభుజా! జగన్నాథుఁడును మహాయశుండును గుభగవంతుని కర్మములును నవతారములును నిట్టివి వెక్కులు వర్ణింపఁబడి యున్నవి' అనెను. ఇది నాలుగవ యధ్యాయము.

జనకార్షభ సంవాదము.

(అనుబంధము.)

రాజు'ఆత్మవిత్తులారా! ఇంద్రియములను జయింపకయు దానిసలనఁ గామము లుడుగకయు నుండువాఁడు భగవంతుని హరిని బహుతిరముగా భజింపకుండురు. అట్టివారికి మఱి దేనియం దాసక్తి?(వారికి స్వాప్యమేది? అందులకు హేతువేమి? వారెట్టివారు?) అని యడిగెను.చనుఁడు—చతుర్ముఖశరీరకుం డయిన పరమపురుషుని ముఖమునుండియు బాహువులనుండియుఁ దొడలనుండియుఁ బాదములనుండియు నాయా సత్త్వాదిగుణ ములతోఁ గూడియున్న బ్రాహ్మణులు మొదలగు నాలుగు వర్ణ ములును నాలుగాశ్రమములును బుట్టినవి. వీనిలోపల నెవఁడు తమకుఁ జక్కఁ గారణభూతుండును సర్వనియామకుండును నగు పరమపురుషుని భజింపకయు నతనిని దక్కిన దేవతల పాటిగాఁ దలఁచి యనమానింతురో వారు తమవర్ణాశ్రమప ములనుండి భ్రంశమునొంది నరకమునఁ బడుదురు. 'వాఁడు తమకుఁ గారణభూతుఁడనియు నీశ్వరుఁడనియు సర్వోత్కృష్టుఁ

డనియు జ్ఞానముగలిగియుండినను నతని భజింపనివారు కృత ఘ్నులుగాన వారు నరకమునఁబడుట సత్యమే; అట్టిజ్ఞానమే లేక కేవలమజ్ఞులై యుండువారి గతియేమి యందువా రిహికథలను వినుటయు నచ్యుతునిఁ గీర్తించుటయు నెవరికి శాస్త్రాధికారము లేమిచే దూరములగునో యట్టిస్త్రీలు శూద్రులు మొదలగు వారు సైతము మాభాగవతులకృపకుఁ బాత్రులై లేని తప్పక ముక్తినొందుదురు. బ్రాహ్మణుఁడుగాని క్షత్రియుఁడుగాని వైశ్యుఁడుగాని వేదసంయోగముచేతనైనను దానినలనఁగలిగిన జ్ఞానముచేతనైనను హరిచరణములను భక్తింపుటకు వలయు సాధనముల ననుష్ఠించుట కధికారము గలవారై యుండియు మోహమును గొనుదురు; కాన వారిపదాంబుజములను భజిం పకి స్వర్గాదులయుపయుక్తకామములుగలిగియుందురు. ఏలనవారు వేదములు (a) * దక్షిణాదులు సేయుచుందురుగాన వారికా మోహము గలిగియుండును. వారామోహమువలనఁ గర్మము లను దమకు బంధకములుగానుండునట్లు చేయుటకుఁ దెలియకయు, సోకరికిని లొంగనివా రగుటచేఁ దెలిసినవారి నడుగకయు నుందురు. వారు మూర్ఖులు, తమ్ముఁబండితులుగాఁ దలంచుటచే గుట్టు లోకరి నడుగఁబోవరు; కాఁబట్టి, వారు చెవికి నింపుగా మాత్రముండునట్టివేదవాక్యములచేతమూఢులై 'మనమప్పరస

(a) * అర్థవాదపరులు. 'అపామ సోమమృతా అభూమ, అక్షయ్యం వాఁవైచాతుర్హాస్యయాజి సస్కృతంభవతి యత్రసోష్ణంశీతంభవత్యగ్నిర్వ్యాధయః' ఇత్యాదిశ్రుతులు చెవికింపుగా మాత్రముండువానిని నమ్మి రంభాసంభోగాదులం గోరి కర్మము లనుష్ఠించుచుందురు. భగవదారాధనపరముగా ననుష్ఠింపరనిశ్చయము. ఇదియె 'యామిమాం పుష్పితాం వాచం ప్రవదన్త్యవిపశ్చితః। వేదవాదరతాఃపార్థనాన్యదస్తీతివాదినః' ఇత్యాదిభగవద్గీతావాక్యములందు నిరూపింపఁబడియున్నది.

లతోఁ గూడివిహరింత' మని యిట్టిప్రియవాక్యములు * చెప్ప కొనుచుందురు. మఱియు వారికి రజోగుణమువలన నొకరిని జంపునట్టి యభిచారాదులు సేయవలయునని భయంకరములయిన సంకల్పములు గలుగుచుండును. వారికిఁ గోపము ప్రాణములకుం బోలె నుండును. ఇట్లు దాంభికులును దురహంకారులును భూపులునై వారు నిష్ణుప్రియులగు వారిని గాంచి హసనము చేయుచుందురు. వారు స్త్రీలనే కోలుచుచుందురు గాని పెద్దలను సేవింపరు. వారి గృహములందు మైథునమొక్కటియె యొక్కుడు సుఖముగానుండును. వారిట్టి గృహములందు వసించుచు నొకరికొకరు † తమపెంపుసొంపులను జెప్పకొనుచుందురు. మఱియు వారు లోభమువలన నన్న వస్త్రములుగాని దక్షిణలుగాని యొసంగకయె యజ్ఞములు సేయుదురు. తమ జీవనము కొఱకై యూరకి పశువులను జంపుదురు. కాని దానిని జంపించుటవలన గలుగు దోషములను దెలియరు. మఱియు నట్టి ఖలులు ధనాదిసంపదలచేత గ్రామాధిపత్యము మొదలగు నైశ్వర్యముచేతను మంచికులమునఁ బుట్టుటచేతను విద్యచేతను, దానముచేతను రూపముచేతను బలముచేతను శ్రౌతాది కర్మములచేతను గర్వితులై బుద్ధితెలివిదూల నీశ్వరుని హరిప్రియులగు సత్పురుషులను నవమానించుచుందురు. సమస్తములయిన దేహధారుల యందును, సదా

---

* ఇదియె గీతయందు 'ఇదమద్య మయాలబ్ధ మిమం ప్రాప్స్యే మనోరథమ్ । ఇదమస్తీదమపి మే భవిష్యతి పునర్ధనమ్' అని చక్కఁగాఁ బ్రతిపాదింపఁ బడియున్నది.

† శాస్త్రాధికారము దత్తజ్ఞానమునుండియు హరిని మూర్ఖులై భజింపని వారికి నరకప్రాప్తి కేయని యిందు చెప్పఁబడెను.

యాత్మరూపుఁడై నెలకొని యాకాశమువలె వానిదోషములను దానుబొరయక నిరతిశయ పురుషార్థరూపుఁడై యుండును. వాని స్వరూపస్వభావములు వేదాంతవేద్యములు. అట్టి భగవంతుని వార్తయైనను వినరు. కాని తమతమ మనోరథముల వార్తలు చెప్పికొనుచు నజ్ఞులుగాన యిట్లు కాలము పుచ్చుచుందురు. లోకమందు స్త్రీసంగమును మాంసభోజనమును మద్యసేవ యును బ్రాణులకు సాగమునుబట్టి నిత్యమును గలిగియుండును. కాని యందులకు విధిగలుగదు. శాస్త్రములు వానిని విధింపక పోయినను వానినిగూర్చి యొక యేర్పాటు మాత్రముచేసియు న్నది. వివాహమాడిన స్త్రీతోనే సంగమము చేయవచ్చుననియు యజ్ఞమునందే మాంసము భుజింపవచ్చుననియు, సౌత్రామణి యందే మద్యపానము సేయవచ్చుననియు నియమము గావిం పఁబడియున్నది. * ఈ స్త్రీసంగాదులనుండి నివర్తించుట (య నఁగా పరభార్యలందును ఋతువుగాని కాలములందును సం గమనుండియు యజ్ఞియమాలుగాని మాంసమద్యములను సేవిం చుటనుండియు) నివర్తించుటయు నిష్టమయినదికాని స్వభార్యా దులవలననుండి నివర్తించుటగాదు. ధర్మమువలన తత్త్వత్రయ ప్రకారమును గూర్చినజ్ఞానమును, భగవంతుని స్వరూపజ్ఞానము ను గలుగుచున్నది. పిదప దానివలన నాఁకలి దప్పి మొదలయిన యూర్మిలాశను వీడుచున్నవి. అటువంటి ధర్మమొక్కటియే

* 'ధర్మప్రజాసంపత్త్యర్థం స్త్రీయముద్వహేత్ -ఋతౌ పుత్రేయాత్ - పశుమాలభేత-యజమానపశ్చాత్ ఇడాం భక్షయన్తి-హంతకేమమశ్నీయాత్' సౌత్రామణ్యా సురాగ్రహాన్ గృహ్ణతి-ప్రతిగ్రహాదివా ధనమూర్జయేత్, ఇత్యాది కాస్తమాలు స్త్రీసంగాదులను విధింపుచుండఁగా దానిని నింది చుట యిట్లవఁగా నిది చెప్పఁబడినదని తెలియనది.

ధనమునకు ఫలముగాన ప్రతిగ్రహాదులచేత ధనమును సంపాదించి భగవంతునకుఁ బ్రీతికరమగు ధర్మమును సంపాదించుకొనవలయును గాని విషయభోగములనుగాదు. ఇది తెలియక కొందఱు కేవలము గృహములందు (విషయభోగాదులయందు) దానిని వినియోగించుచున్నారు; కాని యీశరీరమునకు మృత్యువు దురంతమయిన బలము గలదియని కనుఁగొనరు. కనుక వారెంతయు నింద్యులగుదురు. యజ్ఞమందు సురయును బశుభక్షణమును * బ్రాణశరీరకుండగు పరమాత్ముని భక్తిముగా విధింపఁబడియున్నది. కనుకఁ బశువును యజ్ఞమందుఁ జంపుట హింసగానేరదు; పశ్వాత్మకముల యుజ్జీవనముకొఱకే యగును. ఇట్లు స్త్రీసంగమమును బ్రజకొఱకుఁగాని రతి సుఖముకొఱకుఁగాదు. ఇదియె విశుద్ధమగు స్వధర్మమని తెలియరు. ఎవరిట్టిధర్మము నెఱుంగక యవినీతులై తాము సజ్జనులమని తలఁచుకొని జంకుమాలి పశుఘ్నులకుద్యోహము సేయుదురో వారు మృతులయి పరలోకమునకుఁ బోఁగానం దాపశువులు వారిని బట్టి తినుచున్నవి. పరుల దేహములందు దోహము చూపుచుఁ దన్మూలమున నాదేహములందెల్లనుదనయందును నాత్మభూతుఁడై యుండు నీశ్వరుం డగుహరియందును ద్వేషముచూపుచును, శవప్రాయమయిన తమదేహమందును దాని కనుబంధులయిన పుత్రకళత్రాదులందును మిక్కిలి

---

* యత్ప్రాణభక్షో విహితస్సురాయా స్తథాపశోరాలభనం నహింసా, అని మూలము. 'యత్ ఘ్రాణభక్షో' అని పాఠాంతరము. ఘ్రాణమాత్రముభక్షము-అనఁగా వానిని మూఁజూచుటయే వానిని భక్షించుటయగును. మూఁజూడఁబలసినదే కాని భక్షింపరాదనుట. ఇదియొ సమంజసమయిన పాఠము గాఁ దోఁచుచున్నది.

స్నేహముపచరించుచు, నుండువారు నరకమునం బడుదురు. జ్ఞాన నిష్ఠను బొందకయు మూఢత్వమును జెంపకయుఁ ద్రివర్గమె ప్రధానముగాఁగలిగి క్షణమయిన నుపశాంతిని బడయక యుండువారు తమయాత్మను * జంపిన వారయ్యెదరు. ఇట్లాత్మఘాతుకులై యశాంతులై యజ్ఞానముండియును జ్ఞానముగలిగి యున్న ట్లెన్నికొనుచుండువారు కడపటఁ గాలముచేతఁ దమ మనోరథములెల్ల ధ్వంసమునొందఁగా గృతకృత్యులుగానివారై బ్రతికియున్నపుడె క్లేశములు పడుచుందురు. నుఱియు వారు తా మెంతో కష్టపడి సంపాదించిన గృహములను సంతానములను సుహృదులను స్త్రీలను దిగవిడిచి తా మొల్లకున్నను వాసుదేవు నకుఁ బరాఙ్ముఖులగుటవలన నరకమును జొచ్చుచున్నారు' అనెను. రాజు—'ఆభగవంతుఁడే కాలమున నేవర్ణముగలిగి యెట్టి యాకారముతో నేవేరితోడఁగూడి యేవిధిచేతఁ బూజింపఁబడుచున్నాఁడో దానినంతయును నిపుడు చెప్పవలయు'ననియడిగెను. అందుల † కమ్మునిఁకృతము, త్రేత, ద్వాపరము, కలి,యనియీ యుగములు నాలుగింటను నేశవుఁడు నానావిధములయిన వర్ణములును నాకారములును గలిగి నానావిధులచేతఁ బూజింపఁబడుచున్నాఁడు. కృతయుగమందు శుక్లవర్ణముగలిగి

---

* కేవలమజ్ఞులయినవారు తత్త్వ విదులవలన ఉపదేశమునొంది సంసారమును దాఁటుదురు. జ్ఞాననిష్ఠులగువారు తమంతటనే దాఁటుదురు. ఈ యిరువురకు నడిమితెగవారైన మూర్ఖులో రెంటిని బొందరనిభావము. ఆత్మనుజంపుటయనఁగా దానిని అసత్కార్యముచేసి కడపటస్థావరత్వము నొందింతురనితెలియునది.

† ఇచటఁ జెప్పెడిమునిపేరు లేకున్నది. పూర్వోక్తుఁడగు చమసుఁడే కావలయును.

చతుర్బాహుఁడై యుండును. మఱియునపుడు జటలుదాల్చి వల్కలములుగట్టి కృష్ణాజినమును యజ్ఞోపవీతమును నక్షమాలయు దండమును గమండలువును ధరించి బ్రహ్మచారి వేషము నసుండును. ఆకాలమున మనుష్యులు శాంతులై వైరములు లేక సర్వభూత సుహృదులై సమదర్శులై శమదమములతోను ధ్యానయోగముతోనుగూడి భగవంతుని నారాధించుచుందురు. అక్కాలమున హంసుడు సువర్ణుడు వైకుంఠుడు ధర్ముడు యోగీశ్వరుడు అమలుడు ఈశ్వరుడు పురుషుడు అవ్యక్తుడు పరమాత్మయని యిట్టి గుణములచేతను నామములచేతను భగవంతుఁడు కీర్తింపఁబడుచున్నాఁడు. త్రేతాయుగమందు, నితఁడు రక్తవర్ణుఁడై నాలుగు బాహువులుగలిగి మూఁడు వేఁటల * మేఖలతోఁగూడి యుండును. మఱియుఁగతఁడు పింగళవర్ణములగు కేశములుగలిగి, త్రయీప్రతిపాద్యమగుయజ్ఞమునకు నిర్వాహకుఁడగు యజ్ఞమూర్తియై స్రుక్కు-స్రువమును జిహ్వాములుగాఁగలిగియుండును. ఆకాలమందు, సర్వదేవమయుండగునాహరిని ధర్మిష్ఠులును బ్రహ్మవాదులు నగుజనులు వేదోక్తకర్మములచేత యజింతురు. అపుడు విష్ణువు యజ్ఞుఁడు, పృశ్నిగర్భుఁడు, సర్వుఁడు, దేవుఁడు, ఉరుక్రముఁడు, వృషాకపి, జయంతుఁడు, ఉరుగాయుఁడని యీగుణములచేతను నామములచేతను జెప్పఁబడుచున్నాఁడు. ద్వాపరమందు భగవంతుఁడువిష్ణుఁడు పచ్చని వస్త్రములు దాల్చి చక్రాదులగు తనయాయుధములు గలిగి, శ్రీవత్సము మొదలగు తోడఁబుట్టిన గుఱుతులతోను గౌస్తుభము మొదలుగాఁ దెచ్చిపెట్టుకొన్న గుఱుతులతోడను గూడియుండును.

* ఇట మేఖల యజ్ఞదీక్షకు అంగమని తెలియునది.

అట్లు మహారాజ లక్షణములగు ఛత్రచామరాదులతోఁ గూడియున్న యాపరమపురుషుని తత్త్వత్రయజ్ఞానమును గోరి మనుజులు వేదములందును బంచరాత్రమునందును బ్రోక్తము లయినవిధానములచేతఁ బూజించుచుందురు. రాజా! ద్వాపర మందు జనులాభగవంతుని 'వాసుదేవుండు సంకర్షణుండును బ్రద్యుమ్నుండును, ననిరుద్ధుండును, భగవంతుఁడునగునీకు నమస్కారము. నారాయణ ఋషియుఁ బురుషుండును, మహాత్ముఁడును, విశ్వేశ్వరుండును,విశ్వంభరుండునసర్వభూతాత్ముండునగునీకునమస్కార'మని యాజగదీశ్వరుని స్తుతించుచుందురు. కలియుగమునందును నానావిధములగుతంత్రవిధానములచేత నెట్లుయజింతురో దానిని వినుము. కాంతియందు నింద్రనీలమణి వర్ణముగల శ్రీకృష్ణుని నతని హృదయాదులగు నంగములను గాస్తుభాదులగు నుపాంగములను, సుదర్శనాదులయిన యస్త్రములను, పార్షదులయిన నందసునందాదులను, మిక్కిలినంకీర్తనప్రచురములగు నర్చనలచేతవివేకులగువారు యజించుచుందురు. వారాభగవంతుని 'ప్రణతజనపరిపాలకా! మహాపురుషా! త్యానించుటకుఁదగినదియైయకుటుంబేంద్రియాదులచేత డిందువడకుండఁ జేయునదియై, యిష్టార్థములను బూరించుచు, గంగాదిపుణతీర్థములకాశ్రయంబగుటవలనఁ బరమపావనంబై, బ్రహ్మరుద్రాదుల చేత స్తుతింపఁబడి, శరణ్యమై, వారిభక్తుల యనిష్టములనెల్ల నివారించుచు, సకలార్థ నిదానమగు సంసారసముద్రమును దరింపఁజేయు నావయగు నీచరణారవిందములకు వందనముచేయుచున్నాను. ధర్మజ్ఞా! తండ్రియగు దశరథుని వాక్యము చొప్పున దేవతలును గోరునట్టిదియుఁ ద్యజింపనెంతయుఁ గష్టమైనదియు

నగు రాజ్యలక్ష్మిని విడిచి ప్రియురాలగు జానకి వలచినమా
యామృగము వెంటఁ బరుగిడిన నీపదారవిందములకు వందనము
చేయుచున్నా'మని సంకీర్తనము చేయుదురు. ఇట్లు శ్రేయముల
కెల్ల నీశ్వరుఁడును భగవంతుఁ డగు హరి యీయీయుగముల
కనురూపములయిన నామరూపములతోఁగూడి యీయీయుగ
ముల ననువర్తించుచుండు మనుజులచేతఁ బూజింపఁబడుచు
న్నాఁడు. దోషము లెన్నియుండినను గుణములనే తెలిసికొని
సాగమును గ్రహించునట్టి యార్యులు కలియుగమునే బహు
మానించుచున్నారు. ఏలనఁగా నాయుగమందు సంకీర్తనము
చేతనే * యభిలషించిన యర్థము లన్నియును లభించుచున్నవి.
ఈ సంసారమండలమున భ్రమించుచున్న దేవాలకు నాసంకీ
ర్తనముకంటె నతిశయించిన పురుషార్థసాధనము మఱియొ
క్కటి గలుగదు. ఆసంకీర్తనము మరణపర్యంత మాచరించిన
తెఱఁగున బరమంబగు శాంతిగలుగఁగను. సంసారమును నశించు
ను. కలియందు ముక్తియుపాయము మిక్కిలి సుకరముగా
నుండుటంబట్టి కృతాదియుగములందలివారు కలియందుఁబుట్ట
వలయునని కోరుదురు. కేవలమట్లు కోరుటయే కాక యాకలి
యందును నారాయణపరాయణులై (యష్టాక్షరచింతనపరులై)
పుట్టనుంబుట్టుచున్నారు. మహాభాగా! ద్రమిడదేశమునందాయా
చోట్లఁబుట్టుదురు. అందును నెచటఁ దామ్రపర్ణియుఁ గృతమా
లయుఁ బయస్వినియు, మహాపుణ్యయగు కావేరియుఁ బ్రతీ

---

* 'ధ్యాయన్ కృతే యజన్ యజ్ఞైస్త్రేతాయాం ద్వాపరేఽర్చయన్।
యదాప్నోతి తదాప్నోతి కలౌసంకీర్త్యకేశవమ్' అని సంకీర్తనమాత్రమే యభిల
షించిన పురుషార్థములను సాధించుచున్నదని భావము

చియు,నురవ ర్మగయు ననెడి నదులు పాఱునో యటంబుట్టుదురు. మనుజేశ్వరా! మనుజ లెవ రానదులజలములను ద్రావుదురో వారు భగవంతుఁడగు వాసుదేవునియందుఁ దఱుచుగాభ క్తిగల వారయి నిర్మలాంతరంగు లగుచున్నారు. మఱియునందు మనుజులు సంకీ ర్తనముచేయఁగా హరి వారికి ముక్తినొసంగుచున్నాఁడు. ఎవ్వఁడు సమస్తకర్మములను సన్న్యసించి శరణ్యుండగు ముకుందుని సర్వభావమునఁ (భ్రాప్యముగాను భ్రాపకముగాను) దలంచి శరణుఁజొచ్చునో వాఁడు దేవతులకుఁగాని ఋషులకుఁగాని కుటుంబమువారికిఁగాని మనుష్యులకుఁగాని పితరులకుఁగాని ఋణపడినవాఁడుగాఁడు;మఱెవారికిఁగింకరుఁడనుగాఁడు. పరేశుండగుహరి తనపాదమూలమునే యాశ్రయించి యుపాయము గనుపాయముగను సేవించుచు. దేవతాంతరములం దట్టిభావమును దిగవిడిచి యుండువాఁడు తననిరతిశయ ప్రీతికిఁ బాత్రుండగును గాన వానికిఁ బ్రమాదవశమున శాస్త్రవిరుద్ధమగు కర్మమేదేని కలిగెనేని వాని హృదయమందుసెలకొని దానినంతయు నాశము చేయుచున్నాఁడు' అనెను.

నారదుఁడు—మిథిలాధిపతియగు జనకుఁడు భాగవతధర్మములను వీనిని విని మిక్కిలి ప్రీతుండై జయంతీదేవి పుత్రులయిన యాకవ్యాదములగును దానును దన యుపాధ్యాయుండును బూజించినవాఁడయ్యెను. అంత జనులెల్లవారును జూచుచుండఁగా నాసిద్ధులగు మనులంతర్ధానమొందిరి. రాజు నాధర్మముల ననుష్ఠించుచుఁ బరమంబగు గతినిముక్తిని బొందినవాఁడయ్యె. మహాభాగా! నీవు సయిత మిపుడు విన్న యీభాగవత ధర్మమును ననుష్ఠించుచు శ్రద్ధగలిగి దేహమందును దాని యనుబంధు

లందును నాన క్తిని వీడి యటమీఁదఁ బరమంబగు పదమును బొందఁగలవు.ఇదిశా స్త్రప్రక్రియ. మీరిది లేకయె కృశార్థులరు. ఎట్లనఁగాభగవంతుఁడును సీశ్వరుండునగుహరి మీయిరువురకును బుత్త్రుఁడయినాఁడు. మీదంపతు లిరువుర యశీస్సుజగమంతయు నిండినది చుఁడీ! మీరు కృష్ణునియందుఁ గన్నకొడుకని నెయ్యము దియ్యమును నెఱపుచుఁ గన్నారఁజూచుచును, గౌఁగిలించుకొనుచును మాటలాడుచును, గూఁడఁ బరుండుచును గూర్చుండుచును బొత్తునఁ గుడుచుచును నుండుటవలన మీ యాత్మలు పవిత్రములు గావింపఁబడినవి. శిశుపాలుఁడు పౌండ్రుఁడు సాల్వుఁడు మొదలగు రాజులు వైరముచేతఁ దాము పరుండునపుడును గూర్చుండునపుడును దక్కినసమయములందును నాకృష్ణుని నడ కవిలాసములను జూపులును మొదలగువానిని మనంబునఁ దల పోయుచు బుద్ధి తన్మయముగాఁగా నతనితోడి సాధర్మ్యము నొందినవా రయిరి. బుద్ధివైరముచేతనే యిట్టిగతి కలుగఁగా,నిఁక ననురాగముతోడిబుద్ధి నతనియందుఁ బచరించువారి కట్టిసాధర్మ్యము గలుగుటను జెప్పనేల? కృష్ణుండు సర్వాత్ముఁడు. సర్వేశ్వరుఁడు మాయామానుష్యభావముచేత నెంతయు నతని యైశ్వర్యము గప్పఁబడియున్నది. అతఁడు ప్రకృతివిలక్షణుండగు పరుండు. అతఁడు స్వరూప స్వభావములందు వికారములేకుండువాఁడుగానయవ్యయుండు. అట్టికృష్ణునియందుఁ గేవలము బిడ్డఁడనుబుద్ధివలదునుమీ! అతఁడు మాయామానుష్యుఁడై పుట్టనేలయందువా? కొందఱసురులు రాజులై పుట్టిభూమికి భారము గావించుచుండిరి. వారిని జంపి సాధువులను రక్షించుటకై యవతరించినాఁడు. మతీయు వినువారికిని గీర్తించువారికిని నిరతి

శయానందమును గలిగించుటకై తనకీర్తిని లోకమునం బెల్ల విస్తరింపఁజేయుచున్నాఁడు, అట్టివానియందు బిడ్డఁడనుబుద్ధి యుంపవలదు' అనెను. శుకుఁడు—మహాభాగా! వసుదేవుఁడును మహాభాగ్యవతియగుదేవకియును దీనినివిని కృష్ణుఁడు తమ కన్న బిడ్డఁడను మోహమునుదిగవిడిచినవారయిరి.పుణ్యంబయిన యీ యితిహాసము నెవ్వఁడునమాహితుఁడై మనస్సునఁదాల్చునోవాఁడీ జన్మమందే భగవత్ప్రాప్తికిఁబ్రతిబంధక మగుటచేతఁ బాపంబగు పుణ్యముల నెల్ల విడిచి బ్రహ్మముతోడిసాధర్మ్యమునకుఁ బాత్రుఁడగుచున్నాఁడు. ఇది యైదవయధ్యాయము.

బ్రహ్మాదులు ద్వారకకువచ్చి శ్రీకృష్ణుని స్తుతించుట.

శ్రీశుకుఁడు—అంత వెలుంగుచున్న ప్రజాపతులగు మరీచి మొదలగు వారును దనపుత్త్రులగు సనకాదులును బరివేష్టించి కొలువఁగా బ్రహ్మయును, భూత గణములు పరివేష్టింపఁగా భూతభవ్యులగు ప్రజల కీశుండయిన రుద్రుండును, మరుద్గణ ములుగొలువఁగా నింద్రుండును, ఆదిత్యులును, వసువులును, అశ్వినీదేవతలును, ఋషులును, ఆంగిరసులును, రుద్రులును, విశ్వులును, సాధ్యులును, దేవతలును, గంధర్వులును, నప్సరస లును, నాగులును,సిద్ధులును,చారణులును,గుహ్యకులును, ఋషు లును, పితరులును, విద్యాధరలును,గిన్నరులును,నందఱునుగూడి కృష్ణునిఁ జూడవలయునని యువ్విళ్లూరుచు ద్వారకకుఁబోయిరి. వారెల్ల భగవంతుఁ డీదేహమును దాల్చి మనుష్యలోకము వారి మనస్సులను రంజింపఁజేయుచు సమస్తలోకముల పాప ములను దూలించునట్టి యశస్సును నంతట విస్తరింపఁ జేసెనో యా దేహముతోఁగూడి యుండఁగా నతనిని జూడవలయునని

కోరిపోయిరి. ఆద్వారకాపురము భోగ్యభోగోపకరణాదులయిన వెంపు సొంపులన్నియు నిండారి మిక్కిలియుఁ బకాశించుచుండెను. అం దద్భుతముగాఁజూపట్టు చిన్నికృష్ణునిఁజూచిరిగాని వారికన్నులకఱవెంత చూచినను దీఱదయ్యె. ఆదేవతలు నందన వనమునఁ బుట్టిన పూవుల నాయదుసత్తమునిపయిఁ గురియించి క్రమ్మి, చిత్రములగు శబ్దములను నర్థములునుగల వచనములతో నిట్లని స్తుతించిరి-దేవతలు-'నాథా! నీదు పదారవిందములకు మాబుద్ధిచేతను(మనస్సుచేతను) వచనములచేతను (వాక్కుచేతను) ప్రాణేంద్రియములచేతను దేహముచేతను, (అనఁగాఁగరణత్రయముచేతను) నమస్కరించుచున్నారము. కర్మమనెడి పెద్ద పశమునుండి విడివడఁగోరుచుండు భక్తియుక్తులగుజనులాపదారవిందములను హృదయకమల మధ్యమునఁ గేవలము చింతించుచుందురు. అట్టిదాని నిపుడుమాంసపుఁగన్నులారఁజూచికరణత్రయముచేత నమస్కరించుచున్నారమే. ఇది యెంతోయరుదుచుమీ.నీవుగుణత్రయమయ మగుమాయచేత ధారకుండవై నిలిచి యితరులకుఁ జింతింపనలవిగాని యీజగత్తును సృష్టించుచును రక్షించుచును సంహరించుచునున్నాఁడవు.అయిన నీవాగుణముల నియామకుఁడవై యధిష్ఠించియున్నావు గాని దానికిఁ బరవశుఁడవుగావు. అజితా! సృష్టిమొదలయిన యీయాకర్మములు నీకు లీలలేకాని పుణ్యపాపరూపమున నిన్నంటవు. నీ వసాధారణమై యపరిచ్ఛిన్నమై నిజస్వరూపానందమునందుఁ దగిలియుందువుగాని విషయసుఖములందుఁగాదు. విషయసుఖాసక్తులకే కర్మములను దన్మూలములగు దుఃఖాదులును గలుగు

చున్నవి. మఱియు నిన్ను హేయములంటవు. కనుక నీ సేవకుల కును హేయములు గలిగింపవు. ఇట్టి నిన్నుఁ గర్మము లంటుట యెట్లు? ఈడ్యా! నత్త్వమానసులకెల్ల నాయకా! శబ్దాది విషయములందు మిక్కిలి మనస్సు దగిలియుండుటవలన నత్యంత మగుననశుద్ధితోఁగూడి యున్న యీ మనుష్యులకు నీ కీర్తిని వినుటయందుఁ బెచ్చుపెరుఁగుచున్న మంచి శ్రద్ధవలన శుద్ధికలుగునట్లు, అధ్వర్యవమువలనను దాని యర్థశ్రవణమువలనను, దజ్జన్యమగు జ్ఞానమువలనను, దానమువలనను, దపమువలనను, వర్ణాశ్రమానుగుణములగు కర్మములవలనను, గలుగనేరదు. 'నీ కథను వినుటచేతనే శుద్ధి గలుగుచుండఁగా నీయడుగులను గుఱించి ధ్యానాదులేల' యన్నచో నీయడుగు లశుభములగు పాపవాసనలకెల్ల ధూమకేతువుచుమీ! దానిని మునులు సంసారము నిస్తరించి క్షేమము నొందుటకై భక్తియుక్తము లగు మనంబులఁ జింతించుచుందురు. దాని నాత్మవిదులగు పాంచరాత్రులు స్వర్గలోకము నతిక్రమించి నిత్యవిభూతిని బొందుటకును, నందును సమానైశ్వర్యముఁ బడయుటకును వానుదేవాదివ్యూహాముల నుపాసించునపుడు మూఁడుసంధ్యల యందును నర్చించుచుందురు. ఈశా! కేవల వైదిక కర్మములే చేయుచుండునట్టివారు వేదవిద్యాప్రోక్త మగువిధానముగఁ జరుపురోడాశాదికమగు హవిస్సును దమ హస్తములఁ గొని యాహవనీయము మొదలయిన యజ్ఞాగ్నులయందుఁ జింతించు చుందురు. మఱియుఁ దమమాయను దెలిసికొనఁగోరు * సాంఖ్య

* సాంఖ్యులకుఁ బురుషనకంటె వేఱుగా పరమాత్మ కలుగదు. అయినను వారు చింతించు ప్రకృతివియుక్తాత్మస్వరూపము పరమాత్మకు శేషమనివారికిఁ

యోగులును ప్రపత్తినిష్ఠులగు పరమైకాంతులును దానిని దమ యధ్యాత్మయోగమందు సేవించి చింతించు చుందురు. విభూ! భగవతియగు శ్రీదేవి నీవక్షమం దున్నదియే కదా, అయిన నాదేవి, వనమాల నీయడుగులవలకు వ్రేలుచు నందు నెలకొని యున్న సొంపునకుఁ జూపోపక సవతివలె మచ్చరించి దానివలెనే తానును నీయడుగుల నతి భోగ్యములగుటచే సేవించుచున్నది. మఱియు లక్ష్మి తెచ్చి సమర్పించెడి కానుకలను గయికొనుచు నీయడుగుఁ దమ్ములు మాయశుభవాసనలకెల్ల ధూమకేతువగుఁ గాత. నీయంఘ్రి బలిని బంధించుటకు మూఁడు లోకములను మూఁడడుగులఁగొలిచినది. అందు రెండవ యడుగు నిడునపు డది సత్యలోకమును జేరుటవలనఁ బయికెత్తినవిజయ ధ్వజమువలెనుండెను ముల్లోకములందును బ్రవహించుచుఁ బావనముచేయు గంగ నానికిఁ బతాకవలె వెలసెను. జగత్పావనిపుట్టిన యాయంఘ్రి నిరతిశయశుద్ధికరముగదే. మఱి యది యసుర సేనకు భయంకరమును దేవతాసైన్యమునకు నభయంకరమునై యుండును. మఱి సాధువులకు సుఖమును దక్కినయసాధువులకు దుఃఖమును నది గూర్చుచుండును. భగవంతా! అట్టి నీయంఘ్రి భజించుచున్న మా పాపములను బోఁగొట్టి పవిత్రులను జేయుఁ గాక. దేహధారులగు బ్రహ్మాదులు పరస్పర మతిశయింపఁ జూచుచున్నను, ముక్కునఁ ద్రాడు గ్రువ్వంబడిన యెద్దులవలె నెవ్వనికి వశగతులై యుందురో, బ్రహ్మాదులనుగూడ వశీకరించు

దెలియకున్నను అది పరమాత్మకు అపృథక్సిద్ధవిశేషణమగుటంబట్టి దానిని జింతించుటయుఁ బరమాత్మనిఁ జింతించుటయుండే పర్యవసించుచున్నదని యున్నము. వారు పరమాత్మపర్యంతజ్ఞానము లేనందున ముక్తిని బడయక కైవల్యమునే పొందుదురని భావము.

నట్టి కాలమునకును నియంత యైనకాల శరీరకుండును, ప్రకృతిపురుషులకు విలక్షణుండును, పురుషో త్తముండును నగు నీదుచరణము మాకు సుఖమును వి స్తరింపఁజేయుఁగాక. స్థూల ములగు చిదచిత్తులమయమగు నీ జగత్తునకు నీ వుత్ప త్తిస్థితిలయ ములకు హేతువగుదువు. మఱియు వ్య క్తమునకును జీవవర్గము నకును మహత్తునకును నీ వు త్తముండగు పురుషుఁడవు. సంవత్స రాత్మకమై యఖలజగమును క్రుయింపఁజేయుటకై పూని గంభీర వేగముతోఁగూడి యున్నకాలము శరీరముగాఁ గల యు త్తమ పురుషుండ వగుదువు. కాన కాలశరీరకుఁడవై నీవు సంహారము చేయుచుందువు. జగత్తును సృజించుటకు నధికృతుఁ డయినయని రుద్ధునకుసృష్టికుపయు క్తములయినవివిధవిచిత్ర శక్తులరూప మగు వీర్య మమోఘముగానుండును. అతఁడు సకలవ్యూహములకు మూలభూతుండవయిన నీవలననుండి యీ జగత్తును సృజించు టకై యావిర్భవించి,పురుషుఁడు స్త్రీయందుగర్భమిడునట్లు,ప్రకృ తియందుఁ బరిణామసామర్థ్యమనెడు తనవీర్యము (శక్తి) నుంచి యందుండి మహా త్తత్త్వమును బుట్టించెను. ఆమహత్తును దన కారణములును ప్రకృతివలెనె మూఁడుగుణములతోఁ గూడిన వై తనవలననుండి యహంకారాదులమూలమున బంగారు మయమయిన యండకోశమును సృజించెను. దానికి వెలుపల జలాదిమయములగు నావరణములేడు గలవు. ఇట్లు జగత్తున కుత్ప త్తిగావించుచుందువు.కాఁబట్టి స్థావరజంగమాత్మకమయిన యీజగత్తునకు నీవధీశుండవు. అనఁగా నీవన్నిటిలోపల నంత ర్యామివై చొచ్చి నియమించుచును నవతారములచేఁ బాలించు చును వానికి స్థితిగలిగించుచుందువు. అంతర్యామివగు నీవాయా

జీవులకర్మములను కర్మముల కనుగుణమగు సంకల్పముచేత గుణపరిణామాత్మకము లగు వారి యింద్రియ వ్యాపారముల నెసకొలిపి వాని మూలమున లీలారసమునకై శబ్దాదివిషయములను జీవమూలమున ననుభవించుచుండువు; కాని కర్మవశ్యుండవు గానందున దానివలని పుణ్యపాపకర్మములచే నంటఁబడకుందువు. నీ విం ద్రియములకుఁ బతివి కాన వానిని వశీకరించువాఁడవు గాని వానికి లోనై పుణ్యపాపములుచేసి పట్టువడు వాఁడవుగావు. తక్కిన జీవులుగాని యోగులుగాని శబ్దాది విషయవాసనలను దిగవిడిచియున్నను వాసనామాత్రముచేత బద్ధులగుచుందురు గాన యీవిషయానుభవమునకు వెఱచుచుం దురు. నీ విం ద్రియములకుఁ బతివగుట యీయవతారమందే చూడవచ్చును. నీపత్నులు పదాఱువేలమందియుఁ జిఱునవ్వు తోఁ గడకంటి చూడ్కులచే భావములను దెలుపుచును నట్లు భావసూచనములచే మఱింతవటు్రవలై కొమరుచూపుకనుబొ మలను గిఱపుచును, సురతపు మాటలనీటుచూపుచును మన్మథ బాణములు నిగిడించినిన్నుఁగూడఁగ్రుచ్చినను నీయింద్రియములను గలంచి వశము గావించుకొనుటకువలంతులుగారైరిగదే. అమృతతుల్యములగు నీకథానదులును నీపాదప్రక్షాళన జలాత్మకము లగు గంగాదినదులును ముల్లోకములందును గలదురితములను దూలించుటకు సమర్థములయినవి. కావునసే యాత్మశుద్ధికై పాటుపడుచుండువారు శ్రుతిసిద్ధమగు నీదుకీర్తియనెడు తీర్థమును జెవులచేతను,నీయంఘ్రులందుఁ బుట్టినగంగాతీర్థమును నంగసంగరూపములగు స్నానాదులచేతను, నిట్లీ రెండుతీర్థములను సేవించుచున్నారు'అని స్తుతించిరి. ఇట్లుబ్రహ్మరుద్రునిని దేవతలను

నుగూడి వారిని స్తుతించి యూకాశమున నేయుండి యూ గోవిందు నకుఁ బ్రణమిల్లి యిట్లనియె. బ్రహ్మ-'ప్రభూ! ప్రభూ! సమస్తచిదచిదంతరాత్మా! మేము తొల్లి భూమిభారమును దీర్పవలయునని నీకు విజ్ఞాపనము చేసికొంటిమి. నీవు నవ్లిగావించితీర్చితివి. సత్యసంధులగు సత్పురుషులయందు ధర్మమును స్థాపించితివి. వినుచును జెప్పుకొనుచునుండు సకల జనముల పాపములనెల్లఁ దూలించునట్టి కీర్తినిగూడ దిక్కులయందు వెదచల్లితివి నీవు త్తమంబయిన రూపమును దాల్చి యదువంశమునం దవతరించి యుదార కథావిషయములగు కర్మములను జగమునకు శ్రేయస్సు గలుగుటకై కావించితివి. ఈశా! కలియుగమందు సాధువులగు మనుష్యులు నీయాచరితములను వినుచును గీర్తించుచును సుఖముగాఁ బ్రకృతికార్యంబగు సంసారమును దరింతురు. పురుషోత్తమా! విభూ! నీవు యదువంశమునం దవతరించి యింతకు నూటయిరువదియేనేండ్లు గడచెను. అఖిలాధారా! నీకిపుడు దేవకార్య మింకను జేయక మిగిలియున్నది యేమియు లేదు. ఈ యదుకులమును బ్రాహ్మణశాపముచేత నించుమించుగా నశించినట్టి దాయెను. కాఁబట్టి నీధామంబగు పరమపదమునకుఁ జిత్తగించిన యెడల వేంచేయుదువుగాక. ఆజ్ఞాపింప మే మెవ్వరము? వైకుంఠా! ఈలోకములను లోకపాలురను నీకుఁ గింకరులమగు మమ్మును బాలింపుము' అనిరి. మాయామానుష్యుఁడై యున్న భగవంతుఁ డీశ్వరుఁ డిట్లు బ్రహ్మాదులయిన దేవతలు స్తుతింపఁగానా స్తుతి నభినందించి వారలఁజూచి 'దేవేశ్వరా! నీవు చెప్పినది నే నపుడె నిశ్చయించుకొనియున్నాను. మీ కార్యమంతయుఁ జేసి యైనది. భూమిభారమును దింపితిని. అయిన నీయాద

వకులము వీర్యశౌర్యముల పెంపు సొంపున మిక్కిలి విఖ్యాతిగాంచు లోకమును గబళింపఁ దివురుచున్నది. మహాసముద్రమును జెలియలికట్టవలె నేను దీని నడ్డగించియున్నాను. మిక్కిలి దర్పించిన యీయాయదువుల పెనుకులమును నేను సంహరింపక పరమపదమునకుఁ బోవుదునేని నది గట్టుమీఱి వైఁబడఁగా నీలోకమంతయు నశింపఁగలదు. ఇప్పటికే బ్రాహ్మణశాపమువలన నీకులమునకు నాశ మారంభించియున్నది. అనఘా ! బ్రహ్మా ! ఇది ముగిసిన కడపట నాభవనమునకు వచ్చుచున్నాను' అనెను. శుకుఁడు—జగన్నాథుండు కృష్ణుఁడిట్లు చెప్పఁగా దేవుండా స్వయంభు వాతనికిఁ బ్రణమిల్లి దేవగణములంగూడి తన నెలవునకుఁ బోయెను. పిదప నాద్వారవతియందు మహోత్పాతములు పొడచూపెను. దానినిజూచి భగవంతుఁడు సమాగతులై యున్న యదువృద్ధులను జూచి యిట్లనియె. 'ఇవిగో' నిందు మిక్కిలి గొప్ప యుత్పాతములు నలుప్రక్కలఁ బుట్టుచున్నవి. మఱిమన కులమునకు నింతకుమునుపే బ్రాహ్మణులవలనఁ గడవరాని శాప మును గలిగియున్నది. పెద్దలారా! మనము బ్రతుకఁ గోరితిమేని యిచ్చటవసించియుండరాదు. ఇప్పుడేకదలి మిక్కిలియుఁ బుణ్యం బయిన ప్రభాసతీర్థమునకుఁ బోదము బాగువలదు. మున్ను చంద్రుఁడు దక్షశాపమువలనఁ బొందియాక్షయరోగమునొందియా ప్రభాసతీర్థ మందుఁ గ్రోలిన మాత్రముననే యాకిల్బిషమునుండిముక్తుఁడవీడి మరలఁ దనకళలపెంపును బొందినవాఁడాయెను. మనము కూడనందు స్నానముచేసి పితరులకును దేవతలకును దర్పణము విడిచి షడ్రసోపేతమయిన యన్నమును గమనీయుల విప్రులకు భోజనముపెట్టి వారియందుఁ బాత్రులయినవారిని శ్రద్ధతో

గొప్పదానములు చేసి యీదానములచేత,సముద్రమును నావల చేతంబోలె, బ్రాహ్మణశాపమువలని దుఃఖముల నెల్లఁ దరింతును' అనెను. కురునందనా! భగవంతుఁ డిట్లానతియ్యఁగా, యాదవులా తీర్థమునకుఁబోవుటకు బుద్ధినిశ్చయించుకొని రథములకు గుఱ్ఱము లను బూన్చునట్లు చేసిరి. భగవంతునకు నిత్యము ననువ్రతుఁ డైయుండు నుద్ధవుఁడు తండ్రిచెప్పినది విని వారిసన్నాహము లను జూచి, మఱి భయంకరము లగు నరిష్టములను గాంచి,జగ దీశ్వరులకెల్ల నీశ్వరుం డయిన యాకృష్ణుని నేకాంతమున సం ధించి యతని పాదములందు శిరమునోఁకఁగా మ్రొక్కి చేతులు జోడించుకొని యిట్లనియె.ఉద్ధవుఁడు—'దేవదేవేశా! యోగేశా! పుణ్యశ్రవణకీర్తనా! నీ వీకులమునంతయు సంహరించి యీ లోకమును విడుచుట నిజము. ఏలందువా? ఈశ్వరా! నీవు బ్రాహ్మణశాపమును బడఁగొట్టుటకు సమర్థుండ వయ్యును నట్లు చేయక యున్నావు. కాన నీ విదివిడుచుట నిక్కము. కేశవా! నేను నీపాదకమలములనునరక్షణమయిననుబాసియుండుటకు నొల్లను. నాథా! నన్నుఁగూడ నీధామమునకుఁ గొనిపొమ్ము! బ్రహ్మమా! నీదు వివిధక్రీడలు మనుజులకు మిక్కిలియు మంగళావహములు. అవి కర్ణముల కమృతమువంటివిగాన జనులు వానిని జవిచూచి తక్కినదేహము మొదలగువానియందలి శోకికలనెల్ల దిగవిడుచు చుందురు. కనుక నట్టినిన్ను నాకెట్లు విడువనగును? నీవు పరుండు నపుడును, గూర్చుండునపుడును, దిరుగుచున్నపుడును,నిలుచున్న పుడును, జలకమాడునపుడును, పనులుచేయునపుడును, గుడుచు నపుడును, మఱి తక్కినసమయములందును, నీతోడఁ గూడి మూఁడి యుండువారము. మఱి మా కాత్మవు; కాన యత్యంత

ప్రియుండవు; ఇట్టినిన్ను, మఱిభక్తులగు మేమెట్లుదిగనాడియుండ నేర్తుము ? మఱియుఁ బూదండలు గంధములు వస్త్రము లలంకారములును నీవనుభవింపఁగామిగిలినవానిని గొనియలంక రించుకొని నీ యుచ్ఛిష్టమును గుడుచుచు నుండువారము. నీదా సులముగాన నీసంసారమాయనుజయించినవారము కాఁబట్టియం దులకుఁ భయపడికాదు; నిన్నుఁబాయలేక వెంటఁగొనిపొమ్మను చున్నవారము చుమీ. కౌపీనమాత్రముదాల్చి దిగంబరులై యనళినాదులవలన శ్రమపడియూర్ధ్వరేతస్కులై సన్న్యాసులై రాగద్వేషాదులువీడి పాపములెల్ల దిగ విడిచికదా ఋషులుబ్రహ్మ లోకంబునెడి నీ పదమును బొందుచున్నారు. మఱి యితరులును బ్రహ్మచర్యాది క్లేశములపాలై సంసారమును దరించుచున్నారు. మేమో ! మహాయోగీ ! యీ సంసారమందుఁ గర్మార్జితము లయిన సుఖదుఃఖాదులంబడి భ్రమించుచునుండియు నీభక్తులం గూడి నీ ముచ్చటలచేతనే దుస్తరంబగు సంసారము ననాయా సముగా దాఁటుచున్నారము చుమీ! నీచేష్టితములను నీపలుకు లను నీనడకలను, నవ్వులను బరియాచకములనును మనుష్య లోకము ననుకరించుటకై నీవు గావించుదాని నెల్లఁ దలంచు చును దలఁపించుచును ననాయాసముగా నీ సంసారమును దరింతుముచుమీ'? యనెను. రాజా! ఇట్లుద్ధవుండు విజ్ఞాపింపఁ గా భగవంతుఁ డాదేవకీపుత్రుఁడు తనకేకాంతియుఁబ్రియుండు ను భృత్యుండు నగు నుద్ధవునిఁజూచి యిట్లనియె. ఇది యూఁబవ యధ్యాయము.

శ్రీకృష్ణుఁడు దుర్ధవునకుఁ బరమార్థోపదేశము
సేయుటనవధూతయదు సంవాదమును జెప్పుట.

శ్రీ భగవంతుఁడు 'మహాభాగా! నీవు చెప్పినట్లు నేను జేయనిశ్చయించుకొంటిని. బ్రహ్మయు రుద్రుఁడును లోకపాలురును నన్ను స్వర్గమునకు రమ్మనికోరుచున్నారు. నేనుభూభారము తీర్పవలయు నని దేవతలు కోరిరి. కార్యమును బూర్ణముగా నిందు నెఱవేర్చితిని. అందులకే కదా బ్రహ్మ ప్రార్థింపఁగా నా యంశముచేత నిం దవతరించితిని. ఈ యదుకులము బ్రాహ్మణ శాపముచేత దగ్ధమై పరస్పర కలహములచేత నశింప నున్నది. నేఁటి కేడవనాఁడు సముద్ర మీ పట్టనమును ముంపఁ గలదు. నే నీలోకమును వ్యజించినపుఁడే యిది మంగళము లెల్లఁదూలి త్వరితముగానే కలికిం జిక్కి క్రిందు పడఁగలదు. నేను భూతలమును విడిచినపిదప నీ విచట వసింప యుండవలదు. ఏలనఁగలియుగమందు జను లధర్మునందు రుచిగలిగినవారగుదురు. నీవు శబ్దాది విషయముల నన్నిటిని, సాంతజనులందును బంధువులయందును గల నెయ్యమును, దిగవిడిచి నాయందు మనస్సును జక్కఁగా నెలకొల్పి యన్నియును బ్రహ్మాత్మకములని సమదృష్టి గలిగి, భూమియందుఁ గ్రమ్మరుచుండుము. మనస్సుచేతను వాక్కుచేతను గన్నులచేతను జెవులు మొదలగువాని చేతను గ్రహించునవి యెల్లను నశ్వర మనియుఁ బ్రకృతిగుణములకు లోనయిన మనస్సుచేఁ గలుగునవనియుఁ దెలియుము. సర్వాంతరాత్ముఁడనగు నాయందు మనస్సు నుంపని పురుషునకు భ్రమము గలుగుచున్నది; ఆభ్రమము వస్తువులెల్ల బ్రహ్మాత్మకములుగాక వేఱువేఱ స్వతంత్రములై నానావిధముల నున్న

ని తోఁపించుచున్నది. (నాయందు మనస్సు నుంచువానికో అన్నియు మదాత్మకములనియు నొక్కరూపై యున్నవనియుఁ దోఁచుచుండునుగాని నానావిధములనున్నదని భ్రమగలుగదు.) ఆభ్రమము సుఖదుఃఖములను గలిగించుచున్నది. అది స్వరూప ముచేత నట్లు సుఖదుఃఖములు గలిగించునది గాదు. కర్మము (అవశ్యకర్తవ్య మగు నిత్యనైమిత్తిక కర్మము),అకర్మము (ప్రతిషిద్ధకర్మము),వికర్మము (వివిధ ఫలార్థమగు కామ్యకర్మము)అనియీ విధినిషేధాదులు భ్రమగలవానికిఁ దోఁచుచున్నవి. (కనుక విధినిషేధాదులు ప్రతిపాదించు శాస్త్రమునకు వాఁడు లోనగుచున్నాఁడు. కాఁబట్టి యీ విధుల ననునర్తించుట వలననును నిషేధముల నతిక్రమించుటవలననును వానికి సుఖ దుఃఖములు గలుగుచున్నవి. కనుక భ్రమము స్వరూపముచేత విధినిషేధాదిభేదప్రతిపాదకమగు శాస్త్రమునకు లోఁబఱుచుటచేత నిట్లు) సుఖ దుఃఖములు గలిగించుచున్నది. ఇట్లు నానా విధములఁ దోఁపించు భ్రమము సుఖ దుఃఖగర్భ మగు సంసారమునకు హేతువగుటంబట్టి యింద్రియసమూహమును నియమించి నాయందు మనస్సును జొనిపి,యచిత్పరిణామాత్మక దేవ మనుష్యాదిశరీరసమూహ మగు నీజగమును జీవునియందును (అనఁగా జీవునికి ధార్యమనియును) జీవుని నీశ్వరుండనగునాయందును (నాకువాఁడుధార్యుఁడయినవాఁడనియుఁ)గనుఁగొనుము. నీవిట్లు సదా గనుఁగొనుచుందువేని యీభ్రమమును దన్మూలమగు సంసారమును నివర్తించుచున్నది. 'అయిన నిట్టిచూపున కనాదివిషయాసక్తివలన నంతరాయములు గలుగవచ్చు' నందువా? మొదట నీవు పృథివిమొదలుకొని యాత్మవఱకుఁగల తత్త్వ

ములను గూర్చి జ్ఞానమును విజ్ఞానమును బడయుము. అపుడు సమస్తభూతముల స్వరూపము దెలిసియుండుటం బట్టి నీవు వాని యన్నిటియందును నాత్మవలె సుహృదుఁడ వగుదువు. అప్పు డాత్మ స్వరూపము ననుభవింతువు గాన నిరతిశయానందమయిన యా యనుభవముచేతనే సంతుష్టి నొందుదువు. అల్పసుఖము లగు విషయానుభవములందు నీకపుడు వెగటుపుట్టును గాన విషయ సుఖానుభవమున కయిన కర్మము లంతరాయములై యట్టి చూపునకు విఘాతము గలిగింపఁజాలవు. ఇట్లాత్మానుభ వముచేత సంతుష్టుఁడయినవాఁడు విషయ సుఖదుఃఖముల రెం టిని గడచినవాఁ డయినను నిషిద్ధముల నాచరించుట యాత్మ ప్రాప్తికి విరోధిగదాయని నిషేధములందు దోషముదలఁచి వాని నుండి నివర్తింపనే నివర్తింపఁడు. విహితమయినకర్మము స్వర్గా ది సుఖసాధనముగదా యని దానియందు గుణమును దలఁచి యాచరింపఁడు. ఇట్లాతఁడు చేయఁదగనినిషేధములను జేయు చును జేయఁదగినవిహితములను జేయకయు నుండుటంబట్టి, బిడ్డఁడు దన స్వభావమును వెలి పుచ్చకయే యా యాకార్య ములు చేయునట్లు, అతఁడును దన మాహాత్మ్యమును బయలు పఱుపకుండుటకై * యట్లు చేయుచున్నాఁడని తెలియుచున్నది. ఇట్లు పూర్వోక్తరీతిని సర్వభూతములకు సుహృదుఁడై వైరా గ్యమువలన శాంతుఁడై సకలతత్త్వములనుగూర్చి జ్ఞాన విజ్ఞా

* నిషేధములు ఆత్మప్రాప్తికి ప్రతిబంధకములు గలిగించు నవయ్యును వానినిజేయుట తనమహత్త్వము తెలియకుండుటకనియు, విహితములు ఫలము లను గలిగించి యాత్మప్రాప్తినుండి చ్యుతి గలిగించుచున్నవి గాన వానిని జేయఁడనియు, తెలియునది.

నములు దృఢముగాఁ బడసి సమస్తమును మదాత్మకముగాఁ గనుఁగొనుచు నుండువాఁడు మరల సంసారవిపత్తి నొందఁడు' అనెను. ఇట్లు భగవంతుఁ డానతియ్యఁగా మహాభాగవతుం డయిన యుద్ధవుఁడు తత్త్వమును దెలియఁగోరి యచ్యుతునకుఁ బ్రణమిల్లి యిట్లనియె. 'దేవా! నీవు యోగనిర్వాహకుండవు. యోగము నుపదేశించు వాఁడవు. యోగఫల రూపుండవు. యోగశాస్త్ర జనకుండవు. మోక్షమునకై నీవు నాకుఁ జెప్పిన త్యాగమును సన్న్యాసరూపమయినదానిని జెప్పుము. భూమా! విషయముల త్యాగము విషయాసక్తచిత్తు లగువారికి దుష్కరముగా నున్నది. సర్వాత్మా! మతి నీయందు భక్తి లేనివారికి నది మిక్కిలియు దుష్కర మని నాయభిప్రాయము. నిరతిశయ సుఖరూపమగునిన్ననుభవించువారికో యల్పసుఖములగువిషయములందుఁ ద్యాగ మెట్లయినను గలుగుచున్నది కానియట్టియను భవము లేనివారికి విషయములం దెట్లును వెగటుగలుగనేరదు. నీవు నాకుఁ ద్యాగముపదేశించితివిగాని నేనో నీమాయచేతవిరచితం బగు దేహమునందును దాని యనుబంధు లగు పుత్రకళత్రాదులందును, సహంకార మమకారములచే మూఢమతినై మిక్కిలియు మునిఁగి యున్నాఁడను. నీ వన్నియుఁ బరిత్యజింపు మని యుపదేశించినదానిని సుఖముగా సాధించుసట్లు నీ భృత్యుండనగునాకు వేఱువేఱ తెలుపుము.'నేను సంగ్రహముగాఁ జెప్పితిని. తక్కినవారివలన సవిస్తరముగాఁ దెలిసికొనుము' మందు వేమో! ఈశా! నీకు నిత్యమును నీ స్వరూపము ప్రత్యక్షముగాఁ దెలియుచుండును. కనుక నీకెప్పుడును స్వభావము సంకుచితముగాక యుండును. నీవాత్మకును నంతరాత్మఁడవు. ఇట్టి నీకంటె

మఱియొకని నుపదేశించువానిని దేవతలయందును నేను గనుఁ గొనజేరకున్నాను. ఏలందువా? బ్రహ్మ మొదలయిన వీరందఱును నీమాయచేత బుద్ధి మోహము నొందుటవలనఁ గర్మాధీనములగు దేహములు దాల్చి యీ త్కృకానిదానిని నే ననెడియభిమానము గలిగి యజ్ఞులై యున్నారు. నీమాయయొ నీపదారవిందముల రస మెఱింగినవారితోడఁ గూడిక లేకున్న వారికి, దాని నిరసింపవలయు ననియెన్ని యుపాయములు పన్నినను నది నివర్తింప కుండునది చుమీ! అట్టి మాయచేతనే కదా వారిబుద్ధులు మోహితములై యున్నవి. ఆలుమగ లని దంపతులుగా వర్తించుచు గృహాసులనొంది తాపత్రయములచేతఁ దపించుచు నున్న మానవులేనియు విషయములందలి యాసక్తి వీడిరేని సత్సంగమము గలుగుచున్నది. ఎట్టివారయినను విషయాసక్తిగలిగియుండిరా, యీసంగమముగలుగనేరదు. కాఁబట్టి బ్రహ్మాదులవలె మోహాదిదోషములు లేక యపరిచ్ఛేద్యములగు స్వరూపస్వభావములు గలిగి సర్వవస్తువులను సాక్షాత్కరించి తెలియుచు సర్వనియంతయై యప్రహతమగు వైకుంఠము స్థానముగాఁ గలిగి నారాయణుండవై నరసఖుండవై యున్ననిన్ను సంసారదుఃఖముచేఁ గ్రాఁగుచు బుద్ధిగలఁగివేసరియున్న వాఁడను గాన నేను శరణముఁ జొచ్చుచున్నాను' అనెను.

భగవంతుఁడు 'లోకమునం చాయావస్తువుల తత్త్వములను విమర్శింప నిపుణులయిన వారు తమ మనస్సును చక్కఁగా శిక్షితము గావించికొని దానిచేతనే విషయవాసనవలన నుండి తఱుచుగాఁ దమ్ము త్తరించుకొనుచున్నారు. పురుషునకు మనుష్యజన్మమందు విశేషించి గురువైనని

(హిత(ప్రవర్తకమైనది) చక్కఁగా శిక్షితమగు తనమనస్సే. ఏల నఁగా మనుష్యజన్మమందుఁబ్రత్యక్షానుమానములగు శ్రుతిస్మృతులవలననుబురుషునకు శాస్త్రాధికారముపలసను శ్రేయస్సుగలుగుచున్నది. మఱియు మనుష్యజన్మునందే సాంఖ్యమునందును (చిదచిదీశ్వరతత్త్వత్రయవివేకమునందును) యోగమునందును (పరమాత్మోపాసనమందును) గుళ్లులై జితేంద్రియులగుచు నన్ను (వివిధవిచిత్రసృష్ట్యాదుల కుపయుక్తములయిన సర్వజ్ఞత్వము సత్యసంకల్పత్వము మొదలుగాఁగల) శక్తులతో నెల్ల నతిశయించియున్నవాఁడ నని మిక్కిలియు స్పష్టముగా నెఱుఁగనేర్తురు. ఇందు నేనొకపాదముగలవానిని రెండుపాదములు గలవానిని మూఁడుపాదములు గలవానిని నాలుగుపాదములు గలవానిని బెక్కుపాదములు గలవానిని నసలు పాదములే లేని వానిని, ఇట్లు పెక్కుదేహములను సృజించియున్నాను. అందు మనుష్యదేహమే (నన్ను స్పష్టముగా నెఱుఁగఁగూడినది గాన) నాకు మిక్కిలియుఁ బ్రియమైనది. అట్లేని మనుష్యజన్ముఁ డొందినవారెల్ల నిన్నుఁజూతురుగదా యనవలదు. నేను (ప్రత్యక్షముగా గ్రహింపఁబడు రూపాది లక్షణములచేతను ననుమాన లక్షణములచేతను గ్రహింపనలవిగాని వాఁడను. కావున నెవరో కొందఱు మాత్రమె యీశ్వరుండనగుననన్ను యుక్తము లగు హేతువులచేత విమర్శించి యెదకుచుఁ గనుఁగొనుచున్నారు. ఈవిషయమై పురాతనమగు నొకయితిహాసము నుదాహరించుచున్నారు. అది యొకి యవధూతకును నమిత తేజుం డయిన యదువునకును జరిగిన సంవాదము. ఒక (బ్రాహ్మణుఁ డభ్యంగనాదులచేత దేహమును సంస్కరించుకొనక శీతవాతాది

లకువేనికిని భయపడక యవధూతగానుండెను. అతఁడెలప్రాయపు వాఁడు, విద్వాంసుఁడు. అతఁడుసంచరించుచుండఁగా నొకప్పుడు ధర్మవిదుఁడగు యదు వతనిని జూచి 'బ్రాహ్మణా! నీ వింద్రియ ప్రీతికై యేకర్మమును జేయవు. మిక్కిలి నిపుణమయి లోకుల కెవ్వరికిని లేకున్న యిట్టిబుద్ధి యెక్కడనుండి కలిగినది? నీవా బుద్ధిని బడసినందున, విద్వాంసుఁడవయ్యు నజ్ఞునివలె లోకమందుఁ జరించుచున్నావే. బహుతరముగా మనుజులు గొప్పవారు సయితము ధర్మార్థము కామములందుఁను దానికి సాధనాదులు తెలిసికొనుటయందును నాయువు క్షీణసంపదను బడయుకొఱకును, ప్రవర్తించుచునే యున్నారు. నీవెట్లు శక్తుఁడవు గాన యశక్తిచేత నేమియుఁ జేయలేవని చెప్పనయితి లేదు. విద్వాంసుఁడవు; కాన దెలియమిచేత నూరకున్నావనరాదు. సమర్థుఁడవు; కాన నేర్పులేమిచేత ననరాదు. చక్కనివాఁడవు, కాన విరూపినిగాననూరకున్నాననుటయుఁ దగదు. మితభాషివి, కాన మూఁటకారితనము లేనందుచేత ననరాదు. అయినను నీవు జడుని వలెను స్తుత్తునివలెను బిశాచముపట్టినవానివలెను నేమియుఁ జేయుట కొల్లకున్నావు. తక్కిన జనులు కామ లోభము లనెడికారుచిచ్చుచే దగ్ధులగుచుండఁగా నీవట్లు తపింపక యగ్ని నుండి గంగాజలములం దోలలాడుచున్న యేనుఁగువలె సుఖముగా నున్నావు. బ్రాహ్మణా! ఇట్లు శబ్దాది విషయ స్పర్శము మాని కేవల మేదేహానుబంధమును లేని యాత్మతోఁ గూడియున్న నీదు మనస్సునకుఁ గల యానందమునకుఁ గారణ మేమియో యడుగుచున్నవారము గాన మాకుఁ జెప్పవలయును' అనియడిగెను. భగవంతుఁడు-'మిక్కిలి

మేధావియు బ్రహ్మణ్యుండు నగు యదు విట్లు పూజించి వినయ వినమ్రుఁడై యడుగఁగా మహాభాగుం డాబ్రాహ్మణుఁడు-"రాజా నాకు బుద్ధిసంపన్ను లగు గురువులు పెక్కండ్రున్నారు. వారి వలననే నేను నుశిక్షితమయిన బుద్ధినిబడసి తాపత్రయమునుండి విడివడి క్రమ్మరుచున్నాను. బుద్ధిమంతు లయిన యాగురువులను వినుము. భూమియు,వాయువు,నాకాశమును, అప్పును,నగ్నియుఁ, జంద్రుఁడును, సూర్యుఁడును, గపోతమును, అజగరమును, నది యును, పతంగమును, మధుకృత్తును, గజమును, బోయవాఁ డును, జింకయును, జేపయును, బింగళయుఁ, గురరమును, బాలుఁడును, గుమారియు, అయస్కారుఁడును, సర్పమును, నా లెవురుగును,దుమ్మెదయు ననెడియీయిరువది నాలుగునునాకు గురువులు. నేను వీరిని నాశ్రయించితిని. వీరల వృత్తులచేతనా మనస్సునకు శిక్ష గావించితిని. యయాతిపుత్రా! దేనివలన, నేదానిని, నేవిధమున, శిక్షనొందితినో దాని నన్నిం చెప్పెదను. పురుషసింహమా ! వినుము. దైవప్రేరితములై భూతములు పట్టి పీడించుచున్నను ధీరుండై భూతములు దైవవశమున నట్లు చేయుచున్నవని యెఱింగి మార్గమునుండి చలింప కుండ వలయును. భూమికిఁ గల [1]నియతధర్మమును (క్షమను) దానినుండి శిక్షనొందితిని. సర్వదా పరోపకారము కొఱకై చేష్టించుటయుఁ బరులకొఱకై పుట్టుటయుఁ [2]బర్వతమువలన

1.భూమి సమరూపయు పర్వతవృక్షాదిరూపయునని రెండువిధములు. అందు సమరూపయగు భూమివలన గ్రహించినదానిని జెప్పిరని తెలియవలసినది.

2. ఇందుఁ బర్వతవృక్షాది రూపయగు భూమివలననుండి శిక్షితమైనది చెప్పఁబడెను. పర్వతము తనయందలిచెట్లు పట్టలు గడ్డిసెలయేళ్లుమొదలయిన

నుండి చక్కఁగాఁ గఱవఁదగును. వృక్షములకు శిష్యుఁడై, దాని వలనఁ బరాధీనతను గఱవవలయును. ముని ప్రాణధారణమునకు వలయునంతమాత్ర మాహారాదివృత్తి గలిగి యుండవలయును గాని శబ్దాదివిషయముల ననుభవించుచుండరాదు. ప్రాణము నెలకొనియుండుటకు నాహారాదులు మాత్రము చాలును గాని, శబ్దాదివిషయములు వలదు. ప్రాణములకొఱకుఁగాని బ్రతుకు చూడనేలయనవచ్చును. ప్రాణవ్యాపారము జరుగనిచో మనస్సు విక్లబమై జ్ఞానము నశించుచున్నది; కనుక, జ్ఞానము నశింపకుండునట్లును మనస్సుగాని చెడకుండునట్లును నందులకుపయుక్తమగు ప్రాణవ్యాపారమును జరుపుకొనవలయును. విషయములు ప్రియములనియు నప్రియములనియుఁ బ్రియాప్రియములనియు నానాధర్మములుగలిగి యుండును. యోగియగువాఁడు విషయములం దెల్లఁజొచ్చియున్నను (అనఁగావానిని దన యింద్రియములచే ననుభవించుచున్నను) మనస్సుమాత్రము వానివలనిప్రియాప్రియములను వీడి, వాయువు చందనముతోఁ గాని యగ్నితోఁగాని గూడియున్నను వానియందుఁ దగులు లేకుండునట్లు, తాను నావిషయములందుఁ దగులులేకుండవలయును. ఆత్మదర్శనముగల యోగి పృథివ్యాదిపరిణామరూపములయిన దేహములందుఁజొచ్చి దేవత్వము మనుష్యత్వము స్థూలత్వము కృశత్వము మొదలయిన దేవాధర్మములతోఁ గూడిన వాఁడుగా నగపడుచున్నను, ఆగుణములతోఁ గూడినవాఁడు గాక (అనఁగా నేను స్థూలుఁడను కృశుఁడ నని తలంపక)

వాని నిచ్చటియొల్ల పరులకొఱకె. చెట్లు పరులునఁటికిని జీల్చినను వెలదనవు. ఒప్పుకొనును. ఇదియే పరాధీనత్వము.

వాయువు మంచి చెడు గంధములు మొదలగువాని కాశ్ర యమై యుండినను వా స్తవమునకు వానితోఁ గూడిక లేక యుండునట్లు తాను నట్టి గుణములతోఁ గూడిక లేమిని దెలిసి తన్ను దేహావిలక్షణమగు నాత్మగాఁ గనుఁగొను చుండును. వేదాంతవాక్య సమన్వయము చేత సర్వవస్తు వులను బ్రహ్మాత్మకము లని సిద్ధించుచున్నది.కనుకఁ జరాచరాత్మక ములగుసకలభూతములందుఁ బరమాత్ముండు నిరంతరముగావ్యా పించి నిండియున్నాఁడు. ఇట్లతఁడు సకలమునకును వెలుపలను లోపలను వ్యాపించియున్నను నాకాశమువలె వానితోడి [1]సంగమమాత్ర మతనికిఁ గలుగదు. భూజల వికారములయిన మేనుములనెడి పదార్థములు వాయువుచేతఁ బ్రేరితములై పుట మెగసినను వానిచేత నాకాశమంటఁబడదు. అట్లే పరమపురుషుఁ డును, నిమిత్తమగు కాలముచేత సృజింపఁబడినవై గుణపరి ణామాత్మకములైన స్థావరజంగమములందెల్లవ్యాపించియున్నను వానియందలి దోషములచేత నంటఁబడడు. మఱి యు

---

1. వాయుపలనిశీతము చెప్పనపుడు, వాయువు ప్రాణమనియుబా హ్యమగు వాయువనియు రెండువిధముల గ్రహించి ప్రాణవాయువుతనధారణ మునకు వలయునంత మాత్ర మాహారాదిపృథ్వీగోరుచున్న దేహానిశబ్దాదివిషయ ములు నందులకుఁ గోరకుండునట్లు మునియుండవలయుననియు, బాహ్య వాయువు; తానుగూడియున్న వాని ప్రియాప్రియములతోఁ దనకుసంబంధము లేకుండునట్లు, యోగి విషయముల ననుభవించుచున్నను వానియందలిప్రియా ప్రియములను బాటింపకయుఁ దగులులేకయు నుండవలయుననియు, ఆ వాయువు సురభి పూతి గంధాదులతోఁ గూడియున్నను ఆగంధాదులగుణము లు వాయువు గుణములు గానట్లు,యోగి దేహాదులతోఁగూడియున్నను వాని గుణములగుస్థూలత్వకృశత్వాదులు తనవిగావని తలంపవలయుననియును శిక్ష తెలియునది.

[1] స్వచ్ఛుఁడై స్వభావముచేతస్నిగ్ధుఁడై మాధుర్యముగలిగినరులకు తీర్థస్థానమైయిట్లుజలమునకుసాటిగానుండుమునిచేతను నుపస్పృశించుటచేతను గీర్తించుటచేతను బవిత్రముచేయును. ఆత్మయోగముగలవాఁడు తేజస్సుగలిగి తపస్సుచేతమిక్కిలి దీపించుచుండుటవలనఁ జెనకరానివాఁడై యుదరమె పాత్రముగాఁగలిగి(అనఁగా మఱియేపరిగ్రహమునులేక)మృష్టాన్నమనియుఁ గదన్నమనియుఁ జూడక యన్నిటిని భక్షించువాఁడయినను మాలిన్యమునొందక [2]యగ్నివలెనుండును. మఱియు నాయోగి,యొక్కయెడ,నగ్ని నివ్వలుఁ జేఁగప్పఁబడియున్నట్లుతనమాహాత్మ్యమునువెలిపుచ్చక, యగ్నియాజ్యాదులతోఁగూడిచెలంగునట్లు యోగాభ్యాసాదుల చేతఁ జెలంగి స్వర్గమోక్షాదులగుశ్రేయములను గోరువారికి నగ్నివలెనే కొలువఁదగినవాఁడైయగ్ని పరులకొఱకే హవిస్సును గొనునట్లు తాను దనకొసంగు

---

1. సచ్ఛబ్దము, జలపక్షమున లేటయైనది. మునిపక్షమున నిర్మలుఁడైనవాఁడు. స్వభావముచేత స్నిగ్ధముగానుండుట యనఁగాభూతములం దనురాగముగలిగియుండుట యని మునిపరము. జలము స్వభావముచేతస్నేహముగలదిగదా. మాధుర్యశబ్దమునకర్థము మధురములగుమాటలుగలవాఁడనిమునిపరము. తీయఁదననముగలది యనిజలపరము. తీర్థస్థాన మనఁగా,తీర్థులఁబంటినాఁడని మునిపరము. పుణ్య తీర్థమైనదని జలపరము. ఉపస్పృశించుట యనఁగా మునిపక్షమున పాదస్పర్శాదులు. జలపక్షమున స్నానపానాదులు.

2. తేజస్వీతపసాదీప్తోదుర్ధర్షోదరభాజనఃసర్వభక్షోఽపియుక్తాత్మానాదత్తే మలమగ్నివత్' అని మూలము. దీనికి అగ్నిపక్షమున (తేజస్వీ)తేజస్సుగలవాఁడు. (తపసాదీప్తః) గ్రీష్మఋతువునందుమిక్కిలిదీపించువాఁడు, కనుక (దుర్ధర్షః) చెనకరానివాఁడు. (సర్వభక్షః)సమస్తమునుభక్షించువాఁడు. (మలంనాదత్తే) అగ్ని సర్వభక్షణము చేసియు దోషము నొందదనుట.

వారలభూతభవిష్యత్ప్రాపములు నెల్లఁ గాల్చుటకై వారియిచ్చు నవి గయికొనుచున్నాఁడు. పరమపురుషుఁడు చిదచిదాత్మకమగు జగత్తును బ్రవేశించి యాయావాని దేవమనుష్యాది రూపములుగలవానివలెను, కట్టియలందుఁ బొచ్చినయగ్ని వానివంకర మొదలగు రూపములను దాల్చునటువలెను, యోగి కనుపట్టుచున్నాఁడు.చంద్రుని కలలకే పెరుఁగుటయుఁ దఱుఁగుటయుఁ గలుగుచున్నవి;చంద్రునికిఁగావు. అట్లె గర్భాధానము మొదలుకొని శ్మశానమువఱకుఁ గలుగు వికారము లస్పష్టగతియగు కాలమునిమిత్తమున దేహమునకే కలుగుచున్నవి గాని, యాత్మకుఁ గలుగవు. [1] అగ్ని పాసుఁగువడక నెలకొనియుండునపుడే దానిజ్వాలలు పుట్టుచును నడఁగుచు నుండును. కాన యుత్పత్తి వినాశములు జ్వాలలకే కాని యగ్నికి లేవు. అట్లు ప్రవాహమువలె వేగమగల కాలముచేత జన్మనాశములు ప్రవాహరూపమున నిత్యములుగానున్నను నవి భూతములకేకాని యాత్మకుఁ గావు. సూర్యుఁడుతనకిరణములచేత జలములను దీసికొని మరల వానిని వర్షరూపమున నిచ్చునట్లు యోగియగువాఁడు కాలోచితముగా సుఖభోగ్యములగు వస్తువులను దన యింద్రియములచేత సంపాదించి వాని నర్థులకు నొసంగుచున్నాఁడుగానితనకై యుపయోగించుకొనఁడు. దేహమేయాత్మయని తప్పఁదలంచువాఁడు, దేవాదిశరీరములం దున్నప్రత్యగాత్మను, వాస్తవమున దానికి దేవత్వాదులు లేకున్నను, 'వీఁడు దేవుఁడు వీఁడుమనుష్యుఁ' డనియే యెఱుంగుచున్నాఁడు. మఱి

1.పూర్వవాక్యమున చంద్రదృష్టాంతముచే జన్మాది వికారము లాత్మకు లేవని,దానినే మరల నగ్నిదృష్టాంతముచే నిందుపపాదించుట తెలియనది.

తమ యాత్మనుగూడ 'నేను దేవుఁడను మనుష్యుఁడను బలసితిని జిక్కితి'నని కనుఁగొనుచున్నాఁడు. ఆకాశమందున్న సూర్యుఁడద్దము జలము మొదలగువానియం దున్నట్లు తోఁచుచున్నను వానిస్వభావములతోడి సంసర్గము లేకుండునట్లు, ఆత్మయు దేవాదిదేహములం దున్నను వాని స్వభావాదులను బొందదని దేహమునకంటె నాత్మవిలక్షణమైనదను మతిగలవా రెఱుంగుదురు. అయినను సూర్యుఁడద్దము మొదలగు వ్యక్తులయందు లేకయె యం దున్నట్లు కనఁబడుచున్నాఁడు. ఆత్మయో వాస్తవమున దేవాదిదేహవ్యక్తులం దున్నవాఁడు. అయినను సూర్యుఁడావ్యక్తుల స్వభావములతోడి సంసర్గము లేకుండునట్లు యాత్మయు లేకుండును. ఎవ్వఁడయినను మిక్కుటమయిన ప్రేమను నుపలాలనాద్యాసక్తినిని దేనియందుఁగాని నెఱపరాదు; అట్లు నెఱపినచో బుద్ధివిన్నై కపోతమువలె సంతాపమును బొందుచున్నాఁడు. కపోతమొకటి యొకానొకయడవియం దొకన్యూనిపయిని గూఁడు కట్టుకొని దానును దన భార్యయుఁగొన్ని సంవత్సరములుగానానాసముచేయుచుండెను. ఆకపోతములు రెండును నెయ్యముచేత నొండొరుల హృదయముగలసి మెలసియిట్లున ధర్మము నెఱపుచుఁ జూపుతోడఁ జూపును, మేనితోడ మేనును, బుద్ధితోడ బుద్ధినిని గూర్చికొని మెలంగుచుండునవి. రాజా! ఆకపోతికి గర్భముగలిగె. అపుడు కపోత పిల్లాలివలన దయగలిగి యడుగఁగా నాపె యేమేమి గావలయునని కోరునో యాకోరినదానినంతయు మిక్కిలియుఁగష్టపడియైనను దెచ్చియిచ్చుచుండెను. ఏలనఁగా నాకపోత మిందియములకు లోనయినది గదా. ఆ పిట్టలును రెండును బరుండినను గూర్చున్నను

దిరుగుచున్నను నిలుచున్నను ముచ్చటలాడినను గ్రీడించినను నెరదిన్నను మఱి యేమేమిచేసినను గవగూడియె జంకులేక చేయుచు వనసమూహములందుఁ జరించుచుండెను. కపోతి తనకుఁ దొలుచూలు రాఁగాఁ బ్రసవకాలము వచ్చినపుడు తన గూఁటియందుఁ దన మగనియెదుటనే గ్రుడ్లఁ నీనెను. ఆగ్రుడ్లకాలక్రమమునఁబరిపక్వములై కూనలాయెను. మఱియు వానికి నచింత్యము లగు హరిశక్తులచేతను నవయవములు లేర్పడి మృదువులయిన యంగములును నీఁకలుఁగలిగినవి. ఆదంపతులు రెండును గన్నబిడ్డలయందు మిక్కిలిగారాముగలవిగానయాకూనల కూఁతలను వినుచు నవ్యక్త మధురములయిన వాని పలుకులకుఁ జొక్కుచును నిట్లు సంతోషము దొంతరలుగొన నా బిడ్డలను బెంచుచువచ్చినవి. తాఁకుటకు మిక్కిలి యింపయిన వాని చిగురుతెక్కలను నల్లల్లఁ దడవుచును వాని యింపయిన రవళులను వినుచును, వాని సొగసయిన చేష్టలను గనుచును, నవి సొంపుసెంపునఁ బయి కెగురఁగాఁ జూచుచును, తలిదండ్రు లెంతయు ముదమునొందినవి. అవి రెండును విష్ణుమాయచేత మిక్కిలియు మోహితములై నెయ్యమున మనస్సు లొండొరులయెడ ననురక్తమై నిగుడఁ దమకన్న యాకూనలను బెంచు విషయమున బుద్ధి చెలువుదప్ప వానిని బోషించుచు వచ్చెను. ఒకప్పు డాయాలుమగలు రెండు, నాకూనల కెరదెచ్చుటకై చుట్టుప్రక్కలనున్న యడవియందుఁ జాలసేపు తిరుగుచుండెను. అపు డాయడవియందుఁదిరుగుచున్నయొక బోయవాఁడుదైవికముగానాకూనలనుజూచి యవితమగూఁటికిఁబోంత దిరుగుచుండఁగా వలవైచి వానిని బట్టుకొనెను. కపోతమునుఁ

గపోతియును దమ బిడ్డలను పోషించుటయందే యెప్పుడు తమి గొని యుండునవి. కనుక నవి బిడ్డల కొఱకై యెరగొని తమ గూటికి వచ్చినవి. కపోతి యంతఁ దనబిడ్డలు వలయందుఁ జిక్కి యుండుటను జూచి యవి మిక్కిలియు దుఃఖముతోఁ దన్నుఁ జూచి బిట్టుగాఁ గూయిడఁగాఁ దానును బిగ్గరఁ గూపెట్టుచు వాని కడకుఁబోయెను. ఆకపోతి యజుం డగు విష్ణుని మాయ చేత మాటికి నెయ్యమున దనహృదయము వానియందుఁ జిక్కు వడఁగా నవి యట్లు బద్ధములై యుండుటను జూచి నృతి దప్పి తాను నా వలయందుఁబడి పట్టుపడెను. అంతఁ గపోతము తన కంటె నెక్కుడు ప్రియులయిన తన బిడ్డలును, తనకు సమానురాలయిన ప్రియురాలును బద్ధులై యుండుటను జూచి మిక్కిలియు దుఃఖమున విలపింపఁ దొడఁగెను. 'అక్కటా ! చూడుఁడు నావ్యసనమిది. నేనుదుర్మతిని నే నల్పపుణ్యుఁడను. కావు ననే యింకను విషయములనుభవించి తనివినొంద నైతిని. కనుకఁ గృతార్థుఁడనుగా నయితిని. ఇంతలో ధర్మార్థకామముల నెడు మూఁడు పురుషార్థములకును సాధనభూతమయిన గృహస్థాశ్రమము నాకు హతమైనదిగా! నాయిల్లాలు నాకెంతోయనుకూలముగానుండునది. నాకు మిక్కిలి యనురూపయైనది.పతియె దానికి దైవము. నన్ను దిగవిడిచి నా యిల్లు పాడు పుచ్చి తానును సాధువులగు తనపుత్రులతో స్వర్గమునకుఁబోవుచున్నది. నే నిట్లు పెండ్లమునుబచ్చి బిడ్డలునుబచ్చి దీనుండనై పాడుపడిన యింటనుండి యెందులకని బ్రతికియుండుటకుఁ గోరవలయును ? అన్నియును బాసి దుఃఖముతో మనవలయునా ?' అని విలపిం చెను. అది యట్లు తన బిడ్డలు వలలందుఁ జిక్కువడి వ్యథ్యమ్యమ

వాతఁ బట్టువడినట్లయై, మూర్ఛిల్లుటఁ జూచి యజ్ఞుండు గానఁ దానును దీనుఁడై యా వలలయందుఁ జొచ్చెను. కూర్చుండియున్న యా బోయవాఁడు కుటుంబియగు నాకపోతమును వానిబిడ్డలను గపోతినిని బడసి, వచ్చినపని యొడఁగూడినవాఁడై యింటికిఁ బోయెను. ఇట్లు మనుజుఁడు కుటుంబియై యింద్రియములను జయింపక శీతోష్ణాది ద్వంద్వములయందే రమించుచుఁ గుటుంబమును బోషించుచు నుండి కడపట నా పక్షి వలెనే దీనుఁడై పుత్రకళత్రములతోడఁ క్లేశముపాలగు చున్నాఁడు. పక్షివలె వివేకశూన్యముగాక ముక్తి ద్వారమును దెఱచునట్టి దయిన మనుష్యదేహమును బొందియు గృహములందుఁ గపోతమువలెఁ దగులుపడ్డవాఁడు శ్రేయోమార్గము పయినెక్కి యుఁ గ్రింద దొర్లిపడినట్టివాఁ డగునని తెలియుదురు. ఇది యేడవయధ్యాయము.

అవధూత యదుసంవాదము.

(అనుబంధము.)

బ్రాహ్మణుఁడు'రాజా! ఇంద్రియములవలనఁ గలుగు సుఖము స్వర్గమునందును నరకమందును బ్రారబ్ధవశమునఁ గలుగు చున్నది. దుఃఖము కోరకయే వచ్చునట్లు సుఖముగూడ నచ్చు చున్నది. దుఃఖమువలెనే సుఖము గూడ, సుఖదుఃఖములు ప్రారబ్ధమూలములని తెలిసిన వానికిఁ గోరఁదగదు. ఆహారము మిక్కిలి రసవంతమైనదిగాని విరసమైనదిగాని, మిక్కిలి చాతివంతమైననుగాని, రవ్వంతయైననుగాని, దైవికముగాఁ బెట్టి పెంత

మాత్రము లభించునో యంతటిని లోఁగొని కష్టపడి తెచ్చు కొనుటకుఁ బ్రయత్నింపకుండుట యజగరవృత్తి యగును. ఆహారము దైవికముగాఁ దనంతట దొరక కున్నయెడల నపు డజగరమువలె నాహారస్తృప్తికిఁ బ్రతిబంధకమయిన యీ స్వారబ్ధము ననుభవించుచు నే యుద్యమమును జేయక వెక్కులు దినము లూరకపడుండి యుండవలయును. ఇంద్రియబలమును సహమును శరీరబలమును గలిగి యున్నట్టి దేహమును దాల్చి యున్నను నేపనియుఁ జేయక యూరకపడుండి యుండనలయును. ఇంద్రియము లాయా వ్యాపారములకుఁ జాలియున్నను నిద్ర లేక (అనఁగా దత్త్వ విమర్శనమునందుఁ బారవశ్యము లేక) యే సుఖమును గోరకయు నే వ్యాపారమును జేయకయు నుండ వలయును. ముని సముద్రమువలెఁ బ్రసన్నముగను లోపల గంభీరముగను నుండుచు, నిట్టివాఁడని చెప్పఁదరము గాకయు గడవ నలవిగాకయు, నింతయని కొలఁది లేకయుఁ, గలంచి పుచ్చరాకయు, స్తిమితుండై యుండును. మఱియు, సముద్రము వర్షాకాలమున నదీజలములచే సమృద్ధముగానున్న ప్పు డుప్పొంగుటలేదు. గ్రీష్మమున నాజలములు లేకపోయిన పు డెండిపోవుటయు లేదు. ముని యగువాఁడు విషయ పరుఁడు గాక నారాయణపరాయణుఁడై యుండుటవలనఁ గార్యములెల్లఁ దనకు సమృద్ధముగా నున్నపుడు హర్షింపఁడు. అవి లేనపుడు శోకింపఁడు. దేవమాయవలె మోహపెట్టునదిచుమీ ముద్దియ. ఆ మగువనుజూచి దాని విభ్రమాదిభావనలచేత నింద్రియ ముల జయింపనివాఁడు జెలుపడి పేరాసగొని యగ్నియందు మిడుతవలె, నంధతమస్సునందుఁ బడుచున్నాఁడు.

మాయారచితము లగు స్త్రీలయందును వారల బంగారు సొమ్ములు వస్త్రములు మాల్యములు చందనములు మొదలగు వానియందు నుపభోగింపందగదని బుద్ధిగలిగి మనస్సు మిక్కిలి యు మోహితముకాఁగా, మూఢుండై దానివలన వివేకము చెడి [1]మిడుతవలె నశించుచున్నాఁడు. తుమ్మెద పువ్వులను బీడింప కయె యందందుఁ గొంచెము గ్రహించుచు నొక్కచోటను గుటిగా నుండకుండునట్లు, మునియు దేహముజరుగుటకు వలయు నంతమాత్రము గొనుచు నందును గొంచెము గొంచెమే గొనుచును నెవ్వరినిని బీడింపక వర్తింపవలయును. [2] తుమ్మెద, యొక్క శామరయందే తగులువడి యుండునేని యది మొగుడు నపుడు దానిలోపలఁ జిక్కుకొనునట్లు, మునియు గుణలోభము చేత నొక్కగృహమునే యాశ్రయించి యుండునేని దాని యందలి మోహమునకుఁ బట్టువడుచున్నాఁడు. తుమ్మెద రవ్వంత పువ్వుల నుండియుఁ బెద్దపెద్ద పువ్వుల నుండియు సారమును గ్రహించునట్లు, కుశలుండగు మనుజుఁ డల్పసారములగు శాస్త్ర ములనుండియు మహాసారము లగు శాస్త్రముల నుండియు నన్నిటను సారమును గ్రహింపవలయును. మనుజుం డన్నమును

---

1. రూప రస గంధ స్పర్శ శబ్దము లయిదింటియందుఁదగిలిన పతంగ మధుకర గజహరిణమీనము లయిదును ఆ యయిదింటిచే హతములగు చున్న వి. కాన యివి యైదును గురువులు. ఇదియే 'పతంగ మాతంగ కురంగ భృంగీ మీనాహతాః పంచభిరేవ పంచ| ఏకః ప్రమాదీస కథంనహన్యతే యస్సేవన పంచభిరేవపంచ' యని చెప్పఁబడియున్నది. ఇందు రూపవిలాసమోహితుఁడ యినవాఁడు నశించుచున్నాఁడని పతంగమువలన శిక్షింపఁబడుచున్నదని చెప్పు చున్నాఁడు

2. ఇదియె మాధుకరవృత్తి యనఁబడు చున్నది.

భిక్షించి తెచ్చి యిది మాపటిభోజనమునకు నిది రేపటి భోజనము నకని దానిని సేకరించి పెట్టుకొనఁ గూడదు. మఱి తనదో సిలియె యన్నము తినుపల్లెరముగాను, దనకడుపే యన్నము పెట్టుకొను పాత్రముగాను గలిగి యుండవలయును. కాని* తేనె టీఁగవలెఁ గూడఁబెట్టుకొనరాదు. భిక్షించి తెచ్చుకొనువాఁడన్నమును మాపటికినియు రేపటికినియుఁ గూడఁబెట్టుకొనరాదు. తేనెటీఁగవలె వాఁడు గూడఁ బెట్టుకొనునేని, యా తేనె తోడనది నశించునట్లు వాఁడా కూడఁబెట్టి కొన్నదానితో గూడఁ దానునశించుచున్నాఁడు. భిక్షుఁడగువాఁడుపడఁతిని మ్రానితోఁ జేయఁబడినదాని నయినను, కాలితో సయితము ముట్టరాదు. ముట్టెనా గడ్డిమొదలగువానితోఁగప్పియున్న గోతిపయినుండు మ్రాని యేనుఁగుపెంటియెముకలని దాఁకఁగా మగయేనుఁగాగోతిలోఁబడి పట్టువడునట్లు తానును బట్టువడుచున్నాఁడు. స్త్రీమృత్యువునకుసాటియైనది. కనుక వివేకియగువాఁడుదానిని బొందరాదు. వాఁడు దానినిబొందెనా, మగయేనుఁగొక యాఁడు గజమును బొంది తనకంటె బలమెక్కుడయిన యేనుఁగులచేఁ జంపఁబడునట్లువాఁడు హతుఁడగును. లోభియగువాఁ డెంతోకష్ట పడి గడించినధనమును నొకరికినిపెట్టఁడు; దానునుగుడువఁడు. తేనె టీఁగలు కష్టపడి కూడఁబెట్టిన తేనెనుదానిని గొనువాఁడు హరించు

---

*మూలమునందు గురువర్గగణనమున 'పృథివీ వాయురాకాశమాపోఽగ్నిశ్చన్ద్రిమారవిః। కపోతోఽజగరస్సిన్ధుపతఙ్గోమధుకృద్గజః। మధుహారిణోమీనః పిఙ్గళాకురరోఽర్భకః।కుమారీశరకృత్సర్పఊర్ణనాభిస్సుపేశకృత్।ఏతే మేగురవః'అని చెప్పఁబడియున్నది. అందు 'మధుకృత్' అనఁగా తుమ్మెదమనుతేనెటీఁగకును జెల్లునుగాన, ఇంతపుణుకు దుమ్మెదను గూర్చిచెప్పినయుక్తము తేనెటీఁగవలనఁ గుఱవఁదగు వానిని జెప్పుచున్నారు.

నట్లు ఆలోభి ధనమును దీసికొన నేర్చినవాఁ డెట్లో గ్రహించి తాననుభవించుచున్నాఁడు. వీఁడును దాన భోగములకు దాని నుపయోగింపఁడేని మఱియొకఁడు వాని కంటె బలీయుఁడు దానిని లాఁగికొని యనుభవించుచున్నాఁడు. తేనెటీఁగలు కష్ట పడి కూడఁబెట్టిన తేనెను దాను గుడువఁ దలఁచుచుండగా వానికి మునుపే తేనెను హరించువాఁడు దాని ననుభవించుచున్నాఁడు. అల్లి మిక్కిలియుఁ గష్టపడి ధనమును సంపాదించి దానిచేతఁ బానభోజనాదులయిన కామములెల్ల ననుభవింప నువ్విళ్లూరు చుండు గృహస్థులకుఁ గల యన్నము నెల్లవారికి మునుపు [1]యతి యనుభవించుచున్నాఁడు. కనుకఁ దేనెను హరించువాఁ డేప్రయత్నము లేకయే భోజనమును బడయునట్లు యతియుఁ బడయుచున్నాఁడు. యతిగాని వావప్రస్థుఁడుగాని గ్రామ్యజనుల గీతములను వినరాదు. (భగవద్గీతయే వినఁదగును) వేఁటకాని యింపయిన గీతమునకు మోహపడి జింక పట్టువడుటను వాఁడు నేరవలయును. [2]మృగీపుత్రుఁడగు ఋశ్యశృంగుఁడు గ్రామ్యము లయిన స్త్రీల నృత్యవాద్యగీతములను జూచియును వినియును గడపట నాపఁడఁతులకు నాటబొమ్మవలె లోనయినాఁడు. కనుక నట్టి గ్రామ్యసుఖముల సేవింపరాదు. జిహ్వ మిక్కిలి కలంచి పుచ్చునట్టియింద్రియము. జనుఁడు దానిచేత దాని విషయమగు

---

1. ఇట 'యతిశ్చబ్రహ్మచారీచ పక్వాన్నస్వామినా వుభౌ 1 తయోరన్న మదత్త్వాతు భుక్త్వాచాన్యాయణంచరేత్' అనిశాస్త్రము. దీనిని దెలిసినగృహస్థుఁడు యతికి ముందుపెట్టియె తాను గుడుతురు.

2. గురువర్గునుండు 'మధుహారిణో మీనాః' అన్నహరిణ శబ్దముచేత హరిణీపుత్రుఁడగుఋశ్యశృంగుఁడును విభాండకుఁడగుటచేత నతఁడును గుఱుపని తలఁచి చెప్పుచున్నాఁడు.

రసమునందు మిక్కిలి మోహపడి దానివలన బుద్ధి చెడి, మిగిసెర కాసపడి గాలమును మ్రింగి చచ్చునట్లు, తాను మృతినొందుచున్నాఁడు. బుద్ధిమంతు లాహారమును విడుచుటచే నాలుకతప్పఁ దక్కిన యింద్రియములను జయించుచున్నారు. [1]నాలుకయో యన్నము లేకున్ననుబెరుఁగుచున్నది గాని డిందువడదు. పురుషుఁడు తక్కిన యింద్రియముల నన్నింటిని జయించియున్నను జిహ్వానుగూడ జయింప కుండఁనంతవఱకు జితేంద్రియుఁడు గానేరఁడు. జిహ్వాను జయించినచో నన్నియు జయించినట్టి తొల్లి విదేహపట్టనమునఁ బింగళయను నొక వేశ్యయుండెను. దాని వలన నేను నేర్చుకొన్నది కొంచెము కలదు. రాజనందనా! దానిని జెప్పెదను వినుము. ఆపింగళ విచ్చలవిడిని బ్రవర్తించినది. అది తన కింత విత్తమిచ్చువాఁడు తనకుఁ గాంతుఁడని యొక సంకేత మేర్పఱచుకొని యుత్తమమయిన వేషము నలంకరించుకొని తగినతఱిని నింటివాకిట నట్టి విటుని నరయుచు నిలుచుండెను. అట్లు నిలుచుండ దారిని బోవుచున్నపురుషు లెంద ఱో కనఁబడివచ్చిరి. వారు ధనవంతులే; మఱి బత్తెమునిచ్చుటకును నుండిరి. అయినను దానికి ధనమునందే మిక్కిలి కోరిక గాన తాను గోరినంత ధనము వారియనందున వారియం దెవ్వరితోను రమింపదయ్యె. ఇట్లు పురుషులు వచ్చుచును నది నిరాకరింపఁగాఁ బోవుచును నుండిరి. అది సంకేతముచేతనే బ్రతుకునది గాన 'వేఱెవ్వఁడేని ధనవంతుఁ డొక్కఁడు నేను గోరినంత

1 ఆహారమును విడువఁగా పాటవము దప్పి యింద్రియములు లెల్ల తోడనే లోనగుచున్నవి. కాని జిహ్వ మాత్రము అన్నము లేకున్నను అతిశయించుచున్న దని భావము.

ధన మివ్వారిగా నిచ్చి నన్నుఁ బొందఁడా' యని యెదురు చూచుచుండెను. ఇట్లు పెద్ద దురాశ పడుటచేత వాకిట నిలిచి నిలిచి యుండఁగా దానికి నిదురయుఁ జెడెను. మఱి మాటికి వెలుపల వచ్చుచును లోపలికిఁబోవుచునుండఁగా నర్ధరాత్రము కావచ్చెను. దానికి విత్తము సందలి పేరాసవలన నిట్లులేచి లేచి మొగమెండి మనస్సు సొంపును దూలెను. దీని వలన దానికిమిక్కుటమైన నిర్వేదము మిగటికి సుఖావహమై పుట్టెను. ఆ నిర్వేదము వలన దానికి వేఱుచింతయుఁ గలిగెను. అప్పుడది చిత్తమున నిర్వేదము నొంది పాడిన గీతమును గలరూపున నావలన వినుము. దానిని వినుటవలనఁ బసయేమి యందువా? పురుషునకు నిర్వేద మూలాపాశములను ద్రెంచునట్టి ఖడ్గముచుమీ. ఓయీ! నిర్వేదము పుట్టనివాఁడు దేహమునందును దదను బంధులందును గలయాశను దిగవిడువ నెంతమాత్రము గోరఁడుచుమీ.

పింగళ—ఓరీ! మనస్సును గెలువకున్నందున నాకు మోహమెంతవి స్తరించి యున్నదిచూపుఁడు. నే నామోహముచేతఁ దుచ్ఛుండగుకాంతునివలనఁ గోర్కినిబడయఁగోరుచున్నాన గదా. కావున నేను వివేకశూన్యురాలను. నాకు వలయు రమణుఁడు నా సమీపమున నే(హృదయమందే)యున్నాఁడు. వాఁడు నిరతిశయప్రీతికిఁ బాత్రుఁడు. మఱి నాకు రతి (నాయురదనురాగము) గూర్చువాఁడు. మఱి ధనమును (ధర్మాది పురుషార్థములునాలుగును) నొసంగువాఁడు. ననున్నొకప్పుడును వీడక (నిత్యుఁడై) యుండువాఁడు. ఇట్టి యీకాంతుని (భగవంతుని) దిగవిడిచి, కామములను (ధర్మాదులను) నొసంగక మఱి దుఃఖ

మును భయమును నాధియు శోకమును మోహమును గలిగించు వాఁడును గావునఁదుచ్ఛుండునగు నొకనిని దెలివిమాలినదానన్నై కొలుచుచున్నాను. కన్నవానితోఁసింత రొక్క మీయవలెనని సంకేతముచేసికొని నేను బొట్టఁబ్రోచికొనుచుందును. ఇట్టి వృత్తి యెంతయు నిందింపఁదగినది ఇట్టికుచ్చితపుబ్రతుకుచేత నాదేహమునకును మనస్సునకును బరితాపము వ్యర్థముగాఁ గలిగించితిని. స్త్రీలయందు మిక్కిలి దగులుపడి ధనమునందుఁ బేరాసగలిగి మిక్కిలిజాలికిఁ బాత్రుఁడయిన యొక మనుష్యునికి నాదేహమును విలిచి వానివలనరతినిని విత్తమునును గోరుచునుంటినే ఈదేహమొకయిల్లు. దీనికి నడిమి వెన్ను దూలమును దానిపయిని వాసములును వానికి నూతయగు కంబములు నన్నియు నెమ్ములచేత రచింపఁబడియున్నవి. మఱి తోలుచేతను గోళ్లచేతను రోమములచేతను బయటికిఁ దెలియకుండునట్లు గప్పఁబడియున్నది. దానికి నవద్వారములు. అన్నియును మలినమును గాఱుచుండును. మఱి మలమూత్రములచే నిండినది. ఇట్టి యీనరదేహమును నేనుదప్ప మఱి యెవ్వతినొందును? ఈవిదేహపట్టనమందు నేనొక్కతియే మూఢబుద్ధి గలదానను. కాకేమి! తన్నయిన నిచ్చునట్టిదాతయగు నచ్యుతుని విడిచిమఱియొక్కనిఁ గాంతునిఁగాఁ గోరుచున్నాను. కావున నేనెంతయు దుష్టురాలను. ఈ యచ్యుతుఁడు శరీరధారులకు నాత్మభూతుఁడు కాఁబట్టి మిక్కిలిప్రియుఁడు. మఱి హితకరుఁడు నాయకుఁడు. కాఁబట్టి యాత్మభూతుఁడైన యా యచ్యుతునకే నాయాత్మను సమర్పించి విలుచుకొని (వశీకరించుకొని) యాతనితోడ లక్ష్మి వలెరమించెదను. కామవిషయములకును గామము లొసంగు

మనుష్యులకును దేవతలకును నాద్యంతములు గలవు గాని వీరందఱుఁ గామముచేత నుపద్రవము నొందుచుందురు. ఇట్టివారిని భజించుచున్నయెడల భార్య యగుదానికి వీరేమి ప్రియముచేసిరి? ఏమియులేదు. కనుక నిందు నందును భగవంతుని కంటె సేవింపఁదగినవాఁడు మఱియొకఁడు గలుగఁడు. ఏదో నేను దొల్లిచేసికొన్న యొకానొక సుకృతకర్మముచేత నాయందు భగవంతుఁడు విష్ణుఁడు ప్రీతుఁడయినాఁ డనుట నిజము. ఏలనఁగా దురాశపట్టియున్న నాకు సుఖావహమయిన యిట్టి నిర్వేదము పుట్టెనే ! అతని ప్రసాదములేక యిట్టిదియుఁ బుట్టునా. నేను మందభాగ్యురాలనయితినేని క్లేశము లిప్పటి చందమున నాకు నిర్వేదమును గలిగింపకుండును. ఆ నిర్వేదము చేతఁగదా పురుషుఁడు దేహగేహాదులం దహంకారమమకార రూపములయిన పాశములను దిగవిడిచి మనస్సు ప్రసాదమును బొందుచున్నాఁడు. గ్రామ్యజనులతోఁ గూడిమాఁడియుండు నేను భగవంతుఁ డనుగ్రహించి యుపకరించినట్టి నిర్వేదమును నాదలయందుఁ దాల్చి దురాశలనెల్ల దిగనాడి యధీశ్వరుండగు నాభగవంతునే శరణుఁ జొచ్చుచున్నాను. మఱియు నేను శ్రద్ధగలిగి విత్తాదులు దొరకక పోయినను సంతోషమును వీడక దైవికముగా దొరకినదానితో బ్రదుకు మనాత్మభూతుఁడు గావునసే నిరతిశయ ప్రియుండు నయిన యాభగవంతునితోడ మాత్రమేకూడి క్రీడించుచుండెదను. ఇది నిజము. సంసార కూపమునందుఁబడి విషయసుఖములచేత వివేకము గోలుపోయి యున్ననన్నుఁ గాలసర్పము పట్టుకొన్నపుడు గాచుటకు మరలఁ బురుషుఁడు తప్ప మఱియొవఁడు సమర్థుఁడగును? ఎప్పుడు నకల

విషయములవలన నిర్వేదమునొంది యెచ్చరికగలిగి సమస్తమయిన యీ జగమును గాలమనెడిసర్పముచే గ్రస్తమైయున్న దని కనుఁగొనుచున్నాఁడో, యప్పు డట్లు కనుఁగొని నిర్వేదముపడుచున్న పురుషునకురక్షకుఁడు పరమాత్మయొకాని మఱి యొకఁడుగాఁడు' అనెను. ఇట్లది మది నిశ్చయముచేసికొని కాంతుని యందలి యభిలాషవలనఁ గలిగిన దురాశనుదిగవిడిచి చిత్తశాంతి నొంది శయ్యకుఁబోయి నెమ్మదిగాఁ బరుండెను. ఆశయె పరమంబయిన దుఃఖము. ఆశ లేకుండుటయే పరమంబయిన సుఖము. అట్లు పింగళ, కాంతునివలని యాశను ద్రుంచుకొని హాయిగా నిదురపోయెను. ఇది యెనిమిదవ యధ్యాయము.

అవధూతి యదుసంవాదము.

(అనుబంధము.)

అవధూతి —మనుష్యుల కేదేది ప్రియతమమో దానిని పరిగ్రహించుట యత్యంత దుఃఖము కలిగించుచున్నది. ఇట్లు పరిగ్రహము మిక్కిలి దుఃఖమునకు హేతువయినదని తెలిసి పరిగ్రహమువీడినవాఁడనంతమగుసుఖమును బొందుచున్నాఁడు. కురరమను పిట్ట నోర మాంసమును గవ్వుఁగొనియుండఁగాఁజూచి దానికంటెబలవంతములగుడేగ మొదలయినవి తమకుమాంసము లేనందున దానినిబట్టి చంపుచున్నవి ఆకురర మామాంసమును దిగవిడువఁగా నట్టి భయములేక మిక్కిలి సుఖమును బొందిన దయ్యె. నాకు మానమును నవమానమును గలుగవు. నాకు గేహములును బుత్రకలును గలవారికిఁ గలుగు చింతయును గలుగదు. నేను బరమాత్మతోడనే క్రీడించు చుందును. నాకుఁ బరమాత్మయందే ప్రీతి. ఇట్టివాఁడనై యీలోకమందు

మానావమానములును చింతయును లేనిబాలునివలెఁ జరించు చుందును. ఇరువురిచే చింతనుండియు మానావమానములనుండి విడివడ్డవాఁడై పరమానందమున మునిఁగి యోలలాడుచుందురు. అందొకఁడు మానావమానములు దెలియనివాఁడును దేహాదులు పోషించుటకై యే పూనికయు లేకుండువాఁడు నగు బాలుఁడు. మఱియొకఁడు త్రిగుణములకు నవ్వలనుండు పరమును సాక్షాత్కరించుచుండువాఁడు. ఒకచోట నొకకుమారి యుండెను, దొనిని వరించుటకై కొందఱు దానియింటికి వచ్చిరి. అపుడు దాని తలిదండ్రులు మొదలయిన బంధువు లింటలేక యెచ్చటికోపోయి యుండినందునఁ దానే వారికిఁ బూజగావింపఁ బూనెను. నాజా ! ఆ వచ్చినవారికి భోజనము పెట్టుటకై యాకన్నియ రహస్యముగా వరి బియ్యమును ఓటఁ దంచుచుండఁగా దాని ముంజేతనున్న సంకుకడియములు బిట్టుగాఁబప్పుడు సేయసాగెను. ఆకుమారి మిక్కిలి బుద్ధిమతిగాన యాదంచు చప్పుడు వచ్చినవారు వినిరేని 'ఓరా! ఇది తానేదంచుచున్నది. దీనికెవ్వరు బంధువులులేరా? నిజముగానిది దరిద్రురాలగు' నని తలంతురు గాన యట్లు దంచుట యేవగింపఁదగినదని తలఁచి యందువలన సిగ్గుపడి ముంజేతి కడియములను బప్పుడు కలుగకుండు కొఱకై యొక్కొక్కటిగాఁ జేతనుండి తీసి వైచుచువచ్చెను. అప్పు డొక్కక్కచేత రెండేసికడియములు మాత్రమేయుండెను. మరల నది దంచుచుండఁగా నారెండేసి సంకుకడియములు గూడఁ బప్పుడు సేయసాగెను. ఆ రెంటిలోఁ గూడ నొక్కక్కసంకువును విఱిచి పాఱవైచెను. అపుడు చేత నొక్కక్క కడియమే యుండుటవలనఁ బప్పుడు గలుగ

దయ్యెను. అరిందమా ! నేను లోకతత్త్వములను దెలిసికొన వలయునని కోరి యాలోకములందెల్లఁ గ్రుమ్మరుచు నా కుమారివలన నీ యుపదేశమును గఱచితిని. వెక్కండ్రుగూడి యుండినచోఁ గలహము పుట్టుచున్నది. ఇద్దఱు గూడినచోఁ బరస్పరము ముచ్చటలు గలుగుచున్నవి. కనుకఁ గుమారి కడియమువలె నొక్కఁడుగానే యుండి క్రుమ్మరుచుండ వలయును ఇదియే నేనాకడియము వలనఁ నేర్చితిని. మనస్సును వైరాగ్యమును సభ్యసించుచువచ్చి దాని బలమువలన స్థిరము గావించి యాసనములను సమర్థించి శ్వాసమునుజయించి ప్రాలు మాలికలేక యామనస్సును శుభాశ్రయుండగు భగవంతు నొక్కనియందే నెలకొలుపవలయును. ఆశుభాశ్రయునియందు మనస్సును బట్టుకొలుపఁగా నది కర్మవాసనలను మెల్ల మెల్లగాఁ దుడుచుచువచ్చును. అప్పుడు సత్త్వము వృద్ధినొందఁగా రజస్తమస్సులను దూలించి విషయాంతరముల కగోచరమై ధ్యేయం బయినపరమాత్మాకారమునం దాత్మ దగిలినట్టివాఁ డగుచున్నాఁడు. ఇట్లు పరమాత్మునియందుఁ జిత్తమును నిరోధించి నిలిపినపుడు వానికి లోపలఁ గాని వెలుపలఁగాని యేదియుఁ దెలియకుండును. బాణములకుఁ జిల్లలు చేయువాఁ డాచిల్లయందే మనస్సు నిలుపుటచేఁ బ్రక్క రాజు పోవుచున్నను జూడఁడు. మునియగువాఁ డొంటరి గాఁదిరుగుచు నొకచోటను నిలుకడగా వసతిలేక పరాకునుబడక గుహాలయందువసించుచుఁ దనపోకడ లితరులకుఁ దెలియకయుండు సర్వమువలె

---

1 యోగిసమర్థము ధ్యజించుటకు తగుమారిగురువు. జనసమర్థము త్యజించుటకు సర్వనుగురువు.

నొక్కండును వర్తించుచు మితముగా మాటలాడువాడై యుండును. దేహము ధ్రువముగాదు. అట్టిదానికి గృహముకట్టు కొనుట (కట్టునపు డాయాసము గలిగించుటచే) మిక్కిలి దుఃఖము కలిగించుచున్నది. మఱి కోరినంతభోగము గలుగ నందున నది విఫలమగుచున్నది. కాఁబట్టియె సర్పము తన కని యిల్లు గట్టికొనక పరులు గట్టినపుట్టలు మొదలగు పట్టులను జొచ్చి హాయిగా వర్ధిలుచున్నది. దేవుండగు నారాయణుఁడొక్కఁడు *తాను పూర్వమసృజించి యున్న జగత్తును దానిప్రలయమునకు గారణాంతరము లేక తానొక్కండొకారణమై కల్పాంతమునందుఁ దన విశేషణమగు కాలమునుగొని తనసంకల్పము చేత సంహరించి యంత నొక్కండును నద్వితీయుండునై యుండెను. అనఁగాఁ దాను మరల జగమునునిర్మించువాడై చిదచిత్తు లపుడు మిక్కిలియు సూక్ష్మములై నామ రూపములచే వేఱుపడక యుండుట వలన నన్నియును గూడి తానొక్కఁడేయు పాదానకారణమయ్యు నాజగమునకు నిమిత్తకారణమును రెండవది లేక తానే యయ్యు నుండెను. మఱి యపుడు సకలములయిన చిదచిత్తులకును దానాశ్రయమై తనకుఁ దానే కాక మఱియొక్క యాధారము లేక యుండువాఁడు కనుకఁ దనకు శక్తి భూతమగుకాలము నిమిత్తముగాఁగొని సత్త్వము మొదలయిన తన విశేషణములయిన శక్తులు మున్ను సృష్టిదశయందు విషమములుగా నుండిన విపుడు ప్రలయమున సామ్యమునొంది తన యందులయించి యుండఁగాఁ దనయందు వేఱుపఱుపరానంత సూక్ష్మములై యున్న యచిత్తునకును జిత్తునకును నియంతయై

* ఇట ప్రలయమందలి భగవత్స్వరూపము వర్ణితము.

యఖిలజగత్కారణభూతుఁడు గాన యాది పురుషుఁడై చిదచిత్తులకుఁ గార్యకారణావస్థలు రెంటియందును దానే మేరయై యుండు నాభగవంతుఁ డాప్రలయసమయమున నన్నియు నామరూపవిభాగములు లేమిం జేసి వేఱువేఱ నేర్పడక యన్నియుఁ దానొక్కండుగా నుండుటచే కైవల్యుఁడని పేరొక్కనబడియుఁ జెను. మఱియు నపుడు జాడ్యమునుదుఃఖమును గొంచెమయినను గలియకుండు జ్ఞానానందసమూహమే స్వరూపముగాఁగలవాఁడు ను,కర్మమువలనఁగాక తనంతట జ్ఞానాదులు పడసిన వాఁడుగాన నిరుధిపాకుఁడునై యుండెను.*పిదప సృష్టిసేయఁబూని మఱివేఱొక పరికరము లేక తానే సృజింపవలయునని తనసంకల్పముచేత నిరతిశయ సూక్ష్మమై తనకు శరీరమయినదియుఁ ద్రిగుణాత్మకయు నగు మాయను స్థూలదశనొంది వికారముఁజెందునట్లు కలతవెట్టుచున్నాఁడు. అంత నామాయచేత నహంకారాది తత్త్వములకెల్ల నాధారమగు సూత్రము వంటి దగుమహత్తత్త్వమును మొదట సృజించుచున్నాఁడు ఆమహత్తత్త్వమును త్రిగుణప్రకృతికిఁ గార్యముగాను అహంకారము మొదలు పృథివివఱకుఁ గల తత్త్వపరంపరను సృజించునదిగాను సర్వకార్యములందును బ్రాధాన్యమైనదిగాను జెప్పదురు. ఆమహత్తత్త్వము నందే యీ జగమంతయు గ్రుచ్చంబడి యున్నది. దాని వలననే పురుషుఁడు సంసారము నొందుచున్నాఁడు. సాలెపురుగు తన కడుపులోపలనుండి నూలిని నోటివలన వెలువరించి సాగించి దానితోఁగొంత క్రీడించిన పిదప దానిని మరల లోనికిమ్రింగునట్లు మహేశ్వరుఁడును నీ జగమును వెలికి సృజించి మరల

* భగవంతుని సృష్టియందలిప్రకారమును వర్ణించుట తెలియవచ్చినది.

లోపలికి సంహరించుచున్నాఁడు. దేహీ యగువాఁడు నిశ్చయ రూపమగు బుద్ధితోఁ దన మనస్సు నేయేవిషయమందు స్నేహ మువలననో, ద్వేషమువలననో, భయమువలననో నిశ్చలముగా నుంచుచున్నాఁడో యాయా దాని రూపమును బొందు చున్నాఁడు. పురుగు, దానికి రూపము గావించెడి తుమ్మెద తన గూఁటిలోనడంచియుంపఁగా నందులకు భయపడి, యాతుమ్మెద నే చింతించుచు పూర్వరూపమును త్యజింపకయె దానితో సామ్యమును బొందుచున్నది. ఇట్లు చెప్పిన గురువులవలన నాఁకీ మతి గఱపఁబడినది. ప్రభూ ! ఇఁక నా దేహముచేతఁ గఱపఁ బడినబుద్ధిని జెప్పెదను వినుము. ఈ దేహ ముత్పత్తియు నాశ మును గలిగియున్నది. దీనికి మీఁదు మీఁదెప్పుడును దుఃఖ ఫలముగానుండును. కనుక దీనియందు నాకు విరక్తి గలుగు చున్నది. అయినను దీనివలననే నేను బ్రకృతి తత్త్వములను విమర్శించి తెలియుచున్నాను గాన యిది నాకు వివేకము గలి గించునది ఇది నాకు గురువు. ఇట్టిదియైనను నిది కుక్క మొద లగు పరుల సొమ్మే యని నిశ్చయించి యిది యిట్లుపకారి యయ్యు దీనియం దభిమాన ముంపకయె చరించుచుండును. మఱి యీ దేహమునకుఁ బ్రియముచేయఁ దలఁచి దారాపుత్ర బిడ్డలనును ధనములను బశువులను భృత్యులనును గృహము లనును నాప్తవర్గములను సంపాదించి పోషించుచున్నాఁడు. ఎట్లో పలుకష్టములు పడి ధనములను గూఁడఁ బెట్టియుఁ దుదకు దేహీ తన యాయువు తుదముట్టఁగానేయా దేహమును వీడియె పోవుచున్నాఁడు. దేహము విడిచిపోయినను దుఃఖము విడు చుటయెక్కడిది ? వృక్షము నశించుచు మఱియొక్క వృక్షము

నకు బీజము సంతరించునట్లు వాఁడును మఱి యొక దేహమునకు బీజమయిన కర్మమును సంతరించి మఱి మునుపటి దేహమును వీడుచున్నాఁడు. వీనిని జిహ్వ యొక్క వలనికి (రసమునకు) లాగుచున్నది. దప్పి మఱొక్కటికి (జలమునకు) లాగు చున్నది. అట్లు శిశ్నమును నొక్కటికిని (మైథునసుఖమునకును), ద్వక్కు నొకటికిని (స్పర్శమునకును) ఉదరమొక్కదానికిని (అన్నమునకును) శ్రవణ మొకదానికిని (శబ్దమునకును) ఘ్రాణ మొక దానికిని (గంధమునకును) చపలమగు దృష్టి యొక్కటికిని (రూపమునకును) వీనిని బట్టి లాగుచున్నది ఇట్లు వాక్కు మొదలయిన కర్మేంద్రియములను నొక్క వలనికి (నాయా) వ్యాపారములకు వీని నాకర్షించుచున్నది. ఇట్లు పెక్కండ్రు సవతులు చేరి యొక్క గృహపతిని దుద ముట్టించునట్లు, ఈ యింద్రియము లెల్ల దేహిని ద్రుంచుచున్నది. బ్రహ్మ (శరీరకుఁడగు భగవంతుఁడు) తన శక్తియు విశేషణమునగు ప్రకృతిచేత వృక్షములు, సరీసృపములు, పశువులు, పక్షులు, దంశములు, మత్స్యములు మొదలుగా నానావిధము లయిన దేహములను సృజించెను గాని, యవి ముక్తిసాధన మనుష్యించుట కశక్తములగుటను జూచి సకలచేతనుల నుజ్జీవింపఁ జేయుటకై తాను జేసిన సృష్టికార్యము వ్యర్థమయ్యె నని యందులకు హృదయమున సంతుష్టి నొందక పోయెను. పిదప మనుష్యుని, బ్రహ్మదర్శనమునకు సాటి యగు నుపాసనమునకు యోగ్యుఁడయిన వానిని, సృజించి యీ దేవుఁడు ముదము నొందెను. పురుషుఁడు మిక్కిలియు దుర్లభమయిన యీ మనుష్యజన్మమును, కోరిన పురుషార్థములను బొందించుదానిని, వెన్క జన్మము లను

గడపటఁ బొంది సుఖ దుఃఖములు సమముగాఁ గొని, మృత్యువు వెంట నంటియున్న యీ దేహము చెడి శూలకము నుపే వేగిరపడి ముక్తికొఱకుఁ బాటుపడవలయునుగాని కామ విషయములకొఱకుఁగాదు. కామవిషయములో కుక్క పంది మొదలుగాఁ గల జన్మము లన్నిటి యందును సులభముగా నున్నవి. కాన, యవి యొక హెచ్చుగాదు. ఇట్లు బుద్ధిని నేర్పి కొని వైరాగ్యము పుట్టఁగా నాత్మయందలి విజ్ఞాన వృష్టిని బొంది దేహాత్మాభిమానమును వీడి, దేహానుబంధులగు పుత్రకళ త్రాదులందు సంగమును వదలి, యీభూమియందుఁ ద్రిమ్మరు చున్నాను. జ్ఞానమొక్క గుగువు వలననుండియె మిక్కిలి స్థిర ముగాను మిక్కిలి పుష్కలముగాను గలుగఁజాలదుచుమీ. ఈ జ్ఞాన మద్వితీయమైనది. దీనికి సాటి మఱియొకటి లేదు. ఋషు లు దీనిని భూమిమొదలగు సృష్టాంతములను గొని నెక్కు విధ ముల వర్ణించుచున్నారు' అనెను.

భగవంతుఁడు - ఇ ట్లపారజ్ఞానసంపన్నుఁడయిన యీ బ్రాహ్మణుఁడు యదువునకుఁ జెప్పి యీ రాజుచేత నందినము లంది చక్కఁగా నర్చితుండై సంతోషము నొంది యతనిని వీడుకొని వచ్చినదారిని బోయెను. మన కెల్లవారికిని బూర్వజు డయిన యీయదువును * నవధూత చెప్పిన దెల్ల విని సర్వ సంగములనుండి విడివడి యున్నటను సమాత్ముఁడై ముక్తి నొందెను ఇది తొమ్మిదవ యధ్యాయము.

అవధూత యదుసంవాగము సమాప్తము.

---

* 'యోగర్ధి మాపు రుభయం యదు హైహయా చ్యా' అనుటం బట్టి హైహయుఁడగు కార్తవీర్యార్జునునితోఁ బాటిగా యదువు యోగాదులను

భక్తియోగమును దాని కంగణులను కర్మ జ్ఞానాది సాధనములను భగవంతుఁ డుద్ధవున కుపదేశించుట.

భగవంతుఁడు—సర్వజ్ఞుండును బరమకారుణికుఁడు నగునేను స్వరూపానురూపములయిన యర్చన వందనాది ధర్మములను (గీతాదులందు) నుపదేశించియున్నాను. వానిని బరాకులేక యనుష్ఠించుచు నేనే తనయునికికిని స్థితికిని బ్రవృత్తికిని నాధార మని జ్ఞానముగలిగి ఫలాభిసంధి లేక దేహమున్నంతవఱకును దన వర్ణాశ్రమకులములకుఁ దగిన యాచారములను నాచరించుచుండవలయును. మఱి యాధర్మములవలన మనస్సు పరిశుద్ధం బయినవాఁడు తనయాత్మకును బరమాత్మకును గల స్వరూపములను జింతించుచుండవలయును. అట్లు చింతించుట చేత వాఁడు విషయాసక్తచిత్తులయిన దేహులెల్ల శబ్దాదివిషయముల కొఱకే సకలములయిన ప్రయత్నములును జేయుదురనియు నట్టి ప్రయత్నములకు ఫలములు తొఱుఁ మాఱుగా (అనఁగా సుఖమునకుమాఱు దుఃఖముగా) నుండుననియుఁగనుఁగొనును. దానిని గనుఁగొనుటచే వానికిఁ గామము లందు (ఫలములందు) మనస్సు గలుగకుండును. నిదురించు వానికిఁ గలలోఁదోఁచు విషయములును, జింతించుచుండువానికి మనస్సునఁ గలుగు గొంతెమ కోర్కులును బ్రియములనియు నప్రియములనియు నానావిధములుగా నుండుటంబట్టి విఫలములే కాని నానివలనఁ బురుషార్థముగలుగదు. అట్లు యాత్మయందు దేవమనుష్యాది భేదములును శబ్దాది విషయములును బుద్ధికిఁ

భూతనుటచే నీ యవధూత యా యర్జునునకు నుపదేశించినదత్తాత్రేయుఁడుగా నుండవలయునని తోఁచుచున్నది.

దోఁచుచుండును. అవియు నానావిధములై కార్యభూతములై యసత్యములై యుండుటంబట్టి విఫలములే యగును. కనుకఁ దత్త్వమును జింతించిననే మనస్సునందుఁ గామము లేకపోవును గాని యతత్త్వములగు విషయాదులను జింతించుట వలన నట్లు గాక కామముగలిగి తుదకు దుఃఖమునకే మూలకుగును కాఁబట్టి నిన్నే పరమపురుషార్థముగాఁ గల వాఁడు నిష్కామమగు నివృత్తకర్మమునే యాచరింపవలయును. ఫలమును గోరి ప్రవృత్తకర్మ మగు కామ్యమును ద్యజింపవలయును. ప్రవృత్తకర్మ మిష్టసాధకమగాని దానినివిడుచుట యెట్లందువా? మనుష్యుఁడు బ్రహ్మవిచారమందుఁ బ్రవర్తించినపుడు గామకర్మము నకు ఫలము స్వల్పము నశ్వరమునని తలంచి దానిని గూర్చిన విధి నంతగా నాదరింప కుండును. మఱియు బాహ్యాంతఃకరణములనునిగ్రహించునట్టియమములను మాటిమాటికి నాచరించుచుండవలయును. శౌచము మొదలయిన నియమములను నన్నుఁ దప్ప మఱియొక్క ప్రయోజనమును గోరక యథాశక్తి నాచరింపవలయును. మఱియును బ్రహ్మంబగు నన్నెఱింగినవాఁడును, నన్నియమదాత్మకములుగాఁ గాంచినవాఁడును, జితేంద్రియుఁడును నగు గురువు నుపాసింపవలయును. ఆగురువు నెడఁ గపటము లేక యతని యందును నతని వారియందు నర్థకామాదుల వలన మచ్చరము పెట్టుకొనక, నతని గొలుచుటయందుత్సాహముగలిగి, దేహమునందును దానియనుబంధులందును మమకారముంపక, గురువునందు దృఢమయిన మంచి మనస్సు గలిగి తొందరపాటులేక నిది తగును నిది తగదని యర్థములకలరూపును దెలిసికొనఁ దివురుచు, నసూయమాని, వట్టిమాటలు వదర

కుండవలయును. మమకారమెట్లు వీడునందువా? ఆలు బిడ్డలు, గృహము, పొలము, చుట్టములు, ధనములు, పశువులు మొదల గువానియందాసక్తినుంపకయు నన్నిటిని దనవిగాఁ దలంపకయు సాధారణమైనవిగాఁ దలంచుచుండవలయును. మఱియుఁ దనది గాఁదలఁచిన ధనమే తన పుత్రాదు లనుభవించుటచేఁ దనవిగా కుండునట్లు, ఆలుబిడ్డలు మొదలగువారును దనవారయ్యు నట్లు గానివారినిగా నెన్నవలయును. ప్రత్యగాత్మ స్థూల దేహమున కంటెను సూక్ష్మదేహమునకంటెను వేఱు. అది చూచునట్టిది. దేహ మోచూడఁబడునట్టిదిగాని చూచునదిగాదు. అదిస్వప్రకాశమైన ప్రత్యక్కు. దేహమోపరాక్కయినదికనుక దేహమునకంటెనాత్మ వేఱుకావలయును మఱియుఁగాల్పదగినదియు వెలిఁగింపఁదగినది యునగుకట్టియకంటెఁగాల్చువాఁడును వెలిఁగించువాఁడునగునగ్ని వేఱగునట్లు,ఆత్మ దేహమునకంటె వేఱేయగును. దేహమునకంటె నాత్మ వేఱగునేని దేహమునుబట్టియే యాత్మను బుట్టినాఁడుచచ్చి నాఁడు బలసినాఁడు చిక్కినాఁడని చెప్పుట యెట్లందువా ? కాల్పఁదగిన కట్టియయం దగ్ని చొచ్చి యాకట్టియకుఁ గలుగుపుట్టు కను నాశమును గొంచెమగుటను బెద్దయగుటను మొదలగు నానారూపములను దాని వలనఁ బలుచనగుటయు దట్టమగుటయు మొదలగు నానాగుణములను దనకుఁ గలిగినట్లు చూపట్టుచున్నాఁడు కాని, నిజమున కవివానివి కావు. అట్లే దేహమునకంటె వేఱయిన జీవుఁడును దేహమును జొచ్చి యనాద్యజ్ఞానమువలన దానిగుణములను దనకుఁ గలిగినట్లుగా ననుసంధించుచున్నాఁడు. కాని, వాస్తవమున కవి వానివి గానేరవు. ప్రకృతి పరిణామము లయిన పృథివి మొదలగు వానిచే జీవుని దేవమనుష్యాదిరూప

మయిన యీదేహము రచింపఁబడినది గదా. ఇట్టి దేహమును బ్రవేశించుటవలన జీవునికి దేహగుణము లనుసంధించుకొనుట మాత్రమేకాక, యీసంసార మంతయును దాని వలననే జ్ఞాన స్వరూపుండయిన యీజీవునకుఁ గలిగిన దని తెలియుము. ఆసం సారమును స్రుంచునది పరమాత్మోపాసనమే కాని యొండు గాదు. కాఁబట్టి వేదాంతవిచారముచేసి దానివలన జీవునియం దంతరాత్ముఁడై హేయప్రతిభటుఁడై యున్న పరమపురుషుని నెఱింగి యీదేహమును దీని యనుబంధులగు పెండ్లాముబిడ్డలు మొదలగునవియు నుపాదేయము లనుబుద్ధి క్రమముగా నిరసిం చుచు రావలయును. మీఁది యరణి యీచార్యుఁడు. క్రిందియ రణిశిష్యుఁడు. ఆరెంటికి నడుమనున్న చిలుకు కొయ్య యుపదే శము—అనఁగా వేదాంతార్థవిచారము. విద్య (ఎఱుఁగుట) యీ రెంటిగూడికవలనఁబుట్టిన[1] యగ్ని వంటిది. అదిపరమనుభావమా యినది. వేదనాత్మకమును విశుద్ధమును నిపుణమునయిన యీబు ద్ధి (ఎఱుఁగుట) సత్త్వరజస్తమస్సులనెడి గుణములవలనఁ బుట్టి నదియు విచిత్రమైనదియు నగు సంసారమును దూలించుచున్న ది. అట్లది యీదేహమును దీని యనుబంధులును వేనిపరిణామ ములో యీగుణములను దన్మూలకము లయిన పుణ్యపుణ్య కర్మములను దహించి యంతఁ గట్టియలు లేకపోఁగాఁ దనంతటఁ జల్లాఱిపోవునగ్నివలెఁ [2]దానే శమించుచున్నది. మఱియుఁగామ

1. ఇందులకు 'ఆచార్యాత్ పూర్వరూపం అన్తేవాస్యుత్తరరూపంవిద్యా సన్ధిః ప్రవచనం సన్ధానమ్' అను శ్రుతి యనుగుణముగా నిచటఁ బ్రతిపాదిం చుట తెలియునది.

2. దీనివలన ధ్యానరూపమును నుపాయభూతమునగుబుద్ధి ముక్తి కలిగి న పిదప నుండదు. ముక్తి గలుగుపలుకును బ్రతిదినమును దాని నావర్తించుచుం డవలయునని తేలుచున్నది.

కర్మముల ననుష్ఠించుచుండు వారును దాని ఫలములగు సుఖ దుఃఖములను ననుభవించుచుండువారు నయిన యీ దేవమను ష్యాదులును వీరి సుఖానుభవమునకును సుఖసాధనము లనుష్ఠించుటకును నగు దేశమును గాలమును, దగిన సాధనముల నుపదేశించు వేదమును, ఫలసులను గుడుచుటకు జీవుడును, వీనికి భోగ్యములయిన శబ్దాదివిషయములును నానావిధములుగను గార్య భూతములుగను నుండినను ననిత్యములుగావు; నిత్యములుగానే యున్నవని తలంతువు. ఎట్లన సర్వపదార్థములకును వినాశము పుట్టుకవలననే కలుగుచున్నది. దేశకాలాదులకుఁ బుట్టుక గనఁబడ నందున వానికి నాశమును గలుగదు గాన యవి నిత్యములేయ గును. [1] దేశకాలాదులు నిత్యములయినను దేవాదిదేహములును శబ్దాది విషయములును ననిత్యములుగాఁ జూపట్టు చున్నవే యందువా? సత్త్వము మొదలయిన యాయాగుణములు మిక్కుటముగా నుండుటంబట్టి దేవుఁడు మనుష్యుఁడని యాయా

---

1. 'దేవాద్యాకారములును వానికుపభోగ్యములైనశబ్దాదివిషయములును నానావిధములై కార్యములై యనిత్యములై యుండుటంబట్టి పురుషార్థములు కావు. కనుక వాని విషయమై ప్రవృత్తికర్మము త్యజింపఁబడియున్నది. వానివిధంచుశాస్త్రమును ఆపరింపరాదని చెప్పఁబడినది. కాని యిదిసరికాదు. దేవాద్యాకారము లనిత్యములయినను ఆ యాకారములు గలిగియుండుజీవులు నిత్యులగుటం బట్టియును, వారి యాకారపరంపరయు దానిదానికుపభోగ్యములగు విషయముల పరంపరయును నిత్యములగుటంబట్టియు, విషయానుభవమునకైన దేశకాలములును దత్సాధనములను దెలుపు ఆగమములును నిత్యములగుటం బట్టియు ఎల్లప్పుడు నాయాతోరిన విషయములను సాధించుటయు నాయాఫలముల ననుభవించుటయు స్వభావముగాఁ గలవారికిఁ బ్రవృత్తికర్మము పురుషార్థసాధనమే కాన దానిని త్యజించుట తగదు. దుఃఖసాధనమో ప్రతికూలమగుటంబట్టి త్యజింపఁబడుట తప్పదు అని భావము.'

యాకారభేదములతో జీవులు పుట్టుచున్నారు. వారల బుద్ధియు నాయాగుణమున కనుగుణముగా నాయాఫలములను నాయా సాధనములను నాయాదేవతలను వేఱువేఱ యవలంబించు టచే నానాభేదములు గలిగి యుండును. కనుక దేవాది దేహములును శబ్దాది విషయములును ననిత్యములు గావున న వానివిషయమైన ప్రవృత్తికర్మమును ద్యాజ్యముగాదు. అ యిన నా ప్రవృత్తికర్మమువలన దేవాది దేహసంబంధములును వానివలన షడ్భావవికారములును దుఃఖగర్భములై తప్పకగలు గుచున్నవి గనుక, ప్రవృత్తికర్మము పురుషార్థసాధనము కాదం దువా? ఉన్నదవా? ఇట్లు ప్రకృతి కర్మము పురుషార్థసాధనమగుట యొప్పియున్నను సకు స్తదేహములకును దేహసంబంధమునలనను, కల కాష్ఠ ముహూ ర్తము మొకలుగా సంవత్సరమువఱకుఁ గల కాలావయవములవలనను మాటిమాటికి జన్మము జరమరణము మొదలయిన భావములు కలుగుచునే యుండును. దానివలన దుఃఖము త్రోసిపుచ్చరాకున్నది చుమీ. ప్రవృత్తి యొక విధమునఁ బురుషార్థమునకు సాధకముగానున్నను, రజోగుణ మునో తమోగుణమునో యనుసరించు చుండు నా ప్రవృత్త కర్మములను గావించువాఁడును, గావుననే దానివలని సుఖ దుఃఖముల ననుభవించువాఁడును, గర్మములకుఁ బరతంత్రుఁ డై యుండుట లోకమునఁ జూపట్టుచున్నది అట్లు కర్మములకుఁ లోకువగాని చో దుఃఖ మెవ్వఁ డనుభవింపఁడుగదా. కనుకఁ బురుషుఁ డెవ్వఁ డట్లు పరవశుఁడై శబ్దాదివిషయములను భ జించును? ఎవ్వఁడును భజింపఁడు. ఈతియు దేహములకుఁ, గర్మ ములనుజక్కఁగాఁ జేయుటకుఁ దెలిసినవిద్వాంసుల కియినను,

సుఖము కొంచెమైనను గలుగదు ; మఱి దుఃఖమేగలుగును. అట్లే మూఢులగువారికి 'మేము కర్మములు చేయుటయందు నిపుణులము కావున మాకుదుఃఖముగలుగదు. మేము సుఖులమే' యని పట్టి యహంకారము మాత్రమే మిక్కిలి యుండునుగాని మఱేమియుఁ గలుగదు. మఱి విద్వాంసులగువారు, కర్మవశ్యులగువారికి శుభకర్మములే సుఖము ప్రాపించుటకును నశుభకర్మములు దుఃఖము గలిగించుటకును నుపాయములనియు సుఖములను బడయుటకును దుఃఖములను వారించుటకును నుపాయము లీవి యనియుఁ దెలియుదురు; తెలిసినను వారు మృత్యువు గలుగకుండుటకు నేది హేతువో యట్టి మోక్షోపాయము నెంత మాత్రము దెలియరు. ఇట్లు బ్రతుకు చుండువానిని మృత్యువు దేహముతోఁగూడనేపుట్టి దగ్గఱనే యుండి మ్రింగ నెదురుచూచుచుండఁగా నర్థముగాని కామము గాని యేది సుఖపెట్టఁగలదు ? చంపఁదగిన యపరాధిని, గొల పట్టునకుఁ గొనిపోవుచుండునపుడు వానికి క్షీరాన్నములు నలం కారములు మొదలగుస వేవి యిచ్చినను దుష్టిగలిగించునా ? శ్రుతమును పశువులు మొదలయిన లౌకికఫలమగు దృష్టములును స్వర్గాదిఫలమగునదృష్టములును,కృషియుఁ బెక్కులువిఘ్నములచే నిష్ఫలమగునట్లు, తామును మచ్చరము, అసూయ, నాశసు, క్షయము మొదలుగాగల యంతరాయములు పెక్కిటిచేతఁ గొట్టువడుటంబట్టి నిష్ఫల మగుచున్నవి. ఒక ధర్మము విఘ్నములచేతఁ గొట్టువడకుండుట వలనఁ జక్కఁగా ననుష్ఠింపఁబడినదియగునేని, యట్లు చక్కఁగా ననుష్ఠింపఁబడిన దాని వలనను నిట్టిస్థానమును సాధించి పొందనగునో దానిని

జెప్పెదను వినుము. ఇందు నింద్రుఁడు మొదలగు దేవతలను యజ్ఞములచేత నారాధించి, యజ్ఞానుష్ఠానముచేత విశిష్టుఁడయిన పురుషుఁడు స్వర్గలోకమునకుఁ బోవుచున్నాఁడు. ఆస్వర్గలోకమందుఁ దన యజ్ఞాదికర్మములచేత గడించి కొనఁ బెట్టుకొన్న దివ్యములగు భోగములను నింద్రాదిదేవతలవలె ననుభవించుచున్నాఁడు. మఱియుఁ దనపుణ్యకర్మములచేతఁ బడసిన నిర్మలంబగు విమానము నెక్కి దేవతాస్త్రీలనడుమ వారల మనంబుల రంజింపఁ జేయుచు నట్టివేషమునుదాల్చి విహరించుచుండును. అందు గంధర్వ లతనికిగానము సేయుచుండుదురు మఱి యాస్త్రీలం గూడివిహరించుచుఁగామగమనంబై చిఱుగంటల సమూహములు వరుసలుగాఁ గట్టంబడియున్న విమానమందు దేవతలక్రీడాస్థానములగుమేరువు మొదలగువాని ద్రోణులందుఁగా నియుద్యానములందుఁగాని సంచరించుచును గ్రీడించుచును మిక్కిలియు సుఖనునఁ బొక్కుచుఁ బుణ్యమంతయుఁ దీఱి తాను బడఁబోవుట తెలియకుండును. మఱి తన పుణ్యమంతయుఁ దీఱుపెఱుకును స్వర్గమునందు ముదంబునఁ దేలుచుండును. పిదపఁ బుణ్యమనుభవించుటచే క్షీణింపఁగాఁ దా నొల్లకున్నను బలవంతమగు కాలముపట్టి తన్నుఁ గదల్పఁగా నచ్చటనుండి కదలి క్రిందుగాఁ బడుచున్నాఁడు. ఇట్లే యిహమందును బరమందును బోవుచును వచ్చుచును సుడియుచున్నాఁడు. ఇష్టము లగువానిని జేయువారి గతియిట్టిది. అనిష్టము లాచరించువారిగతుల వినుము. అసత్పురుషులతోడ సహవాసమువలన నధర్మమం దాసక్తుఁడై శబ్దాది కామ విషయములందు మనస్సుదగిలి యుండుటవలన నింద్రియములనుగెలువక దీనుండై భోగములందుఁ బేరాసకలిగి

స్త్రీలంపటుండై యండులకొఱకు భూతములను హింసించుచుండును. మఱియు దుష్టజనులు పురికొలుపఁగా ధనాదుల కొఱకుఁ బశువులను విధిని దప్పి వధించుచును ప్రేతగణములను భూతగణములను యజించుచును నిజకర్మములకుఁ బరవశుఁడై జీవుఁడు నరకములను వగుసగాఁ బొంది మిక్కిలియుఁదమస్సు నిండియున్న స్థావరజన్మమును బొందుచున్నాఁడు. కర్మములు పుణ్యములయినవి గాని పాపములైనవిగాని మీఁదట దుఃఖమునే కలిగించుచుండును. దేహమెత్తియట్టికర్మములనే యాచరించుచు వాఁడు దేహావసానమం దాకర్మములవలనఁగలుగు నాయాఫలము లనుభవించుటకుఁ దగిన దేహమును బొందుచున్నాఁడు. ఇట్లుండుటంబట్టి మరణశీలుండగువానికి సుఖము కొంచెమైనను గలుగదు. అయినను లోకములు శాశ్వతములును లోకపాలురు మరణశీలురు గానివారు నగుటంజేసి వారికి సుఖము తప్పక కలదేకదా యందువా? లోకములును లోకపాలురును గల్పమువఱకు జీవించువారయినను నావలన భయమునొందుదురు. వేయేల ! రెండుపరార్ధములు పరమాయుష్యముగాఁ గలబ్రహ్మకును గాలాత్ముండయిన నావలన భయముతప్పదు. లోకాదులన్నియుఁ గాలముచేఁ జలితములై. యనిత్యము లగుటంజేసి దుఃఖముతోఁ గలియని సుఖము వానికిని గలుగదు. ప్రాకృతములయినవగు గుణములు

---

1. ఇట ప్రవృత్తికర్మము త్యాజ్యమని తెలుపుటకు దానియందుఁ గల దోషములు పెక్కులుచెప్పఁబడినవి. మఱియు నుత్తరోత్తరదేహములకునుగర్మములకును బూర్వపూర్వములగు దేహములు నిమిత్తములని చెప్పఁబడినవి. మఱియురజస్తమోగుణముల కనురూపములగుప్రవృత్తికర్మములకుఁగర్తయగుటయు నట్టికర్తృత్వమువలన కర్మములకుఁ బరతంత్రుఁడగుటయు దానివలన సుఖ

తమతమ కనుగుణములయిన కర్మవాసనాదులవలని దేహముల మూలమున, గర్మములను బుట్టించుచున్నవి. గుణ పరిణామక్రమై యింద్రియయుక్తమగు దేహమును గుణముల ననుసరించి కర్మములను బుట్టించుచున్నది. ఇట్లు ప్రాకృతగుణములతోఁగూడి దానికి వశ్యుఁడై యుండు జీవుఁడు తన దేహము చేతఁగలుగు పుణ్యపాపకర్మముల ఫలములగు సుఖదుఃఖములను ననుభవించుచున్నాఁడు. [1]ప్రాకృతములగు గుణము లెంత వఱకు వైషమ్యముగలిగి యుండునో యంతవఱకు నాత్మకు జ్ఞానైకరసంబయ్యును దేవమనుష్యాది రూపములగు దేహముల చేత నానాత్వము గలుగుచున్నది. ఆ నానాత్వముండువఱకును గర్మకర్తృత్వము వలన గుణకర్మములకుఁ బరతంత్రుఁడై యుండుటయుఁ గలుగుచున్నది. ఈ దేహికిఁ బారతంత్ర్యము

దుఃఖములకు భోక్తయగుటయు దానివలన మరల తపతమ గుణముల కనుగుణములయిన ప్రవృత్తికర్మవాసనలవలనఁ బారతంత్ర్యము గలుగుటయు దానివలన మరల సుఖదుఃఖ భోక్తృత్వము గలుగుటయు నని యిట్లు చక్రము వలె పరివర్తనము చెప్పఁబడినది. పీదప దేహమునకు విలక్షణుఁడై జ్ఞానైకరస స్వరూపుఁడై నిశ్చిన్మయుఁడగు నాత్మకు కర్తృత్వమెట్లు? ఆకర్తృత్వమెట్లు సుఖదుఃఖ భోక్తృత్వము కలిగించుచున్నది? యని శంకరాచార్యులు ఆత్మ యుట్టి దయ్యును, మోక్షము పొందు వఱకు దానికిఁ బ్రాకృత గుణయోగమును, వానికి వశ్యమై యుండుటయును, గుణములు మోక్షము కలుగువఱకు సామ్య వైషమ్యరూపము లలయించుచును నుదయించుచు నుండుటయును గలదు గాన, యాత్మ కివి యున్న వనుట పొసఁగుచున్నది.

1. నీ వలని భయమొంతవఱ కుండునన్నఁగా నెంతవఱకు గుణములు వైషమ్యముగలిగియు దానివలన నానావిధదేహములు గలిగియు, ఆ దేహములవలన గర్మములకుఁ గర్తయగుటయు ఆకర్తృత్వము వలన పారతంత్ర్యము గలుగుటయు దానివలన సుఖదుఃఖభోక్తృత్వము గలుగుటయు నవెడి యీపరంపర యనుపర్తించుచో యంతవఱకు నీవలని భయమనుపర్తించునని చెప్పుచున్నారు.

గలిగియుండువఱకును నీశ్వరుండగు నావలన భయము (సుఖలేశముతోఁ గూడి దుఃఖబహుళమై యున్నసంసారభయము) గలుగుచున్నది. ఈశరీరము నవరాత్మయని యనుసంధించుచు దాని సుఖముకొఱకుఁ బ్రయత్నించుచుందుగో వాఁడు శోకము పాలై శోకనివృత్తి కుపాయము తెలియక తడఁబడుచుందురు. భయమునకు హేతువులు ప్రతికూలములగు దేశకాలస్వభావాదులేకాని నీవుగావే యందువా? కాలమును శరీరమును ఆగమమును (విధి ప్రతిషేధరూపమగు శాస్త్రమును) లోకమును, గాయవస్తు స్వభావమును. ధర్మము నని యివి మొదలుగాఁగల బహుప్రకారములసృష్టిదశయందు నన్నుగాఁ (అనఁగా నాయధీనములయినవిగాఁ) జెప్పుదురు; కనుక నేనే భయాభయములు రెంటికిని గర్తనుజుమీ' యనెను. ఉద్ధవుఁడు—ప్రభూ! జీవుఁడు దేవాదిదేహములం దధిష్ఠాతగను శబ్దాదివిషయములందు భోక్తగాను, దేహాజములును గణమూలములు నగు కర్మములందుఁగర్తగానువర్తించుచున్నవాఁడుగానగుణములచేఁ గ్రమ్మఁబడకుండుటయెట్లు? దాని వలననే కర్మమూలములగు సుఖదుఃఖాదులు పొందకుండుటయెట్లు? మఱియీశ్వరునివలె స్వయంప్రకాశులు డును ద్రష్టయునై యుండఁగా వానికి బంధముగాని కలుగుటయెట్లు? విద్వాంసుఁడగువాఁడెట్లు వర్తించును? ఎట్లు విహరించును? ఏలక్షణములచేత నతనిని గుఱుతెఱుంగవచ్చును? అతఁడు భోజనమును గుడుచునా? లేకకుడువక దిగవిడుచునా? అతఁడు పరుండియుండునా? లేక కూర్చుండి యుండునా? లేక తిరుగుచునే యుండునా? అచ్యుతా! నీవు ప్రశ్నములకుఁ బ్రతి చెప్పువారి యందు మిన్నవు. కాన నేనడిగెడి యీప్రశ్నమును నాకుఁ జెప్ప

ము. నిత్యము క్తుఁడయిన యీశ్వరుఁడొక్కఁడే తన యవిద్యచేత నిత్యబద్ధుఁ డయినాఁడని నాకు భ్రమకలిగి యున్నది. చుమీ!' యని యడిగెను. ఇది పదియవయధ్యాయము.

—:కృష్ణుఁడుద్ధవునకు జీవపరయోరైక్యము నుపదేశించుట.:—

శ్రీభగవంతుఁడు—గుణకర్మములచేత బద్ధుఁడు వానినుండి ముక్తుఁడని చెప్పుట నిర్దోషుండగు నాకువా స్తవమునఁగలుగనేకలుగదు. మాయ(ప్రకృతి) నానియమనమునకు లోనయినది.మాయకు నియామకుఁడయిన నాకు నామాయాగుణములచేత బంధముగాని మోక్షముగాని గలుగదు.గుణకర్మములకు లోకువయగు జీవునికే యీరెండును గలుగును. నాకు నియామ్యమయిన మాయచేతనే జీవునకు శోకమును మోహమును సుఖమును దుఃఖమును దేహ ప్రాప్తియు, స్వప్నమందు నాత్మకు దేహసంబంధము లగునుఖదుఃఖాదులు తోఁచునట్లు, గలుగుచున్నవి. సంసార మాత్మకు స్వరూప సిద్ధమును నిత్యమును గాదు. అది [1]యుపాధిచేతఁగలిగి యనిత్యమైయుండును. ఉద్ధవా! విద్యయు నవిద్యయు నాకు దేహములు; దేహములవలె నాకు మిక్కిలి యధీనములయినవని తెలియుము. శరీరుల కవి మోక్షమును బంధమును గావించుచుండునవి; ఆద్యము లయినవి. దానిని

1. ఇది యుద్ధవుఁడు ఆత్మ యెట్లు గుణముల చేతఁ గ్రమ్మఁబడక యుండును? ఎట్లు సుఖదుఃఖాదులు పొందక యుండు? నన్న ప్రశ్నముల కుత్తరములు. సంసార మనాదియగుటచే అనిత్య మగునా యనవలదు? ఆదియు అంతమును లేనిదే నిత్యమగును. సంసారమున కాది లేకున్నను అంతము కలదు గాన అనిత్యముగాదు; నిత్యమే యగును. అది ఆత్మకు అనాదిగానున్నందున దానిని గ్రమ్ముచున్నది. దానివలని సుఖము లాత్మను బొందుచున్నవి. ఇటస్వ

నాదుసంకల్ప రూపజ్ఞానముచేతను నేను నిర్మించితిని. (విద్యయనఁగా నాయుపాసనము. అవిద్య యనఁగా స్వాత్మ పరమాత్మ స్వరూపములు తెలియఁమి, మహామతీ! శరీరమునకుఁ బ్రధానభూతుఁడై నాకు శరీరమును విశేషణము నగుటచేత నా యంశమై యున్న యీ జీవునకు నవిద్యచేత బంధమును విద్యచేత మోక్షమును గలుగుచున్నది. ఇఁక బద్ధుఁడగు జీవునకును నిత్యముక్తుఁడయిన యీశ్వరునకును గల వైలక్షణ్యమును నీకుఁ జెప్పుచున్నాను. ఆ యిరువురు నొకదేహమునందుఁ బరస్పరము నిబద్ధ ధర్మములుగలిగి నెలకొని యుందురు. [1]ఈ రెండు(జీవుఁడు నీశ్వరుఁడు నను) [2]పక్షులును మంచి యొక్కలుగలవి. సమానములయిన గుణములు గలవి. ఒకటి కొకటి చెలిమిగలవి. ఇది యదృచ్ఛచేత నృక్షమునందు (శరీరమునందు) గూఁడు కట్టుకొని (హృదయకమలమందు) నున్నవి. ఆ రెంటి

ప్నదృష్టాంతముచేత ప్రపంచము మిథ్యయని తెలుపఁబడదు. అదినాస్తి గా నసఁగా నిత్యముగాదని భావము; మిథ్యయనికాదు. స్వప్నప్రపంచమును 'నతత్ర రథాఃరథయోగా న పన్థానో భవన్తి అథరథాన్రథయోగాన్ సృజతే సహరథాన్ పథీఃస్వ జతే యత్ తేషు సుప్తేషు జాగర్తి కామం కామపురుషోనిర్మిమాణః' అని ఈశ్వరుఁడు సృజించుట వాస్తవమే యగును. శ్రుతి.

1. జీవేశ్వరులు భోక్తృత్వా భోక్తృత్వములు, జ్ఞాత్వాజ్ఞాత్వములు మొదలగు విరుద్ధ ధర్మముల నేకాలమందేయొక దేహమందుఁ గలిగియుండు రని భావము.

2. ఇట 'ద్వాసుపర్ణా సయుజౌ సఖాయాసమానం వృక్షం పరిషస్వజాతే - తయోరన్యఃపిప్పలం స్వాద్వత్త్యనశ్నన్నన్యో అభిచాకశీతి' అను శ్రుతి యనుసంధింపఁబడెనని తెలియుచున్నది. ఇచట గూఁడనఁగా హృదయకమలము. ఈశ్వరునకును 'హృది హ్యయమాత్మా ప్రతిష్ఠితః' అని జీవునకును హృదయకమలవాసము చెప్పఁబడి యున్నది.

యుఁదొకటి (జీవుఁడు) [1]మట్టిచెట్టుపండును (ప్రకృతి ఫలములగు శబ్దాది విషయములను) తినుచున్నది. ఇంకొకటి (ఈశ్వరుఁడు) యేఫలమును (పుణ్యాపుణ్య ఫలములగు సుఖదుఃఖాది భోగములు) లేకయుండును;(మఱియు సర్వజ్ఞత్వము సర్వశక్తిత్వము మొదలుగాఁ గల) బలముచేతి చిక్కిలి మెఱుఁగై ప్రకాశించుచుండును. [2]సర్వజ్ఞుండయి (ఫల) భోక్తకాకుండెడివాఁడు, తన్నును దక్కిన ప్రధానమును బుద్ధిని గలయావున సాక్షిత్వంబరించుచున్నాఁడు. భోక్తయగు జీవుఁడో తన్నును దనసఖుండయిన పరమాత్మను నెఱుఁగఁడు; మఱి దేహమునే యాత్మగాఁ దప్పఁదలంచుచుండును. మఱి యవిద్యచేతఁగూడియుండువాఁడు(జీవుఁడు) నిత్యబద్ధుఁడై యుండును. విద్యమిక్కిలియుఁగల వాఁడు (ఈశ్వరుఁడు), నిత్యముక్తుఁడై యుండును.విద్వాంసుఁడెట్లు వర్తించునని కదా యడిగితివి? వాఁడు దేహమునందుండియు దేహమునందు లేనివాఁడే. స్వప్నమునుండి మేలుకొన్న వాఁడు స్వప్నమందుఁ జూచిన శరీరమును తన్నుగాఁ దప్పఁ దలంపకుండునట్లు, దేహమందుండియు వాఁడు దేహమునే యాత్మగాఁ దప్పఁదలంచుటలేక యుండును. దేహమే యాత్మ యని తలంచు కుమతి యున్ననో, దేహమందులేకున్నను (అనఁగా గర్భము మహాప్రళయము మొదలగు దశలయందు దేహము నిష్పన్నముగాకున్నను) స్వప్నము గనువాఁడందలి శరీరమునే యాత్మగాఁ దప్పఁది

---

1. పిప్పలమనఁగామట్టి. 'పిప్పలాదః' అనఁగా మట్టినిదినువాఁడు, అనఁగా 'ఊర్ధ్వమూల మధశ్శాఖ మశ్వత్థం ప్రాహు రవ్యయమ్' అన్నట్లు ప్రకృతి మట్టిగా చెప్పఁబడుచున్నది. మట్టిపండనఁగా ఫలభూతములైన శబ్దాది విషయములని తెలియునది.

2. 'జ్ఞాజ్ఞౌద్వావజావీశనీశౌ' అను శ్రుతి యిట యనుసంధింపఁ బడినది.

దలంచునట్లు, దేహమునందున్నవాఁడై బద్ధుఁడై వర్తించుచుండును.విద్వాంసుఁడగువాఁడు గుణపరిణామాత్మకములయిన తన యింద్రియములు శబ్దాది విషయముల ననుకూలములను గాని ప్రతికూలములనుగాని యనుభవించుచున్నపుడు, తానందులకు హర్షము విషాదము మొదలగు వికారముల నొందఁడు. మఱి యుఁ దానే కర్తయనియు భోక్తయనియుఁ దప్పఁదలఁపఁడు. విద్వాంసుఁడుగానివాఁ డన్ననో ప్రకృతి గుణములచేఁ గలుగు కర్మమునుబట్టి వర్తించుచున్నవాఁ డయినను దేహముదై వాధీన మనుటయుఁ, బూర్వకర్మమును బట్టి తానందుండుటయు, దేహమునకంటె నాత్మ విలక్షణమగుటయును దెలియక దేహమునే యాత్మగాఁ దలంచుచునుండును కావున దేహాత్మాభిమానముచే తను,తానేకర్తయనియుభోక్తయనియునభిమానముచేతనుబద్ధుఁడగుచున్నాఁడు.విద్వాంసుఁ డెట్లువిహరించుననియడిగితివి. వాఁడు కుమతివృత్తిని జింతించి దేహమునందును దానియనుబంధులందును విరక్తుఁడై మఱియు[1]బఁగుడుట, వ్యాపించుట, తిరుగుట, జలకమాడుట,చూచుట,స్పృశించుట, మూర్కొనుట,కుడుచుట, వినుట మొదలగు వ్యాపారములను దగుఁబోలఁదిగాఁ జేయుచుండును. మఱియు గుణపరిణామము లయినయింద్రియములే,యీశ్వరుని వలన సత్తయుఁ బ్రవృత్తియు నొంది యాయాగు శబ్దాది విషయములం దమంతఁ వర్తించి యనుభవించుచున్న వనియు[2]వానియందే కర్తృత్వభోక్తృత్వములున్న వనియుఁజింతిం

1. 'యుక్తాహారవిహారస్య యుక్తచేష్టస్య కర్మసు । యుక్త స్వప్నావబోధస్య యోగోభవతి దుఃఖహా' అని భగవద్గీత.

2. 'తత్త్వవిత్తు మహాబాహో గుణకర్మ విభాగయోః । గుణాగుణేషు వర్తన్త ఇతి మత్వాన సజ్జతే' అను భగవద్గీత యిట యనుసంధించునది.

చుచు. నుండు నని బుద్ధి నెఱింగినవాఁడు కుమతివలె బద్ధుఁడు గాఁడు. అట్టి విద్వాంసుఁడు కర్మములను జేయుచును వానిఫల ములగు సుఖదుఃఖముల ననుభవించుచును దేహముసందుండి యుఁ గర్మత్వాదులు శరీరమునం దుంచి తా నుదాసీనుఁడై యుండుట యెట్లందువా ? వాఁడు ప్రకృతి పరిణామం బయి నదేహమునం దుండినను దాని వలని సుఖదుఃఖాదులచే వికారము నొందకయుండును. ఆకాశము, అంతటవ్యాపించియు న్నను, ఆయావాని దోషములచేత వికారమునొందదు. సూర్యుఁ డు తన ప్రభచేత నంతట వ్యాపించినను, వాయువు దానియంత టఁబర్తియున్నను నాయావాని దోషముల నొందవు. అట్లె ప్రకృ తి పరిణామంబగు దేహమునందుండియు దానియం దభినివేశ ము లేమిచే విద్వాంసుఁడు దాని వలని వికారముల నొందఁడు. వానికి బుద్ధి విశారదమై దేహాదులందు సంగము లేమిచేత నాడియై యుండును. కాన యీవాడిబుద్ధి చేత సందేహ ముల నెల్లఁ ద్రుంచుకొని కిలగని మెలుకొన్నవానివలె దేవత్వము నమనుష్యత్వము మొదలగు భేదములనుండి వీడి దేహమే తాననెడి యభిమానము లేకుండును. మఱి నేను దేవాములకంటె విలక్షణుఁడనా ? కాదా ? నేను స్వతంత్రుఁడనా ? ఈశ్వరునికిఁ బరతంత్రుఁడనా ? నే నీశ్వరుఁ డా ? వానికంటె వేఱా ? యను సందియములు వానికిఁ గలుగవు. వానిని గుఱు తెఱుంగునట్టి లక్షణము లేవి యని యడిగితివి. ఎవ్వనికిఁ బ్రాణములయు నింద్రియములయు మనస్సును బుద్ధియు వ్యాపారములు దీనిని తినవలయును. దీనిని జూడవల

యును. దీనిని సంపాదింపవలయును. దీనిని బరిహరింపవలయు ననియిత్యాదులగు నుద్దేశములు లేకయుండునో యట్టివాఁడే దేహమునందు వర్తించుచున్నను దానిగుణములనుండి విడివడినవాఁడని తెలియవలయును. ఎవ్వఁడితని దేహమును దుర్జనులు పట్టి పీడించినను, లేక దైవికముగా నెవఁడేని సత్కరించినను నట్టి పీడకును సత్కారమునకును దా నంతగా వికారము నొందకుండునో వాఁడే విద్వాంసుఁడని తెలియవలయును. ఎవఁడు మానావమానములందు సమదృష్టి గలిగి యుండుటవలన నారెంటిని దిగవిడిచి తిన్నవేని మంచిదిగాని చెడ్డదిగాని పలికినను జేసినను బొగడకయుఁ దెగడకయు నుండునో వాఁడు ముని యని తెలియవలయును. మఱియు వాఁడు తన యాత్మయందే రమించుచు తాను దనంతట లౌకిక కర్మములను మంచివానినిగాని చెడ్డవానినిగాని చేయకయుఁ జెప్పకయుఁ జింతింపకయు నుండి మననలుండై పూర్వోక్తమగు వృత్తిని వర్తించుచు జడునివలెఁ [1]బరించుచుండును. శబ్దబ్రహ్మమగు వేదమునందుఁ బారంగతుఁడయినను, పరబ్రహ్మ విషయమగు జ్ఞానమందుఁ బరినిష్ఠితుఁడు గాక పోవచ్చును. అప్పుడు వాఁడధ్యయన మధ్యాపనము మొదలగు వానికై

1. ఇట్లు గుణములందువర్తించుచున్ననుగుణములనుగడచియుండుటనఁగాశేయనాసన్యాసులనువీడియుండుటగాదు. అహంకారరాగద్వేషములు లేకుండుటయు ఉపకారాపకారాదులందు మనస్సు సముముగా నుండుటయు దర్శనస్పర్శనాదులందుఁ దానే కర్తయనెడి యభిమానము లేమియు సువర్ణలోష్టాదులం దిష్టానిష్టములనియు బుద్ధి లేకుండుటయు నే యగునని బదులుచెప్పఁబడినది. ఇఁకనిట్టి పురుషునకు శాస్త్రీజన్యమనియు ఉపాసనమనియు రెండుజ్ఞానములను జెప్పుచున్నాఁడు.

పడిన శ్రమమంతయు, ఈని చాలదినములయ్యెఁ బాఁడిలేని యీవును రక్షించువానికింజోలె వట్టిశ్రమయే ఫలమగును. పాలుపిండియైన యీవును, దుష్టురాలగు భార్యను, ప్రతిక్షణము దుఃఖహేతువగు దేహమును, దురాత్ముండగు పుత్రునిని, పాత్రమునకు దానముసేయని విత్తమును, నన్నుఁ బ్రతిపాదింపని వాక్కును రక్షించువానికి నుద్ధవా! దుఃఖమువెంట దుఃఖమే కలుగుచుండును. ఉద్ధవా! ఈజగత్తునకు నుత్పత్తిస్థితిసంహారములు సేయుచు విన్నను బలికినను భావనకరమైన నా చరిత్రమును, నేను లీలార్థమై త్తిన యవతారములలో జగమునకుఁ బ్రేమాస్పదమయిన రామకృష్ణాది జన్మములును నెవని వాక్కునకుఁ బ్రతిపాద్యములుగావో, యట్టివానివాక్కు నిష్ఫలమే యగును. బుద్ధిమంతుఁ డట్టివాక్కును దాల్పరాదు. ఇట్లు విచారముఁ జేసి జీవాత్మయందు దేవుఁడనియు మనుష్యుఁడనియు నానావిధములఁ గలుగు భ్రమమును బోకార్చి దేహమునకంటె జీవాత్మవేఱని యెఱింగి సకల చిదచిదాత్మకుఁ డగు నాయందు, రజోగుణములేనిదై సాత్త్వికమగు నాహృదయముచేత సత్త్వమందే తగిలియున్నట్టి మనస్సునునిచి, నాయందు భక్తిగావించి లౌకిక కర్మములనుండి యుపరమింపవలయును. బ్రహ్మంబగు నాయందు నిశ్చలముగా మనస్సును నిలుపుటకు శక్తుఁడవుగావేని యపుడు వర్ణాశ్రమోచితము లగు సమస్తకర్మములును వానిఫలము నపేక్షింపక యు వానికి నీవు కర్తగానని యధ్యవసాయము గలిగియు నాచరింపుము. మఱియు శ్రద్ధగలవాఁడై లోక పావనములును సుభగములునగు నా కథలను వినుచును బాడుచును స్మరించుచును నా జన్మములను నభినయించుచును

దలంచు కొనుచును నావిషయుఁడై నా యారాధనమున కనియెడి ధర్మకామార్థములను నాశ్రయించుచు నేనే యాశ్ర యముగాఁ గలిగి యుండినచో నుద్ధవా ! సనాతనుం డయిన నాయందు నిశ్చలమయిన భక్తిని బొందుచున్నాఁడు. సాధువు లతోడి సంగతివలన నాయందు భక్తి లభించుచున్నది. అట్టి భక్తితో నన్నెవఁడు సేవించుచున్నాఁడో వాఁడు నాస్థానమును సుఖముగాఁ బొందుచున్నాఁడు. సత్పురుషు లిట్లని నిశ్చయించి యున్నారు' అనెను.

ఉద్ధవుఁడు-ప్రభూ ! ఉత్తమశ్లోకా ! సాధువులు వెక్కు విధములనుందురు. వారిలో నెట్టి వాఁడు నీకభిమతుఁడు. సజ్జను లాదర పూర్వకముగా ననుష్ఠించు భక్తియు బహువిధములుగా నున్నవి. అం దెట్టి భక్తి నీ పట్ల నుపయోగించుచున్నది ? ఎట్టి భక్తిని నారదాదులగు సత్పురుషు లాదరింతురు? నీవు ప్రధాన పురుషుల కధ్యక్షుఁడవు, లోకాధ్యక్షుఁడవు. జగత్పతీ ! నీకుఁ బ్ర ణతుఁడయి నిన్ను శరణుఁ జొచ్చిన వానికి, నీకనుర క్తుఁడయిన వానికి, నాకు, దీనిని జెప్పవలయును. నీవుపరబ్రహ్మమవు, పరమా కాశమువలె నిర్మలస్వరూపుఁడవు, పురుషుఁడవు, చిదచిత్తులను ప్రకృతులు రెంటికంటెను బరుఁడవు. భగవంతా ! నీవు కర్మము చేతఁగాక నీయిచ్చచేత రామప్రద్యుమ్నాదిగుద్ధాదు లగునానా విధములయినరూపములను గయికొనియవతరింతువు'అనెను.భగ వంతుఁడు 'కృపగలవాఁడును భూతము దేనికిని ద్రోహము సేయని వాఁడును ద్వంద్వములను సహించువాఁడును, సత్యమే సారముగాఁ గలవాఁడును, అసూయాదిదోషములు మనస్సునందు లేని వాఁడును, సర్వత్రసమదృష్టి గలవాఁడును, సర్వమున కుపకార

కుఁడయినవాఁడును, సమస్తదేహములలోపల సాధువయినవాఁడును, మఱికామములచే బుద్ధి కొట్టఁబడి చెడనివాఁడును, ఇంద్రియనిగ్రహముగలవాఁడును, మెత్తనివాఁడును, లోపలను వెలుపలను శౌచము గలవాఁడును, ప్రయోజనాంతరమేదియులేనివాఁడును, లౌకికవ్యాపారములు లేనివాఁడును, మితముగా భుజించువాఁడును, అంతఃకరణము నిగ్రహించినవాఁడును, స్థిరచిత్తుఁడును, నేనే రక్షకుఁడుగాఁగలవాఁడును, నాశుభాశ్రయమును మననము సేయువాఁడును, పరాకుపడనివాఁడును, లోనియభిప్రాయమును దెలియనలవిగాని వాఁడును, ఆపదిలయందు ధైర్యముగలవాఁడును(ఆకలిదప్పిశోకమోహములు జరామరణములనెడు)గుణములఱాఁటిని జయించినవాఁడును, తనదేహమునకు సత్కారమొల్లనివాఁడును, పరులకుసత్కారముసేయువాఁడును, క్షితోపదేశమునందు సమర్థుఁడును, వంచనలేనివాఁడును, కరుణతోవర్తించువాఁడును, చిదచిత్తు లీశ్వరుఁడను మూఁడుతత్త్వముల కలరూపును దెలిసిన వాఁడును, సాధువు. ఇట్లునేను వేదముఖమున నుపదేశించియున్న గుణములను దోషములను డెలిసి స్వపరాశ్రమోచిత ధర్మములనెల్లఁ బరిత్యజించినన్నెయు సాయముగాను నుపాయముగాను భజించువాఁడుసాధుతముఁడు. మఱియునాస్వరూపమెద్దియో నాస్వభావమేమియో నావిభూతు లెంతయో పలుమాఱు విచారించి యెవ్వఁడితర ప్రయోజనములందును దేవతలందును సాధనములందును భావముంచక భజింతుతో వారు నాకుమిక్కిలియు భక్తులు. ఇఁకభక్తి కుపయుక్తమగు లక్షణములను జెప్పెదను. నాదు ప్రతిమలకును నాభక్తజనులదర్శించుటయు, స్పృశించుటయు, నర్చించుటయుఁగాలు

పిసుకుట మొదలగు పరిచర్యలుగావించుటయు స్తుతించుటయుఁ బ్రణామిల్లుటయు గుణకర్మములను గీర్తించుటయు నాకథలను వినుటయుం దక్కరగిలిగియుండుటయు, నన్నుగుఱించిధ్యానము సేయుటయు దొరకిన వెల్ల నాకు సమర్పించుటయు, తన్ను నాకు శేషభూతుఁ డని యధ్యవసాయము గలిగి యుండుటయు, నాజన్మకర్మములను వినువారికిఁ జెప్పుటయు, నా పండుగు దినములగు జయంతి మొదలగు వానియం దుత్సవములు చేసి యుబ్బొంగుటయు, గీతములు వృత్తములు వాద్యములు సభలు మొదలగు వానిచేతి నా యాలయములం దుత్సవములు గావించుటయు, దివ్యదేశములకు యాత్ర పోవుటయు, చాతుర్మాస్య మేకాదశి మొదలగు నేఁడాది పండుగులయం దెల్ల విశేషించి నాకుఁ బూజ గావించుటయు, నా శాస్త్రమగు పంచరాత్రమునఁ జెప్పఁబడిన యుత్తమంబగు పంచసంస్కార దీక్షయు, నావ్రతములయిన యేకాదశ్యుపవాసాదుల నాచరించుటయు, నాయర్చావిగ్రహములను స్థాపించుట యందుఁ శ్రద్ధయును, మఱియు నాకై యింటి పురటితోఁటలను బెలుపలి తోఁటలను, క్రీడాస్థలములను, బురములను, గృహములను, తానొక్కఁడైనను గాని, యందులకు శక్తిలేనిచో నితరులంగూర్చికొనికాని, చేయుటకుఁ బ్రయత్నించుటయు, నాగృహము నూడ్చుటయుఁ, గలయంపిచల్లుటయు, నలుకుటయు, ముగ్గులు పెట్టుటయు మొదలగువానినిగవటము లేక యూడిగమువలెఁ జేసియలంకరించుటయు, దురహంకారము లేకుండుటయు, వంచనమాటలును, చేసినధర్మమును జెప్పుకొనకుండుటయును, గలిగియుండవలయును. మఱి నాకొఱకుఁ దా నిడినట్టి గాని పరులర్పించినట్టి కాని దీపముల

వెలుతురు వీవనలగాలి మొదలగు వానిని దనపనికై యుప యోగించు కొనరాదు. ఒకనికి లోకమునం దేదేది మిక్కిలి రమణీయమైనదో యేదేది మిక్కిలి ప్రియమైనదో యీయా దాని నెల్ల నాకు నివేదింపవలయును. అట్లు చేసినచో నది నా కపరిమితమైన ప్రీతి గలిగించి యత్యుత్తమము ఫలము సొసంగునదగును. భద్రా ! సూర్యుఁడు, అగ్ని, బ్రాహ్మణుఁడు, గోవులు, వైష్ణవుఁడు, ఆకాశము, వాయువు, జలము, భూమి, యాత్మ, సమస్తములైన భూతములను పూజించుట కయిన స్థానములు. నీవు సూర్యునియందు త్రయీవిద్యచేతను 'ఆసత్యేన' మొదలగు మంత్రముల చేతను, అగ్నియందు పురోడాశాజ్యాదులయిన హవిస్సులచేతను, నన్నుఁ బూజింపవలయును. మఱి నన్ను బ్రాహ్మణశ్రేష్ఠునియం దాతిథ్యముచేతను, గోవులయందు యవస తిల పిష్టోదకాదులచేతను విష్ణుభక్తుని యందు బంధువువలె సత్కరించుటచేతను హృదయాకాశమందు ధ్యాన నిష్ఠచేతను వాయువునందు ముఖ్య ప్రాణమును బుద్ధిచేతను జలమునందు జలగంధ పుష్పధూపాక్షతాదులచేతను స్థండిలభూమియందు మూలమంత్రముచేతను, హృదయాద్యంగములందు మంత్రన్యాసములచేతను, తన యాత్మయందు శాస్త్రవిరుద్ధముగాని కామములచేతను దేవ మనుష్యాదిసమస్త భూతముల శరీరములందు క్షేత్రజ్ఞునిగాను (జీవశరీరకునిఁగాను)ఇట్లునన్ను రాగద్వేషములు మాని సమచిత్తముతో యజింపవలయును. ఈసూర్యాదిస్థానములందు శంఖ చక్రగదాంబుజములతోడను గూడినదియుఁ జతుర్భుజములు గలదియు శాంతంబయినదియు నగు నారూపమును సమాహి

తుఁడై ధ్యానించి యర్చింపవలయును.ఎవ్వఁడు సమాహితుఁడై నన్ను వైదికకర్మములచేతను స్మార్తకర్మములచేతను నన్నే యజించు చున్నాఁడో వాఁడును నాప్రతిమలయెడ దర్శనాదులు చేయువానివలె నాయందుఁ బ్రేమాత్మకమును నవిచ్ఛిన్నము నగు భక్తినిబొందుచున్నాడు.నాభక్తియు సత్సంగమము వలననే కలుగుచున్నది. శుద్ధవా! సత్సంగమమువలనఁ గలుగునట్టి భక్తియోగము తప్ప నాప్రాప్తికిఁ బెక్కని యుపాయము మఱియొకటి బహుతరముగాఁగలుగదు. ఏలనఁగా సజ్జనుల కృపాయము నుపేయమును నేనేయగుదును జుమీ. కాన వారితోడి కూడికవలననే నాయందు భక్తియుఁ దన్మూలమున ముక్తిప్రాప్తియుఁ గలుగును. యదునందనా!ఇఁక బరమరహస్యమయిన మఱియొకటి నీదె చెప్పుచున్నాను వినుము. అది మిక్కిలి గోప్యమయినది. నీవు నాకు భృత్యుఁడవనియు నుహృదుఁడవనియు సఖుఁడవనియుఁదలఁచి దానిని నీకుఁ జెప్పుచున్నాను. ఇది పదునొకండవయధ్యాయము.

కృష్ణుఁడు ఉద్ధవునకుఁ[1] భక్తియోగమును జెప్పుట

భగవంతుఁడు-ఉద్ధవా!నన్ను వర్ణాశ్రమములకుఁ దగిన(కర్మ)యోగముగాని, వివిక్తాత్మోపాసనరూప మగు సాంఖ్యమును గాని, యహింసాదిరూపమగు ధర్మము స్వాధ్యాయమును తపమును త్యాగమును యిష్టాపూర్తముగాని, దక్షిణలుగాని, యేకాదశ్యుపవాసాదివ్రతములును పంచ మహాయజ్ఞములును

---

1 ఇంతపఱకు భక్తియోగమును దానిపెక్కుంగములును జెప్పి యిప్పుడు దుష్కరమని యుద్ధవునకుఁ దోఁచుటచే సులభోపాయమగు ప్రపత్తిని చెప్పుచున్నారని తెలియునది.

రహస్యమంత్రములును గంగాదితీర్థములును, శౌచాచమనాది నియమములును బాహ్యాంతరింద్రియనియమనములగుయమము లివియెల్లసత్సంగమమునన్నుహృదయమందు నిలుపుటల్లు, నిలిపి వశీకరింపఁజాలవు. ఏలన సజ్జనసంగము మనసునకు నేను దప్పఁ దక్కిన వానియందుఁ గలుగు సంగమములనెల్ల నపహరించుచు నాయందే సంగమము గలిగించుచున్నది. యోగాదు లిట్టివి గావు [1]సజ్జనులతోడి సంబంధముచేతనైత్యులును రాక్షసులును పశులును మృగములును గంధర్వులునప్సరసులును నాగులును సిద్ధులును జారణులునుగుహ్యకులును విద్యాధరులును మనుష్యాలయందు వైశ్యులును శూద్రులను స్త్రీలును నంత్యజులును మొదలుగాఁగల రజస్తమఃప్రకృతులును, ఆయాయుగమందుఁ బొక్కండ్రు నాపదమును బొందిరి. మఱి వృత్రాసురుఁడును బ్రహ్లోదుఁడును మొదలగువారును వృషపర్వుఁడును బలియును బాణుఁడును మయుఁడును విభీషణుఁడును, సుగ్రీవుఁడును, హనుమంతుఁడును, భల్లూకమగు జాంబవంతుఁడును, గజేంద్రుఁడును గృధ్రమగు జటాయువును, వైశ్యుఁడగు తులాధారుఁడును, బోయయగు ధర్మవ్యాధుఁడును, స్త్రీయగుకుబ్జయు, గోపికలును, మునిపత్నులగు బ్రాహ్మణస్త్రీలును మఱియు నితరులును నాపదమును బ్రాపించిరి. వీరందఱును వేదములను నధ్యయనముచేసి వారుగారు. గొప్పవా రగుసాధువుల నుపాసించిన వారును గ్రాసు, వ్రతము లాచరించినవారుగారు, తపములుసల్పినవారును

---

1 సజ్జనులతోడి సంబంధమువారి కులమునందుఁ బుట్టుటగాని వారున్న దేశమందు వర్తించుటగాని వారిదర్శన స్పర్శనములకుఁ బాలగుటగాని దీనిని తెలియునది.

గారు, అయినను సత్పురుష సంగమువలన నన్నుఁ బొందిన వారయిరి, గోపికలు వేండ్రమగు కామభావముచేతను, గోవులును, గవమద్దులు మొదలయిన నగములును మృగములును నన్ను జూచుచుఁ దాఁకుచును మిక్కిలి యాదరము నెఱపుటచేతను, గాళియుఁడు మొదలయిన నాగులు తీవ్రమయిన కోపభావము చూపుటచేతను, వీరందఱును దమోగుణము గ్రమ్మిన బుద్ధుల గలవారయ్యును సిద్ధినొంది యనాయాసముగా నన్నుఁబొందిన వారయిరి. నన్ను, యోగముచేతను సాంఖ్యము చేతను దానవ్రత తపములచేతను యజ్ఞములచేతను శాస్త్రాధ్యాపనముచేతను స్వాధ్యాయముచేతను సన్న్యాసముచేతను నెంత ప్రయత్నించినను బొందనలవిగానట్టి నన్ను, వీరెల్లను బొందిరిచుమీ. అక్రూరుఁడు నన్నును బలరాముని మథురకుం దోడ్కొని పోయినపుడు గోపికలు నాయందు మిక్కుటమయిన వలపుచేతఁ జిత్తము లనురక్తములై యున్నందున మన న్నసందు దుఃఖము దుస్సహమైపట్టి వీడింపఁగా మఱి దేనివల నను వారికి సుఖము చూపట్టినది గాదయ్యె. బృందావనమందు వారికిఁ బ్రియతముండగు నన్నుఁగూడి విహరించునపు, డే రాత్రి లరక్షణమువలెఁ గడచిపోయినవ్రా యవియే మరల నేను లేకుండినపుడు కల్పములవలె నారికి నయినవిచుమీ. వారు నాయందలి మక్కువలవలన బుద్ధులెల్ల నాయందుఁ గట్టువడియుండుటవలన మునులు సమాధియందుఁ దమ్మెఱుంగకుండు నట్లును, సముద్రజలములందుఁ జొచ్చిన నదులు నామరూపము లడంగి యుండునట్లును, తమ దేహములనుగాని దూరమునున్న దానినిగాని దగ్గఱ నున్న దానినిగాని పర

వశులై తెలియుదురు. ఆయబల లజ్జలయ్యును, నా యందే మరులుగొని నా స్వరూపము నెంతమాత్రము దెలియక యెన్నను జారుడనిఁగాను రమణుడనిఁగాను వలచి పరమబ్రహ్మంబగు నన్నుఁ బొందిరి. ఇట్లు సజ్జనసంగమువలన వందలకొలఁది నన్నుఁ బొందిరి చుమీ. ఉద్ధవా! కాఁబట్టి నీవు విధిని నిషేధమును విధినిషేధశాస్త్రములందుఁ బ్రతిపాదితము లగు [1]ప్రవృత్తినిని నివృత్తినిని, శ్రోతవ్యమును శ్రుతమునును దిగ విడిచి సమస్తదేహులకు నాత్మభూతుండయిన నన్నొకనినే యుపేయముగాను బితగాను రక్షకుఁడు గాను శేషియనియు నాకుఁగల యన్నిభావముల చేతను శరణుఁజొరుము. దానివలన నీకు దేని వలనను భయము గలుగని నన్నే పొందఁగలవు' అనెను. అందుల కుద్ధవుఁడు "యోగీశ్వరేశ్వరా! నీవు చెప్పినది వినఁగా నా కుపాయవిషయమగు సందేహము వీడినది. మఱి యాత్మను గుఱించిన సంశయమో విడువకున్నది. ఆసంశయము చేత నామనస్సు భ్రమించుచున్నట్లున్నది" యనెను. భగవంతుఁడు—ఆజీవుఁడు ప్రాణవాయువుతోఁ గూడిన శరీరమందు హృదయచ్ఛిద్రమను గుహను జొచ్చి వెలుంగుచు ఘోషముతోఁ గూడినవాఁడై మనస్సునకు మాత్రము గ్రాహ్యము గావు ననే ప్రక్కనున్నవారికిఁ దెలియరానంత సూక్ష్మమును నగురూపమును బొంది యుచ్చరించునపుడు స్థానప్రయత్నవశమున

---

1. ఇందులకుఁ 'తస్మాత్త్వ ముద్ధ వోత్సృజ్యచోదనాం ప్రతిచోదనాం।ప్రవృత్తించ నివృత్తించ శ్రోతవ్యం శ్రుతమేవచ॥ మామేకమేవ శరణమాత్మానం సర్వదేహినామ్। యాహిసర్వాత్మభావేన మయాస్యసి వ్యకుతోభయమ్॥ అని మూలము దెలియునది.

మాత్రాదిహ్రస్వములునుగకారాదివర్ణములునుఉదాత్తాది స్వరములునై మిక్కిలిస్థూలమగుచున్నది. కట్టియయందున్న యగ్ని మొదట సూక్ష్మముగా నుండును. పిదప దానిని జిలుకఁ దొడఁగినపుడు వేఁడిమిరూపముగా నుండును. పిదపఁ గట్టియయందు మఱింత బలముగాఁ జిలుకఁగా నాకాశమందు గాలి సహాయపడుటవలన మిణుఁగురుగా నేర్పడును. అంతఁ గ్రమముగాఁ బెద్దపెఱిగి మవిన్నుచేఁ జక్కఁగా మంటమండును. అట్లె నావాఙ్మనోవ్యాపారంబయిన యీవాణియు వ్యక్తినొంది నాకు శరీరమైనాయధీనమై యుండును. వాక్కు వ్యాపారము మాత్రమే యాత్మకు లోనయినదిగాదు. పాదేంద్రియవ్యాపారమగు గతియు, పాణీంద్రియవ్యాపారమగు కర్మమును, ఉపస్థవ్యాపారమగు రతియు, పాయువ్యాపారమగు మూత్రపురీషోత్సర్గమును, ఘ్రాణేంద్రియవ్యాపారమగుగంధాఘ్రాణమును, రసనేంద్రియవ్యాపారమగు రసగ్రహణమును, చక్షురింద్రియవ్యాపారమగు దర్శనమును, త్వగింద్రియవ్యాపారమగు స్పర్శమును, శ్రోత్రేంద్రియవ్యాపారమగు శ్రవణమును, మనోవ్యాపారంబగు సంకల్పమును జ్ఞానమును, అహంకారవ్యాపారమగు నభిమానమును, బహుకార్యములకు సూత్రమునలె నాధారమగు మహత్తు వ్యాపారమగు నధ్యవసాయమును, మఱి గుణత్రయపరిణామములగు దేహేంద్రియాదిగుణములును నా వ్యక్తియగును. మూఁడుగుణములకు వశ్యుఁడై, యీపార వశ్యమును బట్టి బ్రహ్మాండములోపల నుత్పత్తిమరణములొందుచు స్వరూపమునందు వృద్ధియుఁ బరిణామమును లేకయేక రూపుండై నిత్యుండై కాలమున దేహమునందును దాని

యనుబంధులందును నహంకార మమకారములుగలిగియుండుట చేత దనచైతన్యశక్తి ప్రిదిలి దేవుఁడు మనుష్యుఁడు మొద లయిన పెక్కురూపములొంది, విత్తనము లొక్కజాతివైనను విత్తిననేల కనుగుణముగా వృద్ధియును క్షీణతయును నొంది పెక్కువిధములఁ జూపట్టునట్లు, వెలయుచున్నాఁడు పటము నందు నూలిపోఁగులు గ్రుచ్చి యల్లంబడియున్నట్లు, సమస్తము లయిన యింద్రియప్రాణజాలమంతయు సంసారమందు గ్రుచ్చి యల్లంబడియున్నది. అట్టి యీసంసారవృక్షము ప్రవాహ రూపమున ననాదియైనది;కర్మాత్మకముగాన ప్రవృత్తి స్వభావమైనది. అది పువ్వులగు కర్మములను బండ్లగు సుఖదుఃఖములను గనుచున్నది. ఈసంసారవృక్షమునకుఁ బుణ్యపాపములు రెండును బీజములు. రాగద్వేష భయాదులను వేళ్లు నూఱు. మూఁడు ప్రకాండములు పంచభూతములు స్కంధములు. శబ్దాదులగు పంచవిషయములు దానియందుఁ బుట్టుచున్నవి. జ్ఞానకర్మేంద్రియములు పదియును మనస్సును దానికి శాఖలు. జీవపరమాత్మలను రెండుపక్షులున్నహృదయకమల మనుగూఁడు దానియందుఁ గలదు. దానికి వాతపిత్తశ్లేష్మము లని మూఁడువల్కలములు. భోగమోక్షములను ఫలములు రెండు. అందుఁ బ్రవృత్తికర్మమునకు భోగమును నివృత్తి కర్మమునకు మోక్షమును ఫలమగును. అధ్యాత్మికాది తాపత్రయమనెడి పాదునం దది నెలకొనియున్నది. ఆవృక్షమునందు సుఖదుఃఖరూపమైన యొకఫలమును గ్రామమునందుఁ జరించు విషయాభిలాషలగు జీవులనెడు గ్రద్దలు దినుచున్నవి. మోక్ష మనెడి మఱియొకఫలమును నరణ్యమునందు వసించుచుండెడి

హంసలు దినుచున్నవి. పురుషుఁడొవఁడు, సంసారవృక్షమును బ్రకృతిపరిణామమైనదనియు దేవత్వమనుష్యత్వాదులగు వెక్కు రూపములు గలదనియు గురునులచేతి నెఱుఁగునో వాఁడు వేదములను నెఱింగినవాఁడగును. ఇట్లు స్థిరభక్తితోఁగూడిన గురూపాసనముచేత * విద్యనభ్యసించి యూవిద్యయను వాఁడికుఠారముచేతఁగొని దేనినలనను భయములేక జీవునియందు శరీరసంబంధమనెడి వృక్షమును, నిశ్శేషముగాఁ బోకార్చి యప్రమత్తుఁడై యాత్మయగు నన్నుఁబొంది యంతి నాయాయుధమును దిగవిడువుము. ఇది పండ్రెండవయధ్యాయము.

సత్త్వాదిగుణ జయోపాయములను జెప్పుట.

భగవంతుడు—సత్త్వమురజస్సు తమస్సును, ప్రకృతి పరిణామమయిన మనస్సు గుణములుగాని యాత్మకు గుణములు గావు. సత్త్వమును వృద్ధినొందించి దానిచే రజస్సును దమస్సునును నాశముచేయవలయును. అయినను సత్త్వముండి నేని గుణమునకు లోనగుట గలుగుచున్నదిగదా యన్నచో, సత్త్వముచేతనే (అనఁగా సత్త్వముచే బనించిన జ్ఞానముచేతనే) సత్త్వమును నాశముచేయవలయును. పురుషునికి నాభక్తియనెడు ధర్మము, సత్త్వము వృద్ధినొందఁగాఁ గలుగుచున్నది. ఆసత్త్వమును సాత్త్వికములయిన యాహారములను సేవించుటచేత వృద్ధినొందుచున్నది. ఆసత్త్వము వృద్ధినొందఁగా మద్భక్తియును ధర్మమును నహరహ రభ్యాసమువలన నతిశయించుచున్నది. సత్త్వము తనంతట రజస్తమస్సులను నాశముసేయనేరదు. సత్త్వమువలన భక్తిరూపమగు ధర్మము

* ఇట్టివిద్యయనఁగా న్యాసమైనను ఉపాసనమైనను గావచ్చును.

వృద్ధినొంది రజస్తమస్సులను నాశముసేయుచున్నది. కాఁబట్టి సత్త్వవృద్ధియు త్తమమగుమోక్షోపాయమగును. 'రజస్తమస్సులు నాశమొందినను వానికి మూలమై యనాదిగానున్న పుణ్యపాపములు ముక్తి ప్రతిబంధకమగును గాన సత్త్వవృద్ధి మోక్షోపాయమె?ట్లందువా! రజస్సును దనుస్సును రెండునుహానములు కాఁగా నారెంటికి మూలమై పుణ్యపాపరూపమైన యధర్మమును వేగముగా నశించుచున్నది. సత్త్వవృద్ధికి హేతువు సాత్త్వికోపాసనము మాత్రమేకాదు మతియు (వేదము పంచరాత్రము భగవద్వైభవ ప్రకాశకమయిన యితిహాసపురాణాదులు మొదలగు సాత్త్వికములైన) యాగములును (విషయలంపటులనుగాక సాధువులయిన) జనులును, (గంధోదకనురా మద్యాదులుగాక గంగాది పుణ్య) జలములును, (పాన స్త్రీద్యూతాదులు గలదేశముగాక వివిక్తమగు) దేశమును, (అర్ధరాత్రము మొదలగునవిగాక బ్రహ్మముహూర్తము మొదలయిన) కాలమును (ఫలాభిసంధితోఁజేయఁబడినది గాక యదిలేనట్టి కర్మమును, (సావిత్రమును యాజ్ఞికమునగు) జన్మమును (దేవతాంతర విషయముగాక విష్ణువిషయంబగు) ధ్యానమును, (దేవతాంతరస్మారకముగాక విష్ణుస్మారకంబైన) మంత్రమును, (తాపము పుండ్రము నామము మంత్రము యాగమునఁనెడి పంచవిధ) సంస్కారమును — ఈపదియును సత్త్వవృద్ధికి హేతువులు. భగవద్భక్తులగువెద్ద లాహారాగమాదులం దేయే దానిని మేలయినదిగాఁ జెప్పుదురో యదియే సాత్త్వికము. ఏయేదానిని నిందింతురో యది తామసము. ఏయేదానిని బాగడకయుఁ దెగడకయునుందురో యదిరాజసము. పురుషుఁడు

సత్త్వము వృద్ధినొందుటకు సాత్త్వికములయినవానినే సేవింప వలయును. అట్టి సత్త్వము వృద్ధివలన మద్భక్తిలక్షణ మగు ధర్మము గలుగుచున్నది. ఆ భక్తివలన నాస్వరూప స్వభావములను గలరూపునఁ దెలియు జ్ఞానము గలుగుచున్నది. దాని వలన నాస్వరూపాదులను గుఱించిన స్మృతి యెడతెగక కలుగుచున్నది. దానివలన శబ్దాదివిషయాంతరములను గుఱించిన స్మృతి నిశ్చయముగా లేక పోవుచున్నది. అనఁగా విషయాంతరములకు విముఖమై మద్విషయ స్మృతి సంతానరూపమైన జ్ఞానముగలుగుచున్నది. [1]గుణత్రయముచే బుట్టునట్టి దేహమెట్లు సత్త్వమును బుట్టించి పెంచి దానిచేఁ బుష్టినొందిన భక్తిమూలమునఁ దనకుమూలంబైన యా గుణత్రయమును దొలఁగించి దానును దొలంగఁగల' దని యడుగుదువా? ఒక వనమందు వెదు ళ్లొకటి నొకటి రాచుకొనుట వలనఁ బుట్టిన యగ్ని తనకు మూలమైన యా వెదురు టడవిని దహించి పిదపఁ దాను నుడిగి పోవుచున్నది. ఇట్లే మూఁడు గుణములును వైషమ్యము నొందుటవలనఁబుట్టిన దేహము, తనకు మూలమైన యా గుణత్రయమును దొలఁగించి యంతఁ దాను నివర్తించుచున్నది' అనెను.

---

1. గుణములు మూఁటియొక్క పరిణామము దేహము. అది సాత్త్వికమైన యూహాదులచేత మఱలఁ దనయందలి సత్త్వమును వృద్ధి నొందించుచున్నది. దానివలన భక్తియోగము జనించి రజస్తమస్సులు నిశ్శేషముగా నశింపఁజేయుఁగా దేవసంబంధమునకు నిమిత్తమగుపుణ్యపాపము లనెడి యధర్మములు రెండును హతములగుచున్నవి. అవి హతములుగాఁగా వానివలనఁ గలుగుదేహమును నశించుచున్నదని చెప్పఁబడెను. ఇట్లు గుణములవలనఁబుట్టిన దేహమె సత్త్వవృద్ధిభక్తి పుష్టిద్వారా గుణములను దొలఁగించి తానునుదొలఁగుచున్నది. ఇందులకేదృష్టాంతముగా వేణువులనఁబుట్టినయగ్ని చెప్పఁబడెను.

ఉద్ధవుఁడు—కృష్ణా! మనుజులు బహుతరముగా శబ్దాది విషయము లాపదలకుఁబట్టయినవిగా నెఱుంగుదురు. అట్లు తెలిసి యుండియు వారెట్లు [1]కుక్కలవలెనుగాడిదలవలెను, గొఱియలవలెను మరల నావిషయములనే యనుభవించుచున్నా? రని యడిగెను. భగవంతుఁడు-ఆత్మవిషయమై ప్రమత్తుఁడగువాఁడు దేహాత్మలసంసర్గమువలన దేహమునే యాత్మగాఁదలఁచి 'నేను స్థూలుఁడను, నేను కృశుఁడనని' హృదయమం దహంకారబుద్ధి నొందుచున్నాఁడు. అట్టి బుద్ధివలన వాని మనస్సు సాత్త్వికాహంకార కార్యమువలన రజోగుణకార్యములగు కామక్రోధములు మహాపాపములగుటచే భయంకరములగు వానిని బొందుచున్నది. మన స్సట్లు రజస్సుతోఁగూడఁగా దానికి [2]సంకల్పమును వికల్పమును గలుగుచున్నవి. అనఁగా రజోగుణము విజృంభము గలిగించుచున్నది గాన, దానివలన మనస్సునకు సంకల్పవికల్పము లనెడు వ్యాపారములు గలుగుచున్నవి. హేయములందు భోగ్యము లనెడి బుద్ధి సంకల్పము గలిగించుచున్నది గాన,యట్టి సంకల్పమువలన భోగములందిచ్ఛయగు కామముపుట్టుచున్నది.

---

1. కుక్క, మొఱుఁగుచున్నను ఆఁడు కుక్కను వెంబడించు చున్నది. గాడిద, స్త్రీ కాలం దన్నుచున్నను ఆఁడు గాడిదను వెంబడించు చున్నది. గొఱియ! తన్నుఁ జంపుటకుఁ గొనిపోవుచున్నను ఆఁడు గొఱియ వెంటఁబడుచున్నది. కాన, వీని నిట దృష్టాంతీకరించుట తెలియునది.

2. సంకల్పమనఁగా నేను మనుష్యుఁడు నేను బహువత్సరము లభిమానము నకు ననుగుణముగా అన్నము పాలు మొదలగు హేయములందు భోగ్యము లను బుద్ధి గలుగుట వికల్ప మనఁగా స్రక్చందన స్త్రీ గతాకారవైవిధ్య ప్రతిపత్తి రూపమైనది. రజస్సు కర్తృములనుజేయించునది. తమస్సు వాని యందలి దోషములను గనుఁగొననీక కప్పుచున్నది. కామ మనఁగా భోగేచ్ఛ.

దేహాభిమాని యగు జీవుఁ డాభోగ్యములందలి చక్కందనము తీయందనము మొదలగు గుణములనే తలపోయుచుండుటకు వానికి వానియందలి కామము సహింపరాక మిక్కుటమగుచున్నది. అట్లు వాఁడు దుస్సంగమగు కామమునకు వశగతుఁ డగుటవలనను భోగ్యముల నొసంగునని తాను దప్పఁదలంచిన కర్మములు, వాస్తవమునకుఁ బిదప దుఃఖములనే యొసఁగునవియని చక్కఁగాఁ గనుఁగొని యుండియు, నింద్రియములను జయింపనందున రజస్సు నురవడిచేఁ దెలివి చెడి యట్టి కర్మములను జేయుచున్నాఁడు. రజస్తమస్సుల చేత బుద్ధి విభ్రష్టమై మూఢముగా నున్నను వివేకి యగు వాఁడు మనస్సును సంకల్ప వికల్పములకు వశము గాకుండు నట్లరికట్టి [1]శబ్దాదివిషయ మాపదలకుఁ బట్టయిన దని వాని యందుదోషములనే కనుఁగొనుచు నావిషయములందుఁ బ్రమాదము నొందక విషయానుభవమందుఁ దగులువడక యుండును. మఱి యిట్టిదోషములనే కనుఁగొను చుండుటచే విషయ భోగములం దాసక్తి విడిచి, యప్రమత్తుఁడై యాయా యుచిత కాలమునుదప్పక [2]యాసనజయమును ప్రాణజయమును బడసి,

---

1. సంకల్పమువలన ఆత్మానుగుణములగు వస్తువులెల్ల భోగ్యములుగాఁ బోఁచుచుండును. దానివలన భోగ్యములం దిచ్ఛ-ఆవఁగా కామము పుట్టును. ఆ కామ మాభోగ్యవస్తువు లందలి గుణములనే తలపోయుచుండుటవలన మఱి మఱి హెచ్చును. వానియందలి దోషములనే కనుఁగొనుచుండినచో అది మిక్కిలి తగ్గునని వివేకి విషయ మిట చెప్పుట తెలియునది.

2. చాలసేపు కూర్చుండినను శ్రమముగలుగ నీకుండునట్టి యభ్యాస విశేషమె ఆసనజయము. ప్రాణములను పూరణరేచ కుంభనములచేత వశీకరించుటయె ప్రాణజయము.

యలనుఁడు గాక, మిల్లగా మనస్సును శుంభాశ్రయ భూతుఁడగు నాయందు నెలకొలిపి సమాధినిష్ఠుఁడు గావలయును. నేను హంస రూపమున నవతరించియుండినపుడు నాకుశిష్యులయిన సనకాదులు నావలన యోగమును విని 'సమస్తములయిన విషయముల నుండి మనస్సునాకర్షించి, నాయందే నివేశింపవలయును' అని యింత మాత్రమె దాని నితరుల కుపదేశించిరి వారయిరి'-అనెను.

ఉద్ధవుఁడు—'కేశవా ! నీ వేరూపమున సనకాదులకు నెట్లు యోగము నుపదేశించితివో యారూపమును నాకుఁ దెలుపఁ గోరుచున్నాను' అని యడిగెను.

భగవంతుఁడు—[1]హిరణ్యగర్భుండగు బ్రహ్మకు మానసపుత్రులయిన సనకాదులు దెలియరానంత సూక్ష్మమై యసాధారణమై యొప్పుయోగము ప్రకారమతనినడిగిరి. వా:రతనితో—'ప్రభూ ! మనస్సు శబ్దాదివిషయములందు భోగ్యములని ప్రవేశించుచున్నది. ఆవిషయములను స్మరింపఁబడుచుండుటవలన మనస్సునందుఁ బ్రవేశించుచున్నవి కాని దానినుండి తొలఁగవు. ప్రకృతిబంధ మనర్థమైనదని నిశ్చయించి దానినుండి విముక్తి నొంది విషయముల నత్యంతము దూఁటఁగోరువానికి నా రెండును నొకటినొకటి వీడుట యెట్లు ?—అనఁగా విషయములు మనస్సును విడుచుటయు మనస్సు విషయములను విడుచుటయు నెట్లు? అని సంశయముగా నున్నది' యని యడిగిరి. వా రట్లడుగఁగా భూతభావనుండయిన యా మహా దేవుఁడు బ్రహ్మ దా నెంత యా ప్రశ్నకుఁ బ్రతివచన మాలోచించినను గర్మముచేత జ్ఞానము సంకోచించి సర్వజ్ఞుఁడు కాకుండుట వలనఁ

1. ఇట ప్రస్తావవళమున హంస సనకాది సంవాదము చెప్పఁబడినది.

దెలియ నేరఁడయ్యెను. అపుడా దేవుఁ డా ప్రశ్నము దరిను త్తరింపఁగోరి నన్నుఁదలంచుకొనెను. నేనపు డాతనికడకు హంస రూపమున వచ్చితిని. నన్నుఁజూచి యీ సనకాదులు బ్రహ్మను మున్నిడి కొని నాకుఁ బ్రత్యుత్థానాదులుచేసి పాదమున కభివందనము గావించి తామడుగవలసిన దానిని విడిచి 'మీ రెవ్వ' రని యడిగిరి. ఇట్లామునులు తత్త్వమును దెలియఁగోరి నన్నడుగఁగా, ఉద్ధవా! వారికేమి చెప్పితినో వినుము. నేను వారితో 'విప్రులారా! జగమునంగల చిత్తులు నచిత్తులు నగువస్తువులన్నియు నాశరీరమై యుండుటచే నవి యన్నియు నే నొక్కఁడనే యగుదును గాని యవి వెక్కులువేఱు వేఱు కానేరవు. నన్ను వీడి వేఱైయున్న చిత్తుగాని యచిత్తుగాని యొకటియు లేక యన్నియునేనైయై యుండఁగా మీ రెవరని యడుగుట యెట్లు సరిపడును? అడిగినట్టి మీరు మదాత్మకు లగుటచే నేనేయగుదును. మీ రడుగఁగా బదులు చెప్పవలసిన విషయమును సర్వము మదాత్మకముగాన నేనేయగుదును. ఇట్లు, అడుగువాఁడును బదులుచెప్పువాఁడును బదులుచెప్పవలసిన విషయమును సర్వమునేనేయైయుండఁగా 'నీవెవ్వ'రని యడుగుట యెట్లుపొసఁగును? నేను సర్వాంతరాత్ముఁడని యెఱింగి మీ రిట్లడిగినది పొసగదయ్యె. మఱి యజ్ఞానమువలన సర్వమును శరీరముగానే తలంచినవారడిగిరన్ననో నేను హంసరూపమునఁ బ్రత్యక్షమైతిని. నాకు సజాతీయములగు జంతువులన్నియుఁ బంచభూతములచే సమానముగారచితములై యుండఁగా 'మీ రెవ్వ?' రని వావిడిచియడుగుటయు నట్టియజ్ఞానులకు సంమతమువట్టినిరర్థకమేయగును. మనస్సుచేతఁగానివాక్కుచేతఁగాని చూపుచేతఁ

గాని మతి తక్కిన యింద్రియములచేతఁగాని నేనొక్కఁడనే గ్రహింపఁబడుచున్నానుగాని నాకంటె వే ఱొక్కటిగాదని యెఱుంగుము. పుత్రులారా ! మదాత్మకుఁడగు జీవునకు దేహ సంబంధముండునపుడు మనస్సు విషయములందును విషయ ములు మనస్సునందును జొచ్చుచున్నవి. కనుక నామనస్సును విషయములు నొండొంటిని వీడవు. అందులకు దేహసంబంధమే నిమిత్తము. దేహసంబంధముండఁగా మనస్సు మాటిమాటికి విషయములను సేవించుచుండుట వలన వానియందుఁ జొచ్చు చున్నవి. విషయములును మనస్సునందుఁ జొచ్చుచున్నవి. మనస్సులోపలిది; విషయములు వెలుపలివి. కనుక రెండు నొకటి యం దొకటి చొచ్చుట యెట్లందువా? విషయములు మనస్సునఁ బుట్టుచున్నవి- యనఁగాఁ బూర్వసంస్కారవశమున దానియందు బ్రకాశించుచున్నవి; దానివలననే మనస్సును వానిని విషయీ కరించుచునుండును. ఈ విషయములు మనస్సునందు మిక్కిలి యుఁబ్బఁదుకొని వెడలిపోవకుండును. నారూపమును జింతించు చుండినయెడల మనస్సును విషయములును రెండు నొండొంటిని వీడుచున్నది. దానివలన దేహసంబంధమును నివర్తించు చున్నది. జాగ్రత్తు స్వప్నము సుషుప్తి యని యీమూఁడ వస్థలును బ్రకృతిగుణములవలనఁ గలిగి యంతఃకరణవ్యాపార నిమిత్తములై యుండును. జీవుఁ డీవ్యాపారములకెల్ల విల క్షణుఁడు. వాఁడు వానికెల్ల సాక్షిగానుండునని చెప్పఁబడు చున్నాఁడు. జీవునకు దేహసంబంధరూపమగు సంసారబంధము మనస్సునకు శబ్దాదివిషయములందు భోగ్యము లనెడి బుద్ధిని గలిగించుచున్నది. ప్రకృతి వివిక్తుఁడును మదాత్మకుఁడు నగు

జీవునకు స్వరూపముచే జాగరాదులగు మూఁడవస్థలుగలుగవు. అట్టి యాత్మ స్వరూపమును గల రూపున ననుసంధించుచుండిన యెడల విషయములందు భోగ్యము లనుబుద్ధి వీడును. అది వీడఁగా విషయములును మనస్సును బరస్పర మావేశించుట వీడును. దానివలన దేహసంబంధము వీడును. దానిచేత విషయ సుఖదుఃఖములెల్లవీడి నిరతిశయానందప్రాప్తి గలుగఁగును. అనాదియగునహంకారముచేత నాత్మకు బంధము గావింపఁబడినది. ఆబంధము పరమపురుషార్థమును విఘాతము సేయునట్టిది. దీని నెఱింగినవాఁడు సంసారబంధము నెడ విర క్తినొంది జాగరాదులనెడుమూఁడవస్థలనతిక్రమించియున్న యాత్మస్వరూపము నందు నెలకొని సంసారబంధమునుండి యెట్లు విడివడుదునాయను చింత దిగవిడువవలయును. పురుషునకు దేవుఁడని మనుష్యుఁడని నానావిధముల నాత్మయున్నదని తప్పఁదలంచినట్టిబుద్ధి దేహాత్మలకు భేదమును బ్రతిపాదించు యుక్తులచేత నివర్తింపకుండువఱకును, స్వప్నము గనుచుండువాఁడు దానిని స్వప్నమని తలఁపక జాగరమనియే తప్పఁదలంచునట్లు, అట్టివాఁడు జాగరావస్థయఁదుండినను సుషుప్తినివలె నజ్ఞుఁడేయగును. ఎప్పుడునుజ్ఞానైకరూపుఁడై యుండునాత్మకు నితరములైన దేవమనుష్యాద్యాకారములు లేవని ముక్తాత్మ స్వదర్శనముచేతఁ దెలియును కనుక నాదేవాదిశరీరములచే, బాలుఁడు వయసుకాఁడు బ్రాహ్మణుఁడు ననియివి మొదలుగాఁగలుగు భేదమును వానిబుద్ధులును దానికి హేతువులయిన యితరములగు దోషములును స్వప్నమును గాంచువాఁడందుఁ గనినవిషయములును మేలుకొనఁగాఁగల్లలని తెలియునట్లు, ముక్తాత్మకు ననిత్యము లని తోచును.

జీవుఁడు జాగరావస్థయందుఁ బ్రతిక్షణమునుబరిణామ మొందుచు సుఖదుఃఖాదులను గలిగించుచుండుటచే ధర్మముగాఁగలశబ్దాది విషయములను ననుభవించుచున్నాఁడు. స్వప్నమం దా జాగరావస్థయం దనుభవించిన వానికి సదృశములయిన విషయముల ననుభవించుచున్నాఁడు. సుషుప్తియం దా విషయభోగముల నుపసంహరించుచున్నాఁడు. ఈ మూఁడవస్థలయందును జీవుఁడొక్కఁడేకాని యొకొక్కఁ యవస్థకును నొకొక్కఁ జీవుఁడుగాఁడు. ఎట్లన నిదురించునట్టి నేనే మేలుకొంటినని స్మృతి యాజీవునికిఁ గలిగియున్నది గాన, యీయవస్థలన్నిట జీవుఁడొక్కఁడేకావలయును. మఱి యాజీవుఁడు కర్మనిమిత్తములగు ప్రాకృతేంద్రియములను బ్రవర్తించుచుండునుగానఁ ద్రిగుణవృత్తులయిన జాగరాదులకు ద్రష్టయై యుండును. మనస్సునకుఁగలిగెడి యీ మూఁడవస్థలును వానివాని కర్మమున కనుగుణమయిన సాసంకల్పముచేత మనోనిష్ఠములయిన సత్త్వాది గుణములను బట్టి నీయందుఁ (అనఁగా మదాత్మకుఁడయిన జీవునియందు) జేయఁబడినవనియిట్లు విచారించి నాప్రాప్తికి సాధనమగు నాయుపాసనమే పరమప్రయోజనమను విషయము నిశ్చయించి హృదయమందుఁగల సకలసంశయము లనెడివ్యాధిని ననుమానము చేతను వేదాంతవిచారవైరాగ్యముల చేతను వాఁడియగు జ్ఞానమనెడు కత్తిచేతను ద్రుంచి నన్నుభజింపుఁడు. ఈదేవాది శరీరములును దన కుపభోగ్యములయిన విషయములన్నియును దా మే యాత్మలన్నియు భోగ్యములనియు భ్రమము గలిగించుచుండును. వాని వలన మనస్సునకు సంకల్పవికల్పములు గలుగుచుండును.దాని సాధనమును, దృష్టముగాని సాధ్యములు, వినష్టము

లే. అవి మిక్కిలియుఁదిరుగుచున్న కొఱవిచక్రమువలె నుండుఁను;
కనుక నీచందము లయినవిగా ననుమానింపవలయును. మఱి
యు జీవస్వరూపము జ్ఞానైక స్వరూపమయ్యును మనుష్యాది
రూపములచేఁ బెక్కువిధములుగాఁ దోఁచుచున్నది. దాని స్వ
రూపమునకు నట్టి భేదములులేవు. ఆదేవమనుష్యాది భేదమును
మూఁడువిధము లయినవి. అది సత్త్వాదిగుణపరిణామముచేతఁ గా
వింపఁబడినది; సర్వజ్ఞుండును సర్వశక్తియు నగుభగవంతుని ప్ర
కృతిచేత స్వప్నమువలెఁ జేయఁబడినది. అనఁగా మనస్సునకు
స్వప్నము దోఁచుచున్నను మేలుకొనఁగా నది నివర్తించునట్లు
ఆత్మపరమాత్మల స్వరూపము ననుసంధించు నట్టివానికి నాత్మ
గతములని తోఁచునవియెల్ల నాత్మోపాసనము వలన నివర్తించు
చున్నవి. ఆశబ్దాదివిషయముల వలన నుండి చూపును మఱల్చి
యాబాహ్యవిషయములనుగ్రహింపక విషయాభిలాషము నుడిగి
వ్యాపారములుమాని సమాధియందు నిజసుఖానుభవము చే
యుచు దేహమునుచింతనమే లేక మిన్నకయుండవలయును. ఇటు
వంటి వానికిఁ బూర్వ మనాత్మయని దిగవిడిచిన యీదేహము
లు సమాధితప్పఁ దక్కినశయనాసన భోజనాదిదశలయందు నను
సంధింపఁ బడుచున్నను వాని సమాధిని జలింపఁజేయఁ జాలవు.
మఱివానికి దేహాంతరప్రాప్తిమూలమగు దేహాత్మాభిమానభ్రమ
మును గలిగింపఁజాలదు. మఱి భగవంతుని ధ్యానము మాత్రము
శరీరము నశించువఱకును జేయుచుండ వలయును. లేనిచో
మనస్సు కాలుష్యము నొందునుగాన సమాధియె జాతిపోవును.
మద్యపానము వలని మత్తుచేత వివేకరహితుఁడగు వాఁడు తాను
ధరించిన వస్త్రము దైవికముగాఁ దనదేహమునందే యుండినను

గాని తొలఁగినను గాని తెలియడు. అట్లే సమాధి చక్కఁగా నొడఁగూడిన వాఁడు హేయమైనట్టి యీ దేహము గూర్చున్న దియు లేచియున్నదియు ననుసంధింపఁడు. ఏలనఁగా వానికి సమాధిదశయందు నిష్కృష్టమైన యాత్మస్వరూపము సాక్షాత్కరించుచుండును గాన దేహము నెంతమాత్రము తెలియనక్కఱలేదు. సమాధి నిష్పన్నమయినపుడు, దేహమునకు వేఱు పని లేనందున యోగికది నశించునా? కొంతకాలము వఱకుండునా? యని సంశయింపవలదు. దేహము సత్తాస్థితి ప్రవృత్తులఁతరాత్మయగు నాయధీనములు. సమాధినిష్పత్తియు నాసంకల్పమువలననే కలుగఁను. కనుక దన దేహమునకుఁ బ్రారబ్ధకర్మమున్నంతవఱకును బ్రాణములతో నెలకొనియే యుండును జ్ఞాని దేహమును దదితరుల దేహమును బ్రారబ్ధకర్మమున్నంతవఱకు నుండనుగాన యీ రెంటికిని విశేషమేమి? యనవలదు. సమాధియోగమును బ్రాపించినవాఁడు తన యాత్మవస్తువును సాక్షాత్కరించినవాఁడగును. గాన స్వప్నముఖలె ననిత్యమైన యీ దేహమును దాని యనుబంధులనును మరలఁ బొందఁడు. ఇతరుఁడన్నచో మరల దేహాంతరమును బొందుచున్నాఁడు. విప్రులారా! [1]సాంఖ్యమునఁదును యోగమునందును గుహ్యమయిన యీ విషయమునంతయును మీకుఁ జెప్పితిని. మీకు మోక్షధర్మమును జెప్పఁగోరి యజ్ఞనిర్వాహకుఁడగు శ్రీకృష్ణుండను నేను మీకడకు వచ్చితినని తెలియుఁడు. నేను సాంఖ్యమునకును యోగమునకును సత్యమునకును బుణ్య

1. సాంఖ్యమనఁగా తత్త్వత్రయవిభాగపూర్వకముగా బ్రహ్మాత్మకో మగు స్వాత్మనుపాసించుట యోగమనఁగా భగవదుపాసనము.

కర్మమునకును దేజమునకును శ్రీకిని గీర్తికిని శమమునకును, ముఖ్యమయినయాశ్రయమగుదును. వానికెల్ల నేనే ప్రవర్తకుఁడునగుదును. హేయగుణములు లేనివాఁడును, స్వాగ్రహమునపేక్షింపక పరదుఃఖముల నిరాకరింపఁ గోరుచుండు వాఁడును నాత్మస్వరూపుండును, గావునను నే ప్రియుండును సుహృదుండును నగు నన్ను సామ్యము (వైషమ్యము లేమి) ఆనందము మొదలయిన కల్యాణ గుణములన్నియును సేవించుచుండును. ఇట్లు సనకాదులయిన మునులు నావలన సందేహములనెల్ల బోఁగొట్టుకొన్నవారై పరమంబగుభక్తిచేత నన్నుఁజక్కఁగా నారాధించి స్తోత్రములచేత స్తుతించిరి. ఇట్లు హంసరూపుం డగు నే నాసనకాదులచేతఁ జక్కఁగా బూజితుండనై యాపరమర్షులు స్తుతించుచుండఁగా బ్రహ్మ చూచుచుండఁగానే నా స్థానమునకుఁ బోయినవాఁడనయితిని. ఇది పదుమూఁడవయధ్యాయము.

{ భగవంతుఁడు మోక్ష పురుషార్థము తన్నుఁదప్ప
మఱిదేనిని గుఱించినది కాదని నిర్ణయింపుట. }

ఉద్ధవుఁడు—కృష్ణా! వేదాధ్యయనాధ్యాపనపరులగు బ్రహ్మవాదులు ధర్మము అర్థము కామము మోక్షము మొదలుగాఁ గల శ్రేయములను బెక్కింటిని జెప్పిరదరు. స్వామీ! నీవు ఫలాపేక్షారహితమైన భక్తియోగమే మోక్షసాధనముగానుదాహరించి యున్నావు. వీనియం దేదేని యొకదానిని ముఖ్యముగాఁ గొనవచ్చునా? లేక యొక్కటిమాత్రమే ముఖ్యమైనదా? అభక్తియోగముచేత సర్వవిషయములనుండిసంగమును

ద్రోసిపుచ్చి మనస్సు నీయందే యావేశించుచున్నది. అట్టి భక్తియే ముఖ్యమైనదా? యని యడిగెను.

భగవంతుఁడు—ప్రాకృత ప్రలయము వచ్చినపుడు వేదము నెడి నావాణి తన్నుఁజదువువారును జదివించువారును లేనికాల మునఁ బుట్టి దాని వర్ణ పరంపరల యథావస్థితి మాని నశించిన దయ్యె. నేను దొల్లి దానిని బ్రహ్మకుఁ గలరూపున నుపదేశించి తిని. అందు నాస్వరూపమైన ధర్మము ప్రకటితమై యున్నది. ఆబ్రహ్మయుఁ దనప్రథమ పుత్రుఁడగు మనువునకు దానిని నుప దేశించెను. ఆమనువువలననుండి సప్తబ్రహ్మలగు భృగువు మొద లయిన మహర్షులు గ్రహించిరి. ఆ తండ్రులవలననుండి వారి పుత్రులగు దేవతలు దానవులు గుహ్యకులు మనుష్యులు సిద్ధులు గంధర్వులు విద్యాధరులు చారణులు కిందేవులు కిన్నరులు నాగులు రాక్షసులు కింపురుషులు మొదలగువారు పడసిరి. వారిస్వభావము లనేకములు. అవి రజస్సత్త్వతమము లవలనఁ బుట్టినవి. అట్టి స్వభావముచేతఁ బ్రాణులకు మతములు భేదిల్లుచున్నవి. ఎల్ల వారికిని దమతమ స్వభావమున కనుగుణము గావాక్కులును నానావిధములుగాఁ బ్రవహించుచున్నవిగదా. ఇట్లు స్వభావములు విచిత్రము లగుటంబట్టి మనుష్యులకును దేవాదులకును మతములుగూడ భేదము నొందుచున్నవి. మఱికొందఱు వేదము లపౌరుషేయము లని దానికి విరుద్ధార్థ ములను గల్పించుచుండు మూలపురుషులనుండి పరంపరగా నుపదేశమునొందుటవలనఁ బాషండమతములు గలవారయిరి. పురుషోత్తమా! కొందఱు పురుషులు మాయాయచేత బుద్ధి మోహమునొందఁగాఁ దమతమ రుచులచొప్పునను దమతమ

కర్మముల కనుగుణముగాను, శ్రేయమనుటకు నానావిధములయి నవానిని జెప్పుచున్నారు.*కొందఱు ధర్మమును కొందఱు యశమును గొందఱు కామమును మఱికొందఱు నత్యదమశమములను శ్రేయముగాఁజెప్పిరి. కొంద ఱైశ్వర్యమునుగొందఱు సాంపుగా భోజనముసేయుటను బురుషార్థముగాఁ జెప్పిరి. కొందఱర్థమును గొందఱు కర్మములను మఱికొంద ఱిష్టాపూర్తములను నిశ్లె వారువారు యజ్ఞములను దపమును దానమును శౌచాది నియమములను నింద్రియ నియమాదియమములను బురుషార్థోపాయములుగాఁ జెప్పిరి. ఈ ధర్మాదులకుఁ గల ఫలము లాద్యంతములు గలవియేకాని సతములుగావు. ఏలన, నివి కర్మములచేత సంపాదింపఁబడినవి;మఱి తమకు మూలమైన కర్మము క్షీణించినపిదప దుఃఖమె యొసంగునవి. ఇవి యెల్ల మోహమందుఁ బర్యవసించుచుండును. మఱి వీనివలనఁ గలుగు నానందమో క్షుద్రము. వీని ననుభవించునపుడును బతనభయము గలుగుచుండుటచే శోకముతోఁగూడియె యుండును. సభ్యా! నిత్య నిరతిశ యానందస్వరూపుఁడ నగు నాయందు మనస్సును నెలకొలిపి సమస్తములయిన విషయసుఖములు క్షుద్రములుగావున వానియం దపేక్ష మాని యున్నపురుషునకు

---

* పూర్వ మీమాంసకులకు ధర్మమే పురుషార్థము. కావ్యాలంకారికులకు యశస్సు. కామతంత్ర ప్రణేతలకుఁ గామము. యోగులకుసత్యశమదమములు. నీతిశాస్త్రవిదులకు ఐశ్వర్యము. వార్తాకులకు విభవభోజనము. వీరు 'భస్మీభూతస్యదేహస్య పునరాగమనంకుతః। తస్మాత్పూర్వ ప్రయత్నేన ఋణం కృత్వా ఘృతంపిబేత్' అందురు. త్రయీమతానుసారులు కొందఱు యజ్ఞాదులు పురుషార్థ సాధనములుగాఁ జెప్పుదురు.

నావలనఁ గలుగునట్టి సుఖము విషయాత్ములగు వారికి నెట్లు గలుగును? నాచేత మనస్సునందు సంతుష్టినొందిన, సమస్తము నందు నాభావమె మనస్సునఁగలిగి, యభిలషింపఁదగినది మఱి యొక్కటియులేక, శాంతియు శాంతియుఁ గలిగియుండువానికి సమస్తములయినదిశలునుగాలావస్థములును సుఖమయములుగా నుండును. నాయందు మనస్సర్పించియుండు నట్టి వాఁడు నన్నుఁ దప్ప మఱి బ్రహ్మాధిపత్యముగాని, మహేంద్రపదవిగాని, సమస్త భూమండలాధిపత్యము గాని, పాతాళైశ్వర్యముగాని యోగసిద్ధులయిన యణిమాదులుగాని, వేయేల మోక్షముగాని యెంత మాత్రమును నొల్లఁడు. నాకు,నాదేహముగాని నాపుత్రుఁడగు బ్రహ్మగాని,మనుమఁడగు శంకరుడుగాని, తోడబుట్టువగు బలరాముఁడుగాని,యిల్లాలగుశ్రీదేవిగాని, నీఱోటిభక్తువలెఁ బ్రియతములుగారు. నన్నుఁదప్ప మఱిదేనిపేక్షింపక నాస్వరూపగుణాదులనే మననముసేయుచు శాంతుఁడై,సర్వత్ర నాభావముగలిగియుండుటంబట్టి వైరములేక యుండునట్టి వానిని నేను నిత్యము వెంటనంటుచుందును ఏలన, వాఁడుచూచినదికాని తాఁకినదికాని యొక్కొక్కటియు నాపదరేణువులచేఁ బవిత్రమగుగాకయనియట్లుచేయుచుందును. నేనుదప్పఁగోరఁదగినది వేఱొక్కటియులేక, నాయందే యనురక్తి మనరంబులఁ గలిగి, శాంతులై సమస్త జీవులందును నాభావము గలిగి యుండుటచే దయాళువులైన సాధువుల బుద్ధికిఁ గామము లెంతమాత్ర మంటవు. అట్టి వారు నన్ననుభవించుటవలని సుఖమును ననుభవించుచుందురు ; మోక్షసుఖమును సైతము నన్ననుభవించుటకు సాటిగాఁ దలఁపరు గాన దాని నెంతమాత్రము పాటింపరు. భక్తియో

గమును ప్రారంభించినట్టివాఁడింకను నింద్రియములను జయింప కుండును. కాని ప్రతిదినమును భక్తి పెరుగుచుండుటం బట్టి విషయములకుఁ గ్రిందుపడక యుండును. అగ్ని పయి పయిని మంటలు రగులుకొనఁగాఁ గట్టియలను నీఱుగావించునట్లు, ఉద్ధవా! నన్నుగుఱించిన భక్తియుఁ బాపము నెల్లను సమూలముగా నాశమునేయును. నాయందుఁ బ్రవృద్ధమైయున్న భక్తి వలె, ధర్మముగానిసాంఖ్యముగాని యోగముగాని స్వాధ్యాయముగాని తపముగాని త్యాగముగాని నన్ను సాధింప నేరదు. ఏకరూపమైన భక్తియొక్కటిచేతనే నన్ను గ్రహించుటశక్యము. నేను బ్రియులకు నాత్మ గావున మిక్కిలి ప్రియతముఁడను. కనుక వారిభక్తికే చిక్కుదునుగాని మఱియొకదానికిఁ బట్టుపడను. నాయందు నెలకొన్న భక్తి కుక్కను దిను బోయవారి పయినను, వారి జాతిదోషమునుండి పరిశుద్ధులను గావించును సుమీ. ధర్మమును సత్యమును దయయుఁ గలిగియుండియు విద్యతోడను దపస్సుతోడను గూడి యుండియు, నాభక్తియొక్కటి లేకుండినచో నట్టివాని యాత్మ నది చక్కఁగాఁ బరిశుద్ధము గావింపదు సుమీ. మేనియందుఁ బులకలు పుట్టకయు, మనస్సు నీరుగాఁ గరంగకయుఁ, గన్నులయం దానందాశ్రు బిందువులు గ్రమ్ముకొనకయు, నూరక భక్తి యెట్లు పుట్టిన దని తెలియవచ్చును? భక్తి లేక యంతఃకరణ మెట్లు శుద్ధ మగును? ఎవనికి పలుకు డగ్గుత్తికపడునో, మనస్సు కరఁగునో, ఎవ్వఁడొకానొకప్పుడేడ్చునో, మాటిమాటికి నవ్వుచుండునో, ఎవ్వఁడొక్కయెడ సిగ్గుపీడి బిగ్గరఁబాడుచుండునో, మఱియొక్కఁడ నాడుచుండునో, వాఁడే నాయందలి భక్తిగలవాఁడు. వాఁడు

భువనమును దన యీక్షణస్పర్శనాదులచేతఁ బరిశుద్ధముచేయును, బంగారము నిప్పనందుఁగాఁచి పటకారుతోఁ బట్టి యూఁదఁగా నది తనయందలి మలమును వీడి తన యొప్పటి రూపమునొంది తలతల మెఱయుచుండును. అట్లు జీవుఁడు నాయందలి భక్తిచేత జ్ఞానమును గప్పునట్టి యనుభవింపఁగా మిగిలియున్న కర్మమును దూలంబుచ్చి నన్నుఁబొంది స్వస్వరూపమును బొందుచున్నాఁడు. ఈజీవుఁడు నాపుణ్యచరిత్రములను వినుటచేతను జెప్పుటచేతను గర్మములను దూల్చి పరిశుద్ధినొందుచువచ్చును. అపుడు వాఁడు బ్రకృతియు దానికంఁటె సూక్ష్మమగు జీవుఁడును వానికంటె సూక్ష్ముఁడగు నీశ్వరుఁడును ననుమూఁడు తత్త్వములను, తెవులుచేఁ గంటిచూపు చెడియున్నవానికి మందు కాటుక కలికము వేయఁగా నది దోషము వీడి రూపమును గ్రహించినట్లు-ఆమూఁడు తత్త్వములను గర్మరూపదోషములు వీడుటవలన గలరూపున వివేచించి కనుఁగొనుచున్నాఁడు. విషయములనే తలపోయు చుండిన యెడల మనుజునకు మనస్సు విషయములందే మిక్కిలి తగులుపడుచున్నది. నన్నే స్మరించుచుండు వానికి మనస్సు నాయందే మిక్కిలి లయించు చున్నది. ఇట్లు నా చరిత్రములను వినుట మొదలగు వాని వలననే క్రమముగా భక్తిపుట్టుట వలన, స్వప్నమందలి కోరికలవలె నస్థిరములయిన శబ్దాది విషయములను ధ్యానించుచుండుటను మాని నాయందలి భక్తి కలుగు నట్లుగా మనస్సును నాయందే శ్రవణాదులచేతఁ గ్రమముగా సమాహితము చేయుము. స్త్రీలతోడను వారితోడి సంగము గల వారితోడను బొత్తు దూరముగాఁ దొలఁగవిడిచి యింద్రియములను మెల్లగా వశము

చేసికొని నిర్భయమును నిర్జనమునయిన దేశమునందుఁ గూర్చుండి యలసత లేక నన్నుఁ జింతింప వలయును. పురుషునకు స్త్రీలతోడి పొత్తువలనను స్త్రీ సంగము గలవారితోడి పొత్తు వలనను గలుగునట్లుగా దక్కిన వారితోడి ప్రసక్తివలనఁ గ్లేశమును బంధమును గలుగనేరవు' అనెను.

ఉద్ధవుఁడు.—'అరవిందాక్షా! ని న్నేధ్యానప్రకారమున నెట్టి విగ్రహముగలవానినిగా నెట్టి యాత్మస్వరూపముతోఁ గూడినవానినిగా ముముక్షువగువాఁడు ధ్యానము చేయవలయునో యాధ్యానస్వరూపమును నాకుఁ జెప్పవలయును' అని యడిగెను. భగవంతుఁడు— సమమయిన ప్రదేశమందు నేదయినను బఱచుకొని స్వస్తికము కనులము మొదలగు నాసనములలో నొకటి గయికొని సుఖముగాఁ గూర్చుండవలయును. అపుడు దేహమును జక్కఁగా నిలువఁ బెట్టుకొని చేతులను దొడలయం దిడి, ముక్కుకొన యందుఁ జూపు నెలకొలుపవలయును. మఱి పూరక రేచక కుంభకములచేత, ఇడాపింగళానాడి రంధ్రరూపముగా నున్న ప్రాణవాయు సంచారమార్గమును బరిశుద్ధము చేయవలయును. మరలఁ దలక్రిందుగా రేచకపూరకకుంభక క్రమమునఁ బ్రాణమార్గమును బరిశుద్ధముసేయుటను మెల్లమెల్లగా నింద్రియముల నియమనముతో నభ్యసించుచు రావలయును. మఱి హృదయమందు ఘంటానాదమువలె నవిచ్ఛిన్నముగా మ్రోఁగుచుఁ దామరతూఁడులోని సన్నని పోఁగువలె సూక్ష్మమైయున్న యోంకారమును నట్టిదిగా ననుసంధించి యంతఁ బ్రాణమునెడి వాయువుచేత (లేపి దానిచేత) లేచినట్లుగా ధ్యానించి మరల హృదయమందు నోంకారమునంతయుఁ బ్రతి

శించినదిగా ధ్యానింపవలయును. ఇట్లు ప్రణవానుసంధానము తోఁ గూడునట్లుగా మూఁడు సంధ్యలయందును బదిమాఱులు ప్రాణసంయమము నభ్యసింపవలయును. ఇట్లు చేయుచుఁగాఁగా మూసమునకు మోపలనేఁ ఘ్రాణవాయువును జయించినవాఁ డగు చున్నాఁడు. *ఇది ధ్యానింపవలసిన విధము. శరీరములోపల హృదయకమలము తూఁడు పయిగాను ముఖము క్రిందుగాను గలిగి ముకుళించినయరటి పువ్వువలె వ్రేలుచుండును. దానినూ ర్ధ్వముఖమును నధోనాళమును నున్నిద్రమును నష్టపత్రమును సకర్ణికము నయినదానినిగా ధ్యానించి దానియందు సూర్య సోమాగ్నులను వారి మండలములను నొకటిమీఁద నొకటిగా నున్నట్లు చింతింపవలయును. పిదప నాయగ్ని మండలము నడు మ ధ్యానమునకు శుభాశ్రయరూపంబయిన నాయీరూపమును స్మరింపవలయును. నల్లని వాఁడును బ్రశాంతుఁడును జక్కని ముఖము గలవాఁడును, నిడుదలయి యందములయిన నాలుగు భుజములు గలవాఁడును మిక్కిలి సొబగయిన వానియందు సొబగయిన కుత్తుకగలవాఁడును జక్కని చెక్కిళ్లుగలవాఁడును దెల్లని చిఱునవ్వు గలవాఁడును, సమానసములగు కర్ణము లందుఁ దొడుగఁగా మిక్కిలి స్ఫురించుచున్న మకరకుండలము లు గలవాఁడును బంగారువలువ గలవాఁడును మేఘశ్యాముఁ డును, శ్రీవత్సమునకును శ్రీదేవికిని నివాసమైనవాఁడును శంఖ చక్రగదాపద్మవనమాలావిభూషితుఁడును, బొదములందునూపు రములు విలసిల్లువాఁడును గౌస్తుభకాంతులతోఁ గూడినవాఁడు

* ఇంతవఱకు ధ్యానాంగములుచెప్పి యిఁక ధ్యేయమయిన మూర్తి స్థానమును ధ్యానించు ప్రకారమును జెప్పుచున్నాఁడు.

ను, బ్రకాశించుచున్న కిరీటమును గటిసూత్రమును గటకము లును బావుపురులును గలవాఁడును సర్వాంగసుందరుఁడును మనోహరుండును బ్రసాదనముఖము లయిన చూపులుగలవాఁ డును నుకుమారుండునునగు నాదురూపమునందలి పాదములు మొదలుకొని శిరమువఱకుఁ గల యంగము లన్నింటియందును మనస్సును ధారణముచేసి ధ్యానము సేయవలయును. ఇంద్రి యములను మనస్సుచేత శబ్దాదివిషయములనుండి యీడ్చికొని సారథి యగు బుద్ధిచేత ధీరుండగువాఁడు మనస్సును నిరతిశ యానందావహుఁడయిన నాయందు సమాహితము గావింపవ లయును. ఇట్లు భగవంతుని దివ్యవిగ్రహమునం దంతటను వ్యాపిం చునట్టి మనస్సును బట్టి లాగి దానిని నొక్క యంగమునందె నెలకొలుపవలయును. అపుడు తక్కిన యంగములను జింతింప రాదు.మిక్కిలియుఁజిఱుఁ వ్వు దొలఁకుచుండునట్టి నాముఖమును విశేషించి చింతనము సేయవలయును. అందు మనస్సు చిరకా లము నెలకొని యనుభవించిన పిదప దానిని లాగి వ్యోమమ నందు (అనఁగా వ్యోమమువలె నిర్మలమును నపరిచ్ఛిన్నమును నిర స్త నిఖిలదోషమును సమస్త కల్యాణానంతత్వాదిగుణగణ యుక్తము నగు దివ్యాత్మస్వరూపమందు) ధరింపవలయును. పిదప నాస్వరూపరూపముల ననుసంధానము సేయుచు నాధార ణమును దిగవిడిచి మఱి యేదియును (అనఁగా ధ్యేయమును ద ప్పఁ దక్కిన ధ్యాతృధ్యానక్రియాదుల నొక్కటినిని) జింతింప రాదు.ఇట్లు సమాహితచిత్తుండై సమస్తమున కాత్మభూతుండ నగు నాయందుఁ దన్మును, బ్రత్యగాత్మయగు తనయందు న న్మును, సూర్యాదుల ప్రభను దీపాదిజ్యోతులందును, గూడియు

న్నటువలెఁ జూచుచున్నాఁడు. అంతఁగాయములచేతఁ గొట్టు పడక మిక్కిలియుఁ దీవ్రమయినట్టి యిట్టి ధ్యానముచేత మన స్సు నీచందమున సమాహితము గావించునట్టి యోగికి ద్రవ్య ములగు పంచభూతములచేతను జ్ఞానకర్మేంద్రియములచేతను రచితమైన దేహమే యాత్మ యనియు, ఆత్మ స్వతంత్రమనియును గలిగియుండు భ్రమము వేగ నాశము నొందుచున్నది. ఇది పదునాలుగవయధ్యాయము.

సమాధిపర్యంతమగు ధ్యానయోగమునకు ముక్తి యేకాక యణిమాదిసిద్ధులును ఫలములగు నని చెప్పుట.

శ్రీభగవంతుఁడు—'బాహ్యేంద్రియములను జయించిన వాఁడును గావునఁ స్థిరచిత్తుండును బ్రాణములను జయించిన వాఁడును నాయందు మనస్సును ధారణము చేయు వాఁడును నగు యోగికి సిద్ధులన్నియు నుపస్థితములగు చున్నవి' యనెను. ఉద్ధవుఁడు— 'అచ్యుతా ! ఏధారణచేత నేసిద్ధి యేవిధమునఁ గలుగుచున్నది. సిద్ధులెన్ని ? నీవు యోగులకు సిద్ధిప్రదుఁడవు గావున దీనినిఁ జెప్పు'మని యడిగెను. భగవంతుఁడు—ధారణా యోగమందుఁ బారంగతు లయినవారు సిద్ధులు పదునెనిమిది గలవని చెప్పియున్నారు. అందు నెనిమిదింటికి నాప్రాప్తియే ముఖ్య ప్రయోజనముగా నుండును. తక్కిన పది విషయానుభవ మునకు హేతువులయినవి. ఆసిద్ధులివి - దేహమునకు ననిమయు (అణుత్వమును) మహిమయును (మహత్త్వమును) లఘిమయుఁ (దేలికయు) (ప్రాణేంద్రియములచేత నాయావిషయము లను భవించుట యనెడి) ప్రాప్తియు (శ్రుతములగు పార లౌకికములం

దును దర్శనయోగ్యములగు నైహికములందును దక్కిన వారి కంటె నతిశయించి యుండుట యనెడి) ప్రాకామ్యమును (సమస్తమునకు సామర్థ్యమును గూర్చునట్టి యీశిత్వమును (గుణములయందు సంగము లేకుండుట యనెడి) వశిత్వమును, ఏనుఖము నందుఁ దక్కినకామములు సముద్రమందునీటిబొట్టువలెలయము నొందునో యట్టి సుఖమును-అని యీ యెనిమిది సిద్ధులును సమాధియోగ నిష్పత్తిగలవానికి (నిష్పనకుఁ బై కెగయుటయు, వాయువునకు వ్యాపించుటయు నెట్లోయట్లు) స్వభావసిద్ధములై యుండుననని తలంపఁబడును. యోగి కీదేహమునందు నరలుము డుతలు గొని యూఁగలి దప్పులు మొదలగు నూర్మ్యులు లేకుండుట యు,దూరమునందున్న సర్వభూతములశబ్దముల నెఱుంగుటయను దూరశ్రవణమును, దూరమందున్న సర్వవస్తువులసాక్షాత్కరించుటయను దూరదర్శనమును,మనస్సు చన్నచోటికి దేహమును బోవుట యను మనోజవమును, తలఁచినరూపము దాల్చుట యును, పరకాయప్రవేశమును, స్వచ్ఛందమరణమును దేవతలప్సరసలతోఁ గ్రీడించుక్రీడలనుబొందుటయు, సంకల్పించినట్లెల్ల సిద్ధినొందుటయు, అడ్డులేని యాజ్ఞయు గతియు, భూతభవిష్యద్వర్తమానకాలములు మూఁటిని దెలియుటయు, శీతోష్ణాదులగు ద్వంద్వములకుఁ గీడ్పడకుండుటయుఁ, బరుల చిత్తములను జేష్టలను మొదలగువానిని నెఱుంగుటయును, అగ్ని సూర్యుఁడు జలము విషము మొదలగువానిని స్తంభింపఁ జేయుటయు, నపజయము లేకుండుటయు, యోగధారణముచేఁ గలిగెడి యీసిద్ధు లుద్దేశమునుబట్టి చెప్పఁబడినవి. ఇఁక, నే ధారణచేత, నేసిద్ధి యే విధమునఁ గలుగుచున్నదో చెప్పెద

వినుము. ఎవఁడు భూత సూక్ష్మశరీరకుఁ డయిన నాయందు నాభూతసూక్ష్మమును మాత్రముగుఱించిన మనస్సును ధారణ చేయుచున్నాఁడో యట్లు నా శరీరభూతమైన భూతసూక్ష్మ మును మాత్ర ముపాసించినట్టివాఁడణిమము నొందుచున్నాఁడు. మహత్తత్త్వముశరీరముగాఁగలిగిన పరమాత్మయగునాయందు విషయాంతరములనుండి మరల్చి చక్కఁగా నెలకొనునట్లు మన స్సును ధారణచేసినవాఁ డాకాశాదులకుఁ గల యాయామ మహిమమును వేఱువేఱఁ బొందుచున్నాఁడు. భూతముల పరమా ణువులందు (సూక్ష్మావయవము లందు) వ్యాపించి నాయందుఁ జిత్తమునుదగులుకొలిపినవాఁడు సూక్ష్మం బగుకాలమునుధ్యానిం చులఘిమమును బొందుచున్నాఁడు. వైకారికాహంకారము శరీర ముగాఁగలనాయఁదుమనస్సు నేకాగ్రముగానుంచిధారణనెవఁడు చేయునో, వాఁడు నాయందేమనస్సుగలిగి, సమస్తప్రాణుల యింద్రియములును వాని వాని విషయములను బ్రాపించునట్టి స్వభావ మబగుప్రాప్తిని బొందుచున్నాఁడు.* పెక్కుమణులందుఁ బొచ్చియున్న సూత్రమువలెఁ దనకార్యములు పెక్కింటియందు నాధారముగాఁ బొచ్చియుండునట్టిమహత్తత్త్వమును శరీరము గాఁగల నాయందు మనస్సును ధారణముసేయువాఁడు ప్రాకా మ్యమును (అనఁగా దృష్టాదృష్టములగు నర్థ వ్యాపారములను గుఱించిన జ్ఞానమును) పారమైశ్యమును (పరమేష్ఠివలె నితరుల

---

* కేవలమహత్తత్త్వమును శరీరముగా నేను గలిగియున్నట్లుపాసించిన వానికి మహిమమనుసిద్ధి. మహత్తత్త్వమునుమాత్రముగాను అవ్యక్తమునుండిపుట్టినదిగాను నిట్టిగుణవిశేషములతోఁగూడిన ట్లుపాసించినయెడల ప్రాకామ్యాదులు గలుగుననిభేదము తెలియునది.

కంటె నతిశయించిన వ్యాపారములను జేయఁజాలి యుండుట నును) బ్రధానమునుండిపుట్టినయాహమహత్తత్త్వమును నాకువిశేషణముగా నుపసించుటంబట్టి పడయుచున్నాఁడు. సర్వ వ్యాపకుండును సృష్టి స్థితి లయము లనెడు మూఁడువ్యాపారములకు నిర్వాహకుండును గాల శరీరికుండు నయిననాయందుఁ జిత్తమును ధారణచేయువాఁ డీశిత్వమును బొందుచున్నాఁడు. ఈశిత్వమనఁగా సమస్తములయిన దేహములకును నాత్మలకును నన్నిటిని గుఱించిన సామర్థ్యమును గలిగించుట యగును. జాగ్రత్తు స్వప్నము సుషుప్తియనెడి మూఁడవస్థల కవ్వలిదై తురీయమనఁబడు పరిశుద్ధ జీవాత్మ స్వరూపములు శరీరముగాఁ గలవాఁడను జీవులకుఁ బ్రాప్యమును ప్రాపకమును నాధార భూతుఁడు నయినవాఁడును, జ్ఞానశక్తి బలైశ్వర్య తేజస్సు లనెడి యీ గుణములచేఁ బూర్ణుఁడగుటంబట్టి భగవచ్ఛబ్దవాచ్యుండును నగు నాయందు మనస్సును ధారణచేసి, నాధర్మమగు వశిత్వమును(గుణములందాసక్తిలేకుండుటను) బొందుచున్నాఁడు. హేయగుణములేక కల్యాణగుణములు మిక్కిలి వెల్గువెరిఁగి యున్న నాయందు యోగపరిశుద్ధమగు మనస్సును ధారణము చేసి పరమానందమును బొందుచున్నాఁడు. ఆ యానందమునందుఁ దక్కిన కామములన్నియు సమాప్తము లగుచున్నవి. శ్వేతద్వీపపతియు శుద్ధసత్త్వాత్మకుండును ధర్మనిర్వాహకుండును నగు నాయందుఁ జిత్తముధారణచేసి యూఁకలి దప్పి మొదలయిన ఊర్మిలాఱింటిని గడచినవాఁడై శ్వేతరూపుఁ డగుచున్నాఁడు. ఆకాశమువలె నిర్మలమును సర్వవ్యాపకమునయి యాత్మస్వరూపము గలవాఁడును బ్రాణశరీరకుండు నగు

యందు మనస్సుచేతఁ బ్రాణఘోషమును జింతించుచు నాధారణయందుఁ గలిగినయుపలబ్ధితోఁ గూడి యీయోగి దూరమందున్నట్టి భూతములందును నభివ్యక్తము లగువాక్కులను వినుచున్నాఁడు. చక్షురింద్రియముల కధిష్ఠాతయగు సూర్యుని యందుఁ జక్షువులనుగూర్చియు, సూర్యుని నాచక్షువునందుఁ గూర్చి యున్నట్లుగాధ్యానించి యట్లుభయసంయోగమునపుడు నన్ను మనస్సుచే ధ్యానించుచు సూక్ష్మదృష్టినొంది సర్వమును దూరమందున్నను జూచుచున్నాఁడు. నాయందు మొదట మనస్సును నిదపఁ బ్రాణవాయువుతోడ దేహమును సంయుక్తమైనదిగా ధ్యానించినచో మన సెచ్చటికిఁ జనునో యచ్చటికి దేహమును నన్నుగుఱించిన ధారణ ప్రభావముచేతఁ బోవుచున్నది. మనస్సును నాయందునిలిపి, యేయేదేవాది రూపము గలవాఁడు గాఁగోరుచున్నాఁడో వానిమనస్సున కభీష్టమయిన యాయారూపమును బొందుచున్నాఁడు. ఏలన వాఁడు నన్ను గుఱించి ధారణాయోగముచేత బలము నొంది యుండును గాన యది సుకరముగా నుండును. పరకాయమును బ్రవేశింపఁ గోరువాఁడు దానియందుఁ దన్నుండునట్లు చింతనము సేయవలయును. పిదపఁ దనదేహమును విడిచి ప్రాణములను నింద్రియములను గూడి వాయువునకు సాటియై (వాయువు వెలుపలనుండి నాసికరంధ్రముల మూలమున లోపలఁబ్రవేశించునట్లును, దుమ్మెదపువ్వునుండి పువ్వున కనాయాసమునఁ బోవుచున్నట్లును) వానిని బ్రవేశింపవలయును. పాదమూలముచేత మూలాధారమును నదిమి ప్రాణమును గ్రమముగాహృదయమునందును తొండ్లనందును గంఠమునందునుమూర్ధమునందును నిలిపిశిరఃకపాల

ముపగులఁగా నేర్పడినబ్రహ్మరంధ్రము చేతబ్రహ్మమునుబొందించిదేహమును విడువవలయును. దేవతలుక్రీడించు దేవోద్యానాదులయందుఁ గ్రీడింపఁగోరువాఁడు నామూర్తియుగుశుద్ధసత్త్వమును జింతింపవలయును;అట్లునాశరీరమైనశుద్ధసత్త్వమందుమనస్సువర్తించుచున్న యాపురుషునికడకు దేవతాస్త్రీలు విమానములతోఁ గూడవత్తురు.ఎప్పుడేవిధమునుబుద్ధిచేత సంకల్పించుచున్నాఁడో యపుడువాఁడుమదాసక్తచిత్తుఁడై సత్యసంకల్పుఁడగునాయందు మనస్సును ధారణచేసి తనసంకల్పమున కనురూపమయినదానిని బొందుచున్నాఁడు.సర్వనియంతయును స్వతంత్రుఁడునగు నాదు భావ మగువశిత్వాదులనుబొందినవాఁడు (అనఁగాఁదానుఈశిత్వ వశిత్వములను బొందినవాఁడు)ఈశిత్వవశిత్వములతోఁగూడినవానినిగా నన్ను ధ్యానింపఁగా వానికి దేనివలననను విపత్తుగలుగదు. మఱి నాయాజ్ఞవలెనేవానియాజ్ఞయుగతియునడ్డులేకయుండును శుద్ధమయిన యంతఃకరణము గలిగి ధారణయెఱింగినట్టి యోగికి నాభక్తిప్రభావము వలననే కాలత్రయవస్తువులను గుఱించిన జ్ఞానరూపమగు సిద్ధిగలుగును. కాలత్రయమందుఁ గలుగు వస్తువులను గూర్చిన జ్ఞానముగలిగియుండు ముని దేహము యోగప్రచురమైయుండునుగాన యది యగ్ని మొదలగు వానిచేతఁ గీడ్పడక వానినే స్తంభింపఁ జాలియుండును. ఏలన నాముని నాయోగముచేతఁ జిత్తశాంతి నొందియుండును గాన జలజంతువులకు జలమెట్లో యట్లె యగ్ని మొదలగునవియు నతనికిఁ బ్రతిఘాతకములు గాకుండును. మఱియు శ్రీవత్సము చేతను శంఖచక్రాద్యాయుధములచేతను విభూషితములై ధ్వజములతోను నాతపత్రములతోను వ్యజనములతోను గూడి

యున్న నావిభూతులను ధ్యానించుచుండువానికిఁ బరాజయ మెన్నఁడును గలుగదు. ఇట్లు యోగధారణచేత నన్నుపాసిం చుచుండువానికిఁ బూర్వోక్తములయిన సిద్ధు లన్నియును సంప్రాప్తించుచున్నవి. అంతఃకరణమును జయించి బాహ్యేంద్రి యములను జయించి ప్రాణములను జయించి నా ధారణ నుధరించుచున్న మునికి సిద్ధి యేది దుర్లభము? నాయుపాసనమె యుత్తమయోగము. దానిని జేయుచున్న యోగికి నూర్మ్యులు లేకుండుట మొదలయినవి యెల్ల యోగమును జలింపఁజేయు నట్టివిగాన మరల సంసారమునకు హేతువులగును. కాన వీనిని విఘ్నములుగానే యోగవిదు లెఱుంగుదురు. అయిన నణిమాదు లెనిమిది యట్టివిగావు. నన్నుపాసనముచేసి దానిచేఁ దమ సాక్షాద్భాదులు మునిసినతుదిని నిరతిశయపురుషార్థరూపుండగు నన్నుఁబొందఁబోవునట్టి వాని కివికాలక్షేపమునకు హేతువులుగా నుండును, జలజంతువులకు జలస్తంభమును బక్షుల కాకాశ గమనమును మొదలగువానింబోలె జన్మముచేత నే కొన్ని సిద్ధులు గలుగుటయుఁ గలదు. అట్లు జన్మము చేతను నోషధులచేతను దపముచేతను మంత్రముచేతను నిందెన్ని సిద్ధులుగలుగుచున్న వ్రో యా యన్నియును నా యుపాసన మునఁడు యోగముచేతఁ బొందుచున్నాఁడు. దేవాదిజన్మములు మొదలగు వానిచేత నాయా సిద్ధులు సులభము లని తలఁచి యోగము నాజన్మో ద్భాదులకు వినియోగించి నా విషయముగా దానిని వినియో గింపక త్యజించుట తగదు. నన్నుపాసనము సేయుచున్నచో నమస్తములయిన సిద్ధులకును నేను వ్యాపకుండను బాలకుండను నిర్వాహకుండను. ఈ సిద్ధులకే కాదు. ప్రకృతి వివిక్తాత్మో

పాసనరూపమైనసాంఖ్యమునకు మదుపాసన రూపమైనయో గమునకును నేనట్టివాఁడనగుదును బ్రహ్మాదులకును స్వర్గాదులను గలిగించుయజ్ఞాదిధర్మములకును నేనట్టివాఁడను. ఏలయందువా? నేను సమస్తములయినజీవులకును నంతర్యామియైన యాత్మను. ఆత్మయైనమాత్రమునఁ బరిచ్ఛిన్నుఁడనుగాను; వానికి వెలుపల వ్యాపించియుందును. కాఁబట్టియె నాకుఁబరిచ్ఛేదములేదు. దేవ మనుష్యాదిభూతములయందు నాకాశాది భూతములలోపలను వెలుపలనువ్యాపించి వర్తించుచున్నట్లు నేనున్నవాఁడను. ఇది పదునేనవయధ్యాయము.

శ్రీ కృష్ణుఁడు తన విభూతుల సుద్ధవునకుఁ జెప్పుట.

ఉద్ధవుఁడు—నీవు సాక్షాత్పరబ్రహ్మమవు. నీ కుత్పత్తి వినాశములు లేవు. నిన్నుఁ గర్మము లావరింపవు. ఇట్టివాఁడవు గనుక నీవు సమస్తములయిన వస్తువులకును మోక్షోపయుక్తమగు జ్ఞానము నొసంగి యాత్మనుజ్జీవింపఁ జేయుదువు. వానికిఁ బాలనమును బ్రలయమును నుత్పత్తియును నీవలననే కలుగుచున్నవి. జితేంద్రియులు గానివారికి నిన్నుఁ దెలియుట మిక్కిలి కష్టమైనను వేదాంతవిదు లెక్కువతక్కువలుగా నుండు భూతములందు నిన్ను సమస్త భూతముల యుత్పత్తి స్థితి ప్రవృత్తులకు హేతుభూతుఁడవని నీ యథావస్థిత మయివ యాకారమున నెఱిఁగి యాయా భూతములందు వాని వాని విభూతులతోఁగూడియున్న నిన్ను భక్తి వృద్ధినొందుళొఱకు నుపాసించుచుందురు. పరమర్షులు భక్తి వృద్ధిళొఱకు నిన్నే యే వస్తువులందు నే యే విభూతిరూపముల నుండువానినిగా

నుపాసించుచు భక్తియోగనిష్ఠ్తిని బొందుదురో యావిభూతి రూప మగు వస్తువును నాకుఁ జెప్పము. భూతములకు నత్తగలిగించుచు సర్వభూతాంతరాత్ముఁడు భూతము లందు స్ఫుటము గానట్లు వర్తించుచున్నాఁడు; అట్లయినను సమస్తము నొక్కమ్మడిగా సాక్షాత్కరించుచుండు నిన్ను భూతములు నీ మాయ చేత మోహితము లగుటఁజేసి కను గొనఁజాలవు. మహా విభూతీ! భూమియందును దివియందును బాతాలమందును దిక్కులయందును నీవు వాని వానియందు నుత్కృష్టములు గావించియున్న విభూతులను నాకుఁ జెప్పము. తీర్థములకుఁ బట్టి యిన నీ పదారవిందములకు నిదె మ్రొక్కుచున్నాను' అనెను.

శ్రీ భగవంతుఁడు—ఉద్ధవా! నీవు ప్రశ్నములు తెలిసిన వారియందు మిన్నవు. మునుపు కురుక్షేత్రమునందు నర్జునుఁడు కౌరవులతో యుద్ధము సేయఁదివిరి నన్నిట్లె యీ ప్రశ్నము నడిగెను. అతఁడు జ్ఞాతులనుజంపుట రాజ్యప్రాప్తికి మాత్రమే హేతువు గాని ముక్తికిహేతువుగాదనియుఁ గావున నది యధర్మమును నిందనీయము నగుననియుఁ దెలిసి 'నేను జంపువాఁడను వీఁడు చంపఁబడినవాఁ' డని ప్రాకృత బుద్ధి గల వాఁడై యీ యుద్ధమునుండి నివర్తించినవాఁ డయ్యె. అప్పుడు నే నాపురుషసింహమున కుపాయములను బోధించి తెలివి పుట్టింపఁగా నా యుద్ధాగ్రమందు నీవలెనే నా విభూతులను జెప్పమని యడిగెను. ఉద్ధవా! నే నీ భూతములకెల్ల నాత్మ భూతుఁడను—అనఁగా నాత్మవలె లోపలఁ జొచ్చి నియమించు చుండువాఁడను. కాన యీశ్వరుఁడను. మఱి సుహృదుఁడను. సమస్త భూతములును మదాత్మకములుగావున నవియన్నియు

నేనేయగుదును. వానికి నుత్పత్తి స్థితి వినాశములును నావలన నే కలుగుచున్నవి. నేను మంచి గమనము గల వానిలోపల గతిని. అనర్థములు గలిగించునవిగా గణింపబడు వానిలోఁ గాలుఁడను సత్త్వాదిగుణములందలి సామ్యము నేను. గుణులకు స్వభావ సిద్ధముగాఁ గల గుణము నేను. సత్త్వాదిగుణములు మూఁడు పుట్టియున్న వానిలోపలఁ బ్రథమకార్యం బగు సూత్రంబైన మహత్తత్త్వము నేను. మహత్తయినవానిలో మహత్తత్త్వము నేను. సూక్ష్ములయినవానిలో మిక్కిలియు సూక్ష్మము జీవుఁడు నేను. జయింపఁ గష్టమయిన వానిలో మనస్సు నేను. దేవతలలో హిరణ్యగర్భుఁడు నేను. మంత్రములలో మూఁడక్షరములు గల ప్రణవము నేను. అక్షరముల లోపల అకారము నేను. వేదములయందు గాయత్రి నేను. సమస్త దేవతలలోపల నింద్రుఁడ నేను. పశువులందు హవ్యవాహుండగు నగ్ని నేను. ఆదిత్యులయందు విష్ణుఁడు నేను. రుద్రులయందు నీలలోహితుఁడు (శివుఁడు) నేను బ్రహ్మర్షులయందు భృగుఁడు నేను. రాజర్షులయందు మనువు నేను. దేవర్షులయందు నారదుఁడు నేను. ధేనువులయందుఁ గామధేనువు నేను. మేటిసిద్ధులలోఁ గపిలుఁడు నేను. పక్షులలో గరుడుఁడు నేను. ప్రజాపతులయందు దక్షుఁడు నేను. పితృదేవతలయం దర్యముఁడు నేను. ఉద్ధవా ? దైత్యులయందు నే ననుశేశ్వరుఁడగు ప్రహ్లాదుఁడనని తెలియుము. నక్షత్రములకును నోషధులకును నధిపతి యగు చంద్రుఁడు నేను. యక్షరాక్షసులలోఁ గుబేరుఁడు నేను. మేటి గజములలోపల నైరావతము నేను. జలజంతువులకుఁ బ్రభుండగు వరుణుఁడు నేను.ద్యుతిగలవారలలోను దపింపఁ జేయు వారి

లోపలను సూర్యుఁడు నేను. మనుష్యులలోపల భూపతి నేను. గుట్టములలో నుచ్చైశ్శ్రవము నేను. ధాతువులయందు బంగారము నేను. దండించువారిలోపల యముఁడు నేను సర్పములందు వాసుకి నేను. పెక్కు-తలలుగల మేటిసర్పములలోపల ననంతుఁడు నేను. కొమ్ములును గోఱులును గలమృగములలోపలసింహము నేను. ఆశ్రమములందునాలుగవదియగుసన్న్యాసాశ్రమము నేను. వర్ణములలోపలఁ బ్రథమంబగు బ్రాహ్మణవర్ణము నేను. ప్రవాహరూపములగు తీర్థములయందు గంగను నేను. జలములుపాఱకనిలుకడగానుండు నీటి పల్వలయందు సముద్రము నేను. ఆయుధములందు ధనుస్సు నేను. విలుకాండ్రయందుఁ ద్రిపురములను నాశముచేసిన శివుఁడు నేను. గృహములలోపల మేరువు నేను. దుర్గమము లయిన వానిలోపల హిమాలయము నేను. వృక్షములలోపల నశ్వత్థము నేను. ఓషధులయందు యవలు నేను. పురోహితులలోపల బహిష్మఁడు నేను. వేదార్థనిష్ణులలోపల బృహస్పతి నేను. సమస్తసేనానుల లోపలఁ గుమార స్వామి నేను. సన్మార్గ ప్రవర్తకులయందుభగవంతుఁడగుబ్రహ్మను నేను. యజ్ఞములయందు బ్రహ్మయజ్ఞము నేను వ్రతములం దహింసావ్రతము నేను. శుద్ధిచేయునానిలో వాయువు అగ్ని సూర్యుఁడు జలము ఆకాశమునెడి యీపదార్థముల రూపున మిక్కిలియు శుద్ధినేయువాఁడు నేను. యోగము లెనిమిదింటిలోపల సమాధి నేను. జయింపఁగోరువారలలో జయోపాయ మగు నీతి నేను. వివేకాదినై పుణ్యములలో నాన్వీక్షికి (ఆత్మానాత్మ వివేకవిద్య) నేను. అన్యథాఖ్యాతివాదు లగు తార్కిక-వాదులలో నీ విట్లు చెప్పుదువా? వేఱువిధముగఁ జెప్పెదవా? యనెడి వికల్పము

నేను. స్త్రీలయందు స్వాయంభువమనువు భార్యయైనశతరూప నేను. పురుషులయందుస్వాయంభువమనువునేను. మునులలోపల బదర్యాశ్రమవాసి యగునారాయణమునిని నేను. బ్రహ్మచారుల (జితేంద్రియుల) లోపల సనత్కుమారుఁడను నేను. ధర్మముల లోపల ఫలాభిసంధిలేని ధర్మమగు నాత్మవిద్యోపము నేను. క్షేమములందు (భయరాహిత్యము గలిగించువానిలోపల) ప్రత్యగాత్మ స్వరూపానుసంధానము నేను. గుహ్యము లోపలఁ * బ్రియవచనమును మౌనమును నేను. మిథునములలోపలఁ బ్రజాపతి నేను. అప్రమత్తు లగువారిలోపల సంవత్సరము నేను. ఋతువులందుఁ జైత్ర వైశాఖములు(వసంత ర్తువు) నేను. మాసముల లోపల మార్గశీర్షము నేను. నక్షత్రములలోపల నభిజిత్తు నేను. యుగములందుఁ గృతయుగము నేను. ద్వంద్వ సహులయినధీరులలోపలనసితుండగు దేవలుఁడు నేను. వేదవిశారదులలో వ్యాసుఁడు నేను. కవులలో (దీర్ఘదర్శులలో) సూక్ష్మ బుద్ధిగల కావ్యుడు (శుక్రుఁడు) నేను. జ్ఞానైశ్వర్యాదులు గలవారిలోపల వాసుదేవుఁడు నేను. భాగవతులలోపల నీవు నేను. కింపురుషులలోపల హనుమంతుఁడు నేను. విద్యాధరులలోపల సుదర్శనుఁడు నేను. రత్నములయందుఁబద్మరాగము నేను. మిక్కిలి సొగసైనవానిలోఁ దామరమొగ్గ నేను. తృణజాతులలోపలఁ గుశము నేను. పురోడాశము మొదలయిన హవిస్సులలో నావు నేయి నేను. ధనార్జనశీలు రయినవారిలోపల లక్ష్మి నేను. కాదు

---

* ప్రియవచనము లాడినను మౌనముతో నుండినను మిథునములోపలి యభిప్రాయము తెలియుదు. కనుక నవిరెండును గుహ్యములందుఁ జేటిగాఁ జెప్పఁబడెను.

గలవారిలోపల (జూదము మొదలగువానిచే నేను జయించితినని) ఛలముచేతఁ గలుగు నాగ్రహము నేను. ఓర్పు గలవారిలోపల నోర్పు నేను.సత్త్వగుణప్రచురులగువారిలోపల సత్త్వము నేను. *ఓజస్సులయం దోజస్సు నేను. బలవంతులయందు బలము నేను. భాగవతులలోపలఁ బంచరాత్రోక్తమును బంచకాలములం డనుష్ఠింపఁ దగినదియునగు కర్మము నేను. మత్స్యము మొదలు గొని కృష్ణునివఱకుఁగల తొమ్మిది యవతారమూర్తులలోపల సర్వకారణభూత మైన యాదిమూర్తి నేను. గంధర్వులలోపల విశ్వావసువు నేను. అప్సరసలలోపలఁ బూర్వచిత్తి నేను. పర్వతములలోపల స్థైర్యము నేను.భూమికిఁగల గంధతన్మాత్రము నేను. అప్పులకు సర్వరసకారణమైన రసము నేను. మిక్కిలి తేజముగల వానిలోపల సూర్యుని తేజము నేను. సూర్యచంద్ర తారకములందుఁగల ప్రభ నేను. ఆకాశమందుఁగల ప్రభ నేను. ఇంద్రియములకు విషయములందెల్లఁ బగంబయిన స్పర్శము నేను. బ్రహ్మణ్యులగు వారిలోపలబలి నేను.వీరులయం దర్జునుఁడు నేను. భూతములయుత్పత్తియు స్థితియుఁబ్రలయమును నేను. పాదముల గతియు వాక్కులయుక్తియుపాయువునుత్సర్గమును హస్తమును పాదనమును,ఉపస్థము నానందమును నన్నెడి యీ యైదుకర్మేంద్రియవ్యాపారములును కన్నులదర్శనమును జెవుల శ్రుతియురసనము నాస్వాదమును ఘ్రాణమునాఘ్రాణమును,త్వక్కు స్పర్శమున నన్నెడి యీ యైదుజ్ఞానేంద్రియవ్యాపారములును నేనే. సకలమయిన యింద్రియములకును నింద్రియము (నిర్వాహకుఁడను) నేనే.

* ఓజస్సుఅనఁగాఇంద్రియపటుత్వము. సహస్సుఅనఁగా ధారణసామర్థ్యము. బలమనఁగా శరీరబలము.

పృథివియు వాయువు నాకాశమును నప్పులును జ్యోతియు నేను. వీనికెల్లఁ గారణమయిన యహంకారమును మహత్తత్త్వమును నహంకార వికారములయిన యేకాదశేంద్రియములును నచిత్తు సమష్టియు చిత్తుసమష్టియు రజస్సును సత్త్వమును దమస్సును బరంబగు ముక్తాత్మస్వరూపమును నేనే. నేను గేవల మీతత్త్వములే కాక వీని గణనమును నీనిలక్షణముల యెఱుకయు దాని వలన నా యా వస్తువుల స్వరూపస్వభావములు గలరూపున నిశ్చయించునట్టి జ్ఞానమును నేనే. లోపలఁ బ్రవేశించునట్టి యీశ్వరుఁడయిన నేనును నాకు శరీరమైన జీవుఁడును సత్త్వాది గుణములును సమష్టివ్యష్టిరూపములయి సర్వకార్యరూపములై యాగుణముల కాశ్రయములై యున్న యచిద్ద్రవ్యములునుదప్ప మఱియొక్క వస్తువు గలుగదు. * అన్నియు చిత్తు నచిత్తు నీశ్వరుఁడునను మూఁడుతత్త్వము లగును. చిదచిత్తులెల్ల మదాత్మకములై నానియమమునకులోనై యుండును. నేను నెంతో కాలము నకేని భూమియందలి పరమాణువులను లెక్కపెట్టుదునుగాని యట్లే నా విభూతులను లెక్కపెట్టనేరను. నేను సృజించునట్టి యండములే కోట్లకొలఁది ననంతములై యుండఁగా నందలి నా విభూతులను లెక్కింప నలవియగునా? వర్చస్సును కాంతియుఁ గీర్తియు సంపత్తియు లజ్జయు సత్యాత్రదానమును, సౌందర్యమును భాగ్యమును వీర్యమును సోర్పును వస్తుతత్త్వజ్ఞానమును, హితాహితపర్యాలోచనమును నెందుఁగల వ్రాయది యంతయు నావిభూతియే యగును. నీకు నావిభూతులను నీనిని

* 'న తదస్తి వినాయత్స్యాన్మయా భూతంచరాచరమ్' అను భగవద్గీతార్థమిట యనుసంధింపవలయును.

సంక్షేపమున నన్నింటిని జెప్పితిని. ఇవి యెల్ల నాసంకల్పమాత్ర మునఁ బుట్టినవి యని వేదము కలరూపునఁ జెప్పుచున్నది. కనుక వాక్కును జెడుమాటలు పలుకకీక నిగ్రహింపుము. మనస్సు చెడువిషయములను ధ్యానింపకుండునట్లు నిగ్రహింపుము. ప్రాణ ములను దుష్టాన్నాదులచేతఁ బోషితము గాకుండునట్లుగాని పూరికకుంభకరేచకాద్యుపాయముచేతఁగాని నిగ్రహింపుము. ఇంద్రియములను నిగ్రహింపుము. ఆత్మను నపాయములందుఁ బ్రవర్తింపనని నీయంతట నీవే నిగ్రహింపుము. ఇట్లు చేయుదు వేని మరల సంసారమార్గమునకు రావు. ఎవఁడు వాక్కును మనస్సును బక్కఁగా నిగ్రహింపఁడో వాఁడు బుద్ధిమంతుఁ డయినను యతియైనను వాని వ్రతమును దపమును దానమును బచ్చికుండలయందలినీ రొలుకుచుండునట్లుండునే కాని గుదు రుగా నుండవు. కాఁబట్టి వాక్కును మనస్సును శ్రోత్రాణములను నాభక్తితోఁగూడిన బుద్ధిచేత నిగ్రహింప వలయును. అట్లు నియమింపఁగా మోక్షోపాయము సంపూర్ణమగుచున్నది. ఇది పదియాఱవయధ్యాయము.

శ్రీకృష్ణుఁడు బ్రహ్మచారిగృహస్థవర్ణముల నుద్ధవునకుఁ బ్రతిపాదించుట.

ఉద్ధవుఁడు—తమ తమ వర్ణాశ్రమములకు ననుగుణము లయిన యాచారములం బ్రవర్తించుచుండు మనుష్యు లెల్ల వారికి నీవు నీప్రాప్తికి సాధనమైన ధర్మమును (నీభక్తిని) జెప్పి తివి. అరవిందాక్షా! తమతమవర్ణాశ్రమములకు ననుగుణమయిన ధర్మముల నేప్రకారము ననుష్ఠించుచు వచ్చిన యెడల మను

మ్యులకు నీయందుభక్తి గలుగును? ఆయనుష్ఠించు ప్రకారమును నాకుఁ జెప్పము. ఉపదేష్టలగు వారి పరంపరవలనఁగదా యది తెలియవలెను. నన్నడిగెదవేల యందువా? కుహోభావా! ప్రభూ! తొల్లిపరమం బయిననుఖరూపం బగు నాధర్మమును నీవు హంసరూపమున బ్రహ్మకును సనకాదులకును నుపదేశించితివి గదా! అమిత్రకర్శనా! ఆధర్మమును నీవు మున్నులోకమునందుఁ జక్కఁగా నేర్పఁజితివి ఇంతకుమిక్కిలియుఁ బెద్దకాలమయినది. కాఁబట్టి యిది మనుష్యలోకము నందిపుడు బహుతరముగా లేక విచ్ఛిన్నమయి యున్నది. అచ్యుతా! ఆధర్మమును జెప్పువాఁడును జేయువాఁడును, గాచువాఁడును నీకంటె మఱి యొక్కఁడు భూలోకమందుఁ గలుగఁడు.విద్యలన్నియువిగ్రహములుదాల్చియున్నబ్రహ్మసభయందును గలుగఁడు. ఇట్లాధర్మమునకుఁ గర్తయు రక్షకుఁడునుఁబ్రవక్తయునగు నీవీభూతలమునుదిగవిడిచిపోయితివేని,మధుసూదనా! అది యెంతయు నశించిన దగును. అప్పుడు దాని నెవ్వఁడు చెప్పఁగలఁడు? కావున నీవే యుపదేశింపవలయును. సర్వాధర్షిష్ఠా! అట్లు ధర్మమునకుఁ గర్తయు వక్తయు రక్షకుఁడునగు నీవు మాకు నీభక్తి యనెడు ధర్మ మెట్టి యంగముల తోఁ గూడినదో, యేయాశ్రమికి విధింపఁబడినదో దానిని, నాస్వామీ! నాకుఁ జెప్పము' అనెను. శ్రీశుకుఁడు—ఇట్లు తన భృత్యులయందు ముఖ్యుఁడయిన యాయుద్ధవుఁ డడుగఁగా భగవంతుఁడు వారి ప్రీతుండై మనుష్యుల కేమముకొఱకు సనాతనములగు ధర్మములను జెప్పువాఁడయ్యెను.భగవంతుఁడు—లోకహితైకకారియగు నీవడిగిన యీప్రశ్నముధర్మయుక్తమయినది.

ఏలన నిది తమ తమ వర్ణాశ్రమముల కనురూపమయిన యా చారములుగల మనుష్యులకు (జ్ఞానానుష్ఠానాదులచే) ముక్తి సాధకమైనది. భక్తియోగము ననుగ్రహించునదియై వర్ణాశ్రమానుగుణమయిన ధర్మమును నావలన నెఱుంగుము. మొట్టమొదటఁ గృతయుగమందు మనుష్యులవర్ణము హంస (బ్రాహ్మణవర్ణమని) యని చెప్పఁబడెను. అదియొకటే వర్ణమపు డుండెను గాని తక్కిన క్షత్రియాదివర్ణములు గలుగవు. ఆయుగమునందు జనులా హంసత్వజాతిచేఁ గృతకృత్యులై యుండినందున దానికిఁ గృతయుగమని పేరు తెలియుదురు. అపుడు ప్రణవము మాత్రమే వేదముగా నుండెను. ధర్మమునకు మనోవిషయుఁడగు నేను వృషరూపమునఁ బతుష్పాదములనుంటిని గాని, క్రియావిశేషములగు యజ్ఞాదులు గలుగవు. అపుడు వాసు కేవలము యోగనిష్ఠులై యుండి నిరస్తనిఖల దోషుండ నగుట హంసుండ (శుద్ధుఁడ) నగు న న్నుపాసించిరి. దానివలన వారు కల్మషములను వీడి నావలె హంసులై యుండిరి. మహాభాగా ! పిదపఁ ద్రేతాయుగము ప్రవేశింపఁగా నాహృదయమందుఁగల ప్రణవమునుండి ఋగ్యజుస్సాములనెడిమూఁడవయవములు గల వేదవిద్య ప్రాదుర్భవించెను. ఆత్రయీవిద్యవలననుండి హోతయు నధ్వర్యువును నుద్గాతయు ననునంధించుటచే మూఁడురూపము లైనఋగ్యజుస్సామ మంత్రములు గల యజ్ఞము నేనుగా నుంటిని — అనఁగాఁ ద్రేతాయుగము మొదట యజ్ఞాదులగు ధర్మములును వానికి విధాయకములయిన వేదములును గలిగి యుండెను. బ్రాహ్మణులు క్షత్రియులు వైశ్యులు శూద్రులు ననెడి నాలుగు వర్ణములు విరాట్పురుషుని

వలనఁ బుట్టిన చతుర్ముఖునివలన నతని * ముఖమునుండియు, బాహువులనుండియు, నూరువులనుండియుఁ, బాదములనుండియుఁ బుట్టిరి. వారికి, వారి వారి ధర్మములే తెలుపునట్టి లక్షణము. చతుర్ముఖశరీరకుఁ డయిన నాబ్రహ్మనమునుండి గృహస్థాశ్రమమును, హృదయమునుండి బ్రహ్మచర్యమును బుట్టెను. వక్షస్థలమునుండి వానప్రస్థమువుట్టెను. శిరస్సును సన్న్యాసమాశ్రయించెను. వర్ణములకు జన్మదేశములయినముఖబాహూరుపాదములను నాశ్రమములకు జన్మభూములయిన బ్రహ్మనహృదయ వక్షశ్శిరస్సులనును (అనఁగా ముఖాదుల ధర్మములను) మనుష్యుల ప్రకృతు లనుసరించునవయ్యెను. కాఁబట్టి నీచములగు జన్మదేశములచేతఁబ్రకృతులునీచములును, నుత్తమములయిన జన్మప్రదేశములచేత నుత్తమములునవయ్యెను. శమము, దమము, తపస్సు, శౌచము, సంతోషము, ఋజుత్వము, ఆర్జవము, మద్భక్తి, దయ, సత్యము ననెడియివి బ్రాహ్మణ ప్రకృతులు (స్వభావములు). తేజస్సు, బలము, ధృతి, శౌర్యము, తితిక్ష, ఔదార్యము, ఉద్యమము, స్థైర్యము, బ్రహ్మణ్యము, ఐశ్వర్యమునఁ బనెడియివి క్షత్రియస్వభావములు. ఆస్తిక్యము, దాననిష్ఠ, దంభములేమి, విప్రసేవనము, ధనముయందుఁ బాలుననని తుష్టినొందకుండుటయును, నివి వైశ్యుని స్వభావములు. ద్విజాలకును గోవులకును దేవతలకునుపాయముఁ జేసి శుశ్రూషయొనర్చుటయు, దైవికముగా లభించినదానితో సంతోషమును, శూద్రస్వభావ

* ఇచట బ్రాహ్మణాదులు వైరాజుఁడగు చతుర్ముఖునిముఖాదులవలన పుట్టిరనఁగా ముఖాది వ్యవహారములను వేదప్రవచనాదులు చేయువారయి పుట్టిరని వీరరాఘవుల మతము.

ములు. అశౌచమును నబద్ధమును దొంగతనమును నాస్తిక్య మును గారణములేని కలహామును గామమును క్రోధమును ధనమందలి తృష్ణయు, వర్ణాశ్రమములులేని చండాలాదుల స్వభావములు.అహింసయు సత్యమునుదొంగతనములేకుండుటయుఁగామక్రోధలోభములు లేకుండుటయు,భూతములకుహితమునుబ్రియమునుజేయఁ బాటువడుటయు, ననునివిసర్వవర్ణములవారికి నగు ధర్మములు. ద్విజుఁడుగర్భాదానము మొదలగు సంస్కారముల క్రమమున,నుపనయనమనెడు రెండవజన్మమునుబొంది గురుకుల మందు వాసముచేయుచుజితాంతఃకరణుఁడై వేదమునునధ్యయన ముచేయుచున్నాఁడు. అట్లుతనయాశ్రమమునకుఁజెప్పఁబడిన వ్రతములందు నియతుఁడై యుండును. మఱియు నతఁడు మేఖల యు నజినమును దండమును నతిసూత్రమును యజ్ఞోపవీతమును గమండలువును దాల్చి యభ్యంగనాదులు లేనందున వెండ్రుకలు జడలుగట్టఁ,బల్లుగాని వస్త్రములుగా నితోమకి,వేడుకకు నెట్టినిప చ్చనివస్త్రములను ధరింపక, గుశలను దాల్చి యుండవలయును. మఱియు స్నాన భోజన హోమములందును జపముననుమూత్ర పురీషోత్సర్జనమునందును మౌనియై యుండవలయును, చంకల యందును మొలయందునుగల వెండ్రుకలను నఖములను ద్రుంపరాదు. అతఁడెప్పుడుగాని బుద్ధిపూర్వకముగా రేతస్సు నొలుకరాదు.అతఁడు బ్రహ్మచర్యవ్రతమును దాల్చి గృహస్థుఁడు ను గాకుండుటచే నొకప్పుడు రేతస్సును నొలుకునేని యపుడు జ లములం దవగాహనముచేసి, ప్రాణాయామము గావించి సావిత్రి నష్టోత్తరసహస్రము జపింపవలయును. వాఁడు రెండు సంధ్య—

లయందును శుచియై * యగ్నిని అర్కుని ఆచార్యుని గోవు లను విప్రులను గురువులను వృద్ధులను దేవతలను నుపాసింప వలయును. మఱియు సమాహితచిత్తుఁడును మౌనియుఁనై సంధ్య యందు సావిత్రినిజపింపవలయును. వాఁడాచార్యుని నన్నుఁగాఁ దెలియవలయును. అతని నొకింపుఁ ననమానింపరాదు. అతని యందొకమనుష్యుఁడనియసూయఁజూపరాదు. గురువు సర్వదేవ మయుఁడుచుమీ! ఆచార్యుని లేపును మాపు నుపాసింపవల యును. తాను భిక్షింపఁగా దొరికిన యన్నమునుగాని మఱి దేనినిగాని గొనిపోయి యాచార్యునకు నివేదింపవలయును. అంత నాయాచార్యుననుజ్ఞను గొని తాను దానిని నుప యోగించుచు వాగ్నియమము గలిగియుండవలయును. ఆచా ర్యునికి దానునివలె శుశ్రూషచేయుచు నతనిని సదా యుపాసిం పవలయును. అతఁడు పొవుచుండఁగాఁ బీఱుందఁబోవలయును; పరుండఁగాఁ దగ్గఱఁ బరుండియు, కూర్చుండఁగా దాపుగాఁ గూర్చుండియు నుండవలయును. చేతులుమోడ్చి యతని నియోగము నెదురుచూచుచు మిక్కిలి దవ్వుగాకయుండునట్లు నిలుచుకొనియుండవలయును. ఇట్టివ్రతముగలవాఁడై భోగ ములుమాని యధ్యయనము సమాప్తమగువఱకు నవిచ్ఛిన్న ముగా నాన్రతమును ధరించి గురుకులమున వసించియుం డవలయును. ఈబ్రహ్మచారి వేదాధ్యయనాది కర్మములకు ఫలం బగు బ్రహ్మలోకము నారోహింపఁ గోరునిడల నవును స్వాధ్యా

---

* అగ్నిని అగ్నివంశ్రోత్ర హోమముచేతను, సూర్యుని సూర్యమండలాం తర్వర్తి పరమపురుష ధ్యానముచేతను, గోవులనుగడ్డి పెండలనుగనని యిచ్చుట చేతను, గురువులనుఖణాతూదుల చేతను, నుపాసింపవలయును.

యమునకై బ్రహ్మచర్య వ్రతమును దాల్చియె గురువునకు దనదేహమధీనముగావింపవలయు. ఇట్లుచేసిన నేనై ష్ఠికుడగును. అగ్నియందును గురువునందును దనయందును దక్కిన సర్వభూతములయందును నున్న పరముండగునన్ను — భేదబుద్ధిలేక బ్రహ్మచర్యవ్రతముచేత వర్చస్సు వెలుంగుచుండ నకల్మషుండై యుపాసింపవలయును. మఱి బ్రహ్మచర్యుండు గృహస్థుండుగానం దున స్త్రీలనుజూచుటయుఁ దాకుటయు వారితో మాటలాడు టయుఁ బరిహాచకములాడుటయు మొదలగువానిని వర్జింపవల యును. ఒండొంటిని రతియందుఁ గలసియున్న ప్రాణులను బళు పక్ష్యాదులను సయితము చూడకుండవలయును శౌచమును నాచమనమును స్నానమును సంధ్యోపాసనమును (మనో వాక్కాయము లొక్కటిగా నుండుటయనెడి) ఆర్జవమును దీర్ఘసేవయు గాయత్రి మొదలగువానిని జపించుటయుఁ, దాకరానివానిని భక్షింపఁదగనివానిని మాటలాడఁగూడనివానిని వర్జించుటయు, నమస్తభూతములందును సుదాత్మకములనెడి [1] మనోవాక్కాయములసంయమము, ననెడి యివి యాశ్రమముల కన్నిటికిని సామాన్యముగాఁ బ్రయుక్తములయిన నియమములు. కులనందనా! ఇట్లు బ్రహ్మచర్య వ్రతమునుదాల్చి వేదములను దదర్థములను నధిగమించి, వేండ్రమయి యెడతెగని తపస్సుచేత నగ్నివలె జ్వలించుచు, నాయందలి భక్తియోగమును లభించి దానివలననే సన్నుఁబొందుటకుఁ బ్రతిబంధక

1. మనస్సు సంయమమనఁగా అసత్తగువానిని ధ్యానింపకుండుట. వాక్సంయమమనఁగా అసత్యము లాడకుండుట. కాయసంయమమనఁగా నిషిద్ధభోగములు లేకుండుట.

ములగు కర్మవాసనలను దగ్ధముగావించి దేహాంతమందుఁ బ్రకృతి సంబంధ మనెడి మాలిన్యము వీడి నిర్మలుఁడై ముక్తుఁ డగుచున్నాఁడు. బ్రహ్మచారి విద్యను సమాప్తము చేసిన పిదప వేదవేదార్థములను నెఱింగి మఱి యొకయాశ్రమమును బ్రవేశింపఁగోరినపుడు గురువునకు దక్షిణయొసఁగి గురువు ననుజ్ఞాతుఁడై సమావర్తనంబను స్నానము చేయవలయును. *పిదప గృహస్థాశ్రమమునై నను వాన ప్రస్థాశ్రమము నయినను బొందవచ్చును. వాఁడు ద్విజోత్తముఁ (బ్రాహ్మణుఁ) డగునేని, సన్న్యసింపవచ్చును. నాభ క్తుఁడగు ద్విజుండొకయాశ్రమమునుండి మఱియొక యాశ్రమమును బొంద వచ్చును గాని యేయాశ్రమము నమష్ఠింపక యూరక త్రిమ్మరు చుండరాదు. అందు గృహస్థాశ్రమమును గోరినవాఁడు తన కంటె వయస్సునందుఁ బిన్నదియు దుష్టురాలు గానిదియుఁ దనకు సజాతీయురాలు నయినదియుఁ దన కనురూప యైన దియు నగుభార్యను బెండ్లాడవలయును. మొదట నతఁడు సవర్ణురాలిని బెండ్లాడి పిదప నితరవర్ణపు వారిని బెండ్లాడఁదగును. మఱి యజ్ఞమును నధ్యయనమును దానములును ద్విజన్మలెల్ల వారికిని గలవు. అందుఁ బ్రతిగ్రహమును నధ్యాపనమును యాజనమును బ్రాహ్మణునికి మాత్రమే కలిగి యుండును. బ్రాహ్మణుఁడందుఁ బ్రతిగ్రహమునుదనతపస్సునకును దేజస్సునకునుయజనస్సునకును విఘాతకముగాఁ దలఁచునేని తక్కిన యాజనాధ్యాపనములు రెంటిచేత బ్రతుకవచ్చును. వానియందుదోషముగలదని

* దీనిపలన బ్రహ్మచర్యము నండియే చక్కఁగాఁజదువ బాఁటగవ యాశ్రమమును గూడఁ బొందవచ్చునని తెలియుచున్నది.

చూచునేని, [1]శిలములచేతఁగాని జీవింపవచ్చును. బ్రాహ్మణునికిఁ గలయీదేహముతుద్రములగుకామములకై యేర్పఱుపఁబడదు అదియిహమందు మిక్కిలియుఁ గాయక్లేశరూపమగుతపస్సుచేయుటకును మృతినొందినపిదప ననంతసుఖములను బడయుటకునై యేర్పడియున్నది. వాఁడుశిలోంఛవృత్తిచేతఁజిత్తమునసంతుష్టినొంది నైర్మల్యమును గలిగించునదియు మహోఫలంబయినదియును నిజవర్ణాశ్రమోచితమునైన ధర్మము ననుష్ఠించుచునాయందు మనస్సును సమాహితముఁ చేసియుండునది. గృహమందే యుండినను భోగములయం దాసక్తుఁడుగాక సంసారక్లేశములశాంతి(ముక్తి)సిబొందుచున్నాఁడు. శిలాదులచేతఁ గ్లేశపడుచున్నవాఁడును మత్పరాయణుండు నగు విప్రునికి నెవరు జీవనము గలిగింతురో వారిని నే నాపదలనుండి వేగముగా, నావ సముద్రమునుండి యుద్ధరించునట్లు లుద్ధరింతును. నాబయిన వాఁడు, తండ్రి బిడ్డలనుంబోలె సమస్తప్రాణులను నుద్ధరింపవలెను. తన్నుఁదనచేతనే యుద్ధరించుకోనవలెను. ఇట్లుగజపతిగజములనుంబోలెఁ దన్ననుబరులనునుద్ధరించుకొనవలయును. ఇట్లుచేయుటట్టిరా జిందుఁ దనకుఁగల యశోధనములనెల్ల విదిల్చికొని సూర్యునివలె మెఱయుచున్న విమానముసెక్కి యింద్రునితోడ మోదమునొందుచున్నాఁడు. విప్రుఁడుశిలోంఛవృత్తిచేతజీవనముచేయనేరక కష్టపడుచున్నచో, నతఁడు వణిజునివృత్తిచేసి నందును నిషిద్ధములగు లవణమాంసాదులను గాక తమ వ్యవహారమున కనుగుణములయిన తృణకాష్ఠాదులను నంగడి సరకులను

---

1. శిలమనఁగా పొలమునందుసొంతకాఁపు విడిచిపెట్టినధాన్యకణికలు. దానినే దినప్రతికుంచ శిలవృత్తి.

విక్రయముచేసి,బ్రతుకు దొరకకున్న యెడలను గడపిలొనవచ్చును. అప్పటికిని నాపద పయిలొనెనేని ఖడ్గముగొనిక్షత్రియవృత్తి చేతఁగానిబ్రతుకవచ్చును. కాని,కుక్కనలె నీచవర్ణములవారిని సేవించుటచేత నట్టి యాపదలను నేవిధముననుగడపుకొనరాదు. రాజన్యుఁడగువాఁడు వైశ్యవృత్తిచేతఁ గాని వనమార్గమందు వేఁటలాడుటచేతఁ గాని యదియునుగూడక పోయెనా బ్రాహ్మణవృత్తి చేతఁగాని యాపదయందు జీవింపవలయును గాని గుక్కవలె నీచవర్ణముల సేవించి యెట్లును బ్రతుకరాదు. వైశ్యుఁడు నట్టి సమయమున శూద్రవృత్తిని వర్తింపవచ్చును. శూద్రుఁడునుదంతవులు పేనుట చాపలల్లుట మొదలగుపనులు చేయవచ్చును. వీరందఱును నట్టి యాపదనుండి విడివడిన పిదప నితరవర్ణముల కర్మములు తమకు నింద్యములు గాన, యట్టి కర్మములచేత నెంతమాత్రము జీవింపరాదు. వేదాధ్యయనముచేతను(బ్రహ్మయజ్ఞాదులచేతను)స్వధచేత(తాట్టకాదిశ్రాద్ధములచేతను) స్వాహాచేతను (యాగహోమాదులచేతను)బలియన్నము మొదలగువానిచేతను దనకలిమి సొంపునకుఁదగినట్లు వరుసగా ఋషులను బితృదేవతలను దేవతలనుభూతములనుమఱ్ఱి రిభూతము లయినవానిని బ్రతిదినమును యజింప వలయును. తానేమియుఁబాటువడక దైవికముగా లభించినట్టిధనములచేతఁ గాని పరిశుద్ధమైన ధనముచేతఁగాని తనవృత్తిచేత గడించిన దానిచేతఁగాని, పోష్యులగు వారిని బీడింపకయె నన్నుయజింప వలయును.యజ్ఞములనుష్ఠింపవలయును. గృహస్థుఁడగువాఁడు ను భార్యాపుత్రాదుల యందు మమత నుంపరాదు. దేహముఁ దన్నుగాఁ బ్రమాదపడరాదు. వాఁడు తత్త్వ స్వరూపము నెఱిం

గినవాఁడై తాను గన్నారఁ జూచువానివలెనేచూడనివి (అదృష్ట ములు) అగు స్వర్గాదులనుగూడ నశ్వరములుగాఁ గనుఁగొన వలయును. పుత్రులు పెండ్లములు అప్తులు బంధువులు మొద లగువారితోడి పొత్తు చలిపందిరియందలి బాటసారుల పొత్తు వంటిదేకాని మఱియొకటి గాదు. నిద్రరాఁగా స్వప్నము వచ్చును. నిద్రవీడఁగా స్వప్నమునుమాయును. అట్లే దేహము కలిగిన వెంటఁ బుత్రాదులు గలుగుదురు. ఱది వీడఁగా వారును వీడుదురు. ఇట్లు దృష్టాదృష్టములు రెండును ననిత్యములగుటఁ బరామర్శించి సమాహితుఁడై గృహములయం దొకయతిథి వలెఁ దానుదాసీనుఁడై వసించుచు నహంకార మమకారములు విడిచి యాగృహములందాసక్తుఁడుగాకుండవలయును. మఱియొక గృహస్థునకు విహితములయిన యజ్ఞాదికర్మములచేత నారా ధించి భక్తిమంతుఁడై యావజ్జీవము గృహాశ్రమమునందే యుండ వచ్చును పుత్రవంతుఁ డయినయెడల వానప్రస్థుఁడుగావచ్చును. లేక సన్న్యసింపవచ్చును. ఎవ్వఁడు గృహమందు బుద్ధి దగులు కొలిపి దారపుత్రధనేషణలచేత నాతురుఁడై స్త్రీలకు వశ్యుఁడగు నో యట్టివాఁడు బుద్ధిచెడి నేను నాదియనెడియభిమానములచేత మూఢుఁడై బంధమునొందును. వాఁడు 'అయ్యో వృద్ధులైననాతలి దండ్రులును బసిబిడ్డల తల్లియగు నాయిల్లాలును గన్నబిడ్డలును నేను లేనియెడల దిక్కుమాలిన వారగుదురే! అట్లు వారు దుఃఖితులై యెట్లు బ్రతుకఁగలరు?' అని యిట్లు గృహాదుల యందుఁ దలంపులు మళ్లడిగొనుటచేఁ జిత్తము తత్తరపడఁ గా, బుద్ధిచెడి విషయ భోగమునందుఁ దృష్టినొందక యా గృహాదులనే తలంచుకొనుచు మృతుఁడై యంధతమ

న్నును (మిక్కిలిశ్రమనంబయిన జన్మమును) బొందు చున్నాఁడు. ఇది పదియేడవయధ్యాయము.

—:కృష్ణుఁ డుద్ధవునకు వానప్రస్థాశ్రమ ధర్మములను జెప్పుట.:—

శ్రీభగవంతుఁడు—వాన ప్రస్థుఁడు కాఁగోరినవాఁడు భార్యను బుత్రులకప్పగించి కాని, భార్యను గూడఁదోడ్కొనికాని, వనమునకుఁ బోయి జితేంద్రియుఁడై యాయువునందుమూఁడవభాగమంతయు (డెబ్బదియేనవయేఁడు వఱకు) వసించి యుండవలయును. అడవియందుఁబుట్టినవియు శాస్త్రవిహితములయినవియునగు కందమూలఫలములచేతజీవనముగావించుకొనవలయును.వల్కలములను,నదిలేనిచోదృణములనో పర్ణములనోయజనముఁనోవస్త్రములుగాఁగట్టుకొనవలయును. కేశములు రోమములు నఖములుగడ్డములు మీసలు మొదలగు మలములు ద్రుంచిపుచ్చరాదు. పలుదోమరాదు. నిత్యము మూఁడు కాలములు జలమునందుఁ గ్రుంకవలయును. తృణాదులు పఱచిన భూమిపైఁ బరుండవలయును. మండువేసవియందుఁ బంచాగ్నులచేతఁ దనకుఁ దాపముగావించుకొనవలయును. వర్షాకాలమునందు జడివానలయందుఁ దోర్చియుండవలయును. శిశిరమునందు నీళ్లలోఁగంత్తుకబంటి మునిఁగియుండవలయును. ఇట్టి వృత్తి గలిగి తనతన వర్ణాశ్రమమునకుచితమయిన తపమునొనరింపవలయును.కందమూలముల నగ్నిచేతఁ బక్వములు గావించి భుజింపవలయును.ఫలములను గాలముచేతఁ బక్వములయిన వానిని భుజింపవలయును. నివ్వరిధాన్యములను ఓటిచేతఁగాని జాతిచేతఁగాని దంచుకొనవలయును. దంతములే ఓలుగాను గొనుట (యనఁగా దంతము

లతోనే ధాన్యమును జక్కఁబెట్టుకొనుట) దగును. తన జీవన మునకు సాధనమయిన కందమూలాదులను తానే తెచ్చుకొన వలయును గాని మఱియొకరిచేఁ దెప్పించుకొనరాదు. దేశ కాలముల బలిమిని దెలిసికొని కాలాంతరమునఁ దెచ్చిన దానినపు డు వానప్రస్థుఁడగుకొనరాదు. వన్యములగునీవారాదులచేతఁ గాలచోదితములయిన యగ్న్యయణాదులగు చరుపురోడాశాదుల నిర్వహింపవలయును. శ్రౌతపశువగు ఛాగము మొదలయినవాని చే నన్నుయజింపరాదు. వైదికవాక్యములందు, మునికిఁగూడఁ నగ్ని హోత్రమును దర్శమును పౌర్ణమాసమును జాతుర్మాస్య మునువిహితములయియున్నవి. కనుక వానియందలికర్మముచేత నన్ను వానప్రస్థుఁడ రాధింపవలయును. ఇట్లుమని, నాడులుదేహ మంతయు వ్యాపించి యుండగా, జీవితకాలమంతయు నాచరిం చిన తపస్సుచేతఁ దపోమయుం డగు నన్నారాధించి (యనఁగా యావజ్జీవము ఫలాభిసంధిలేక స్వధర్మనిష్ఠుఁడై మద్భక్తియు క్తుఁడై యుండి) యీలోకమును విడిచి దేహాంతమందు నన్నుఁ బొందుచున్నాఁడు. మిక్కిలి కష్టముచేతఁ గావించిన యీతపస్సు నిశ్శ్రేయసమునకు సాధనమైనది. ఇట్టి మహా నీయమయిన తపమును మిక్కిలి యల్పమయిన కామమున కు నుపయోగించిన యెడల నట్టి వాని కంటె మూర్ఖుఁడెవఁడు గలఁడు? ఈవానప్రస్థుఁడు తనకు నియమంబయిన స్వధర్మము ందు సమర్థుఁడు గాక ముదిమిచేతఁ గంపము నొందినపుడు, ఆ హవనీయాదు లయిన యగ్నులను హృదయమం దారోపించి కొని నాయంచే చిత్తమిడి యగ్నిని బ్రవేశింపవలయును. స్వ ర్గాది లోకములు కర్మవిపాకములు గనుక నరకరూపములే య

గును. వాని యందు విరక్తిగలిగినపు డగ్నులను న్యాసముచేసి కొని ప్రవ్రజనముచేయ వలయును. వాఁడు మొదట యథావిధి నెనిమిది శ్రాద్ధములను గావించి ప్రాజాపత్యేష్టిచే నన్నారాధించి సర్వస్వమును ఋత్విజున కొసంగి యగ్నులను దనయాత్మయందారోపించికొని నన్నుఁ దప్పఁ దక్కినవానియం దపేక్షారహితుఁడై ప్రవ్రజనము గావింప వలయును. విప్రుఁడు సన్న్యసించునపుడు దేవతలు దార పుత్ర బంధుజనాదుల రూపమునఁ దోఁచి 'వీఁడు మనల నుల్లంఘించి పరమపదమునకుఁ బోవునో' యని వానికి విఘ్నములు గావించుచుందురు. వాఁడు మునియగునేని కౌపీన మొక్కటియే వస్త్రములన్నిటివలెఁ దాల్ప వలయును గాని మఱియొక్కటి దాల్పరాదు. వాఁ డాపదలేనపుడు త్రిదండమును గమండలువును దప్పఁ దక్కిన వాని నెల్లఁ ద్యజింప వలయును. చూపు వెట్టి చక్కఁగాఁ బరిశుద్ధమైనచోటనే యడుగు పెట్టవలయును. జలమును వస్త్రము చేత వడియఁగట్టి త్రాగవలయును. సత్యముచేతఁ బరిశుద్ధములయిన మాటలు పలుక వలయును. మనస్సుచేతఁ దగును దగదని వివేచించి యుక్తమయిన దాని నాచరింపవలయును. వాక్కునకు మౌనమును దేహమునకుఁ గామ్యకర్మముల విడువఁబడుటయు మనస్సునకుఁ బ్రాణాయామమును దండములగును. ఇవి నాలుగవయాశ్రమమువాని కెవ్వనికి లేకుండునో వాఁడు యతిగాఁడు. ఉద్ధవా! వెదుళ్లుచేపట్టినంత యతిగాఁడు. నాలుగు వర్ణములవారి యందు భిక్షాచరింపవచ్చును. అయినను వారియందు నభిశస్తులు పతితులు మొదలుగాఁగల నింద్యులను వర్జించి తక్కినవారినే యాచింపవలయును. మఱియు యతి

యేడిండ్లయందు మాత్రమే బిచ్చమడుగవలయును. ఆయిం డ్లును ముందుగా నేర్పఱచుకొన్నవి గా కుండవలయును. అంత వఱకు లభించిన దానితోనే తృప్తినొందవలయును. ప్రతిదిన మును నూరి వెలుపలనున్న నీటిపట్టునకుఁ బోయి యాచమన ముచేసి మూనియై తాను దెచ్చిన భైక్షాన్నము నెవరేని యా చించిన యెడల వారికిఁ బంచి యిచ్చి శేషించిన దంతయును భుజింపవలయును, కాని, యంత కన్న నెక్కుడు మరలఁ బోయి తెచ్చుకొనరాదు. మఱియు దా నొక్కండు నసహా యుఁడై యెందును దగులుపడక లోపలి వెలుపలి యింద్రియ ములను రెంటిని నడంచి పుచ్చి యాత్మయందే క్రీడించుట యందుఁ గుతుకము గలిగి పరమాత్మయందే సంతుష్టుఁ డై సమస్తమును బ్రహ్మాత్మకములని సమదృష్టి గలిగియుండవల యును. జనులు లేకయు భయము గలుగకయు నుండు చోటు వాసస్థానము గావించు కొనవలయును. మఱియు నాయందలి భక్తిచేత నిర్మలంబగు మనస్సుగలవాఁడై తనయాత్మయుఁ నావలెనే జ్ఞానైకరూపమైనదని చింతింపవలయును. తనకు బంధ హేతువును మోక్షహేతువును తత్త్వజ్ఞాన నిష్ఠచేతఁ బర్యాలో చింపవలయును. ఇంద్రియములు విచ్చలవిడిగా నుంచుటయే బంధము. వాని నడంచిపుచ్చుటయే మోక్షము. కాఁబట్టి మన స్సుతోఁ గూడిన యింద్రియము లయిదింటిని నడఁచిపుచ్చి నా యందే భక్తిభావముగలిగి శుద్ధములగు కామములైనశబ్దాది విషయములందు విరక్తుఁడై యాత్మస్వరూపమం దపారమయిన సుఖమును బడసి చరింపవలయును. మఱియు భిక్షార్థము పురము లను గ్రామములను గొల్లపల్లెలను సాత్త్విక జనసమూహముల

నును జొచ్చుచును మహీయందెల్లఁ బుణ్యస్థలగుదేశములను నదులను బర్వతములను వనములను నాశ్రమములను సంచరింపవలయును. వానప్రస్థులున్నయాశ్రమప్రదేశములందు మాటిమాటికి భిక్షగొనవలయును. ఏలనఁగా వారు శిలవృత్తిచేఁ బడయు నన్నమును దినుటచేతఁ దాను శుద్ధసత్త్వుఁడై మోహము నివర్తించి నుక్తి నొందుచున్నాఁడు కావునసే యందు మాటికి భైక్షమాచరించుచున్నాఁడు. (కామములవలన విరక్తుఁడగుటకు నుపాయము వినుము.) ఈకనఁబడుచున్న శబ్దాది విషయజాలమును వాస్తవముగాఁ గనుఁగొనరాదు. ఏలన నవి నశించునట్టివి. దీనినిబట్టి పారలౌకికవిషయములందును జిత్తము దగులువడ కుండవలయును. ఇహపరములందలి కామములను సాధించుటకైన కార్యములనుండి విరమింపవలయును. ఇట్లు చక్కఁగా వివేకముచేత విరక్తుఁడు గావలయును. మఱియు బుద్ధి యింద్రియములు మనస్సు ప్రాణములు పంచభూతముల నెడి వీని కూడికచేతనయిన యీజంగమ శరీరము ప్రకృతి పరిణామాత్మక మని వితర్కించి బ్రహ్మాత్మకంబగు తన యాత్మస్వరూపమందే కుదురుగా నెలకొని దానినే చింతనము సేయుచు శరీరమం దాత్మాభిమానమును వదలి మరల నాశరీరము నాత్మగాఁ దలంప కుండవలయును. భగవంతుఁడే పరమప్రాప్యమును బ్యాపకమును, నామనోరథమందుఁగల తక్కిన వంతయు నతఁడే యనెడి యధ్యవసాయమే వైరాగ్యయుక్తమగు జ్ఞానము. అట్టి విరక్తిగలజ్ఞాననిష్ఠుఁడుగాని, ఫలాపేక్ష లేకుండు మధ్యక్తుఁడుగాని యుపాయము తమకు నిష్పన్నమై యుండుటం బట్టి విధినిబట్టి ప్రవర్తింపవలయు నని కాని నిషేధమునుబట్టి నివర్తింప

వలయునని కాని యొక నియతికి లోనుగాకుందురు. వారన్నియు నావిధినిషేధములను బట్టి కాక భగవత్సంకర్యములని చేయుచుండు వారు. కనుక, వారాశ్రమములును వాని లింగములును దమ ముక్తి యుపాయమునకుఁ దోడుపడునట్టి ననుబుద్ధి గలిగియుండరుకాని, భగవత్సంకర్యము లని తలంచుటచే స్వరూపముతోవానినినిష్ఠించుటవదలకుందురు. అట్టివాఁడు వివేకవంతుఁడుగా నుండినను బాలకునివలెఁ గ్రీడించుచుండవలయును. నేర్పరియైనను జడునివలెఁ జరించుచుండవలయును. విద్వాంసుఁడయినను వెఱ్ఱి పట్టిన వానివలెఁ బలుకవలయును. వేదార్థనిష్ణుఁడయినను బళువువలె (నజ్ఞునివలె) నడచుకొనవలయును. వేదవాదము లందాసక్తుఁడుగాఁదగదు. పాషండియుఁగారాదు. కేవలము తర్కనిష్ఠుఁడును గారాదు. పనికిమాలిన ముచ్చటలకుఁ గాని రచ్చలకుఁ గాని యెవరి పక్షమును జేరరాదు. ధీరుండై జనులకు భయపడరాదు. జనులను భయపెట్టుటయుఁ దగదు. దురుక్తములను సయించుకొనవలయును. ఎవరినిగాని యవమానింపరాదు. భూతపరిణామము లయినదేవమనుష్యాదిదేహములందుండెడి ప్రత్యగాత్మలయందు నెలకొనియున్న పరుండయిన పరమాత్ముఁడు, జలపాత్రములు పెక్కింటియందుఁ గనఁబడుచున్న చంద్రునివలె నొక్కఁడే యగును. భూతములకెల్లఁ బరమపురుషుఁడే యాత్మగాన దేహమును గూర్చి యెవరితోఁగాని పళువులవలెఁబగ పెట్టుకొనరాదు. ఆకటివేళ నశనముదొరకని యెడల ధృతిమంతుఁడగువాఁడు విషాదము నొందరాదు. ఒకప్పుడశనము దొరకెనా యందులకై యుబ్బరాదు. ఏలనఁగా నది దొరకుటయు దొరకకపోవుటయు రెండును దైవా

ధీనములగును. 'అక్లేని భిక్షయెత్తుటకుఁ బాటుపడవలసినది చాలుఁగదా' యందువా? అట్లుగాదు. ఆహారము కొఱకుఁ బాటుపడియే తీఱవలయును. దాని వలననే ప్రాణములు నిలఁబెట్టుకొనఁగూడును. ప్రాణములు నిలఁబెట్టుకొనుటవలనఁ బనయేమందువా? దానివలనఁ దత్త్వమును విమర్శించుట గలుగుచున్నది. ఆ తత్త్వమును (అనఁగాఁ జిదచిదీశ్వరుల స్వరూపమును) దెలియుటవలన ముక్తి గలుగుచున్నది. కావున నందుల కుపయుక్తమగు ప్రాణధారణమునకై యాహారమును గొనఁ బ్రయత్నింపవలయును. తాను బాటుపడకయే దైవికముగా దొరకిన యన్నము శ్రేష్ఠమైనది. తక్కినది నికృష్టమైనది. ఆరెంటియందు దేనినిగాని గుఱుతవలయును. అట్లు వస్త్రముగాని శయ్యగాని దైవికముగాఁ బ్రాప్తించినదానిని మునియగువాఁడు గయికొనవలయును. శౌచమును, ఆచమనమును, స్నానమును మఱి తక్కిననియమములను నేను శాస్త్రమును బట్టి కాక లీలకొఱకుఁ జేయునట్లె జ్ఞానియు శాస్త్రముచేతఁగాక 'యిదికైంకర్యము నాస్వరూపమున కనుగుణమైన' దని తలఁచి చేయవలయును. ఇటువంటి యాచారముతోఁ గూడి యున్నవానికి బ్రహ్మాత్మకములు గాక స్వతంత్రములై వస్తువులున్నవనుభేదభ్రాంతి గలుగదు. వానికి సద్వస్తువును మదాత్మకములని బుద్ధి గలిగియుండునుగాన దానిచే నాభేదభ్రమము కొట్టువడిపోవును. అయిననుదేహము ముగియునంతలో నెప్పుడేనియొకప్పుడట్టితోఁ పిక గలుగవచ్చును గాని, వాఁడు మదాత్మకములనెడి చూపు చేత దేహాంతమందు నన్నుఁ బొందుచున్నాఁడు గాన దేహాంతమం దట్టి తోఁపిక నిరవశేషముగా నివర్తించు

చున్నది. కామములకు మీఁదటిఫలములు దుఃఖములే కాన మిక్కిలి హేయములను నిశ్చయము నొందినవాఁడై యవి యనర్థావహములను బుద్ధియుఁజెంది మత్ప్రాప్తికి సాధనధర్మ మిదియని తెలియనివాఁడు మననశీలుఁడును బ్రహ్మ నిష్ఠుండు నగు గురువు సన్నిధి నొందవలయును. మఱియు బ్రహ్మమును దెలిసికొనునంతవఱకును గురువునందు భక్తియు శ్రద్ధయుఁ గలిగియు యసూయయమాని యతఁడే నెనని తలఁచి యాద రంబుగఁ బరిచర్య చేయుచుండవలయును. ఇంద్రియవర్గ మా తీంటిని నడంచివుచ్చక, విషయములందు మిక్కిలి యాసక్త మయిన బుద్ధిగలిగి జ్ఞానవిజ్ఞానములు రెండును లేకుండునట్టి వాఁడు, త్రిదండము మొదలగు నాయాయాశ్రమ చిహ్న ములను దాల్చుట, వానినిగొని బ్రతుకుటకే కాని యాయాశ్ర మములను నిర్వర్తించుటకుఁ గాదు. అట్టివాఁడు తాను విశేష భూతుండని తెలియఁడు గాన తన్నును, తాను స్వతంత్రుఁడనెడి యభిమానముచేతఁ దన యాత్మయందున్న నన్నునుఁ బ్రతా రించుచున్నాఁడు. కనుక సర్వాశ్రమములవారికి విహితధర్మ మగు భక్తిని వాఁడు గీడ్వఱచుకొనుచున్నాఁడు. భక్తి లేమిం జేసి వానికిఁ బాపములు దూలకయె యుండును. దానినిఁబట్టి వాఁడిహమునకునుబరమునకును వెలియగుచున్నాఁడు. నాలుగవ యాశ్రమమువాఁడగు భిక్షువునకు నింద్రియ జయమును సహిం సయు ధర్మములు. వానప్రస్థునకు శాస్త్రీయకాయక్లేశరూప మగు తపమును స్వాత్మ పరమాత్మల స్వరూపములను గనుఁ గొనుటయు ధర్మములగును. గృహస్థునకు భూతరక్షయుఁ బంచ మహాయజ్ఞములును ధర్మములగును. బ్రహ్మచారికి నాచా

ర్యుని సేవించుట ధర్మము. ఋతువులందుమాత్రము భార్యను బొందునట్టి గృహస్థునకు బ్రహ్మచర్యమును దపమును శౌచమును సంతోషమును భూతములందుఁ జెలిమియుఁ గలుగుచున్నవి. ఎల్లవారికిని న న్నుపాసించుట ప్రధానమయిన ధర్మము. ఎవ్వఁడు దేవతాంతరమునందు భక్తిసేయక సర్వభూతము లందు మదాత్మకము లనెడి బుద్ధిగలిగి యిట్లు స్వధర్మముచేత నన్ను భజించుచున్నాఁడో వాఁ డచిరకాలమునఁనే నాయందలి భక్తిని బడయుచున్నాఁడు. ఉద్ధవా! సమస్తమున కుత్పత్తి లయముల పట్టయినవాఁడును, గావునఁనే సర్వలోకములకు మహేశ్వరుండును సమస్తమునకుఁ గారణభూతుఁడును, బర బ్రహ్మభూతుండు నగు నన్ను ననపాయిని యగుభక్తిచేత వాఁడు పొందుచున్నాఁడు. ఇట్టి స్వవర్ణాశ్రమ ధర్మముచేత శుద్ధం బగు సత్త్వము గలిగి నా స్వరూపమును నెఱింగిన వాఁడై జ్ఞానవిజ్ఞానసంపన్నుఁ డై విరక్తుఁ డగువాఁ డనపాయినియగు భక్తిచేత నన్నుఁ బొందుచున్నాఁడు. వర్ణాశ్రమములు గలవారికి నాచారమనెడి యీ ధర్మము నిరూపింపఁబడినది. ఈ ధర్మము నాయందలి భక్తితోడఁ గూడిన దగునేని ముక్తికి సాధనమగును. మఱి యింతకంటె నుత్కృష్టమయిన యుపాయమును గలుగదు. సాధూ! నీవు న న్నడిగినందులకు మనుజుఁడు తనతన వర్ణాశ్రమధర్మము ననుష్ఠించుచు భక్తితోడఁ గూడినవాఁ డగునేని ప్రకృతిపురుష విలక్షణుఁడగు నన్నుఁ బొందుచున్నాఁడని నీకుఁజెప్పితిని. ఇది పదునెనిమిదవయధ్యాయము.

{భగవంతుఁడు భక్తియోగమున కశక్తులగువారికి న్యాసము ముక్తిసాధనముగాఁ జెప్పుట.}

శ్రీభగవంతుఁడు — శాస్త్రజన్యజ్ఞానం బగు విద్యయు నుపదేశజన్యజ్ఞానం బగు శ్రుతియు ననురెండును గలవాఁడై శాస్త్ర విరుద్ధముగాని తర్కమును దెలిసి సమాహితచిత్తుం డగువాఁ డీశరీరము ప్రకృతి పరిణామాత్మకమనియు భగవన్మా యచేత రచితం బయినదనియు నెఱింగి జ్ఞానాత్మక మయిన యాత్మ స్వరూపమును సర్వశేషియు సర్వాంతరాత్ముఁడు నగు నాకు లోనయినదిగా ననుసంధింపవలయును. జ్ఞానికిఁ బ్రాప్యము నేనే. కావున, నేనే వానికిఁబ్రియతముఁడు. నేనే వానికిఁ బ్రాపక మును సమ్మతుఁడును. నేను దప్పఁ దక్కిన మోక్షమును గైవల్యమును మఱి తక్కిన దేదియును వానికిఁ బ్రియముగాదు. జ్ఞానవిజ్ఞానసంపన్ను లగువారు నన్నుఁ బ్రకృతిపురుషవిలక్ష ణునిఁగాను గావున సర్వోత్తమునిఁగాను నా స్వరూపము నెఱుంగుదురు. కావుననే జ్ఞాని నాకుఁ బ్రియతముఁడగును. నేను లేక నాను నిలువనేరఁ డనుజ్ఞానము వానికిఁ గలిగి యుండును గాన వాఁడే నన్ను భరించుచున్నాఁడు. అనఁగా వాఁడులేక నేనును నిలుపోపకయుందును. జ్ఞాన లేశముచేతఁ గలుగునట్టి శుద్ధిని, దపమును దీర్థములును జపములును దాన ములును మఱి పవిత్రములయిన యితరములును జేయనోపవు. ఇట్లు జ్ఞానమునిరతిశయ శుద్ధిని గలిగించునదిగావున, దానితోఁ గూడినవాఁడై యంతరాత్మ యగు నేనే ప్రాప్యమును ప్రాప కము నగుదునని యెఱింగి యుద్ధవా! జ్ఞాన విజ్ఞానసంపన్నుఁడ వగు నీవు నాయందలి ప్రేమగలిగి న న్నారాధింపుము.

జ్ఞానవిజ్ఞానము లనెడియజ్ఞములచేత జీవాత్మయం దంతరాత్మయై సర్వయజ్ఞనిర్వాహకుం డైయున్న నన్నారాధించి నన్నే ముక్తిగా మునులు మున్ను పొందినవాఁగయిరి. ఉద్ధవా! 'మాయాపరిణామం బయినశరీరము నాశ్రయించి వర్తించుచున్న నీయందు నుత్పత్తిస్థితిప్రలయము లనువికారములు శరీరసంబంధమునకు మునుపుగాని కడపటఁగాని గలుగవు. మఱి యాశరీరమునకుఁ గలయీ జన్మాదులు దానికే కాని నీకుఁ గలుగవు. మఱి శరీరమునకు మొదలను గడపలను నాత్మస్వరూపముండు నట్లైనఁబుమనుగూడ నుండును గాని శరీరముఁవలె వృద్ధిక్షయాదులు పొందుచుండవు. కనుక జన్మాదులచేతనమగు శరీరములకే కాని యాత్మకుఁ గలుగవు! ఆత్మనిత్యుఁడు' అనెను.

ఉద్ధవుఁడు—విశ్వేశ్వరా! 'విశ్వమూర్తీ! ఉపదేశపరంపరచేఁ బ్రాప్తించుటంబట్టి పురాణంబయినదియు వైరాగ్యముతోను విజ్ఞానముతోను గూడినదియు విశుద్ధి గలిగించునదియు నగు నీజ్ఞానమును, విపులముగా మహానీయులకు వెదకఁ దగియుండుటంబట్టి పరమ గోప్యముగనున్న నీదు భక్తియోగమును, నాకుఁ దెలియఁజెప్పుము. ఈశా! ఘోరమయిన సంసారమార్గమందుఁ జిక్కి తాపత్రయమనెడి యెండచేఁ గొట్టువడి మిక్కిలియుఁ దపించుచున్న నాకు నమృతమును (మోక్షసుఖమును) గురియుచున్న నీ పదయుగళమనెడు గొడుగుతప్ప మఱియొక శరణము గానరాకున్నది. సంసార మనుగోతియందుఁబడి కామమనెడి సర్పముఁ జేవఁగా ఱువ్రస్తుఖములయందు మిక్కుటమయినతృష్ణ నొంది తాపత్రయముచేతఁ దపించుచున్న యీ జనుని నన్నుఁ గృపచేత నుద్ధరింపుము. మఱి యపవర్గబోధకములగు వాగమ్మ

తములచేత మహానుభావా! తడుపు'మనెను. శ్రీభగవంతుఁడు-తొల్లిరాజయినయజాతశత్రుఁడు యుధిష్ఠిరుఁడు మేమిల్లవారును వినుచుండఁగా ధార్మికాగ్రణ్యుఁడయిన భీష్మునినడిగెను. భారత యుద్ధ ముడిగినపిదప నా రాజు సుహృదులను బంధుటకు వివ్యా లుండై వెక్కులు ధర్మములు విని పిదప మోక్షధర్మముల నడి గెను. భీష్మనిముఖమువలననుండి విన్నట్టి యా ధర్మములను నీకుఁ జెప్పుచున్నాను అవి, జ్ఞానముతోను విజ్ఞానముతోను వైరాగ్యముతోను శ్రద్ధతోను భక్తితోను గూడియున్నవి. ఈ కనుపట్టుచున్న దేవమనుష్యాది శరీరములయందు శబ్దము స్పర్శము రూపముఁరసము గంధమువిసర్గము శిల్పము గతియుక్తి యనెడి తొమ్మిదియు,నింద్రియములు పదునొకొండును, మహా భూతము లయిదును, సత్త్వాదిగుణములు మూఁడును, ననెడి యీపదార్థములనుజ్ఞానైకాకారములయిన యాత్మవస్తువులను మచ్ఛేషత్వమే స్వరూపముగాఁ గల జీవస్వరూపమును గనుఁ గొనుటయె-అనఁగా ప్రకృతిపురుషస్వరూప వివేచనమే - జ్ఞాన మని నేను నిశ్చయించితిని.ఆ ట్టి ప్రకృతిపురుషులకు విలక్షణుఁ డును నొక్కఁడును నగు నన్నె యుపాయనుఁగాఁ గొని నాస్వ రూపమును బొందవలయుననుటయె విజ్ఞానము. మఱి యీవిజ్ఞా నముచేతఁ ద్రిగుణాత్మక ప్రకృతి పరిణామము లయిన దేహా ములకే జన్మస్థితి వినాశములు గలుగుచున్నవని కనుఁగొనవల యును. ఆత్మస్వరూప మొక దేహమునుండి మఱియొక దేహ మునకుఁ బోవునపుడు మొదటను నడుమను గడపలను దానిని వెంబడించి పోవుచుండును. మరల నాశరీరము ప్రళయమొంది నపుడది తానేకరూపమున శేషించి యుండునే కాని కూడఁ

బ్రలయమునొందదు. ఇట్లు వికారమునొందక యుండునట్టిదే యాత్మస్వరూప మని విమర్శించుటయు జ్ఞానంబగును. శ్రుతి ప్రత్యక్షము * ఐతిహ్యము అనుమాన మనెడి యీ నాలుగు ప్రమాణములచేతఁ బ్రమితములగు నా యాకర్మముల ఫలము లందుఁ బూర్వోక్తమగు జ్ఞానముగలవాఁడు విరక్తినొందు చున్నాఁడు. ఇదియె వైరాగ్యము కర్మములకుఁ గలఫలము లొక్కరూపున నెలకొనియుండవు. మఱి యవి తారతమ్యము గలవియు వికారములతోఁగూడినవియునై వినాశమునొందు చుండును గాన వానివలననుండి విరక్తిగలుగుచున్నది. ఇట్లు కర్మము లొక్కతీరుగాక వికారము నొందుచుండుటవలన దృష్టములవలె నదృష్టములును బ్రహ్మాధిపత్యమువఱకును సమస్తమును శ్రుత్యాదులచేఁ బొందు కర్మ ఫలములు నశ్వరములు; కావున నే యమంగళములు దుఃఖగర్భము లని జ్ఞానియగువాఁడు గనుఁగొనవలయును. అనఘా! నాయందు మిక్కిలియుఁ బ్రీతి గలిగియున్న నీకు భక్తియోగమును సపరికరముగా మునుపేచెప్పితిని. కాన యిపు డుపదేశింప వలసినదిలేదు. ఇప్పుడు చెప్పఁబడినభక్తియోగకారణములలో నుత్కృష్టమైయంతరంగకారణ మగుదాని నిఁకఁ జెప్పెదను. ఎప్పుడు నమృతతుల్యంబయిన నాకథలను వినుట మొదలగువానియం దాదరమును, సంతతము నాగుణము గీర్తించుచుండుటయును

---

* ఐతిహ్యమనుటచే శ్రుతి మూలకములగు స్మృతి పురాణాదులను గ్రహించుచున్నది. శ్రుత్యాదులచేతప్రమితమగుకర్మఫలము స్వర్గాదులు. ప్రత్యక్ష సిద్ధమగు కృష్యాది కర్మఫలము ఆరోగ్యాదులు. అనుమాన సిద్ధములయినవి ఆరోగ్యాదులు. ఇవి ఔషధాదులచేతఆరోగ్యము గలుగు ననెడి యనుమానము చేత సిద్ధించుచున్నవని తెలియునది.

వాపూజయం దాసక్తియు, నాజన్మకర్మములను బ్రతిపాదించు స్తుతులచేత నన్నుఁ బొగడుటయు, నామందిర మార్జ్జన యలుకుట మొదలగుపరిచర్యలయం దాదరమును, సర్వాంగముల చేతి నాకు వందనములును,నాభక్తులను మిక్కిలిగాఁ బూజించు టయు,సర్వభూతములును మదాత్మకములనెడి మతియు, నన్నా రాధించుట కుపకరణములగు తులసిపువ్వులు మొదలగునవి గడిం చుకార్యములకై దేహవ్యాపారముచేయుటయు, లౌకికములగు వాక్కులచేతను నాగుణములను జెప్పుటయు, మనస్సు నాయం దర్పించుటయు, సమస్తములయిన యితరకామములను దిగవిడు టయు,నాకొఱకై ధనమును వ్యయముచేయుటయు, భోగము లను సుఖములనుదిగవిడుచుటయు, నాకొఱకయిన యజ్ఞములను దానములను హోమములను నతిథిభోజనములను నేకాదశి మొద లయిన వ్రతములనును దపములను సలుపుటయు, మఱి తన యాత్మను నాకధీనముగా సమర్పించుటయు, ననెడి యివి యుద్ధవా! యివి మనుష్యులకు ధర్మములు. వీనివలన నెల్ల నాయందు భక్తిపుట్టుచున్నది. అట్లు భక్తియోగ ముప్పతిల్లి నట్టివానికిఁ బురుషార్థమేది కొఱతయగును ? అన్ని పురు షార్థము లట్టివానికి సులభములే యగును. ఎప్పుడు రజస్త మస్సులను గీడ్పఱచినసత్త్వముతోఁ గూడినదై కావున నే రాగాదులచేతఁ గలుషితముగాకయున్న చిత్తము నంతరాత్మ యగునాయం దర్పించునో యపు డట్టిపురుషుఁడు ధర్మమును జ్ఞానమును వైరాగ్యమును నైశ్వర్యమును బొందుచున్నాఁడు. రజస్తమస్సులు మిక్కుటముగాఁగలదై దేహమం దాసక్తమై యున్నచిత్త మింద్రియములు నియమింపఁగా శబ్దాదివిషయ

ములకుఁ బరుగెత్తుచున్నది. అట్టిచిత్తము వ్యత్యస్తముగా, నధర్మాదులకుఁ గారణ మగునని యెఱుంగుము. నాయందలి భక్తిని గలిగించునది ధర్మము.సమస్తములయిన యాత్మలందుఁ బరమాత్మ యాత్మభూతుఁడై యున్నాఁడని కనుఁగొనుటయే జ్ఞానము. శబ్దాదివిషయము లనర్థహేతువు లని విమర్శించి దానియందుఁ దగులులేకుండుటయె వైరాగ్యము. అణిమాదులైశ్వర్యములని చెప్పఁబడియున్నది' యనెను.

శుద్ధవ్రుఁడు——శత్రుకర్శనా ! యమముగాని నియమముగాని యెన్నివిధములు ? కృష్ణా ! యమమనఁగానేమి? దమమెద్ది ? ప్రభూ! తితిక్షయు ధృతియు ననఁనేమి? దానమనఁనేమి? తపము శౌర్యము ననఁగానేమి ? సత్యమెద్ది ? ఋతమనునది యేమి? త్యాగమేమి? ధనమెద్ది ? చేష్టయన నేమి? యజ్ఞమేమి? దక్షిణయెద్ది ? శ్రీమంతా! పురుషునికి బలమెద్ది ? కేళవా ? వానికి దయయన్నను లాభమన్నను నేమి ? విద్య యెద్ది? హ్రీయెద్ది? పరంబగు శ్రీయెద్ది ? సుఖనేమి ? దుఃఖ మనఁనెద్ది ? పండితుఁడెవఁడు? మూర్ఖుఁడెవఁడు? మంచిమార్గి మెద్ది? చెడ్డమార్గ మెద్ది? స్వర్గ మన నేమి? నరకమనఁనేమి? బంధువన నెవరు? గృహమనఁగానెద్ది? సంపన్నుఁడనఁగానెవరు? దరిద్రుఁడెవఁడు? కృపణుఁ డెవఁడు ? ఈశ్వరుఁడు (ఏలిక) యెవఁడు ? సత్పతీ! నే నడిగిన యీ ప్రశ్నములను విపరీతములగు నియమాదులనును నాకుఁజెప్పు మని యడిగెను.

శ్రీభగవంతుఁడు——అహింస (భూతద్రోహము తలంపకుండుట), సత్యము (భూతహితముగాఁ బలుకుట), అస్తేయము (మనమ్మునఁ జేతను బరులసొమ్ము గయిగొనకుండుట), అసంగమా

(దేనియందును దగులులేకుండుట), హ్రీ, అసంచయము (పరిగ్రహములేకుండుట), ఆస్తిక్యము (శాస్త్రార్థములందు విశ్వాసము), బ్రహ్మచర్యము (స్త్రీ సంగములేకుండుట), మౌనము (వృథాలాపము వీడియుండుట), స్థైర్యము (చాంచల్యములేమి) క్షమ (ఓర్పు), భయము,సనెడి యీపండ్రెండును యమములు. శౌచమును, జపమును, దపమును, హోమమును, శ్రద్ధయు, ఆతిథ్యమును, సన్మర్చించుటయు, తీర్థాటనమును, పరుల కుపకారముసేయుటయు, దొరకినదానితోఁ దుష్టి నొందుటయు, ఆచార్యుని సేవించుటయు సనెడి యీ పండ్రెండును నియమములు. వీనిని బూరుషు లుపాసించి రేని కోరిన కోర్కులు పిదుకుచుండును జుమీ. శమమనఁగా బుద్ధి నాయందు నెలకొనియుండుట (శాంతి మాత్రముగాదు). దమమనఁగా బాహ్యములయిన యింద్రియముల నడంచుట (చోరాదులను నడంచుట మాత్రముగాదు). తితిక్షయనఁగా దుఃఖముల సయించుట (గాని బరువు మొదలయిన వానిని సహించుటగాదు). జిహ్వోపస్థలయురవడిని గెలుచుటయె ధృతిగాని (యూరక మిట్టిపాటులేకుండుటకాదు). భూతద్రోహమగు దండమును ద్యజించుటయె దానము (గాని ధనమునొసఁగుటకాదు). భోగములనపేక్షింపకుండుటయె తపము (గాని కృచ్ఛ్రాదులుగావు). ఆకలిదప్పి మొదలగుస్వభావములకుఁ గ్రిందుపడకుంటయె శౌర్యము(గాని శత్రువులను జయించుట మాత్రముగాదు). తారతమ్యము మాని సర్వమును బ్రహ్మాత్మకమని కనుఁగొనుటయే సత్యము (గాని యథార్థమును జెప్పుటమాత్రముగాదు.) కన్నదానిని

గన్నట్టి చెప్పుట ఋతము (గాని యింపుగాఁ జెప్పుటమాత్రము గా) దని కవులు కీర్తించియున్నారు. కర్మములందుఁ గర్తృత్వ ముగల దని తప్పఁదలఁపకుండుటయె శౌచము (గాని స్నానా దులవలనఁ గలుగుశుద్ధిమాత్రము గాదు.) కర్మఫలములను త్యజించుటయె త్యాగము (గానికర్మములనుద్యజించుటగాదు.) మనుష్యులకు మద్భక్తినిగావించు ధర్మమే యిష్టంబగు ధనము (గాని హిరణ్యాత్రమాత్రముగాదు) అతిశయములగుజ్ఞానభక్త్యాదులు గలవాఁడగునేనేయజ్ఞము. జ్ఞానోపదేశము సేయునదియె దక్షిణ (గాని హిరణ్యాదిదానములుమాత్రముగాదు). ప్రాణాయామమే పరమంబయినబలము (కానిదుర్మదబలముగాదు.) భగమనఁబడి నయైశ్వర్యవీర్యాదికము నాయీశ్వర సంబంధియగు స్వభావము. (పరులదుఃఖముల నిరసింపఁగోరుటయే దయ). ఉత్తమమయిన నాయంఁటి భక్తియేలాభము (గాని పుత్రాదులు గారు.) ఆత్మ యందు దేవమనుష్యాదిభేదభావము నుడుగుటయె విద్య (గాని జ్ఞానమాత్రముగాదు). నిషిద్ధకర్మములను హేయములుగాఁ దలఁచి రోయుటయే హ్రీ యనఁబడునుగాని (లజ్జామాత్రము గాదు). అపేక్ష లేకుండుట దొరకినదానితోఁ దృప్తినొందుట మొదలయిన గుణసముదాయమే యలంకారము (గాని కిరీటా దులుగావు). దుఃఖమిశ్రమయిన సుఖముతోలఁగుటయె సుఖము (గాని భోగముగాదు.) శబ్దాదివిషయ సుఖాపేక్షయే దుఃఖము. బంధమోక్షకారణములను దెలిసినవాఁడే పండితుఁడు (గాని విద్వాంసుఁడు మాత్రముగాదు). దేహాదులనే తన్నుఁగాఁ (ఆత్మగా) దలంచువాఁడు (అనఁగానహంకారమమకారములు గలవాఁడు) మూర్ఖుఁడు. నన్నుగుఱించిన జ్ఞానమే మంచిమూర్గ

ముగాని (ముల్లు మొనలగునవి లేనట్టిమార్గముగాదు), శబ్దాది విషయములందుఁ జిత్తము దగులుపడుటయే చెడ్డమార్గము (గాని దొంగలు మొనలగువానిచే నెరసినట్టిమార్గముగాదు). సత్త్వగుణము నభివృద్ధియే స్వర్గము (గాని యింద్రాది లోకము గాదు.) తమస్సు నభివృద్ధియె నరకముగాని (తామిస్రాదినరక ములుగావు.) గురుఁడేబంధుఁడు (కాని తండ్రితోఁబుట్టువులు మొదలగువారు గారు). ఆగురుఁడును నేనే. మనుష్యశరీరమే గృహము (గాని మేడలుప్పరిగలు మొదలగు భోగస్థానములు గావు). సద్గుణశాలియే సంపన్నుఁడు (గాని ధనికుఁడుగాఁడు). దొరకినదానితోఁ దృప్తినొందనివాఁడే దరిద్రుఁడు (గాని ధన హీనుఁడుగాఁడు). ఇంద్రియములనుజయింపనివాఁడే కృపణుఁడు (గాని దీనుఁడుగాఁడు). శబ్దాదులందు బుద్ధి దగులకుండు వాఁడే యీశుఁడు. (రాజాదులు); అందుఁ బుద్ధిగలిగినవాఁడో యనీశుఁడు. ఉద్ధవా! నీవడిగిన విషయములెల్ల నిట్లు చక్కఁగా నిరూపింపఁబడినవి. ఊరక వెక్కుఁలు నిరూపింపనేల? విషయ సుఖములే గుణములుగాను దుఃఖములు దోషములును గాంచు టయే దోషము. అట్టి సుఖదుఃఖములు రెంటిని దోషములుగా నెన్ని వర్జించుటయే గుణము. ఇది పందొమ్మిదవయధ్యాయము.

శ్రీకృష్ణుఁ డుద్ధవునకు భక్తిజ్ఞాన కర్మ ములను నందు భక్తియతిశయ మును వర్ణించుట.

ఉద్ధవుఁడు—అరవిందాక్షా! "ఈశ్వరుఁడవగు నీదుశాసనము వేదము. అది విధినిషేధరూపముననున్నది. కనుక విధించుకర్మ

ములుగుణములుగాను *నిషేధించుకర్మములు దోషములుగాను నది యుపేక్షింపవలసి యున్నది. మఱియు నది వర్ణాశ్రమభేదములనును,నందుఁబుట్టినప్రకృతిగోమజాతులను ననులోమజాతులనును, ద్రవ్యమును దేశకాలములను,వయస్సును స్వర్గనరకములనును నపేక్షించుచున్నది. ఇది గుణ మిది దోష మని కనుఁగొనుట లేనిచో నీవు విధినిషేధరూపముగాఁ జెప్పియున్న వచనములు మనుష్యులకెట్లు నిశ్రేయసమును బ్రతిపాదింపఁగలదు? గుణదోషభేదమును దెలిపి ప్రవృత్తినివృత్తు లేర్పఱిచి కదా నీ వచనము పురుషార్థ మొనఁగూర్చునది. కావున గుణదోషదృష్టి యావశ్యకమై యుండఁగా బానిని దోషమని నీవు చెప్పుట యెట్లు? ఆలోకికమగు స్వర్గాదులును వానికి సాధనములయిన యర్థములును బ్రత్యక్షాదులకు గోచరింపవు

ఇట్లు సాధ్యములగు స్వర్గాదులును సాధనములగు యజ్ఞాదులును దెలియకుండినపు డీశ్వరా! పితృదేవమనుష్యులకు శ్రేష్ఠంబయిన చక్షువు నీ యాజ్ఞారూపమగు వేదమేయగును. కాఁబట్టి గుణదోషభేదమునందు దృష్టి, నీ యాజ్ఞారూపమగు వేదము

---

* పూర్వాధ్యాయమున భగవంతుఁడు విషయములందలి సుఖము లను గుణములుగాను దుఃఖములను దోషములనుగాను గనుఁగొనుట దోషమనియుఁ దెంటిని దోషములుగాఁ గనుగొనుట గుణమనియుఁ జెప్పెను. అందుల కిందు సిద్ధుఁడు వేదమిది గుణము ఇది దోష'మని కర్మములను నిరూపించుచున్నది. వేదమో నీ యాజ్ఞ. అట్టిది చెప్పగుణదోషములను దెలియనిచో సిద్ధిగలుగుట యెట్లు? కానగుణదోషదృష్టిని నీవిట్లు దోషమనుట చెల్లునా? అని యడుగుట తెలియునది. దీనికే భగవంతుఁడు బదులు చెప్పవాఁడై మఁదు కర్మజ్ఞానభక్తుల స్వరూపమును తదధికృతులగువారి నిష్ఠలను జెప్పదొడఁగినాఁడని తెలియునది.

వంనసే కలుగవలయును గాని పురుషునకుఁ దనంతటఁ గలుగ నేరదు చుమీ. ఇట్లుండఁగా నిపుడు 'గుణదోషదృష్టి దోష' మని గుణదోషదృష్టిభేదము నపవాదము సేయుట యెందుల కని తెలియక నాచిత్తము తబ్బిబ్బు వడుచున్నది" యని యడిగెను. శ్రీ భగవంతుఁడు —* మనుష్యులకుఁ గైవల్యము స్వర్గమపవర్గమను శ్రేయస్సును బోధింపఁగోరి జ్ఞానము కర్మము భక్తియని మూఁడుయోగములు నాచేఁ జెప్పఁబడియున్నవి. కర్మములయందు నిర్వేదము నొందినవారికి (యనఁగా వాని ఫలములు దుఃఖము లని విరక్తులై వానికి సాధనమయిన కర్మములను త్యజించినవారికి జ్ఞానయోగము చెల్లును. ఆ కర్మములందు మనస్సు విరక్తినొందక యుత్సాహము గలిగినవారికి స్వర్గకామము లగువారికిఁ గర్మయోగము చెల్లును. ఒకానొక

---

* ఏ వస్తువునాని తనంతట గుణమనియుఁ దోషమనియుఁ జెప్పఁ బలనుపడదు. నరకమునకోఁ బోల్పఁగా స్వర్గము గుణమగుచున్నది. ఒకదానితోఁ బోల్చి నిరూపించుటనుబట్టి ముఱియొకటి గుణమో దోషమో యగుచున్నది. ఆయా నిరూపకుని చొప్పున ఆయావస్తువుల గుణదోషము లేర్పడుచున్నవి. కనుకవిధినిషేధశాస్త్రానురూపించువానికి స్వర్గమునరకము రెండును దుష్టము లని గుణదోష భేదము అపవాదము చేయఁబడినది. మోక్షోపాయమో నిరూపకునకుఁగూడ గుణవత్తరమైనది; కాన గుణదోషభేదము తగినదనుట సామాన్యముగాఁ జెప్పినను మోక్షోపాయమునందుఁ జెప్పఁటలగదు. కనుక మోక్షోపాయము గుణమనియే గ్రాహ్యము. దీనినే ప్రపంచించుటకై ముందాయాయధికారుల భేదమున కనుగుణముగా ఆయా పురుషార్థ సాధనములేర్పడియున్నవని చెప్పుచున్నారు. దీనిమూలమున ఆయాయధికారులకు గుణదోషముల నేర్పఱిచి ముముక్షువునకు గుణమయినదాని నిరూపించుచున్నారని తెలియనది. ఇచట జ్ఞాన మనఁగా ప్రకృతి వివిక్తమైనయాత్మ స్వరూప చింతనము. ఫలాభిసంధిలేని కర్మయోగమే యిచట కర్మము. భక్తియోగమే భక్తియని చెప్పఁబడినది.

భాగ్యవిశేషమువలన నా కథలను వినుట మొద లగువాని యందు నాదరముపుట్టి పూర్వవాసనచేత నిష్పుడును కర్మఫల ములందు విరక్తి పూర్ణముగాఁ గలుగక, యపేక్ష వాసనా మాత్రముగా నుండియు వానియందలి దోషమును గనుఁ గొనుటచేత నాసక్తియంతగాలేక, యున్నవానికి భక్తియోగ ము తన్ననుష్ఠింపఁగా నపవర్గసిద్ధిగలిగించుచున్నది. ఎంతవఱకుఁ గర్మములందు మిక్కిలియు నిర్వేదము గలుగకుండునో, యెంత వఱకుమత్కథాశ్రవణాదులందు శ్రద్ధపుట్టకుండునో, యంతవఱకు ఫలాభిసంధినాని న్నాశ్రములకుఁ [1]దగినకర్మములను జేయు చుండవలయును. ఇట్లు మోక్షముగలుగువఱకును స్వధర్మము లగు సంధ్యోపాసనాద్యాచారములందు నిష్ఠ గలిగి పంచమహా యజ్ఞములచే నన్ను యజించుచు ఫలములం దాశమానియుండు. వాఁడు స్వర్గనరకములను బొందఁడు; నాయందలిభక్తియోగము పుట్టినవాఁడై నన్నే పొందును. కనుక ఫలాభిసంధితోఁ గూడిన కర్మమును ననుష్ఠింపరాదు. స్వర్గనరకములను బొందఁజేని మఱి దేనిని బొందునందువా? వాఁడీదేహముతో వర్తించుచు నిషిద్ధకర్మములువదలి స్వధర్మము లనుష్ఠించుచు శుచియై విశు ద్ధంబగు [2]జ్ఞానయోగమును గాని యేదేనొకభాగ్యవిశేషము

---

1. మోక్షము గలుగువఱకు వాసనమాత్రము అనువర్తించుచుండును గాన ఫలాభిసంధిలేక కర్మము ననుష్ఠించుచు నే యుండవలయునని తెలియునది.

2. జ్ఞానయోగమందు శ్రద్ధ గలుగునంతవఱకును జ్ఞానయోగాధికారికిఁ గూడ ఫలాభిసంధిలేనిదియుఁవర్ణాశ్రమోచితమైనదియునగు కర్మమనుష్ఠించియే తీరవలయునని యిందేర్పడియున్నది. జ్ఞానయోగము భక్తియోగమున కుప కారకమే. ఐనను జ్ఞానయోగము పరిపక్వముగానప్పుడు యొకానొక భాగ్య విశేషముచే మొదటనే భక్తియోగమును బొందుటయుఁ గలుగవచ్చును.

చేతఁదైవికముగా మద్భక్తియోగమునుగాని పొందుచున్నాఁడు. ఈదేహము జ్ఞానభక్తులు రెంటిచేతఁ గైవల్యమోక్షములకు సాధకమయినది. కాఁబట్టి స్వర్గస్థులును నరకస్థులును నీ మనుష్యదేహమును గోరుచున్నారు. అయినను స్వర్గస్థులదేహమును నరకస్థులదేహమును రెండును నాకైవల్యమోక్షములకు సాధకములుగాసేరవు కుశలుఁడగువాఁడు నరకోపాయమును వలెస్వర్గోపాయమునుగూడఁ గాంక్షింపరాదు. దృష్టాదృష్టసుఖసాధనమున కుపయుక్తమయిన యీదేహమును మరలఁ గాంక్షింపరాదు. అట్లు కాంక్షించినచో దృష్టాదృష్టములగు దేహసుఖములం దధినివేశము గలుగుచున్నది. దానివలన మోహము నొంది కడపటి స్థావరత్వమును బొందుచున్నాఁడు. 'నేనడుగని దిదియేల చెప్పుచున్నా'నెనవలదు. ఎవఁడు మరణమునకుఁ బూర్వమే శరీరము దృఢముగా నుండఁగపుడే యీమనుష్యశరీరము మరణశీలమయినను నిరతిశయ పురుషార్థసిద్ధికి నుపయుక్తునిఁ తెలిసి యవహితచిత్తుఁడగునో యట్టి విద్వాంసుఁడు మోక్షముగైకై ప్రయత్నించును. నేను నాకు జెప్పిన యీవిషయములనెఱుంగుట మనుగతముగాఁ జెప్పలేదు. బుద్ధిపట్టి తాను గూఁడుకట్టుకొనియున్న వృక్షమునొక్కఁడు మానవులెవరయినాలే నఱకుచుండఁగాఁ జూచి తన యునికిపట్టును వీడి యాశ్రయమాత్ర సుఖము నొందుచున్నది. అట్లు శరీరమనెడు వృక్షమునందు హృదయ మనుగూఁట నున్నపక్షివంటిజీవుఁడు కామమునీడి తనపట్టునువీడి (నశ్వరమగు శరీరపు సంబంధమును వదల్చుకొనువెరవు నెఱింగి) క్షేమము నొందుచున్నాఁడు. మనుజుఁడు

తన యాయువును, రేలును బగళ్లును ద్రుంచుచుండుటను జూచి భయముచే వడంకుచు సంగముమీడి ప్రకృతిపురుషవిలక్షణుం డగు నన్ను నెఱింగి యుపాసించి ప్రకృతి సంబంధమునుండి విరతి నొందుచున్నాఁడు. మనుష్యదేహ మిది సర్వఫలములకు మూలమైనది. కోట్లకొలఁది ప్రయత్నములుచేసినను దీనిని బడయుట యశక్యమయినను, దైవికముగాఁ గలిగియున్న దగు టచే సులభమైయున్నది; అన్ని సాధనములకు నర్హమయినది. ఇది సంసారసముద్రమును దాఁటుట కొక తెప్ప యైనది. దీనికి మాలిమి గురుఁడు. నేను దీని కనుకూలవాయు వై నడపు చుందును. ఇట్టి తెప్పచేత సంసారసముద్రమును దాఁటని వాఁడాత్మ నాశము చేసికొట్టివాఁడే యగును. ఎప్పుడు కామ్యకర్మ ములను దుఃఖములుగాఁ గనుఁగొనుటచే మిక్కిలియు వానియం దుపేక్ష పుట్టి వానిఫలములయందును కోరికలు విడిచి యుండునో యప్పుడు యోగసాధనమైన బాహ్యాభ్యంతరమలయిన్ద్రియ ధర్మముల నణఁచి యుభ్యాసము చేఁ బ్రసన్నమనస్సును నచల ముగా నుండునట్లు నాయందు నెలకొలుపవలయును దానినట్లు పట్టుకొలుపు చున్నను నది యితర విషయములందుఁ దిరుగుచుఁ వడుచు వేగ నిలుపఁజాలదే యగును. అప్పుడు వాఁడు పరాకుపడక యానూనసముపోయినదారి ననుసరించుచునే యు పాయముచే దానిని దనవశము చేసికొనవలయును. ఎంత నడఁ చి పుచ్చినను మనస్సు నిలువలేదే యని యూరకుండరాదు. మఱి ప్రాణములను నింద్రియములను జయించి సాత్త్వికాహార మువలనఁ బుష్టి నొందిన సత్త్వముచేతను బరిశుద్ధమయిన బుద్ధిచేతను దానిని మెల్ల మెల్లగాఁ దనవశమునకుఁ దెచ్చుకొన

వలయును. సులువుగాఁ బనుపడరాకున్న గుఱ్ఱమును సార థియగువాఁడు తాను మనస్సులోఁ దలఁచిన రీతిని బోవునట్లు చేయఁ గోరి మొదట నది పోయినదారినే పోయి మెల్ల మెల్లగా దాని నడఁచి తన శ్రోవకుఁ ద్రిప్పునుగాని యూరకుండఁడు. అట్లె మనస్సును మొదట నది పోయినదారినే యనుసరించుచు మెల్ల మెల్లగా దాని నడఁచి లోపఱచుకొనవలయును. ఇట్లు మనస్సును లోపఱచుకొనుట యాత్మ వశీకరణమునకు సాధనము గనుక బ్రమంబయిన యోగమగును. తత్త్వములు విచేకముచేసి మహత్తు మొదలుగాఁ బృథ్వి వఱకుఁ గల సమస్తభావములను బ్రకృతిని మొదలుచేసి యనులోమముగా నుత్పత్తియుఁ బృథ్వినిని మొదలుచేసి ప్రకృతిలోమముగా లయమును బొందుచుండుటను మనస్సు ప్రసన్నముగా నుండు నంత వఱకు ధ్యానించుచుండవలయును. ఇట్లు తత్త్వవిచారము చేతఁ జింతితములయిన సృష్టి ప్రలయాదులనే మరిలఁ జింతించుటవలన సంసారమునందు వెగటు నొంది విరక్తుఁడయి మనస్సును నిగ్రహించుటకై చెప్పఁబడిన మార్గమును నెఱిఁగిన వాఁడు మనస్సునకు శబ్దాది విషయములందుఁగల యాసక్తిని దిగిపడుచున్నాఁడు. యమము మొదలయిన యోగమార్గములచేతను తత్త్వ విమర్శనంబగు విద్యచేతను మఱి యర్చనధ్యానాదులచేతను మఱి యట్టి యుపాయములచేత యోగ్యుండగు పరమాత్ముని నన్ను స్మరింప వలయును. ఇట్లు చేసినచే మనస్సు తన విషయాసక్తిని వదలునుగాని మఱి యితరములచేత వదల నేరదు. 'మనస్సు విషయాసక్తినొందుటకు దురితమే మూలము కనుక యోగికిఁ గూడ నట్టి దురితము

గలుగుట గలదు గాన దానిని బోగొట్టుటకుఁ బ్రాయశ్చిత్తా
దు లగు నితర ప్రయత్నములు చేయవలసియుండఁగా మఱి
యితరములను జేయుటాదనుట యెట్లు' లందువా? యో గి
ప్రమాదవశమున నిషిద్ధ మగు కర్మము చేసెనేని, యప్పు డా
దురితము దాని యనుధ్యానమనెడి యోగాభ్యాసముచేతనే
కాల్చిపుచ్చవలయును గాని యితరములగు కృచ్ఛ్రాదియ
త్నము లొకప్పుడు దానికి వలదు. [1] తన తన వర్ణాశ్రమాను
గుణమయిన యధికారధర్మమునందు నిష్ఠ గలిగియుండు
టయే గుణము. [2] అట్లధికారమున కనుగుణమయిన నిష్ఠలేకుం
డుటయే దోషము. గుణదోషముల రెంటికి నిదియే స్వరూప
నిర్ణయము. స్వభావముచే నశుద్ధములగు కర్మములనును
నశుద్ధిని గలిగించు సంగములను నడలునట్లు చేయుఁ
గోరి ముముక్షు వగువానికే యిట్లు 'విషయసుఖములను
గుణములనియు దుఃఖములను దోషములనియుఁ గాంచుట
దోషము. రెంటిని దోషములుగాఁ గాంచుట గుణము' అని
గుణదోషములను విధించి నియమము గావించితిని. ఇది [3] ము

---

1. ఇంతవఱకు ఆయాఅధికారులకుఁ గల ఆయాసాధనముల యేర్పా
టును జెప్పి యిప్పుడడిగిన ప్రశ్నమునకు త్తరము చెప్పువాఁడై మొదటగుణ
దోషముల స్వరూపముల నిరూపించుచున్నాఁడు.

2. శూద్రునకు బ్రాహ్మణ ధర్మమును, విరక్తి లేనివానికి సన్న్యాస
ధర్మమును, విరక్తునకు బ్రాహ్మణధర్మము దోషములని తెలియునది.

3. ఉద్ధవుఁడు 'వేదములు గుణదోషములను విధించుచున్నవి. కాన యా
గుణదోషభేదమును బాటింపక ముక్తిఁ బొందుట యెట్లని యడుగఁగా భగ
వంతుఁడింత వఱకు నాయాయధికారుల సాధన భేదమును జెప్పి యిట్లు
తాను జెప్పిన గుణదోషభేదదృష్టి యింతవఱకు వర్ణించిన యా యాయధి

ముత్తువునకే కాని బుబుత్తువునకుఁ గాదు గాన విరోధము లేదు. కామ్యకర్మములందు వెగటు గలిగియు దానియందు విర క్తి యింతకును బొందక, కామములను దుఃఖాత్మకము లని యెఱింగియు దానిని విడుచుటకు సమర్థుఁడు గాక, యుండిన ను నాదుకథలయందు శ్రద్ధ పుట్టినవాఁడై నన్ను భజింపవల యును. ఆ భక్తివలననే సర్వమునొడఁగూడునని దృఢనిశ్చయ ముగలవాఁడై యీ నిశ్చయమందును శ్రద్ధ గలిగి, యిట్లు కామముల ననుభవించుచున్నవాఁ డయినను వానికి మీఁద దుఃఖములే ఫలములని వానిని నిందించుచునే నన్ను భజింప ఎలయును. ఇట్లు చెప్పఁబడిన భక్తి యోగముచేతి మునియ గువాఁడు నన్ను మాటిమాటికి భజించుచున్నాఁడు. అట్టి వానికి హృదయమందు నేను నెలకొనియుండుటం బట్టి యందుఁ గల కామములన్నియు నశించుచున్నవి. అనఁగా వాఁడు భక్తిచేతి నన్ను హృదయమందు నెలకొలుపఁగానే నే నందుఁగల కామములనెల్ల నాశము సేయుచుందును. వాని హృదయమందు నెలకొనియున్న యఖిలాంతరాత్ముఁడగు నేను దృష్టుఁడను గాఁగానే (యనఁగా దర్శనసమానాకార మగు భక్తికి * విషయభూతుఁడు కాఁగానే) యట్లు భజించు వానికి

కారుల సాధనకారణత్వములను బుబుత్తువునకే కావలసినది గాని ముత్తువున కిక్కడ లేదని తెలియఁదగు నిదియు ముత్తువును గుఱించియే యట్లు నాను దాని కపవాదము చెప్పినట్లును విశదీకరించి యాప్రశ్నమునకు సమాధానము చెప్పినవాఁడయ్యెను.

* భక్తియోగమున భగవద్దర్శనము లేకున్నను ఆభక్తి తైలధారవలె అవిచ్ఛిన్నమై దర్శన సమానమై యుండునుగాన భగవద్దర్శనముతో సాటియే యగునని భావము.

హృదయము నందలి గ్రంథి (అనఁగా ముడివలె విడిపింపరాక పెనఁగొనియున్న దేహాత్మాభిమానస్వతంత్ర్యాభిమానములు) ప్రిదిలి పోవుచున్నవి. కావునను 'నేనేమి దేహమునకంటె వేఱా? దేహమే నేనా? పరతంత్రుఁడనా? స్వతంత్రుఁడనా? యని యిత్యాదులగు సంశయము లెల్ల ఛిన్నములగుచున్నవి. మత్ప్రాప్తికిఁ బ్రతిబంధకములయిన వాని పుణ్యాపుణ్యకర్మములన్నియును క్షయించుచున్నవి. ఇట్లు భక్తి యోగము సర్వ సిద్ధిప్రదము. కాఁబట్టి మద్భక్తితోఁ గూడినవాఁడై కావునను నిరతిశయప్రీతి విషయుండగు నాయందుఁ జిత్త మిడి యున్నయోగికిఁ బ్రకృతి వియుక్తాత్మోపాసనరూపం బగు జ్ఞానయోగముగాని దాని కుపయుక్తమగు వైరాగ్యముగాని శ్రేయస్సాధనములుగావు. ఇంకఁ గర్మయోగము నట్టిది గా దన నేల? కర్మములచేతను దపస్సుచేతను జ్ఞానముచేతను వైరాగ్యముచేతను యోగముచేతను దాన ధర్మములచేతను దీర్థయాత్ర వ్రతములు మొదలుగాఁగల తక్కిన శ్రేయస్సాధనములచేతను నేదేది కలుగఁగూడునో దాని నంతయు, మఱి స్వర్గమును సైవల్యమును నాస్థానంబగు మోక్షమును, నాభక్తుఁ డగు వాఁడు కోరిన యెడల వీని నంతయును నాయందలి భక్తియోగముచేత సులభముగానే పొందుచున్నాఁడు. సాధువులును ధీరులు సైన నన్ననుభవించుట మాత్రమే ప్రయోజనముగాఁ గలిగియున్న యేకాంతులగు నాభక్తులు కైవల్యమును

---

* భక్తులకు భగవదనుభవమే ముఖ్యప్రయోజనమై భక్తి మోక్షాదుల కంటె స్వాదుతమముగా నుండుటంబట్టి కైవల్యాదులనుభగవంతుఁడియిచ్చినను వారొల్లరనిభావము. మోక్షమునందును భగవదనుభవమేకదాఫలము. ఆఫల

మోక్షమునను నేనై యిచ్చినను గోరనుగూడఁగోర నొల్లరు. ఏకాంతభక్తియే నిశ్శ్రేయసమునకు సాధనము. కాఁబట్టి, యట్టి భక్తులు ముక్తి నెంత మాత్రమును గోరక మిక్కిలియు గొప్ప నిరపేక్ష గలిగియున్నను నదియె వారికి ముక్తి గలిగించు చున్నది. కాఁబట్టి దృష్టాదృష్ట ఫలములం దాశ యుడిగి యపవర్గమునందు సయిత మపేక్ష లేక యుండువానికి నాభక్తి యంతరాయములచేఁ గొట్టు వడక చెలంగు చుండును. కనుక భక్తియోగమును మిక్కిలియు నిరపేక్షుఁడగువానియందే నెలకొనియుండును. నాయం దనన్యప్రయోజన మగు భక్తిగలవారికి గుణదోషములు రెంటను సమంబగు చిత్తము గలిగి గుణదోషములను రెంటిని వర్జించుటయే ధర్మముగాఁ గలవారు నగు సాధువులకు గుణదోషములను దెలియుచుండుట వలననే పుట్టునవగుణ రాగద్వేషాదిగుణము లెంత మాత్రము గలుగ నేరవు. నే నిట్లుపదేశించిన యీమోక్ష మార్గముల ననుష్ఠించు నట్టివారు పరమబ్రహ్మంబని తెలియంబడు నాదు స్థానమును సుఖముగాఁ బొందుదురు. ఇది యిరువది యవయధ్యాయము.

భగవంతుఁడు శుద్ధునకు దేశకాలాదుల శుద్ధత్వాశుద్ధత్వముల విధమును జెప్పుట.

శ్రీభగవంతుఁడు—నాస్వాప్తికిని పాయమార్గము లయినకర్మయోగ జ్ఞానయోగ భక్తియోగములను విడిచి యెవరు చంచల

మీభక్తియోగమందే సిద్ధమైయుండఁగా దాని నేల తోరపలయునను వారికందు వాంఛ లేకుండుటకుఁ గారణముగాఁ దెలియునది.

ము లగు నింద్రియములచేత శుద్రము లగు శబ్దాదివిషయము లను ననుభవించుచుండుగోవారు సంసారమునొందుదురు. తన తన వర్ణాశ్రమముల కనుయాపమయిన యధికార మగు నాయా ధర్మమునందు నిష్ఠ గలిగియుండుటయె గుణమని చెప్పఁబడి నది. అట్టి నిష్ఠలేనిచో నది దోషమనఁబడినది. గుణ దోషములు రెంటికి నిట్లు స్వరూపములు నిశ్చయింపఁబడినవి. దేశము కాల ము ద్రవ్యము కర్తను ద్రవ్యము కర్మము నవెడి పదార్థము లన్ని యుఁ బంచభూతాత్మకము లగుటవలన సమానము లేయగును. అయినను ద్రవ్యమిదియోగ్యమా? అయోగ్యమా? యని సందే హము మూలమున దాని స్వాభావికప్రవృత్తిని దెలియుకొఁజాలకు నాదేశకాలాదినస్తువు లన్నిటియందును దాని యోగ్యతా యోగ్యత్వములు విధింపఁబడుచున్నవి. అట్లు ద్రవ్యమును విచి కిత్సచేయుటవలననే వారివారి యధికారములును అధికారములు గానివియు గుణదోషములును దెలియుచున్నవి. మఱియుధర్మము కొఱకును నిది యుపాదేయము మిది యనుపాదేయ మని వ్యవహ రించుకొఱకును ధర్మముఁదు వికోధము లేకయె దానికుపయుక్త మగు శరీరమును రక్షించుకొఱకును నిది యంతియు శుద్ధి య శుద్ధియను రెంటి వివేకము చేతఁ గలుగుచున్నది. తమ యధి కారమునెడు ధర్మమును వహింపఁగోరువారికి శుద్ధిని నశుద్ధిని వేఱువేఱఁ దెలిసికొని ప్రవర్తించుట యనెడి యీ యాచారము తెలుపఁబడినది. బ్రహ్మ మొదలుకొని స్థావరములపఱకుఁ గల ప్రాణుల శరీరములను గావించిన నగు భూమి, యప్పు, తేజస్సు, వాయు, వాకాశ, మనెడి ధాతువులలెదు గలవు. దానితోఁగూడ నంతరాత్ముఁడనై నేనుగూడియున్నాను. కనుక సమస్తములయిన

పదార్థములు చిదచిదీశ్వరులను మూఁడు తత్త్వముల చేత నయినవిగానుండుటచే నొకటి కొకటి సమానములే యగు చున్నవి. ఇట్లు బ్రహ్మమొదలు స్థావరములవఱకుఁ గల పదార్థ ములు సమానాకారములై యున్నను వాని శరీరములను గావించు ధాతువులయిన భూమి మొదలయిన భూతములకు వివిధములయిన నామరూపములు వేదముచేత [1] విధాతవలనఁ గల్పింపఁ బడుచున్నవి. ఇటు కల్పించుట సంసారులయిన యీ జీవులకు స్వార్థసిద్ధి కుపయుక్తమగు నధికారనిష్ఠకలు గుటకొఱకని తెలియునది. దేశకాల ద్రవ్యకర్మ మంత్రాది రూపమున వస్తువుల శుద్ధియును నశుద్ధియును నేను. కర్మము లకుఁగల దేశకాలాదినిష్ఠలను నియమించుకొఱకును విపరీతాధి కారములకుఁ బోక తమతమయధికారములనే యనుష్ఠించుకొఱ కును వానిని వేఱువేఱ తెలుపుచున్నాను. కృష్ణమృగము తిరుగుట లేనిదియు బ్రాహ్మణభక్తశూన్యము నగు దేశ మశుచి యగును. ఆ రెండు గలదేశము శుచియగును. కృష్ణమృగ ముండినను [2]సౌవీరదేశమును గీకటదేశమును సంస్కారము లేక మ్లేచ్ఛులు మిక్కిలిగాఁగలదేశమును ఊషరదేశమును నశుచియెయగును. మంచి కర్మముతోఁగూడినకాలము శుచియగును. అది ద్రవ్య సంపత్తిచేతఁగాని పూర్వాహ్ణమగుట మొదలగు వానిచేఁ దనం

---

1. బ్రహ్మసృష్టి కాలమున మనస్సునందున్న వేదమునఁగలదేవమనుష్యాది శబ్దములను దలంచి వానియాకారగుణ మనదేవమనుష్యాదులనును సృజించు చున్నాఁడను శ్రుతి యిట యనుసంధించునది.

2. సౌవీర మనఁగా సౌరాష్ట్రము. మగధ కళింగాదులు కీకట దేశము. 'అంగవఙ్గకళింగేషు సౌరాష్ట్రమగధేషుచ। తీర్థయాత్రాం వినాగత్వా పునస్సంస్కారమర్హతి' అనుట స్మరించునది.

తటనే కాని, గుణవంతమై యుండును. ఏకాలమందు ద్రవ్యము దొరకనందుచేతనో, రాష్ట్రవిప్లవము చేతనో యారంభించిన కర్మము సమాప్తినొందకుండునో, యేది సూతకాదులందు దశాహాది రూపముననుండునో *యట్టి కాలము కర్మముల కనర్హముగాన యశుచి యగును. వస్త్రము మొదలైన ద్రవ్యములకు, మృత్తు జలము ఎండ యగ్ని మొదలయిన ద్రవ్యముచేత శుద్ధి గలుగుచున్నది; మూత్రాదులచేత నశుద్ధిగలుగుచున్నది. ఒకటి శుద్ధమా యశుద్ధమా యను సందేహము గలిగినపుడు శాస్త్ర బలముచేతఁగాని శుద్ధమే యని బ్రాహ్మణుఁడు చెప్పినను గాని శుద్ధియగును. పుష్పములు మొదలయిన వానికిఁ బ్రోక్షణాది సంస్కారముచేత శుద్ధిగలుగును; మూర్కొనుట మొదలగు వానిచేత నశుద్ధి గలుగును. పర్యుషితాన్నము మొదలగువాని కట్లు సంస్కారముచేత శుద్ధి గలుగదు. క్రొత్తజలము మొదలగు వానికి నల్పకాలముచేత శుద్ధి యగును. అట్లు గానిచో నశుద్ధి గలుగును. మహత్త్వము చేతను నల్పత్వముచేతను శుద్ధియు నశుద్ధియుఁ గలుగుచున్నవి. నదీజలము మహత్తగుటచేత చండాలాదిసంస్పర్శము గలిగినను శుద్ధినొందును. పీఠులందలి జలమల్పమగుటచేత నశుద్ధి నొందును శక్తిచేతను నశక్తిచేతను శుద్ధియును నశుద్ధియుఁగలుగును. ఎట్లన, గ్రహణాదికాలములందు స్నానము చేయశక్తుఁడగువానికిస్నానాదులచేత నేశుద్ధిగలుగును. రోగికో యశక్తిచేత శుద్ధియగును. బుద్ధిచేతను శుద్ధియు నశుద్ధి

---

* కాలములు కర్మాన్యములగుట ద్రవ్యాంతర సంబంధముచేతఁగాని తమంతటఁగాని యగును. మధురాదిదేశములును జయంత్యాది మొదలగు కాలములును భగవత్సంబంధయోగముచేత గుణవంతములగుచున్నవి.

యుఁగలుగును. ఎట్లనఁబుత్ర జన్మాదులు, గలిగినపుడు, దశాహము గడచిపోయిన వను జ్ఞానముచేత నే శుద్ధియుఁ, గడచిపోలేదను జ్ఞానముచేత నశుద్ధియుఁ గలుగుచున్నవి. ఉత్సవముచేతను శుద్ధి గలుగును. ఎట్లన, భగవదుత్సవాదులందు స్పృశింపఁదగని వానిని స్పృశించినను నాయుత్సవముచేతనే శుద్ధి గలుగుచున్నది. మఱి శోధకు లగు వారు దేశము కాలము వయస్సు మొదలగు వాని ననుసరించి యశుద్ధమగు ద్రవ్యమునకుఁ [1]జాలినంతశుద్ధి గావించుచున్నారు. కావున వానివలనను శుద్ధి గలుగుచున్నది. ధాన్యములు, దారువులు, అస్థులు, తంతువులు, క్షీరాదిరసములు, కంచు మొదలగు తైజసములు, తోళ్లు, నవెడివీనికిఁ, గాలము వాయువగ్ని మృత్తు జలములనెడు వీనిచేత శుద్ధి గలుగుచున్నది. మఱి పార్థివములగు వాని కొండొంటి తోడిసంయోగముచేతను శుద్ధి గలుగుచున్నది ఎట్లన, నన్నము నకుఁ గేశాదుల యసంయోగముచేతను, ఆజ్యాదుల సంయోగ ముచేతను, శుద్ధిగలుగుచున్నదిక దా. రాగి వస్త్రము మొదలయిన వాని కమేధ్యము లగిలినయెడల వాని కాదుర్గంధమును నాయ

---

1. 'దేశంకాలం వయశ్చ క్తిం ద్రవ్యాద్రవ్య ప్రయోజనమ్। ఉపపత్తి మవ స్థాంచ జ్ఞాత్వా శౌచం ప్రకల్పయేత్' యని స్మృతియందు ద్రవ్యవచనా దులు చెలియునది. అవియె యిట సనుసంధింపఁబడినవి.

2. ధాన్యమునకు గాలి యెండ మొదలగు వానివలన శుద్ధి. దారు పాత్రా దులకు మన్ను చే జలముల చేతను శుద్ధి. గజదంతము మొదలయిన యస్థులకు గాలి యెండ మొదలగువానిచే శోషణముగలుగుటవలన శుద్ధి. తంతువులకు జలముల చేత శుద్ధి. పాలు మొదలగు రసములకు కేశాది సంస్పర్శుగలిగినను గాఁచుటచేత శుద్ధి. కంచు మొదలగు తైజసములకు నగ్ని చేతశుద్ధి. తోళ్లకు తైలము చేత శుద్ధి.

మేధ్యపు పూతయుఁ దుదమట్టఁబోయి తనతనయెప్పటి స్వరూపమునొందువఱకుఁ జింతపండు నీళ్లు మొదలగువానిచేత మాటిమాటికి శుద్ధిచేయవలయును. ద్విజుఁడగువాఁడు స్నానదానతపస్సులచేతను, కర్మానుష్ఠానమున కుపయుక్తమయిన వయస్సు చేతను, శక్తిచేతను, నుపనయనాది సంస్కారముచేతను, సంధ్యోపాసనాది సంస్కారముచేతను, నన్నుస్మరించుట చేతను, దనకు శుద్ధిని గావించుకొనుచున్నాఁడు. ఇట్లు శుద్ధుఁడై తన యధికారం బగు కర్మమును నాచరింపవలయును. ఆ మంత్రమున కాచార్య ముఖమునఁ గల రూపునఁ బ్రయోగము నెఱుంగుటయె శుద్ధి యగును. కర్మమునకు భగవదారాధనములని తలంచినాయం దర్పణము సేయుట శుద్ధియగును. ఇట్లు దేశము కాలము ద్రవ్యము కర్త మంత్రము కర్మమునెడి యీ యేడును విశుద్ధములయినచో పురుషునకును నిజాధికారం బగు ధర్మముసిద్ధించుచున్నది ఇవి యశుద్ధములయ్యెనా యధిధర్మమె కలుగుచున్నది. ఒక్కయెడ గుణము (శుద్ధి) గూడ విశేషవిధి బలము వలన దోషము (అశుద్ధి) అగును. ఎట్లన రోగికి స్నానాదులు నిషిద్ధములగుచున్నవి. అట్లె దోషమును (అశుద్ధియును) గుణము (శుద్ధి) అగుచున్నది. ఎట్లన యజ్ఞమునేయువాని పశుహింస గుణమే యగును. కనుక విశేషశాస్త్రముచేత గుణదోషములకుఁ గల నియమము సామాన్యశాస్త్రమువలనఁ గలిగిన గుణదోష విభాగమును బాధించుచున్నది. అనఁగా సామాన్యశాస్త్రము నం దేర్పడు గుణదోషభేదములను విశేషశాస్త్ర మపవదించుచున్నది. పతితు లగువారికి సహ సంభాషణము మొదలయిన కార్యములు పాతకములుగావు. అపతితులకే యీ పతితుల

తోడిసంభాషణాదులు పాతకములగును. ఒక్క యెడ గుణమైనది మఱి యొకచోట దోష మంటినిగదా. అట్లె, శబ్దాది విషయములతోడి కూడిక గృహస్థునకుఁ (బూర్వమె కయికొనఁ బడియుండున దగుటచే) స్వాభావికముగా నుండును. కనుక, నతని యెడ నది దోషము గాక గుణమెయగును. అదియె యతికి దోషమగుచున్నది. ఎట్లనఁ గిందఁ బరుండియున్న వానికిఁ బతనము గలుగదు. మీఁదనున్న వానికే యట్టి పతనము గలుగఁగూడును గదా. మనుష్యుఁ డేయేవిషయము నుండి నివర్తించునో యా యాదానినుండి విముక్తుఁ డగుచు రావలెనుగాని చానితోఁ గూడరాదు. ఇది యే సరులకుఁ బరమధర్మము; మఱి శోక మోహ భయములను బోఁగొట్టునది. శబ్దాది విషయములను గుణములుగాఁ జింతించుచు వానియం దధినివేశము గలిగియుండుటవలనఁ బురుషునకు వానియందు ములమగిల సంగము గలుగుచున్నది. సంగమువలన నావిషయములందుఁ గామము గలుగుచున్నది. కామమువలనఁ గలహము పుట్టుచున్నది. దానివలన దుస్సహమయిన క్రోధము గలుగుచున్నది. క్రోధమువలనఁ గార్యాకార్యములు దెలియని సమ్మోహము గలుగుచున్నది. ఆ సమ్మోహమువలనఁ బురుషునందు వ్యాపకమైయుండు ధర్మ భూత జ్ఞానము, సంకుచిత మగుచున్నది. సాధూ! అట్టి జ్ఞానములేని జీవుఁడు సత్ప్రాయుఁడగుచున్నాఁడు. అట్లు శూన్యత్వమును బొందుట వలన మూర్ఖుఁడు జ్ఞానవానివలెను, మృతుఁడయినవాని వలెను, విషయాసక్తుఁడు * స్వార్థమునుండి పిభ్రంశము నొం

* స్వార్థభ్రంశ మనఁగా స్వపరవివేకజ్ఞానములేకుండుటయని తెలియునది.

దుచున్నాఁడు. వాఁడు విషయములం దభినివేశముచేతఁ దన్ను నెఱుంగఁడు; పరుల నెఱుంగఁడు. మఱి వృక్షము స్వపర వివేకములేక బ్రతుకునట్లె తానును బ్రతుకుచుఁ దోలుతిత్తి వలె వ్యర్థముగా నూర్పుచ్చుచు వర్తించు చుండును. "యజేత స్వర్గకామః" ఇత్యాది రూపమున వినంబడుచుండు స్వర్గాధి ఫలము పురుషార్థమును బ్రతిపాదింపఁ దలంచినవి గావు. మఱి మోక్షసాధనములందు రుచిని బుట్టించుటకై యట్లు ఫలముకీర్తింపఁ బడుచున్నది. "అదృష్టసుఖ మగు స్వర్గాదిక మతిశయించినది. దాని కంటె నపవర్గసుఖ మతిశయించినది" యని యిట్లు మోక్షసుఖము నిరతిశయ పురుషార్థ మని చెప్పు తలంపున స్వర్గాదిఫలము చెప్పఁబడినది. ఔషధము నందు రుచిగల్పించుటకై బెల్లము చక్కెర మొదలగునవియుఁ బోలె మోక్షసుఖమందు రుచికై స్వర్గాదుల ఫలము * కీర్తింపఁ బడినది. జన్మమాదిగాఁ దమకు బాధాహేతువు లగు కామాదులందు మనస్సులు నిగిలి వానియందు శిరమునిచి తమశ్రేయము నెఱుఁగక జనులు దుఃఖావహ మగు సంసారమార్గము నందు భ్రమించుచు దానఁ జేసి తమస్సును జొచ్చుచు స్థావరత్వము నొందువారై యుండఁగా నట్టిమనుష్యులను మరల సంసారావహములయిన యాకామములందే వేద మెట్లు ప్రవర్తింపఁ జేయును? అట్లేని యది యాప్తమగునా? ఇట్లు ఫలశ్రుతి రుచి గలిగించుటకు మాత్రమే యగుటం బట్టి వేదతాత్పర్యము నెఱింగినవారు ఫలశ్రుతి పువ్వులుమాత్రము పూచి పండ్లు

---

* 'పిఱ నిమ్బం ప్రదాస్యామి ఖలుతే ఖణ్డలడ్డుకాన్। పితేత్యిపయుక్తః పిఱ తీ నఫలంతావదేవతు' అనుట యిట యనుసంధించునది.

పండనిచెట్టునలె పయికిఁ జెవి కింపుగామాత్ర ముండునది గాని నిజమునకు సార్థకమైనదిగాదని తెలియుదురు. కనుకవారు దాని నుపదేశింపరు శబ్దాది విషయములందుఁ గామముగల వారు గాన కృపణులును దృష్ణాకులును నైనవారు, కర్మజన్యము లగు స్వర్గాదులు వట్టిపువ్వులవంటి వయినను బండ్లవలె బుద్ధి నెంచి యగ్నిసాధ్యము లగు కర్మములం దభిని వేశముచేత వివేకముడుగలి యెడతెగని హోమధూపముచేత బడలి సడలి తమ ప్రత్యగాత్మస్వరూపమును దెలియకుందురు. ఉద్ధవా! అట్టివారు కర్మవిధి ప్రేరితులు నింద్రియతర్పణ పరులు నగుటంబట్టి యుపాదాన నిమిత్తకారణభూతుండగు నెవ్వని వలన నీజగత్తు పుట్టుచున్నదో, కనుక నెవ్వఁడీజగత్తగునో, యెవ్వఁడులేనిచో నిది కలుగనే నేరదో, యట్టి నన్నుఁ దమహృదయమందున్నవాఁడ నయినను దెలియరు చుమీ. చీఁకటి కన్నులఁ గ్రమ్మినవారికి నెదుట నున్నవస్తువులు గూడఁ దెలియవు గదా. మూఢులు, స్ఫుటము గానందున దురవహ మైయుండు మతమును దెలియక కేవలము విషయములందు మనస్సు దగిలిన వారై యూగ మను నెపమిడి మాంసభక్షణము కొఱకు వ్యర్థముగాఁ బశువులను హింసించుచున్నారు. కనుక వారు నాస్తికు లగుదురు. వారు మృతినొందిన పిదపఁ దా మట్లు హింసించినపశువులే తోఁడేళ్లు మొదలగు రూపముల నొంది పరలోకమందుండఁగా వానిచేత నందు హింసింపఁబడుచున్నారు. వారికి హింసించి మాంసభక్షణము సేయుటయం దిచ్ఛయుండెనేని, యందులకు యజ్ఞమే యనుమతి యని తలఁచి హింస సేయుచుందురు. వారికి హింస

యొక వేడుక. కనుక మాంసమునిండి సుఖమును గోరి పశువులను జంపి యజ్ఞములుచేసి పిత్రాది దేవతలను యజిం తురు. ఇట్లు యాగమును నెపముచేసికొని తమ సుఖమునకే తోరునట్టివారు గాన వారు ఖలులే యగుదురు నా స్తికులఫల మిది. ఆ స్తికుల ఫలము వినుము. ఒకా నొక వర్తకుఁడు మి క్కిలి ధనమును గడింపవలయు ననికోరి యంతకుమునుపే నంతరించి యున్నధనమును విడిచి సముద్రమును దాఁటం గోరి రెంటికిని భ్రష్టుఁడగుచున్నాఁడు. అట్లు ప్రకృతి పరిణామమైనది గాన స్వప్నము వలె ననిత్యమై కావునసే చెవికి మాత్ర మింపై యున్న పరలోకమును మతియుఁ దక్కిన కామము లను హృదయమునం దుద్దేశించి తమకుఁ గలధనములను గామసాధనము లగు కర్మము లందు వినియోగించుచున్నా రు; తుదకు నుభయభ్రష్టు లగు చున్నారు. వారు రజస్తమ స్సులను గుణములచేఁ గలుగు కర్మములందు నిష్ఠగలిగి రాజ సస్త్రీకి కామసాహారాదులను సేవించుచు వాని యందుఁ బ్రీతిగలిగి తమ తమగుణములకు ననురూపులయిన యింద్రుఁ డు మొదలగు దేవతల నుపాసించు చున్నారు. కాని యా దేవ తలను భగవదాత్మకులని యుపాసించుటయే సరియైనయుపాసన మగును గాని యట్లు చేయమిచే వా రింద్రాది దేవతలను యథారీతిని నుపాసింపనివారే యగుదురు. అట్లు నన్నుఁ యథావిధి నుపాసించినవారు గాకుందురు. వారు హృదయ మందు మన మిహలోక దేవతలను యజ్ఞములచే నారా ధించి స్వర్గలోకమును భాసింపించి స్వర్గమున రమించుచుండు ము. ఆ భోగము ముగియఁగా మరల నిహలోకములందు

గొప్పగృహములగల కధిపతుల మయి గొప్పకులమునందుఁబుట్టి నవారమైయుండఁగల'మని యిట్లు వేద పూర్వభాగమందు వట్టి వువ్వవలె నున్న యిట్టి వాక్యముచేత మనస్సు వ్యామోహమ గుటచే మిక్కిలియు దురహంకారులై తమ్ముఁ బరిపూర్ణులుగాఁ దలంచుకొనుచు నుందురు కాన, వారికి నావార్త సయితము రుచింపకుండును దీనినిఁ బట్టి వారు నిత్యసంసారులు గుండ నగుదురు కర్మకాండ దేవకాండ జ్ఞానకాండము లను మూఁడుకాండములరూపమున నున్న వేదము లివి యన్నియును సమస్తమున కంతరాత్మభూతుఁడయిన పరబ్రహ్మమును గుఱించినవే యగును. (అనఁగా నది పరబ్రహ్మమును దద్గుణములను దద్విభూతులను దత్ప్రాప్తి కుపాయములను నుపేయములను నుపేతలను గూర్చిన స్వరూపములను గుఱించినవి). వేదములు పరోక్షవాదములు (అనఁగాఁ దమయభిప్రాయముల నన్యులటముగాఁ జెప్పుచున్నట్టివి). కనుక వాని తాత్పర్యము నందఱు నెఱుంగరు. లోకోజ్జీవనముగా వేదరూపమగు వాక్కును నొసంగిన నీకుఁ బరోక్షవాదము గావింపనగునా యందువాఁ పరోక్షముగాఁ బలుకుటయే నాకుఁ బ్రియమయినది. ఏలన శుద్ధాంతఃకరణులగువారికే యీవేద తాత్పర్యము తెలిసికొనఁ దగినది; అనధికారులకుఁ గాదు. వారును దెలిసికొనిరేని వ్యర్థముగాఁ గర్మత్యాగముచేసి భ్రంశము నొందుదురు గాన పరోక్షమే నాకుఁ బ్రియముగా నున్నది. శబ్దబ్రహ్మం బగు వేదస్వరూపము మిక్కిలి దురవగాహము. అది ప్రాణముతోఁ గూడినవాగింద్రియము చేత నుచ్చరింపఁ దగినది. సముద్రమువలె దాని యవధికిఁ గొలఁదిలేదు; అందలి

యర్థములు దురవగమములు. దానిని యుక్తులచేతను నిరూపింప శక్యముగాదు. అనంత జ్ఞానవీర్యాదిశక్తులు గల భూముండనగు నాచేత నది విస్తరింపఁ బడినది. కామరతూఁడుల యందుఁ బోఁగులువలె మనుష్యాలయం దది యుచ్చరింపఁదలంచు వారికిఁ, జెవులు రెండును మూసి కొనఁగా వినఁబడు ప్రాణఘోషమహోపమునం జూపట్టుచున్నది. సాలె పురుఁగు హృదయమునుండి ముఖముదారిని నూర్ణను వెలి గ్రక్కునట్లు, ఉచ్చరింపఁ గోరు పురుషునికిఁ బ్రాణవాయు ఘోష మాకాశమునుండి (నాభినుండి ఓష్ఠ్య వఱకుఁ గల లోపలి రంధ్రము మూలమున) స్పర్శరూపి యగు మనస్సు తోఁగూడి ఛందోమయమును స్థాయియు దేహేంద్రియాది ధారణసమర్థమును శబ్దబ్రహ్మాత్మకమును నగు వాక్కును సృజించుచున్నది. ఇట్టి ప్రాణము వాగింద్రియము నొంది బృహతి యగు వాక్కు నావిష్కరించుచున్నది. ఆ బృహతీవాక్కు వలన శ్రేయోనూర్గములు వేయి తెలియనగును. ఓంకారము నుండి వ్యంజితము లగు స్పర్శములును స్వరములును నూష్మములును నంతస్థములు ననుపీనితో నది భూషితమై యుండును. విచిత్రములగు క్రుతులయం దది విస్తరింపఁబడి యుండును దాని యనధికమితి గలుగదు; చతుశ్చతురక్షరాధికము లగు గాయత్రి మొదలగు ఛందములతోఁ గూడియుండునది. ఇట్టి బృహత్త్వముగల వాక్కును బ్రాణము కానే సృజించుచున్నది; విదపఁ దన వ్యాపారము నుడుగుటచే దానిని వ్యక్తముగాకుండను జేయుచున్నది. ఆఛందస్సులుగాయత్రి, ఉష్ణిక్కు, అనుష్టుప్పు, బృహతి, పంక్తి, త్రిష్టుప్పు, జగతి, అతిచ్ఛన్ద, అత్యష్టి,

అతిజగత్తు, విరాట్టు నగును. ఆ వేద మేమి విధించుచున్నది? ఏ తత్త్వమును విశదీకరించుచున్నది? దేనిని సముచ్చయించి విధించుచున్నది? దేనిని సామాన్యముగా విధించుచున్నది? దేని నభవదించుచున్నది? యని యీ వేదమునకుఁ గలతాత్పర్యమును నేను దప్ప మఱియెవ్వఁడు నెంతమాత్రమునెఱుఁగఁడు. దాని హృదయమిది. అది నాయారాధన మనెడుధర్మమును విధించుచున్నది. నన్నే సర్వశరీరకుఁ డని యభిధావృత్తిచేతఁ బ్రతిపాదించుచున్నది. అది వికల్పించి యభవదించునదియు నేనే. వేదమునకుఁ దాత్పర్యమైన యర్థము సర్వమును నింతమాత్రమే. అది యేదన-వేదము నన్నే తాత్పర్యముగా నాశ్రయించి దేవమనుష్యాది భేదమును ప్రకృతిమాత్రమునకుఁ గలిగినది గాని జీవస్వరూపమునకుఁ గలిగినదిగాదని యనువదించి జీవగతం బయిన యాకారమును గాల్పాభూతుఁడ నగు నాయందుఁ బ్రతిషేధించి (అనఁగా నాకులేదని ప్రతిపాదించి) సర్వతత్త్వవిలక్షణునిఁగా నన్నుఁ బ్రతిపాదించి యంతఁ దన వ్యాపారమునుండి విరమించు చున్నది. ఇదియె * వేదతాత్పర్యము. ఇది యిరువదియొకండవయధ్యాయము.

{శ్రీకృష్ణుఁడు ఉద్ధవునకుఁ దత్త్వముల సంఖ్యా స్వరూపములను నిర్ణయించుట.}

ఉద్ధవుఁడు—"విశ్వేశా! ప్రభూ! తత్త్వము లెన్ని? కొందఱు ఋషులు తత్త్వములు తొమ్మిదనియుఁ గొందఱు పదునొకం

---

*ఇందు వేదతాత్పర్యము 'ప్రకృతికే దేవమనుష్యాది భేదము, జీవునకుఁ గాదు. జీవుని యాకారము ఈశ్వరునకుఁ గలుగదు. ఈశ్వరుఁడు సర్వతత్త్వవిలక్షణుఁడు' అని తెలియఁబడినది.

డనియుఁ గొంద ఱయిదనియు లెక్కించియున్నారు. నీవు మూఁడనిచెప్పితివి. ఇట్లీ తత్త్వవిషయమందు వాదములు వెక్కుఁలు వినుచున్నారము. కొంద ఱిరువదియాఱనియుఁ గొంద ఱిరువది యైదనియుఁ జెప్పిరి. మఱికొంద ఱేడనియుఁ దొమ్మిదనియు నాలుగనియుఁ బదునొకండనియుఁ జెప్పిరి. కొందఱు పదియే డనియుఁ బదియాఱనియుఁ బదుమూఁడనియుఁ జెప్పిరి. ఆయు మ్మంతా ! ఋషు లిట్లు తత్త్వములను వేఱువేఱువిధముల గణ నము సేయుట యేప్రయోజనము నుద్దేశించి చెప్పెదరో మాకు నీవు చెప్పఁదగును'' అని యడిగెను. శ్రీభగవంతుఁడు- ఋషులు చెప్పినట్లే సమస్తము లయిన పఱుఁములును యుక్తి యుక్తములై యున్నవి. నాదుప్రకృతి యొక్కఁడు సంఖ్యగల తత్త్వములకుఁ గారణమని కాని తక్కువసంఖ్యగల తత్త్వములకుఁ గారణమని కాని గ్రహించి యెట్లు చెప్పినను బొసఁగియుండునే కాని విరోధమేమియు నుండదు. కనుక నీవు తత్త్వముల గణనము విరుద్ధముగా నున్నదని చెప్పితివే. అది యట్లు విరుద్ధముగాదు ఆ గణనము విరుద్ధముగాకుండువిధమున నేను జెప్పుచున్నాను. ఇట్లనేకవిధములయిన వాదములకెల్ల హేతువు నాశక్తులయిన ప్రకృతిపురుష మహదహంకారాదులే యగు నని యందఱు నొప్పుకొనియే తీఱవలయును. ఆశక్తి లొకటియం దొకటి యంతర్భవించియుండుటఁబట్టి తత్త్వముల సంఖ్యనుగుఱించి వాదించువారికిఁ బఱుఁభేదములు వెక్కుఁలు గలిగినవి. అనఁగా తత్త్వము లొకటిలోనొకటి యంతర్భవిం చుటవలనను నంతర్భవింపకపోవుటవలననును తత్త్వములసంఖ్యను గొందఱు వెక్కువగాను మఱికొందఱు దక్కువగాను వాదింపుచు

రయిరి. శివమును దమమును గలుగఁగా నీ పశుభేదము లడు గంటును. వాదములెల్ల నుడిగిపోవును. ఏలన శివమదమాది సంపన్నుఁ డగువాఁడు చిదచిదాత్మక మగు జగత్తునంతయు నా శరీరముగాఁ గనుఁగొనుచున్నాఁడు గాన, వికల్పమును వాద మును రెండునుగలుగవు. పురుషతిలకా! తత్త్వములొకటియం దొకటి చొచ్చుటవలన వాదులు చెప్పఁదలఁచిన క్లిల్లఁ దత్త్వము లెక్కుడు సంఖ్యగలవిగాను దక్కువసంఖ్య గలవి గానునగుచున్నవి. కట్టియ మొదలగువానియం దొక్కట నగ్ని జలము మొదలగు నితరములు పెక్కులు ప్రవేశించియుండును గదా. కాఁబట్టి యొక్కదానియందుఁదక్కినవి పెక్కులు చొచ్చి యుండుట చూపట్టుచున్నది. మఱియుఁగారణమగుమృత్తునందు ఘటాదులు సూక్ష్మరూపమునఁ జొచ్చియుండును కార్యభూతము లగు ఘటాదులందుఁగారణం బగుమృత్తును ననుగతమైచొచ్చి యుండును. కాన కారణంబగు తత్త్వమునందుఁ గాని కార్య భూతంబగుదానియందుఁ గాని సమస్తములయిన తత్త్వములు చొచ్చియుండును. కాఁబట్టి యాతత్త్వములసంఖ్య యొక్కువ యనియుఁ దక్కువయనియుఁ గాము కోరినట్లు లెక్కించుచున్న వాదులనోర వారు చెప్పఁదలఁచిన క్లేదేవచ్చునో దానినంత యు సరియని నే ననుమతించుచున్నాను. ఏలన నాతత్త్వము లొకటియం దొకటి చొచ్చియుఁ జొరకయునుండు యుక్తివలన నెట్లు లెక్కించినను బొసఁగుచునే యుండును. జీవునకు జీవాత్మే శానయియుఁ దాను స్వతంత్రుఁడనియు నిట్టి యజ్ఞాన మనాదిగా నుండియున్నది. అట్టి జీవునకుఁ దన స్వరూపమును బరస్వరూ పమును నెఱుంగుట తనంతటఁ గలుగనేరదు. మఱి వానికంటె

నన్యుండునుఁ దనంతటనే సర్వజ్ఞుండును నగు పురుషుఁడే యట్టి జ్ఞానమునొసంగు వాఁడగును. జీవునకును నీశ్వరునకును నణు వంతయైనను వైలక్షణ్యము గలుగదు. ఏలన నిరువురును జ్ఞానస్వరూపులును జ్ఞానగుణకులు నగుదురు. కావున జీవుఁడజ్ఞుఁడు; ఈశ్వరుఁడు సర్వజ్ఞుఁ డని యీ యిరువురకును వైషమ్యము గల్పించుటయెల్ల నిరర్థకమే యగును. వారికి స్వరూపమందు భేదముగలుగదు. జీవునందుఁ గనపట్టు నజ్ఞత్వమో ప్రకృతి కార్యముగాని జీవునిదిగాదు. ప్రకృతియనఁగా రజస్సత్త్వాదిగుణములు సమముగా నుండుటయే కాని మఱియొకటిగాదు కనుక జగత్తు నుత్పత్తికిని స్థితికిని నాశమునకును హేతువులయినరజస్సత్త్వతమస్సు లనుగుణములు ప్రకృతికిఁగల గుణములేకాని యాత్మగుణములు గావు. ఇట్లు సత్త్వాదులు ప్రకృతిగుణములై దానితో నడంగినవగుటచే నవి కాకయే తత్త్వము లిరువదియైదగుట తేలుచున్నది. సత్త్వము జ్ఞానమును గలిగించునది. రజస్సు కర్మమును దమస్సుఅజ్ఞానమును గలిగించునది. గుణము లొండొంటితోఁగలయుటచేఁ గాలము పుట్టుచున్నది. అదియేస్వభావమనియు సూత్రమనియుఁ జెప్పఁబడుచున్నది. కానదీనినిగూడఁ గూర్చుకొనఁగాఁ దత్త్వము లిరువదియే డగుచున్నవి. జీవుఁడును గుణసామ్యావస్థ యగు ప్రకృతియును మహత్తును నహంకారమునునాకాశమును వాయువును జ్యోతియు నప్పలును భూమియు ననితత్త్వములు తొమ్మిది చెప్పబడియున్నవి. శ్రోత్రము త్వక్కు దర్శనము ఘ్రాణము జిహ్వయని జ్ఞానేంద్రియము లయిదును, వాక్కు పాణిపాయువు ఉపస్థము పాద మని కర్మేంద్రియములయిదును, జ్ఞానకర్మేం

ద్రియమగు మన స్పాక్కటియు, శబ్దము స్పర్శము రసము గంధ
ము రూపమను విషయ సమూహమును, గతి ఉక్తి ఉత్సర్గము
శిల్పమని కర్మేంద్రియ కార్యములును గలిగినవి. ఈ ప్రపంచ
సృష్టికిఁ బూర్వ మాకాశము మొదలు మనస్సు వఱకును గల
కార్యములుగాను, ప్రకృతి వ్యక్త మహంకార మనుకారణము
లుగాను రెంటి రూపమున నున్న ప్రకృతి సత్త్వాదిగుణము
లతోఁ గూడినదై ప్రత్యక్షాది ప్రమాణముల కగోచరుండును
వేదాంతైకవేద్యుండు నగు పరమపురుషుఁ డీక్షింపఁగా, నీ
ప్రపంచమును విధించిన దయ్యె. ఇట్లాతని వీక్షణము వలనఁ
బుట్టిన వ్యక్తము మొదలగు తత్త్వము లాతని యీక్షణము
వలన సృష్టిసేయు సామర్థ్యము నొందినవై యొక్కటిగాఁగూడి
కొని వికారములనొందుచుఁ దమకుఁ గారణమగు ప్రకృతి బల
మువలన బ్రహ్మాండము సృజించుచున్నవి తత్త్వము లేడే యని
చెప్పఁబడెనుగదా! ఆది యెట్లనిన-ఆకాశాదులైదును, జ్ఞాన
స్వరూపుండగు జీవుండును, ఆకాశాదులకును జీవునకును సుభ
యులకు నాధారభూతుఁ డయిన పరమాత్మయు,నని తత్త్వము
లేడే యగుచున్నవి. ఆ యేడు తత్త్వములవలన నుండియే *
దేహమును నింద్రియములును భూతాణములును గలుగుచున్నవి.
దేహేంద్రియాదులం దేతత్త్వముగాని యాకాశాదులం దొ
క్కటినైన విడిచియుండుట గనుపట్టదు కాఁబట్టి యవి యెల్ల

* ఇంద్రియములు జీవమున కంతరంగములు. ప్రాణములును దేహకారణములగు ధాతువులం దంతరంగములు. ప్రకృతి మొదలయిన కారణము లనుగార్యములయినయాకాశాదులందంతరంగములు. కావున తత్త్వములేడ ఇట సిద్ధము.

నొకటియం దంతర్భవించియుండుటయొప్పుచున్నది *ఆకాశాదులయిదును బరమపురుషుండొక్కఁడునుగూడఁగాఁద త్త్వములా అగుచున్నవి ఆపరమపుగుహుఁడు తనవలననుండిపుట్టినభూతములతోఁగూడి యీ వ్యష్టి జగత్తును సృజించి దానికి స్థితి గలుగుటకై లోపలఁ బ్రవేశించినవాఁ డయ్యెను త త్త్వములు నాలుగే యనెడిపక్షమునందుఁ బరమాత్మునివలననుండి తేజస్సు అప్పులు అన్నము (భూమి) అను మూఁడు పుట్టెను. ఆత్మతోఁగూడిన మూఁడును జేరి త త్త్వములు నాలుగగుచున్నవి. †పరమాత్మయుఁ దేజస్సు నప్పును నన్నమును గూడి యీ జగత్తు పుట్టినది. స్థూలము లగు కార్యములు సూక్ష్మము వలన నుండి పుట్టుట తప్పకగలుగుటనుగదా. త త్త్వములు పదునొకండనుపక్షమునందు ఈ పరమాత్మయు మహాభూతము లయిన యాకాశాదులగుటను శ్రోత్రాదులగునింద్రియము లయిదును గూడి పదునొకండయినవి. త త్త్వములు పదియేడనుపక్షమునందు నాకాశాదులయిదును శబ్దాది తన్మాత్రలయిదును నింద్రియాదు లయిదును గూడి పదియేనగుచున్నవి మనస్సు పదియాఱవది. ‡ ఆ పరమాత్మ పదియేడవవాఁ డగుచున్నాఁడు. పదియేడనుపక్షమునందుంబోలెఁ బదియాఱనెడు లెక్కయందును నాత్మయు భూతములు తన్మాత్రలును నింద్రియములు నని పదియాఱు సమానముగా నున్నవి. అయిన నిం దాత్మయే

*ఇందు జీవుఁడు పరమాత్మయందుశరీరనిర్మాపమున నంతర్భూతుఁడగును. దేహేంద్రియాదు లాకాశాదులం దంతర్భూతములు.

† ఇం దాకాశాదులు తక్కిన తేజస్సు మొదలగువానియం దంతర్భూతములు. తక్కినవి మునుపటివలెనే తక్కిన వానియం దంతర్భూతములు.

‡ ఇందును జెప్పఁబడిన వానియందుఁ జెప్పఁబడనివి యంతర్భూతములు.

మనస్సనఁబడుచున్నది. అనఁగా నాత్మయం దంతఃకరణ మడఁగి యున్నది. ఆకాశాదిభూతములును జ్ఞానేంద్రియములును బంచ వృత్తి ప్రాణమును మనస్సును బరమాత్మయునని తత్త్వములు పదుమూఁ డగుచున్నవి. * (ఇట్లై తత్త్వములు మూఁడనుట యు నయిదనుటయును దెలియునది) ఇట్లు ఋషులు తత్త్వము లను నానావిధముల లెక్క-పెట్టియున్నవాఁగు. అన్నియునొం ద్రొంటిలో నడఁగియున్న యుక్తిచే నొప్పియుండుటచే న్యాయ ములే యగుచున్నవి. కావున విద్వాంసు లగువారికి దుర్ఘట మనుచు దేనిఁ గాని యేదియు లేదు' అనెను.

ఉద్ధవుఁడు—'ప్రకృతియును పురుషుఁడునిరువురునుదమంతట విలక్షణమగు స్వరూపము గలిగియుందురు. అయిన వానిలో నొకటి విడిచి మఱి యొకటి కనుపట్టకుండుటవలన నా రెంటి కిని భేదము గానరాకున్నది. ప్రకృతియందు (అనఁగాఁ బ్రకృతి కార్యమగు దేహమునఁదు) నాత్మయు నాత్మయఁదుఁ బ్రకృతియుఁ గనుపట్టుచున్నది. (ఒకటిని విడిచి మఱియొకటి కనుపట్టకుండుటవలనను 'నేను దేవుఁడ'నని దేహమునకును నాత్మకును నభేదము తెలియుటవలనను దేహమునకును నాత్మకును భేదము కానంబడకున్నది. నాహృదయమందుఁ బెద్దసందేహమిదియొకటి నాటుకొని యున్నది. నీవు సర్వజ్ఞుండవు గాన యుక్తులందు నిపుణములయినన చనములచేత దీనిని ద్రుంపఁదగుదువు. జీవు లగు మాకు నాయా యర్థములను గలయాపునఁ గనుఁగొనునట్టి

* ప్రకృతి పురుషుఁడు ఈశ్వరుఁడని తత్త్వములు మూఁడు. నాలుగు తత్త్వముల పక్షమునఁ జెప్పఁబడిన నాలుగును వాయువును గూడి తత్త్వము లయి దగుచున్నది.

జ్ఞానము నీ ప్రసాదమువలననే కలుగుచున్నది. వారికి స్వభావముచేత నీ శక్తివలన జ్ఞానము సంకుచితమై యుండును. నీ వొక్కడవే సర్వజ్ఞుడవు; నీదు మాయకుఁగల స్వరూపమును నీవే యెఱుంగుదువు కాని నీదు మాయచేత నితరు లెల్లవారును మోహితులుగాన యెఱుంగ నేరరు' అనెను.

భగవంతుఁడు—ప్రకృతి పురుషుఁడను రెండును భిన్నములే కాని యొక్కటిగావు. ఇందధిభూతము మొదలుగా సృజింపఁబడిన యివి యెల్లఁ బ్రకృతివికార మగు నహంకారము చేతఁ గావింపఁబడినవి. అందుఁగోరుచున్నాను ద్వేషించుచున్నానని పురుష (ఆత్మ) గుణములును, బలుపు పలుచన యను ప్రకృతి (దేహ) గుణములును నొక్కటనే గజిబిజిగాఁగలసి యొకదాని గుణములు మఱియొక దానివిగాఁ గనుపట్టుచుండుట యీ యహంకారము స్వరూపము. ఉద్ధవా! నామాయ తన యహంకారము మూలమున నిట్లు దేహాత్మలగుణములను గలపి వానికి భేదము తెలియకుండునట్లు చూపుటయే కాక మఱి యాత్మ దేవుఁడనియు మనుష్యుఁడనియు స్వతంత్రుఁడనియు నిట్లు భేద బుద్ధులు పెక్కులుగలిగించుచున్నది. అధ్యాత్మము,అధిదైవము అధిభూతమనఁబడు నీ మూఁడును వైకారిక (అహంకార) స్వర్గ మనఁబడును. కన్నధ్యాత్మము. రూపమధిభూతము సూర్యశరీర మధిదైవము. ఈ దేహమందలి కంటిరంధ్రమునం దీ మూఁడు నొకటి కొకటి యుపకరించుటంబట్టి జ్ఞానమును బుట్టింప నేర్చు చున్నవి. 'అధ్యాత్మాదులు పరస్పరముగూడుటవలన రూపాదుల ప్రకాశము గలుగునేని, యాత్మ ప్రకాశమెక్కడి' దందువా? హృదయాకాశమందుఁగల యాత్మ తనంతటఁదానే ప్రకాశించు

చున్నది. * ఎట్లన, ఆత్మ యీ దృక్కు మొదలగు మూఁడేసిం టికి సాధ్యమైనది గాన వానిని బ్రకాశింపఁజేయుట కదియే హేతువు. దృగాదు లుడిగినపిదపఁగూడ నది నెల కొని యుండునది గాన వానికంటె విలక్షణ మయినది. తనకుఁ మాత్రము గలిగి యుండు జ్ఞానము చేత నది ప్రకాశింపఁ జేయఁదగువాని కెల్లఁ బ్రకాశకమై యున్నది. పరస్పరముకూడిక చేతఁ జక్షువు సిద్ధించినట్లి త్వక్కు మొదలయినవియు శ్రవణము మొదలైనవియు, జిహ్వా మొదలయినవియు నాసిక మొదలయినవి

---

* ఇంద్రియములు ఆత్మయందు (దేహమునందు) ఉండుటంబట్టిఅధ్యాత్మములనియు, విషయములగు రూపాదులు తేజస్సు మొదలగు భూతములయందుండుటంబట్టి అధిభూతమనియు, అధిష్ఠించియుండు దేవతదేహము క్షేత్రజ్ఞుడగు సూర్యుఁడను దేవతారూపముగలిగియుండుటచేతఅధిదైవమనియుఁ జెప్పఁబడినవి. రాజసాహంకారముతోఁగూడిన సాత్త్వికతామసాహంకారములు రెంటివలన దృగాదులగు ఇంద్రియములును రూపాదులగువాని విషయములును వాని కధిష్ఠాతలగుదేవతలును సృజింపఁబడినట్లు సృష్టిప్రకరణమునందుఁ జెప్పఁబడుచున్నవి. కావున నేఅధ్యాత్మాదు లహంకారసర్గమనఁబడుచున్నవి.అధ్యాత్మాదులు మూఁడును, అనఁగా ఇంద్రియము విషయము అధిష్ఠించియున్న దేవతాశరీరము మూఁడును, పరస్పరము ఉపకరించినచో జ్ఞానమను కార్యము పుట్టఁగూడును.కాఁబట్టిమూటికిని ఉపకార్యోపకారక భావముగలదు. ఎట్లన సూర్యుని దేహము తనకిరణముల ద్వారావచ్చి చక్షువునందును దాని విషయ మగు రూపమునందును అధిష్ఠించుచున్నది. అప్పు డారెంటిలో చక్షువు గ్రహించునదియు రూపము గ్రహింపఁబడునదియు అగుచున్నవి. కాఁబట్టి అధిదైవమునకు ఆరెండును ఉపకార్యము లగుచున్నవి. రూపము మిక్కిలి దూరముగాకయు నడుమ నేమియుడ్డులేకయు నుండినచో చక్షువునకు గ్రాహ్యమగుచున్నది. కాన చక్షువున కది ఉపకార్యమగుచున్నది. ఇట్లు మూటికి ఉపకార్యోపకారకభావము తెలియుచున్నది.

యు సిద్ధించుచున్నవి. * ఇవియన్నియు మనస్సుతోఁ గూడియె కార్యకరములగు చున్నవి. ఇవంతయు నహంకారము చేసిననృష్టి యగును. ఈయహంకారము సత్త్వరజస్తమస్సులు సమత్వము వీడి విషమములై కలఁతనొందుటవలనఁగలిగిన వికారము; మఱి ప్రకృతి మూలకారణముగాఁగల మహత్తత్త్వమునుండిచక్కఁ బుట్టినది. ఇట్టి యీయహంకారము దేహమేయాత్మ యనెడిభేద మునుగలిగించుభ్రమమును, ఆత్మయే దేవుఁడు మనుష్యుఁడను వికల్పమును గలిగించుచున్నది. ఇది వైకారికము(సాత్త్వికము) ఐంద్రియము (తైజసము) తామస మనిమూఁడు విధములగును, ఆత్మ పరిపూర్ణముగా జ్ఞానస్వరూపమయినది. దేహమో పరి పూర్ణముగాజడమైనది. నేననుటకునాత్మయెంతయునొప్పియుండు నుగాని యుందులకు వివాదమేమియుఁగలుగదు. ఉన్నదనియు లేదనియుదాని నిట్లుభేదముగాఁజెప్పఁగలదుగదా. అభేదముగాఁ జెప్పట దానిదేవమనుష్యాది రూపములకే చెల్లునుగాని యాత్మకుఁజెల్లదు. ఈ భేదభ్రమ మాత్మయందు లేకున్నను స్వరూపసాక్షాత్కారము గలిగించు నావలనబుద్ధినుంపని పురుషుల కది యుడుగకయే యుండును గనుక వారి ననువర్తించుచునేయుండును' అనెను.

---

* మొదలయినవి యనుటచే ఆయా ఇంద్రియములయొక్క అధిభూతమును (విషయమును) అధిదైవమును దెలియనది. త్వక్కు అధ్యాత్మము; దాని కధిభూతము స్పర్శను; అధిదైవము వాయువు. శ్రోత్రమధ్యాత్మము; దాని కధిభూతము శబ్దము; అధిదైవము దిక్కులు. జిహ్వాఅధ్యాత్మమును; దాని కధిభూతమురసము;అధిదైవము వరుణుఁడు. నాసికఅధ్యాత్మము;దానికధిభూతము గంధము; అధిదైవము అశ్వినీదేవతలు. మన స్సధ్యాత్మము; దాని కధిభూతము ధ్యేయవిషయము; అధిదైవము చంద్రుఁడని తెలియనది.

ఉద్ధవుఁడు—ప్రభూ ! 'నీ వలనబుద్ధి యుంపక మరల్చుకొన్న వారు తమతమ చేసి కొన్న కర్మములచేత గొప్పదేహములును దక్కువ దేహములును నేవిధమునఁ గయికొందురో మఱి యేప్రకారమున విసర్జింతురో, (యనఁగాఁ బూర్వదేహమును విడిచిన ట్లింద్రియములను గూడ విడిచి, దేహాంతరమును బొంది నట్లు వేఱింద్రియములను గూడఁ బొందుదురా ? లేక మును పటి యింద్రియములతోఁ గూడియే దేహాంతరమును గయి కొనుచును విడుచుచు నుండెడిదా?) చెప్పము. గోవిందా ! ఈ విషయమున నిశ్చితమయినది నాకుఁ జెప్పుము. అల్పబుద్ధుల కిది యెంతమాత్రము నిశ్చయింపరానిది; దీని నెఱింగినవారు బహుతరముగా లోకమునందుఁ గలుగరు. ఏలన నందఱును నీ మాయచేత వంచితులై యున్నవారు. కావున,దీనిని నీవే నిశ్చ యించి చెప్పవలయును' అని యడిగెను.

భగవంతుఁడు—'మనస్సు పూర్వకర్మవాసనలతోనిండినదై జ్ఞానేంద్రియములయిదింటితోను భూతసూక్ష్ములతోను గూడి యేయొక దేహమునుండి మఱియొక దేహమునకుఁబోవుచున్నది. దానికంటెను వేఱయినయాత్మ యీ మనస్సు నమసరించి పోవు చున్నది. మనస్సు కర్మవాసనలకు వశమై తాను గన్నట్టియు విన్నట్టియు విషయములను జింతించుచు నుండును; పిదప నా విషయములు కలిగినపుడు హర్షించుచుండును; కలుగనప్పుడు దుఃఖించుచుండును. దాని వెనుకనే మునుపటి స్మృతులన్నెల్ల నుడిగిపోవును. ఒక్క జన్మమందే యిట్టిమఱపు గలుగఁగా దేహమును విడిచిపోయినపుడు మునుపటిస్మృతులను మఱచు టనుగుణించి చెప్పనేల? ఎవ్వనిమనస్సు విషయములం దఖినివే

శము గలిగియుండుటచే నాత్మదేహ విలక్షణమయినదని యను సంధింపదో యట్టి ప్రాణికి నొకానొక కారణమువలన మరణ కాలమందు మిక్కిలియు జ్ఞానలోపము గలుగుచున్నది. అట్లు జ్ఞానము లోపించినను జన్మాంతరము నొందునపుడు మునుపటి యింద్రియము లాఱు ననువర్తించుటవలనఁ బూర్వజన్మస్మృతి గలుగదా యందువా? బూరిదా! పురుషునకు సర్వవిధములగు మనోవృత్తులచే దేహము నాత్మగా స్వీకరించుటయే జన్మ మందురు. జన్మకాలమునుండి దేహమే యాత్మ యని వానికిఁ దోఁచుచుండును. ఇట్లు దేహమే యాత్మ యని తప్పఁదలఁచు చుండుటంబట్టి దేహమునకు విలక్షణ మైనదియుఁ బూర్వోత్తరజన్మముల ననుసంధించునదియు నగు నాత్మ తోఁపకుండును గాన, తొంటిమృతిని నిప్పటిదేహ స్వీకారమునుగూర్చి స్మృతి గలుగనేరదు దేహమే యాత్మయని తలంచుట యెల్ల స్వప్నము నందలి మనోరథములవలె భ్రాంతియే యగును. ఈ పురుషుఁడు స్వర్గమున నేవేవో మనోరథములను గావించుచుండి తన మునుపటి బ్రాహ్మణత్వాదులగు నాకారములను స్మరింపఁడు. మఱియొక స్వప్నము గనుచో మునుపటి స్వప్నమును, నొక మనోరథమును గోరుచో మునుపటి మనోరథమును స్మరింపఁడు. మరణమువలనను మఱియొక దేహమును బొందుటవలనను జ్ఞానము మిక్కిలియు లోపించుటంబట్టి పూర్వము తాను దేహమునే యాత్మయని మనస్సునఁ దలఁచుట నీ జన్మమందు స్మరింపఁడు. జన్మాంతరము కలిగినపుడు పూర్వ జన్మమందుఁ దాను నున్నవాఁడయినను నపుడు లేకుండినట్లును, ఈజన్మమందే తాను స్పష్టముగఁ గలిగి

నట్లును గనుఁగొనుచున్నాఁడు ఏక రూపమున నున్న యాత్మ స్వరూపమునందు నింద్రియముల కునికి పట్టయిన శరీరము పుట్టుచున్నది. ఆ పుట్టుటచేత శరీరము నింద్రియము లు నంతఃకరణము ననియీ మూఁడు విధములును దోఁచు చున్నవి. ఈ మూఁటివలన వెలుపల దేవత్వము మనుష్యత్వము బాలత్వము యువత్వము మొదలయినవియు, లోపల లోభము భయము మొదలగునవియు నగు భేదములు, చెడు పుత్రునిఁ గన్నపురుషునికింబోలె, ననర్థహేతువులై కలుగు చున్నవి. ఉద్ధవా! భూత పరిణామములయిన శరీరములు నిత్యమును వేఱొక పరిణామమును బొందుచును మునుపటి యనస్థ విడుచుచును నుండును. ఈ రెండును నలక్ష్య వేగంబగుకాలము మిక్కిలి సూక్ష్మమగుట చేతఁ దెలియఁ బడ కున్నవి. అగ్నియందు మునుపటిజ్వాలలు పోయి వేఱు జ్వాలలు వచ్చు చుండుటయుఁ, బ్రవాహము లందు మునుపటి జలములు పోయి క్రొత్త క్రొత్త జలములు వచ్చుచుండుటయు, దెలియఁబడవు. వృక్షమునందుఁబండ్లు ప్రతి క్షణమును బక్వ మగుచుండుటయుఁ దెలియరాదు. అట్లె సర్వభూతములకును గాలముచేతఁ గావింపఁబడిన బాల్య ము మొదలయిన యవస్థలు మిక్కిలి సూక్ష్మములగుటం జేసి తెలియఁబడ కుండును. ఇట్లాయాయవస్థలు ప్రతిక్షణమును బరిణామ మొందుచుండుటం బట్టి 'వాఁడే యీబా లుఁడు' 'వాఁడే యీ వయస్కుఁడు' డని మునుపటియవస్థ వా నినేయిప్పటి యవస్థ వానినిగాఁ దలంచుటయుఁ జెప్పుటయు నెట్లు పొసగుఁ నందువా? అగ్నికిఁ గల మునుముందటి

జ్వాలలును వెనువెనుకటి జ్వాలలును సదృశము లగుటంబట్టి వానికిఁ గల భేదమును దెలియక పురుషుఁడు తన కంటికిఁ గనఁబడుచున్నదానినే యీఁది 'అదియే యీదీప' మని తలంచి చెప్పుచున్నాఁడు. అట్లె ప్రవాహమునందు మునుపటి జలములకును బిమ్మటి జలములు సమానముగా నుండుటను బట్టి భేదము తెలియనందున 'అదియే యీజల' మని తలంచి చెప్పుచున్నాఁడు. అట్లె 'వాఁడే యీపురుషుఁడు, వాఁడే యీబాలుఁ' డని తలంచుటయుఁ జెప్పుటయు నస్థిరాయుష్కులగు మనుష్యులకు భ్రాంతిమూలమునఁ గలుగునవే కాని మఱి యొకటిగాదు. ఈ దేహము నుత్పత్తికిఁ గర్మము బీజము. అట్టి కర్మముచేత దేహాత్మాభిమాని యగు జీవుఁడు దేహము వలె నెప్పుడును బరిణామము నొందుచుండు స్వభావము గలవాఁడు గాకుండుఁ గాక; అయినను వాఁడు భ్రాంతిచేతఁ బుట్టుచును జచ్చుచు నున్నాఁడు. ఆత్మకు నుత్పత్తి మరణములు భ్రాంతిచేత సిద్ధములయినవి గాని స్వాభావికములు గావు. ఏలనఁ బురుషునకుఁ బుట్టుకయులేదు, జావును లేదు. వాఁడు దేహము గలుగుటకుఁ బూర్వమును నది నశించిన పిదపను నుండియున్నాఁడు. దారువునందుఁ గూడియున్న యగ్ని చిలుకుటచేతఁ దోఁచుచున్నది గాని దారువులోఁ గూడ నుత్పత్తి నాశములు పొందదు గదా! అట్లె యాత్మయు దేహమునందుఁ దోఁచినను దానితోడి యుత్పత్తి వినాశములకుఁ బాలుగా కుండును. అవి గలసియుండునట్లు తోఁచుటయెల్ల భ్రాంతిమూలము. దేహమునకు శైతోనిష్క్రమము, గర్భము, బాల్యము, కౌమారము, యౌవనము,

మధ్యవయస్సు, జర, మృత్యువని యవస్థలు తొమ్మిది గలుగు చున్నవి. నిషేకము మొదలయిన యీ యవస్థలును మఱియు శయనాసనాదు లయిన యితరావస్థలును నానావిధ ముల నుండును. ఇవి యెల్ల నొకఁడు (బద్ధుఁడు) తానొ కా నొకప్పుడు కర్మపరిపాకదశయందుఁ గయి కొనుచు న్నాఁడు. మఱి యొకప్పుడు వానిని విడుచుచున్నాఁడు. గుణ పరిణామము లగు శబ్దాది విషయములను మనస్సునందు ధ్యానముసేయు చుండుటయే వీనినెల్లఁ గయికొనుటకును విడుచుటకును కారణమగుచున్నది. వీనిని గయికొనుటయు విడుచుటయుఁ గంటికిఁ గనఁబడవు గాని తమకుఁ గలుగు జన నమునుఁ దన పుత్రునిజననమునుబట్టియుఁ దన మరణమును దన పిత మరణమునుబట్టియు ననుమానముచేతఁ దెలియ వలయును గాని, తన జననమును మరణమును నపుడు తాను మూఢాగ్రస్తుఁడై యుండుటవలనఁ గన్నారఁ గనుఁగొన నే రఁడు. అట్లు తాను జననమరణముల నొందినను నవి తన దేహమును సంబంధించినవే కాని తన్నుఁ గావ్రు. బీజము వలన వృక్షపు జన్మమును గాలపరిణామమువలన వృక్షపు నాశ మును బురుషుఁడు తెలియుచున్నాఁడు. అట్లు వానిని దెలిసిన పురుషుఁ డావృక్షముకంటె వేఱుగాఁ గనుపట్టుచున్నాఁడు. ఇట్లె దేహమునకుఁ బంచభూతసంఘాత మనెడు బీజము వలన నుత్పత్తియు విపాకమువలన నాశమును జూచునట్టి యాత్మ యా దేహమునకంటె వేఱే యగును. ప్రకృతివికార మగు దేహమునకంటె నాత్మ వేఱయినది; దాని కల రూ పును వివేచించి తెలియనేరక శబ్దాది విషయముల ననుభ

పించుటచేత దేహమే యాత్మ యని రెంటి నొక్కటిగాఁ దలఁచి మోహము నొందినట్టి వాఁడు సంసారమును బొందుచున్నాఁడు. సత్త్వకార్యము లగు శమ దమాదులం దభినివేశము గలిగి వాని కనురూపము లయిన కర్మములచేత దేవత్వమును ఋషిత్వమును బొందుచున్నాఁడు. రజఃకార్యము లగు కామాదులం దభినివేశముచేతఁ దదనుగుణము లయిన కర్మములచేతను నసురయోనిని గాని మనుష్యయోనిని గాని పొందుచున్నాఁడు. తమఃకార్య మగు శోక మోహాదుల చేతను దానివలని కర్మములచేతను బీభత్సత్వమో పశుపక్ష్యాది జన్మమునో పొందుచున్నాఁడు. ఇట్లు కర్మములచేత జీవుఁడు ప్రకృతి మండలమందుఁ ద్రిప్పఁబడు చున్నాఁడు. 'ఆత్మకుఁ జేష్టలేమిలుగవు. వాఁ డిట్లు తిరుగుచున్నా' డందువా? ఆడుచును బొడుచునుండు జనులను జూచి పురుషుఁడు తానును బుద్ధి యం దాడుచుఁ బొడుచునున్న వానివలె నగునట్లు, ఆత్మకుఁ క్రియ లులేనివాఁ డయ్యును బుద్ధిచేతఁ దనయం దుంపఁబడిన చేష్టలు మొదలగు ధర్మములను జూచి తనవిగా నిశ్చయించి వానిని జేష్టించువానివలె వర్తించు చున్నాఁడు. నీళ్లు కదలుచు నుండఁగా గట్టునం దున్న వృక్షములును గదలుచు నుండు నట్లు కనఁబడుచున్నవి. కన్నులు గిరగిరఁ ద్రిప్పఁగా, భూమియుఁదిరు గుచున్నట్లు తోఁచుచున్నది. అట్లు దేహమే యాత్మ యని బుద్ధి యధ్యసించుచుండుటంబట్టి దేహధర్మము లాత్మ యందుఁ దోఁచుచున్నవి. దాశార్హా! స్వప్నమందుఁ గాంచిన విషయానుభవము లనిత్యము లగునట్లు, ఆత్మ దేహధర్మములను దన యం దధ్యసించెడి సంసారమున్మృషయే యగును; దానికి హేతువు

నివర్తింపఁగా నదియు నివర్తించుచున్నది. శబ్దాదివిషయములు సన్నిహితములు గాకుండినను శబ్దాదులను ధ్యానించుచుండుటవలన నీజీవునకు సంసారము నివర్తింపకుండును; మఱి బలవత్తరమై వాని ననువర్తించుచునే యుండును. స్వప్నము జరుగుచునుండఁగా నండలి దేశాంతరగమనము శిరశ్ఛేదము మొదలయిన యనర్థపరంపరలు నివర్తింపక యనువర్తించుచునేయుండు నట్లదియు ననువర్తించుచునే యుండును. విషయములను ధ్యానించుచుండుటవలన సంసారము వర్ధిల్లుచుండును గావునఁ, జెడువిషయములం దగిలినయింద్రియములచేత విషయములను ననుభవింపకుము. ఏలన వాని ననుభవించితివేని వానిని ధ్యానించుటకు హేతువగుచున్నది. ఆత్మయందు జన్మమరణాదులయిన యవస్థలను గల్పించుటకు నిమిత్తమగు భ్రమము దేహావిలక్షణములగు నాత్మపరమాత్మలస్వరూపమును గ్రహింపమి చేతఁ గలిగినదిగా నిశ్చయింపుము. దుర్జనులు ని న్నాక్షేపించినను, నిందించినను, వంచించినను, దోషములు చెప్పినను, గొట్టినను, జెఱఁబెట్టినను, నీబ్రతుకును బోకార్చినను, ఉమ్మివేచినను, మూత్రము విడిచినను, ఇట్లజ్ఞులగువారు పెక్కువిధముల నిన్ను మిక్కిలియుఁ బలింపఁజేసినను నీవు శ్రేయమునే కోరు వాఁడవేని, యిట్టి యాపదలనెల్ల బొందినను నాత్మ స్వరూపదర్శనము చేత ని న్నుద్ధరించుకొనవలయును' అనెను.

ఉద్ధవుఁడు—మాటకారులందు మేటీ! నే నీ యాక్షేపాదులన్నియు సహించి యాత్మ పరమాత్మలను గలయాపున నెఱుంగునట్లుగా నాకు వలయు నుపాయము నుపదేశిం

పుము. ఏలనఁగా, అసజ్జనులు తమయందుఁ గావించునాతీపాదు లను దుఃఖములను సహించి యుండుట మిక్కిలియుఁ గష్టమైనదని తలఁచు చున్నాను. కావునఁనే వానిని సయించుట కుపాయ మడుగుచున్నాను. విశ్వాత్మా! విద్వాంసులకుఁ గూడఁ బ్రకృతిసంబంధమువలన దేహాత్మాభిమానమును రాగ ద్వేషాదులును బలీయము లయినవి. విద్వాంసులందఱకును గాదు. భగవద్ధర్మనిరతు లయి నీచరణములనే యాశ్రయించి జితాంతఃకరణు లైయుండు నట్టివారు తప్పఁ దక్కిన విద్వాంసులకెల్ల నవి బలీయమైనవియే యగును' అనెను. ఇదియిరువది రెండవయధ్యాయము.

శ్రీకృష్ణుఁడు సుఖదుఃఖములకు హేతువు మనస్సే యని యుక్తిపూర్వకముగా నిరూపించుట.

శ్రీ శుకులు—ఇట్లు తన భక్తశ్రేష్ఠుఁడగు నుద్ధవుఁ డడుగఁగా వీనులకు విందైన వీర్యములుగల యాముకుందుఁ డా భృత్యునిమాట నెంతయు గావించుచు నిట్లనియె.

భగవంతుఁడు—బృహస్పతి శిష్యా! దుర్జనులాడు దుర్వచనములచేత భేదిల్లినమనస్సును సమాధానపెట్టుకొనుటకు సమర్థుఁడయిన సాధుపురుషుఁడు లేఁడు చుమీ. దుర్జనులాడు పరుసని ములుకులవంటిమాటలు మర్మములం దగిలి పురుషుని నొప్పించునట్లు, మర్మములునాటిన వాఁడి బాణములు సైతము నొప్పింపవు. అట్టి బాణములకుఁగూడ నాపురుషుఁడంతఁ దపింపకుండును. ఉద్ధవా! మిక్కిలియుఁ బుణ్యంబయినయొక యితిహాసమును జెప్పుచున్నారు. దానిని నీకు వివరించి చెప్పెదను.

మిక్కిలి యెచ్చరికగలిగి వినుము. ఒక భిక్షుఁడుగలఁడు. వానిని దుర్జనులెల్లను జేరి మిక్కిలి యవమానించిరి. వాఁ డందులకు మనస్సు దిటచెడక తనలో నహంకారమమకారముల వలన నిజకర్మములకు లోనై యంతఃకరణమే యిట సుఖదుఃఖములను బరిపాకముసేయుచున్న దని స్మరించుచు నీ యితిహాసమును బాడెను. అవంతి దేశమునందు నొకానొక బ్రాహ్మణుఁడుండెను. వానికి సంపద నిండి గండరించుచుండెను. వాఁడు సేద్యము నర్తకము మొదలగునవి చేసి బ్రతుకుచుండెను. అయినను వాఁడు తన యుదరపోషణమాత్రమును జూచుకొను. వాఁడు, కేవలవిత్తకామి,లుబ్ధుఁడు; అందఁడుమిక్కిలియుఁగోపి. జ్ఞాతులను గాని యతిథులను గాని వాఁడు వట్టిమాటచేతఁ గూడఁ బూజించినవాఁడు గాఁడు. అతిథు లెవ్వరును వాని యింటలేకయే యుందురు. అట్టి యింటఁ దానైనను నయ్యెకాలములఁదుఁ దగుభోగముల ననుభవించినవాఁడు గాఁడయ్యె. దుశ్శీలుఁడును స్వోదరపోషణపరుఁడును నగువానికిఁ బుత్రులును బంధువులును ద్రోహముచేయుచుండిరి. మఱి వానిభార్యయును గూఁతుఁడ్రును భృత్యులును విషాదమునొంది వానికిఁ బ్రియము గావింపకుండిరి. ఇట్లు వాని ధనములూరకరక్షింపఁబడుచుండున యయ్యెనే కాని పరుల కుపయోగింపఁ బడినవిగావు. కనుక వాఁడు ధర్మమును గామమును లేనందున నుభయలోకములకును వెలియైయుండెను. కాఁబట్టి దేవర్షులు పితరులు భూతములు మనుష్యులు బ్రహ్మర్షులనెడి *పంచమహాయజ్ఞదేవతలు

---

* ఆర్జించిన ధనమునకు పంచ మహాయజ్ఞములచేత ఆయా దేవతల 'సారాధించుటయె ప్రయోజన' మని తెలియునది.

దమ తమ యజ్ఞభాగముల నొందకపోవుటచే వానియెడఁగ్రుద్ధులయిరి. అట్లు భాగము నొందువారల ననాదరము చేయుటం జేసి వాని పుణ్యస్కంధము విధ్వంసము నొందెను. భూరిదా! వెక్కలు కృషి మొదలగుపాట్లుపడి గడించినవానిధన మంత యునుగూడ నాశమునొందెను. వానిధనమును జ్ఞాతులు కొంత పట్టుకొనిరి. దొంగలు కొంత యపహరించిరి. ఇల్లుగాలుటమొదలగు దైవికములవలనఁ గొంత నష్టమయ్యెను. నేలపుడ్చుట మొదలగువానిచేతఁ గాలక్రమమునఁ గొంత నశించెను. రాజు గారి మనుష్యులవలన నా దుష్టబ్రాహ్మణునిధనము నాశము నొందెను. ఇట్లు దైవాదులవలనఁ దన ధనమంతయు నష్టము గాఁగా ధర్మకామరహితుఁ డగువానిని వాని సొంతజనులు నాదరింపక యుపేక్షించిరి. దానివలన వానికిఁ గడవరాని మహాచింత గలిగెను. వాఁ డిట్లు ధనమంతయుఁ బోఁగొట్టుకొని మిక్కిలియుఁ జింతయందు మునిఁగి డగ్గుత్తికవడ దుఃఖించుచుండఁగా నంత వానికి మిక్కిలియు గొప్ప విరక్తిపుట్టెను. వాఁడు తనలో 'అక్కటా! నేనిట్లు కష్టపడి ధనము సంపాదించితిని గాని దానివలన నొక ధర్మమునుగాని కామమును గాని జేసి యుపయోగింపనయితిని అందులకై వ్యర్థముగా నాయీదేహమున కనుతాపము పెట్టితిని. ఏమికష్టమిది? తెఱఁగుగా నాహోటి పిసినిగొట్టులకు ధన మొకప్పుడును సుఖము కొఱకుఁ గానేరదు; మఱి సొంతముగా ననుభవించుటకును గాదు; చచ్చినపిదప నరకము నొందించుటకే యగును. కీర్తిమంతులగు వారి నిర్మలమైన కీర్తి యెంతయుండినను గుణవంతులకు శ్లాఘ్యములగు గుణము లెన్నియుండినను రవ్వంత

లోభముగూడ నుండినా, గొనియాడందగిన చక్కందనమును దెల్లనికుష్ఠు మూలించినట్లు, అది తక్కిన యా గుణములనెల్ల హతము సేయుచున్నది. మొదట ధనమును సంపాదించుటకును, అది సంపాదించినపిదప దానిని బెంచుటకును, నాయాసపడ వలయును. పిదప దానిని రక్షించువిషయమున భయము గలుగుచున్నది. దానిని వెచ్చించినను ననుభవించినను జింత గలుగుచున్నది. అది నశించెనా యయ్యో చెడితి నని భ్రమమును మృతియుఁ గలుగుచున్నవి. దానిని సంపాదించునపుడు దొంగతనము, హింస, అబద్ధము, దంభము, కామము, క్రోధము, గర్వము, మదము, దేహానుబంధులగువారికిఁ బ్రియము చేయుట, కారణము లేని విరోధము, కలహము, స్త్రీ, జూదము మొదలగు వ్యసనములు నసిసి యీ యనర్థములు పదియేనును ధనమూలమున మనుష్యులకుఁ గలుగు నని చెప్పుదురు. ఇట్లు ధనము వేరికి నర్థ మనఁబడినను గొప్ప యనర్థమే యగును గాన, శ్రేయస్సును గోరినవాఁడు దానిని దూరముననే త్యజింపవలయును. ధన మిరువదిచిల్లిగవ్వ లంత వ్యాఖ్యానపడినను దన తోఁబాటియాపదయు సంపదయుఁగలిగి మిక్కిలిప్రీతితోఁగూడి యున్నట్టి యన్నదమ్ములును భార్యలును దండ్రులును సుహృదులును దోడనే నెయ్యమునువిడిచి యందఱును శత్రువులుగాఁ జేయఁబడుచున్నారు. అల్పమగు ధనము వ్యత్యస్తముకాఁగానే యా యన్నదమ్ములు క్రుద్ధులై కలకాలము రోషము దిగవిడువక మచ్చరించుచుఁ దోడనే నెయ్యమును దియ్యమును దిగవిడిచి వేగ నొకరినొకరు గొట్టుకొనుచుఁ బ్రాణములను బాయుచుందురు. దేవతలకును బ్రార్థింపఁదగినమనుష్యజన్మము

నొంది యందును గొప్పదియగు బ్రాహ్మణత్వమును గూడఁ బడసి వానివలనఁ గలుగునట్టి శ్రేయమును బాటింపక యెవరు ధన మందుమాత్రము దగులుగలిగి తమ యాత్మహితమును నాశముచేసికొందురో వా రశుభం బగునరకగతిని బొందు చుఁరు. ఈ మనుష్యదేహము స్వర్గమునకును నపవర్గమునకును సాధనమయినది. ఇట్టిదానినిబడసియు ననర్థమున కునికిపట్టయిన ద్రవ్యమునం దెవఁడు తగులునొందును? ఎవ్వఁడు నొందఁడు. పంచమహాయజ్ఞముల కుపయుక్త మగు ద్రవిణము ననర్థావహ మని యెట్లు చెప్పెద వందువా? దేవతలకును ఋషుల కును బితరులకును భూతములకును, జ్ఞాతులకును బంధువులకును నిట్లు తనతోడి భాగముగలవారికిని దన దేహమునకును ధన మును బంచి గుడువక యూరక పదిలముగాఁ బెట్టుకొనియుండు వాఁ డధోగతి నొందుచున్నాఁడు. ధనమున్నకై పాటుపడు చుండువానికిఁ బ్రమత్తతఁ జేఁదుదకు విత్తమును వయస్సును బల మును వ్యర్థముగాఁ బోవుచున్నవి. ఆ విత్తాదులవలనఁగదా కుశ లము లగు ధర్మకామ మోక్షములు సిద్ధించుచున్నవి. అట్టివి పోయినపిదప నిపుడు ముదిసి ముదుకఁడై యుండఁగా నేమి సాధింపఁగూడును. ఇట్లగ్ధ మనర్థావహ మగుటంబట్టి యిది దెలిసినవాఁడుగూడ ధన మార్జించుటకు వలయు చేష్టలే కావిం చుచుండును. ఇట్టి జనుఁడక్కటా! పలుమాఱు క్లేశమునొందు చున్నాఁడు. ఏలన నొకానొకని (యీశ్వరుని) మాయ చేత నీ లోకమంతయు మిక్కిలిమోహముపాలై యున్నది. ధనములో, భోగోపయుక్తములగు కామములను దానోపయుక్తములగు ధనములను నొసంగుచున్నవి. అట్టి ధనముచేతఁ బనయేమి?

మతికామములచేతఁగాని బసయేమి? ఇఁకఁ గర్మములో జన్మములను గలిగించుచుండునది. కనుక వానివలనఁగాని పసయేమి? ఏలన మృత్యువు పట్టికొని మ్రింగుచుండఁగా నివియెల్ల నేమిపనికి వచ్చును? సర్వదేవమయుండును భగవంతుఁడునగు హరి నాయందు సంతుష్టుఁడయి యనుగ్రహించినాఁ డనుట నిజము. అతఁడొక్కఁ డా నా కిట్టిదళ కలిగించెను. ఇట్టి స్థితివలన సంసారసాగరమునకుఁ దెప్పవంటి దయిన యీ నిర్వేదము నాకుఁ గలిగినది. ఇట్లు నాకు నిర్వేదము పుట్టియున్నందున శేషించియున్న నా యాయువువఱకు నా శరీరమును దపస్సుచేత శోషింపఁజేసెదను. మతి సమస్తమునకు నిరతిశయపురుషార్థమయిన యాత్మయందు నేను బ్రీతిరూపమగుభక్తిగలిగి, యం దప్రమత్తుఁడనై వర్తింతునేని యపుడు నా పూర్వవృత్తము దెలిసినవా రనుమోదింపకపోయినను నా యభిప్రాయమును దెలియునట్టిదేవత లేనియు నన్నను మోదింపక తప్పరు. మిగిలియున్న స్వల్పాయువుచేత నప్రమత్తుఁడగుట యెట్లందువా? ఋభ్వాంగుఁడు ముహూర్తకాలమున భగవత్ప్రాప్తి నొందెనని చెప్పిన శ్లోకము సాధించెనుగదా' యనెను.

శ్రీభగవంతుఁడు— ఇట్లాయవంతి దేశపుబ్రాహ్మణుఁడు మనస్సునం దభిప్రాయపడి హృదయమునందు విడిచిపుచ్చిరాగట్లు ముడివడియున్న రాగద్వేషాదులను బరిహరించి చిత్తమునందలికలుషముల నెల్ల వీడి భిక్షుకుండును మునియు నయ్యెను. వాఁడాత్మను నింద్రియములను బ్రాణములను నడంచివుచ్చి, యీభూమియందుఁ ద్రిమ్మరుచుండెను. మతి నగరములందుఁగాని గ్రామములందుఁ గాని యెందును నాసక్తిలేక యెవరికిని

దా నిట్టివాఁ డనిచక్కఁగాఁ దెలియంబడకుండునట్లు, భిక్ష కొఱకుఁబ్రవేశించుచుండెను. భద్రా! అట్లువాఁడు వృద్ధుఁడై యవధూతయై భిక్షుకుఁడుగా నుండుటను దుష్టులగువారు చూచి యడియాలములచేతవానిని గుఱుతుపట్టి దర్పితులై వానిని బరిపరివిధములఁ బరిభవించిరి. కొందఱాతని త్రిదండమును లాగికొనిరి.కొందఱాతనిపాత్రమును గమండలువును బెఱికికొనిరి.కొందఱాతని యజినసూత్రమును గొందఱు బాంతనును నారచీరలనును దీసికొనిరి. మఱి యామునికి వాని నిచ్చెదము రమ్మని చేయిచూపి యతఁడు రాఁగా మరల నియ్యక యేమఱించిరి. అతఁడు భిక్షించి తెచ్చుకొన్నయన్నమూ నేటిగట్టునఁగూర్చుండి తినుచుండఁగా బాపిష్ఠులగువారు దానియందు మూత్రము విడుతురు. వాని తలయందు ఫూత్తని నిష్ఠీవనముచేయుదురు. వాఁడు పలుకకుండుటను జూచిబలవంతముగాఁ బలికింతురు, పలుకకుండెనా కొట్టుదురు.మఱికొందఱు ''వీఁడుదొంగ'' యని మాటలచేత బెదరింతురు. వేఱు కొందఱు వానిని శాశములచేతఁగట్టి 'చంపుఁడు చంపుఁ'డని పలుకుదురు.కొందఱు పట్టి త్రోయుదురు. కొందఱు 'వీఁడు ధర్మాత్ముఁడని వేషమువేసి కొన్నవాఁడు; గూఢముగా విప్రియముచేయును, ధనమంతయు క్షీణింపఁగా సాంతజనులు దిగవిడువఁగాఁ జేయునదిలేక యీ వృత్తిని గయికొన్నాఁ'డని యవమానింతురు.కొందఱు 'ఔరా! వీనిబలమెంత గొప్ప! పెద్దకొండవలెఁ గదలక దిటగలిగి యున్నాఁడు చూడుఁడు. వీఁడు కొంగవలె నేదోయొక నిశ్చయమును లోపలనే పెట్టుకొని మౌనముచేతఁ గోరిన ప్రయోజనములను (అన్నాదులను) సాధించుచున్నాఁడు' అని పకపక

నవ్వుదురు. మఱికొందఱు వానియం దపానవాయువును విడుతురు. వానిని దార్ఢ్యచేత బంధింతురు. లేనిపోని యట్టాటకలఁ బెట్టుదురు. ఇట్లాటబొమ్మవలె నతని నాడింతురు. అతఁ డీవిధమున దుర్జనులుగావించు భౌతికదుఃఖమును శీతోష్ణాదులవలనఁ గలుగు దైవికదుఃఖమును జరాదులవలనఁ గలుగు దేహదుఃఖమును మాటికి మాటికి వచ్చుచుండఁగా నవన్నియు నిజకర్మములవలననే కలిగినవనియుఁ దా ననుభవించియె తీఱువలయు ననియు నిశ్చయించి యే వికారమును లేకుండెను. ఇట్లాతఁడు మనుష్యాధములచేత నవమానింపఁబడినవాఁ డైవారు పడఁ ద్రొబ్బుచుండఁగాఁ దన ధర్మమును దప్పక సత్త్వగుణప్రేరిత మగు ధృతిని నూఁది యీగాధను బాడెను.

భిక్షువు—ఈజనులు నాకు సుఖదుఃఖములను గలిగించుటకు హేతువులు గారు. మఱి యీశ్వరుఁడుగాని సూర్యాదిగ్రహములుగాని కర్మములుగాని కాలముగాని, హేతువులుగావు. ఇఁతకును ముఖ్యంబగు కారణము మనస్సని సుఖదుఃఖములకుఁ గారణముల నెఱింగినవారు తలంచుచున్నారు. ఆమనస్సేకదా సంసారచక్రమును ద్రిప్పుచున్నది; కావున నదియేకారణము.బలీయంబగుమనస్సు, రాగద్వేషాదిగుణములను సృజించుచున్నది. ఆగుణములవలననుండి శుక్లము లగు సాత్త్విక (పుణ్య)కర్మములును కృష్ణములగు తామస(పాప)కర్మములును లోహితములగు రాజస (పుణ్యాపుణ్య) కర్మములును బహుస్వరము విలక్షణములై పుట్టుచున్నవి. ఆ కర్మములవలననుండి వాని వాని కనురూపను లయిన * దేవ తిర్య జ్నరజన్మములు గలుగు

*సాత్త్వికకర్మములవలన దైవగతియుతామసములవలనఁదిర్య్యగ్గతియు

చున్నవి. వానియందు మరల మనస్సుచేత గుణసృష్టి గలుగు చున్నది. మనస్సును ద్రిప్ప నట్టిసంసారచక్రముచేత జీవునికి సుఖదుఃఖము లెట్లు? దేహసంబంధముచేతఁ గలుగు నన్నచో నట్టి సంబంధముగల పరమాత్మకును నవి గలుగ వలదా యని యందువా? లోపలఁజొచ్చి శాసనధారణములు చేయుచు నన్నుఁ బాయక హిరణ్యాయువలె మిక్కుటముగాఁ బ్రకాశించు చుండు పరమపురుషుఁడు మన స్సెన్నిసంకల్పవికల్పములు చేయుచున్నను దా నహంకారమమకారములకుఁ దగు చేష్టలు చేయకుండును. కనుక బుద్ధి సాక్షియై కేవలముండును. ఈజీవుఁ డో తనదేహమును నాత్మగాఁ దప్పఁదలఁచి విషయముల ననుభవించుచు శబ్దాదివిషయసంగమువలన బద్ధుఁడగుచున్నాఁడు. * కనుక వానికే సుఖదుఃఖములు గలుగుచున్నవి. దానమును వర్ణాశ్రమోచితమగు ధర్మమును యమమును నియమమును నధ్యయనమును, దక్కినకర్మములును నేకాదశ్యుపవాసాదులగు మంచివ్రతములును మొదలగు నివి యన్నిటికిని ఫలము మనోనిగ్రహమే. దానాదులు యోగమున కంగము లని శ్రుతి చెప్పుచుండఁగా మనోనిగ్రహమున కంగము లెట్లందువా? విష

రాజసములవలన మానుషగతియుఁ గలుగుచున్నవి. మనస్సుచేత గుణములు, గుణములచేత కర్మములు, కర్మములచేత గతులు, గతులయందు మరల మనస్సుచేత గుణములు ననియిట్లు చక్రమువలెఁ బరివర్తించుటచే మనస్సు సంసారచక్రమువలెఁ దిరుగుచున్నది.

* శరీరసంబంధమాత్రముచేత సుఖదుఃఖములు గలుగవు. గుణకర్మములకు లోనగుటచేతనే యవి గలుగును. పరమాత్మ శరీరసంబంధము గలిగయుండియుఁ గుణకర్మములకు లోనుగాఁడు గాన యతనికి సుఖదుఃఖములు లేవు. జీవుఁడో గుణకర్మములకులోనయ్యుండునుగాన సుఖదుఃఖములను బొందుచున్నాఁడు.

యాంతరములనుండి మనస్సు నాకర్షించి పరమాత్మయందే నిలుపుట సమాధి. అదియె మనోనిగ్రహము. అదియె పరంబగు యోగము. ముముక్షుఁడగు నెవ్వానిమనస్సు సమాహితమై రాగాదులచేతఁ గలుషితముగాకుండునో యట్టి వానికి దానాదుల తోఁబనియేమి? చెప్పుము. ముముక్షువగు నెవ్వానిమన స్సడంచి పుచ్చంబడ కుండు నేని, యాలస్యాదులచేత మతిఁగియుండు నేని, యీదానాదులవలన మతి వేఱు ప్రయోజనమేమున్నది? వానికి సమాధియే యుపేక్షిత ఫలసాధనమగును గాన యందులకే యీదానాదు లంగములు గానోపును. అట్టి సమాధి ఫలము గానిచో దానాదులుగావించియుఁ బ్రయోజనములేదు. తెక్కిన యింద్రియములుగాని వాని నధిష్ఠించియుండు దేవతలుగాని మనస్సునకు వశమందున్నవి యాయెను. మనస్సో తెక్కినవాని వశమును బొందదు. దేనికిని వశముగానిది దానాదులచేత నెట్లు సమాహితమగు నందువా? నిజతేజంబున దీపించుచున్న పరమపురుషుఁడు బలవంతులకంటె బలీయుఁడు. ఏలన నతఁడు మనస్సు మొదలయిన యింద్రియములకును వానినధిష్ఠించియుండు చంద్రాదులకును, దేవుఁడుగాన వానికెల్ల * భీష్ముఁడు (భయంకరుఁడు). కాఁబట్టియతఁడు దానాదులచేత నారాధితుఁడయ్యేనేని, నిగ్రహించుట కలవిగాని మనస్సునుగూడ వశముగావించుకొని తనయందు సమాహితము చేసికొనుచున్నాఁడు. ఇట్లు మనస్సు దానాదులచేత నారాధితుం డయిన పరమపురుషుని ప్రసాదము తప్పఁ దక్కిన యుపాయములచేత జయించుట కలవిగానిది;

* 'నతత్రసూర్యోభాతి నచంద్రతారకం భీషాదస్మా ద్వాతఃపవతే' ఇత్యాది శ్రుతుల నిట యనుసంధించునది.

మఱి శత్రువువలె దుఃఖప్రద మయినది. దానరాగాదుల యురవడి సహింపఁ నలవిగాదు. కావున నదియెప్పుడును హృదయ మునకు నొవ్వుగలిగించుచుండును; అట్టి మనస్సును జయింపక మనుష్యులతోడి నిష్ఫలమగు వైరమును బెట్టుకొని మిత్రు లని యుదాసీను లని శత్రువు లని యేర్పఱచుకొని మిక్కిలి మూఢు లగుచున్నారు. దేహమునకు మనస్సాకటివూత్రమే నిదానము. ఇది దేవుఁడనియుమనుష్యుఁడనియు మఱియుఁ బెక్కుదెఱంగులఁ జూపట్టుచున్నది. ఇందేదేని యొక్కదానిని గయికొని దేహమే నేననియు నాదియనియు సహంకార మమకారముల చేత బుద్ధి తన స్వరూపమును గనుఁగొనలేక గ్రుడ్డి యగుచుండఁగా 'నేను బ్రాహ్మణుఁడను వీఁడుశూద్రుఁడని యిత్యాదిభ్రమల పాలై యగాధమగు సంసారమందు భ్రమించుచున్నారు. జనుఁడే సుఖదుఃఖములకు హేతువని చెప్పినచో, జనుఁడనఁగా దేహ మని తెలంతము. అపుడు దానివలన నాత్మకేమి? మఱియొకటి సుఖదుఃఖములకుఁ గర్తయగునేని దానివలన నాత్మకు స్వర్గ నమ్ము గొంచెమైనను గలుగదు. భూవికారము లయిన దేహములకే యీసుఖదుఃఖముల కర్తయగుటయుఁ * వానికిఁ బాలుపడుటయుఁ గలుగుచున్నవి. అచేతనములగుటచేత దేహ మును సుఖదుఃఖములకు హేతువు గానేరదు. జనుఁ డనఁగా నాత్మయు దేహము నని తలంతము. ఒకానొకప్పుడు తన పుట్ల

* కర్తృత్వ మొకవిధమైన ప్రయత్నమును యత్నము సుఖదుఃఖములును జ్ఞానరూపములు. అచేతనములగు భూవికారములకుయత్నాదులు గలుగనేరవు. కనుక భూవికారములనుటచే భూవికారములును అచేతనములు నగు దేహ ములకును సుఖదుఃఖ హేతుత్వము గలుగనేరదని భావము.

చేతనే తననాలుకను బురుషుఁడు కొఱుకుకొనుచున్నాఁడు. అప్పుడు నొప్పి గలుగుచున్నది. అందుల కెవ్వానిని గోపింప వచ్చును? తనయాత్మ యధిష్ఠించియున్నశరీరము నందలి యవయవములు రెంటిలో నొకటి యాదుఃఖమునకుఁ గర్తగాను మఱియొకటి కర్మముగాను గనుపట్టుచున్నది. అం దొకజనుని వలననుండి మఱియొకజనునికి సుఖదుఃఖము లన్వయించుట లేదు. ఇట్లు దేహముగాని యాత్మగాని సుఖదుఃఖములకు హేతువుగానేరదు. ఆరెంటికి నంతరాత్ముఁ డయి యున్న * ఈశ్వరుఁడే సుఖమునకు దుఃఖమునకు హేతువగుఁగాత. అప్పుడు దానివలన నాత్మకేమి? వైషమ్యాదులును సుఖదుఃఖాదులునగు వికారములుగలవారికే యట్టి హేతుత్వాదులుగాని, నిర్వికారములయిన యాయంతరాత్మల కిరువురకును నట్టివి గలుగనేరవు. ఒక యంతరాత్మ మఱియొక యంతరాత్మకు సుఖదుఃఖ హేతువుగానేరదు. ఒకటి తానే తన సుఖదుఃఖములను గలిగించుకొని సుఖించుచు దుఃఖించుచు నుండునందువా? ఒకానొకప్పుడీశ్వరునిచేఁ బ్రవర్తితమగు నొక యంగముచేత మఱియొక యంగము కొట్టువడెనేని, దానివలన వేదన గలుగుచున్నది. పరమపురుషునికిఁ బ్రకృతి పురుషులు రెండును దేహము లగుటంజేసి యతఁడు దా నెవనిని గోపింపఁగలఁడు? తన్నే కోపించుకొనవలయును? వెట్టిలేనివాఁ డెవఁడు గాని

---

* ముందు 'నాయంజనో మే సుఖదుఃఖ హేతు ర్న దేవతా న్యా గ్రహకర్మ కాలాఽమనఃపరంకారణ' మ్మని చెప్పఁబడియున్నది. అందు, జనుఁడు కారణముగాదని నిరూపించి యిపుడు దేవతయుఁ గారణము గాదని నిరూపించుట తెలియునది.

తనకుఁ దానే సుఖ దుఃఖములు గలిగించుకొని తన్నే కోపించు కొనఁడు గదా. మఱి నిత్యనిర్వికారుఁడగు పరమపురుషునికి సుఖ దుఃఖాది వికారములుగాని యొక్కఁడివి? ఒకప్పుడును నవి యతనికిఁ గలుగనేరవు. నిర్వికారుఁడగు నీశ్వరుఁడు సుఖాదులకు హేతువుగాకున్న మానఁ గాని వికారియగుప్రత్యగాత్మ హేతువు గాదాయందువేమో? దేహియగునాత్మ సుఖదుఃఖములకు హేతు వగునేని,—అనఁగా మఱి యొక యాత్మను సుఖపెట్టు నదిగాని దుఃఖపెట్టునదిగానియైనను, లేక దానికంటె మఱియొక యాత్మ సుఖించినను గాని దుఃఖించిననుగాని, లేక తానే వా నిని గలిగించుకొని సుఖించినను దుఃఖించిననుగాని, యపుడుమఱి యొక యాత్మవలనఁ దనకు సుఖదుఃఖములు గలిగిన వని తలంచుట తప్పే యగుచున్నది. ఎట్లన, సుఖదుఃఖాదివికార ముల కాశ్రయమగుట నిజస్వభావ మగుచున్నది గదా. అవు డాత్మకు వికారశీలత్వము గలుగును. అది దానికి స్వభావమ గును. స్వయంప్రకాశస్వభావములు నిత్యములు గనుక నాత్మకు స్వభావప్రయుక్త మనియెన్నఁడైన యీహేతుత్వమునుగూ ర్చి కోపపడుట కేమున్నది? ఆత్మకంటె మఱి యొకటి హేతువుగాదు. ఆత్మయే హేతువన్నచో నదియు మృషయే యగును. జ్ఞానానందైకరసుఁడును నిర్వికారుండు నగు నా త్మకుసుఖము దుఃఖమునను వికారములు గలుగనేకలుగవు.సుఖ దుఃఖములకు దాదృశాత్మజన్మస్థానము లందున్న సూ ర్యాదిగ్రహములు నిమిత్తము గావచ్చునన్నచో నాత్మ కేమి? ఆత్మకు జన్మమే లేదనఁగా దానికి జన్మమును నష్టమూదు లందు గ్రహము లుండుటవలని సుఖదుఃఖములు నెట్లు గలు

గును? ఉత్పత్తికిఁ బట్టుయిన దేహమునకు జన్మాదిస్థానములం
దుండుట వలన సుఖదుఃఖహేతువు లగు గ్రహములకును
నితరగ్రహములచేతఁ బీడగలుగుచున్న దని దైవజ్ఞులు చెప్పె
దరు. కనుక గ్రహములకును దేహమునకును నన్యుం డయిన
పురుషుఁ డెవనిని గోపింపవచ్చును? ఈ చెప్పిన వారిలో నెవనిని
గోపించుటకును లేదు. గ్రహములకును బరస్పరపీడగల దేని
కర్మమే యన్నిటికిని హేతువుగాఁగూడదా యందువేమో?
దాని వలన స్వయంప్రకాశరూపుండును నిర్వికారుండును
నగు నాత్మకు సుఖదుఃఖములుగాని తన్మూలమగు శుభాశుభ
కర్మములుగాని గలుగవు. దేహ మచేతనము గాన యే
ప్రవృత్తికిని యోగ్యముగాదు. కాన దానికి నవి గలుగ
నేరవు. జడ మగుదేహ మజడమైన యాత్మయగునేని యాసుఖ
దుఃఖాదులు గలుగును. జడమును నజడమును స్వభావము
లందు విరుద్ధగుణులు గనుక నొకటి మఱి యొకటి యగుట
పొసఁగదు. కాన సుఖదుఃఖాదులు గలుగవు. దేహము జ
డము. ఈ పురుషుఁడో (జీవుఁడో) సుపర్ణునిలెఁ బ్రకాశస్వ
రూపుఁడు కినుక వీనికిఁ గర్మమూలము హేతువు గానేరదు.
కాఁబట్టి యింత వఱకుఁ జెప్పిన జనాదులలోపలఁ దేనిని గా
రణమని గోపింపవచ్చును? దేనిని కాదు. కాలము సుఖదుఃఖములకు హేతువన్నచో స్వరూపముచేత సుఖదుఃఖముల తోడి సంబంధములేక జ్ఞానైకస్వరూపమై యున్న యాత్మ కేమి? దానికి సుఖదుఃఖ కార్యములయందుఁ గర్తృత్వకర్మ త్వాదు లేవియుఁ గలుగవు. ఆత్మ పూర్వోక్తమగు స్వరూప ముగలవాఁ డగును. (అనఁగాఁ బూర్వము చెప్పినట్లు జడుఁడును

నిర్వికారుఁడును నుత్పత్తి వినాశరహితుఁడును స్వప్రకాశస్వరూపుఁడును నగును.) ఇట్లు స్వరూపమునుబట్టి యాత్మసుఖదుఃఖాన్వయము లేనివాఁడయ్యును గాలమునకు వశ్యుఁడగుటంబట్టి సుఖదుఃఖసంబంధము నొందుచున్నాఁ డనవచ్చును. అట్లేని యా హేతువును బట్టియే యగ్నికిని స్వరూపసిద్ధమగు తాపము లేక పోవచ్చును. హిమమునకుఁ బ్రసిద్ధమగు శైత్యమును స్వరూపసిద్ధమేకాని కాలవళమున నవియట్లగుటగానరాకున్నది. దీనినిబట్టికాలమును హేతువు గానేరదు. ఇట్లు జనాదులాఁటియందును దేనిచేతఁగాని సుఖదుఃఖములు గలుగుట గానరాదు. కనుక వీనియందు దేనిని గారణమని శోపింప వచ్చును? దేహమునకు విలక్షణమయిన యాత్మకుఁ జక్కిన జనాదులం దొక్కదానిచేతను మఱియే యొద్దాని చేతనునెచ్చటఁ గాని యేవిధముననుగాని సుఖదుఃఖములసంబంధము గలుగకుండును. అట్టి యెడ సంసారమును గలిగించుసట్టి మనస్సును బట్టి యాయాత్మ కహంకారముగలుగఁగా నాయుపాధినుండి సుఖదుఃఖములు గలుగుచున్నవి. స్వరూపముచేతఁగాదు. (అనఁగా సంకల్ప వికల్పాత్మకమగు మనస్సు సనూహితము గాకుండుటవలన నహంకారమమకారములు పుట్టుచున్నవి). వానినుండి ద్వేషాదులును, ద్వేషాదులనుండి కర్మములును కర్మములనుండి జన్మములును, జన్మములనుండి సుఖదుఃఖములునుగలుగుచున్నవి. ఇది యెఱింగినవాఁడు భూతములచేతను ప్రద్రవము నొందినను నెంతమాత్రము భయపడకుండును. ధన మెల్లఁ బోవఁగా నిర్వేదమునొంది యడవులపాలి వనమునకేఁగి, భూమియెల్లఁ ద్రిమ్మరుచు బడలికవీసి మిక్కిలి

పూర్వులగు మనుష్యులెల్ల సుఖదుఃఖనిదానమని పరిష్కరించి గయికొన్న పరమాత్మనిష్ఠను నవలంబించి దుష్టులెంత నిరాకరించినను దన ధర్మము నుండి కొంచెమైనను జలింపక ముకుందపాదారవిందసేవయే యుపాయముగాఁ గొని యపార మును దమకి కార్యమునగు సంసారమును దాఁటుదు నని నిశ్చయించుకొని మునియైన యా బ్రాహ్మణుఁ డీ గాథను జెప్పెను. మనస్సుచేత దేహమే యాత్మయనియుఁ దాను స్వతంత్రుఁడ ననియుఁ దలంచుటయే సుఖదుఃఖములను బురషున కిచ్చుచుండును గాని మఱి యొకటిగాదు. ఇట్లు మనస్సుచేతఁ దలంచుట వలన నిదియే కాక మిత్రులు శత్రులుదాసీనులని మువ్వురేర్పడుటయు సంసారమును గలుగుచున్నవి. నాయనా ! ఇట్లు మనస్సు తడఁబాటే సుఖదుఃఖములకు హేతువగుటంబట్టి నాయందు బుద్ధిని జొప్పించి మనస్సును సర్వవిధములచేతను విషయాంతరముల నుండి మరల్చి నాయందు సమాహితము గావింపుము. శాస్త్రములందెల్ల ముఖ్యముగాఁ బ్రతిపాదింపఁ బడుచున్న యోగము సంగ్రహమెల్ల 'నాయందు బుద్ధిని జొనిపి నన్ను నిగ్రహించుట' యను నింతయే భిక్షుండుపాడినయీవిషయమును నెవ్వఁడు శ్రద్ధతో మనంబునఁ దాల్చుచు నొకరికి వినిపించుచును స్తుతించుచుండునో వాఁడు సమాహితుఁడై బ్రహ్మనిష్ఠుఁడునై సుఖదుఃఖాదిద్వంద్వములకుఁ గీడ్పడక ముక్తి నొందుచున్నాఁడు. ఇది యిరువదిమూఁడవయధ్యాయము.

శ్రీకృష్ణుఁ డుద్ధవునకు సాంఖ్యము నుపదేశించుట.

శ్రీభగవంతుడు—ఇపుడు నీకు సాంఖ్యమును (అనఁగాఁ బ్రకృతి పురుషేశ్వరుల స్వరూపవిభాగమును) జెప్పెదను. ఇది పూర్వులగు ఋషులచేత లెస్సగా నిర్ణయింపఁబడియున్నది. దీని నిని బురుషుఁ డెఱింగిన యెడల వీఁడు వాఁ డను భేదబుద్ధిని గలిగించు దేహాత్మభ్రమమును దిగవిడుచుచున్నాఁడు. తొల్లి జీవస్వరూపమును బ్రకృతియు రెండును నామరూపవిభాగములేనివై మిక్కిలి సూక్ష్ములై పరమాత్మతోఁ గూడి యంతయు నొక్క వస్తువుగానే కనుపట్టుచుండెను. నిరుపమానమైన తొంటియుగమగు కృతయుగమునందుఁ జిదచిదీశ్వరులను మూఁడుతత్త్వములను వివేచించి తెలియుటకు నేర్పరులగు వారు సర్వకారణంబగు బ్రహ్మము నుపాసింపుచుండిరి. ఆబ్రహ్మము, గుణవైషమ్యము లేక కేవలమైనది; జాత్యాది వికల్పములును లేనిది. దాని స్వరూపస్వభావములను వాక్కుచేతను మనస్సుచేతను గొలఁదియిడఁ దరముగాదు. అది నిత్యమైనది, బ్రహ్మంబయినది. దానికిఁ బ్రలయదశయందు మాయయు (ప్రకృతియు) ఫలమును (పురుషుఁడును) రెండు విశేషణములై యుండెను. ఆమాయాఫలములు రెంటిలో మాయయనంబడు ప్రకృతి, కార్యము కారణమని రెండువిధముల నున్నది. ఫల మనఁబడు మఱియొకటి పురుషుండని చెప్పఁబడుచున్నది. ప్రకృతికిఁ దమస్సు రజస్సు సత్త్వ మని మూఁడు గుణములు గలవు. నేను బురుషునికి దేహేంద్రియము లొసఁగి యనుగ్రహింపఁగోరి యీ గుణములను విషమము లగునట్లు కలఁపగా వానివలన సూత్రం బనఁబడుమహత్తు పుట్టినది

అది పెక్కు మూలందుఁ జొచ్చియున్న సూత్రమువలె బహు కార్యములందు ధారకమై యుండునది. అది వికారమునొందఁ గా దానివలన నుండి యహంకారము పుట్టినది. ఇదియే దే హాత్మభ్రమాదులచే మిక్కిలి మోహపెట్టునది. ఆ యహం కారము, వైకారికము తైజసము తామసమని మూఁడువిధ ములు అది తన్మాత్రములకును నింద్రియములకును మనస్సున కును గారణము. అది [1] చిదచిత్తుల మీఁదుమిగిలినది. శబ్దాదితన్మా త్రములకుఁ గారణమయిన తామసాహంకారమువలననుండి యాకాశాది మహాభూత పంచకము పుట్టినది. దేవతలు త మ్మధిష్ఠించియుండుటంబట్టి దేవత లనఁబడునింద్రియము లన్న నో రాజసాహంకారమువలనను సాత్త్వికాహంకారమువలనను బుట్టినవి. మహత్తు మొదలుగా సమస్తములయిన వస్తువులును నే నంతరాత్మనై యుండి పురికొలుపఁగా నొకటిగాఁ గూడి కార్యమునకు సమర్థములయి యండమునుఁ బుట్టించినవి. అది నా కుత్తమమయిన స్థానము. జలములవలననుండి పుట్టిన యా యండమునందు నేను జతుర్ముఖరూపమునఁ బుట్టితిని. ఎట్లన- నా నాభియందుజగత్తనెడి పద్మముపుట్టెను. ఆ పద్మమునందుఁ జతుర్ముఖుఁడు పుట్టెను. ఆ చతుర్ముఖుఁడు రజస్సుతోఁ గూడిన వాఁడై తపస్సుచేసి నా యనుగ్రహమును బడసి భూర్లోకము భువర్లోకము స్వర్లోక మను [2] మూఁడులోకములనును లోక

1. అచిత్తులయందు నవ్వులయందు నూనెవలె చిత్తు లంతర్గతమునై యుండుటను దెలుపుటకై అహంకారమునందు చిదచిత్తు లుండుటను బ్రద ర్శించిరని తెలియునది.

2. అతలాదులు భూమియందలి రంధ్రము లగుటంజేసి భూమియందే యంతర్భవించుచున్నది. మహర్లోకాదులు ముఖ్యప్రధాన మనఁబడిబట్టి స్వర్లో

పాలురనును సృజించెను. అందు స్వర్లోకము దేవతలకు స్థాన మయ్యెను. అంతరిక్షము భూతములకు స్థానమయ్యెను. మను ష్యులు మొదలగువారికి భూలోకము పట్టయ్యెను. భృగువు మొదలగు సిద్ధులయిన బ్రహ్మర్షుల కీమూఁడులోకములకు వే అగు మహర్లోకజనలోకములు నునికిపట్టయ్యెను. సురలకును నాగులకును భూమికిఁ గ్రిందుగా నున్నయతలము మొదలగు వానిని సృజించెను. ఇట్లీశ్వరుఁడు కావించు సాత్త్వికరాజస తామసకర్మములకుఁ దగిన ఫలములగు లోకప్రాప్తులు ము ల్లోకముల లోపలనే (బ్రహ్మాండమునందే) కలుగుచున్నవి. ప్రాణాయామాదిరూప మగు యోగమునకును సన్న్యాసాశ్రమ మునకును మహాన్సు జనన్సు తప స్సనియెడి యీసాత్త్వికము లగు లోకప్రాప్తులు గలుగుచున్నవి. మధ్యక్షితియోగముగల వానికో మద్గతియగు పరమపదమే ప్రాప్తించుచున్నది నే నంత రాత్మ రూపమున లోపలఁ జొచ్చి భరించుచు వెలుపలఁ గాల రూపమున మెలపుచును గర్మయుక్తనగు నీ జగత్తును జరుపు చున్నాను. దానినిఁబట్టిగుణప్రవాహరూపనుయిన యీప్రకృతి యందం దీ జగము నాచేతఁబుట్టుచును గిట్టుచునుండును. * అయినను దానిదాని కర్మములనుబట్టియె యట్లు చేయుచు న్నాను గాని నా యంతటఁగాదు. అణువైనా పెద్దదియో చిన్నది యో బలసినదియో మఱి యెట్టిపదార్థమయినను,గనఁబడుపదార్థ

కనుచేతనే సంగ్రహింపఁ బడుచున్నది. కాఁబట్టి మొత్తమునకు లోకములు మూఁడనియె వ్యవహరింపఁబడుచున్నది. అవాంతర లోకములనుగూడ వేఱువేఱుగాలెక్క పెట్టినచో నవి పదునాలుగని వ్యవహరింపఁబడుచున్నది

* దీనివలన భగవంతుఁడు వైషమ్యనైర్ఘృణ్యాదులను దోషములుచెప్పి టకు వీలులేదు. కర్మములను కారణముగాఁగొని యిట్లు చేయుమన్నా డను

మొక్కొకటియ్యను బ్రకృతి పురుషులు రెంటిలోను గూడియె యున్నది ఏ కార్యవస్తువుగ కేద్రవ్య మాదియందును నంత మునను గారణముగా నుండునో యదియె మధ్యమందునునుండు ను కీటము మొదలగు కార్యములకు నాద్యంతములందుఁగారణముగు బంగారమే మధ్యమందునుగారణముగా నుండునుగదా! ఆయా యవస్థలందొక్కొ దానికే నేఱువేఱు నామములు గలుగును. తైజసములగు కటక ముకుటములకు నుపాదానము ద్రవ్యము బంగారు. పార్థివములగు ఘటశరావాదులకుఁగారణద్రవ్యమువృత్తు. అయినను 'ఘటములో నీరుదెమ్ము' మొదలయిన వ్యవహారములకును జలమానుదెచ్చుట మొదలయిన ప్రయోజనములకునుపయోగించుటకై ఘటము మొదలగు వికారములు మృత్తునకుఁగయికొనఁబడుచున్నవి. ఒక యవస్థయందున్న యొక పదార్థ, మేద్రవ్యము నుపాదానముగాఁ గలిగి యా యవస్థను బొందినదో యా ద్రవ్యమేయగును. ఆ యవస్థను బొందినపిదపను గూడ నా ద్రవ్యమే యగును. కనుక నొకానొక ద్రవ్యమందు దాని వికారమున కాదియు నంతమును గనుపట్టుచుండును గాని యా ద్రవ్యమువూత్రము నవంతట స్థాయి యనియే చెప్పఁబడుచున్నది. దాని యవస్థలవలె నదియును వచ్చుచును బోవుచును నుండునదిగాదు. దేవుఁడు మనుష్యుఁడు మొదలగు నానావిధములైయున్న యీ దేహజాలమునకు నుపాదానము ప్రకృతి. ప్రకృతికిఁ బరం బగుజీవుఁడు వీనిలోపలఁ జొచ్చి ధారకుండైయుండును. కనుకఁ బ్రకృతివలననే జీవునికి నుత్పత్తి మొదలగు నవస్థలుగాని తనంతటలేవు. ఇట్లు స్వరూపస్వభావముల చేత నిత్యుఁడైయున్న యాత్మకు ధర్మభూతం బగు జ్ఞానము

వెలువఱుచునది కాదు. ఏలన సృష్టికాలమునందుఁగదా జీవునకు జ్ఞానవికాసము గలుగుచున్నది. ఇట్టి ప్రకృతియుఁ బురుషుఁడును గాలమును మూఁడును బ్రహ్మం బగు నే నగుచున్నాను. ఇట్లు చిచ్ఛక్తులు రెండును స్వరూపమునందు స్థాయులగును. వాని కార్యమగు జగత్తును బ్రహ్మముచేత నిత్యమగును. ఎట్లన భగవంతునిసంకల్ప ముండుపర్యంతము మనుష్యులొద లుగాఁగల ప్రపంచము సత్త్వాదిగుణములచేత సృష్టినొంది చిదచిదూహాపములస్థితి గలిగి పిదప సంహారమునొందుచు నిట్లు ముందువెనుకగా నిత్యమును బ్రవర్తించుచుండును. జనులకు సృష్టిప్రళయాదు లెందేర్పడుచుండునో యట్టి బ్రహ్మాండమును నేను గాలశరీరకుండనై లయము నొందించుచున్నాను. ఆ బ్రహ్మాండము తనలోపలనున్న భువనములతోఁగూడి వంచత్వ మనెడి యవస్థా విశేషమును (నాళమును) బొందుచున్నది. [1] శరీర మన్నమునందు లయించుచున్నది. అన్నము ధాన్యము లందులయించుచున్నది, [2] ధాన్యములు భూమియందు లయించు చున్నవి. భూమి గంధమునందు లయించుచున్నది. గంధ మప్పులయందు లయించుచున్నది. అప్పులు తమగుణమగు రసమునందు లయించుచున్నవి. రసము జ్యోతిస్సునందు లయించుచున్నది. జ్యోతి రూపమునందు లయించుచున్నది. రూపము వాయువునందును, వాయువు స్పర్శమునందును

---

1. అన్నము లేకపోగా శరీరము నశించుచున్నదని భావము. 'ఏషపురుషోఽన్నరసమయః' అని శ్రుతి. ధాన్యములు నశింపఁగా అన్నమును నశించుచున్నదని భావము.

2. ధాన్యములను విత్తఁగా మొలచుకుండ్రునని భావము.

లయించుచున్నది. స్పర్శ మహాకాశమందు లయించుచున్నది. ఆకాశము శబ్దతన్మాత్రమందు లయించుచున్నది. ఇంద్రియములును, మనస్సు దనకారణమందు లయింపఁగాఁ, దమకు యోని భూతములగు సాత్త్వికాహంకారమునందు లయించుచున్నవి. శబ్దము * భూతాదియందు లయించుచున్నది భూతాదియుఁ బ్రభువగు మహత్తునందు లయించుచున్నది. అధ్యవసాయహేతువగుటంబట్టి గుణవత్తమంబయిన యామహత్తు తనకుఁ గారణభూతము లగు సత్త్వాదిగుణములందు లయించుచున్నది. (అనఁగా గుణము లుపరతములుగాఁగా మనస్సు లయించుచున్నది.) గుణములును దమవైషమ్యము నుడిగి యవ్యక్తమునందు లయించుచున్నవి. ఆయవ్యక్తము కాలమునందు లయించుచున్నది. అనఁగాఁ గాలమాత్రోపలక్షిత సంసర్గము నొందుచున్నది. ఆ కాలమవ్యయమయినది. కాలమును బ్రకృతితోడ సంసృష్టమగు జీవునియందు (సంసర్గమును) నొందుచున్నది. జీవుఁడు కర్తృత్వమగు నుత్పత్తిలేకయంతరాత్మకుఁడనై యుండునాయందు లయించుచున్నాఁడు. సర్వాంతరాత్మభూతుండ నగు నేను నాయందే నెలకొని యుందును గాని మఱియొక్కటను లేనివాఁడను గాను. దానినిబట్టి నాకు జీవాదిశరీరభేదము గలుగుటగాని యవి పోవుటగాని లేవు. ఉత్పత్తి వినాశములు నన్ను ముట్టనేవు. మహదాద్యాకార్యసమష్టి లేక నేను నాయంతట నుండువాఁడను. ప్రకృతిపురుషకాలేశ్వరులవిశేషము నిట్లు కనుఁగొనుచున్న పురుషుఁడను, 'నేను స్థూలుఁడనుకృశుఁడ' ననెడి యిత్యాది వికల్పముల

* ఇచట భూతాదిశబ్దము తైజస తైజాకారకమునకు ఉపలక్షకము.

గుఱించిన భ్రమము మనస్సుచేత హృదయమందెట్లు కలుగఁ గలదు. సూర్యుఁడుదయింపఁగాఁ జీఁకట్లు నశించుచున్నట్లు అట్టివివేక ముదయింపగానే యీ భ్రమమెల్ల మాని పోవుచున్నది. ఇదిసాంఖ్యవిధి. ఇది హృదయమందు గ్రంథులవలె విడిచివుచ్చరాకున్నసంశయముల నెల్ల విడిచి పుచ్చుచుండును, నేను బరాపరతత్త్వములనెల్లఁ గనుఁగొను నట్టివాఁడనుగాన దీనిని * ప్రతిలోమమునను సనులోమమునను నీకుఁ దెలియఁజెప్పితిని. ఇది యిరువదినాలుగవ యధ్యాయము.

{శ్రీ కృష్ణుఁడుద్ధవునకుఁగర్మణత్వమును ప్రతిపాదించు చిత్తవృత్తి మొదలగు వానిని ప్రతిపాదించుట.}

శ్రీభగవంతుఁడు—సత్త్వాది గుణములు కలసి యుండినపుడు గాని వేఱువేఱుగానుండు నపుడుగాని వానియందు నే గుణము చేతఁ బురుషుఁడట్టివాఁడగునో (యెట్టి యభినివేశముగలవాఁడ గునో) దానిని నేను జెప్పుచున్నాను. పురుషవర్యా! వినుము.

శ్రీభగవంతుఁడు—శమము (అంతఃకరణజయము), దమము (బాహ్యేంద్రియ జయము), తితిక్షము (ద్వంద్వములను సహించుట), ఈక్ష (తత్త్వవిమర్శము), తపము, సత్యము, దయ, స్మృతి, తుష్టి, త్యాగము, స్పృహాలేమి (వైరాగ్యము), శ్రద్ధ (వైరాగ్యము), హ్రీ (తగనిపనులయందు సిగ్గు). దానము, ఋజుయార్జవము వినయము మొదలైనవియు, ఆత్మానుభవము వలనఁ గలిగిన సుఖమును, (సాత్త్వికగుణములు). కామము

---

* ప్రతిలోమమనఁగా సృష్టి మొదలుకొని సంహారముదాఁకను; అనులోమమను అనఁగా సంహారము మొదలుకొని సృష్టివఱకని తెలియవలయును.

(విషయము లనుభవింపనిచో నిలుపోపకుండుట), ఈహ(చేష్ట), మదము, తృష్ణ (సంతోషములేమి), స్తంభము (గర్వము), (ధనాదులు గావలయునను) ఆశ, వైషమ్యము, సుఖము (విషయభోగము), సాహసకర్మములం దుత్సాహము, స్తోత్ర ప్రియత్వము, అపహసనము, వీర్యము, నెఱపుట, బలిమిచేతఁ బూనుట (రాజసము) -ఇవి రాజసగుణములు.క్రోధము (సహింప కుండుట), లోభము (వెచ్చము సేయమి) అనృతము (ప్రమాణము శాస్త్రీయము గాదనుట) హింస, ద్రోహము,యాచన, దంభము (వంచనము), శ్రమము, కలహము, శోకము, మోహము దుఃఖము, దైన్యము, (ఇది నాకుఁ గలుగఁ గలదనెడి) అపేక్ష, భయము, జాడ్యము ఇవి-తామసగుణములు. (సత్త్వాదిగుణములుమాఁడును బెరుఁగఁగా నీగుణములును క్రమముగాఁ బెరుఁగుచున్నవి. ఈ గుణములనుబట్టియే పురుషుఁడుసాత్త్వికుఁడనియు రాజసుఁడనియుఁ దామసుఁడనియుఁ జెప్పఁబడుచున్నాఁడు. ఇట్లు సత్త్వమునకును రజస్సునకునుగల వృత్తులు క్రమముగా నన్నియు నించు మించుగా వర్ణింపఁబడిన వయ్యెను. ఇవి యా యా గుణములు వేఱు వేఱు నుండినపుడు వానివలనఁ గలుగు కార్యములను, గుణము లొకటినొకటిగలసినపుడు గలుగువానిని,వినుము.ఉద్ధవా! నేను నాదియని యహంకారమమకార ప్రయుక్తమగు మతి గుణమిశ్రమమువలనఁ బుట్టినకార్యము, ఆయహంకారమమకారముల మూలమునఁ మనస్సును దేహమును నింద్రియములను ప్రాణములనును బట్టి కల్గు వ్యవహారమంతయు గుణమిశ్రముల వలనఁ గలిగిన కార్యమే యగును. ఈపురుషుఁడర్థమునందును ధర్మమునం

దును గామమందును, నిష్ఠగలవాఁడయినపుడు. అట్టిమూఁటికైఁ
చేయు వ్యాపారము గుణసన్నిపాతమువలనఁ గలుగునదగును.
మఱి యది శ్రద్ధనును బ్రీతినిని ధనమును గలిగించును. పురుషుఁ
డెవ్వఁ డెప్పు డట్టి త్రివర్గానుకూలమగు వ్యాపారమునందు నిష్ఠ
గలవాఁడగునో యపుడు వాఁడు గృహాశ్రమధర్మమునందును
నిజవర్ణ ధర్మమునందును నిష్ఠగలవాఁ డగుచున్నాఁడు. అట్టి
ప్రవృత్తినిష్ఠ, గుణముల సన్నిపాతమువలనఁ గలుగునదగును. ఒక
పురుషుని శమదమాదులచేత సత్త్వము మిక్కిలి గల
వాఁడనియుఁ, గామాదులచే రజస్సు మిక్కిలి గలవాఁడనియుఁ,
క్రోధాదులచేతఁ దమస్సు మిక్కిలి గలవాఁడనియు ననుమానిం
చుకొనవలయును. ఎప్పుడు ఫలాపేక్షవిడిచి స్వవర్ణాశ్రమములకుఁ
దగిన కర్మములచేత నన్ను భక్తితో భజించునో యపుఁడు
వాఁడు పురుషుఁడయినను స్త్రీయైనను సత్త్వప్రకృతి గలవాఁడని
తెలియవలయును. అట్లుగాక యిహపరభోగముల నుద్దేశించి
నిజవర్ణాశ్రమకర్మములచేత నన్ను భజించువాఁడు రాజస
ప్రకృతియనియు శత్రువులను జంపుట మొదలగు హింసల
నుద్దేశించి యట్టివిచేయువాఁడు తామసుఁడనియుఁ దెలియుము.
సత్త్వము రజస్సు తమస్సునను నిడి యీగుణములు జీవునికే
బంధకములుగాని నాకుఁగావు. ఇవి జీవునికిఁ జిత్తమునందు
దమ తమ కార్యములను బుట్టింపఁగా వానిచేత వాఁడు
భూతపరిణామములయిన దేహములందును వానిని సంబంధిం
చిన విషయములందును నిబద్ధుఁడగుచున్నాఁడు. సత్త్వము
తక్కిన రజస్తమస్సుల రెంటిని జయించి యడఁచిపుచ్చునేని
యపుడు చిత్తము సూక్ష్మార్థములను గ్రహించుచు సందులకుఁ

బ్రతిబంధకములైన కలుషములేవియులేక రాగాదులు నుడిగి శాంతమై యుండును. అపుడు పురుషుఁడు సుఖముతోను ధర్మము జ్ఞానము శమము దమము మొదలగువానితోను గూడి యుండును. రజస్సు తక్కిన తమస్సును సత్త్వమును రెంటిని గెలిచి యడంచునేని యపుడు చిత్తము విషయాసక్తమై శబ్దాదులగు వేఱు వేఱు విషయములందుఁ జలించుచు నుండును. అపుడు పురుషుఁడు దుఃఖముతోడను రాజస దైవతారాధనములగు కర్మములతోడను ధనాదిసంపదలతోడను దానివలనఁ గలుగు కీర్తితోడను గూడినవాఁ డగుచున్నాఁడు. తమస్సు తక్కిన రజస్సును సత్త్వమును గెలిచి కీడ్పడుచునేని చిత్తము, వివేకమువాలి ప్రసరింపక జడమై యే పూనికయు లేకుండును. దానివలన శోకముతోను మోహముతోను, నిద్రతోడను హింసతోడను విషయ తృష్ణతోడను గూడియుండును. చిత్తము శాంతమైనపు డింద్రియములు విషయములందుఁ బొచ్చు తుందుడుకు లేక సుఖముగానుండును. దేహమునందు రోగాదులవలన భయము లేకుండును. మనస్సునకు భయనిమిత్తములగు నట్టిరోగాదులను గలిగించు వస్తువులందుఁ దగులులేకుండును. దీనివలన సత్త్వ ముద్రేకించియున్నదని తెలియుము. అట్టిసత్త్వమే నన్నుఁ దెలియుటకుఁ బట్టుచుమీ. ఎప్పుడెప్పుడు మంచిదో చెడ్డదో యేదిగాని చేయుచు వానికి ఫలములగు హర్షశోకాది వికారము లొందుచు దానివలన మనస్సు కలతపడఁగా, జ్ఞానేంద్రియములు విషయములందుఁబొచ్చుటకుఁ దుందుడుకుపడఁగాఁ, గర్మేంద్రియములును గుదురు లేక పీడనొందఁగాఁ, జంచలమగునో, యపుడీ క్రియల

చేతరజస్సు దెల్కించియున్నదని తెలియుము. చిత్తమెపుడు తిరో హితమైజ్ఞానేంద్రియవిషయము లగురూపాదులను గ్రహింప నేరక లయించునో యపుడుసంకల్ప వికల్పాత్మక మగుమనస్సు లయించును. అజ్ఞానమును విషాదమునుగలుగును. అప్పుడు తమ స్సుత్కటముగా నున్నదని నిశ్చయింపుము. ఉద్ధవా! సత్త్వగుణము పెరుగుచుండగా దేవతలకును, రజస్సు పెరుగు చుండగా నసురులకును, దమస్సు పెరుగుచుండగా రాక్ష సులకును, బలము పెరుగుచుండును. జననమరణాది స్వభావ మగు దేహముతోడి సంసర్గముగలయీజీవునకు సత్త్వముచేత జాగరము గలుగునని తెలియుము. రజస్సుచేత స్వప్నావస్థయు, దమస్సుచేత సుషుప్తియుదెలియుము. ఈ మూఁడవస్థలతోను గూడియున్నట్లు తోఁచుచున్న యాత్మస్వరూపము తురీయ మైనది. కనుక దానికి స్వభావముచేత నీమూఁడవస్థలును గలుగనేరవు. (సత్త్వము కొంచెమున్నసితమైనపుడు స్వర్లోక మును మఱింత యున్నసించినపుడు మహరాదిలోకములును మఱియు నెక్కుడుగా నున్నసించినపుడు సత్యలోకమునగును) జనులు సత్త్వముల్లాసమగుటొలఁదిని బ్రహ్మలోకపర్యంతము మీఁదుమీఁదుఁగా బోవుదురు. తమస్సున్నసిలుకొలఁదిని క్రిందు క్రిందుగామిక్కిలి హీనమైనలోకమువఱకుఁ బోవుదురు. రజస్సు చేతనీరెంటికినడుమ సంచరించుచుందురు. సత్త్వము ప్రకర్షము గలిగి యుండఁగా మరణించినవారు స్వర్గమునకుఁ బోవు దురు. రజస్సు మిక్కుటమై యుండఁగా లయించినవారు నర లోకమునకుఁ బోవుదురు. తమస్సు మిక్కిలిగా నుండినపుడు

మరణించినవారు నరకమునొందుదురు. [1] నిర్గుణులగు వారు నన్నే పొందుదురు. నాయందర్పించి నాయారాధనమనితలఁచి ఫలము నుద్దేశింపకచేయునట్టికర్మము సాత్త్వికము. అభ్యుదయ ఫలమును సంకల్పించిచేయుకర్మము సాత్త్వికము. శత్రుహింసమాత్సర్యము మొదలగునవిమిక్కిలిగాఁగలుగుకర్మము తామసము. ఆరోపితమైన రూపమునొక్కకలరూపునుగుఱించినజ్ఞానము సాత్త్వికము ఆరోపితమైనరూపునుగుఱించినజ్ఞానము రాజసము ప్రాకృతమగు(దీనిని గుఱించినదని తెలియకుండు) జ్ఞానము తామసము. నన్నుగుఱించినట్టిజ్ఞానము నిర్గుణము. (సత్త్వోద్రేకము మిక్కిలియుఁ గలది) యని స్మరింపఁబడెడివి. వనము సాత్త్వికమైన యునికిపట్టు గ్రామము రాజసమయిన పటు జూదపుటిల్లు తామసమైనపట్టు. నేనుండెడి దివ్యస్థానములో నిర్గుణమైనవి. అర్థకామములందు సంగములేని కర్త సాత్త్వికుఁడు. రాగాంధుఁడై మిక్కిలి కార్యమం దభినివేశముగల కర్త రాజసుఁడు. విషయము లనర్థములు గలిగించిన వని కనుఁగొనుచున్నను నట్టి తలంపుమాలిన కర్త తామసుఁడు. నాధ్యానాదులయందు వర్తించు కర్త నిర్గుణుఁడు అధ్యాత్మవిషయమగు శ్రద్ధసాత్త్వికి. కర్మములందు శ్రద్ధరాజసి

---

1. నిర్గుణులనఁగా మిక్కిలి ప్రవృద్ధమైన సత్త్వముగలవారని యీప్రకరణమునఁదెలియవలెను. సత్త్వముమిక్కిలి యుల్లాసితమైనపుడు గుణసంబంధమును బోఁగొట్టుచున్నది. 'సత్త్వం రజస్తమ ఇతి గుణాబద్ధే చాత్మనః। సత్త్వేనాన్యతమౌ వాన్యౌ స్యాత్సత్త్వం. సత్త్వేనచైవహి' అనుటచే నిర్గుణశబ్దముచే నైర్గుణ్యమున గలిగించు అతిప్రవృద్ధసత్త్వమగును.

2. ఇట నిర్గుణ శబ్దముల కెల్ల నిరతిశయ సత్త్వోల్లాసము గలుగుటగా తెలియఁబడినది.

అధర్మమందుఁ గల శ్రద్ధ తామసి. నాసేవయందుఁ గల శ్రద్ధ నిర్గుణమైనది హితమైనదోషము లేక పరిశుద్ధమైయాయాసము లేకప్రాప్తించినట్టి యన్నాదులు సాత్త్వికములు. ఇంద్రియసుఖావహమైయాయాసముచేత లభించినది రాజసము. దేహేంద్రియములకుఁ బీడకలిగించునదియు నశుద్ధమును (శాస్త్రప్రతిషిద్ధము) అయినది తామసము. ఆత్మానుభవమువలనఁ గలుగు సుఖము సాత్త్వికము. శబ్దాదులగు సుఖస్పర్శములైన విషయములవలనఁ బుట్టు సుఖము రాజసము. మోహముచేతను (మునన్నునకు మోహకములగు వస్తువులచేతఁ గలుగు పారవశ్యము చేతను) దైన్యముచేతను (పుత్ర కళత్రాదుల యుపచ్ఛందనముల చేతను) బుట్టు సుఖము తామసము. నాధ్యానాదుల వలనఁ గలుగు సుఖము నిర్గుణము. ఇట్లు ద్రవ్యమును (అన్నాదులను), దేశమును (వనగ్రామాదులను), ఫలమును (సుఖములు), కాలమును, జ్ఞానమును, కర్మమును, కారణమును, శ్రద్ధయు, అవస్థయు, లయమును (సత్త్వమందు లయించుట మొదలయినవియు), అవస్థయు (జాగరణాదులును), * ఆకృతియు, నిష్ఠయు నివియన్నియును సత్త్వాదులగు మూఁ

---

* ఇందుకాలమును కారణమును ఆకృతియును పూర్వము చెప్పఁబడినవి గావు. అందుకాలమునఁ బ్రాతర్మధ్యందినసాయంతనములు సాత్త్వికము. రాత్రిప్రహరపర్యంతము రాజసము. నిశీథము మొదలయినవి తామసము. కారణమనఁగా సమీహితము లగు వానికి సాధనములను సంపాదించిన జ్ఞానమునకుఁ గారణమనియర్థము. అందు ఊర్ధ్వగమనమునకు సాధనములను దెలుపు శాస్త్రము సాత్త్వికము. దైహికసుఖసాధనములను దెలుపునది రాజసము. అభిచారాదులను దెలుపునది తామసము. భగవత్ప్రాప్తి సాధనములను దెలుపునది నిర్గుణము. ఆకృతియనగా వేషము. అందువైదికమైనది సాత్త్వికము. అర్థకా

డుగుణములమయమై యుండును. సమస్తములయిన యీ పదార్థములు గుణములవలన నుండి నచ్చినవే; అచిత్తుతోడి సంసర్గముగల పురుషునిగుఱించి వర్తించు చుండునవి. పలు మాట లేల! పురుషసింహా! కన్నారఁ జూచునై హికాదులును, వినెడి పారలౌకికాదులును, బుద్ధియుఁదుఁ జింతించునవియు, నగు సుఖములన్నియును, గుణమయములే కాని వేఱుగావు. పురుషుని కీద్రవ్యాదులెల్లను గుణముల వలనను గుణములకుఁ దగిన వ్యాపాతన పుణ్యపాపకర్మముల వలనను బుట్టిన నరుచులచేతఁ గలుగుచుండునవి. మఱి సంసారమునకును హేతువులయినవి. సౌమ్యా! చిత్తమున నుల్లసిల్లుచుండెడి యీగుణములను జీవుఁ డెవఁడు నిర్గుణముచేత (అతి ప్రవృద్ధమైన సత్త్వముచేత) జయించునో వాఁడే సత్త్వము వలన మిక్కిలి వర్ధిల్లిన భక్తి గలిగి నాతోడ సాధర్మ్యమునకుఁ బాత్రుఁ డగుచున్నాడు. కాబట్టి జ్ఞానమునకును విజ్ఞానమునకును హేతువయిన యీ దేహమును బడసి, విచక్షణులగు వారు శబ్దాదివిషయములందుఁ దగులును దూలఁబుచ్చి నన్ను భజించుచుందురు. ఇంద్రియములను వశముగావించుకొన్నను వానిని విశ్వసించిన యెడల మరల విషయములందుఁ దగులుపుట్టించి యనర్థములుగలిగించు నని తెలిసి

మార్జనములకు అనుకూలమైనది రాజసము. పాశు పతాదులైన ఆగమములందుఁ జెప్పబడినది తామసము. భగవచ్ఛాస్త్రమునందుఁ జెప్పఁబడినది నిర్గుణము. ఇట్లన్నియు త్రిగుణముల కార్యములనికాని త్రిగుణముల కుల్లాసకరములగునని కాని యర్థము.

యెవఁ డింద్రియములను విషయములనుండి మరల్చి తనవశ ముఁచేసికొన్నను మఱల వానియందు విశ్వాసమిడక యప్రమ త్తుఁడయి సంగము మాలి నన్ను భజించునో యట్టి ముని యగువాఁడు సత్త్వమును మిక్కిలియు నుల్లసిలఁజేయు ద్రవ ములను సేవించి రజస్సునును దమస్సునును జయించుచున్నాఁ డు. మిక్కిలి యుల్లసితమైన సత్త్వము గూడ ప్రకృతి సం బంధియే కాన యది యుండువఱకుఁ బ్రకృతిసంబంధమును వీడుట యెట్లందువా? అనన్యప్రయోజనమై మిక్కిలి యుల్ల సితమగు సత్త్వమువలనఁ బుట్టిన యుపాసనాత్మకమగు జ్ఞాన ముచేత నట్టి సత్త్వమువలన రాఁగాది కలుషములడఁగి యు న్నచిత్తముగలవాఁడు యుక్తుఁడై సత్త్వమును జయించుచు న్నాఁడు. అతిశయించిన సత్త్వమువలనఁ బుట్టినజ్ఞానము చేత మూఁడు గుణములు నివర్తింపఁగా సత్త్వమును దనంతట నివర్తించుచున్నది. ఇట్లు గుణముల నెల్ల వీడిన జీవుఁడు దేహమును విడిచి నన్నుఁ బొందుచున్నాఁడు. మనస్సునం దుల్లాసము నొందునట్టి గుణములనును దేహమునును వీడి జీవుఁ డు బ్రహ్మంబగు నేను దనయందంతర్యామి నై వ్యాపించి యుండుట సాక్షాత్కరించుచు వెలుపల సంసారనిమిత్తమైన కర్మముల నాచరింపఁడు. లోపలను మోక్షసాధన మగు జ్ఞాన యోగమును నాచరింపఁడు; అనఁగా ముక్తిదశయందు శా స్త్రమునకు వశ్యుఁడు గాకయుండును. ఇది యిరువదియేనవ యధ్యాయము.

స్త్రీసంగము దూష్యమని తెలుపుటకై యైలగీతలు.
సాధుసంగప్రభావము.

శ్రీభగవంతుఁడు—నాదర్శనమునకు సాధనమైనయీమను ష్యదేహమును బొంది ప్రవృత్తి ధర్మము నొందక మదారాధనరూపమగు నివృత్తిధర్మమునే యవలంబించి, యానందమయుండును జీవాత్మయందు నెలకొనియుండువాఁడు నగు పరమాత్మను నన్నుఁ బొందుచున్నాఁడు. గుణత్రయమయమైన ప్రకృతికార్యములగు దేవాదిదేహములందు జీవపరమాత్మల స్వరూపములను దృఢముగాఁ దెలియుట వలన నేను నాది యనెడి యభిమానమును నడలినవాఁడు ప్రకృతికార్యములగు శబ్దాదులను విహితములయిన వాని ననుభవించుచున్నను, ఆ వస్తువులచేతఁ గాని గుణములచేతఁ గాని పట్టు వడుకుండును. శిశ్నోదరసుఖములయందు మిక్కిలి తగులు గలిగియున్న దుష్టులతోడ సంగము చేయరాదు. వాని ననుసరించు వాఁడు గ్రుడ్డివానిని ననుసరించు మఱి యొక గ్రుడ్డివానివలె నంధతమస్సునందుఁ (నరకమునందుఁ) బడుచున్నాఁడు. పురూరవుఁడు తొల్లి సార్వభౌముఁడై యుండి మిక్కిలియుఁ గీర్తిని సంపాదించెను అతఁడూర్వశియందు మిక్కిలియు మోహము నొంది తన తెలివి యంతయు దానిచేఁ గోలుపోయినవాఁడయ్యెను. అందు వలన నతఁడానందరితోఁ గలసి మెలసి యేండ్లు పూండ్లుగా రాత్రులు పోవుటయు వచ్చుటయుఁ దెలియఁడయ్యెను. మఱి యతఁడు దానంజేసి నీచములగు విషయములందుఁ దృప్తినొందక యనుభవించుచునే యుండెను. ఇట్లుండఁగా

నొకప్పు డాపూలోఁడి యతనిని దిగవిడిచిపోఁగా రాజును దానివెంటం బడి దిన్నమొలతో వెట్టిపిసవానివలె 'జా యూ! ఎంత మనస్సున బెట్టిదురాలవే' యలునిలు పోకువే' యని విలపించుచు దిటవెడిపోయెను. అట్లూర్వశి నెడఁబాయుట వలన మోహము నొంది (కురుక్షేత్రమున దానిని గలసి గంధర్వ లోసంగిన యగ్నిచేత యజించి దాని లోకమునకుఁ బోయి బహుకాలము దానితో రమించిన పిదప) నతనికి శోకమంత యుఁ దొలంగెను. అప్పుడు విషయము లనర్థహేతువు లని యాలోచించి వైరాగ్యము పుట్టఁగా నతఁడీగాథను బాడెను.

ఏలుఁడు-కామముచేత నామనస్సు కశ్మలమైయున్నదిగాన నాకారా' యీమోహమెంత విస్తారముగా నున్నది! ఆయూర్వశి నన్ను నిత్యమునెడతెగకమెడఁగొఁగిలించుకొని చొక్కించుచుండఁగా నాయాయువుభాగము లయిన యీ యహోరాత్రములను దలఁపనే తలఁపనయితిని. ఈ యూర్వశిచేత నా వివేకమంతయుఁ గోలుపోయి యిపుడె దాని నుండి విముక్తుఁడ నయితిని. నేను దానితో రమించు చుండునపుడు సూర్యుఁ డుదయించి నదియు నస్తమించి నదియుఁ దెలియకుంటిని. మఱి యేండ్లు పూండ్లుగా దినములు గడచిపోయినయియు నాకుఁ దెలయవయ్యెను గదా! నేను జక్రవర్తిని. నరదేవశిఖామణిని. ఇట్టివాఁడై యుండియుఁ దుద కామోహాముచేత యబలలకుఁ గ్రీడామృగము గావింపఁబడితినిగదా! ఔరా! నామోహమెట్టిది! సమాక్షిప్తయిన నన్నును నాభోగోపకరణములనుగూడ గడ్డిపఱకవలెఁ దలఁచి దిగనిడిచి యూయాఁడుది పోయినదే! అట్టిదానివెంటదిన్నమొలతో వెట్టిపట్టిన

వానివలె నేడ్చుచును నేను భోయితినిగా? ఎప్పుడు తన్ను విడిచి పోవుచున్న యాఁడుదానిని గాడిదవలెఁ గాలంకన్నిను విడువక వెంబడించిపోవునో యట్టి వానికి మహత్త్వము గాని తేజస్సుగాని ప్రభుత్వముగాని యొక్కఁడివి? ఎవ్వనిమనస్సు స్త్రీలచేత నపహరింపఁబడినదో యట్టివానికి వివేకముచేతను దపస్సుచేతను దానముచేతను నధ్వయనముచేతను ఏకాంతముగా నుండుటచేతను మౌనముచేతను బ్రయోజనమేమి? నేను భూమిశ్వరత్వమునుబొంది యుండియుఁ గడపట నొక యాఁడుదానికి నావువలెను గాడిదవలెను నోడిపోయితినే! నామేలు నే నెఱుంగనివాఁడనై మూర్ఖుఁడనై పండితుఁ డని మాత్రము తలంచుకొనుచున్న నన్నుఁ గాల్పనా! ఇస్సీ! నాదొక బ్రతుకా! నేను సంవత్సరములకొలఁది సూర్యశి క్రిందివెదవి యాసవమును జుఱ్ఱుచున్నను, అగ్ని యాహుతులచేతఁ దగ్గక మఱి మఱి మండునట్లు, కామములచేత మన్మథుఁడు తృప్తి నొందియుడుగక పయిపయిని బెరుఁగుచునే యున్నాఁడు. విటకత్తియ యపహరించిన మనస్సును దానినుండి విడిచిపుచ్చుటకు నింద్రియవృత్తులకు లోఁబడనివాఁడును నాత్మస్వరూపమందే రమించుచుండు వారికి నిర్వాహకుండును నగు భగవంతుఁడు తప్ప మఱి యితరుఁ డెవ్వఁడు సమర్థుఁడగును? ఆ యూర్వశియు నాకు సూనృతవాక్యముచేత * బోధించినది. దానియందుఁ దప్పలేదు. నేను దుర్మతిని; యింద్రియములను జయింపనివాఁడను. కనుక నా మనస్సునందలిమోహము

---

* 'నవై స్త్రైణాని సఖ్యాని సంతి సాలావృకాణాం హృదయాన్యేతాః' అనిశ్రుతి యీబోధమును ప్రతిపాదించుచున్నది.

నన్నువిడిచిపోయినది గాదయ్యెను! ఈ యూర్వశి నాకపకార ముచేసిన దేమున్నది ? ఏమియులేదు. త్రాడుని కలరూపుదెలి యక పామని చూచి పాముగానే మనస్సునఁ దలఁచునేని వాని కాత్రాడుచేసినయుపకార మేమి? అట్లు యింద్రియము లను జయింపనందున దేహాత్మస్వరూపములను దెలియక దేహమునే యాత్మగాఁ గనువానికి నాదేహముచేసిన కీడేమి ? ఈ కాయము మిక్కిలి మలినమైనది. దుర్గంధము మొదలయినవాని కిదిపట్టు, అనుచితమైనది, ఇట్టికాయ మెక్కడ ! మంచిగంధము మొదలయిన యింపారు గుణము లెక్కడ ! మిక్కిలి హేయమైన కాయమును భోగ్యముగాఁ దలంచుట యెంతయు నొప్పదు. అట్టి కాయమునం దిట్టిమంచిగుణములు, కలరూపును దెలుపనియవిద్యచేతఁ గావింపఁబడినవే కాని మఱి యొకటి గాదు. 'ఈ దేహము కన్నతండ్రికి సొంతమా! లేక యనుభవించు భార్యదియా? లోపలనుకొనియున్నయొడ యనిదా? చితియందుఁ గాల్చు నగ్నిదా? కడపటఁ బెట్టికితిను కుక్కగ్రద్దలదియా ? లేక తనకైనసొంతమా ? దాని కుపకరించు సుహృదులదియా ?' యని యాలోచించి యెవఁడిది పరకీయ మని తలంచునో వాఁడు దీని యందలి మోహము నొంది కుందఁడు. ఇట్లపరిశుద్ధమై తుదకేమియుఁగాక పోవునట్టి యీశరీరమునుజూచి. 'ఓరా! ఆ సుందరి ముఖ మేమి సొంపుగానున్నది! దాని ముక్కెంత నిక్కుగా నున్నది! ఆచిఱునవ్వేమి? యని యందుఁ దగులుపడి కడపట మోహమునఁ గుందుచున్నాఁడు. ఇది తోలుకండ నెత్తురు నరములు నెనడు మజ్జయెమ్ములునను నివిగూడియైనది. మూత్రపురీషములఁ

చేతనిండినది. ఇట్టిదానియందు రమించువారికిని దీనిని దిను క్రిములకును భేద మేమియున్నది ? ఇట మీఁదనయినను నాత్మ హితమును దెలిసిన వాఁడు స్త్రీలయందును స్త్రీవశ్యులగువారి యందును దగులుగలిగి యుండరాదు. మనస్సు, విషయముల కు నింద్రియసంబంధము గలుగుటచేతనే కలంగు చున్నది కాని, మఱి యొకటిచే గలఁగదు. విషయములను జూడకయు వినకయునుండినయెడల మనస్సు కలంకపుట్టదు. అట్లు పురుషుఁ డింద్రియములను విషయములందు నిగిడింపక యుండినచో మనస్సు నిశ్చలమై శాంతి నొందుచున్నది. కాఁబట్టి స్త్రీల యందును స్త్రీవశ్యులగువారియందును సంగము చేయరాదు. ఇంద్రియము లాయును విద్వాంసులకుఁగూడ నమ్మఁదగనివనఁగా నిఁక మాఱోంట్లకుఁ జెప్పనేల" యని పాడెను.

శ్రీభగవంతుఁడు—ఇట్లు రాజరాజగు పురూరవుఁడు పాడుచు నూర్వశీలోకమును విడిచి తన యాత్మ యందున్న పరమాత్ముఁడగు నన్ననుపాసనముచేత సాక్షాత్కరించి యుపాసనాత్మకమయిన యా జ్ఞానముచేత దేహాత్మాభిమానరూపమగు మోహమునంతయుఁ దూలించి ముక్తుండాయెను. కాఁబట్టి తన శ్రేయస్సును గోరువాఁడు దుష్టులతోడిసంగమును దిగవిడిచి సజ్జనులతోడి సంగము చేయవలయును. సజ్జనులగువారు వాని మనస్సునకు విషయములందుఁ గలసంగమును మాటలచేతఁ జెప్పి గ్రుంతురు. సజ్జనులు నాయందే మనస్సు గలిగి నన్నుదప్ప మఱి యొక్కటి నపేక్షింపక మనస్సునందలి రాగాదికలుషము లేక శాంతినొంది చిదచిత్తులనెల్లఁ బ్రహ్మాత్మకము లని సమముగాఁ గనుఁగొనుచు మమకారమును నహం

కారమును లేక ద్వంద్వములనును వీడి. పరిగ్రహములను మాని యుందురు. మహాభాగా! ఆ మహాభాగులయందు నా కథలు నిత్యమును సంభవించుచునే యుండును. అవి మనుష్యులకు హితములైనవి. అవి, వినువారికిఁ బాపములెల్లఁబాపంచలుకాఁగా వారిని బరిశుద్ధులను గావించుచుండును. ఎవ్వరు మదాశాధినపగులయి శ్రద్ధతోడ నాకథలను నాదరమున వినుచును బాడుచును ననుమోదించుచును నుందురో వారు నాయందు భక్తిని బొందుదురు. అనంతకల్యాణగుణుండును బరబ్రహ్మమును నిరతిశయానందజ్ఞానరూపుండును నగు నాయందు భక్తిని బొందిననాదుపురుషునకు నిఁకఁ బడయఁదలసిన దేమున్నది? ఏమియులేదు. భగవంతుఁడగు నన్నిని నాశ్రయించుపురుషునకుఁ జలిగాని చీకటిగాని దానివలనభయముగాని లేక పోవునట్లు, సాధువులను మిక్కిలి సేవించుచుండుపురుషునికి నజ్ఞానమును దానివలనఁ గలుగు సంసారభయమును దొలఁగిపోవుచున్నవి. భయంకరమయిన సంసారసముద్రము నందు మునుఁగుచును దేలుచునుండువారికి బ్రహ్మవిదులును శాంతులునగు సాధువులు,నీటియందు మునిగిపోవుచున్నవారికిదృఢమైన యొక నావవలెఁ మిక్కిలియుఁ బ్రాపైయుందురు. బ్రతుకుఁగోరు ప్రాణుల కన్నమె జీవింపఁజేయు ప్రాణము. తాపత్రయము చేతఁ బీడితులగువారికి నీశ్వరుండ నగు నేను శరణము. పరలోకమందు ధర్మము రక్షకము. ఇహమునందు మనుష్యులకు ధనము శరణము. అట్లె యీ సంసారమునకు భయపడు పురుషునికి సాధువులే శరణము. సజ్జనులు జ్ఞానాత్మకములగు కన్నులనిచ్చుచున్నారు. సూర్యుఁడుదయింపఁగా వెలి కన్నులే

యిచ్చుచున్నాఁడు. కనుక సజ్జనులు * దేవతలును బాంధవులు నగుచుఁదు. వారు నా కాత్మ. నేనే వారు చుమీ ! వీతిహోత్రుని పుత్త్రుఁడయిన యాపురూరవుఁడు స్త్రీలయు స్త్రీసఖ్యులయు సంగమునుండి విముక్తుఁడై తన యాత్మయందే రమించుచు నీ భూమియందు సంచరించినవాఁ డాయెను - ఇది యిరువది యాఱవయధ్యాయము.

భగవంతుఁడు ఉద్ధవునకు భగవదారాధన క్రమమును జెప్పుట.

ఉద్ధవుఁడు—. 'ప్రభూ ! నీ యారాధనరూపమగు క్రియాయోగమును నాకు వివరింపుము. సాత్వతులగువారు నిన్నే యుపకరణములనుగొని, యే యధికరణములం, దేయే విధమున నర్చింతురో పురుషోత్తమా ! నాకుఁ జెప్పుము. ఈ నీ యారాధనమును నారదుఁడును భగవంతుఁడగు వ్యాసుఁడును అంగిరసుని కొడుకగు బృహస్పతియు మొదలగు మునులు మనుష్యులకు గొప్ప నిశ్శ్రేయసమై నదని చెప్పెదరు. ఇది నీముఖారవిందమునుండి మొదట వెలువడి బ్రహ్మకుపదిష్టమైనది. భగవంతుఁడా బ్రహ్మయుఁ దన పుత్త్రులయిన భృగువు మొదలగు వారికి దీని నుపదేశించెను. భగవంతుఁడా శిపుఁడు దీనిని దన దేవి యగు పార్వతికినుపదేశించెను. సత్తమా! ఇది సమస్త వర్ణములవారికిని నాశ్రమములవారికిని, ఇంతేల ! స్త్రీలకును శూద్రులకును నుత్తమంబయిన శ్రేయముగాఁ దలఁచుచున్నాను. కమలపత్రాక్షా ! కర్మబంధములనెల్ల వడిచివుచ్చునట్టి

* దేవతలనఁగా బూజింపఁదగినవారును బంధువులవలె నుపకరింపఁదగినవారు నగుదురని భావము.

దీనిని నీభక్తుఁడును నీకనురక్తుఁడునైన నాకుఁ జెప్పము. ఇది బ్రహ్మాదులవలనఁ బ్రాప్తించియున్న దేకదా; నే నేల చెప్పవలె? నందువా! నీ వావిశ్వేశ్వరుల కెల్ల నీశ్వరుఁడవుగాన నీవే చెప్పఁ దగును' అని యడిగెను.

శ్రీ భగవంతుఁడు—ఉద్ధవా! మదారాధనమగు కర్మమును బోధించు శాస్త్రమునకుఁ బారములేదుగాన నాని కంతములేదు. దానిని సంక్షేపించి గలరూపునఁ గ్రమముగాఁ జెప్పుచున్నాను. నన్నారాధించు యజ్ఞము వైదికము తాంత్రికము మిశ్రమని మూఁడువిధములయినది ఈ మూఁటియం దిష్టమైన విధిచేత నన్నర్చింపవచ్చును. త్రైవర్ణికుఁడగు పురుషుఁడు తన యధికారమును బ్రతిపాదించు వేదముచేతఁ జెప్పఁబడినట్లు(జన్మించిన యెనిమిదవయేఁటనో, పదునొకండవయేఁటనో, పండ్రెండవయేఁటనో) యుపనయనము పొందినపుడు నన్ను భక్తితోను శ్రద్ధచేతను నెట్లు యజింపవయునో దానిని వినుము. అర్చ్యయందును (ప్రతిమయందును) స్థండిలమునందును (చక్రాబ్జమండలాదులందును) అగ్నియందును, సూర్యనియందును, జలములందును, హృదయమందును, ద్విజనియందును, గంధకుసుమాది ద్రవ్యములచేత భక్తియుక్తుండైన తనగురుండగు నన్నుఁ గపటములేక యర్చింపవలయును. మొదట బలుదోసిలొగొని, దేహాశుద్ధికి స్నానముచేయవలయును. అంతమృత్తుగోమయము మొదలగువాని లేపముచేత వైదిక తాంత్రికములగు నుభయమంత్రములచేతను స్నానముచేయవలయును, పిదప, నేను వేదముఖమునఁ జోదితముగావించియున్న సంధ్యోపనాది కర్మములను గావింపవలయును. పిదప ఫలాభిసంధి లేకుండునట్లు

చక్కఁగా సంకల్పించుకొని ప్రాప్యప్రాపకవిధియుఁ బ్రాచీన ములునగు కర్మములెల్లఁ దూలించునట్టి పూజను నాసంధ్యో పాసననాదులతోఁ గూడనే కల్పింపవలయుఁ గాని దానిని విడిచి చేయరాదు. శిలామయము దారుమయము లోహమయము (మృచ్ఛందనాది) లేపమయము. లేఖ్యామయము, సికతామయము మనోమయము మణిమయము ననిప్రతిమయెనిమిది విధములు. అనిమఱియుఁ జలమనియు నచలమనియు రెండువిధములగును. అవి భగవంతునికి స్థానములు. ఉద్ధవా! అచలమైనదానియం దర్చనచేయునపుడు, ఉద్వాసమును నావాహమును రెండునుగలు గవు. చలమం దావిధిలోనేదియో యొకటి గలుగుచున్నది. స్థండిలమందు రెంటిని గలుగుచున్నవి. విలేప్యమందు (లేఖ్య మందునుసైకతమందును) స్నపనమూత్రము చెల్లును. తక్కిన వానియందుఁబరిమార్జనము చెల్లును. శాస్త్ర వ్యసిద్ధములయిన ద్రవ్యములచేత నాయాగము (అనఁగా మదారాధనము) ప్రతి మలయందు మాయలేకఁ గావింపవలయును. భక్తుఁడగువాఁడో దొరకినవానితోఁగాని, నాద్రవ్యములను గేవలముహృదయమం దుసంకల్పించుకొని కాని నన్నారాధించినఁ జాలును. ఉద్ధవా! అర్చయందు స్నానమును నలంకరణమును నాకు మిక్కిలియుఁ బ్రియములైనవి. కాఁబట్టి యారెండును సిద్ధక చేయవల యును. స్థండిలమునందు, అయా యంగప్రధానదేవతలను వాని వాని స్థానములందు మంత్రములచేత స్థాపనముచేయు టయు, అగ్నియందు నాజ్యముతోఁ గూడిన హవిస్సును, నాకుఁ బ్రియతమములు. సూర్యునియందుస్తుతులచేనారాధించుటయు జలమునందు సలిల గంధపుష్పాదులచేత నర్చించుటయు శ్రేష్ఠ

మైనది. నట్టిజలమైనను భక్తితోడ సమర్పించిన యెడల నాకు మిక్కిలియుఁ బ్రియమగు ననఁగా గంధము ధూపము పుష్పములు దీపము అన్నము తాంబూలము మొదలగువాని యందు దేనితోనైనను భక్తితో నారాధించినఁ జెప్పవలయునా? భక్తిలేక నాకెంత పెద్దకానుక పెట్టినను సంతోషము కలిగింపనే చాలదు. పూజాక్రమము వినుము:—

మొదటఁబూజకు వలయునుపకరణముల నెల్లసమకట్టుకొన వలయును. పిమ్మటఁ దూర్పు మొనలగు దర్భలచేత నాసనము కల్పించుకొని తూర్పు మొగముగానో యుత్తరదిక్కు మొగముగానో లేక యర్చాగ్రహమునకు నభిముఖముగానో కూర్చుండి మాటిమాటికి లేవకయర్చింపవలయును. అర్చించుమాఁడు మొదటఁదనయంగములందు మంత్రన్యాసము చేసికొని నాయర్చా ప్రతిమయందును నట్లెన్యాసముచేసి చేతితోఁదడువవలయును. పిదపఁ దనకు నెడమప్రక్క బ్రోక్షణకలశము నుంచుకొనవలయును. ఆకలశమునందలి జలముచేత యాగభూమినిని బూజాద్రవ్యములనును దనదేహమును ఔద్యము మొదలయిన మూఁడు పాత్రములనును బ్రోక్షించి యంత నాకలశోదకముల చేతను దులసి దర్భ మొలకలు విష్ణుకాంత యెఱ్ఱగలువ మొదలైన యా యాద్రవ్యములచేతను బూజింపవలయును. ఆరాధకుఁడు పాద్యముకొఱకును నర్ఘ్యముకొఱకును నాచమనీయము కొఱకును గల పాత్రములు మూఁటిని హృదయమంత్రము చేతను శిరోమంత్రముచేతను శిఖామంత్రము చేతను విష్ణుగాయత్రిచేతను నభిమంత్రింపవలయును. శోషణముచేతను దాహనముచేతను ప్లావనముచేతను బరిశుద్ధమయి

యున్న శరీరమునందలి హృదయపద్మమునందు జ్ఞానస్వరూప మగు జీవుఁడున్నాఁడు. వాఁడు మదాత్మకుఁడు, దేహేంద్రియ ములకు విలక్షణుఁడు, అణుస్వరూపుఁడు, ఉదాత్తస్వరయుక్త మగు ప్రణవమందలి కడపటి వర్ణమగు మకారమునందుఁ బ్రతిపాద్యుఁడని యోగులువానిని ధ్యానింప వలయును.

దీపము ప్రభచేత గృహమునవ్యాపించినట్లు స్వరూపభూతుం డైన జీవుఁడుధర్మభూత జ్ఞానముచేత వ్యాపించియున్నట్లు శరీర మునుధ్యానించి, యిట్లునంస్కరింపఁబడిన శరీరమందలిహృత్పద్మ మున మొదట మానసోపచారముల చేతనన్నర్చించి,యంతియర్చ స్థండిలము మొదలగు వానిలో దేనియం దయినను [1] నా వాహనముచేసి స్థాపనముగావించి. నాకు నంగన్యాసముసలిపి యంతఁ బూజింప వలయును. పిదప [2] ధర్మము మొద లయిన యెనిమిదిపాదముల తోఁగూడిన పీఁదుఁ [3] దొమ్మి ది మూర్తులతోఁ (పీఠదేవతలతోఁ) గూడినదియుఁ గర్ణి కతోడను కేసరములతోడను గూడినదియు నెనిమిదిదళములు గలదియు నగు పద్మము నాసనముగాఁ గల్పించి యందుఁ

---

1. ఇచట ఆవాహనస్థాపనమున చేత సన్నిధాపన మొదలగు వానినిగూడ గ్రహింపవలయును. ఆవాహనము మొదలగు అయిదుముద్రలను ప్రదర్శించుట చేత ఆవాహనాదులు కావించుట యని తెలియునది.

2. ధర్మము జ్ఞానము వైరాగ్యము ఐశ్వర్యము అధర్మము అజ్ఞానము అవైరాగ్యము అనైశ్వర్యము అనిపీఠములకు పాదములనెనిమిది.

3. పీఠదేవతలు 'విమలోత్కర్షిణీ జ్ఞానా క్రియా యోగాతథా పరమ్। ప్రహ్వీసత్యాతథేశానా నుగ్రహా నవ మూర్తయః; విమల, ఉత్కర్షిణి, జ్ఞాన, క్రియ, యోగ, ప్రహ్వీ, సత్య, ఈశాన, అనుగ్రహ యని తొమ్మండ్రు తెలియునది.

సర్ఘ్యమును భాద్యమును నాచమనము మొదలగునుపచార ములను వేదవిధులచేతను బంచరాత్రో క్తవిధులచేతను మంత్ర ములచేతను స్వర్గాపవర్గములు రెండును సిద్ధించుకొఱకు నాకుఁ గావింపవలయును. పిదప సుదర్శనమును పాంచజన్యమును, గదను, అబ్జమును, ఇషువును, శార్ఙ్గధనువును, హాగ్నమును ముసలమును, కౌస్తుభమును వనమాలికను, శ్రీవత్సమును, వెంటనేపూజింప వలయును * అంతఁ బార్షదులగునందుఁ, సునందుని గరుడునిఁ, బ్రచండుని, జండునిని, మహాబలునిని, బలునిని, గుముదునిఁ, గుముదేక్షణునిని బూజింపవలయును. పిదపఁ దమ తమ స్థాన ములయందుఁ నాకభిముఖములుగా నెలకొల్పఁబడియున్న దుర్గ నును, వినాయకునిని, వ్యాసుని, విష్వక్సేనుని, గురువులను నింద్రాదిదేవతలనును బ్రోక్షణము పాద్యము మొదలగు వాని చేతఁ బూజింపంలయును. చందనము, ఎట్టిపేరు, కర్పూరము, కుంకుమపూవు, అగరువు ననెడివీనిచే జలమును వాసింపఁ జేసి మంత్రములచేతఁ, బ్రతిదినమును మంచి కలిమియున్న యెడల స్నానము చేయింపవలయును. లిమిలేనిచో దొరకిన

---

* సుదర్శనము మొదలుగా ముసలముపర్యంతమగు నాయుధములను అష్ట దిక్కులయందును, కౌస్తుభవనమాలా శ్రీవత్సములను ఈశానుడందును, నంద దులను అష్టదిక్కులందును, గరుడుని ముందటను, దుర్గాదులను కోణము లందును, గురువులను భగవంతుని దక్షిణపార్శ్వమందును, ఇంద్రాదులను తూర్పు మొదలుగా అష్టదిక్కులందును నుంపవలయును. దుర్గ, భగవన్నా యాభిమాని దేవతయగుటంబట్టియు, వినాయకుఁడు విష్వక్సేనుని పార్షదుఁ డగుటంబట్టియు, వ్యాసుఁడు వేదశాఖలను విభజించి వానిని ప్రవర్తింపఁ జేసి యుపకరిం చుటంబట్టియు, దేవతలు భగవద్విభూతులగుటంబట్టియు, వీరి నెల్లభగవంతుని పరివారములలోఁ జేర్చి పూజ విధింపఁబడినది.

వఱకుఁ బందనాదులుగలిపి స్నానముచేయింపవలయును. *సువర్ణ ఘుర్మానువాకమంత్రముచేతను మహాపురుషవిద్యచేతను బురుష సూక్తముచేతను, నామాశ్రయములగు నీరాజనము లౌహిణ ము మొదలగుమంత్రములచేతను స్నానముచేయింపవలయును. పిమ్మట వస్త్రములు యజ్ఞోపవీతము భూషణములు తులసీదళము లు పుష్పమాలికలు చందనలేపనములు మొదలగువానిచేత నా భక్తుఁడగువాఁడు తన్ముఁ బ్రేమతోఁడ యథోచితముగా నలం కరింపవలయును. అర్చకుఁడు నాకుఁ బాద్యమును నాచమ నీయమును గంధమును బుష్పములను ధూపములను నక్షతలను దీప ములను నుపహారములను శ్రద్ధతోఁ బొసంగవలయును. పిదప బెల్లము, పాయసము, నెయ్యి, చక్కిలములు, పిండివంటక ములు, కుడుములు, గోధుమపిండి, వడకములు, పెరుగు, వండిన పప్పు, మొదలగు వానిని నైవేద్యము చేయ వలయును. ఏకాదశి మొదలగు పర్వదినములయందు, నా కభ్యంగనము, ఉన్మర్దనము, అద్దముసూపుట, దంతధావ నము, పంచామృతముచేత నభిషేకించుట, అన్నాదులు, గీతము, నృత్యము, వాద్యము, మొదలగునవియుఁ గావింపవలయును. సంపదయుఁడైనా ప్రతిదినమును నివి చేయవలయును. అగ్ని యందుఁ బూజాప్రకారము వినుము. మేఖలాగర్తవేదు లగు

---

* 'సువర్ణం ఘుర్మం పరివేదనేన, ఇత్యాదులు సువర్ణ ఘుర్మానువాకమంత్ర ములు 'జిత స్తేస్తోత్రరీకాత్మనమస్తే విశ్వభావన। నమస్తేస్తుహృషీకేశ మహా పురుష పూర్వజ' అనుమంత్రము మహాపురుషవిద్య. పురుషసూక్తము ప్రసి ద్ధము. 'ఇన్ద్రోమహాసే మఘిరోనవన్తః' ఇత్యాదులగు ఋక్కులు నీరా జనాదులు ఇవి సామము నాశ్రయించినవని తెలియునది.

వారి చేతఁ దంత్రోక్తవిధిప్రకారము నిర్మింపఁబడిన కుండ మందో లేక స్థండిలమందో యగ్ని మునిచి, మండిన వెనుక నాయగ్నిని జేత నలుప్రక్కలనుండి యొకటిగాఁ జేర్చవల యును. పిదప దర్భలు పఱచి పరిషేచనము చేయవలయును. అంతఁ దన గృహ్యోక్త విధి దొప్పున నగ్నిముఖ మనెడి కర్మము నెల్ల సంకల్పము చేసికొని ప్రోక్షణపాత్రజలముచేత, నాజ్య ముస్థాలిమొదలైన యుపకరణములను ప్రోక్షించియగ్నియందు నన్ను మేలిబంగారుకాంతి గలవాఁడుగను శంఖచక్రగదాం బుజములు నాలుగును నాలుగుజేతులయందు వెలుంగుచున్న వాఁడుగను, శాంతుఁడుగను, తామర కింజల్కములవలె నెఱ్ఱని వస్త్రముగలవాఁడుగను, గిరీటమును గటకములును గటి సూత్రములును సంగదములును వెలయుచుండువాఁడుగను, శ్రీ వత్సవక్షుఁడుగను, వనమాల ధరించి యున్నవాఁడుగను భావనచేయవలయును. ఇట్లు ధ్యానించి యర్చించి నేతఁ దడిసిన సమిధలనును హవిస్సులనును నగ్నియందు వైచి, అఘోర ములనెడి యూహ్యవాహుతులను వేల్చి తెలిసినవాఁడు శ్రీమ దష్టాక్షరన్యాహంతి మగుమూలమంత్రముచేతను, బురుషసూ క్తమునుఁ బదియూఁ బుక్కులచేతి నగు నవదానములచేతను, నాజ్యమందుఁ దోఁగిన హవిస్సును హోమము చేయవలయును. అంత న్యాయము చొప్పున ధర్మాదుల కొఱకును, విమలాదులు అంగదేవతి లావరణదేవతలు నస్త్రభూషణపార్షదులు మొద లగు వారికొఱకును హోమముచేయవలయును. అంత స్విష్టకృతము వేల్వవలయును. పిదప నగ్నియం దాహా వానము చేయఁబడియున్న భగవంతు నర్చించి

లయిన నందాదులకు నష్టదిక్కు-ల యందును బలి నొసంగనల యును. బ్రహ్మంబగు నన్ను ధ్యానించుచు నారాయణాత్మక మగు మూలమంత్రమును జపింపవలయును. పిదప విష్వక్సేను నకు నాచమనము సమర్పించి భగవంతునకు నివేదించిన వాని నతనికి నర్పింపవలయును. అవ్వల, కర్పూరాదులచే వాసిత మ్ములయిన తాంబూలము మొదలగు ముఖవాసములను సమ ర్పింపవలయును. మరల బుష్పాదులచేతఁ బూజింపవల యును. అంతఁ బొడుచును బొగడుచును, నాడుచును, నాచే ష్టితముల నభినయించుచును, నాకథలను వినుచును, వినిపించు చును, మహాహర్షముసేపు లజ్జావసరుండై యుండవలయును. అంత శ్రుతి ప్రతిపాదితములును పురాణోక్తములును ద్రవిడాం ధ్రభాషాత్మకములును బ్రాకృతములునగు నానావిధస్తవముల చేత స్తుతించి 'భగవంతా! ప్రసన్నుఁడవగు' మని దండమువలె బడి వందనము చేయవలయును. నాపాదములయందు శిరస్సునిడి రెండుచేతులచేత నారెంటిని బట్టికొని 'ఈశా! నేను శరణుఁ బొచ్చితిని. మృత్యువువలెను బిశాచమువలెను సముద్రము వలెను నున్నసంసారమునకు భయపడియున్న నన్ను రక్షింపు' మని పలికి నేననుభవించిన తులసి మొదలగువాని నేనిచ్చినట్లు గాఁ జేకొని యాదరముతోడ శిరస్సునందుఁదాల్చి జ్యోతియగు నాస్వరూపమును నుద్వాసనముచేయవలయు నేని యాజ్యోతిని మరల జ్యోతి యగునంతిగా ధ్యాత్మయం దుద్వాసనముచేయవల యును. అర్చ మొదలగు వానిలో నెప్పుడు దేనియందు శ్రద్ధ గలుగునో దానియం దపుడు న న్నర్చింపవలయును. మఱియు సర్వాత్ముం డగు నేను భూతములయందును దనయందును నెల

కొనియుండునట్లు భావింపవలయును. పురుషుఁడిట్లు వేదములం దును దంత్రములందును జెప్పఁబడిన క్రియాయోగమార్గ ములచేత నన్నర్చించి యిహమందునుఁ బరమందును దాను గోరినట్టి ఫలమును నావలనఁ బొందుచున్నాఁడు. శ క్తి గలి గినవాఁడు నాకు దృఢమైన మందిరమును గట్టింపవలయును. అందు నాప్రతిమను ప్రతిష్ఠాపించి రమణీయములయిన పుష్పో ద్యానములను బూజలను యాత్రలను నుత్సవములను జేయిం పవలయును. మహాపర్వములయందును ప్రతిదినమును బూజా దు లెడ లెగక జరుగుచుండుటకై యాపూజాదులకుఁగాను నారాధించు వారికో నాకో క్షేత్రములను బురములను గ్రామ ములను మాన్యములనిచ్చి నాతోడి సమానైశ్వర్యమును బొం దుచున్నాఁడు. నాప్రతిమను ప్రతిష్ఠించుటచేత సార్వభౌముఁ డగుచున్నాఁడు. మందిరము నిర్మించుటచేత ముల్లోకముల కధి పతి యగుచున్నాఁడు. పూజాదులచేత బ్రహ్మలోకమును బొం దుచున్నాఁడు. ప్రతిష్ఠాదులు మూఁటిని జేసిన యెడల నాతోడి సాధర్మ్యమును బొందుచున్నాఁడు. ఎవ్వఁడు ఫలాభిసంధిలేక న న్నిట్లు పూజించునో వాఁడు భక్తియోగమును బడయుచు న్నాఁడు. ఆభక్తియోగముచేత నన్నే పొందుచున్నాఁడు. ఎవ్వఁడు దేవతలకును బ్రాహ్మణులకును గల వృత్తులను దాని చ్చినవానినిగాని పరు లిచ్చిన వానినిగాని యపహరించునో వాఁడు వేలకొలఁదిసంవత్సరము లమేధ్యమును దినుచుండును. ఈ దానముగాని యపహారముగాని చేయువాఁడును జేయిం చు వాఁడును నందులకు దోడుపడువాఁడును వానియందు భాగముగలవారు గాన దానివలని ఫలము లనుభవింతురు. ఆ

ఫలమే పరలోకమందు వారికిమతిమతి పెచ్చుపెరిగిన దగును. ఇది యిరువదియేడవయధ్యాయము.

భగవంతుఁడు ముద్ధవునకు జ్ఞానయోగమును మరల సంగ్రహరూపమున వర్ణించుట.

భగవంతుఁడు——పరులకు స్వభావానుగుణముగా నిచ్చుట యో యపహరించుటయో యిత్యాదికార్యములు గలిగియుండ వచ్చును. కాని యందులకై వారిని స్తుతించుటయు నిందించు టయుఁ దగదు. ప్రకృతితోడను పురుషుని (జీవుని) తోడను గూడియున్న యీ ప్రపంచమెల్ల నంతర్యామి యైన నాకు శరీర భూతమై యున్నదని కనుఁగొనవలయును. ఎవఁడు పరుల స్వా భావికములగు కర్మములను బొగడుచును దెగడుచు నుండునో వాఁడు దేహము తీఱుఁగానే తనయాత్మాభిమానమును బట్టి స్వార్థంబగు జ్ఞానయోగమునుండిభ్రష్టుఁడగుచున్నాఁడు. దేహ మునకంటె నాత్మ వేఱయినదని తెలియమిచేత దేహమే యా త్మయని భ్రమించుట గలుగుచున్నది. అపుడు దేహమందున్న జీవుఁడు యెఱుకచెడి మృత్యువునకు సాటియు సూక్ష్మరూపము నగు ప్రకృతిచేత మఱుఁగుపడుచున్నాఁడు. అట్లు నానావిధ దేహములుగల యట్లుగా భ్రమించుపురుషుఁడును బ్రబుద్ధుఁడ యినను దత్త్వజ్ఞానము లేనందున నిదురపోయినవానితో సాటి యగుచున్నాఁడు. దేహములన్నియును దేవాదులవియైనను స్త్రీములవియైనను నొక్కరూపముననుండక ప్రకృతిచేత వికార ముల నొందుచునే యుండును. వాని కన్నిటికి నిమేషముగర్భము మొదలగు కాలకృతములైన యవస్థలును సమానములుగానే

యుండును. మఱి యవియన్నియు నాత్మకు వేఱైనవియగును. ఇట్లన్నియు నభద్రములైయుండఁ గొన్ని భద్రములనియు మఱి కొన్ని యభద్రములనియుఁబింతయేల? దేవాదిశబ్దములచే నా యాశరీరములు చెప్పఁబడుచున్నవి. మఱి యాయాశరీరములే యాత్మ యనియుఁ దప్పఁ దలంపఁబడుచున్నది. అట్టి దేవత్వము క్రిమిత్వము మొదలయినవి యాయా దేహములయందేయున్నది గాని యాత్మయందుఁగలుగవు. కనుక దేహములను బట్టి కాని యొక దానిని స్తుతించుటయు మఱొక దానిని నిందించుటయు యుక్తములు గావు. దేహమునకుఁ గల దేవాద్యాకారము లాత్మయందు లేవు గనుక నట్టి లేనివానియం దభినివేశమున్న మాత్రనే యనర్థము లెట్లు కలుగునందువా? ఒక నీడను జూచి రాక్షసుఁ డని భ్రమించినపు డది భయముకలిగించుచున్నది. అది తన నీడయే యని సరిగా గ్రహించినపు డట్లుగాదు. ఒక ప్రతిశబ్దము విన్నపు డది కొండగుహ యందలిబంతువు శబ్దముగాఁ దలంచినపుడు భయమును దన ధ్వనియే యని తెలిసినపు డది లేకపోవుటయుఁ గలుగుచున్నది. స్వప్న మందు బాధించునవిగాఁ గొన్నితోఁచుచున్నవి. ఆవి మేలుకొన్నప్పటి వానివలెనే భ్రమించుటవలన భయము గలిగించుచున్నవి. వట్టి కలలోని వని తెలియఁగా నట్లు గాకుండును. ఇట్లు రాక్షసత్వాదులు లేనివిగాన తమంతట ననర్థము లేనియుఁ గలిఁగింపఁజాలవు గాని వాని కలరూపును గ్రహింప నపుడు భయాదులను గలిగించుచున్నవి. అట్లే దేహాదులను వాని కలరూపునగ్రహింపక యాత్మగా భ్రమించిన యెడల నవి ప్రలయమువఱకును సంసారభయము గలిగించు

చున్నవి. ప్రపంచమంతయుఁ బరమాత్మయే యగును. మఱి యుఁ బ్రభుండును విశ్వాత్ముండు నగు నీశ్వరుఁడు సృజించుచును రక్షించుచును హరించుచు నుండుటయె కాక తానే చిదచిత్తుల రూపమున సృజింపఁబడుచును రక్షింపఁబడుచును సంహరింపఁ బడుచును నుండును. ఇట్లు ప్రపంచమునందుఁ గలవానిరూప ములనెల్లఁ బరమాత్ముఁడే యుండుటనుబట్టి "వానినుండి యాత్మ వేఱుగా నేర్పడినది; ఆ యాత్మనుండి యాజడము వేఱుగా నేర్పడిన'దని నిరూపించుటకు శక్యముగాదు. ఇట్లు పరమాత్మ యందు దానికంకె వేఱయినవస్తు వొకటి నిరూపించుట కల విగానందున నన్నివస్తువులు నతఁడే యగుటంబట్టి దేనినిగాని నిందించుట పొగడుట యుపేక్షించుట యనెడి యీ మూఁడును బ్రమాణశూన్యములు; వట్టి భ్రమరూపములు. ఈ జగమున కెల్ల నుపాదానము పరమాత్ముఁడే యైనచో దాని వికారము యాతనికిఁ గలుగునేయందువాఁ? నిందకును బ్రశంసకును నుపేక్ష కును విషయమైయున్న యీ జగమునప్రకృతిగుణములయిన సత్త్వాదుల వికారమే యని తెలియుము. కనుక వికారము లా గుణములతోఁ జేరినవే యగును. గుణమయమైన జగత్తు నకు నుపాదానము పరమాత్ముఁడెట్లన్నచో వాఁడు సంకల్ప రూపమున గుణములందుఁ బ్రవేశించి యుపాదాన మగు చున్నాఁడుఁ. ఇట్లతఁడు సర్వాత్మకుఁ డగుటవలన గుణము లందును జొచ్చియుండుటంబట్టి గుణమయమగు జగమును నతనిమయమే యగును గాన నతఁడు దాని కుపాదానమగుట విరుద్ధము కానేరదు. ప్రకృతిపురుషులు పరస్పరము విలక్షణుఁ లనెడిజ్ఞానమును పరమపురుషుఁడాయుభయమునకును విలక్షణుఁ

డనెడి విజ్ఞానమును గుశలముగా నెఱింగినవాఁడు దేనిని నిందిం పఁడు, స్తుతింపఁడు; మఱి సూర్యునివలె గుణదోషములను బాటింపక లోకమందు సంచరించుచుండును. బ్రహ్మ మొదలు గాఁ గీటమువఱకుఁగల దేహ సమూహమంతయును నుత్పత్తి మరణము లొందుననియును నాత్మకంటె వ్యతిరిక్తమైనవసియుఁ బ్రత్యక్షముచేతను ననుమానముచేతను నిగమముచేతను నాత్మ బుద్ధిచేతను దెలిసికొని దేనియందును ఏగుఁలు లేక యీ లోకమందుఁ జరింపవలయును' అనెను

ఉద్ధవుఁడు——ఈశా! ద్రష్టయగు నాత్మయును దృశ్యమగు దేహమును రెండును బరస్పరము విలక్షణము లగుటంబట్టి యిందు దేనికి సంసారము? దేనికి లేదు? అయినను సుఖ దుఃఖము లనుభవించుచుండుట ప్రత్యక్షముగాఁ గనఁబడు చున్నది. కాన సంసారము లేదనుటకును శక్యముగాదు. ఆత్మ తనంతట స్వభావముచేతనే శుద్ధుడు; ఒకనిచేతఁ గాక తనంతటనే ప్రకాశించుచుండువాఁడు. కర్మము లతని నావరింపవు. సత్త్వాదిగుణములకాశ్రయముగాఁడు. వాఁడుజన్మమరణాది వికారములు లేనివాఁడు. దేహమో జడము. ఇట్లు లాత్మయు దేహమును విజాతీయములై యున్నను రెండును, నగ్నియును దారువులుంబలెనే, కలసియున్నవి. అయినను జడము గాని యాత్మ తనంతటఁ బరిశుద్ధమగుటచేత, దానికి సంసారము గలుగనేరదు. అశుద్ధమైన దేహము జడనుగాన దానికి సంసారము గలుగఁజాలదు. కనుక నిందు సంసారము దేనికి? నని యడిగెను.

శ్రీభగవంతుఁడు—ఆత్మకు దేహాదులతోడ నెంతవఱకు సంబంధము గలదో యంతవఱకు దానికి సంసారావహములయిన దేవాదిరూపములు తనంతట లేకున్నను నున్నట్టివాని వంటివై యాత్మకు సుఖదుఃఖములు కలిగించుచుండును. ఏలన నా యాత్మ జేహమునకంకెఁ దాను విలక్షణమని తన స్వరూపమును దెలియనందున దానితోడి సంబంధమునొంది యజ్ఞాన్ని నొందుచున్నది. ఆత్మకు దేవమనుష్యాద్యాకారములు లేకున్నను నవి 'నేను స్థూలుఁడను. నేను గృహుఁడను. వీరు నా యాలుబిడ్డలు. వీరు నాకు స్వకీయులు. వీరినుకూలు'రని యిట్లు విషయములను జింతించుచుండువానికి సంసారము నివర్తింపదు. కల గినపుడు స్వప్నదేహము తన యాత్మ కాడనుట యెప్పియున్నను నప్పటి కాదేహమె యాత్మయనిభ్రమించుటవలన సుఖదుఃఖము లనుభవించుట గలుగుచున్నది గదా! అట్లే యాత్మకు దేవాదిరూపములు లేకున్నను నవి యున్న దలంచి విషయములను జింతింపఁగా సంసారము విడువక యనుభవింపవలసివచ్చుచున్నది. మేలుకొనినవానికి స్వప్నమె మిక్కిలి యసత్యము గలిగించుచున్నది. ఆస్వప్నమె దానినుండి మేలుకొన్నవానికి దేహాభిమాన మనెడుమోహామును గలిగింపఁజాలదు. దానిమూలమున సుఖదుఃఖములును గలుగనీయదు శోకమును హర్షమును భయమును గ్రోధమును లోభమును మోహమును స్పృహయు జన్మమును మరణము మొదలగు నవియెల్ల బ్రకృతి పరిణామమై యాత్మగానిదానిని నాత్మగా భ్రమింపఁజేయు నహంకారమువలనఁ గలుగునవే కానియాత్మకు స్వభావసిద్ధములుగావు. దేహము, ఇంద్రియములు, ప్రాణము,

మనస్సు, అభిమానము (ఆత్మ గాని దానియం దాత్మయనెడు భ్రమము), (కర్మానుష్ఠాతియగుటవలన)జీవుఁడును,గుణములును గర్మములును దనకు లోనై యుండు పరమాత్మయును, సూత్ర మగు మహత్తును, ననెడి వీనిసలన బహుప్రకారములు సంసా రము కాలవశమై ప్రవర్తించుచున్నది. మనస్సుచేతను వాక్కు చేతను ప్రాణముల చేతను శరీరముచేతను జేయంబడిన కర్మము వెక్కు దేహాదిరూపములచేత రూపింపఁబడుచున్నది. సంసా రమున కిది మూలము. దీనిని వేరు లేకుండునట్లుగా నాయుపా సన మెడతెగక చేయుటచే వాడివైన జ్ఞానమునడి కత్తిచేతఁ ద్రుంపఁబూనినవాఁడై శబ్దాదులయందుఁ దృష్ణవదలి శుభాశ్ర యమగు నావిగ్రహమును మనసము సేయుచు భూమియందు సంచరింపవలయును. వేఱువేఱుధర్మములచేత నాత్మకును దేహా మునకునుగల వేఱుపాటు తెలియునట్టి వివేకముచేతను తపము (కర్మయోగము) చేతను (శాస్త్రాధ్యయనమునలనఁ బుట్టిన జ్ఞానమగు) నిగమముచేతను 'నేను ఇది'యని యాత్మను దేహా మును వెలియు ప్రత్యక్షముచేతను, ఐతిహ్యము (ఉపదేశము) చేతను, అనుమానముచేతను, జ్ఞానమును సాధింపఁదగినది. *ఆ జ్ఞానస్వరూప మెట్టిదనఁగావినుము. ఈ దేహమునకు మొద టను గడపటను నేది శరీరరహితమై యుండునో యా యాత్మ స్వరూపమె దానికి నడుమనుగూడ నుండును. కాని శరీర మాత్మగాదు. భగవంతుఁడు దాను వెక్కులగునట్లు సంకి

---

* సంసారనివృత్తి కుపాయమైన యీజ్ఞానము ఇటట 'దేహమునకు మును పును వెనుకను నడుమను ననువర్తించునదై దానికి విలక్షణముగా నాత్మ స్వరూపముండు' ననుటను గూర్చినది.

ల్పించుకొన్న కామమె యిటువంటి యాత్మకు దేహసంబంధము గలుగుటకు నిమిత్త మని తెలియుటయే జ్ఞానము * పుటము చేఁ బరిశుద్ధమయిన బంగారము కటకమకుటాదులగు బంగారు నగలెన్నియైనను వెండి మొదలగువానితోఁ గూర్పఁబడుచున్నది. అది కటకమకుటాదులగుటకుఁ బూర్వమును, దానికిఁ బిదప ను, నడుమ రజతాదులతోఁ జేరి కటకాదులయి యుండునపుడును, 'నచ్చుము కలపడ'మని నానావిధములయిన పేళ్లనువ్యవహరింపఁ బడుచున్నది. ఇట్లచ్చపుబంగారు రజతాదులతోఁ గలసి నగలై యుండునపుడు గూడ బంగారమని చెప్పఁబడుచున్నది. అట్టియెడ దానిని బంగారమని వ్యవహరించుట భ్రాంతియె. నిరూపకులగువారు రజతాదులతోఁ గలియక మునుపును నగ్నియందుఁ బుటము పెట్టినపెనుకను గల యచ్చపుబంగారమునే బంగారమనునట్లు, నగలతోనడుమఁగూడియుండునపుడు నందలి యచ్చపుబంగారమునే బంగారమందురు గాని కలసియున్న రజితాదులను గూడ నట్లు చెప్పరు. అట్లు చెప్పకుండుట భ్రాంతిమూలముగాదు. అట్లె నే ననెడి యాత్మ దేహముతో సంబంధించుటకు మునుపును పెనుకను పెట్లో యట్లే నడుమ దేహముతోఁ గలసియుండునపుడును దేహవిలక్షణమైన దేకనుక దేహముతోఁ గూడి యుండినపుడు దానినిమాత్రము గాక దానితోఁ గూడియున్న దేహమును గూడ నే నని తలంచుట భ్రాంతియె యగును. ఇట్లటుఁగుటయుఁ బూర్వోక్తమగు

* ఇచట జ్ఞానము, ఆత్మ దేహముతోఁగూడియున్నపు 'డా దేహమును నే' ననుటచే భ్రాంతిరూపమని నిర్ణయించునదగును.

జ్ఞానమే. ఉద్ధవా! [1] కారణభూతమగు నింద్రియవర్గమును గార్య మగు శరీరమును గర్తయగు నహంకారము ననెడి మూఁడవ స్థలు గలదై త్రిగుణపరిణామ మైయున్న యచేతనము 'ఆత్మ దేహములోఁ పలనుండఁగా నింద్రియములు ప్రవర్తించుచున్నవి' యని యన్వయముచేతను 'ఆత్మ లోఁపలలేనిచో నింద్రియ ములు ప్రవర్తింప' వను వ్యతిరేకముచేతను నా మూఁడవస్థలు లేని తురీయమగు దేనిచేఁ బ్రవర్తించుచున్నదో యదియే యాత్మతత్త్వము. ఆ యాత్మ పరిణామములేనిది యని తెలియు టయె యావిజ్ఞానము. [2] శరీర ముత్పత్తికిఁ బూర్వమాత్మగాదు; లేక నశించినపిదపను నాత్మగాదు, రెంటికినడుమను నాత్మ గాదు. నేను స్థూలుఁడని యూరకే చెప్పికొనుటయె కాని యది భ్రాంతిమూలము. దేహమునకుఁ బూర్వమందును బిదపను గూడను నుండునదియుఁ బ్రమాణముచేఁ బ్రసిద్ధమునైన యాత్మతత్త్వమె యెప్పుడు నేకరూపమై యుండునని తెలియుట యే జ్ఞాన మని నామతము. [3] మఱియుఁ బ్రకృతికారమై రజోగుణ ముద్రేకించుటచేఁ బ్రవృత్తిస్వభావమై యున్న యీ సృజ్యపదార్థమగు శరీర మాత్మయందులేనిదైనను దానే యాత్మయని తోఁచుచున్నది. పరిశుద్ధంబగు జీవాత్మస్వరూ

---

1. ఇచట జ్ఞాన మన్వయవ్యతిరేకములచేత దేహాదులను ప్రవర్తింపఁజేయు చున్న దనుటను గుఱించినది.

2. ఇచట జ్ఞానము 'దేహము ఆత్మగా'దని నిశ్చయించుచున్నది.

3. పరిశుద్ధాత్మస్వరూపము దేహమును వీడి యవస్థాంతమటను విచారించు నదై యిచట జ్ఞానమున్నది. ఇట్టిజ్ఞానము సంసారమునకుమూలమైనదేహాత్మభ్రాంతిమానమును ఛేదించునదిగాఁ జెప్పఁబడినది. ఇట్లే తిక్కనఛేదకములను జెప్పి యీజ్ఞానము నుపసంహరించుచున్నారు.

పమో యీ దేహమును మరలిరాకుండునట్లు దిగవిడిచి స్వయం ప్రకాశమై వెలుంగును. ప్రకృతియో, యింద్రియ రూపములు శబ్దాదివిషయరూపము లనువికారము లొంది చిత్రముగా వెలయుచున్నది. ఇది యెఱుఁగుటయు విజ్ఞానమగును. ఇట్లుపర మాత్మ ప్రకృతిపురుషు లిరువురకంటె విలక్షణుఁ డని స్పష్ట ముగా నిర్ణయించుటకు హేతువులయిన జ్ఞానముల (విచార ముల) చేతను, ఇతరములగు దేహేంద్రియప్రాణాదులకు నాత్మత్వమును నివృణముగాఁ బోఁగొట్టుటచేతను తానే దేహ మనియు స్వతంత్రుఁడనియుఁగల మోహమునుఁజేదించి బ్రహ్మా త్మకస్వాత్మానుభవానందముచేఁ బరితుష్టుఁడై సమస్తకర్మజనుల తోడ సంగముగావింపకుండవలయును. పృథివీమయమైన యీ దేహ మాత్మగాదు. దేవతలని చెప్పఁబడు నింద్రియములును బ్రాణమును, వాయువును, జలమును, అన్నముచేత నాప్యా యితమగు మనస్సును, బుద్ధియు, నంతఃకరణమును, నహంకా రమును, నాకాశమును, ఆత్మగావు. ఇట్లు దేహము మొదలగు నవన్నియును సమముగాఁ బ్రకృతిపరిణామములై యున్నవి. ప్రకృతియె యాత్మకంటె వేఱైయుండఁగా దాని పరిణామము లయిన దేహాదు లాత్మ యెట్లగును? నాస్వరూపము వివిక్త ముగాఁ దెలిసికొన్న యాత్మకు సత్త్వాది గుణపరిణామము లగుచు యింద్రియము లెచ్చరిక గలిగియుండుటవలన సపూర్వ గుణ మేమి కలుగఁగలదు! ఆ యింద్రియములను విచ్చలవిడి నిగిడించినను దానికి దోషమేమి? సూర్యుని మబ్బులుగ్రమ్మినను భాసినను దానివలన సతనికొక దోషముగాని గుణముగానికలు గదుగదా? సూర్యునికిని మేఘములకును గూడిక గలుగదుగాన

వానివలస నతని కొకదోషమును గలుగదు. ఆత్మ కును నింద్రియములకును నట్లుగాదే యందువా ? వాయువు శోషింపఁజేసినను నగ్ని దహించినను జలము దడిపినను భూమి దుమ్ముగ్రమ్మినను ఆకాశము వాని గుణములచేతఁగాని మఱి ఋతు గుణములగు శీతోష్ణాదులచేతఁగాని లేపమునొందకుండు నట్లె,ప్రకృతి విలక్షణమును సదాయేకరూపమును నహంశబ్దవాచ్యమునగు నాత్మస్వరూపముగూడ సంసారమునకు హేతువులు గాఁదలంపఁ బడురజస్తమస్సత్త్వాదులతోడను వానికార్యములతోడను సంబంధింపదు. కాఁబట్టి, వారికిఁగాముకులతోడినంగమమున దోషముగలుగదు. అయిననుమనస్సునకుఁగషాయము వంటిదగు రజస్సును దాని కార్యములగు కామక్రోధములును దృఢమగునాభక్తియోగముచేత నిరసింపఁబడినంతవఱకును బ్రకృతిచేతఁగలిగింపఁబడు శబ్దాది విషయములందుసంగము లేకుండ వలయును.రజస్సును నిరసింపక భక్తియోగము పెరుఁగఁజాలదు. అట్టి భక్తియోగము నిష్పన్నమగుటకు దానికి విరోధియగు రజస్సునుదూలించుట, యుపాయముగానసంగములేనివాఁడై యుండ వలయును. మనుష్యులకు రోగము చక్కఁగాఁ గుదుర్పఁ బడని యెడల నది మరలమరల దేహమును బాధ పెట్టుచుండును. అట్లు యపక్వమగు కషాయమువలె విడిచి పుచ్చరానిదై యుపాయ విరోధియగు ప్రాచీనపుణ్యాపుణ్యకర్మము గలిగి యుండు చెడ్డ యోగికి మనస్సు విషయములందుఁ దగిలినదై యోగమునుండి భ్రంశము గలిగించుచున్నది. పరులపెంపును దేవతలు చూడనోపరుగాన వారు మనుష్యరూపములచేఁ గాముకులను సృజించిపంపుదురు. ఆకాముకులు వచ్చివిఘ్నములుగలిగింపఁగా

యోగులు పూర్వ మభ్యసించినవిషయవాసనల బలముచేత మరల యోగము ననుష్ఠింపరు; కర్మతంత్రమునే యనుసరించి సంసారమునఁ బడుదురు. జంతువు శరీరము పడి పోవువఱకును దనంతట నేదేని యొక కార్యముచేయుచును లేక మఱి యొకజంతువువలన దా నేదేని కార్యము చేయింపఁబడుచునే యుండుఁను. సంగమిట్టి యనర్థము గలిగించుచుండు నని తెలిసిన వాఁడు స్వానందానుభవముచేత విషయసులందలి యభిలాష మునుడిగి దేహమునం దేయున్నను దానియందునుండనివానివలె నేమిచేయుచున్నను జేయునట్టివాఁడే యగుచున్నాఁడు. వాఁడు బలుకుచున్నను వెంటఁబడుచున్నను బరుండియున్నను మూత్ర పురీషములు విడుచుచున్నను నన్నముదినుచున్ననుస్వభావమును నిట్టి చూచుట తాఁకుట మొదలగు నితరకార్య మేదేని చేయు చున్నను నాత్మయం దే మతి గలిగినవాఁ డగుటంబట్టితన దేహమును సంబంధించిన స్థితిగమనాది వ్యాపారములను నాత్మ ను సంబంధించినవిగాఁ దలంపఁడు. ఎఱుకగలవాఁడు స్రుతికూల ములగు శబ్దాది విషయములను మతిలెక్కిన శరీరమును,ననుకూలములగు శబ్దాదివిషయములను బెక్కింటిని జూచుచున్నను స్వప్నమునుండి మేలుకొనఁగా నఁదుఁ గన్నసదార్థముల నెల్ల మఱుఁగుపడుటనలన స్థిరములయినవని తలంపనియట్లు, వానినెల్ల ననిత్యములని యనుమానించుటచేత నిత్యములయిన విగాఁ దలంపకుండును. సత్త్వాదిగుణముల కనుగుణములుగా నుండు పుణ్యాపుణ్యకర్మములచేత నానావిధములై యుండు దేవ మనుష్యాది శరీరములను దేహాత్మాభిమానరూప మయిన యజ్ఞానమును జ్ఞానముపుట్టుటకు మునుపు నాత్మయం దవివిక్త

ముగా గ్రహింపఁబడినవి. అదియె మరల జ్ఞాన ముదయించిన పిదప నన్నుగుఱించిన జ్ఞానముచేత నివర్తించుచున్నవి. అప్ప డాత్మమరలమునుపటివలె నేనుస్థూలుఁడ'నిత్యాదులగు దేహాకా రములచేత గ్రహింపఁబడదు. అదిసంహారాదులనుబొందదు. సూ ర్యునియుదయము మనుష్యులకన్నులకుఁ గలఁచీఁకటినిదూలిం చునే కాని కలిగింపనట్లు, నన్నుగుఱించినజ్ఞానము గలుగఁగానే పురుషుని'నేను స్థూలుఁడ'నిత్యాదికమగు బుద్ధినిని దన్మూలమైన సంసారమునును, నాశనుఁ జేయుచున్నది. అపుడుపరిశుద్ధుండయిన యీజీవాత్మ స్వయంప్రకాశుండును జన్మాదివికారరహితుం డును బ్రత్యక్షాది ప్రమాణములచేఁ దెలియరానివాఁడును, న పరిచ్ఛిన్నమగు ధర్మాభూతజ్ఞానముగలవాఁడును, సర్వార్థము లను దెలియుజ్ఞాగము గలవాఁడును, నేకద్రవ్యమయుండును, బ్రాకృతదేహరహితుఁడును, దేవమనుష్యాది శబ్దములకువిషయ ముగాని వాఁడు నైయుండును. వీనిచేత నేకదా మునుపు వాగాదు లయిన యింద్రియము లును భూతాణములును బనులు చేయుచుండెను. దేహము ప్రకృతి నవలబించుటయు దేవాదులయిన యాకారములును దేనికిఁ గలుగఁ బ్రా యట్టి తన యాత్మను మఱచి కేవలజ్ఞానైక స్వరూపంబయిన యీయాత్మ యందు 'నేను దేవుఁడను మనుష్యుఁడను స్థూలుఁడను గృశుఁడ' నని యిత్యాది విధమున నభిమానము గలిగియుండుట యను నింత మాత్రమే యాత్మసమ్మోహ మగుచున్నది. అట్లు దేవ మనుష్యాది నామరూపములచేత గ్రాహ్యమును బంచభూత ములచే రచితమగుటంజేసి పంచవిధమును నగుదేహమును వివిధములగు స్వర్గాదిభోగ్యవిషయములను నిత్యమని తలంచుట

యు నాత్మసమ్మోహమగుచున్నది.అట్లైనేను దేవుఁడనుగృశుఁడ
ననెడి యీ రెండుదమ్ములఁబండితులుగాఁదలంచుకొను చుండువారికి
నర్థవాదమె. వాస్తవమునకు రెండును భ్రాంతిరూపము లని
తెలియునది. యోగము పరిపక్వము గాకున్న యోగికియోగము
చేయు చున్నపు డితని దేహమునకు రోగాదులయిన యుపద్రవ
ములు పుట్టి విఘాతముచేయుట కలదు. అపు డందులకుఁ బ్రతి
కార మిదివిధింపఁబడియున్నది.అదియేదనఁగా– సోమసూర్యాగ్ని
ధారణముచేఁ గొన్ని కాఁకలను జలుబులనును, వాయుధా
రణముతోఁ గూడిన యాసనములచేత వాతాదిరోగముల
నును,దపస్సుచేతను మంత్రముచేతను ఔషధములచేతను భూత
ములు గ్రహములు సర్పములు మొదలగు నుపద్రవములనును
నిర్వహింపవలయును. నన్నుధ్యానించుటవలనను సంకీర్తనాదుల
చేతనును మఱియుఁ దక్కినవానిచేతనును గామాదులను,
యోగనిష్ఠలగు సదాచార్యుల ననువర్తించుటచేత దంభము
మొదలగువానిని,నిట్లుశుభములయిన యుపాయములచేతనశుభ
ప్రదములగు విఘ్నము లను నాశముసేయవలయును. ఇట్లు
విఘ్నములను దూలించు యోగసును నిష్పన్నము గావించు
కొనవలయును. కొండఱు ముదిసినశరీరమును సైతము
మంత్రౌషధాదు లయిన వివిధోపాయములచేత మిక్కిలి పటు
తరమైనదికావించుకొని కాయసిద్ధికొఱకై, యద్వంద్వపర
కాయప్రవేశాదులకై యోగము నాచరించెదరు. అదిప్రాజ్ఞులగు
వారించుకయు నాదరింపఁ దగినదిగాదు. అట్లు దేహము స్థిరము
గానుండుటకై పడు వాట్లన్నియు దేహమంతయుగలదిగాన నిష్ఫల
మే యగుచున్నది. ఇంద్రియపాటవ మెంత యుండినను నా

యువు మంత్రౌషధాదులచేత నొనఁగూడి రానేరదుగదా! కనుక దేహమును దృఢము గావించుటకై కాలమును బుచ్చుటను దిగవిడిచి యా కాలమును యోగమునకై వినియోగింపవలయును. నృత్యమునందలిబంధువలె దేహ మాతముగలదిచుమీ. ఇట్లు యోగము నిత్యమును మిక్కిలి యనుష్ఠించుచుండువానికిఁ గాయము మిక్కిలి పటుత్వమునొందెనేని, మతిమంతుఁడగువాఁడు యోగమును దిగవిడిచి మత్పరుఁడై యాకాయ మట్లు దృఢముగా నున్నదని దాని స్థిరిని యెంతమాత్రము నమ్మరాదు. యోగియగువాఁడు యోగచర్యనను ష్ఠించుచు నన్ను శరణముగా నాశ్రయించి, యణిమాదుల యందు స్పృహలేక నాకు శేషమై యుండు తనయాత్మయందలి సుఖము ననుభవించుచుండును గానయట్టివాఁడంతరాయముల చేత విభూతి మెంతమాత్రము నొందకుండును జుమీ. ఇది యిరువదియెనిమిదవయధ్యాయము.

{*భగవంతుఁడుద్ధవునకు మరల సంగ్రహముగా, భక్తియోగమును వర్ణించుచున్నాఁడు.}

ఉద్ధవుఁడు—అచ్యుతా! అనాత్మయగు వానికి నీయోగచర్య మిక్కిలియు దుష్కరమయిన దని తలంచుచున్నాను. కనుకఁ బురుషుఁడు సులభముగా సిద్ధి నొందు ప్రకారమును నాకుఁ జెప్పుము. పుండరీకాక్షా! శ్రీకృష్ణా! మనస్సును వశీకరించు కొనుచును గాఁబట్టి మనస్సును నిగ్రహించుటకై యుపవాసాదులుండి చిక్కి మనస్సెప్పటికిని సమాధా

* ఇందుఁ జెప్పినదే కాక మరల మొదటియధ్యాయమునందును భక్తియోగమును సంగ్రహముగాఁ జెప్పుట తెలియుచున్నది.

నము నొందక యోగులు తఱచుగాఁ గీడ్పడుచున్నారు. కనుక యోగచర్య మిక్కిలీయ దుష్కరముగా నున్నది. కాఁబట్టి సారాసారములు వివేచించి తెలిసికొనువారు కొంద ఱానందమును బిడుకునట్టి నీపదారవిందమును హాయిగా నాశ్ర యింతురు. విశ్వేశ్వరా ! వారు తమ యోగకర్మములకు గర్వ పడకుందురుగాన నీచేత వంచింపఁబడ కుందురు. తక్కిన వా రన్నలో విజ్ఞులీగుచు విభూతము నొందుదురు. అచ్యుతా! ని న్నాశ్రయించిన మాత్రముననే నీ వీ మాయనుండి నుమ్ము దాఁటించుటయు నిన్నే శరణొంది యుఁడు నీదాసులకు నీ వధీనుఁడవై యుండుటయు, అశేషబం ధూ ! నీయం దొక చిత్రముగాదు. ఏ లందువా? తమంతట నీశ్వరులై యుఁడు బ్రహ్మాదిదేవతలు తలతల మెఱయుచున్నతమ కిరీటముల మొసలచెనీపాదపీఠమునకునొత్తుడుగలిగించుచుందురు. నీ వట్టివాఁడయ్యు బృందావనమునందు నీ పిల్లంగ్రోవికిఁజిక్కి వచ్చిన మృగములతోఁ గూడి మాడి యుండుటకు నిష్టపడిన వాఁడవుగదే. ఇఁక నీభక్తులగు మనుష్యులకు లోనయియుం డుట చెప్పనలయునా ? ఇట్లు పరత్వమును వాత్సల్యమును సౌలభ్యమును సౌశీల్యమును గలిగి సకలమయినయాత్మలకును బ్రియతముఁడై స్వామియై యాశ్రితులు గోరినపురుషార్థముల నెల్ల నిచ్చుచుండు నిన్ను, నీవు చేసినయుపకారము నెఱింగిన మనుష్యుఁడెవఁడు విడుచును? పురుషుఁడెవఁడు తన్నుఁదానే మఱచునట్లు చేసెడి యైశ్వర్యమును గోరి నిన్నుఁదప్ప మఱి యొకదైవమును భజించును? ఆరోగ్యాదులకు సూర్యాది దేవతాంతరములనుభజింపరాదా యందువా? నీపాదపద్మముల

ధూళిని సేవించుచుండు మాకు శ్రేయమేది గలుగదుగా కోరిన వన్నియుఁ గలుగుచుండఁగా నితరదేవత లెందులకుగా ఈశా ! బ్రహ్మాదులు లగువారు నీవు చేసినయుపకారమును దలంచుకొని మిక్కిలి యుబ్బుచుఁ దమకానందము వెచ్చువెరుఁగఁగా నీకుఁ బ్రత్యుపకారము బ్రహ్మాయుష్య మంతకాలమునకుఁ జేయుటకు శక్తులుగాకున్నారు. నీవు వెలుపల నాచార్యరూపమునను,లోప ల హృదయమందు మేము చింతించుచున్నరూపమునను, నెల కొని దేహధారులకుఁ గల యశుభమును నూలించుచు నీరూపు ను మాకు వెలువఱుచు చున్నావు' అనెను.

శ్రీశుకుఁడు—ఇట్లుద్ధవుఁడు మిక్కిలి మనస్సునం దనుర మోదు నడుగఁగా, జగమంతయుఁ దన కాటబొమ్మగాఁగల యా దేవుఁడు, తన సృష్టిస్థితి సంహారశక్తులచేత బ్రహ్మ విష్ణు శివమూ ర్తులు మూఁటిని దాల్చు నాప్రభువు, ఈశ్వరులగు బ్రహ్మాదుల కును నీశ్వరుండయిన యాభగవంతుఁడు, సొగసయిన చిఱునవ్వు తోఁ బ్రేమ దొలఁకుపలుకుల నుద్ధవున కిట్లనియె. శ్రీభగవం తుఁడు—'ఓయీ ! నాభాగవతధర్మములను మిక్కిలి మంగళ కరము లయిన వానిని బెక్కింటిని నీకుఁ జెప్పెదను వినుము. ఆధర్మముల శ్రద్ధతో ననుష్ఠించిన యెడల మిక్కిలి జయింపరాని దియు మృత్యురూపము నయిన సంసారమును మనుష్యుఁడు జయించుచున్నాఁడు. వర్ణాశ్రమోచితము లయిన కర్మముల నెల్ల మదారాధనరూపములుగా ననుసంధించుచును మనస్సును జిత్తమును నాయం దర్పించి క్రమముగా వానిని జేయుచుండ వలయును. అట్టి వాఁడు నాధర్మముల కొఱకే తన మనోవృత్తి నంతయుఁ జెల్లించుచుండవలయును. మద్భక్తి లగు సాధుజను

లుండు నట్టి పుణ్యదేశములను సేవింపవలయును. దేవతలయం
దును నరులయందును మనుష్యులయందును నాభక్తులెవరో
వారిచరితములనుగూడ సేవింపవలయును. జనులు వేఱువేఱు
గానియొక్కటిగాఁగూడికాని నాకొఱకు నృత్తములు గీతములు
వాద్యములు మొదలయిన మహారాజోపచారములతోడ
యాత్రలనును మహోత్సవములనును జేయింపవలయును.
నిర్మలాంతఃకరణుఁడు లోపలను వెలుపలను నంతటను నాకాశ
మును జూచునట్లు, నేను సర్వభూతములయందును దనయం
దును లోపలను వెలుపలను నావరణములేక వ్యాపించి యున్న
పరమాత్మునిఁగాఁగనుఁగొనవలయును. ఇట్లునేను సర్వమున కంత
రాత్ముఁడనై వర్తించుచుండుటంబట్టి మహాద్యుతీ! సమస్తభూత
ములును నేను లేకనిలుపోపవుగాన నా శరీరముగాఁ దలంచుచుఁ
దానినిబట్టియే వాని నెల్ల బహుమానించుచు, సమస్త భూత
ములయందును వైషమ్యము లేకుండునట్టి జ్ఞానము నాశ్ర
యించినవాఁడగుచున్నాఁడు. బ్రాహ్మణునియందును బుల్క
సునియందును, బ్రాహ్మణధనము నపహరించువానియందును,
బ్రాహ్మణలయందు భక్తిగలవానియందును, సూర్యునియందు
ను, మిడుఁగుఱునందును, సర్వభూతహితము సేయువానియం
దును, సర్వభూతములకు ద్రోహియగువానియందును, వీఁడు
బ్రాహ్మణుఁడు వీఁడు చండాలుఁడని యెక్కువతక్కువలు తలంపక
యందఱను సమానముగాఁ గనుఁగొనువాఁడే పండితుఁడని
యెన్నఁబడుచున్నాఁడు. ఏలనఁగా వీరందఱశరీరములును ప్రకృ
తిపరిణామములే. వీరి యాత్మ లన్నియును జ్ఞానైకాకారములే.
వీరిదేహములును నాత్మలును రెండును బరమాత్మునికి శరీరమే

కావున నందఱును సమానులనియె పండితుఁడగు వాఁడు తలం చును. మనుష్య లందఱును మదాత్మకులని మాటికిఁ దలంచు నట్టి పురుషునకుఁ గలహమును నసూయయును నవమానమును నహంకారమును దనయందుఁగాని పరులయందుఁగాని త్వరిత ముగానే నివర్తించుచున్నవి. 'సమస్తభూతములను నిన్నుగా భావించుట దృఢముగానుండిన నేకదాకలహాదు లుడిగిపోవును. అట్టి భావనమును సంపాదించువిధ' మెట్లందువా? గ్రామమృగ ములలోశునకమువఱకును, మనుష్యులయందుఁ జండాలురవఱ కును బళువులయందు గాడిదలవఱకును, మఱి యితరజాతుల యం దాయానిహీనము లగువానివఱకును, గల సమస్తమున కును దండమువలెఁబడి మ్రొక్కుచుండవలయును. అప్పుడు బంధువులు పరిహసింతురేని యట్లు నవ్వుచున్న తనవారిని దిగ విడువవలయును. మఱియు నే నెక్కువ వీఁడు తక్కువ యను గర్వమును మానవలయును. అప్పటికినా దేహమెక్కుడు నానిది తక్కువయని యనుసంధింపఁగా లజ్జ కిలుగుచున్నదేని, దేహ మునుగూర్చియా లజ్జయును దిగవిడచి, జీవుని శరీరముగాఁ జేసి యతనియందంతరాత్ముఁడై భగవంతుఁడు ప్రవేశించియున్న వాఁ డుఁ గాన సర్వము నీశ్వరశరీరమే యని తలంచి మ్రొక్కవల యును. ఇట్లు సమస్తములయిన భూతములందును నేననెడి భావము మిక్కిలి దృఢముగాఁ గలుగ కుండునంతవఱకు, సర్వ భూతములనుజూచి 'భగవత్తేజమః' యని వాక్కునను చ్చరించు చును, 'ఈశ్వరుఁడు జీవశరీరకుఁడై భూతములందుఁ బ్రవేశించు చున్నా'డని మనంబునఁదలంచుచును, గట్టినలెఁబడి దేహము చేత మ్రొక్కుచును నిట్లు మనోవాక్కాయ వృత్తులుమూఁటి

ఁోడి నుపాసింపవలయును. ఇట్లుపాసించుచుండువానికి సమస్త మును బ్రహ్మోత్మకమే యని దృఢతర మగు నధ్యవసాయము గలుగుచున్నది. ఇట్లుసర్వమును భగవదాత్మకమనెడి బుద్ధిచేత నన్నిటిని గనుగొనుచుండఁగా నీపురుషుఁడు 'ఆత్మయే దేహమా? లేక దేహమునకంటె వేఱా? జీవుఁడు స్వతంత్రుఁడా? పరమాత్మునకుఁ బరితంత్రుఁడా?' యనెడియిట్టి సంశయములను వీడి సంసారమునిమిత్తములయినవాని యన్నింటినుండి విముక్తు డగుచున్నాఁడు. సమస్తభూతములందు నేనే యని మనో వాక్కాయవృత్తులు మూఁటిచేతను మద్భావము గలిగి యుండుట యనునదియె సమస్తములయిన యుపాయము లందును మిక్కిలి సమీచీనమైనదని నామతము. ఉద్ధవా! ఇట్లు సర్వమును బ్రహ్మోత్మకముగా నుపాసించుట యనెడి యీ నాధర్మము నుపక్రమించినచో దానికి ఫలము లేక నశించుట గలుగదని *నా నిశ్చయము. ఏలనఁగా ధర్మముపక్రమించిన మాత్రమున నప్పటికో కాలాంతరముననో గుణత్రయ సంబం ధమును దొలఁగించుచుండును. దానినే నిష్కామముగా ననుష్ఠించినయెడ దానికి ఫలనాశము గలుగదని చెప్పనేల? లోక మం దాయావ్యాపార మూరక తలంచుచున్నంతమాత్రము గాని కనుమూసినంతమాత్ర ముండునది గానియైనను మిక్కిలి యాయాసకరమైనదిగా నుండినను నిష్ప్రయోజనమే యగు చున్నదిగదా. అట్టివానిని బరమపురుషుఁడగునాయందు ఫలాభి

* ఇదియె గీతయందు 'సహికల్యాణకృత్కశ్చిద్దుర్గతిం తాత గచ్ఛతి' అనియు 'నేహాభి క్రమనాశోఽస్తి ప్రత్యవాయో నవిద్యతే' అనియుఁ దెలియునది.

సంధిని విడిచి మదర్థముగా ననుసంధించినయెడల నవి ధర్మమే (యనగా ఫలమును వీడనిదే) యగుచున్నవి. ఎట్లనఁ గంసుఁడు భయముచేతను, గోపిక లనురాగముచేతను, శిశుపాలుఁడు ద్వేషముచేతను ఫలమునొందరా? అనిత్యమగుమనుష్య శరీరముచేత నిత్యుఁడును స్వభావముచే నిర్వికారుఁడును నగు నన్నుఁ బ్రాప్తించుటకు వలయుసాధనములను సమర్థించుటయే బుద్ధిమంతులకుఁ గలబుద్ధి (అధ్యవసాయము); ఇదియె మనుష్యునకుఁగల మనీష (హితాహిత వివేకము) వేదాంతసిద్ధము లగు నర్థములకెల్ల సంగ్రహ మిదియె, దీని నీకు విస్తరించియు సంక్షేపించియు సంపూర్ణముగాఁ జెప్పితిని. ఇది దేవతలకు సైతము పొందరానిది చుమీ; నీకుఁ దత్త్వత్రయ వివేచనరూపమును నీశ్వరోపాసనరూపము నగు జ్ఞానమును ప్రకారమును మిక్కిలి స్పష్టములగు యుక్తులతోఁగూడ మాటిమాటికిఁ జెప్పితిని ఈ జ్ఞానమును గలరూపునఁ దెలిసి పూర్వోక్తములయిన సంశయములను వీడిన పురుషుఁడు ముక్తినొందుచున్నాఁడు. నీవడిగిన దానిని నేను జక్కఁగా వివేచించి యుపపాదించితిని. దాని నెవఁడు మనస్సునందుఁ దాల్చునో వాఁడు సనాతనమగువేదాంత రహస్యమును బరబ్రహ్మము నగుననున్నుఁ బొందుచున్నాఁడు. ఎవఁడు దీనిని నా కనుకూలురయినవారియందు మిక్కిలియుఁ బుష్కలముగా నుపదేశించునో యీ బ్రహ్మోపదేశము చేసినవానికి నన్ను నేనే యిచ్చుకొనుచున్నాను. ఆత్మకుఁబరిశుద్ధి గలిగించునదియు వినువారికిని శుచిగావించునదియు నయిన దీని నెవ్వఁడు పఠించునో వాఁడు ప్రతిదినమును బెరుఁగుచున్న జ్ఞాన దీపముచేత (అనఁగా యోగ పరిశుద్ధమైన మనస్సు

చేత) నన్ను సాయుజ్యప్రాప్తికిఁ బ్రతిబంధకము లగువాని నెల్ల విడిచి శుద్ధుఁ డగుచున్నాఁడు. ఏ నరుఁడుదీనిని సమాహితుఁడై శ్రద్ధతోడ నిత్యమును వినుచున్నాఁడో వాఁడు నాయందలి భక్తిని గలిగించుకొనుచు నా ప్రాప్తికిఁ బ్రతిబంధకములగు కర్మములచేత బద్ధుఁడుగాక యుండును ఉద్ధవా! సఖా! నీకు బ్రహ్మమును దానికి సాధనములనుజక్కఁగా దెలిసినవా! తెలియనియెడల మరల నుపదేశించెదను. దేహాత్మభ్రమాదిరూప మగు మోహము వీడినదా? తాపత్రయము వలనను జ్ఞానము లేమివలనను నీ మనస్సునఁబుట్టిన శోకము దూలినదా? నీవు దాంభికుఁడగువానికిని నాస్తికునకును మూర్ఖునకును వినవలెనని యిచ్ఛలేనివానికిని భక్తుఁడు గానివానికిని దుర్వినీతుఁ డగువానికిని, దీని నొసంగవలదు. ఈ చెప్పంబడిన దోషములు లేనివానికిని, బ్రాహ్మణులయెడ మంచివానికిని, దన యందుఁ బ్రీతి గలవానికిని, బరుల కుపకరించు వానికిని జెప్పవలయును. శూద్రుఁడు గాని స్త్రీగాని శ్రద్ధ గలిగియున్న యెడవారికిని జెప్పనచ్చును. తెలియఁగోరినవానికి దీనిని తెలిసినపిదప నిఁక దెలియవలసిన దొక్కటియుఁ గలుగదు. తియ్యని యమృతమును గ్రోలినపిదపఁ ద్రాగవలసినది మజ్జిగయుఁ గలుగదుగదా. (ఆత్మోపాసన రూపంబగు) జ్ఞానమందును కర్మమందును యోగమందును కృషియందును (సామాన్యోపాయ రూపమగు) దండ ధారణమందును ధర్మార్థ కామమోక్షము లని నాలుగువిధము లయినపురుషార్థము లెంతెయున్నదో * యంత

---

* జ్ఞానమందు మోక్షమును, కర్మమందు ధర్మమును యోగమం దణిమాదిరూపమయిన కామమును, కృషియందును దండ ధారణమందును అర్థమును

యు నాయనా! నీవంటి భక్తునికి నేనేయగుదును. ఇట్లను గ్రహింపఁగోరుచున్న నాకునట్టివాఁడు దనయాత్మను సమర్పించు కొనిదానిని రక్షించుభారము నాయం దిడి నాకారాధనములు గాని కర్మములనెల్లఁ ద్యజించినవాఁ డగుచున్నాఁడు. అపుడు నాచేత ముక్తినిబొంది తనకు స్వభావసిద్ధములయిన యపహత పాప్మత్వాదులు పొడసూపుటకుఁ బాత్రుఁ డగు చున్నాఁడు; మఱి నుత్తాధర్మ్యమును బొందుచున్నాఁడు' అనెను.

శ్రీ శుకులు—భగవంతుఁ డిట్లు న్యాసోపాసనరూప మగు జ్ఞానయోగ మార్గమును జూపఁగా నుద్ధవుఁ డా యుత్తమ శ్లోకునివచనమునువినిచేతులు మోడ్చి యానందాశ్రువులచే డగ్గు త్తికవడి కన్నీరు కన్నుంగవను గ్రమ్ముచుండఁగా నొక్కటియుఁ బలుకకుండెను. రాజా! అంత నతఁడు ప్రణయముచేతఁ గలం గిన మనస్సు మెల్లగా ధైర్యముచేతఁ గుదురుపఱిచి వశము చేసికొని తన్నుఁ గృతకృత్యునిఁగాఁ దలంచుచుఁ దన శిరసుచేత యదుప్రవీరుఁడయిన యాకృష్ణు పాదారవిందములను ముట్టుచు 'బ్రహ్మజనకా! నన్నాశ్రయించినమాయా మనెడి మహాంధ కారము నీసన్నిధానమువలనఁ దఱుమఁగొట్టఁబడినది. సూర్యుని సమీపమును బొందినవారికి శీతముగాని చీఁకటిగాని దాని వలన భయముగాని కలుగునా? నీ సన్నిధానమాత్రము చేతనే యా చీఁకటి తొలఁగింపఁబడినను నీవను గ్రహించి విజ్ఞాన మనెడు దీపమును నీ భృత్యుండనగు నాకర్పించితివి. ఇట్లుప కరించుచున్నవాఁడవని నిన్నుఁ దెలిసినపురుషుఁ డెవఁడు నీ పాద

న్నవి. ఈ చతుర్విధపురుషార్థములు భక్తునకు భగవంతుఁడే యని భావము.

మూలమునువిడిచి మఱియొకరిని శరణుఁజొచ్చునా? దాశార్హు లందును వృష్ణులందునునంధకులందును సాత్వతులందునుసంసారము వృద్ధినొందుటకై నీవు నీ మాయచేత మిక్కిలి దృఢమైన స్నేహపాశమును వైచితివి. ఆ పాశమును నీవే యాత్మజ్ఞానమనెడి కత్తిచేతఁ ద్రుంచితివి మహాయోగీ! నీకు నమస్కారమగుఁగాక, నిన్ను శరణుఁజొచ్చితిని. నీ చరణారవిందమునందు నా కనురాగమును మైనభక్తి యెప్పుడు నెడతెగకుండునట్లుగా ననుగ్రహింపుమ' డనెను.

శ్రీభగవంతుఁడు— ఉద్ధవా! నే నాజ్ఞాపించినట్లు నా యాశ్రమంబగు బదరికావనమునకుఁ బొమ్ము. అచ్చట నాపాదతీర్థమయిన గంగయందలి జలములందు స్నానముచేసి యాచమించి శుచివై యా గంగదర్శనముచేత సమస్తమయినకల్మషములను బాఱఁజిమ్మి వల్కలములనుదాల్చి వనమునం బుట్టు కందమూలఫలాదులనుభవించుచు నాత్మానుభవసుఖముచేత విషయాభిలాష మాని ద్వంద్వమాత్రములగు శీతోష్ణాదులను సయించుచు నాగ్రవము మొదలయిన స్వభావముతోఁ గూడి బాహ్యము లగు నింద్రియముల నడంచి యంతరింద్రియములను గూడ గెలిచి తత్త్వత్రయస్వరూపవివేచనరూప మగు విజ్ఞానమును బ్రహ్మోపాసనరూప మగువిజ్ఞానమును బుద్ధి సమాధానముచేతఁ బడసినవాఁడై నేను నీకు వేఱు వేఱ స్పష్టముగా బోధించినదానిని మనస్సునందు దృఢముగా నెలకొలుపుచు నా యందు వాక్కును నిలిపి (నా గుణనామములను వాక్కుచేఁ గీర్తించుచు) మనస్సునునిలిపి కాయముచేత న్నాధిం

చుచు నుండి ప్రారబ్ధము ముగియఁగా * సాత్త్విక రాజస తా మసము లనెడి మూఁడుగతులను గడచి 'యా ప్రకృతిమండల మున కివ్వల నున్నవాఁడును నిత్య ముక్తులచేత ను భవింపఁబడుచున్నవాఁడు నగు నన్నుఁ బొందఁగలవు' అనెను. సంసారబుద్ధినెల్ల హరించునట్టి యాభగవంతుఁ డిట్లు చెప్పఁగా నుద్ధవుఁడతనికిఁ బ్రదక్షిణముగావించి పాదములయందు శిరసిడి ప్రియ సంయోగవియోగములకు హర్ష శోకములు రెండును లేకుండువాఁడయ్యును నాహారిని విడిచిపోవునపు డాభగవంతుని యందు మిక్కుటమగుచున రాగమువలన హృదయము కరం గఁగా నశ్రుబిందువులు దొరఁగినవాఁ డయ్యెను. భగవంతుని యందలి స్నేహమును దిగవిడుచుట మిక్కిలియుఁ గష్టమైనది. అట్టి హరి నెడఁబాయఁగలుగుటకు భయపడి దీనుఁడై యతనిని విడనాడి పోవఁ నాళ్లాడక మిక్కిలి సంకటమునొందెను. అంత నతఁడు భర్త పాదుకలను మాటి మాటికి శిరసునందుఁ దాల్చుచు నమస్కరించి వెడలిపోయెను. ఆమహాభాగవతుఁ డుద్ధవుఁడంత నా భగవంతుని హృదయమందు ధ్యానముచేత నెలకొల్పి యా జగదేకబంధుఁ డానతిచ్చిన ప్రకారము బదర్యాశ్రమమునకుఁ బోయి యచ్చట నా కరుణాసముద్రుఁడు తన కుపదేశించిన ప్రకారము తపస్సును సలిపి హరిగతిని బొందువాఁడయ్యెను. యోగీశ్వరు లెవ్వనిపాదములను సేవింతురో యా భగవంతుఁడుహరి నిరతిశయానందమగు పరబ్రహ్మ స్వరూపమును దెలుపు వేదాంతసముద్రము నుండి యెత్తి నదియు భాగవతుం డగు నుద్ధవునకుఁ జెప్పినదియు నైన యీ

* 'ఊర్ధ్వంగచ్ఛన్తి సత్త్వస్థాఃఁ' ఇత్యాదు లిట ననుసంధించునది.

భాషితమునునాజ్ఞానమనెడియమృతము వర్షించుదానిని, బురు షుఁడెవ్వఁడుసేవించుచుండునో యట్టి వానినిసంబంధించినజగత్తు కూడవిము క్తినొందును. ఇఁకనతఁడు విము క్తుడగుటచెప్పనేల? ఊపిరిచేతనకలనిగమములును వెలిపుచ్చినభగవంతుఁడుజ్ఞానవిజ్ఞా నసారమునున మృతతుల్యమునగు వేదసారమును వేదాంతసము ద్రమునుండి యెత్తి తనభృత్యవర్గమునుద్ధరించిన వాఁడయ్యె; అట్టి యాద్యుండును విష్ణుసంజ్ఞుండునగుపరమపురుషునికిమ్రొక్కి నవాఁడ నయ్యెదను. ఇది యిరువదితొమ్మిదవయధ్యాయము.

{బ్రాహ్మణశాపమువలన యదువులుపరస్పరము కలహించి నాశమునొందుట. బలరామనిర్యాణము.}

పరీక్షిత్తు—అంత మహాభాగవతుండయిన యుద్ధవుఁడు బదరికావనమునకు వెడలిపోయినపిదప భూతభావనుఁడయిన భగవంతుఁడు హరి ద్వారకయందేమి గావించెను? ఆయాదవ సింహుఁడు బ్రాహ్మణశాపముచేతఁ దనకులము కీడ్పడినపుడు సమస్తేంద్రియములకును మిక్కిలిప్రియమైనతనదేహమును నిందే విడిచెనా? లేక కూడఁ దీసికొనిపోయెనా? పూఁబోఁడ్లవ్వని దేహమునందుఁ దగిలిన చూపులను మరలఁ దివిచికొనఁ జాలరయిరో, యెవ్వనిరూపము వినికిచేతఁ గర్ణరంధ్రములందుఁ బొచ్చి సత్పురుషుల హృదయములందుఁ జిత్తరువు వ్రాసినట్లు నిలిచి యందుండి వెలువడిపోవకుండునో యెవ్వని దేహకాంతి కీర్తించుచుండుట కవులవాక్కుల కింపు గూర్చుచుండునో, దేనిని యుద్ధమునం దర్జునినిరథమునం దుండఁగా జూచి వాతులైనవారు దానినామ్యమును బొందిరో యట్టిదేహము నేమి చేసెను? అని యడిగెను.

శ్రీశుకుఁడు—కృష్ణుఁడు భూమియందును దివియందును నంతరిక్షమునందును బొడసూపినట్టి పెద్ద యుత్పాతములను జూచి యప్పుడు నుద్ధర్తాసభయం దాసీను లై యున్న యదువులతో 'యదునందనులారా! మన ద్వారకయం దివిగో ఘోరము లయిన మహోత్పాతములు పెక్కు కనఁబడుచున్నవి. ఇవి నాశహేతువులయినవి. ఇం దిఁక ముహూర్తమునే పయినను మన ముండరాదు. మన స్త్రీలును బాలురును వృద్ధులును నిచటనుండి కదలి శంఖోద్ధారమునకుఁ బోదురుగాక. మనము ప్రభాసమునకుఁ బోవుదము. అందుఁ బ్రత్యగ్వాహినియైన సరస్వతి సముద్రమును బ్రవేశించుచున్నది. మన మందు స్నానము చేసి శుచులమై యుపవసించి మిక్కిలి సమాహితులమై దేవతలను నభిపేచనముల చేతను జందన చర్చలచేతను బూజోపకరణములగు కుసుమాక్షతాదులచేతను బూజింతము. మహాభాగులయిన బ్రాహ్మణులను, మనము గోవులను భూములను బంగారములను వస్త్రములను, గజములను నశ్వములను రథములఁను గృహములను నొసంగి పూజించి వారిచేత శాంతికర్మము చేయించుకొందము. ఈవిధియె యరిష్టములెల్లఁ బోఁగొట్టునది; మఱి యుత్తమంబగు మంగళకరము. దేవతలను బ్రాహ్మణుల గోవులను బూజించుట యారాధించువారికి మిక్కిలి యభ్యుదయకరము' అనెను.

శ్రీ శుకులు—ఇట్లు కృష్ణుండు చెప్పినదానిని యదువృద్ధులందఱును విని యట్లె యని యియ్యకొని తోడలచే సముద్రమునుదాఁటి రథములెక్కి ప్రభాసతీర్థమునకుఁ బోయిరి. అచ్చట యాదవులు భగవంతుఁ డానతిచ్చినట్లు పరమంబగు

భక్తితోడ సమస్తములయిన శ్రేయములతోడ గూడిన కర్మములను ముఱియు భగవంతుఁడుచెప్పని శ్రేయములతోడఁ గూడిన వానిని గావించిరి. అంతవా రచ్చట దైవముచేత బుద్ధులు దూలినవారగుటచేత మిక్కిలి చవియైన మైరేయక మను మద్యమును ద్రావిరి. ఆరసములను ద్రాగఁగా మతి యంతయుఁ దూలిపోవుచున్నది. వారు వీరులయినను భగవం తుఁ డగు కృష్ణుని మాయచేత మూఢులగుటవలన మిక్కిలి మద్యపానముచేసి మత్తులై మనస్సులందు విభ్రమగుటచే వారికి నడుమఁ బెద్దకలహముపుట్టెను. పిదప వారు సముద్రతీరమునం దొకరి నొకరు చంపఁబూని కోపముచేత సంరంభించి విండ్లను గత్తులను బల్లెములను గుదియలను దోమరములను ఋష్టులను గొని యుద్ధముచేసిరి. వారు పతాక లల్లలాడుచుండురథములను నేనుంగులను గాడిదలను లొట్టియలను నెద్దులను బత్తెలను మను ష్యులను గఁ చరిగాడినలను గూడి యొండొరులపయిని దలపడి యేనుఁగులు దంతములచేత సడవిని బాఁడుచేయునట్లు, బాణ ములచేత మిక్కిలియు మదించియున్నవారిని వధించిరి. ప్రద్యుమ్నుఁడును సాంబుఁడును అక్రూరుఁడును భోజుఁడును అనిరుద్ధుఁడును సాత్యకియును సుభద్రుఁడు సంగ్రామజిత్తును సుచారుఁడును గదుఁడును సుమిత్రుఁడును సురథుఁడును మచ్చరము పెచ్చుపెరిగి యొకరి నొకరు తెలపడిరి. మతి తక్కినవారగు నిశఠుఁడు సుల్లకుఁడు మొదలగువారును సహస్ర జిత్తు శతజిత్తు భానుఁడు మొదలగువారును కృష్ణునిచేత మిక్కి లియు మోహితులగుటవలన మది మనుచీఁకటి క్రమ్మఁగా నొకరినొకరు మార్కొని హతులం గావించిరి. దాశార్హులను

వృష్ణులును నంధకులునుభోజులును సాత్వతులునుమధువులును అర్బుదులును మాధురులును,శూరసేనులును,వితర్జనులును, కుకురులును, కంతులును మంచిమనస్సువిడిచి యొకరినొకరు కొట్టుకొని కూలిరి. పుత్రులును దండ్రులును సహోదరులును మేనల్లుండ్లును గూతుల కొడుకులును బిన్నతండ్రులును మేనమామలును నొకరినొకరు చంపిరి. ఇట్లు * మిత్రులతోడ మిత్రులును సుహృదులతోడ సుహృదులును జ్ఞాతులతోడ జ్ఞాతులును మూఢులై తలపడిచంపిరి,బాణములన్నియుఁదఱిగి, విండ్లన్నియు విఱిగి, యాయుధములెల్ల వ్యయమైనపిదప వారు పిడికిళ్లయం దచ్చట నున్న యేరకలను బెఱుకఁ గొట్టసాగిరి. అవి వారి పిడికిళ్లయందుఁ బట్టుకొనఁగా, వజ్రములవంటి పరిఘము లాయెను. కృష్ణుఁడు వలదని యెంతవారించుచున్నను వారు వినక యొకరినొకరే కాక కృష్ణునిఁగూడఁ గొట్టసాగిరి. వారా కృష్ణుని బలభద్రునిని దెలివిదూఁలి శత్రులుగాఁదలఁచుచు వారిని గొట్ట నిశ్చయించి యాతతాయులై వారిపయినిఁబడిరి. అంత నాయుద్ధమును మిక్కిలి క్రుద్ధులై పరిఘములుగ నున్న యేరకల పిడికిళ్లను నెత్తికొని తిరుగుచు యుద్ధమున వారిని జంపిరి. కృష్ణునిమాయచేత మనస్సు మోహితమునై దానిచేత బ్రాహ్మణశాపమునఁ గీడ్పడియున్న వారుగాన వారికి మచ్చరమువలనఁ గ్రోధముపుట్టి, వెదుళ్ల యొరయికవలనఁ బుట్టిననిప్పు వనము నంతయు దహించునట్లు, కులక్షయమును బొందించెను. ఇట్లు తనకులమువా రందఱును నశింపఁగా హరి తా నొక్కఁడు

---

* మిత్రులనఁగా సమానవయస్సును బట్టి పరిస్పరహితము గోరువారు. సుహృదులనఁగా వయస్సు సమానముగాకున్నను నట్లు హితముఁగోరువారు.

మాత్రముమిగిలి యఁడి భూమి భాగమును దింపిదైనదని తెలఁ చెను. రాముఁడు సముద్రతీరమందుఁ బరమపురుష ధ్యాన రూప మగు యోగమును నూఁది తన స్వరూపమగు సంకర్షణుని యందుఁ దనసంకర్షణాంశము నొక్కటిగాఁ గూడినట్లు ధ్యానించి మనుష్యరూపమును బరిత్యజించెను. దేవకీ సుతుఁడు భగవంతుఁడు రాముని నిర్యాణమును దెలిపి యంత భూతలమున నొక మట్టిచెట్టుక్రింద మౌనియై కూర్చుండెను. అప్పు డతఁడు చతుర్భుజములు గల రూపమును దాల్చెను. ఆరూపము ధగధగమెఱయుచున్న తన ప్రభచేతఁ బాగలేని యగ్నివలె దిక్కులఁ చీఁకట్ల నెల్లఁ బాపుచు వెలుంగుచుండెను; శ్రీవత్సమను మచ్చగలిగి మేఘమువలె నల్లనై మేలి యపరంజి కాంతిని దులఁకించు పట్టుపుట్టములు రెండు దొడిగి మిక్కిలియు మంగళమై ప్రకాశించుచుండెను. మతియు నది సాగనైచిఱు నవ్వ్వగులుకు ముఖారవిందము గలిగి నల్లని ముంగురులచే నలం కృతమై తెల్ల తామరలవలెఁ జెలువయిన కన్నులతోను నల్లలా డుచున్న మకరకుండలములతోను గండరించుచుండెను. అది మొలనూలును జందెమును గిరీటమును గడియములును బావా పురులును హారనూపురములును సంగుళీయకములును గౌస్తు భమును గలిగి వెలుఁగుచుండెను. అతని దేహమందు వన మాలిక వెలయుచుండెను. ఆయుధము లెల్లఁ దమ తమమూ ర్తులు ధరించి యాతనిని బలసియుండెను. అతఁడు తామర వలె నెఱ్ఱనయిన డా కాలిని గుడితొడపయి నిడికొని కూర్చుండి యుండెను. అప్పుడు జర యనెడి యొక వేఁటకాఁడు ముసల మందు మిగిలిన యినుపదునియలతో నొక బాణము ను

గావించుకొని యాకృష్ణుని చరణము మృగమువలెఁ దోఁచినం దున మృగమని శంకించి యాబాణమును గాఁడనేసెను. అంత వాఁడు దగ్గఱి చతుర్భుజములతోఁ గూడి యున్న యాపురు షునిఁ జూచి యతని యెడ నాకల్బిషము చేసినందులకు భయ పడి యాహరినురాంతకుని పాదములయందుఁ దలసోక వ్యాలి 'మధుసూదనా! పాపాత్ముఁడగు నేను దెలియక యిట్లుచేసితిని. ఉత్తమశ్లోకా ! అనఘా ! కాఁబట్టి నాపాపమును తొలఁగింపఁ దగును ఎవ్వని యనుస్మరణము పురుషుల కజ్ఞానమునెడి చీఁక టిని తోకార్చునందురో యట్టి విష్ణుఁడగు నీకుఁ బ్రభూ! నే నీయపరాధము గావించితిని. కాఁబట్టి పాపాత్ముఁడయిన యీమృగముల వేఁటకానిని, వైకుంఠా! మరల నిట్లు సజ్జనులకుఁ దప్పుగావింపకుండునట్లుగా వేవేగ చంపి పుచ్చుము. బ్రహ్మ రుద్రాదులును బ్రహ్మపుత్రులును వేదార్థములను గనుఁగొనువారు ను నీయాత్మసంకల్పముచేతఁ బరిగ్రహించిన యీరూపమును, నీయవతార రహస్యమును దెలియరు. ఏలనఁగా వారు నీమా యచేతఁ గన్నులు గప్పంబడి యుండుదురు. అట్టి వారికిని దెలియరాకున్న యీ నిరూపరహస్యమును నసద్గతులగు మే మెట్లు నిర్ణయింపఁగలము' అనెను.

భగవంతుఁడు—'జరా! భయపడకుము, లెమ్ము. ఇవి నా యిచ్ఛచేతనే కలిగినది చుమీ. నీవు నాయానజ్ఞచేత ను కృతాత్ములపదవియగు స్వర్గమును బొందు'మనెను. ఇట్లు కర్మము చేతఁగాక తన యిచ్ఛచేత శరీరమును దాల్చిన యాభగవం తుఁడు కృష్ణుఁ డానతియ్యఁగా, నతనికి ముమ్మాఱు ప్రదక్షి ణముచేసి దేవతలు పంపిన విమానమెక్కి దేవలోకమునకుఁ

బోయెను. దారుకుఁడును గృష్ణుఁ డున్న చోటును వెదకుచు వచ్చితులసివాఁడు వాసనలతోఁ గూడియున్న వాయువును మూర్కొనియతఁ డది వచ్చినచోట నుండునని యూహించి గాలి కభిముఖముగాఁ బోయెను అట్లుపోయి యచ్చట నతిశయించిన కాంతితోఁ గూడి మూర్తులు ధరించిన యాయుధములు బలసి యుండ మత్తిచెట్టుక్రింద వసతిఁగొని యున్న పతిని జూచి రథమునుండి గొబ్బునఁ గ్రిందికి దూకి మనస్సునందు నెయ్యము పొంగారఁ గన్నులయందు బాష్పములు గ్రిమ్మ నతని యడుగులపయినిబడెను. అట్లు పడి యతనితో 'ప్రభూ ! నీచరణారవిందములను జూడలే కుండినందున నాచూపు చెడి చీఁకటియందుఁ బడినది. కాఁబట్టి రాత్రియందుఁ జంద్రుఁడు మఱుఁగు నడఁగా నెట్లో యట్లు నాకు దిక్కులు తెలియకున్నవి. నా మనస్సునఁ కూఱటగలుగకున్నది' యనెను. ఇట్లా సారథి పలుకుచుండఁగా గరుడధ్వజము గల యారథమును రాజీం ద్రా ! దారుకుఁడు చూచుచుండఁగానే, యశ్వములతోను ధ్వజముతోను నాకాశమున కెగసెను. దాని వెంట విష్ణుదేవుని యస్త్రములును నాయుధములును బోయెను. అందులకు మనస్సునందు మిక్కిలి యాశ్చర్యపడిన యాదారుకునితో జనార్దనుఁ డిట్లనియె— 'సూతా! నీవు ద్వారకకుఁ బొమ్ము. పోయి జ్ఞాతులు పరస్పరము వధించుకొనుటయు బలరాముని నిర్యాణమును నాస్థితినిని బంధువులకుఁ జెప్పుము. ద్వారకయందు మీరును మీబంధువులు నీఁక నెంత మాత్రము నిలిచి యుండఁగూడదు. ఆపుకమును నేను విడిచిన పిదప సముద్రము ముంచివైవఁగలదు. మీరు మీ మీదేహానుబంధులనును మా

తలి దండ్రులగు దేవకీవసుదేవులను నెల్లవారిని బిలుచుకొని యర్జునుఁడు కావుదలయై వచ్చుచుండఁగా నింద్రప్రస్థమునకుఁ బొండు. నీవు భాగవతధర్మము ననుష్ఠించి మద్భక్తియోగమందు నిమగ్నలిగి శబ్దాది విషయముల నుపేక్షించి యీజగత్తు నా మాయచేత రచింపఁబడిన దని యెఱింగి రాగాదులచేఁ గలుష మొందక (శాంతిని వహించి) యుండుము' అనెను. ఇట్లతఁడు చెప్పఁగా దారుకుఁ డతనిని వలగొని మాటి మాటికి నమస్కరించుచు నతని యడుగులు శిరసునందు మోపుకొనుచు మనంబున దుఃఖము మల్లడి గొనుచుండ ద్వారకాపురమునకుఁ బోయినవాఁ డయ్యెను. ఇది ముప్పదియవయధ్యాయము.

{శ్రీకృష్ణ నిర్యాణము. వసుదేవాదులును బరలోకమున కేగుట.}

శ్రీశుకులు— అంత నక్కడికి బ్రహ్మయు శివుఁడును భార్యతియు నింద్రుఁడు మొదలగు దేవతలును మునులును మరీచి మొదలగు ప్రజాపతులును పితృదేవతలును సిద్ధులును గంధర్వులును విద్యాధరులును నురగులును జారణులును యక్షులును రక్షస్సులును గిన్నరులును నప్సరసలును గరుడులును భగవంతుని నిర్యాణమును జూడఁ గోరి మిక్కిలి కుతూహలముతో హరి కర్మములను జన్మమును బొడుచును గీర్తించుచును వచ్చిరి. వారు మిక్కుటమయిన భక్తిగలవారై తమ విమానములచే నాకాశమంతయు నెరసి పెరసి యుండఁ బుష్పవర్షములు గురిసిరి. భగవంతుఁడును దనకు విభూతులయిన యా బ్రహ్మాదులను జూచి తా నవతరించిన యాత్మయందుఁ దా నేకీభవించి నట్లుగా ధ్యానించి తామరరేకులవంటి కన్నులంగవను మొగి

డ్చెను. ఆదేవుఁడు ధారణాధ్యానములకు శుభాశ్రయభూత మును నిట నుపాసించి ముక్తు లయిన వారికి మనోహరము నయిన తనదేహమును నాగ్నేయియగు యోగధారణచేత * ద హింపకయే యాదేహముతోనే తనధామమగు వైకుంఠమును సుఖముగాఁ బ్రవేశించినవాఁడయ్యెను. అపుడు దివియందు దుం దుభులు మ్రోగెను. ఆకాశమునుండి పువ్వులు గురిసెను. భూ మి నుండి సత్యమును ధర్మము ధృతియుఁ గీర్తియు నాదేవు ని వెంటఁ బోయినవి. కృష్ణుఁ డట్లు తనగతి యెవ్వరికిని దెలియ కుండ, నిజధామమును బ్రవేశించుటను బ్రహ్మ మొదలగు దేవ తలు చూడనేరక మిక్కిలి యాశ్చర్యభరితులయిరి. మొఱపుఁ దీఁగ యాకాశమందు మేఘమండలమును విడిచి పోవునపుడు దానిగతి మనుష్యులకుఁ దెలియనట్లు కృష్ణునిగతియు దేవత లకుఁ దెలియరాదయ్యెను. బ్రహ్మరుద్రాదులుహరియోగగతిని జూచి మిక్కిలి విస్మితులై యతనిని బొగడుచుఁ దమ తమ నెలవులకుఁ బోయిరి. రాజా! పరమపురుషుఁడు యాదవాది దేహ ధారుల యందుఁ బుట్టుట మరణించుట యనెడి యీచేష్టలు నటునివేషములవలె వట్టి మాయావిడంబనమే యగు నని తెలి యుము. ఆపరమపురుషుఁడు చిదచిదాత్మకమయిన యీజగత్తు నుసృజించి దీనిలోపలఁ జొచ్చి వెలుపల ననతాకారములచే విహా రించి రెండు పరార్ధములు మాగిసినపుడు జగమునంతయు సం హరించి స్వానుభవవిషయ మగు మహిమచేత జగద్వ్యాపార

* స్వచ్ఛంద మృత్యువులగు యోగులు తమదేహము నాగ్నేయి యగు ధారణచేతదహించి లోకాంతరములు బొందుదురు. భగవంతుఁ డట్లుదహిం పకయే పొందెనని భావముభావ్యము.

మును నుడిగి యూరకుండును. అట్టి యపారమహిమునికి నిది యెంత మాత్రము! ఈయవతారమందే యెవఁడు యమలోకమునకుఁ బోయిన గురుపుత్రుని వాని మర్త్య దేహముతోనే మరలఁ దీసికొనివచ్చెనో యెవఁడునీతెల్లికి శరణ్యుఁడై బ్రహ్మాస్త్రము చేత దగ్ధుఁడవగు నిన్ను (పరీక్షిత్తుని) రక్షించెనో, యెవఁడు మృత్యున్నకు మృత్యువయిన రుద్రుని బాణాసురయుద్ధమునందు జయించెనో, యెవఁడు వేటకానిని దేహముతోడనే స్వర్గమునకుఁ బంపెనో, యాభగవంతుఁడు తానెవరికిని దెలియకుండఁబోవుటకుసమర్థుఁడు గాఁడా? ఈశ్వరుఁడు తానశేషశక్తులను ధరించివాఁడయ్యును, గావునసే జగమున కెల్ల జన్మస్థితినాశములు వఱియొకరి నపేక్షింపక తానే చేయువాఁడయ్యును, దనదేహమునుమాత్ర మిచ్చటనే మిగిలియుండు నట్లు చేయనొల్లఁడయ్యెను. ఏలన నాత్మస్వరూప మందు నెలకొని యుండు యోగికి మరణశీలమైన శరీరముచేతఁ బురుషార్థమేమియులేదనియు నుత్పత్తి గలదాని కెల్లఁ గాలాంతరమునందైన మృత్యువుగలుగుననియు, గనుక దీనితోఁ బనియేమి యనియుఁ దెలుపుకొఱకే యతఁడా దేహమును నిలుపక కొనిపోవుటకునిష్టపడెను. ఎవఁడు ప్రాతఃకాలమున లేచి కృష్ణుఁడు పొందిన యుత్కృష్టమైన యీ గతిని భక్తితోడఁ బ్రయతుఁడై కీర్తించునో వాఁడాతనియుత్తమగతి యగు వైకుంఠమునేపొందుచున్నాఁడు. దారుకుఁడు ద్వారకకుఁ బోయి వసుదేవుని పాదములను నుగ్రసేనుని పాదములను బడి కృష్ణు నెడఁబాసినందునకు సైపక యశ్రువులచేఁ దడిపెను. రాజా! అతఁడు వృష్ణులెల్లనుఁ బూర్ణముగా హతులగుటను జెప్పెను. అది విని యక్కడ

నున్న వారందఱును హృదయములు భయమొంద శోకంబున మూర్ఛిల్లుతులైరి. అంత వారు కృష్ణవియోగమునకు విర విరఁ బోవుచు, జ్ఞాతులు మొగముల నిటునటు గొట్టుకొనుచుఁ బ్రాణములు వీడి పడి యున్న చోటికిఁ ద్వరితముగాఁ బోయిరి. దేవకియు రోహిణియు వసుదేవుఁడును గృష్ణునిని రామునిని జూడలేక శోకార్తులై తెలివిదప్పి యాభగవంతునితోడివిరహమునకు సైఁపక ప్రాణములను దిగవిడిచిరి. ఆయాస్త్రీలు తమతమపతుల దేహములను గౌఁగిలించుకొని చితనారోహించిరి.రామునిపత్ని లతని దేహమును గౌఁగిలించికొని యగ్నిఁ జొచ్చిరి. వసుదేవుని పత్ని లతనిదేహమును గౌఁగిలించియుఁ బ్రద్యుమ్నాదులను వారివారి పత్నులు గౌఁగిలించు కొనియు నగ్నిఁ జొచ్చిరి. కృష్ణపత్నులు రుక్మిణి మొదలగు వారు మనస్సులతసియందే నిలిపి యగ్నినిజొచ్చిరి. అర్జునుఁడు తనకనుఁగుచెలికాఁడయిన కృష్ణుని విరహమునకు దుఃఖితుఁడై కృష్ణగీతములచేతను సజ్జనులగు లితరుల యూఱటమాటలచేతను ద న్నూరార్చు కొన్నవాఁడయ్యెను. అర్జునుఁడు సంతానము లేక నశించిన యా బాంధవులకు విధ్యుక్తముగా వరుసచొప్పున పిండోదకదానాదికర్మములు చేయించెను. హరి దిగవిడువ గానే ద్వారకను సముద్రముఱ్ఱణమాత్రమున ముంచివైచెను. అయినను నది శ్రీమంతమగుభగవంతుని గృహమునుమాత్రము విడిచిపెట్టెను. అచ్చట భగవంతుఁడు మధునూదనుఁడు నిత్యమును స్మరించిన మాత్రమున సమస్తములైన యశుభములను నపహరించుచున్నహితుఁడై యుండును. కాన యది సమస్తమంగళములయందును మంగళమై యొప్పుచుండును. అర్జునుఁడు బాలికలును వృద్ధులు నగు

స్త్రీలును నందఱును జీవంగా మిగిలిన వారిని దోడుకొని యింద్రప్రస్థమును బ్రవేశించి యందు (భగవత్సంకల్పము చేత నశింపక మిగిలియున్న) వజ్రుడను వానిని నభిషేకము చేసెను. రాజా! నీ పితామహులయిన ధర్మరాజాదులు బంధువులెల్ల హతులగుట నర్జునునివలన విని నిన్ను వంశోద్ధారకునిఁగా నిలిపి యందఱును మహాప్రస్థానమునకు బోయిరి. దేవదేవుఁడయిన విష్ణుని యీ కర్మములును జన్మమును మనుష్యుఁడెవ్వఁడు శ్రద్ధతోడఁ గీర్తించుచుండునో వాఁడు సర్వపాపములనుండి విడివడుచున్నాఁడు. ఇట్లు భగవంతుఁడగు హరి యెత్తిన మనోహరములయిన యవతారములను నతని వీర్యములు దెలుపు చేష్టితములను బాల్యపౌగండ యౌవనచరిత్రములను నితర పురాణములందును నీ పురాణమందును విన్నవానిని మిక్కిలి మంగళావహము లగువానిని మనుష్యుఁడు కీర్తించుచుఁ బరమ హంసులకు గతి యగు భగవంతునియందుఁ బరంబయిన భక్తిని బొందుచున్నాఁడు. ఇది ముప్పదియొకండవ యధ్యాయము.

శ్రీ మహాభాగవతమున నేకాదశస్కంధము

సమాప్తము.

శ్రీ రామనంద్రార్పణమస్తు.

శ్రీరుక్మిణీ సత్యభామాసమేత శ్రీగోపాలకృష్ణ పరబ్రహ్మణేనమః.



శ్రీ శుభమస్తు.

శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః.

శ్రీమద్భాగవతము.

ద్వాదశస్కంధము.

పరీక్షిత్తు—— మునీ! యదువంశె భూషణుఁడయిన శ్రీకృష్ణుఁడు తన ధామమునకు వేంచేసిన పిదప భూమియందుఁ జెప్పఁబడిన యదువంశమువారిలోను జంద్రవంశమువారిలోను నెవ్వని వంశము పరంపరగాఁ బ్రవర్తించెనో నాకు వివరింపు' మని యడిగెను.

శ్రీశుకులు—— రాజా! మగధరాజగు బృహద్రథుని వంశమందు మార్జారి యనువాని కడపటికొడుకు పురంజయుఁడును వాడు పుట్టఁగలఁడుఁ వాని మంత్రి శునకుఁ డనువాఁడు తన స్వామిని వధించి యతని పుత్రుఁడగు ప్రద్యోతనుని రాజుగాఁ జేయఁగలఁడు. అతనికి నలకుఁడును నలకునకు విశాఖపుత్రుఁడును విశాఖపుత్రునకు రాజకుఁడును రాజకునకు నందివర్ధనుఁడును బుట్టుదురు. ఆనందివర్ధనునకుఁ బ్రద్యోతనులను రాజులయిదుగురు పుట్టుదురు. ఈ రాజులందఱును భూమిని నూటముప్పది యొనిమిది సంవత్సరము లనుభవింతురు. ఆప్రద్యోతనులకు శిశునాగుఁడును నతనికిఁ గాకవర్ణుఁడును నతనికి క్షేమధర్ముఁడును నతనికి క్షేత్రజ్ఞుఁడును క్షేత్రజ్ఞు

నకు విధిసారుఁడును విధిసారునకు నజాతశత్రుండును నజాతశత్రు నకు దర్భకుండును దర్భకునకు నజయుఁడును అనజయునకు నంది వర్ధనుఁడును, నందివర్ధనునకు మహానందియుఁబుట్టుదురు. ఈశిశు నాగులు మొదలగు రాజులు కలియుగమందు మున్నూట డెబ్బదియేండ్లు భూమిని ననుభవింతురు. రాజా! మహానందికి శూద్ర స్త్రీ గర్భమందు బలవంతుఁడగు మహాపద్మపతి యను పుత్రుఁడు పుట్టును. వాఁడే నందు డనఁబడును. వాఁడు క్షత్రి యులనెల్ల నాశముచేయును. ఆనందునివలననుండి శూద్ర ప్రాయులును నధార్మికులు నగు రాజులు పుట్టఁగలరు. ఆమహా పద్ముఁడును తన యాజ్ఞ యప్రతిహతముగా భూమినంతయు రెండవ పరశురాముని వలె నేకచ్ఛత్రముగాఁ బాలింపఁ గలఁడు. అతనికి సుమాల్యుఁడు మొదలయిన పుత్రు లెనమండ్రుపుట్టఁ గలరు. ఆ రాజు లీ భూమిని నూఱుసంవత్సరములు పరిపాలింపఁ గలరు. ఒకానొక బ్రాహ్మణుఁడు (కౌటిల్యవాత్స్యాయనుఁ డను వాఁడు) తన్నీ*తొమ్మండ్రు నందులును నమ్మియుండఁగా వారిని నాశము చేయఁగలఁడు. అట్లానందులు లేకపోవఁగా మౌర్యులు కలియుగమునందు భూమిని ననుభవింపఁగలరు. ఆతొమ్మండ్రను నాశముచేసిన ద్విజుఁడే మౌర్యుఁ డను పేరుగల తన పుత్రునిఁ జంద్రగుప్తుని రాజ్యమున కభిషేకము సేయును. ఆ చంద్ర గుప్తునికి వారిసారుఁడును వారిసారునకు నశోకవర్ధనుఁడును అశోకవర్ధనునకు సుయశుఁడును సుయశునకును సంగతుఁడును సంగతునకు శాలిశుకుండును శాలిశుకునకు సోమశర్ముఁడును

---

* తండ్రియగు నందుఁడును వీనిపుత్రు లెనమండ్రును జేరి తొమ్మండ్రు నందు లనఁబడిరి.

సోమశర్మునకు శతధన్వుఁడును శతధన్వునకు బృహద్రథుఁడును బుట్టిరి. ఈ మౌర్వరాజులు పదుగురును గలియుగమందు భూమిని నూటముప్పదియేడు సంవత్సరము లనుభవింపఁగలరు. ఆ బృహద్రథుని సేనాని యగు పుష్యమిత్రుఁడు స్వామినిజంపి రాజ్యము సేయఁగలఁడు. అతని కగ్నిమిత్రుఁడు నగ్నిమిత్రునకు సుజ్యేష్ఠుఁడును, సుజ్యేష్ఠునకు వసుమిత్రుఁడును, వసుమిత్రునకు భద్రకుఁడును, భద్రకునకుఁ బులిందుఁడును, బులిందునకు ఘోషుఁడును, ఘోషునకు వజ్రమిత్రుఁడును బుట్టఁగలరు. ఆ వజ్రమిత్రునకు భాగవతుఁడును, భాగవతునకు దేవభూతియును బుట్టుదురు. అగ్నిమిత్రాదులు తొమ్మండ్రును శుంగు లీపదుగురును నూటపండ్రండేండ్లు భూమిని ననుభవింతురు. అంత నీ భూమి గుణహీనులయిన కాణ్వులను బొందఁగలదు. అంత శుంగుండయిన దేవభూతి స్త్రీలోలుఁడై యుండఁగా నతనిమంత్రియను గాణ్వుఁడు నగు వసుదేవుఁడనువాఁడతనిని జంపి తానే రాజ్యమును జేయఁగలడు. అతని పుత్రుఁడు భూమిత్రుఁడు, భూమిత్రునకు నారాయణుఁడు పుట్టును, నారాయణునకు సుశర్మ్ముఁడుపుట్టును. వసుదేవాదులయిన యీ కాణ్వులు మున్నూటనలువదియై దేండ్లు భూమిని గలియుగమం దనుభవింపఁగలరు. కణ్వుండగు సుశర్మ్ముని వాని భృత్యుఁడగు బలీకుఁడగువాఁడు చంపి భూమిని గొంతకాలమే యనుభవించును. అతఁడాంధ్రజాతివాఁడు వాఁడు సత్తముఁడుగాఁడు వాని తమ్ముఁడగు కృష్ణుఁడు రాజుకాఁగలఁడు. వానికి శ్రీ శాంతకర్ణుఁడును, శాంతకర్ణునకు పౌర్ణమానుఁడును, పౌర్ణమానునకు లంబోదరుఁడును, లంబోదరునకును జివిలకుండును, జివిలకునకు

మేఘస్వాతియు, మేఘస్వాతికి నటమానుఁడును, అటమానునకు ననిష్టకర్ముఁడును, ననిష్టకర్మునకు హాలేయుఁడును, హాలేయునకుఁ దలకుఁడును తలకునకుఁబురుషభానుఁడును బురుషభానునకు సునందనుఁడును, సునందనునకుఁజక్రోగుఁడునుబుట్టుదురు. వారియం దుఁగడపటివాఁడు శివస్వాతి. వానికి గోమతియు గోమతికిఁ బురీమంతుఁడును వానికి మేదశిరుండును మేదశిరునకు శివస్కంధుఁడును శివస్కంధునకు యజ్ఞశ్రీయును యజ్ఞశ్రీకి విజయుఁడును విజయునకు జంద్రవిజ్ఞుఁడును, చంద్రవిజ్ఞునకు సలోమధియును బుట్టుదురు. ఈ వలీకులను రాజు లీరువదియేగురును సన్నూట యెనుబదియాఱు సంవత్సరములు భూమిని ననుభవింతురు. అవ భృత్యులనెడు తొమ్మండ్రభీరజాతులు గలుగుదురు. పిదప గర్దభు లనువారు పదుండ్రురాజులగుదురు. పిదపఁగాముకులగు కంకులను పది యాఱుగురు రాజులగుదురు. తరువాత యవను లెనమండ్రును దురుష్కులు పదునాలుగురును మురుండులు పదుమువ్వురును మౌనులు పదునొకండ్రును రాజులగుదురు. వీరిలోఁ దప్పఁ దక్కిన రాజులును భూమిని వేయిం దొంబదితొమ్మిది సంవత్సరము లనుభవింతురు. పదునొకండ్రు మౌనులు మున్నూఱుసంవత్సరము లనుభవింతురు వారు మరణించిన పిదపఁ గిలింకిలయను పురమునందు భూతనందుఁడు యవనవారుఁడు శిశునందుఁడు వాని తమ్ముఁడు యశోనందియుఁ బ్రవీరకుఁడు ననెడి యీ రాజులు టయాఱుసంవత్సరము లుందురు, వారికిఁ బదుమువ్వురుపుత్త్రులు బాహ్లీకు లనువారు గలుగుదురు. పిదపఁ బుష్యమిత్త్రుఁడు రాజగును. వానికి దుర్మిత్త్రుఁడు పుట్టును. ఆంధ్ర్య లేడుగురును గోసలు లేడుగురును వైదూరపతులును

నిషధులును, ననువా రాయాపేరుగల చిన్నచిన్న మండలము
లకు రాజులగుదురు. వీ రంద ఱించుమించుగా నేకకాలము
వారు. వీ రందఱును బాహ్లీకులవలననుండి పుట్టినవారు. అంత
మగధరాజులలో విశ్వస్ఫూర్జియనువాఁడు పుట్టఁగలఁడు. వాఁడు
పూర్వము చెప్పఁబడిన పురంజయునికొఱకు మిక్కిలి ప్రసి
ద్ధుఁడు. వాఁడు బ్రాహ్మణాదివర్ణములను బులిందులు యదువులు
మద్రకులనెడి మ్లేచ్ఛప్రాయులను జేయఁగలఁడు. ఆ దుర్మతియిట్లు
చేసి ప్రజలను ద్వైరాజ్యలంతగా లేకుండునట్లుగాఁ బాలింపఁ
గలఁడు. వాఁడు వీర్యవంతుఁడై తీరకులమును నిర్మూ
లము గావించి పద్మావతీయను పురమందుండి గంగాద్వారమా
మొదలుకొని ప్రయాగపర్యంతముగల భూమిని బాలించి
యనుభవింపఁగలఁడు. పిదప సౌరాష్ట్రమందును నవంతియందు
నాభీరదేశమందును సర్బ్బదమాలవములందును గల బ్రాహ్మ
ణులు శూద్రప్రాయులై యుపనయనాది సంస్కారదూరులై
యుందురు. సింధుతటమునుజంద్రభాగానదితీరమును గౌంతిదేశ
మును గాశ్మీరమండలమును నుపనయన సంస్కారములేని
బ్రాహ్మణులు గలవారును బ్రహ్మవర్చసము లేనివారు నగు
శూద్రులును మ్లేచ్ఛులును ననుభవింతురు. మ్లేచ్ఛప్రాయులయిన
యీ రాజులందఱును సమకాలులగుదురు. మఱి వీర
ధర్మమందును నసత్యమందును నిష్ఠగలిగి యల్పాతలై
తీవ్రకోపులై యుందురు. మఱి స్త్రీలను బాలురను గోవులను
ద్విజులను జంపువారును బరదారధనములను గొనువారును
తృణమునఁ గోపమును తృణమున సంతోషమును బొందు
వారును, నల్పబలులును, నల్పాయుష్కులును, గర్భాదానాది

సంస్కారశూన్యులును క్రియాహీనులునురజస్సుచేతనుదమస్సు చేతను గప్పవడినవారలును నగుదురు. ఇట్లు రాజరూపములనున్న మ్లేచ్ఛులు ప్రజలనుబట్టి పీడించుచుందురు. మ్లేచ్ఛులు నాధులగుటంబట్టి వారి దేశములందు వర్తించు ప్రజలుకూడ వారి శీలసులను నాచారములును వాడములునే కలవారై రాజులచేతను దమచేతను దాము బీడితులై నాశము నొందుదురు. ఇది మొదటియధ్యాయము.

శుకుఁడు పరీక్షిత్తునకుఁ గలియుగ ప్రాదుర్భావ లక్షణములను జెప్పుట.

శ్రీశుకుఁడు—రాజా! అంత బలీయమగు కాలమునుబట్టి స్మృతిదినమును ధర్మమును సత్యమును శౌచమును క్షమయు దయయునాయువును బలమును స్మృతియును నశింపగలవు. కలియుగమందు గొప్పకులమువానినిగాను నాచారవంతునిఁగాను గుణవంతునిఁగాను జేయునదిధనమే కాని మఱియొకటి గాదు. ధర్మమును న్యాయమును దీర్చునది బలమేకాని వేఱొకటికాదు. స్త్రీపురుషులను నాలుమగలుగాఁ జేయునది వారి వారి రుచియే కాని యాభిజాత్యాదులుగావు. క్రయ విక్రయాదివ్యవహారములను జరుపునది వంచనమేకాని నిష్కాపట్యముగాదు. ఆఁడుది మగవాఁడనుటకు లక్షణము రతి కౌశలమే కాని చీరలు అవికిలు దోవతులు మొదలగు నాయావృత్తులు గావు. బ్రాహ్మణుఁడగుట వట్టి జందెముచేతనే కాని యుపనయనాదుల వలనఁగాదు. ఆశ్రమమును దెలుపునదియు నొక యాశ్రమమునుండి మఱియొక యాశ్రమ

మును బొందినదికాని యొకవర్ణమునుండి మఱియొక వర్ణము గయికొన్నదిగాని తెలుపునదియుదండము నజినము మొదలయిన వేషపుగుఱుతులే కాని దాని దాని యాచారవిశేషములు గావు. ఒకఁడు పట్టిన న్యాయము దుర్బలమగుటకు వాని దారిద్ర్యమె కారణము. పాండిత్యము గలదనుటకు మిక్కిలిమాట లాడుటయె కారణముగాని జ్ఞానము గాదు. నిష్కృష్టుఁడగుట సంపద లేమిచేతనే కాని కులహీనత చెతఁగాదు. ఉత్కృష్టుఁడగుట దేహాలంకారాదిక మగు డంబముచేతనే కాని జాతిచేతఁగాదు. వివాహ మూరక స్వీకరించుటచెతనే కాని శాస్త్రీయవిధిచేతఁగాదు. స్నాన మొడలియందలి ముతికిఁ బోఁగొట్టుకొనుటచేతనేకానిశుద్ధతీర్థములగాదు మునుఁగుటచేతఁ గాదు. దూరమం దుండునీటిపట్టైతీర్థముగాని గంగాదులు గాని గురువుమొదలగువారుగాని గారు. లావణ్యము వెండ్రుకలు పెంచుకొనుటచేతనే కాని శాస్త్రవిహితమగు క్షౌరము చేతఁగాదు ఉదర భరణమె సమస్తమయిన పురుషార్థము. సత్యము పలుకువాఁడగుట దిట్టతనముచేతనేకాని యబద్ధ మాడకుండుట చేతఁగాదు. సామర్థ్యము కుటుంబమును భరించుటయెకాని ధర్మాది పురుషార్థములను గడించుటగాదు. ధర్మ మాచరించుట యశస్సు కొఱకే కాని పరలోకమునకుఁగాదు. ఇట్లు భూమండలమందు దుష్టులయిన ప్రజలు వ్యాపించి యుండఁగా బ్రహ్మక్షత్రియ వైశ్య శూద్రులం దెవఁడు బలవంతుఁడో వాఁడే రాజగును. లుబ్ధులను దయమాలిన వారలును దస్యుధర్మములు గలవారును నగురాజులచేత చారములను ధనములను గోలుపోయి ప్రజలు పర్వతములకు నరణ్యములకుఁ

బాఱిపోవఁగలరు. కాయగూరలు వేళ్లు మాంసము మధువు పువ్వులు పండ్లు విత్తులును భుజించుచు నాఁకలి దప్పులచేతను వ్యాధులచేతను సంతాపముచేతను జ్వరచేతను పీడితులగుచుందురు. కలియుగమందు మిక్కిలి యెక్కుడయిన యాయువు ముప్పది లేక యిరువది సంవత్సరములుగా నుండును. కలిదోషమువలన దేహులకు దేహములు క్షీణించుచుండును. వర్ణాశ్రమాచారముల కర్హులయిన వారి వేద మార్గమును వానియందుఁ జెప్పబడిన ధర్మములును నశించుచుండును. ధర్మములు పాషండమతములు మిక్కిలి గలిగియుండఁను. రాజులు చోరస్వాయులుగా నుందురు. మనుష్యులు చౌర్యము కల్లలు వట్టిహింసమొదలగు నానా వృత్తులు గలిగియుందురు. వర్ణములెల్ల శూద్ర ప్రాయములుగా నుండును. ధేనువులు మేకలవలె నుండును. ఆశ్రమములు గృహములవలె మైథునాదులతోఁ గూడియుండును. యోని సంబంధమును బట్టి చుట్టములయిన వారే ముఖ్యముగా బంధువులగుదురు. ధాన్యము లణువులవలె నతిసూక్ష్మములుగా నుండును. వృక్షములు కొలఁదియందు నీడయందును ఫలసుమందును జమ్మివలెనుండును. మబ్బులు మిక్కిలి మెఱపులుగా నుండును, గృహము లతిథిభోజనాదులు లేక శూన్యప్రాయములుగా నుండును. ఇట్లు కలి దుస్సహములయిన చేష్టితములు గలదై జనులయందు వచ్చినపిదప భగవంతుఁడు శుద్ధసత్త్వమయమైన దేహముతో ధర్మమును రక్షించుకొఱకు నవతరింపఁ గలఁడు. అఖలాత్ముండును నీశ్వరుఁడును బరావరగురుండునగు విష్ణుండు జన్మించుట ధర్మమును రక్షించు కొఱ

కును సాధువులకు మోక్షప్రతిబంధకములుగా నుండు కర్మ
ములను దొలఁగించుటకునే యగుచున్నది. శంబల మను
గ్రామముగలదు. అందు శ్రేష్ఠుఁడును మహాత్ముఁడునగు విష్ణుయ
శుండను బ్రాహ్మణుని గృహమందుఁ గల్కి యవతరింపఁ
గలఁడు. అజగత్పతి యణిమాదులగు నెనిమిది విభూతుల
తోను శౌర్యనీర్యాది గుణములతోను మూడినవాఁడై యప్రతి
మంబగు కాంతితో దేవదత్తమనెడి యశ్వమును మిక్కిలి
వేగముగాఁ బోవుదాని నెక్కి భూమియందతివేగముగాఁదిరు
గుచు దుష్టులనెల్ల నడఁచి పుచ్చుటకై కత్తిఁగొని రాజవేష
చ్ఛన్నులగుదస్యులను గోట్లకొలఁదిని సంహరింపఁగలఁడు. ఇట్లు
దస్యులెల్లను హతులుకాఁగా నంతఁ బౌరజానపదులైన యా
జనులు మనంబులెల్లను నావానుదేస్రవి మైపూఁతలకుఁ గల
మిక్కిలి పుణ్యగంధముతోడి గాలి సోకగానే నిర్మలము
కాఁగలవు. అపుడు భగవంతుఁడు వానుదేవుఁడు సత్త్వమూర్తి
యై వ్యాదయమందు నెలకొనఁగా వారి మనస్సులును సాత్త్వి
కములు కాఁగలవు. వారలకుఁ బుత్రాది ప్రపంచమును స్థూల
ముగా నుండును. ధర్మరక్షకుఁడును భగవంతుఁడు నగు హరి
కల్కియై యవతరించినపుడు కృతయుగముగలుగును; అప్పుడు
ప్రజాపతిసూతియు సత్త్వగుణప్రధానమై యుండును. చం
ద్రుఁడును సూర్యుఁడును బృహస్పతియుఁ బుష్యయోగమున
నేకరాసిని బొందునపుడు కృతయుగముపుట్టును. చంద్రవంశము
నందును సూర్యవంశమునందును గల రాజులును జరగిపోయిన
వారును జరుగుచున్నవారును జరుగఁగలవారును నుత్పత్తిక్ర
మమునఁ జెప్పఁబడిరి. నీవు పుట్టినది మొదలుకొని నందునియఁ

మేచనము వఱకు మాత్రమే చంద్రవంశ మనువర్తించుచు వచ్చెను. [1] ఈ రెంటికి నడిమికాలము వేయున్నూటపది యేను సంవత్సరములు.ఆకాలమునందు సప్తఋషులలోమొదట [2]నెవ్వరిద్ద ఱుదయించి కనుపట్టుదురో యాపులహక్రతువు లిరువు రకునడుమఁ గుడిప్రక్కను సమదేశమందు రాత్రియందుఁ గను పట్టు నక్షత్రముతోఁగూడ నల్లెబుషులు గూడి మనుష్యలనూ తేఁ డ్లుండఁగలరు. ఆఋషులిపుడు నీకాలమందు మఘానక్షత్ర ము నాశ్రయించి యున్నవారు. భగవంతుఁడును బహుప్రకా శుండును విష్ణుండు నయిన యీకృష్ణుఁడు దినమునకుఁ బోయినప్పుడు కలిపురుషుఁ డీలోకమును బ్రవేశించెను. ఆయు గాభిమానిపురుషునివలననే జనులు పాపమందు రమించు

---

1. పరీక్షిత్తుకాలము మొదలుకొనినఁదునికాలములవఱకును గర్గా సంవత్సర ములగుచున్నవి. ఎట్లన పరీక్షిత్తునకు సమకాలీనుఁడైన మగధరాజు మార్జారి. అతఁడు మొదలుగా రిపుంజయుని వఱకుఁగల యిరువదిమందిరాజులు వేయి సంవత్సరములు భూమినిఁనుభవింతురు. 'యేభార్హద్రథ భూపాలాభావ్యాస్తే సహస్రవత్సరమ్' అని నవమస్కంధమునఁ జెప్పఁబడియున్నది. వారికివెనుక ప్రద్యోతనులు గిర్గా సంవత్సరములును శిశునాగులు తిఁ సంవత్సరములు నను భవింపఁగా గర్గా సంవత్సరములగుచున్నవి. గగగగ సంవత్సరములని యిటచెప్పుట యేదోయొక వివక్షచేత అసాంతరసంఖ్యగా నుండును.

2. తూర్పుమొగంగానున్న శకటరూపమున నున్నయెడల నక్షత్రములు సప్తర్షిమండలమగును అందు కొంచె మెత్తుగానున్న యేఁడికోలమూలనుండు వాఁడు మరీచి,అతనికిపల్లవపంగినకాఁడి మూఁపులె నుండువాఁడు వసిష్ఠుఁడు నతని భార్యయు. అతనికిపల్లవ కొంచెమెత్తుగానున్నయేఁడికోలమూలనుండు వాఁడు అంగిరసుఁడు.అతనికిపల్లవ చదరముగానున్న నాలుగుతారల యందు ఈశాన్యమున అత్రి. ఆతనికిదక్షిణమున పులస్త్యుఁడు. పులస్త్యునికిపశ్చిమమున పులహుఁడు. అతని కుత్తరమున క్రతువు.వీరిలో ఉదయసమయమున మొదట బుట్టువారు పులహక్రతువులు.

చున్నారు. లక్ష్మీపతి యగు నాహరి యెంతకాలము తన పాద పద్మములచేత భూమిని స్పృశించుచునుండెనో యంతకాలము కలిపురుషుఁడు దీనిని గీడ్పఱచుటకుళక్తుఁడు గాఁడయ్యెను. దేవ ర్షులు తొమ్మండ్రను మఘానక్షత్రములందు సంచరించుట కెపు డారంభించిరో యపుడు కలియుగము ప్రవర్తించిన దగును. అది దేవమానమున సంధ్యలతోను సంధ్యాంశములతోను బండ్రెండువందలసంవత్సరములకొలఁదిగా నుండును. మహా ర్షులు మఘానక్షత్రములనుండి పూర్వాషాఢలకు నెప్పుడుపోవు దురో యప్పుడునందుఁడు మొదలుకొనియీకలినృద్ధినొందఁగలదు. ఏదినమునందుఁ గృష్ణుఁడు దివమునకుఁ బోయెనో యాదినమునం దాపగటనే కలియుగము ప్రవేశించిన దనికాలాభిజ్ఞు లగువారు చెప్పుదురు. నాలుగవది యగు కలియుగమునందు వేయి దివ్య సంవత్సరములకుఁ గడపటఁ గృతయుగము మరలఁ గలుగఁ గలదు. అప్పుడు మనుష్యుల కది యాత్మస్వరూపమును గోచ రింపఁజేయఁజాలిన దగును. ఇట్లు వైవస్వతమనూ వంశమున కే యే యుచ్చనీచావస్థలు చెప్పఁబడునో యాయవస్థలు శూద్రులకును వైశ్యులకును బ్రాహ్మణులకును బ్రతియుగమం దును గలుగునని తెలియవలయును. ఇట్టి పేళ్లును రూపము లును గల మహాత్ములగు పురుషులందఱి నిపుడు చెప్పుకొనుట మాత్రమే కాని యొక్కరును మిగిలియున్నవారు గారు. వారి కీర్తి యొక్కటిమాత్రమే భూమియందు నిలిచియున్నది. చంద్రవంశమందు శంతనునిభ్రాత యగుదేవాపియును నిక్ష్వాకు వంశజుఁడయిన మరుత్తుండును మహాయోగబలముతోఁ గూడిన వారై బదర్యాశ్రమమందు యోగులకు వాసస్థల మైన కలాప

గ్నివమందున్నవారలు. వారు కలియంతమునఁ గృతయుగాదిని భగవంతునివలన వర్ణాశ్రమధర్మము లుపదేశము నొంది యీలోకమునకు వచ్చి వర్ణాశ్రమధర్మములను బూర్వము వలెను వ్యాపింపఁ జేయుదురు. కృతమున్ త్రేత ద్వాపరము కలి యని యీనాలుగును జేరియొక చతుర్యుగ మగును. ఈక్రమముతోఁ గూడియే ప్రతిచతుర్యుగమును బ్రాహ్మణులయందు నిమిత్తమై ప్రవర్తించుచున్నది. రాజా! నే నిపుడు చెప్పినవైవస్వతమన్వంతరపు రాజులును మఱియుఁ జెప్పని యితరరాజులును భూమిని నాది నాది యని మమత్వబుద్ధి గలిగియుండి కడపట దానిని భోగింపవలసిన పుణ్యము ముగియఁగా నా మమత్వముతోఁ గూడియె నిరయమునుబొందిరి. రాజను పేరుగాంచిన వాని శరీరము నుగియఁగా పురుగులనియుఁ బురీష మనియు బూడిదయనియుఁ బేళ్లు గలుచున్నవి. వాఁడట్టి దేహముకొఱకై భూతములకు ద్రోహము సేయుచున్నాఁడు, దానివలన నిరయము నొందుచున్నాఁడు గాని తన యాత్మహితము నెఱుఁగఁడు. ఆరాజులు 'ఈయఖండమయిన భూమిని నాపూర్వజులు దాల్చి యుండిరి. ఇపుడు నేను ధరించియున్నాను. ఇఁక నాపుత్త్రునకుఁ బౌత్త్రునకును నెట్లు కలుగునో' యని చింతించుచుందురు. తేజస్సు నీళ్లు నన్నము ననెడి యీమూఁటిమయము దేహము. ఇట్టి కాయమును వారు తెలివిమాలి యాత్మగాను భూమిని దనది గాను గ్రహించి కడపట నాదేహమును నాభూమిని రెంటిని దిగనాడి ప్రారబ్ధాంతమందు లయమును బొందిరి. రాజా! ఏ యే రాజులు భూమిని బారుషముచేత ననుభవింతురో వారంద ఱును గాలము చేత సమాప్తినొందినవారై కడపటఁ గథల

యందుఁ జెప్పంబడుచు మాత్రముండురు. ఇది రెండవ యధ్యాయము.

{మమకారముగలరాజులను భూమి పరిహసించుట ఆయాయుగములధర్మములు,ప్రజల వర్తనములును.}

శ్రీశుకుఁడు—ఈభూమి తన్ను జయింపవలయు ననితుక తుకపడుచున్న రాజులను జూచి "ఓరాజా! ఈరాజులు మృత్యువున కాటబొమ్మలు ఇట్టి వీరు నన్ను జయించి భోగింపఁ గోరుచున్నారు. ఈరాజులు తమ తండ్రి మొదలగువారు మరణించుటను బట్టి తామును మృత్యువునకు వశులే యని తెలిసినవారయ్యు నన్ను జయింపవలయునని యువ్విళ్లూరుచున్నారే! ఈకోరిక యంతయు వ్యర్థము. ఏలన వీరికోరికను బట్టి నీటిబుగ్గవలెనున్న యీదేహమునందు చిక్కిలియు నమ్మిక గలిగియుందులకై పాటుపడుచున్నారు. కనుక వీరి కోరిక నిష్ఫలమే కదా. వీరింద్రియలంపటులకు రాజ్యప్రాప్తి కలుగదను తలంపున 'మొదట నింద్రియము లాతింటిని జయించి దాని మూలమున దేవతాప్రసాదమును బడయుదుము. పిదప రాజును మంత్రులను సచివులను బురజనులును వారి యాప్తులను నేనుఁగులయధిపతులను బిదప భూమికిఁ గంటకప్రాయులగు వారిని జయింతము. ఇట్లు క్రమముగా సముద్రపర్యంతమైన భూమండలముల నంతయు గెలుతు' మని యిట్టి యాశలకు మనస్సును లోఁబఱచుచుండురు గాని దగ్గఱనున్న మృత్యువును గనుఁగొనరు.నన్నుఁజుట్టు సముద్రముగల యంత మట్టును జయించి యంత సముద్రము నడుమనున్నద్వీపములను గెలుచుటకుఁ జొత్తురు. ఇట్లు సమస్త భూమండలమునుద్వీపములను జయించిననువారింద్రియములను

జయించి నందుల కిది యెంత మాత్రము ఫలము? ఇంద్రియ జయమునకుఁ దగిన ఫలము ముక్తియే. దేనినిమనువులును వారి పుత్త్రులును జయించియు దిగవిడిచిపోయిరో యట్టి నన్ను బుద్ధి మాలినవారుగాన యుద్ధమున జయింపఁ దివురుచుందురు. వీరు రాజ్యమందు నాది నాది యనెడి మమకారబుద్ధికిఁ మన స్సులు కట్టుపడియుండుట వలన దుష్టులౌటచే నాకొఱకు వీరిలోఁ దండ్రులకును గొడుకులకును నన్న దమ్ములకును గలహములు పుట్టుచున్నవి. వీరు 'ఈభూమండల మంతయు నాదియే. ఓరీ! మూఢా! నీ దికా' దని పలుకుచు నొకరికొకరు మచ్చరించుచు నాకోసర మొండొరులను జంపుచును జచ్చుచు నుందురు. పృథుఁడు, పురూరవుఁడు, గాధి, నహుషుఁడు, భరతుఁడు, అర్జునుఁడు, మాంధాత, నగరుఁడు, * రాముఁడు, ఖట్వాంగుఁడు, ధుంధుమారుఁడు, రఘువు, తృణబిందుఁడు, యయాతి, శర్యాతి, శంతనుఁడు, గయుఁడు, భగీరథుఁడు, కువలయాశ్వుఁడు, కకుత్స్థుఁడు, నలుఁడు, నృగుఁడు, హిరణ్యకశిపుఁడు, వృత్రుఁడు, లోకరావణుఁడగు రావణుఁడు, నముచి, శంబరుఁడు, భౌముఁడు, హిరణ్యాక్షుఁడు, తారకుఁడు మఱియు నితరులైన దైత్యులును రాజులును బెక్కండ్రు భూమికిఁ బతులుగా నుండిరి. వీరందఱును సర్వవిదులు. వీరందఱును శూరులు. సమస్తమును జయించిన వారు; ఎవ్వరిచేతను జయింపఁబడనివారు. అయినను మనుష్య ధర్ములై నాయందు మిక్కుటముగా మమకారమునుగలిగి కొంతకాల ముండినవారైరి కాని' యని భూమి నవ్వుచున్నది. రాజా! ఆరాజులు తమవిషయభోగాభిలాషలు తీఱకమునుపే

*ఇతఁడు దశరథరాముఁడు గాఁడు. మఱియొక రాముఁడని వీరరాఘవము.

వారిని గాలము కొంపోయినది. ఇప్పుడు వారు లేరు. వారి కథలుమాత్రమే మిగిలియున్నవి. రాజా! లోకములందు యశస్సును విస్తరింపఁజేసి పరలోకమును బొందిన మాహాత్మ్యనిధులగు రాజులను గతించి యీ కథలు నీకుఁజెప్పఁబడినవి. విషయములు నిస్సార మని తెలియుటకును దానినిఁ బట్టి దాని యందు వైరాగ్యము గలుగుటకును జెప్పఁబడినవి. ఇవి వట్టి వాగ్వైభవములే కాని యీరాజు లనుభవించినభోగ్యము లందుఁ బారమార్థికమైన దొక్కటియులేదు. ఉత్తమశ్లోకుండగు భగవంతుని గుణానువాదములను సమంగళము లెల్లను దూలించువానిని సజ్జనులు పాడుచుందురుగదా. దానినే పురుషుఁడగువాఁడు నిత్యమును మాటిమాటికి వినుచుఁ గృష్ణుని యందు నిర్మలంబగు * భక్తిని గోరుచుండవలయును" ననెను. రాజు 'మహాత్మా! మునీంద్రా! కలియుగమందు జనులు కలి దోషములు పెచ్చుపెరుఁగు చుండఁగా నేయుపాయముచేతఁ దూలింపనేర్తురో దానిని నాకుఁగలరూపునఁ జెప్పుము. మఱి యు యుగములను యుగధర్మములను బ్రలయకల్పములకొలఁదులను మహాత్ముండయిన యీశ్వరుని విష్ణుని శరీరంబగుకాలము గతియును జెప్ప'మని యడిగెను.

శ్రీశుకులు—కృతమందు ధర్మము నాలుగుపాదములతోఁ గూడినదై కృతయుగజనులచేఁ దాల్పఁబడుచుండును. రాజా! పూర్ణంబయిన యాధర్మమునకు సత్యము దయ తపస్సు దానము నని యీనాలుగును బాదములు, ఆయుగమందు జనులుసంతు

---

* శ్రవణ పరంపరచే భగవంతునియందు దృఢమైన భక్తి కలుగుచున్న దని భావము.

ష్టులును గరుణగలవారును భూతమైత్రిగలవారును శాంతులును దాంతులును ద్వంద్వసహిష్ణులును ఆత్మారాములును జాతిగుణాదిశారతమ్యములను బాటింపక సమస్తమును భగవదాత్మకముగాఁ గనుగొనువారును దపశ్చర్యాదులచేతఁ గాయక్లేశముగలవారును నై * బహుతరముగా నుందురు. త్రేతాయుగమందు ధర్మమునకుఁ గల పాదములందు నాలవపాలిని, అధర్మమునకుఁ బాదములయిన అనృతము, హింస, అసంతోషము, విగ్రహ మనెడి యివి మెల్లమెల్లగా హరించుచున్నవి. ఆయుగమందుఁ గ్రియాతపస్సులందు నిష్ఠులయిన వారును సుక్కిలి హింసాస్వభావము లేనివారును మిక్కిలి లంపటులు గానివారును త్రివర్గపరాయణులును వైదికకర్మవృద్ధులు నై వర్ణములవారుందురు. ఆవర్ణములందుబ్రాహ్మణు లధికులై యుందురు. ద్వాపరమున ధర్మపాదము లగు తపస్సునందును సత్యమునందును దయయందును దానమందును సగము వరుసగాన ధర్మలక్షణము లగు ననంతుష్టిచేతను, ననృతముచేతను, హింసచేతను, విగ్రహముచేతను, దఱిఁగిపోవును. అపుడు జనులు యశస్వులును మహాయజ్ఞానుష్ఠానశీలురగును మహాశ్రోత్రియులునై సంపన్నులును గుటుంబులును దర్పితులు నై యుందురు. వారియందు బ్రాహ్మణులును క్షత్రియులు నధికులగుదురు. కలియుగమందు ధర్మపాదములందు నాలవభాగము మాత్రమే మిగిలియుండును. అదియు నధర్మపాదములు పెచ్చు

* అందఱును నిట్టి గుణములుగలవారై యుండినయెడల ముక్తులగుదురు; యుగాంతరము కలుగవలసినది లేకుండును. కావున నే యందఱుగాదనుటకై 'బహుతరముగా' నని కూర్పఁబడినది

పెరిగి క్షీణించుచువచ్చి కడపటఁ బూర్ణముగా నశింపఁగలదు. ఆ యుగమందు జనులు లుబ్ధులును దురాచారులును నిర్దయులును నిష్కారణవైరులును, భాగ్యహీనులును, మిక్కిలి యర్థకామ తృష్ణగలవారును నై యుందురు. వారియందు శూద్రులును గైవర్తకాదిజాతులును బ్రధానులుగా నుందురు. యుగములం దిట్టి వైషమ్య ముండుటకుఁ గారణము వినుము. పురుషునియందు సత్త్వము రజస్తమస్సనిగుణములుచూపట్టుచున్నవి. అవియె కాలముచేఁ బ్రేరితమై పెరుఁగుచును దగ్గుచును మనస్సునందుఁ దమతమ కార్యములు నెఱపుచుండును. మనస్సును దానికి వశములయిన బుద్ధియు నింద్రియములును నెపుడు సత్త్వమునందు మిక్కిలియుఁ బ్రవర్తించునో, యపుడు కృతయుగమని తెలియవలయును. దానివలన జ్ఞానమందును దపస్సునందును జనులకు రుచి లుగుచున్నవి. ఎప్పుడు దేహికిఁ గామ్యకర్మములందు నభిరుచి కలుగునో యపుడు రజోగుణ ప్రధానమగు త్రేతాయుగమని తెలియును ఎప్పుడు లోభమును నసంతుష్టియును మానమును దంభమును మత్సరమును గామ్యము లగు కర్మములం దభిరుచియుఁ గలుగునో యపుడు రజస్తమః ప్రధానమగు ద్వాపర మని తెలియుము. ఎప్పుడు కాపట్యమును, నసత్యమును, దరిద్రతయు, నిద్రయును, హింసయు విషాదనమును, శోకమోహాములును, భయమును, దైన్యమును గలుగునో యపుడు తామసం బగు కలి యని తెలియునది. మనుష్యులు మందమతులును నల్పభాగ్యులును మిక్కిలి తిండిగలవారును గాములును ధనహీనులు నగుటయు స్త్రీలు సతులు గాక సైరిణులై యుండుటయును నా కలివలననే

యగును. అప్పుడు దేశమందలి ప్రజలు దస్యులచేత నుపద్ర వము నొందుచుందురు. వేదములు పాషండులచే దూషితము లగును. రాజులు ప్రజలనుబట్టి పీడించుచుందురు. ద్విజులు శిశ్నోదరపరాయణులై యుందురు. బ్రహ్మచారులు వ్రత శూన్యులై యశుచులై యుందురు. గృహస్థులు భిక్షులగుదురు. తపస్వులు గ్రామములందు వసించుచుందురు. సన్న్యాసులు విత్తాభిలాషులై యుందురు. స్త్రీలు పొట్టికాయములు గలిగి మీఁదు మిక్కిలి తిండితినుచుఁ బుట్టెఁడు బిడ్డలను గనుచు సిగ్గు మాలి యెపుడును గటువుగా మాటలాడుచుఁ జౌర్యములును మాయలును మిక్కుటమయిన సాహసములును గలిగియుందురు. వణిజు లొక్కటిగాఁగూడి వ్యాపారములు చేయుచుఁ గ్రయ విక్రయాది వ్యాపారములు జరుపుచుందురు. ఏదేని వ్యత్యా సము గలిగెనా క్షుద్రచేష్టలు గలవా రగుదురు. మఱియు నాపద లేకుండునపుడును మిక్కిలి రోఁతపడునట్టి వృత్తిని నుంచి దిగాఁ దలంతురు. భృత్యులు తమపతి సరోత్తముఁడుగా నుండినను ధనహీనుఁడయ్యెనా తోడనే దిగవిడుతురు. పతులును భృత్యుఁడు రోగాదులచేత విపత్తినొందెనా వానిని, బరంపరా గతమైన భాగవతధర్మమును బాఁడియుడిగిన యావులను, దిగ విడుతురు. కలియుగమునందు నరులు దండ్రులను దోఁబుట్టు వులను సుహృదులును జ్ఞాతులను విడిచి సురతనివాసమగు భార్యవంకవాఁడే సుహృదులుగాఁ గొని స్త్రీవశ్యులై భార్య వంకవా రయిన వదినలతోను బావలతోను గార్యము లాలోచ నము సేయుచుందురు. శూద్రులు తపస్సుచేతను విద్యచేతను నుపజీవించుచుఁ బ్రతిగ్రహములు పుచ్చుకొనఁగలరు. మఱియు

ధర్మజ్ఞులు గాకుండియు నుత్తమాసనములనధిష్ఠించి ధర్మములు నుపదేశించుచుందురు. ప్రజలు నిత్యము దుర్భిక్షముల చేతను రాజునకుఁ గట్టుకథముల చేతను జిక్కిస్సుక్కిక మనంబున భయపడుచు నన్నరహితమగు భూతలమునందు ననావృష్టి భయమున దుఃఖించుచు నుందురు. మఱియుఁ గలియందుఁ బ్రజలు వస్త్రములు నన్నమును బానములును శయనమును మైథునమును స్నానమును భూషణములును లేనివారై హీనులై పిశాచుల వలెఁ జూపట్టుచుండఁగలరు. కలియందు జిల్లిగవ్వంత యర్థమునకయినను జగడములుపెట్టుకొని సాహసములు దిగవిడిచి యొకరినొకరు సొంతచుట్టముల నయినను బంపుచుఁ దామును బ్రాణములు విడుచుచు నుండఁగలరు. మఱియు జనులు క్షుద్రులై శిశ్నోదరపరాయణు లగుటఁబట్టి ముదిసిన తలిదండ్రులను రక్షింపరు;పుత్రులను భార్యలు నన్నిటఁగూళలు లై యున్ననువారిని బోషింపరు. రాజా!కలియుగమందు "మనుష్యులు జగములకుఁ బరమగురుండును ముల్లోకములకు నాథుండగు బ్రహ్మ మ్రొక్కిన పాదపద్మములు గలవాఁడును నగు భగవంతుని నచ్యుతునిఁ, బాషండుల చేత మనస్సు భేదిల్లి యారాధింపకుందురు. ఎవ్వని నామధేయమును మరణించుచున్నపుడు గాని దుఃఖితుఁడయినపుడు గాని పతితుఁడయినపుడు గాని వర్ణాశ్రమాచారములు తప్పి నడచునపుడుగాని పరవశుఁడై యున్నపుడుగాని పురుషుఁడు కీర్తింపఁగానే కర్మబంధములన్నింటినుండి విడివడి యుత్తమం బగు గతిని బొందునో యట్టి భగవంతుని మనుష్యులు కలియుగమునందుఁ బూజింపరు. జనులు కలివలన నిషిద్ధద్రవములనుబట్టి కాని నిషిద్ధదేశ

మునుబట్టికాని విషయప్రవణమైనమనస్సునుబట్టికాని కాఁకుండు నట్టి దోషములను నన్నిటిని పురుషోత్తముఁడగు భగవంతుఁడు చిత్తమునందు నెలకొన్నవాఁ డయ్యెనేని హరించుచున్నాఁడు. భగవంతుని విన్నను గీర్తించినను ధ్యానించినను బూజించినను నాదరించినను నతఁడు మనుష్యుల హృదయములందు నెలకొని యుండి వారు వేలకొలఁది జన్మములను గావించిన యశుభములెల్లఁదూలించివైచుచున్నాఁడు. అగ్ని,బంగారమునందుండి రాగి మొదలగువాని కలియుటవలన దానికిఁ గలిగిన తక్కువ వస్తువును బోఁగొట్టునట్లు, విష్ణువును యోగుల మనంబుల నెలకొని యందలి యశుభములనెల్ల హరించి వైచుచున్నాఁడు. అంతరాత్మ,హృదయస్థితుండగు భగవంతుఁడనంతునిచేతఁబోలె మఱి శాస్త్రాధ్యయనముచేతఁగాని తపముచేత గాని ప్రాణాయామముచేతఁగాని, భూతమైత్రిచేతఁగాని తీర్థస్నానములచేతఁగాని, వ్రతముచేతఁగానిదానములచేతఁగాని,మంత్రజపములచేతఁగాని గుక్కిలియు శుద్ధినొందనేరదు. రాజా! కాఁబట్టి నీవు సర్వవిధములచేతఁ గేశవుని హృదయమందు నెలకొల్పుము. ఏలనఁగా నీవవహితచిత్తుఁడవై మరణించునపుడు పరమంబగు గతిని బొందుదువు కాన హృదయమందుఁ గేశవుని నిలిపియుంపుము. భగవంతుఁడగుపరమేశ్వరుని మరణించునపుడెల్లవారును దప్పక ధ్యానింపవలయును. అతఁడు సర్వాత్ముఁడు, సర్వమున కాశ్రయభూతుఁడుగాన యట్లు చేయువారినిఁదన సామ్యమును బొందించును. కలి దోషములకు నిధియైనది. రాజా! అయినను దానియందు నుపాగుణ మొక్కటి యున్నది. కృష్ణుని నూరక కీర్తించుట యొక్కటిచేతనే మనుజుఁడు బంధములనుండి విము

క్తుఁడై పరమపురుషునిఁ బొందుచున్నాఁడు. కృతయుగమందు ధ్యానించుటవలనను, త్రేతయందు యజ్ఞములచేత నారాధించుటవలనను, ద్వాపరయుగమందును నర్చించుటవలనను, గలుగు ఫలమంతయును గలియుగమందుఁగృష్ణునిఁ గీర్తించుమాత్రమువలననే కలుగుచున్నది. ఇది మూఁడవయధ్యాయము.

శుకుఁడు పరీక్షిత్తునకుఁ గల్పప్రలయముల కాలపరిమాణములను జెప్పుట.

శ్రీశుకుఁడు——రాజా! నీకుఁ బరమాణువు మొదలుగా రెండు పరార్ధములు కడపటగాఁగల కాలమును యుగముల పరిమాణములును జెప్పఁబడినవి. [1] కల్పములను లయములను గూడ వినుము. వేయిచతుర్యుగములు బ్రహ్మకు నొక్కదిన మనఁ బడుచున్నది. ఇదియొ కల్పము. ఇందుఁ [2] బదునాలుగురు మనువులు క్రమముగాఁ గలుగుదురు. ఆవేయిచతుర్యుగముల కడపటఁ బ్రలయము. ఈ ప్రలయముకూడ నంత కొలఁదియే (యనఁగా వేయిచతుర్యుగముల పరిమితియె) కలిగియుండు ఇది బ్రహ్మకు రాత్రి యనఁబడును. ఆరాత్రి యందు భూమి మొదలయిన యీ మూఁడులోకములును ప్రలయము నొందు

---

1. కల్పము——దైనందనకల్పము మహాకల్పమని రెండువిధములు. ఇట దైనందిన కల్పము చెప్పఁబడుచున్నది.

2. మన్వంతరకాలము 'స్వంస్వంకాలం మనుర్భుఙ్క్తే యుగానామేక సప్తతిః' అని తృతీయస్కంధమునఁ జెప్పినట్లు డెబ్బదియుగములు.

3. ప్రలయము——నైమిత్తికము, ప్రాకృతికము, ఆత్యంతికము, నిత్యము అని నాలుగువిధములు. ఇట నైమిత్తిక ప్రలయము చెప్పఁబడుచున్నది. వేయిచతుర్యుగముల పరిమితిగలదినము గడపఁగా బ్రహ్మ జగద్వ్యాపారము ముడిగి శయనించును. శయన నిమిత్తమగుటచే ఈ ప్రలయమును నైమిత్తిక మనఁ బడుచున్నది.

చున్నవి. ఇది నై మి త్తిక ప్రలయ మనఁబడును. ఈ ప్రలయ మందు విశ్వమును సృజించునట్టి బ్రహ్మ విశ్వమును దనయం దుపసంహరించుకొని [1] శేషశయ్యపయినిఁ బరుండుచున్నాఁడు. పరమేష్ఠియగు బ్రహ్మకు [2] రెండుపరార్ధములు కడచిపోఁగా, మహత్తు అహంకారము పంచభూతములనెడి యీయేడు ప్రకృతులును లయమును బొందుచున్నవి. ఇదియె ప్రాకృతలయము. ఇందు విభూతము (నాశము) ప్రాప్తించినపుడు, ఏడు ప్రకృతులు కూడిన వికారమగు నండకోశము లయమునొందుచున్నది. ఆ విభూతముకలుగు విధ మిది. రాజా! పర్జన్యుఁడు నూఱుసంవత్సరములు భూమియందు వానగురియకుండును. అప్పుడు ప్రజలన్నము లేకయొకరినొకరుపట్టి యాఁకటిచే నలఁగి భక్షించుచుఁ, గాలము చేత నుపద్రవమునొంది మెల్లగా క్షీణత్వము నొందుదురు. అప్పుడు ప్రలయకాలసూర్యుఁడు సముద్రమునందును, దేహము లందును, భూమియందును గల రసము నంతయు దుస్సహము లయిన తనకిరణములచేతఁ ద్రావును; కాని యిప్పటివలె మరల నిచ్చుట యెంతమాత్రము గలుగదు. అంతఁ బ్రలయకాలపు వహ్ని సంకర్షణుని ముఖమునుండి పొడమి వాయువేగము చేతఁ జిమ్మిరేఁగి సూర్యుఁడు వీల్పఁగా మిగిలిన జలమును లోకరహితములయిన పాతాలాది భూవివరములను దహించు

---

1. బ్రహ్మ శేషశయ్యపైఁ బరుండుట యెట్లన 'కృష్ణసాభ్రాదోద్భూతకమలోదరశాయినఁ' అని శేషశయనుండగు భగవంతుని నాభి పద్మమునందుఁ బ్రహ్మ శయనించునట్లు చెప్పఁబడుచున్నది. కాఁబట్టి ప్రాసాదఖట్వా పర్యంక న్యాయమున బ్రహ్మకు శేషశాయిత్వము ప్రాపఁగుచున్నది.

2. రెండు పరార్ధములు గడచుటనుబట్టి యిదియె కల్పమని తెలియనది.

చున్నది. అట్లు మీఁదను గ్రిందను నలుపక్కలను నగ్ని సూర్యుల శిఖలచేత బ్రహ్మాండము దగ్ధమగుచుఁ గాలినపేఁడ ముద్దవలె నుండును. అంతఁ బ్రచండమగు ప్రలయవాయువు నూఱేండ్లకుఁగొంచె మెక్కువకాలమే నుడిసి వీచును. అప్పు డాకాశము ద్రుమ్ము గ్రమ్మఁగా భూమ్రముగా నుండును. అప్పుడు చిత్రవర్ణములగు మేఘ సమూహములు మెక్కులు నూఱుసంవత్సరములు వర్షముగురియును; భయంకరధ్వనులతో నుఱుముచు నుండును. అంత బ్రహ్మాండ వివరములోపలఁ గల ప్రపంచమంతయు జలమయమై యేకార్ణవముగా నుండును. ఇట్లు జలములందుఁ దెప్పఁదేలుచు జగముండఁగా, భూమికిఁగలగంధగుణమును నప్పులు గ్రసించుచున్నవి. గంధము గ్రసింపఁబడఁగానే భూమి జలములందు లయించుచున్నది. పిదప నప్పులగుణ మగురసమును తేజస్సు గ్రసించుచున్నది. అప్పుడప్పులు రసము దూలి తేజస్సునందు లయించుచున్నవి. అంతఁ దేజస్సు గుణమగురూపమును వాయువు గ్రసించుచున్నది. అప్పుడు రూపగుణములేని తేజస్సు వాయువునందు లయించుచున్నది. వాయుగుణమగు స్పర్శమును నాకాశము గ్రసించుచున్నది. అప్పుడు స్పర్శము లేనివాయు వాకాశమందు లయించుచున్నది. పిదప నాకాశపుగుణ మగు శబ్దమును భూతాదియనఁబడు తామసాహంకారము గ్రసించుచున్నది. అట్లది తనగుణమా గ్రసింపఁబడఁగా భూతాదిని లయించుచున్నది. రాజసాహంకారముతోఁగూడిన త్వికాహంకారముజ్ఞానేంద్రియములను వాని వృత్తులను గ్రసించుచున్నది. మూఁడువిధములగుచున్న యహంకారమును మహత్తు గ్రసించుచున్నది. ఆ

మహత్తు సత్త్వాదులగు మూఁడుగుణములను (అనఁగా గుణ మయంబగు ప్రకృతిని) గ్రసించుచున్నది. రాజా! కాలప్రేరిత మై యవ్యాకృతమనఁబడిన * యీ ప్రధానము గుణములను గ్రసించుచున్నది. (అనఁగా విషమములగు గుణములను సమ ముగాఁ జేయుచున్నది) ఎవ్వని స్వరూప మాద్యంతములు లేనిది గాన కాలావయవములగు రాత్రి పగలు మొదలగు వానిచేఁ బరిణామాదులను బొందకుండునో, కావునఁ జేయఁ యింద్రియములకుఁ జేటపడక యవ్యక్తముగా నుండునో, మరి యేది నిత్యంబును నవ్యక్తము మొదలుకొని పృథివివఱకుఁ గల జగమునకెల్లఁ గారణంబును నవ్యయంబునగునో, యెందు వాక్కులును మనస్సును బ్రవర్తింపనేరవో, సత్త్వమును రజ స్సునుదమస్సును మఱియు నీమహదాదులను నెందుఁగలుగవో, మఱియుఁ బ్రాణములును బుద్ధియు జ్ఞానేంద్రియములును గర్మేం ద్రియములును నెందుఁ గలుగవో-ననఁగాఁ గర్మాయత్తముగా మహదాదులు కూడి యగునట్టి దేహముతోడ సంబంధమును నింద్రియాయత్తమగు జ్ఞానమును నెందుఁ గలుగవో, లోక ములు కల్పితమగునట్టి సన్నివేశమగు బ్రహ్మాండ మేస్వరూపము గాదో, మఱియు జీవులకుంబోలె ధర్మభూతజ్ఞానమునకు సంకో చవికాసము లయినస్వప్నము జాగ్రత్తు సుషుప్తియు ననెడి యవస్థలెందుఁ గలుగవో, యేది యాకాశమును జలమును భూమియు వాయువును నగ్నియు సూర్యుండును గాదో, మఱియు మిక్కిలి నిదురయం దున్నవానివలె నేది లోపలను

---

* మహదాది నామరూపవిభాగములేనిదై గుణసామ్యావస్థయం దుండు ప్రధానమై అవ్యాకృత మనఁబడు చున్నది.

వెలుపలను గలుగు బ్రాహ్మణత్వము సుఖముదుఃఖము మొదలగు వికారములకు లోనుగాకయు, నాకాశమువలె సమస్తమును బొందియున్నను వానిదోషముల యంటులేకయు నుండునో అనఁగా నిదురించువానివలె బాహ్యాభ్యంతరవికారములు లేకయు నాకాశమువలె నిర్మలమయ్యి నుండునో, యట్టి పరమాత్మ స్వరూపము, ఇట్టి దట్టి దని వితర్కింప సశక్యమయినది

యవ్యక్తమునకు లయస్థానమని వేదాంతములు భావించుచున్నవి. ఇది యే ప్రాకృతికలయము. ఇందుఁ [2] బురుషునకు నవ్యక్తమునకులయముగలుగును. ఇందుఁగాల[1]ప్రేరితములై పృథ్వి మొదలుకొని మహత్తువఱకుఁగలశక్తులుపరవశములై తమ తమ కారణములందు లయమునొందుచున్నవి. జ్ఞానస్వరూపుండగు పరమాత్మ బుద్ధి యింద్రియములు నింద్రియార్థములనెడి యివి శరీరముగా నెలవాఁడై శరీరివలె నియమించుచును వాని కాశయమైధారకుఁడగుచును నుండుట ప్రమాణికులకుఁదోఁచుచుండును. పరమాత్మకు శరీరముగానుండునట్లు ప్రమాణముల చేతఁ దెలియంబడుచుండుట వలనను, పరమాత్మను విడిచి వేఱుగ నవి యుండనేరని పగుట వలనను, నతఁడు వానినెల్ల శరీరముగాఁగలిగి వెలుంగుచున్నాఁడు, అతనికి శరీరమగు బుద్ధీంద్రియాదులలోయవ్యంతములుగలవై యేకరూపమునను నుండక యెడతెగక పరిణామము నొందుచుండుటవలనఁ బరమాత్మస్వరూప

---

1. 'మహానవ్యక్తే లీయతే అక్షరం తమసిలీయతే తమఃపరేదేవఏకీభవతి' ఇత్యాదులగు వేదాంతము లిట తెలియునది.

2. పురుషునకు లయమనఁగా- అత్యంత జ్ఞానసంకోచముఁజెంది పరమాత్మలోఁ జొచ్చి సంశ్లేషమునొందుట అవ్యక్తమునకు లయమనఁగా మహదాదులుగా విభక్తముగాని యవస్థనొంది యుండుట యని తెలియునది.

మువలె నిత్యములుగావు. తేజస్సుకార్యముదీపము. తేజస్సునకను గ్రాహ్యమయినదిచిత్తువు. తేజఃకార్యమగునహంకారపుఁగార్య ములయినవి యింద్రియములు. తేజస్సు నాశ్రయించిన ధర్మము రూపము. కనుకదీపమును జిత్తువును రూపమును దేజస్సునువిడిచి వేఱుగ నేర్పడఁజాలవు. ఇట్లయింద్రియములునంతఃకరణములును విషయములును బరమాత్మచేతి సృజింపఁబడి యతని కనుగ్రా హ్యములై యతఁడే యాశ్రయముగాఁ గలిగియుండుటంబట్టి యా బుద్ధ్యాదులకును విలక్షణతమాండను, జ్ఞానశబ్దవాచ్యుండు నగు పరమాత్మనువిడిచి యవి యెల్లవేఱుగ నెలకొనియుండఁ జాలవు. జీవునిబుద్ధియనెడి ధర్మభూత జ్ఞానమునకు జాగరణము స్వప్నము సుషుప్తి యనెడి యవస్థలు చెప్పఁబడుచున్నవి. ఈ మెక్కు లవస్థలుండుట, ప్రత్యగాత్మయగు జీవునియందు ప్రకృతి సంబంధమాత్రమువలనఁ గావింపఁబడినవే కాని నుతియొకటి గాదు. మేఘము లాకాశమునందుఁ గలుగుచును లేకపోవుచును నుండునట్లు యీ కనఁబడుచున్న ప్రపంచమంతయు నవయవి యగు బ్రహ్మమునం దుదయించుటచేఁ గలుగుచును లయించు టచే లేకపోవుచునుండును. అవయవి యగు వానికెల్ల నవయవ ములున్నవనుట సత్యమె. * అవయవి యా యనఁబడువములకు

* అబాధితములగు అనయవములయిన తంతువుల సముదాయమే కదా అవయవి యగుపట మనఁబడుచున్నది. అవయవములగు తంతువుల ఒక విధ మైన కూడికయే అవయవి యగు పటమగుచున్నది. మఱియు కార్యమైన యాపటము తంతువుల కంటె వేఱయినది కాకుండుటయు తెలియుచున్నది అట్లై ప్రమాణప్రతిపన్నము లైన చిత్తు అచిత్తు ఈశ్వరుఁడనెడి వీని సముదాయమే 'సదేవ సోమ్యేద' మిత్యాదులయందు సత్తనఁబడు జగత్తు రూప

వేఱుగా నేరదు. వేఱయినచో, పటమునెడి యవయవికంటె వేఱుగా దాని యవయవములగు తంతువులు చూపట్టవలెను. అట్లు చూపట్టవు గదా. అట్లె సచ్చిద్బవాచ్యంబగు బ్రహ్మమునకు జగత్తు వేఱుగా నేరదు. ఆసత్తే జగత్తునకుఁగారణమగును. కుండ మూఁకుడు మొదలగువాని యందు 'ఇది మన్ను ఇదికుండ' యని శ్రోఁపిక గలుగుచున్నది. అందు సామాన్యశబ్దముచేత మృత్తు మొదలగు కారణములు చెప్పఁబడుచున్నవి. విశేష శబ్దముచేత కుండ మూఁకుడు మొదలగు దాని విశేషాకారములు చెప్పఁబడుచున్నవి. ఆమృత్తునకుఁ గల వికారమే యీ సామాన్యవిశేషములచేత దానికంటె వేఱయిన దని బుద్ధిచేతను వేఱు వేఱు శబ్దములచేతను నసత్కార్యవాదులు ద్రవ్యాంతరముగా నెఱుంగుట నట్టి భ్రమమే యగును. కార్యమును ద్రవ్యాంతరముగా నెఱుంగుటయే భ్రమము. ఏలనఁగా, సామాన్యవిశేషములే యొకటి నొకటి యాధారాధేయములుగా నాశ్రయించి యున్నవి. కాన యొకటి కొకటి వేఱు గానేరవు. అట్లె చిదచిదీశ్వరులసంఘాతమును గారణమయ్యును గార్యమయ్యునుండుటయే కాక యీ రెండవస్థలయందు వానికి భేదమును గలుగదు. అయిన నాచిదచిదీశ్వర సంఘాతమునందు సమస్తము లగు నచిదూర్ధ్వములైన శరీరములు నాద్యంతములు గలవి. కాఁబట్టి యవి చిదూర్ధ్వమగు నాత్మవస్తువు గానేరదు. జాతి గుణము క్రియ జన్మము వృద్ధి మొదలగు వికారములు దేహమం దాత్మాభిమానము గలవారికిఁ దోఁచుచున్నను

మైన పరిణామవిశేషమగు కార్య మని ప్రామాణికులు చెప్పెదరు. మఱియు వారికి నట్లె తోఁచుచున్నది. కాన అసత్కార్యత్వము లేదని భావము.

బ్రత్యగాత్మకది యెంత మాత్రము గలుగునవి గావు. దానికి వానితోడి సంబంధము గలుగదు. ఏలన నావికారములు దానియందు రూపింప శక్యము గాదు నిరూపింపశక్య మగు నేని యణువంతవికారము సైత మాత్మయందుఁ గలుగును. అప్పుడు ముక్తాత్మయు దేహముతో సాటియై యచి జ్ఞాతీయుఁ డే యగుచున్నాఁడు. వికారము లాత్మకుఁ దెలియుచున్నను నవి యుపాధిప్రయుక్తములు గాన దానియందుఁ జెప్పఁబడవు. పరిశుద్ధం బగు జీవాత్మ స్వరూపమునకు దేవత్వము మనుష్యత్వము మొదలగునానాత్వము గలుగదు. ఎవఁడుదానికిట్టి నానాత్వముగలదని తలంచునో వాఁడువిద్వాంసుఁడు(దేహమునకంటె నాత్మస్వరూపము విలక్షణమైన దని తెలిసినవాఁడు) గాఁడు. వాఁడు దేహమునే యాత్మయని తప్పఁ దలంచువాఁడగును. [1]రెండాకాశములకును దేజస్సులకును వాయువులకును నానాత్వము గలుగనియట్లెయాత్మకును (అనఁగాఁ బూర్వాపర దేహములందు వర్తించుచుండుటంబట్టి భిన్నములయినవిగాఁ దోఁచునట్టియాత్మలకును) భేదము గలుగదు. కుండలము తెమ్ము కటకము ధరింపుమని వ్యవహరించుటకును ధారణాదిప్రయోజనముల కొఱకును బంగారు మొక్కటినే రచనావిశేషములచేతఁగుండలాదులగు నానారూపముల మనుష్యులు గ్రహించుచున్నారు. రచ

1. ఆకాశము లని ద్వివచనముచే ఘటాకాశమహాకాశములనియు రెండు తేజస్సులనుటచే సూర్యాదుల బింబ ప్రతిబింబములు రెండును, రెండు వాయువులనుటచే బాహ్యమును శారీరమునగువాయువులు రెండును (గ్రాహ్యము. ఏకకాలమందలి యీరెండేసికి భేదము గలుగనియట్లె భిన్నకాలములయందుండెడి. అనఁగా పూర్వదేహమందును బిమ్మటిదేహమందును వర్తించెడి—యాత్మలకును భేదము గలుగదని తెలియునది.

నావిశేషములు మొదలగు క్రియలకొఱకును ధారణాదులగు ప్రయోజనముల కొఱకును కుండల కటకాదులు సత్యమే; మఱి కారణమగు బంగారమునకంటె వేఱుగానివే యగును. అట్లే సూక్ష్మచిదచిత్తులతోఁ గూడిన భగవంతుఁడొక్కఁడే లౌకికములును వైదికములునగు వచనములచేత విశిష్టాద్వైతవాదులగు జనులచేత నానావిధముల జగదూపముగాఁ బరిణమించినట్లు చెప్పఁబడుచున్నాఁడు. అట్లు నానారూపములుగల జగము సత్యమగుటయే కాక కారణమగు భగవంతునికి వేఱుగాదు. [2] సూర్యునివలనఁ బుట్టినదై సూర్యునిచేతనే ప్రకాశితంబగు మేఘము సూర్యాంశమయిన కన్నులకుఁ దవస్సువలె దర్శన

---

1. 'కటకమకుటకర్ణికాది భేదైః కనకమభేదమపీష్యతేయథైకమ్ । సుర నరపశుపాదపాదిభేదైర్ధరిజిత్తోఽపిఽ దీర్ఘతేత్థైకః' ఇత్యాదులులౌకికవచనములు. 'యథా సోమ్యైకేన లోహమణినా సర్వం లోహమయం విజ్ఞాతం స్యాద్వాచారమ్భణం వికారోనామధేయం లోహమణి రిత్యేవ సత్యమ్' ఇత్యాదులు వైదికవచనములు.కుండల కటకాది దృష్టాంతముచేత కుండలాదులు సత్యమయ్యును కారణమగు బంగారునకు వేఱుగాకయుండు నట్లే జగత్తు సత్యమయ్యుఁ గారణమగు భగవంతునకు వేఱుగాకయుండునని తెలియునది. జగద్రూపవికారము నిర్వికారుఁడగు భగవంతునకుఁ జెప్పఁదగ దన్నచో భగవంతుఁడు స్వరూపముచేత నాశ చిదచిద్విశిష్టంబగు వేషముచేత నట్టి వికారమును బొందుచున్నాఁడనుటచే ఆనోషము గలుగదు. అట్లేని భగవంతుఁడు తాను వ్యాపించియున్న హేయముల దోషములయొక్క స్వర్శము నొందఁడా యన్నచో భగవంతుఁడనుటం బట్టి యట్టి హేయముల కాస్పదముగాఁ డనియుఁ దెలియునది.

2. ఇనట మేఘము సూర్యకిరణములతో మిశ్రమయిన భూమాదితమోద్రవ్యములచేతరచితమైన దగుటచే సూర్యుని వలనఁ బుట్టినదనఁబడుచున్నది. కన్నులు సూర్యాధిష్ఠితములగుటచే సూర్యున కంశముగాఁ జెప్పఁబడినది. సూర్యునియంశమగు కన్ను సూర్యునిఁజూచునప్పుడు సూర్యునివలన బుట్టిన

ప్రతిబంధకమగును (అనఁగా నా సూర్యుని మఱుఁగుపుచ్చున దగుచున్నది) ఇట్లు యహమభిమానవిషయ మగుదేహము పరమాత్మకు విశేషణమై పరమాత్మచేతఁ బ్రకాశితమై పర మాత్మునియంశ మగు జీవుని జ్ఞానమునకుఁ బ్రతిబంధకమగు చున్నది. సూర్యునివలనఁ బుట్టినయా మేఘము వాయువు చేతఁ జెదరిపోయినపుడు చక్షుస్స్వరూపము సూర్యునిఁ జూ చుచున్నది. అట్లె యహంకారపరిణామం బగు దేహమనెడియు పాధి యాత్మయొక్క జిజ్ఞాసచేత (విచారపూర్వకమైనయు పాసనచేత) నశించినపుడు, ఆత్మ పరమాత్మను సాక్షాత్కరించు చున్నది. ఇట్లు వివేకము మొదలయిన సాధనము లేఁటిచేత ననుగృహీత మగు భగవదుపాసన మనెడుఖడ్గముచేత, మా యావికారమైన యహంకారపుఁ బరిణామంబగు దేహసంబంధ మనెడి యాత్మబంధమును ఛేదించి తన యంతరాత్మ యగు నచ్యుతు ననుభవించుచుండుటయె, రాజా ! [1] ఆత్యంతిక ప్రలయ మని చెప్పుదురు. పరంతపా ! బ్రహ్మాదులగు సమ స్తభూతములకును బ్రతిక్షణమును నుత్పత్తి ప్రలయములు గలుగుచున్న వని (అనఁగా బ్రహ్మమొదలుగా సమస్తక్షేత్ర జ్ఞులశరీరము లెప్పుడును పరిణామమొందుచునేయుండుట వలన ను త్తరోత్తరావస్థ గలుగుట యుత్పత్తి యనియుఁ బూర్వా పూర్వావస్థాప్రాప్తి [2] ప్రలయమనియు) సూక్ష్మజ్ఞులయిన

మేనును అడ్డపడునట్లు, పరమాత్ముని శరీర భూతుఁ డగుజీవునకు పరమాత్ముని దర్శించినపుడు పరమాత్మనివిశేషణమగు దేహము,అడ్డపడుచున్నదనిభావము.

1. దేహోపాధివిలయమె ఆత్యంతిక ప్రలయమని తెలియునది

2. ఇవియె నిత్యోత్పత్తి ప్రలయము లనిభావము. ఇది స్థూలదృష్టులకుఁ దెలియదుఁగాన సూక్ష్మజ్ఞులు చెప్పుదు రనఁబడెను.

కొందఱు చెప్పుచున్నారు. నదీప్రవాహవేగమందు విడువం బడుచున్న తృణకాష్ఠాదులు నానావిధములయిన యవస్థలు పొందునట్లు పరిణామస్వభావములయిన దేహములకు నిత్యమును గలుగుచున్న యాయా యవస్థలు సంయోగ వియోగములంబట్టి జన్మప్రలయములకు హేతువు లగుచున్నవి. ప్రతి క్షణమును నవస్థలు గలుగుచుండినచో గనఁబడవేల యని చఱుడుగవచ్చును. ఈశ్వరమూర్తి యగుకాలముచేత నిత్యమును గలుగుచుండెడి యవస్థలు, ఆకాశమందు సంచరించుచుండు సూర్యాది జ్యోతులకుఁ బ్రతిక్షణమును దేశాంతరప్రాప్తి గలుగు చుండినను కనఁబడని యట్లు, కనబడకుండును. నిత్యప్రలయ మును నైమిత్తిక ప్రలయమును ప్రాకృతికప్రలయమును,ఆత్యంతిక ప్రలయమును జెప్పఁబడినవి. కాలముగతి యిట్టిది.కురుశ్రేష్ఠా ! జగమును సృజించువాఁడును నరులకుఁ బ్రాప్యప్రాపకములయినవాఁడును సకలసత్త్వముల కాధారమయినవాఁడును నగు భగవంతుని లీలాచేష్టితములను గుఱించిన యీముచ్చటలు నీకు సంక్షేపముగాఁ జెప్పఁబడినవి. దానిని సంపూర్ణముగాఁ జెప్పటకు బ్రహ్మదేవుఁడును శక్తుఁడు గాఁడు. నానావిధముల యిన దుఃఖములనెడు కారుచిచ్చు దరిఁగొని పట్టి వీడింపఁగా మిక్కిలి దుస్తరమయి యున్న సంసారసముద్రమును, దాఁటఁ గోరుచుండు పురుషునకు భగవంతుఁడగు పురుషోత్తముని లీలా కథల రసమును ద్రాగుటతప్పఁ దానిని దాఁటుటకు మఱియొక తెప్ప పురుషునకుఁ గలుగ నేరదు. పూర్వ మనిరుద్ధరూపుఁడును సర్వజ్ఞుఁడు నవ్యయుండు నగు నారాయణుఁడును భాగవతమైన యీపురాణసంహితను నారదునకుఁ జెప్పెను. ఆనారదుఁడు

దీనిని కృష్ణద్వైపాయనునకుఁ జెప్పెను. మహారాజా! భగవంతుఁడగు బాదరాయణుఁడు ప్రీతుఁడై వేదసమ్మతంబయినయీ భాగవతసంహితను నుపదేశించెను. దీనిచే యీ సూతుఁడు 'నైమిశారణ్యమందు దీర్ఘసత్రము జరుగుచుండఁగా శౌనకాదు లడుగునప్పు డాఋషులకుఁ దాను జెప్పఁగలఁడు'. ఇది నాలుగవయధ్యాయము.

భాగవతమునకుఁ బ్రతిపాద్యమును నిష్కర్షించి చూపుచేఁ జుక్తండగు విధమును శుకులు పరీక్షిత్తునకుఁ జెప్పుట.

శ్రీశుకుఁడు—ఈ భాగవతసంహితయం దాశ్రితబంధహరుండగు భగవంతుఁడు మిక్కిలియు వర్ణింపఁబడుచున్నాఁడు. అతని ప్రసాదమువలనఁ బుట్టినవాఁడే బ్రహ్మదేవుఁడు. అతని కోపమువలనఁ బుట్టినవాఁడు రుద్రుఁడు. అట్టి సర్వకారణుం డగు హరియె యిందు వర్ణింపఁబడుచున్నాఁడు చుమీ. రాజా! నీకు మరణ మాసన్నమై యున్నది గాన దప్పించుటకుపాయమునాకు లేదని యున్నావు. 'నే' ననెడి యాత్మనిత్యం బగుటచే మరణము గలుగదుగాన నీవు 'నేను జచ్చెదనే' యని యీపశుబుద్ధి యగు నవివేకమును దిగవిడువుము. నీవు దేహమువలెనే మునుపులేకుండి యిపుడు పుట్టినవాఁడవు గావు. ఇఁక మీఁదఁ జచ్చువాఁడవును గావు. పుట్టి మరల బీజాంకురము వలెఁ బుత్రపౌత్రాదిరూపములతోఁ గలుగఁ బోవు. ఏలనఁగా కాష్ఠమునకంటె వేఱయిన యగ్నివలె, నీవు దేహమునకంటె వేఱయినవాఁడవు. స్వప్నమందు తనశిరశ్ఛేదమును దానే చూచు

చున్నాఁడు. చూచినను భేదింపఁబడుచున్న దేహమునకంటె చాను విలక్షణుఁ డయినట్లు జాగరమందును విలక్షణుఁడగును; మఱియు దేహమునకుఁ గల నుర్గాదులను జూచుచుండుట వలన నాత్మ దేహమునకంటె వేఱు, వానికిఁ బుట్టుక లేదు. చావును గలుగదు. ఘటమునందలి యాకాశ మాఘటము పగిలినపిదప మునుపటివలె నిరూపాధికమైనయాకాశ మగు చున్నది, అట్లే దేహమందలిజీవుఁ డాదేహము మరఁగించిన పిదప (అనఁగాఁ బరమాత్మోపాసనమువలన నిరవశేషముగాఁ బ్రకృతిసంబంధము నశించినపిదప) పరిశుద్ధావస్థను బొందు చున్నాఁడు. మనస్సు జీవునకు సత్త్వాదిగుణమయములగు దేహ ములను దేహమునకు హేతువులయిన పుణ్యపాపరూపకర్మ ములను సృజించుచున్నది. ఆ మనస్సును గర్మమును మాయను సృజించుచున్నది. ఆ మాయచేతను మనోదేహకర్మముల చేతను జీవునకు సంసారము గలుగుచున్నది చమురు ప్రమిద ప్రత్తినిప్పనెడి యివి కూడియుండునంతవఱకును దీపము మంట గావెలుగుచున్నది * ఇట్లే సంసారమును కర్మారబ్ధములగు దేహేంద్రియము లుండువఱకు వెలయుచున్నది. రజస్సత్త్వ తమస్సుల వ్యాపారముచేత (అనఁగా మూఁడుగుణముల సంస ర్గము కారణముగా) నాత్మకుజననమును మరణమును గలుగు చున్నవి. స్వతస్సిద్ధముగా నవి యాత్మకుఁ గలుగవు. ఎట్లన నా దేహము పుట్టినపుడును బచ్చునపుడును నాత్మకూడఁ బుట్టు టయు బచ్చుటయు, గలుగదు. ఏలన నది వ్యక్తమగు శరీర

* ఇట చమురు కర్మము. ప్రమిద మనస్సు. ప్రత్తి దేహము అగ్నిసంయో గము దేహాత్మాభిమానము. దీపము సంసారమని తెలియునది.

మునకును నవ్యక్తమగు మూలప్రకృతికిని వేఱయినది. వాని కంటె విజాతీయమైనది గావునను యది స్వయంప్రకాశమైనది. ఘటము మొదలయిన యుపాధులకంటె నాకాశము వేఱయి నట్లు దేహమునకంటె వేఱయినయాత్మ దేహమునకు ధారక మైనది, స్వభావముచేత నపరిచ్ఛిన్నమైనది. స్వరూపముచేత వికారములేనిది. ఇట్లు పరమాత్మయందును దేహమునందును నెలకొనియున్న యాత్మను నాత్మచేతనే విచారమునేయుము. శాస్త్రజన్యమగు జ్ఞానముతో నాత్మ వివర్శనముచేయు బుద్ధి తోఁగాని, వాసుదేవుని చింతనేయుచుండు బుద్ధితోఁగాని కూడియుండువేని తఱుకుఁడు బ్రాహ్మణవాక్యముచేతఁ బ్రేరి తుఁడయినను నిన్ను దహింపఁజాలఁడు. (అనఁగా నీకు వేదనఁ బుట్టింపనేరఁడు), ఈశ్వరుఁడు మృత్యువులకును మృత్యు వు. కాఁబట్టి యతనిని మృత్యుహేతువయినవి దహింపఁజాలవు. అట్టివానిని నిన్నుగూడ నవి దహింపనేరవు చుమీ. 'నేను బరమధామంబగు బ్రహ్మము;పరమప్రాప్యంబగు బ్రహ్మము నేను' అని యి ట్లనుసంధించుచుఁ బ్రాకృతశరీరరహితుఁ డగు పర మాత్మయందుఁ బ్రత్యగాత్మను శేషత్వైకరసునిఁగా ధ్యానిం చుచు నుండుఁడు. అపుడు విషయసుఖమాలతో నాలుకలు గ్రోయు చుఁ దఱుకుఁడు నిన్నుఁ గఱవఁగా, వానిని, బరమాత్మకు వేఱ యినశరీరమును బ్రపంచమును (భగవత్స్మరణానందమగ్నుండ వగుటంజేసి కనుఁగొనవు. రాజా! హరి చేష్టలను గుఱించి నీ వేమేమి యడిగితివో యదియంతయు నీకుఁ జెప్పితిని. మఱియు నేమి వినఁగోరుచున్నావు.? అనెను. ఇది యేనవయధ్యాయము

శుకులుపరీక్షిత్తునివిడిచి పోవుట.తక్షకదష్టుఁడై పరీక్షిత్తు మృతుఁడగుట. జనమేజయుని సర్ప యాగము. వేదవిభాగ ప్రచారాదికము.

సకలమైన యాత్మలను సామ్యమునఁ గనుఁగొనునట్టి యా ముని వ్యాసపుత్రుఁడు శుకుఁడు చెప్పిన యీభాగవత సంహిత నంతయును విని యతనికిశిరనువంచి పాదకమలములకు మ్రొక్కి యంజలి గీలించి పరీక్షిత్తు 'నీవు కరుణాత్ముఁడవై యాద్యంత రహితుఁడయిన యా భగవంతుని హరిని సతనిఁ బ్రాప్తించు నుపాయమును వినిపించితివి గాన యెంతయు ననుగ్రహించితివి. కాఁబట్టి సిద్ధార్థుఁడనయితిని అచ్యుతునియందే చిత్తము నెల కొనియుండు మహనీయులకు సంసారతాపత్రయులయి యజ్ఞులయి యున్న ప్రాణులయం దనుగ్రహము గలిగియుండుట మిక్కిలి యాశ్చర్యముగాదని నాకుఁ దోఁచుచున్నది. ఉత్తమశ్లోకుం డయిన భగవంతుఁడు మిక్కిలియు వర్ణింపఁబడి యీ భాగ వతపురాణసంహితను నీవలన మేము విన్నవారయితిమి. మహాత్మా! అభయంబై యానందరూపమైన బ్రహ్మమును నీవు చూపఁగా సందు జొచ్చి యనుభవమున మునిఁగియున్నవాఁ డనుగాన తక్షకుఁడు మొదలయిన మృత్యువులకు నెంత మాత్రము వెఱవను, బ్రాహ్మణోత్తమా! నేను మానముపూని మనంబునందలి కామములనుండియుఁ గామ వాసనలనుండియు విడివడి దాని నధ్యోక్షజునియందుఁ జొనిపి ప్రాణములను విడుచుచున్నాను. అందులకై నాకనుజ్ఞయిమ్ము ఉపదేశము వలన జ్ఞానమును భగవదనుభవాత్మకమగు జ్ఞానమును గట్టిగా నాశ్రయించుటవలన దేహాభ్రమము మొదలయిన యజ్ఞా

నము దూలింపఁబడినది. మఱియు మీరు కేవల సుఖరూప మయియున్న భగవంతుని స్వరూపమును జూపితిరి' అనెను. సూతుఁడు—పరీక్షిత్తిట్లు చెప్పఁగా భగవంతుఁ డాశుకుఁడు రాజువలన సెలవుఁ బుచ్చుకొని యాతనిచేతఁ బూజలంది యంత మునులంగూడి తన నెలవునకుఁ బోయెను. రాజర్షియగు పరీక్షిత్తును బరమాత్మయందుఁ దన యాత్మశేషతైకరసమై నదిగా ధ్యానించి గంగాతీరమందుఁ దూర్పు మొనలుగల దర్భల యందుత్తరాభిముఖుఁడై కూర్చుండి మ్రానివలెఁ గదలక మెదలక సకలేంద్రియవ్యాపారములను మాయముచేసి దేహ మందును దాని యనుబంధులయందును నభిమానము లేక సంశ యము లెల్లఁ ద్రుంచి మహాసమాధినొంది పరిశుద్ధముక్తావస్థఁ జెందినవాఁ డయ్యెను. బ్రాహ్మణులారా ! అప్పుడు బ్రాహ్మణ కుమారుఁడు శృంగి క్రుద్ధుఁడై పురికొలిపిన తక్షకుఁడు రాజును జంపగోరి పోవుచు మార్గమునఁ గాశ్యపునిఁ జూచెను. అతఁడు విషచికిత్సచేసి పరీక్షిత్తుని రక్షించి ద్రవ్యమును గడించుటకై పోవుచుండెను.అతఁడు తక్షకుఁడు గఱవఁగా నీఱయినవృక్షమును మరల మొలకొత్తి పొడసూపునట్లు చేయుటంబట్టి విషమును హరించువాఁ డగుననితెలిసి యావిప్రుఁడుకోరినధనముల నిచ్చి తృప్తిగా వించిమఱల్చియంత నా సర్పరాజు బ్రాహ్మణరూపమున మఱుఁగుఁజేసికొని పరీక్షిత్తునిఁ గఱచెను. రాజా తక్షకుఁడు గఱవఁగమాత్రమునఁ బే ముక్తావస్థ నొందియుండెను. అట్టి రాజర్షి దేహము సర్వవిషాగ్నిచేత నెల్లవారును జూచుచుండఁగా తోడనే నీఱయ్యెను. భూమియందును నాకాశమందును దిక్కు లయందు నెల్లయెడల మిక్కుటమయిన హాహాకారము చెల

రేఁగెను, దేవతలును నసురులును మనుష్యులును మొదలగువా రెల్ల మిక్కిలియు నాశ్చర్యపడినవా రయిరి. దేవదుందుభులు మొరసెను, గంధర్వులు నప్సరసులును బాడిరి. దేవతలు బాగు గా గసుచుఁ బువ్వులవానలు కురిసిరి. జనమేజయుఁడు తన తండ్రి తక్షకునిచేత భక్షితుండయ్యెనని విని మిక్కిలి క్రుద్ధుఁడై యప్పుడు మేటి బ్రాహ్మణులనుగొని యాగముచేయుచు నందు సర్పములనెల్ల వేల్వఁదొడఁగెను. సర్పయాగమునందు జ్వలించు చున్న యగ్నిహోత్రమున మహా సర్పము లెల్ల దగ్ధము లగు చోఁడుటను జూచి తక్షకుఁడు భయమున వడఁకుచు నింద్రుని శరణుజొచ్చెను. జనమేజయుఁ డగ్నిహోత్రమునకుఁ దక్షకుఁడు రాకుండుటనుజూచి బ్రాహ్మణులతో 'సర్పాధముఁ డా తక్షకుఁ డేల పడి దగ్ధుఁడు గా కున్నా'డని యడిగెను. బ్రాహ్మణులు 'రాజేంద్రా! వాఁడింద్రుని శరణుజొచ్చినందున నతఁడు వానిని రక్షించుచున్నాఁడు. ఇంద్రుఁ డట్లు వారించుచున్నాఁడు గాన యా సర్ప మగ్నియందుఁ బడకున్నాఁడు' అనిరి. జనమేజయుఁ డది విని యుదారబుద్ధిగాన ఋత్విజులతో 'బ్రాహ్మణులారా! ఇంద్రునితోఁగూడ నాతక్షకుని నగ్నియం దేల కూల్పరు' అనెను. అదివిని బ్రాహ్మణు లాయజ్ఞమందు తక్షకా! ఇంద్రునితోడను నతని నావరించియున్న మరుద్గణములతోను గూడ వేగవచ్చి పడు'మని యింద్రునితోఁగూడఁ దక్షకుని వేల్వసాగిరి. ఇట్లు బ్రాహ్మణులు పలికిన పరుషవాక్యములచేత నింద్రుఁడు తనవిమాన ముతోడను దక్షకునితోడను స్థానమునుండి కదల్పబడెను. అందుల కతఁడు మనంబున భీతినొందెను. అట్లాయింద్రుఁడు విమానములతోడను దక్షకునితోడను నాకాశమునుండి పడు

చుండఁగాఁ జూచియాంగిరసుఁడగు బృహస్పతి రాజుతో 'మను జేంద్రా! నీవలన నీ సర్పరాజు వధమునొందుట కర్హుఁడు గాఁడు. ఇతఁ డమృతము ద్రాగియున్నాఁడు. వీనికి జరామరణ ములు గలుగవు, రాజా! ప్రాణికిఁ బుట్టుకయును జావును స్వర్గ నరకాదిగతులునుఁ దనతనకర్మముచేతనే కలుగుచున్నవి. కావున నొకనికి సుఖదుఃఖములు మఱియొకనివలనఁ గలుగవు అన్నిటిని సొంతకర్మములే కలిగించుచున్నవి. జంతువు, సర్పము, దొంగ లు, శత్రువులు, నిప్ప,జలము, ఆఁకలి, దప్పి, తెవులు మొదలగు వానివలన మరణము నొందుచున్నది. ఇట్లు వానివలన మర ణమునొందుట తన ప్రారబ్ధకర్మము ననుభవించుటయే కాని మఱొకటి గాదు. కర్మమువలననే యామరణము కలిగెనని తలంపవలయును గాని యీ సర్పాదులవలన ననికాదు. రాజా! కాఁబట్టి యాభిచారికమైన యీ సత్రమును ముగింపుము. నిరప రాధములయిన సర్పములు దగ్ధము లయినవి. ఏలనఁగా 'జనులు ప్రారబ్ధమును గుడువకతప్పదుగదా' యనెను. బృహస్పతి యిట్లు చెప్పఁగా రా జు మహర్షివచనమును బహూకరించుచు సర్ప సత్రము నుడిగి యాతనిని బూజించెను. (బ్రాహ్మణకోపము వలనఁ బరీక్షిత్తునకును జనమేజయ కోపమువలన సర్పములకును మృత్యువు గలిగినదిగదా. ఇట్లు విద్వాంసులకుఁగూడ సమ్మో హము గలుగుటకుఁ గారణమేమి' యన్నచో) ఇ ట్లొకని బాధించువానిని గాను మఱొకనిని వానిచే బాధింపఁబడు వానినిగాను గలిగించినదెల్ల విష్ణువు నుహా మాయయేకాని మఱియొకటి గాదు. ఆ మాయనుబట్టియె యీ యా త్మ విషయములందు గుణవ్యాపారములచేత మోహమునొందు

చున్నది. పరమాత్మ స్వరూపనిరూపకులగువారు పరమాత్మ స్వరూపము నొక్క-సారియైనను జేయుచుండునపుడు మాయ తన కార్యమును జేయనేరదనఁగా నిఁక వారికి విషయమైన పరమాత్మస్వరూపమునం దది తన కార్యమును జేయనేరదని చెప్పనేల? మఱి యీ పరమాత్మునియందు మాయాప్రయుక్త మోహమువలన నానావిధములయిన కుతర్క-రూపములగువికారములు గలుగవు. ఏలన వాని కది గోచరము గానేరదు. మఱియు నాపరమాత్మయందు మనస్సు సంకల్ప వికల్ప వ్యాపారములతోఁ గూడి ప్రవర్తింపనేరదు. అట్టి మనస్సున కును నది గోచరము కానేరదు. ఏలన సంకల్ప వికల్పము లెల్ల నివర్తించి మోగముచేఁ బరిశుద్ధమయిన మనస్సునకే యది విషయమగునది మఱియు నా పరమాత్మయందుఁ గర్మమును నది సృజించుశరీరమును గలుగవు. కర్మమువలనను నదికల్పించు దేహమువలనను సాధ్యము లగు సుఖదుఃఖాదిఫలములును గలుగవు. జీవుఁడు మనుష్యుఁడు మొదలయిన శబ్దసమూహమును నందువర్తింపవు. పరమాత్మ స్వరూప మిటువంటిది. జీవుఁడు తాను దనంతట మూఁడుగుణములకు వశ్యుఁడయినను నట్టి పరమాత్మ స్వరూపమును మననము చేయుచుండినచోఁ బృథివి మొదలయిన యీయాయచిత్తత్త్వమును బరిహరించి యాఁకలి దప్పి మొదలయిన యూర్మిలను నిరసించి మనస్సును సమాహితము చేయుటచే, నొకటి నొకటి గలిగించుచును నడఁగించుచు నుండు మూఁడు గుణములు రూపుమాయునట్లుగా, వ్యాపారము లెల్ల నుడిగినవాఁ డగును. 'నేతి నేతి' యని ప్రకృతి ప్రాకృత జడాజడవస్తువులెట్టివో యట్టిది కాదు కాదని దానికంటె నితరము

లయిన చేతనాచేతనములనెల్ల వ్యావర్తింపఁ గోరుచుండునట్టి వారు దానిని బ్రకృతి పురుష విలక్షణమై వైష్ణవంబగు స్వరూపముగా నెన్నుచుందురు. మఱియు నట్టివారు రాగద్వేషాదులను విడిచి భగవంతుఁడు తప్పఁ దక్కినవానియందు సౌహార్దము లేక ధ్యానాదులచేత దానినిసంశ్లేషించి సమాధినిష్ఠులై యిట్టిదిగా నిశ్చయించియున్నవారు. ఎవ్వరికి గేహదేహములను గూర్చికలుగు 'నేను' 'నాది' యనెడు దౌర్జన్యము గలుగదో యట్టివా రా విష్ణువు పరమంబగు పదమును నుపాసనముచేత సాక్షాత్కరించుచున్నారు. పరుసములయినమాట లెవరేనిపలికిన సహించుకొనవలయును. ఎవ్వరిని నవమానింపరాదు. ఈ మనుష్యదేహము నాత్మగా నుద్దేశించి యెవ్వనితోడను వైరము పెట్టుకొనరాదు అసంకుచిత బుద్ధియగునాభగవంతునికి వేదవ్యాసులకు నమస్కారము. ఆతనిపదాంబుజముల ధ్యానము వలననే నీసంహిత నధిగమించితిని' అనెను. శౌనకుఁడు వేదాచారనిరతులును వేదప్రవర్తకులును మహాత్ములునగు పైలుఁడు మొదలగు వ్యాసశిష్యులచేత వేదము లెన్నివిధముల విభజింపఁబడినవి? సౌమ్యా! వీనిని మాకుఁ జెప్పు'మని యడిగెను.

సూతుఁడు—బ్రాహ్మణోత్తమా! భగవంతునియందు నెవ్వని మనస్సు సమాహితమైయుండునో యా పరమేష్ఠి యగు బ్రహ్మదేవుని హృదయమందలి యాకాశమునుండి నాదము (అనఁగా నాయాకాశముతోఁ గూడిన వాయువుపరిణామంబగు ప్రాణఘోషము) ఆవిర్భవించినది. ఆనాదము చెవులను మూసికొనుటవలన వినఁబడుచున్నది. ఆనాదము నుపాసించుట వలన యోగులు శరీరమువలనను బుణ్యా పుణ్యకర్మఫల

వలనను నింద్రియముల వలనను గలుగు కర్మములను దూలించి యీ యుపాసనము జ్ఞానోత్పాదకమగుట వలన మోక్షమును బొందుదురు. ఆ నాదమువలన నుండి యకారోకార మకారములు మూఁడువర్ణించుచున్న యోంకారము పుట్టినది. యోగులు గానివారికి దానికిఁ బుట్టుక తెలియుట యశక్యము. అది తనంతటనే ప్రకాశించుచుండునది. అది భగవంతుఁడను బరబ్రహ్మంబునగు పరమాత్మునకు వాచకమయినది. ఎవ్వఁ డీ ప్రణవరూపంబగు శబ్దమును జెవులు గట్టిగామూసి ధ్యానియున్నను గూడ వినుచున్నాఁడో వాఁడు పరమాత్ముఁడే; జీవుఁడెలె నింద్రియాయత్తజ్ఞానము గలవాఁడు గాఁడు. ఆ ప్రణవము చెవులు మూసికొనుటవలన విషయాంతరములు కనుఁగొనకుండఁగా వినబడుచుండునది. దానిచేత లౌకికవైదిక శబ్దరాశి యంతయు వ్యక్తమగుచున్నది. ఆప్రణవస్వరూపమునకు హృదయాకాశము వెలువడు స్థాన మగును. అది స్వయంప్రకాశమందు నెలకొనియున్న బ్రహ్మమునకుఁ బరమాత్మునకు సాక్షాద్వాచకమయినది. అది సమస్తములయిన మంత్రములకును నుపనిషత్తులకును వేదములకును బీజమయినది * అది సనాతనము. భృగూద్వహా! ఆ ప్రణవమునకు నకారము మొదలయిన మూఁడువర్ణములు కలిగెను. ఆయకారాదులు మూఁటి చేత (నన్యార్హశేషత్వము అనన్యశరణత్వము అనన్యభోగ్యత్వమునెడి) మూఁడర్థములు ప్రకాశింపఁ జేయఁబడుచున్నవి. మఱియుఁ బ్రాప్యత్వము ప్రాపకత్వము మొదలయిన గుణము

* ప్రణవము సనాతనమయిన దనుటంబట్టి యది హృదయాకాశమందు అభివ్యక్తమైనదే కాని యుత్పన్నమయినదని కాదని తెలియునది.

లను బ్రతిపాదించు నారాయణాదినామములు నభిధా
వృత్తిచేత స్వార్థములందే వర్తించుచుండుటయు, వానివలనఁ
దెలియఁబడుచున్నవి. చతుర్ముఖశరీరకుఁడగు భగవంతుఁడా
ప్రణవమునుండి నఖండరసమామ్నాయమును సృజించెను. అవి
హ్రస్వములును దీర్ఘములు నంయనయాంతస్థము లూష్మములు
స్వరములుస్పర్శములు నని యొప్పుచుండును. చతుర్ముఖశరీరకుం
డయిన యావిభుఁడా యఖండరసమామ్నాయముచేత యజ్ఞ
ములను బ్రకాశింపఁ జేయుతలంపునవ్యాహృతులతోను సప్రణ
వముగాను నాలుగువేదములను నాలుగుముఖములనుండి యా
విష్కరింపఁజేసెను.ఆ బ్రహ్మయానాలుగువేదములను వేదోచ్చా
రణాదులందు నిపుణులును బ్రహ్మర్షులునయిన మరీచి మొదలగు
పుత్రులను జదివించెను. వైదికధర్మముల నుపదేశించెడియా
మరీచి మొదలగువారు తమపుత్రులయిన కశ్యపాదులకువానినుప
దేశించిరి. ఇట్లానేదములు ధృతివ్రతులయిన వారివారి శిష్యు
లకు నుపదేశించుచురాఁగాఁ బ్రతిచతుర్యుగమునను బరం
పరగా వచ్చుచుండెను. అందుఁ బ్రతిద్వాపరము తొలు సంధి
యందును మహర్షులగువారు యుగధర్మమును బట్టి జను
లాయుష్యమందును సత్త్వమునందును బుద్ధియందును క్షీణించి
యుండుటనుజూచి దానిని విభజించిరి. ఆ బ్రహ్మర్షులు తమ
హృదయములం దున్న యచ్యుతునిచేతఁ బ్రేరితులై యా
వేదములను వ్యస్తములు చేసిరి. కాని, తమంతట నట్లు
చేసినవారు గారు. బ్రాహ్మణోత్తమా! ఈ లోపల లోక
భావనుండగు పరబ్రహ్మమాభగవంతుఁడు బ్రహ్మశివాదు
లయిన లోకపాలురు ధర్మరక్షణార్థము తన్ను వేఁడికొనఁగాఁ

బరాశరునివలన సత్యవతియందు నంశాంశభాగముచేత వ్యాసుం డై యవతరించి వేదములను నాలుగు విధములు చేసెను. ఋగ్యజుస్సామాథర్వములురానులుగాఁబడియున్న వానినుండి, పోగువులుగాఁ బడియున్న మణులగుంపులనుండి యాయా మణులను వేఱువేఱయెత్తి దండలు గ్రుచ్చునట్లు, ఆయా ఋగాదులను వేఱువేఱ పర్గములుగా నెత్తి నాలుగు సంహితలను జేసెను. ఆ మహామతి తన శిష్యులగు నలువురను బిలిచి యా సంహితలలోనొక్కొక్కదానిని నొక్కొక్కనికి నిచ్చెను. అం దుఁబైలుం డను శిష్యునకు బహ్వృచంబనఁబడు ఋక్సంహితను మొదటిదాని నుపదేశించెను. వైశంపాయనుఁ డను శిష్యునకు నిగదం బనెడి యజుర్గణము నుపదేశించెను. జైమినికి సామము లందు ఛందోగసంహిత నుపదేశించెను. అథర్వాంగిరసమను శాఖను తన శిష్యుండగు సుమంతున కుపదేశించెను. వైలుఁడు బహ్వృచం బనెడు తన సంహితను రెండుగా విభజించి తన పుత్రుఁడయిన యింద్రప్రమితికిని శిష్యుఁడయిన బాష్కలునకును నుపదేశించెను. ఆ బాష్కలుఁడు తన సంహితను నాలుగుగా విభజించి శిష్యులయిన బోధ్యునకును యాజ్ఞవల్క్యునకును బరాశరునకును నగ్నిమిత్రునకును నుపదేశించెను. ధీమంతుఁ డయిన యింద్రప్రమితి తన సంహితను దనపుత్రుఁడును విద్వాంసుఁడు నగు మాండూకేయఋషిచేతఁ జదివించెను. ఆమాం డూకేయుని శిష్యుఁడు వేదమిత్రుఁడు దానిని సౌభరిమొదల యిన శిష్యులకు నుపదేశించెను. ఆ మాండూకేయుని పుత్రుఁడు శాకల్యుఁడు తన సంహితి నయిదువిధములుగా విభజించి వాత్స్యుఁడు ముద్గలుఁడు శాలీయుఁడు గోఖల్యుఁడు శిశిరుఁ డను

నేర్పరచేతఁ జదివించెను. ఆశాకల్యుని శిష్యుఁడు జాతుకర్ణుఁడు తన సంహితను దాని నిరుక్తమును నాలుగుగా విభజించి బాగా కుసకును పైంజునకును వైతాలునకును విరజునకును నొసంగెను. బాష్కలుని పుత్రుఁడయిన బాష్కలి యీ చెప్పఁబడిన శాఖలన్నింటినుండి యెత్తివాలఖిల్యమునెడు సంహితను గనించెను. పైలాయనుఁడును గార్గియుఁ గాసారుఁడును దానిని జదివిరి. ఇవి యెల్లను బహ్వృచ సంహితలు. వీని నా బ్రహ్మర్షులు ధరించిరి. ఈ ఛందస్సుల విభాగమును విని జనుఁడు సర్వపాపములనుండి విడివడుచున్నాఁడు. (ఇది ఋక్ఖిలావిభాగము. ఇఁక దైత్తిరీయశాఖ యుత్పత్తి చెప్పఁబడెడిని) వైశంపాయన శిష్యులు అధ్వర్యువులని చరకులనియుఁ జెప్పఁబడుదురు అధ్వర్యుశాఖ నధ్యయనము చేయుటచేత నధ్వర్యువు లనఁబడిరి. బ్రహ్మహత్యాగూపపాపమును నశింపఁ జేయుటకై తమగురు వనుష్ఠింపవలసిన వ్రతమును దాము నాచరించినందున చరకులనియుఁ జెప్పఁబడిరి. వైశంపాయనునకు మఱియొక శిష్యుఁడుయాజ్ఞవల్క్యుఁడనువాఁడు గలఁడు. అతఁడు గురువును జూచి 'భగవంతా! ఈయల్పములయిన తపస్సుల నాచరించినవేమి ఫలము? నేను మిక్కిలి దుష్కరమయినవ్రతము నాచరించుచున్నా' ననెను అందులకు గురువు వైశంపాయనుఁడు బ్రాహ్మణుల నట్లు వానించిన యాజ్ఞవల్క్యునియెడఁగుపితుఁడై 'నీవిఁక జాలును. పొమ్ము నావలన నధిగమించినదానిని వేగ త్యజింపు' మనెను. దేవరాతుని పుత్రుఁడయినయాయాజ్ఞవల్క్యుఁడు యజుర్గణములను గ్రక్కి వెడలిపోయెను. అంత మును లాయజుర్గణములనుజూచి క్రక్కినదానిని బ్రాహ్మణరూపములతోఁగొనుట యనుచితమని

తలఁచి) వానియందలి చాపలముచేతఁ దిత్తిరపక్షులై యాయ జస్సులనుమ్మింగిరి. కాఁబట్టియజుశ్శాఖలు తైత్తిరీయములనిపేరొం ది మిక్కిలిరమ్యములయినవి. అంత యాజ్ఞవల్క్యుఁడుగుఱువ లనఁజదివినచందస్సులను వెదకీననుఁగానకయాదిత్యమండలములో నున్న యీశ్వరునిట్లుస్తుతించెను.[1] భగవంతుఁడొక్కఁడే యఖి లజగత్తులకు నాత్మస్వరూపమును గాళ్ళస్వరూపమునను నుండి (దేవ మనుష్య పశువృక్షము లని) బ్రహ్మమొదలుగా స్తంబము వఱకుఁగలనాలుగు విధములయిన భూతసమూహములహృదయ ముల లోపలను వెలుపలను నాకాశముపలె నుపాధిచే వ్యవధి నొందక (అనఁగా వ్యాప్యముల దోషములను చానును బొంద క) క్షణము లవము నిమేషము మొదలగు నవయవములచేతఁ బెరిగిన సంవత్సరగణముచేత జలములను బీల్చుకొనుచు మరల నిచ్చుచును నీలోకయాత్రను నిర్వహించుచున్నాఁడు. అట్టి భగవంతునకు నాదిత్యునకు నమస్కారము. ఓ విబుధర్షభా! సవితా! తపనా! అహరహము మూఁడు సంధ్యలయందును వైదికమార్గమునఁ దన్నుప్రస్థాపనముచేయుజనులు సమస్తపా పములను దుఃఖములకు బీజమగు సజ్ఞానమును భర్జించునట్టి తేజము గలిగి క్రిందుగాఁ దపించుచుండు నీమండలమును జక్కఁగాఁధ్యానించుచున్నాము. నీవు నీ శరీరములగు స్థావర

---

1. ఇందు ఆఖిలజగదాత్మ స్వయాపమునలోపలఁజొచ్చిప్రేరించుచున్నాఁ డని గాయత్రీ ప్రథమపాదమందలి సవితృశబ్దమునకు నర్థము చెప్పఁబడెను. ఇక రెండవపాదమందలి భర్గశ్శబ్దార్థము చేతస్తుతించుచున్నా రనితెలియునది.

2. ఇందుగాయత్రీ ద్వితీయపాదమందలిభర్గశ్శబ్దార్థము ప్రతిపాదింపఁబడినది.

3. ఇందుగాయత్రీ తృతీయపాదమందలి సర్వధీ ప్రచోదయి తృత్వము చెప్పఁబడినది.

జంగమసమూహముల మనస్సులకును నింద్రియములకును భూత గణములకును జీవులకును నాధారభూతుండవై యంతర్యామివైయే యుండివానినెల్లఁ బ్రేరించుచున్నావు. మిక్కిలి భయంకరముఖము గల యంధకాసురుఁడు నిజగరగ్రహము పట్టికొనఁగా మృతిఁజెం దిన దానివలె సంజ్ఞలేకయున్న యీలోకమును జూచియితర సాధారణమైన * కృపాదృష్టిచేత లేపి ప్రతిదినమును మూఁడు సంధ్యలును నిన్నారాధించుటయగు చిత్తసమాధానమనెడి శ్రేయమందుఁ బ్రవర్తింపఁజేయుచున్నాఁడవు దేవాధిపతివగు నీవు భూపతివలె దుష్టజంతువులకు భయమును బుట్టించుచు, నందందు నలుగడల దిక్పాలురు తామరమొగ్గలవంటి చేమోడ్పులఁ బూజలొసంగఁ దిరుగుచుందువు. భగవంతా! త్రిలోక మూలగురువు లగు బ్రహ్మాదులచే నభివందిత మగు నీవు పదకమలయుగళమును నేను సారము తీసిపోకున్న యజుస్సులను గోరి భజించుచున్నా' నని యుపస్థానము చేసెను. ఇట్లు స్తుతింపఁగా నాభగవంతుఁ డశ్వరూపధరుఁ డయిన విష్ణువు యజుస్సులను సారముచెడ కుండఁగనే ప్రసన్నుఁడై యాముని కొసంగెను విభుఁ డాయాజ్ఞవల్క్యుఁ డపరిమితములయిన యజుస్సులచేఁ బదియేనుశాఖలను గావించెను. అంత నశ్వరూపుఁడగు హరియాజ్ఞవల్క్యనియం దుంచిన శాఖలను బిదపఁగాణ్వులును మాధ్యందినులును సధ్యయనము చేసిరి. సానుగుఁడగు జైమిని మునికిఁ బుమంతుఁడను పుత్రుఁ డుండెను. ఆ పుమంతుని కొడుకు సుతన్వుఁడు. జైమిని యాపుత్రపౌత్రుల కిద్దఱకు నాసంహితను

* ఇందు చతుర్విధపురుషార్థ ప్రదత్వము తెలుపుచున్నాఁడు.

రెండుగా విభజించి చెరొకటి యిచ్చెను. ఆ జైమినిశిష్యుడు మహనీయుడగు సుకర్ముడనువాడు సామవేద వృక్షమునుండి నామములకు వేయి శాఖాభేదములను గావించెను. ఆ సుకర్మని శిష్యులు కౌసల్యుడగు హిరణ్యనాభుడు పౌష్పింజి డను సిద్ధులు గలరు. ఆ యిద్దఱును సుకర్మని మఱి యొక శిష్యుడును బ్రహ్మవిత్తముడనయిన యావంత్యుడును వానిని గ్రహించిరి. పౌష్పింజునకును నావంత్యునకును హిరణ్యనాభునకును సామగుణయిన యేనూఱుగురు శిష్యులదీచ్యులనువారుండిరి. ఆ యుదీచ్యులనుగొంద ఱుప్రాచ్యులనియుఁ జెప్పదురు. పౌష్పింజుని శిష్యులయిన లోకాక్షియు జాగలియుఁ గల్యుడును గుసీదుడును గుక్షియు ననువారు చెఱొకనూఱు సంహితలను గ్రహించిరి. హిరణ్యనాభుని శిష్యుడగు కృతుండిరువదినాలుగు సంహితలను దనశిష్యులకుఁ జెప్పెను. తక్కిన సిద్ధములగు శాఖలను నావంత్యుడు తన శిష్యులకుపదేశించెను. ఇది యాఱవయధ్యాయము.

అథర్వవేదవిభాగము

సూతుఁడు—అథర్వవిదుఁడగు సుమంతుఁడు * కబంధుఁడను తనశిష్యునిచేతఁ దన సంహితను జదివించెను. ఆశిష్యుఁడును దానిని రెండుగా విభజించి పథ్యునకును వేదదర్శనకును నుపదేశించెను. శౌల్కాయని, బ్రహ్మబలి, మౌద్గలుఁడు, పిప్పలాయని యను వీరు వేదదర్శని శిష్యులు. ఇక బథ్నునిశిష్య

---

* ఇందు కబంధుఁడని చెప్పఁబడియున్నను 'అథర్వవేదంసముని స్సుమన్తు రమితద్యుతిః। శిష్యమధ్యాపయామాస కబన్ధంపోపిచద్విథా' అని వైష్ణవమం సుఁ జెప్పఁబడుటంబట్టి యిచటను నట్లే గ్రహింపఁబడుట తెలియునది.

లనువినుము. కుముదుఁడు శునకుఁడు జూడలియు నతని శిష్యులు. బభ్రువును నాంగిరసుఁడగు సైంధవాయనుఁడు నసెడిశౌన కునిశిష్యు లీరువురును నాసాహితల రెంటి నధిగమించిరి. వా రిరువుర శిష్యులగు సావర్ణ్యుఁడు మొదలగునితరులును నట్లె యీ రెంటి నధిగమించిరి మఱియు నక్షుత్రకల్పుఁడును శాంతియుఁ గాశ్యపులును నాంగిరసులును నథర్వవేదశాఖను విభజించి వా నిని బ్రవర్తింపఁ జేసినవా రగుదురు. ఇఁక బౌరాణికులనుజెప్పె దను వినుము త్రైయ్యారుణి, కశ్యపుఁడు, సావర్ణి, అకృతవ్ర ణుఁడు, వైశంపాయనుఁడు, హారీతుఁడు, నని యీయార్వురును బౌరాణికులు. ఈయార్వురును వ్యాసశిష్యుండును నాతండ్రియు నగు రోమహర్షణుని వలన నొక్కొక్క పురాణసంహిత * నధి గమించిరి. నేను వీరందఱకును శిష్యుఁడనై యున్నిటి నధిగమించి తిని. కాశ్యపుఁడును నేనును సావర్ణియుఁ బరశురాముని శిష్యుఁడయిన యకృతవ్రణుఁడును వ్యాసపుత్రుఁడగుశుకునివలన నుండి మూలసంహిత లను నాలుగింటిని నధిగమించితిమి. పురాణలక్షణములను వేదశాస్త్రాను సారముగా బ్రహ్మర్షులునిరూ పించినవానిని జెప్పెదను. బుద్ధినూఁది వినుము. సర్గము,విసర్గము, వృత్తి, రక్షు, అంతరము, వంశము, వంశానుచరితము, సంస్థ, హేతువు, అపాశ్రయ మని లక్షణములు పది. పురాణలక్షణ విదు లగువారు పురాణము పదిలక్షణములతోఁ గూడినదని తెలి యుదురు. కొన్ని మహాపురాణములుగను గొన్ని యల్పపురాణ

* దీనిని బట్టి వ్యాసుఁడు ఆఱుసంహితలను రోమహర్షణునకిఁ జెప్పె ననియు నతని వలన నీ యార్వురు పౌరాణికు లొక్కొక్కటి యధిగమించి రనియుఁ దెలియుచున్నది.

ములుగను నేర్పాటు గలిగియుండుటంబట్టి యల్పపురాణము లకు (సర్గము, ప్రతిసర్గము, వంశము, మన్వంతరము, వంశానుచరిత మని) పంచలక్షణములు గలిగియుండును. అవ్యాకృతం బనబడు మూల ప్రకృతిగుణములయిన సత్త్వ రజస్తమస్సులు కలగుండు నొందుటవలన నా మూఁడును మహత్తుగాఁ బరిణమించుచున్నవి. ఆ మహత్తునుండి యహంకారమును, దాని నుండి యాకాశాదిభూతములును వాని సూక్ష్మములయిన శబ్దాదులును నింద్రియములును బుట్టుచున్నవి. వీని పుట్టుకయె సర్గ మనఁబడును. పరమపురుషుఁడు సృష్టిసేయు సామర్థ్యమును గలిగించినపిమ్మట నీ మహదాదితత్త్వములు సంఘాతముగాఁ గూడికనొంది కారణబీజమునుండి కార్యబీజమువలె నవ్యాకృతమునుండి మహదాదిక్రమమునం బుట్టుచుఁ జరాచరాత్మకంబగు జగత్తగుచున్నది. ఇట్లన్నియుఁగూడి జగత్తగుటయె విసర్గ మనఁబడుచున్నది. ఈ విసర్గమునకు జీవుల కర్మవాసనయె మూలము. చరములగుచున భూతములకు నచరములయిన భూతములు జీవనోపాయము. అది యీశ్వరుఁడే కావించెను. మఱియు నది మనుష్యులకు రాగమువలనను గలుగునదే కాక శాస్త్రముచేతను విధింపఁబడియున్నది. ఇట్టి జీవనోపాయమే వృత్తి యనఁబడును. అచ్యుతుఁడు ప్రతి యుగమందును దిర్యక్కులు మహర్షులు దేవతలు మొదలగువానియందు నవతరించుచును నాయా చేష్టితములను జేయుచుండును. ఆ యవతారచేష్టితములే రక్ష యనంబడుచున్నది. ఆ యవతారచేష్టితములచేత వైదికధర్మ విరోధులు హతులగుచున్నారు. మనువు, దేవతలు, మనుపుత్రులు, ఇంద్రులు, ఋషులు,

హరి యంశావతారములని యీ యేడు గలదిగా మన్వంతరము చెప్పఁ బడుచున్నది. మనుప్రవలనఁ బుట్టిన రాజులచరిత్ర మును గాల్రత్రయమందలి చానిని జెప్పుట వంశ మనఁబడును. వారివంశమును నిర్వహించువారి చరిత్రము వంశానుచరిత మనఁబడును. కాలకర్మస్వభావము వలన నీ విశ్వమునకు నై మిత్తికము ప్రాకృతికము నిత్యము ఆత్యంతిక మని నాలుగువిధము లయిన లయమును సంక్షయని కవులు చెప్పెదరు. అజ్ఞాన మూలకమగు పుణ్యాపుణ్య కర్మములను చేయుచుండు జీవులు కర్మఫలానుభవముకొఱకే సృష్టి గావింపఁబడుచున్నది గాన యీ సృష్టి కా జీవులే హేతు వనఁబడును. జీవునిఁ గొంత అనుభవించి మిగిలియున్న కర్మవాసనలతోఁ గూడియున్నవాఁ డనియు మఱికొంతయు దేవాదినామరూపములు లేనివాఁడనియుఁ * జెప్పుదురు. ప్రకృతికార్యము లగు శరీరములందు జాగ్రత్తు స్వప్నము సుషుప్తియనెడి జీవవృత్తులు గలవుగదా! ఈ జీవవృత్తు లందు బ్రహ్మము నిర్వాహకుఁ డగుటచే నన్వయముగలిగియు నా యవస్థలచేత స్పృశింపఁబడకుండుటచేత వ్యతిరేకము గలిగి యున్నాఁడు ఇట్టి యన్వయవ్యతిరేకములు గల యీ బ్రహ్మమే సర్వాధారత్వమునుబట్టి యధిష్ఠాయఁ డనఁబడు చున్నాఁడు. ఆయీరూపనామములు గల ఘటపటాదిపదార్థ ములకుఁ బుట్టుక మొదలుకొని నాశమువఱకుఁ గల యీయీ యవస్థలు గలుగుచున్నవిగదా. అయినను బదార్థముల ద్రవ్య

---

* అనఁగా సృష్టికిఁ బూర్వము దేవాదినామ రూపములు లేనివారై కర్మవాసనలతోఁ గూడియున్న యా జీవులే యీ సృష్టికి నిమిత్తము గాన హేతు వనఁబడుచున్నారని భావము.

మాత్ర మాయా విశిష్టరూపమున జన్మాదులతోఁ గూడియు విశేష్యమాత్రరూపమున జన్మాదులులేకయు నుండునట్లి బ్రహ్మమును విశిష్టరూపమున జీవావస్థలం * దన్వయమును స్వరూపమున వానినుండి వ్యతిరేకమును గలిగియుండును. చిత్తమెప్పుడు జాగ్రత్తు మొదలయిన వృత్తులు మాఁటి నాశ్రయించుటమాని తనంతటఁ గాని యోగాభ్యాసముచేతఁగాని విషయములనుండి విరమించునో యపుడు సంసారమునుండి నివర్తించుచున్నది. ఇట్లు పదియొ మైదో లక్షణములతోఁ గూడియున్న మహాపురాణములును నల్పపురాణములును పురాణవిదులగు మునులుపదు నెనిమిదియని చెప్పెదరు. అవి బ్రాహ్మము, పాద్మము, వైష్ణవము, శైవము, లైంగము, గారుడము, నారదీయము, భాగవతము, ఆగ్నేయము, స్కాందము, భవిష్యము, బ్రహ్మకైవర్తము, మార్కండేయము, వామనము, వారాహము, మాత్స్యము, కూర్మము, బ్రహ్మాండమని పదునెనిమిది. బ్రాహ్మోత్తమా ! బాదరాయణమహర్షి శిష్యులును బ్రశిష్యులును వేద పురాణసంహితలను నిట్లు ప్రవర్తింపఁజేయుట నిఁకఁ జెప్పఁ బడినది. ఇది వినువారికి బ్రహ్మవర్చసము నుద్దీపింపఁ జేయును'. ఇది యేడవయధ్యాయము.

మార్కండేయు చరిత్రము.

శౌనకుఁడు—సూతా ! సాధూ ! చిరకాలము జీవింపుము. మాటకారులందు మేటివి. సంసారమునందు భ్రమించు మను

---

* బ్రహ్మము చిద చిద్విశిష్టరూపమున నా యవస్థలందెల్ల అన్వయమును స్వరూపమున వానినుండి వ్యతిరేకమును గలిగియున్నాఁడని భావము తెలియునది.

ష్యులకు నీవు గట్టు చూపువాఁడవు. 'మృకండునికొడు కగు మార్కండేయుని జనులు చిరాయువని చెప్పెదరు. అతఁడు కల్పాంతమందును శేషించియుండె ననియు జగత్తునంతయు గ్రహించిన పరమపురుషుని దర్శించె ననియుఁ జెప్పెదరు. ఆ మార్కండేయుఁ డీ కల్పమునందే స్వకులమునందుఁబుట్టినాఁడు. ఇంతవఱకును ప్రలయమేదియుఁ గలుగకున్నది. ఈ కల్పమందే పుట్టినవాఁ డింకను బుట్టని ప్రలయము నెట్లు చూడఁగలిగినాఁడని నందేహముగా నున్నది. అతఁ డేకాగ్రమయి యున్నప్పుడందుఁ బ్రభవించుచుండి మట్టియాకు దొన్నెయందుఁ జిన్నబాలుఁడై పరుండియుండిన పురుషునిఁ గాంచెనఁట. సూతా ! ఇది పెద్ద సందేహముగా నున్నందున దీనిని విచఁగుతుకము గలిగియున్నది. మహాయోగీ! నీవు పురాణములను గూడఁ జక్కఁగా నెఱుంగుదువని యంద ఱొస్పరొన్నవాఁడవు గాన యీ సందేహమును ద్రుంపుము ' అనెను. సూతుఁడు 'మహర్షీ ! నీవు శ్లోకమలములనెల్లఁ బోకార్చునట్టి యీ ప్రశ్నను జేసితివి. ఏలన నిందుఁగలిమలాపహంబగునారాయణకథ వర్ణింపఁబడియున్నది. మార్కండేయుఁడు తండ్రివలన గర్భాధానాది సంస్కార క్రమమున నుపనయనసంస్కారమును బొంది శాస్త్రోక్తవిధిని వేదముల నధ్యయనముచేసి స్వవర్ణాశ్రమోచిత మగు తపస్స్వాధ్యాయములతోఁ గూడినవాఁ డయ్యెను.అతఁడు తన ధర్మము పెంపునకై నైష్ఠిక బ్రహ్మచర్యవ్రతమును బూని శాంతుఁడును జటిలుఁడునై వల్కలములుగట్టి కమండలువును దండమును నుపవీతమును మేఖలనుదాల్చి కృష్ణాజినమును నక్షసూత్రమును గుశలను గయికొని రెండు సంధ్యలయందును నగ్ని

సూర్య గురు విప్రులయందును దనయాత్మయందును హరి నర్చించుచు వాజ్ఞ్మయతిగలిగి కేపుమాపునుగురువుకొఱకు భైక్షము తెచ్చి గురువు ననుజ్ఞ చేసినయెడల దానిని దినుచు లేనిచో నుపవసించుచు నుండెను. ఇట్లు తపస్స్వాధ్యాయములు గలిగి వేలకోలఁది సంవత్సరములు హృషీకేశుని నారాధించుచుండి యెవ్వరికిని జయింపరాని మృత్యువును జయించినవాఁడయ్యె. ఇట్లతఁడు తపస్స్వాధ్యాయములచేతను సంయమముచేతను నైష్ఠిక బ్రహ్మచర్యమును దాల్చి యోగమున రాగాదిక్లేశములను ధ్వంసముచేసి మనస్సును విషయములనుండి మరల్చి యధ్యోక్షజుని ధ్యానముచేసెను. ఇట్లా యోగి మహాయోగమువలన మనస్సును సమాధియం దుంచియుండఁగా నాఱు మన్వంతరముల నుహాకాలము కడచెను. ఈయేడవమన్వంతరమున సింధ్రుఁడతని యోగనిష్ఠను నెఱింగి యతని తపంబునకు 'ఇతఁడేమి నాపదవిని గోరుచున్నాఁడా' యని శంకించి దానిని జెఱుపుట కారంభించెను. అతఁడామునికడకు గంధర్వులను నప్సరసలను గాముని వసంతుని మలయానిలమును రజస్సును లోభమును మదమునును బంపెను. వారుహిమాచలమునుత్తరపార్శ్వమం దున్న యతని యాశ్రమమునకుఁ బోయిరి. అచటఁ బుష్పభద్ర యనునదియు, చిత్ర యనెడు శిలయునొప్పుచుండెను. వా రాపుణ్యాశ్రమమును బోయి చేరిరి. అందుఁ బవిత్రములయిన వృక్షములును లతలును వెలయుచుండెను. మఱియుఁ బుణ్యములగు పక్షిగణములును బుణ్యంబయిననిర్మల జలాశయములును నందు విలసిల్లుచుండెను. అందుఁ దుమ్మెదలు మత్తిల్లి పాటలు పాడుచుండెను. కోయిలలు కెరలి కూయు

చుండెను. నెమిళ్లు క్రొవ్వి యాడంబరముగా నాడుచుండెను. అప్పుడు మలయానిలము హిమాలయమందలి సెలయేటితుంపర లతోఁ గూడి పువ్వులతావులతోనెనసి మరులు చెలరేఁగించుచుఁ బొలయుచుఁ బ్రవేశించెను. వసంతుఁడు రాత్రి పొడదెంచు నపుడు చందురుఁ డుదయించుచుండఁగాఁ జిగుళ్లు గుత్తుల జొంప ములఁను దట్టముగాఁ బెనఁగొన్న నూఁకుతీఁగల గుబురులను వెలయుచు నందువచ్చెను. అప్సరల గుంపులకు గమికాఁడయిన పూవిలుకాఁడు తన్ను గంధర్వులును గీతములఁను వాద్యము లును వెంబడించి వచ్చుచుండఁగా నచ్చరలంగూడి విలునమ్ములు గొని యచటఁ గనఁబడెను. ఆ యింద్రుని భృత్యు లట్లు వచ్చి, యగ్నినివేలిచి కన్నులుమూసికొని యెవ్వరికిని జెనకరాక యగ్ని యామూర్తిని దాల్చెనో యన్నట్లు కూర్చుండియున్న యా మునిని గాంచిరి. అతనిముందట స్త్రీలు నర్తనముచేసిరి. పిదప గాయకులు పాడిరి. మఱియు మృదంగములను వీణెలను బణవ ములను గొని మనస్సున కింపుగాఁ వాద్యములు వాయించిరి. కాముఁడు తన వింటియం దరవిందాదులయిన రైదుముఖములు గల బాణమును దొడిగెను. వసంతుఁడును మదమును రజ స్సును లోభమునును - ఈ యింద్రభృత్యు లతనిని గంపింపఁ జేసిరి. అప్పుడు పుంజికస్థలి బంతులు గొని యాడుచుండఁగా దాని పాలిండ్లబరువున సన్నని నెన్నడుము మిక్కిలి నకనక లాడుచుండెను. దాని కురులనుండి పువ్వులు జలజల రాలెను. ఆవన్నెలాడి చూపుల నిటునటు బెళుకులడర నిగిడించుచుబంతి వెంటఁబోవుచుండఁగా నా యురవడిచేత దాని మొలనూలు తెగినదయ్యె. అప్పుడు వాయువు దాని సన్నని వలిపంపువలు

నను దొలఁగఁబుచ్చెను. అప్పుడు మన్మథుఁ డాముని తనకోటు వడినాఁ డని తలఁచి భీతిమునతనిపయి నేసెను. వాఁడుచేసిన నన్నియు నాతనియందు. ధనము లేనివానిప్రయత్నము వలె, వ్యర్థములాయెను. ముని ! వా రిట్లుమునికి నపకారము చేయుచున్నను నతని తేజముచేత దగ్ధులగుచు, సర్పమును మెయి కొలిపిన పొలురవలె, మరలి పోయిరి. ఇట్లింద్రుని యనుచరులెంత దలపడి కీడ్పఁజూచినను నమ్మహామునియహంకార భావంబగు వికారమునొందఁ డయ్యె. ఇది మహోత్పలయం దొకవింత కాదు. కాముఁడు వాని యనుచరగణమును దేజముడూలి విన్నవై యుండుటనుజూచి భగవంతుఁడింద్రుఁడు బ్రహ్మర్షియగు నతని ప్రభావమును విని మిక్కిలి విస్మయము నొందెను. అతఁడట్లు తనచిత్తమును దపస్వాధ్యాయసంయమముల చేత సమాధినుంచి యుండఁగా నరసహితుఁడగు నారాయణుఁడు హరియతని ననుగ్రహించుటకై ప్రసన్నుఁడయ్యెను. ఇద్దఱును దెల్లనినల్లని వన్నెలు గలిగి, నాలుగుభుజములతోను గొండామరలవంటి కన్నులగవలతోను గూడి, వల్కలాజినములు దొడిగి చేతియందుఁ బవిత్రమును దాల్చి, తొమ్మిదిపేటల యజ్ఞోపవీతమును గమండలువును వక్రముగాని వేణుదండమును, పద్మాక్షమాలికను, దోఁపులు మొదలగుజంతువులను దుడుచుళోను వస్త్రమును, దర్భముష్టినిగొని తపస్సే యారూపములు దాల్చినట్లు చూపట్టుచుండిరి. మతియుఁ దలతల మెఱయుచున్న మొఱపుదీగలవంటి శాంతులు దొలఁకుచున్న దేహరుచులతో దేవతావర్యులచేత నర్చితులై వెలయుచుండిరి. భగవంతుని రూపములగు నానర నారాయణఋషులను జూచి మునిలేచి యాదరంబున దండ

మువలెఁబడి, నమస్కరించెను. అతఁడు వారి సందర్శనము వలనఁ గలిగిన యానందముచేత దేహమును మనస్సును నింద్రియములును నిర్వృతములుకాఁగా మేను గఱుపాఱఁ గన్నులనానందబాష్పములు గ్రమ్ముకొన వారిని దలయెత్తిచూడఁజాలక యోయెను. అతఁడు లేచి చేతులుమోడ్చి వినయవినమితుఁడై యాత్సక్యముచేతఁగొఁగిలించు కొనువానివలె మాట డగ్గుత్తిక వడ'నమోనమ' అని యా యీశ్వరులఁగూర్చి పలికెను. అంత నతఁడు వారికి నాసనము వైచి పాదకమలములను గడిగి, తగిన చందనముచేతను, ధూపముచేతను, మాల్యముచేతను బూజించెను. అంత నాయిద్దఱును సుఖాబుగ నాసీనులై ప్రసాదింప నభిముఖులై యుండఁగా ముని మరల వారిపాదములయందుఁబడి మ్రొక్కి యా మిక్కిలి గొప్పవారలతో నిట్లనియె. మార్కండేయుఁడు—విభో! ని న్నేమని వర్ణింతును? ఏలన నాకును దక్కిన దేహధారులకును బ్రహ్మ సుద్రులకును గల ప్రాణములను నీవు ప్రేరించుట వలననే చలనమొందితన తన వ్యాపారములు చేయఁగలుగుచున్నవి. అట్లు చలనమొందు ప్రాణముల ననుసరించి వాక్కును మనస్సును నింద్రియములును జలనము నొందుచున్నది. ఇట్టి ని న్నేమని వర్ణింపవచ్చును! ఇట్టి వాఁడనేని న న్నందఱలో యుపాసింపరందువా? ప్రాణుల కెల్ల సామాన్యముగా నీవుప్రాణాదులను జలింపఁజేయువాఁడవే యైనను భజించునట్టి పురుషులకే ని న్నుపాసించునట్టి యభిప్రాయమును స్థిరముగాఁ గలిగింతువు. భగవంతా! ఈ మీ భగవన్మార్గులు రెండును ముల్లోకముల క్షేమమునకు సంసారతాపమెల్ల నడఁగుటకును మృత్యువును జయించుటకును నగు

చున్నది. ఎట్లన నీవు రాముఁడు కృష్ణుఁడు మొదలుగా నానా విధములయిన యితరదేహముల నీజగమును సృజించుటకై తాల్చుచున్నావు. ఈ సర్వజగత్తును సృజించి మరల నీవె పురుగువలె దీనిని గ్రసించుచున్నావు. ఇట్లు సృష్టిసంహారములు సేయువాఁడై తన యవతారములచేత రక్షించుచుఁ జరాచర ములలోపలఁ జొచ్చి ధరించి నియమించుచుండునీదుపాదమూల మును భజించుచున్నాము. ఆ పాదములను భజించుటవలనఁ బుణ్యాపుణ్యకర్మములందలి రజస్సయిన సుఖదుఃఖములును గుణ ముల రజస్సయిన కామకోపములును, గాలము రజస్సయిన శీతాతపవాతాదులును నంటవు. వేదతాత్పర్యవిదులయినజను లా పాదమూలమును బొందుటకై వానిని మాటికి స్తుతించుచును మ్రొక్కుచును నారాధించుచు నుందురు. నిరతిశయపురుషార్థ రూపా! ఈశా! నీయంఘ్రులచేతఁ జుట్టు నలుప్రక్కలనుండి, యే భయమును గలుగనేరదు. అట్టి నీయంఘ్రులప్రాప్తికంటె మఱియొక శ్రేయము నెఱుంగనేరము. బ్రహ్మకుఁ గల లోకము గూడ రెండుపరార్ధములకాల ముండునే కాని సతముగాదు. కానయట్లు స్థాయిగాని బ్రహ్మయుఁ గాలరూపుఁడగు నీకు భయ పడుచున్నాఁడు. ఇఁక నతఁడు సృజించినభూతపరిణామములైన దేవాధారులు భయపడుట చెప్పనేల ! ఇట్లు సత్యసంకల్పుఁ డును బరమాత్ముఁడును గురుండును సర్వమునకుఁ బరుండునగు నీదుపాదమూలమును మిక్కిలి యాత్మహితమయినది గనుక మిక్కిలియు దుష్టమై నిష్ఫలమైయున్న యీ దేవాదులను దిగ విడిచి దానినే భజించుచున్నాను. ఎవ్వనికి నీ పాదమూలమును కూర్చిన జ్ఞానము మాత్రముగలదో వాఁడు తన కభిమతము

లయిన సమస్త పురుషార్థములను బొందుచున్నాఁడు. తల్లీ! ఆత్మబన్ధూ! నీజగత్సృనకుఁ గల యుదయస్థితిలయములకు నీ బ్రహ్మరుద్రాఖ్యములగు దేహములే హేతువులే యనియును, ఆ దేహములును, సత్త్వము రజస్సు తమస్సన్నియన్ను నీదు మాయచేత లీలార్థము ధరింపఁబడినవే కాని మఱియొండు గాదనియును దెలియుదుము అట్లు తెలిసినను వానియందు సత్త్వమయమగు నీ దేహమే క్షోభయుక్తమగు శాంతిని గలిగింపఁ జాలుచున్నది కాని తక్కిన బ్రహ్మరుద్రాఖ్యదేహములు గావు. ఆ రెంటి నుపాసించుచు వచ్చినచో వ్యసనమును మోహమును భయమును గలుగును. భగవతీ! కాఁబట్టి నీదు భక్తులకుఁ బ్రియంబును నీకును గారామునయిన శుద్ధ సత్త్వమయదేహమునే కుశలు లగువారు భజింతురు. పురుషుండగునీదురూపంబయిన యావిశుద్ధసత్త్వమును బంచరాత్రసిద్ధాంతముల నెఱింగినజను లునన్యముగా గోరుచుందురు. పురుషరూపమైన యాసత్త్వము నుపాసించుచు రాఁగాసంసారభయము వీడును; మఱి యాత్మసుఖము గలుగును గాని భయమిశ్రమయిన యితర సుఖముగలుగదు. ఇట్లు పురుషుండును (చతుర్విధపురుషార్థప్రదుండును) భూముఁడును (సర్వాంతరాత్ముండగుట చేత భూమగుణ విశిష్టుండును) కాఁబట్టి విశ్వుండును (విశ్వాకారమున నెలకొనియున్నవాఁడును) విశ్వగురుండును (విశ్వమునకు శరీరహితాచరణశీలుండగుటంబట్టి హితకరుండును) పరదేవతయును నారాయణుండును ఋషియు నరోత్తముండును హంసుండును (ఆశ్రితదోషనిరాకర్తయు) సంయతగిరుండును నిగమేశ్వరుండును (వేదాచార్యుండు) నగు

భగవంతునకు నీకు నమస్కారము. నీమాయచేత మతి యూ వరింపఁబడి యున్నందున వ్యర్థములగు నింద్రియమార్గము లందు బుద్ధి దిరుగుడు వడుచున్న దేహాత్మాభిమాని, నీవు తన ప్రాణములందును హృదయమందును దృగ్విషయములం దును నియామకుఁడై నెలకొనియున్నను ని న్నెఱుంగనేరకున్నాఁడు. అఖిలగురుండవయిన నీవు మొట్ట మొదటఁ బ్రవర్తిం పఁ జేసిన వేదము నాశ్రయించియున్నవాఁడే నిన్ను వేదాంత విహితమైన యుపాసనచే విశుద్ధంబగు మనంబున సాక్షాత్కరింగ నెఱుంగుచున్నాఁడు. నిన్ను దర్శించుట కుపాయంబయినది వేదమే. అదియే పరమాత్మవగు నీదు రహస్యమును ప్రకా శింపఁ జేయునది. మఱి హిరణ్యగర్భకపిలాదులు యోగసాం ఖ్యతంత్రములచేత నీస్వరూపమును విమర్శించుటకుఁ బ్రయ త్నించుచున్నను నీవిషయమునఁ దబ్బిబ్బుపడుచుందురు. ఇటు యోగముసాంఖ్యము మొదలయిన వాదముల నన్నింటిని బ్రతి క్షేపించునట్లు స్వరూపమును స్వభావమును బ్రకృతి పురుషాదు లందుఁ గలుగనివి యెవ్వనికిఁ గలవో, తనయందు గూఢమై వారికిఁ దెలియంబడకున్న యపరిచ్ఛేద్యజ్ఞానైశ్వర్యము గల యట్టి మహాపురుషునకు వందనములు చేయుచున్నాను' అని స్తుతించెను. ఇది యెనిమిదవయధ్యాయము.

మార్కండేయ చరిత్రము.

(అనుబంధము.)

సూతుఁడు:— బుద్ధిమంతుఁ డామార్కండేయుఁ డట్లు స్తుతింపఁగా, నారాయణుఁడును నరసఖుండు నగు భగవం

తుఁడు—'ఓ యోయీ! ఎడతెగని చిత్తసమాధిచేతను నా యందలి భక్తిచేతను తపస్స్వాధ్యాయసంయమముల చేతను నీవు సిద్ధుండవు. బ్రహ్మర్షి శ్రేష్ఠుండవు నగుదువు. నీదు నైష్ఠిక బ్రహ్మచర్యవ్రతమునకు మేము మిక్కిలి సంతుష్టిఁ జెందితిమి. నీకు శుభం బగుఁగాక. వరదులందు మిన్నను గాన నావ లనఁ గోరిన వరమడుగుము' అనెను. ఋషి—'దేవదేవేశా! ప్రపన్నార్తిహరా! అచ్యుతా! నీకు జయము జయము. నీవు నాకు దర్శన మొసంగితివే. ఇంత మాత్రము వరమే చాలును. బ్రహ్మాదు లెవ్వని పాదారవిందముల దర్శనము యోగ పరిశుద్ధంబగు మనంబునఁ గేవలము వాంఛించుచున్నారు గాని దర్శింప నేరరయిరో యట్టి నీవు నాకన్నులకుఁ బ్రత్యక్షమైతివే! ఇంతకు మించినవర మేమున్నది? అంబుజపత్రాక్షా! పుణ్యశ్లోక శిఖామణీ! నీదర్శనమే యొక్కఁడు; అయినను బ్రహ్మ మొదలుగాఁ గల సకల జనులు సచ్చిద్భవాచ్యులయ్యు దేని చేతఁ దాము దేవ తిర్యఙ్మనుష్యస్థావరములుగా భిన్నులయి యుండు నట్లు తెలియుదురో యట్టి నీయాశ్చర్యశక్తిరూపమున మాయనుగూడఁజూడ నువ్విళ్లూరుచున్నాను' అనెను. ఇట్లాఋషి మిక్కిలియు స్తుతింపఁగా భగవంతుఁ డీశ్వరుఁడట్లు యగుఁ గాకని చిఱునవ్వుతోడఁ జెప్పి బదర్యాశ్రమమునకుఁ బోయెను. ఋషి యాభగవంతునిమాయను జూడవలయునను టయే చింతించుచుఁ దనయాశ్రమమందే పసించుచు అగ్ని, సూర్యుఁడు, సోముఁడు, జలము, భూమి, వాయువు, ఆకాశము, హృదయము, గోవు, విప్రులు మొదలగువానియందు హరిని ధ్యానించుచు మానసోపచారములచేతఁ బూజించుచుండెను.

అతఁ డొకానొకప్పుడు ప్రీతిమయమగు భక్తిరసప్రవాహము నందు మునిఁగి యాపూజను మఱచినవాఁ డయ్యెను. ఒకనాఁ డతఁడు పుష్పభద్రానదితటమునఁ గూర్చుండి యుండఁగా సంధ్యాసమయమున పెద్ద వాయు వొకటి పుట్టెను. అది ప్రచండమయిన శబ్దము గలిగించుచుండఁగా దాని ననుసరించి పెద్ద పెద్ద మేఘములు భయంకరములుగాఁ బొడ కట్టినవి. అవి మెఱుములు మెఱయుచు నురుములు బిట్టుగా నురుముచు బండి కన్నులం తేసి పెద్ద వర్షధారలు నలుప్రక్కలఁ గురియ సాగినవి. అంత నాలుగు మహాసముద్రములును వాయువేగ ముచేతఁ బెద్ద కరడులెగయ నుగ్రములయిన మొసళ్లు చెలఁగ మిక్కిలి భయంకరములయిన నుడి గండములతో దెప్పరమయి ఘోషించుచు భూతలమును నలుప్రక్కలఁ గ్రమ్మి మ్రింగు చుండుట గానంబడెను. ఆకాశము నతిక్రమించినవై జలములును, వేండ్రములయిన సూర్యకిరణములును, మెఱుపులును, గూడి దేవ తిర్యఙ్మనుష్యస్థావరము లని నాలుగు విధముల నుండు జగము నంతయును నామునితోఁ గూడఁ దపింపఁ జేసెను. ఇట్లు భూమి జలములందు మునుంగుటను జూచి ముని మిక్కిలియు భయము నొందెను. అతఁ డట్లు చూచుచుండఁగానే మహా సముద్రము నలలచే మిక్కిలి భయంకరమై బిట్టు గాలిచే జలమంతయు నల్లకల్లోలపడు చుండఁగా, మేఘములు వర్షిం చుచు దానిని నింపి పొంగి పొరలఁ జేయుచుండఁగా, నది పొరలి భూమండలమును నందలి ద్వీపములను వర్షము లను బర్వతములను నేక కాలమున ముంచి మాయముచేసెను. అప్పుడు భూమియు నంతరిక్షమును దేవలోకమును నత్ర

సమూహమును దిక్కులు నన్నియు మూఁడులోకములును జల మున మునిఁగి యుండెను. ఆమునియొక్కఁడుమాత్రమే మిగత పడి యుండి జడలు విరియంబాఱి జడునివలెను గుగ్గిడివాని వలెను భ్రమించుచుండెను. అతఁ డాఁకలిదప్పులు పయికొనఁ గా, మకరములును దిమింగిలములును బట్టి యుపద్రవపెట్టు చుండఁగా, అలలచేతను గాలిచేతను గొట్టువడి, అపారమయిన చీఁకటియందు బడి త్రిమ్మరుచు, బడలికవ్యాపింప దిక్కులను నాకాశమును భూమినిని దెలియఁడయ్యె. అతఁ డొక పెనుఁ బల్లమున బడియును, నొకచోట నలలచేత మోఁదంబడు చును, గొన్నియెడల నొకటితో నొకటి పోరాడుచున్న జల జంతువులచేత భక్షితుండగుచును, నుండెను. అతఁడొక్కయెడ మోహమును నొక్కయెడ శోకమును నొక్కచోట దుఃఖ మును నొక్కపట్టునభయమును బొందుచును, నొక్కడెసవ్యాధి మొదలగు వానిచేత బాధితుండై మృత్యువునొందినట్లును, నుం డెను. ఇట్లతఁడు విష్ణుమాయ తనయాత్మను గ్రమ్మనొనుటయు నందు భ్రమించుచుండఁగా సంవత్సరములు వేల పదివేల లొలఁదిని గడచని పోయెను. అతఁ డొకప్పుడు భూమియందు మెరకయైన యొక పట్టునఁ గుగ్గిమ్మరు చుండఁగా, పండ్లును జిగు ళ్లును విలసిల్లుచున్న యొక్క చిన్న మఱ్ఱిచెట్టును గాంచెను. దానిలో నీశాన్యపుదిక్కు నందలి యొక శాఖయందు, నొక మూకుదొన్నెలో నొక శిశువు పరుండి యుండి తన దేహ ప్రభచేతఁ జీకటి నంతయుఁ గబళించుచుండఁగాఁ గాంచెను. కచిన్నిబిడ్డఁడు మరకతమణులవలె శ్యామలవర్ణముగలిగి, మొ గము శామరపూవువలెఁ గాంతి సిరి గులుకుచుండ, సంకువు

వంటి మెడయు విశాలమయినవక్షమును, సొగసయినముక్కును గనుబొమలును గలిగి చెలువు గులుకుచుండెను. అతని యూర్పులు సోకి ముంగురు లల్లలాడుచుండెను. శంఖములవంటి చెవుల యందు దాడిమపూవ్వవలె నున్న పోగులు సొగసుగాఁ జుచుండెను. పగడమువంటి పెదవికాంతిచేతఁ దెల్లని చిఱు నవ్వు కొంత యెఱ్ఱ వాఱుచుండెను. తామరపూవ్వకడపు వలె నెఱ్ఱని కడగన్నులును, చెన్నుగులుకు చిఱ్ఱునవ్వుతోడి చూపులును నూర్పులచేత నల్లల్లఁ గదలుచున్న వళులతోఁగూడి లోఁతయి యఱచేయంత యున్న యుదరమును, నాపాపనికిఁ జెలువారు చుండెను. సొగసయిన వ్రేళ్లుగల చెండు చిన్ని చేతులచేత నొక చరణాంబుజమును బట్టియెత్తి కొని నోట నిడికొని యూబాలుఁడు చీఁకుచుండెను. ముని యూబాలునిఁజూచి మిక్కిలి యాశ్చర్యపడెను.అతఁ డాపాపనిఁ జూడఁగానే బడలిక లన్నియు నుడిగి యుబ్బున హృదయకమలమును గన్నుఁ చూమరలును వికసిల్లు చుండఁగా మేనంతయు మిక్కిలి గగురు పొడువఁగా, నత్యంతాశ్చర్యము చేత శంకించినను నాబాలునిఁ జూచుటకు సమీపమునకుఁ బోయెను. అపుఁ డాముని యూ శిశువు నూర్పుగాలిచేత దోమవలె నతని శరీరము లోపలఁ బొచ్చెను.ఆతనిగర్భమందును నతనికంటె మఱియొక బాలుని నట్టి వానిని గాంచెను. మఱి యతని శరీరములోనికిఁ బొరక మునుపు నంతయును జూచినట్లె శరీరము లోపలను జూచెను. అట్లుచూడఁగా నతనికి మిక్కిలియు విస్మయముకలిగెను. అతఁడందునంతరిక్షమును భూమ్యాకాశములను నక్షత్రగణములను బర్వతములను సముద్రములను ద్వీపములను వర్షములను

దిక్కులను సురాసురులను వనములను దేశములను నదులను బట్టనములను ఆకరములను సేద్యపుగ్రామములను, మంద లను, ఆశ్రమములను వర్ణములను వాని వృత్తులను గాంచెను. మఱియు నాకాశాదిమహాభూతములను భౌతికములయిన దేవ మనుష్యాదులను, నానాయుగములను గల్పములను గల్పించు చుండు కాలమును, ఇది యది యనలేల! వ్యవహారమునకునిమి త్తమయిన తక్కిన దొకొక్కటి దానిని మఱి యజ్ఞానులకు నిత్యమయినదిగాఁ దోఁచుచున్న జగత్తును గాంచెను. మఱియు నాగర్భములో ఋషి హిమాలయమును బుప్పవహా యనెడి యానదిని దన యాశ్రమమును నిట్లు విశ్వమునుగాంచుచుండి మరల నాబాలుని యూర్పుగాలి చేత నతని వెలుపలికి వచ్చి ప్రలయ సముద్రమునందుఁ బడెను. అట భూమి యం దొక మిట్టపయిని బెరిఁగి యున్న మఱిచెట్టును దాని యాకు దొప్పయందుఁ బరుండి యున్న యాపాపనిని జూచి యమృతంబు వంటి ప్రేమబొలఁకుచున్న చిఱునవ్వుతోడి యు తని కడగంటిచూపును జూచెను. అంత నతండు తనకన్నుఁగవ చేతహృదయమునందుఁ గాఁగిలించుకొనియున్న బాలునిఁగాంచి మిక్కిలియు నుబ్బి పొంది యాయధోక్షజునిఁ జేతులారఁ గాఁగి లించుటకై యెదురుగాఁ బోయెను అప్పుడా దేవుఁ డచిం త్యనులయిన వివిధ విచిత్రశక్త్యాదిగుణములచేఁ బరిపూర్ణుఁడై యాశ్చర్య శక్తియోగనిద్రావహుఁ డైన సర్వాంతరాత్ముఁడు గావునఁ దోడనే యంతర్ధానము నొందెను ఆపు డా ఋషి యాలింగనము చేసికొన వలెనన్న వ్యాపారము, నిర్ధనుఁడు పూనినపనివలె, వ్యర్థమాయెను. ఆ శిశువు తిరోహితుఁడు

కాఁగానే యతనివెంటనే ప్రలయ జలమంతయు మఱుఁ గయ్యెను. తక్షణమే యామునియెదుట వటవృక్షమును మ ఱుఁగుపడెను. అతఁ డెప్పటివలెఁ దన యాశ్రమమందున్నవాఁ డయ్యెను. ఇది తొమ్మిదవయధ్యాయము.

మార్కండేయ చరిత్రము.

(అనుబంధము)

శ్రీసూతుఁడు—ఇట్లు ముని, నారాయణుఁడు పన్నిన తనయా శ్చర్యశక్తి వైభవము ననుభవించి యానారాయణునే యతని మాయను ధరించుటకై శరణుఁజొచ్చెను.—* మార్కండే యుఁడు—'హరీ! నీదు మాయచేత దేవతలు సంయతముజ్ఞాన ముచేత నునంబు చెదరి మోహమునొందుదురుగదే. ఇట్టి నీదు పాదమూలమును బ్రపన్నుల కభయం బొసంగువానిని శరణుఁజొచ్చితిని' అనెను. సూతుఁడు—ఇట్లతఁడు సమా హితచిత్తుఁడై యుండఁగా భగవంతుఁడు రుద్రుఁడు పార్వతితోఁ గూడ నిజగణములచేఁ బరివృతుఁడై నందినెక్కి యాకాశ మునఁ బోవుచు నతనిఁ జూచెను. అంతఁ బార్వతి యాఋషినిఁ జూచిశివునితో 'భగవంతా! గాలిలేనపుడు జలములును మత్స్య సమూహములును నిశ్చలములై యున్న మహాసముద్రమువలె దేహేంద్రియములును మనస్సును నిశ్చలములై యీ విప్రు

---

* అల్పదేశమందు విస్తారముగల దేశమును అల్పకాలమందు బహు కాలమును అంతర్భవించి యుండుటయును తనకంటె వ్యతిరిక్తములయిన మూర్తామూర్త పదార్థసమూహమును గాలావసానము గలిగించు జలాదులను సృజించుటయును ఈశ్వరుని సర్వశక్తిత్వమువలన ఉపపన్నము.

డున్నాఁడు.ఇతనిని బోయిచూతము రమ్ము. ఈమని తపస్సునకు ఫల మొసంగుము.నీవు సిద్ధిప్రదుఁడవుగ దే'యనెను. రుద్రుఁడు—'భగవతీ! ఈ బ్రహ్మర్షి కామములనేమియు మోక్షమును సైతము గోరఁడు; ఏలనఁగా నితఁ డవ్యయుఁడగు పరమపురుషునియందు ననన్యప్రయోజనంబగు భక్తిని లభించియున్నాఁడు. భవానీ! అయిన నీ సాధుపురుషునితో మాటలాడుదము. మనుష్యులకు సాధువులతోడి సమాగమమే పరమంబయిన లాభముచుమీ' యని చెప్పెను.సర్వవిద్యలకు నిర్వాహకుఁడై సర్వదేహధారులకు నీశ్వరుండయి సత్పురుషులకు గతియైన యా భగవంతుఁ డీశానుఁ డశనిని దఱిసివచ్చెను. జగదాత్మకులైన యీ యీశు లిరువురును వచ్చియున్నను నాముని యంతఃకరణవృత్తుల నిరోధించియుండుటంబట్టి యెఱుంగఁడయ్యె. వారినేకాక తన్నును దక్కిన ప్రపంచమును దెలియకుండెను. భగవంతుఁడు రుద్రుఁ డది యెఱిఁగి వాయువు ఛిద్రమునందుఁ చొచ్చునట్లు యోగమాయచేత నతని హృదయాకాశమును జొచ్చెను. అంత నాముని తనలోపలను మెఱుపువలెఁ బిళంగములయిన జటలు దాల్చి మూఁడుకన్నులును బది భుజములును గలిగి పొడువై యుదయించుచున్న సూర్యునివలె వెలుఁగుచుఁ బులితోలును శూలమును ధనువును ఖణాములను ఖడ్గ చర్మములను నక్షమాలను డమరుకమును, గపాలమును బరశువును దాల్చి శివుఁడు తటాలున హృదయమందు జూపట్టఁగా గాంచి విస్మయమునొందెను. అమ్మని 'యేమిది' యని యాసమాధినుండి విరమించి రెండుకన్నులను దెఱచి త్రిలోకైకగురుండగు రుద్రుఁడు పార్వతితోడను బ్రమథగణములతోడను వచ్చి

యుండుటను జూచెను. ముని యద్దేవుని శిరస్సుచేత మ్రొక్కి యతనికిని భార్యాతికిని బ్రమథగణములకును స్వాగతం బడిగి యాసనము లిడి యర్ఘ్యపాద్యముల నర్పించి గంధపుష్ప ధూప దీపములచే నర్చించి యెంతయు నుపచర్యలు గావించెను. అంత నద్దేవునిఁజూచి 'నీవు నీప్రభావముచేతనే పరిపూర్ణ కాముఁడవు. ఈ జగత్తంతయు నీచేతనే సుఖముగా నూఱుట నొందియుండును. ప్రభూ! ఈశానా! ఇట్టి విభునకు నీకు నేనేమిచేయుదును? శాంతుఁడును సత్త్వుఁడును బ్రహ్మచుండును రజోజుషుండును ఘోరుండును దమోజుషుండును నగు శివునకు నీకు నమస్కారము'అనెను.సూతుఁడు—— ఇట్లాదిదేవుఁడును సజ్జనులకు దిక్కునయిన యా భగవంతుఁడు స్తుతింపఁబడఁగాఁ బరితుష్టుఁడై ప్రసన్నుఁబగు మనంబుతో నవ్వుచు నమ్మునిని జూచి 'మేము మువ్వురమును వరదులయందు మిన్నలము; మాదర్శనము వ్యర్థముగాదు. ఆదర్శనమువలన మనుష్యుఁడు ముక్తి నొందును. కాఁబట్టి నీవు నావలన వరమును వేఁడుము.సాధువులును శాంతులును సంగరహితులును భూతములందు దయగలవారును మాయం దేకాంతభక్తులును వైరము లేని వారును సమదర్శులునగు బ్రాహ్మణులకు, లోకులను లోకపాలురును, వీరువారనేల? భగవంతుఁడగు నేనును బ్రహ్మయు నీశ్వరుఁడగు హరి తానును వందనములను నర్చనములను నుపాసనములను జేయుదుము. ఏలనఁగా వారచ్యుతశరీరరులు మఱి నాయందును బ్రహ్మయందును నచ్యుతుం డగు హరియందును భేదమణువంతయైనను గలిగియుండరు.మఱియుఁ దామును నితరజనులును నచ్యుతునికి భిన్నులయినవారనియుఁ దలంపరు;

అనఁగా నందఱును నచ్యుతునికిఁ బరతంత్రులై తచ్ఛరీరభూతులై యుండుటంబట్టి యచ్యుతుఁడేయని తలంతురు. కనుక మేమును మిమ్ము భజింతుము. జలమయములగు తీర్థములును, ప్రాణరహితములయిన (మృచ్ఛిలామయములయిన) దేవతలును దర్శనమాత్రమునఁ బవిత్రత గలిగింపనేరవు. చిరకాల స్నానముల చేతను, ఆవాహనాది షోడశోపచార పూజాదులచేతను, నవి పవిత్రముచేయుచున్నవి. మీరన్నచో దర్శన మాత్రముచేతనే పవిత్రతఁ జేయుచున్నారు. ఎవ్వరు వేదమయంబగు మా రూపమును నాత్మసమాధిచేతను దపస్సుచేతను స్వాధ్యాయముచేతను సంయమములచేతను దాల్చి యుందురో యట్టి బ్రాహ్మణులకు మేము నమస్కరించుచున్నాము. అట్టి మహాత్ములను దర్శించినను విన్నను మహాపాతకులయినను శూద్రులయినను శుద్ధి నొందుదు రనఁగా నిఁక వారితోడ సంభాషణాదులచేత శుద్ధినొందుట చెప్పనేల' యనెను.

సూతుఁడు— ఇట్లు చంద్రధరుఁ డాశివుఁడు సజ్జనసేవ్యయనెడు ధర్మరహస్యమును గూర్చి విస్తరించిచెప్పిన యా వాక్య మమృతమువలెఁ జవి గులుకఁగా నాబుషి చెవులు రెంటను నెంతయుగోలియుఁ దృప్తినొందఁడయ్యెను.బుషి— ఆహా! జగదీశ్వరులయినవారు తమకీశితవ్యములయిన యపకృష్ట భూతములకు మ్రొక్కుచున్నారే! బాగురా! ఈశ్వరునిచర్య యిది శరీరధారుల కెంతమాత్రము దెలియఁదరముగాదుగదే! వారు దేవతలకుధర్మము నుపదేశించువారయ్యునుధర్మములను వారిచేత గ్రహింపఁజేయుటకై తామే యాచరించుచును నను

మోదించుచును నట్లనివిచేయఁబడుచుండఁగా స్తుతించుచును, నుందురు. ఇట్లు భగవంతుఁడు తన కీశితవ్యములయిన వానికి నమస్కరించుట మొదలగు వానిని నాశ్చర్య మయము లయిన తనచేష్టలచేతఁ జేసినంతమాత్రమున వాని ప్రభావ మెంత మాత్రము చెడదు. లోక ప్రసిద్ధమగు మాయావి యింద్రజాలాది కపటవ్యాపారము లెంతచేసినను వాని ప్రభా వము చెడక వాని మాయావిష్కారప్రభావమె వెల్లడియగు నట్లె దీనిని దెలియవలయును. భగవంతుఁడు సంకల్పమాత్రము చేత నీజగత్తును సృజించి తాను దీనిలోపలఁ జొచ్చి, గుణ ములు పూర్వకర్మ వాసనానుగుణముగాఁ బరిణమించి యు త్త రో త్తర పుణ్యాపుణ్యరూపము లయిన విషమసృష్టిని జేయు చున్నను దానే చేయువానివలెఁ గనఁబడుచున్నాఁడు గాని స్వప్నము గన్నవాఁడు స్వప్నమందలి యర్థములను దాను జేయనియట్లు, నిజమున కా సృష్టికిగుణములేకాని తాను గ ర్త గాకుండును. అట్టిత్రిగుణుండును మహత్తుండును గేవలుం డును నద్వితీయుండును గురుండును బ్రహ్మమూ ర్తియు నయిన యాభగవంతునకు నమస్కారము. భూమా! పురుషుఁడు స్వతం త్రుఁడును సత్యకాముఁడు నగుటకంటె వర మేమి వరదో త్త ముండవగు నీవలనఁ బడయవచ్చును ? ఏమియుఁ గలుగదు. అయినను బూర్ణకామమ వర్షించుచున్న నీవలన నీ వరమును వేఁడెదను. భగవంతుని యందును భగవత్పరు లయినవారి యందును నీయందును నచ్యుతంబగు భ క్తి నాకుఁ గలిగియుండ వలయును' అనెను.సూతుఁడు——ఇట్లు ముని చక్రనివాక్యమున స్తుతింపఁగా నచ్యుతుఁడును భగవంతుఁడు నగునాగుద్రుఁడు

పార్వతి యనుమోదింప నతనితో 'మహర్షీ ! నీకు విభుండయిన యధోక్షజునియందు చిక్కిలియు నీవు కోరినభక్తి కలుగుఁగాక. కల్పాంతమువఱకును నీకుఁ బవిత్రంబయిన యశస్సును, ముది మియు మరణమును లేకుండుటయుఁగలుగుఁగాక. భూతభవిష్య ద్వర్తమానములనెడు త్రికాలములందున్న వస్తువులను గూర్చిన జ్ఞానమును బ్రహ్మస్వరూపరూపాదులను గూర్చిన విజ్ఞానమును విరక్తిసహితముగాఁ గలుగు గాక. బ్రహ్మవర్చసుల కెల్ల నీవు పురాణాచార్యుండ వగుదువుగాక' యనెను. సూతుఁడు—ఇ ట్లీశ్వరుఁ డామునకుఁ బూర్వంబు వరములొసంగి పార్వతీదేవికి నాముని మున్ను భగవన్మాయను దర్శించిన కథను జెప్పుచుఁ దన స్థానమునకుఁ బోయెను. ఆ మార్కండేయుఁడును మహాయోగ వైభవమును భగవంతుఁడగుహరి యందు ననన్యప్రయోజనం బగుభక్తిని బొంది యిప్పటికిని సంచరించుచున్నాఁడు. ఇందులకు సందియము లేదు. బుద్ధిమంతుఁడగు మార్కండేయుఁ డనుభవించినభగవంతునిమాయావైభవమును మిక్కిలి యద్భుతమయిన దానిని నీకువర్ణించి చెప్పితిని. సంసార మనాది యని తెలియని వారుకొందఱు, జీవులకుభగవంతునిమాయవలన నొకానొకప్పుడే, సంసారము మార్కండేయునికిఁ గలిగిన మాయా వైభవ దర్శనమువలెఁ గలుగుచున్నదని చెప్పుదురు. ఈసంసార మనాదియై పొరలి పొరలి వచ్చుచున్నది గాని యొకానొకప్పుడు కలుగునది గాదు. ఇట్లు చక్రపాణి యగు భగవంతుని వైభవముతోఁ గూడిన మార్కండేయుని వృత్తమును వినువాఁడును వినిపించువాఁడును నిరువురును గర్మనిమిత్తంబగు సంసారమునకుఁ బాలుపడరు. ఇది పదియవయధ్యాయము.

{మహాపురుషవర్ణనము. ద్వాదశాదిత్యవ్యూహాదులను వర్ణించుటయు.}

శౌనకుఁడు—భాగవతా! నీవు మిక్కిలియు వేత్తలగువారి యందు మిన్నవు. ఏలన నీవు సమస్తములయిన పురాణపంచరాత్రాద్యాది తంత్రముల సిద్ధాంతముల తత్త్వములను జక్కఁగాఁ దెలిసినవాఁడవు. కాఁబట్టి యీ యర్థమును నిన్నడుగుచున్నాము. శుద్ధసత్త్వమయమగు దివ్యవిగ్రహముగల శ్రీయఃపతికిఁ బరిచర్య చేయునపుడు భగవదారాధన తంత్ర నిష్ఠితు లయినవారద్దేవుని పాణి పాదాదులయినయంగములను హృదయాదులయిన యుపాంగములను సుదర్శనాదులయిన యాయుధములను భూషణములను నే యే తత్త్వాభిమాని దేవతగాఁ గల్పించి యేవిధమున ధ్యానింతురో దానిని, భగవదారాధన క్రియకు నపేక్షితములయిన వానిని, దెలిసికొనఁ గోరుచున్నారము గాన మాకు వివరింపుము. ఆయా యంగాదులను నాయా తత్త్వములుగాఁ గల్పించి యారాధనము చేయు కౌశలముచేత మర్త్యుఁడు జరామరణములను గడచి ముక్తిని బొందుచున్నాఁడు గదే' యనిరి. సూతుఁడు 'నేను గురువులకు నమస్కరించి విష్ణుదేవుని యంగాదులకు నభిమానిదేవతలయిన యా విభూతులను జెప్పెదను. బ్రహ్మనారదుఁడు మొదలయిన యాచార్యులవలనను, నాగమములవలనను, బంచరాత్రములవలనను, నావిభూతులెఱుంగఁబడినవి. ప్రకృతి, మహత్తు, అహంకారము, పంచభూతములు, కాలమనెడి తొమ్మిదితత్త్వములచేతను వీని వికారములయిన యేకాదశేంద్రియములచేతను బంచతన్మాత్రలచేతను విరాట్టు (బ్రహ్మాండము) నిర్మింపఁబడినదని శాస్త్రముచేతఁ దెలి

యఁబడుచున్నది జీవులతోఁ గూడిన యీవిరాట్పురుషుఁడు లోకములు కనఁబడుచున్నవి. ఈ*బ్రహ్మాండము పరమపురుషుని రూపము. తలాతల మొదలైన సప్తలోకములతోఁ గూడిన భూమి యతనికిఁ బాదములు. దివి యతనికిశిరస్సు. ఆకాశము నాభి. సూర్యుఁడు కన్నులు. వాయువు నాసిక. దిక్కులు కర్ణములు. ప్రజాపతి మేఢ్రము. పరమపురుషునకు మృత్యువు గుదము. బాహువులు లోకపాలురు. మనస్సు చంద్రుఁడు. యముఁడు కనుబొమలు లజ్జ పయిపెదవి. లోభము క్రిందిపెదవి. వెన్నెలలు దంతములు. భ్రమము నవ్వు. వృక్షములు రోమములు. మేఘములు తలవెండ్రుకలు. ఈవ్యష్టి పురుషునకు నెన్నియవయవములో తనకొలఁతచేత నవయవసంస్థానమెంత మితిగలిగి యుండునో, యట్లే యీ పరమపురుషునకు లోకముల కొలఁదిచేతఁ (అనఁగా లోకాభిమాని దేవతా రూపములగు సాదాద్యవయవముల సంస్థానముచేత) నంత యవయవములు గలవాఁడై యుండును. అజుండు భగవంతుఁడు కాస్తుభము నెపమునఁ దనయాత్మ జ్యోతిని, అనఁగాఁ దనకు విశేషభూతమై జ్ఞానాకారమై యుండు చిదాత్మస్వరూపమును దాల్చుచేసెన్నాఁడు. [1] ఆజీవుని ప్రభయగు ధర్మభూతజ్ఞానము వ్యాపించునట్టిది. ఆ ప్రభను భగవంతుఁడు వక్షమున శ్రీవత్సముగాఁ దాల్చియున్నాఁడు. విషమావస్థయందున్న సత్త్వాదిగుణములమయ మైయుండు ప్రకృతియే వనమాలగాఁ దాల్చి

1. బ్రహ్మాండమున కభిమానిదేవత భగవద్దివ్య విగ్రహమని యర్థము.

2. కాస్తుభము జీవపర్యాభిమాని దేవతయనియుం దాని ప్రభకు అభిమాని దేవత శ్రీవత్సమనియుం ఛందోభిమాని దేవత యుతని వక్షస్థ్సమనియుఁ దెలియునది.

యున్నాఁడు. అతనివస్త్రము గాయత్రి మొదలగుఛందములు. అకారాదిత్రివర్ణములు గల ప్రణవ మాతని బ్రహ్మసూత్రము. అతని యొక మకరకుండలము సాంఖ్యములు వేదము మఱి యొకకుండలము. సర్వలోకోత్తరమయినబ్రహ్మలోకము నతఁడు కిరీటముగా ధరించి యుండును.అది సర్వలోకములకు నభయప్రదమైనది. పరమపురుషుఁ డధిష్ఠించియున్న శేషుం డనెడి యాసనము మూల ప్రకృతి. ధర్మజ్ఞానాదులతోఁ గూడిన విశుద్ధ సత్త్వము పద్మమునఁబడుచున్నది. [1] ఓజస్సుతోను సహస్సుతోను బలముతోను గూడిన మహత్తత్త్వం బగు బుద్ధియే గదగాఁ దాల్చియున్నాఁడు. జలతత్త్వమే శంఖము. తేజస్తత్త్వము సుదర్శనము. ఆకాశమువలె నీలదేహుఁడగు భగవంతునకు నాకాశతత్త్వమే ఖడ్గము. తపస్సే కేడెము. కాలము శార్ఙ్గధనువు. కర్మములే యమ్ములపొది ఇంద్రియములు గుఱ్ఱములు. మనస్సతనికి రథము. అర్చనాకారములందాహితమైన యతని యంశమే తన్మాత్రలు. [2] ఇంద్రియవ్యాపారము లతని క్రియలు అతని యాసనమందుఁ బద్మాకారముగా నున్న మండలము [3] యజ్ఞభూమి. యజమానుని హోమీపత్నీవధూతాదు లయిన యాగదీక్షా సంస్కారము భగవంతునికిఁ బరిచర్య. అది దురితములనెల్ల క్షీణింపఁ జేయునది. భగవచ్ఛబ్దమందలి యవయవ

---

1. ఓజస్సనఁగా ఇంద్రియశక్తి. సహస్సు అనఁగా మనశ్శక్తి. బలమనఁగా దేహబలము. ధేనువునకుఁ గాల అభిమానిదేవత యనుట.

2. ఇట 'ముద్రయార్థ క్రియాత్మతా' అని పాఠాంతరము. 'వరదాభయాది ముద్ర ప్రయోజనము దాని క్రియా స్వరూపమునగు' నని భావము.

3. యజ్ఞ భూమ్యభిమానిదేవత యామండలమనుట. దీక్షాసంస్కారమున కభిమానిదేవత పరిచర్య.

మగు భగవచ్ఛబ్దమునకు నర్థమగు జ్ఞానాదిషాడ్గుణ్యము లీలా కమలముగా ధరించి యున్నాఁడు. ధర్మమును యశమును భగవంతునకుఁ జామరమును వ్యజనము నగును. దేని నలసను భయము లేకున్న సాంతధామమయిన వైకుంఠ మతనికి [1]ఛత్రము.ఋగ్యజుస్సామాత్మకమయినవేనము యజ్ఞారాధ్యుం డయిన యాపురుషుని వహించు వాహనమయిన [2] గరుడుఁడు. శ్రీదేవి హరికిఁ బాయక యుండు తోడిశక్తి. అది యాపరమాత్మునకు ధర్మభూతియగు ప్రభ. సేనాపతియగు విష్వక్సేనుఁ డతని విగ్రహావిశేషము. హరిద్వారపాలురయిన నందాదు లైన మండ్రు అణిమ మొదలయిన గుణములు. వాసుదేవుఁడు సంకర్షణుఁడు ప్రద్యుమ్నుఁ డనిరుద్ధుఁ డనెడి యీమూర్తిసమూహము పరమపురుషుఁడు తానే యని చెప్పఁబడుచున్నాఁడు. ఈవానుదేవాదికమయినచతుర్మూర్తి సమూహము జాగరము స్వప్నముసుషుప్తము క్తి యనెడి యవస్థలందువరుసగా విశ్వుఁడు తై జసుఁడు ప్రాజ్ఞుఁడు తురీయుఁడు(ముక్తుఁడు) అనఁబడు[3]జీవుఁడు. బాహ్యేంద్రియములచేత నర్థములనుదెలుపుజాగరావస్థయందు నుమానసేంద్రియవిషయమగుస్వప్నావస్థయందునుమనస్సుడుగఁ గావాసనమాత్రము మిగిలియున్న యాశేయమగు సుషుప్తియం

---

1. వైకుంఠాభిమానిదేవత యతనికి ఛత్రమనిభావము.

2. వేదాభిమానిదేవత గరుడుఁడనియు, అణిమాద్యష్టైశ్వర్యాభిమానిదే తలు నందాదులనియుఁ దెలియునది.

3. అనఁగాముక్త్యవస్థుఁడగు జీవునకభిమాని వాసుదేవుఁడు. స్వప్నావస్థ జీవున కభిమాని సంకర్షణుఁడు. తక్కిన రెండవస్థల జీవులకు తక్కిన రెండు మూర్తులు పరుసగా నభిమాని దేవతలని యర్థము.

దును బరిశుద్ధానవచ్ఛిన్నజ్ఞానం బగుముక్తియవస్థయందును గల యాయాజీవున కభిమాని భగవంతుఁ డని చెప్పఁబడుచున్నాఁడు. అంగములతోను ఉపాంగములతోను నాయుధముల తోను భూషణములతోను గూడి వాసుదేవాది చతుర్మూర్తి దాల్చియున్న భగవంతుఁడు హరి యీశ్వరుఁడు ప్రసిద్ధముల యిన సృష్టి స్థితి సంహార మోక్షములను నాలుగింటిని గావించుచున్నాఁడు. బ్రాహ్మణోత్తమా! బ్రహ్మరుద్రాది సంజ్ఞలతోఁ గూడి తనమాయచేత సృజించుచును సంహరించుచును రక్షించుచు నున్నయాభగవంతుఁడే స్వరూపముచేతను గుణముల చేతను నిరతిశయ బృహత్త్వముగల బ్రహ్మము, సర్వకారణ భూతుఁడు, సమస్తమును నొక్కమ్మడిని జక్కఁజూచువాఁడు, తన మహిమచేతనే నిండియున్న యవాప్త సమస్తకాముఁడు, అసంకుచిత జ్ఞానుఁడు. ఇట్టివాఁడయినను గూఢుం డని శాస్త్రములు చెప్పుచున్నవి. అయినను నతఁడు తనయుపాసకుల యోగపరిశుద్ధ మనస్సులకు లభించుచున్నాఁడు. *శ్రీకృష్ణా! కృష్ణసఖా! వృష్ణివృషభా! భూద్రోహులయిన రాజుల వంశములకు దహనుఁడయినవాఁడా! అనపవర్గవీర్యా! గోవిందా! గోబ్రాహ్మణ దేవతలయార్తినివారించుటకై యవతరించువాఁడా!

---

* ఇందు మొదటిదానిచే సర్వాత్మక కర్తృత్వమును, రెండవదానిచే సౌశీల్యమును, మూఁడవదానిచేత సౌలభ్యమును, నాలుగవదానిచేఁ దుష్కృతులను నాశముసేయుటయు, ఐదవదానిచేత అపారవీర్యత్వమును, ఆఱవదానిచేత సర్వాధారత్వమును, ఏడవదానిచేత సాధుపరిత్రాణత్వమును, ఎనిమిదవదానిచేత పావనకీర్తిత్వమును, తొమ్మిదవదానిచేత అత్యాదరమున వినఁదగిన వాఁడై యుండుటయు చెప్పఁబడినవి.

తీర్థశ్రవా! శ్రవణమంగళా! నీభృత్యులను రక్షింపుమా ! ఎవ్వఁడు ప్రాతఃకాలమున లేచి చిత్తము పరమపురుషునియందునిచి సమాహితేంద్రియుఁడై మహాపురుషుని చిహ్నభూతములయిన యంగోపాంగాదులనిరూపించు. నీప్రకరణమును జపించునో వాఁడు హృదయగుహాశయమందున్న బ్రహ్మమును గలరూపునఁ దెలియుచున్నాఁడు' అనెను.

శౌనకుఁడు—భగవంతుఁడగు శుకుఁడు పరీక్షిత్తుసకుసూర్యారాధకమగు గణము లేఁడు నెలనెలకు నానావిధములయిన కర్మములను గావించుచున్నదని ముందఁ డుగఁగాఁజెప్పెను. 'సూర్యాత్మకుం డగుహరిని నుపాసించుచుండెడి యాగణముల నామములను వార లాయాయూమాసమునఁ బతియగు నాయాసూర్యునిచే నియుక్తులై చేయుకార్యములను వినఁగోరుచున్నమాకుఁ జెప్పుము' అనియడిగెను. సూతుఁడు-సమస్తదేవాధారుల కాత్మభూతుఁడయిన విష్ణుఁ డనాదియైన తన ప్రకృతిచేత లోకయాత్రా ప్రవర్తకుఁడయినయీసూర్యుని నిర్మించెను. కాఁబట్టియే యితఁడు లోకములందుఁబరిభ్రమించుచున్నాఁడు. *లోకములకెల్లనాదికర్తయు నద్వితీయుండు సర్వాంతరాత్ముఁడునయిన యా హరియె సూర్యశరీరకుఁడై నెలకొనియున్నాఁడు. అతఁడు సమస్తములయిన వేదక్రియలకుఁ గాలావచ్ఛేదకుఁడై మూలము గానున్నాఁడు. మఱి పరాశరాది ఋషులచేతఁ బండ్రెండు

---

* ఇదియె పంచమ స్కంధమందు—'తథాన్యేచ ఋషయోగన్ధర్వాప్సరసో నాగాగ్రామణ్యో యాతుధానాదేవా ఇత్యేకైకశోగణాఃసప్తచతుర్దశమాసి భగవన్తం సూర్యమాత్మానం నానానామానం పృథఙ్నామన్పృథక్కర్మభిర్ద్వంద్వశ ఉపాసతే' అని చెప్పఁబడియున్నది.

విధములయిన వాఁడుగాఁ జెప్పఁబడు చున్నాఁడు. [1] కాలము దేశము క్రియ కర్త కరణము కార్యము ఆగమము ద్రవ్యము ఫలమని హరి యొక్కఁడే తొమ్మిది విధములఁ జెప్పఁబడినట్లు పండ్రెండు విధములుగాను జెప్పఁబడు చున్నాఁడు. చైత్రాదిమాసములయందు భగవంతుఁడు కాలావచ్ఛేదక మగు రూపమును దాల్చి లోకయాత్ర నిర్వహించుటకై (యొకొక్కఁ నెల నొకొక్కఁ గణముగా) వేఱు వేఱ పండ్రెండుగణములతోఁ గూడి [2] చరించుచున్నాఁడు. ధాత (సూర్యుఁడు), కృతస్థలి (అప్సరస), హేతి (రాక్షసుఁడు), వాసుకి (నాగుఁడు), రథకృత్తు (యక్షుఁడు), పులస్త్యుఁడు

---

1. కాలము ఏసంతాదులు. దేశము 'సమేయజేత' ఇత్యాదుక్తము. క్రియ యూగాదులు. కరణముసాధనము. కార్యముఆపూర్వమనెడు స్థాయికార్యము. ఆగమమనఁగా ప్రమాణభూతమగువేదము. ద్రవ్యముచరుపురోడాశాదికము ఫలము స్వర్గాదులు. దేశము మొదలుకొని ఫలమువఱకుఁ జెప్పఁబడినవెల్ల సాధనములుగానో సాధ్యములుగానో క్రియయొక్కటియందు అంతర్భూతము. ఇట్టి క్రియతోఁగూడిన వాఁడై హరి ద్రవ్యాదిశరీరకత్వమువలన బహువిధములఁ జెప్పఁబడు చున్నాఁడని భావము.

2. సూర్యుఁడు ఒకొక్కనెలకు ఒకొక్కగణముగా పండ్రెండునెలలకు పండ్రెండుగణములతోఁగూడి తిరుగుచుండును. ఒకొక్కగణమునకు గణులు ఏడేసిమంది యుందురు. పంచమస్కంధమునఁ బదునలుగురనిచెప్పఁబడినను అందు ప్రధానులు ఏడుగురే యని యిట తెలియునది. మఱియు నొకొక్కగణమందును వెండఁటనామాసమునకు పతియై యొకానొక పేరుగల సూర్యుఁడును పిదప ఒకఋషియు గంధర్వుఁడును అప్సరసయు నాగుఁడును గ్రామణియు రాక్షసుఁడును దేవతయును జెప్పఁబడుదురు. అందుచైత్రమాసపు వారిని మొదటఁ జెప్పుచున్నారు.

(ఋషి), తుంబురుడు (గంధర్వుడు) ననెడి యీ యేడుగురు చైత్రమాసమునఁ దమ తమ కార్యములచేత సూర్యుని నడపుచుందురు. అర్యముఁడు (సూర్యుఁడు),పులహుఁడు(ఋషి), రథౌజుఁడు(యక్షుఁడు), ప్రహేతి(రాక్షసుఁడు),పుంజికస్థలి (అప్సరస). నారదుఁడు (గంధర్వుఁడు), కచ్ఛనీరుఁడు (నాగుఁడు), ననెడి యీ యేడ్గురు వైశాఖమాసమున సూర్యుని నడుపుచుందురు. మిత్రుఁడు (సూర్యుఁడు), అత్రి (ఋషి), పౌరుషేయుఁడు (రాక్షసుఁడు), తక్షకుఁడు (నాగుఁడు), మేనక(అప్సరస), హాహా (గంధర్వుఁడు), రథస్వనుఁడు (యక్షుఁడు), ననెడి వీరు సూర్యుని జ్యేష్ఠమాసమందు నడపుదురు. వరుణుఁడు (సూర్యుఁడు), వసిష్ఠుఁడు (ఋషి), రంభ (అప్సరస), సహజన్యుఁడు (యక్షుఁడు), హూహూ (గంధర్వుఁడు), శుక్రుఁడు (నాగుఁడు), చిత్రస్వనుఁడు (రాక్షసుఁడు) ననువీ రాషాఢమాసమును జరుపుచుందురు. ఇంద్రుఁడు (సూర్యుఁడు), విశ్వావసువు (గంధర్వుఁడు), శ్రోత (యక్షుఁడు), ఏలాపుత్రుఁడు (నాగుఁడు), అంగిరసుఁడు (ఋషి), ప్రమ్లోచ (అప్సరస), చర్యుఁడు (రాక్షసుఁడు) ననెడి వీరు శ్రావణమాసమును జరుపుదురు. వివస్వంతుఁడు (సూర్యుఁడు), ఉగ్రసేనుఁడు (గంధర్వుఁడు), వ్యాఘ్రుఁడు (రాక్షసుఁడు), ఆసారణుఁడు(యక్షుఁడు), భృగువు (ఋషి), అనుమ్లోచ (అప్సరస), శంఖపాలుఁడు (నాగుఁడు) నను వీరు భాద్రపదమాసమును జరుపుదురు. పూష (సూర్యుఁడు), ధనంజయుఁడు (నాగుఁడు), వాతుఁడు (రాక్షసుఁడు), సుషేణుఁడు (గంధర్వుఁడు), సురుచి (యక్షుఁడు)

ఘృతాచి (అప్సరస), గౌతముఁడు (ఋషి), * మాఘమాస మును గడపుదురు. పర్జన్యుఁడు (సూర్యుఁడు), ఋతువర్చనుఁడు (రాక్షసుఁడు), భరద్వాజుఁడు (ఋషి), సేనజిత్తు (అప్సరస), విశ్వుఁడు (గంధర్వుఁడు), ఐరావతుఁడు, (నాగుఁడు) నను వీరు ఫాల్గునమాసమును గడపుదురు. అంశుమంతుఁడు (సూర్యుఁడు), కశ్యపుఁడు (ఋషి), తార్క్ష్యుఁడు (యక్షుఁడు), ఋతుసేనుఁడు (గంధర్వుఁడు), ఊర్వశి (అప్సరస), విద్యుచ్ఛత్రువు (రాక్షసుఁడు), మహాశంఖుఁడు (నాగుఁడు) నను వీరు మార్గశీర్షమును జరుపుచున్నారు. భగుఁడు (సూర్యుఁడు), స్ఫూర్జుఁడు (రాక్షసుఁడు), అరిష్టనేమి (గంధర్వుఁడు), ఊర్ణుఁడు (యక్షుఁడు), ఆయువు (ఋషి), కర్కోటకుఁడు (నాగుఁడు), పూర్వచిత్తి (అప్సరస) యనెడు వీరు పుష్యమాసమును జరుపుదురు. త్వష్ట (సూర్యుఁడు), జమదగ్ని (ఋషి), కంబలాశ్వుఁడు (నాగుఁడు), తిలోత్తమ (అప్సరస), బ్రహ్మోపేతుఁడు (రాక్షసుఁడు), ఋతజిత్తు(యక్షుఁడు), ధృతరాష్ట్రుఁడు (గంధర్వుఁడు), ఇషంభరుఁడు నను వీరాశ్వయుజమాసమును నిర్వహించుచుందురు. విష్ణువు (సూర్యుఁడు), అశ్వతరుఁడు (నాగుఁడు) రంభ (అప్సరస), సూర్యవర్చనుఁడు (గంధర్వుఁడు), సత్యజిత్తు (యక్షుఁడు),పిశ్వామిత్రుఁడు (ఋషి), మఖాపేతుఁడు (రాక్షసుఁడు) నను వీరు కార్తికమాసమును గడపుదురు. భగవంతుఁడు నాదిత్యశరీర

---

* ఇచట భాద్రపదమునకు పిమ్మట ఆశ్వయుజ కార్తికమాసములనుజెప్ప వలసియుండఁగా మాఘమును జెప్పుట కూర్మపురాణోక్తమగు ఆదిత్య క్రమమును అనుసరించుటచేత నని తెలియుచున్నది. లేక క్రమవిపర్యయమేకాఁ జెప్పఁబడినది గాన యథాక్రమముగా యోజించుకొనవచ్చును.

కుండు నయిన విష్ణుని యీవిభూతులును, సంధ్యలయందు తమ్ము స్మరించునట్టి మనుష్యులకుఁ గల పాపము ప్రతిదినమును నపహరించుచున్నవి. ఆదిత్యరూపుండయిన యీ దేవుఁడు పండ్రెండుమాసములందును తా నీ*యూర్జురతోఁ గూడి సంచరించుచు నీ జనమున కిందును బరమందును శుభంబగు గతిని గూర్చుచున్నాఁడు. ఋషులీ యాదిత్యుని సామములచేతను యజుస్సులచేతను ఋక్కులచేతను సూర్యప్రకాశకములగు లింగములచేతను స్తుతించుచుందురు. గంధర్వులతనిఁగూర్చి పాడుచుందురు. అప్సరసలతనిమ్రోల నాడుచుందురు. నాగులాతని రథమును దృఢముగాఁ గట్టుదురు. యక్షులు రథమును ముందుదోలుదురు. బలశాలులయిన రాక్షసులు వెనుకఁ ప్రక్కనుండి రథమును నడపింతురు. నిర్మలులగు బ్రహ్మర్షులయిన వాలఖిల్యులు పదివేవు రతనిముంగల నభిముఖులై పోవుచు స్తుతులచేత నావిభుని స్తుతించుచుందురు. ఇట్లాద్యంతరహితుండును నీశ్వరుఁడు నగు భగవంతుఁడు హరి ప్రతికల్పమందును బ్రకృతిపురుషశరీరకుండగు తన్ను ద్వాదశగణరూపముగా విభజించికొని లోకములను దమ తమ కర్మములయందుఁ బ్రవర్తింపఁ జేయు చుండును. ఇది పదునొకండవయధ్యాయము.

---

* ఒక్కొక్కగణమందును ఆదిత్యుఁడు తప్ప తక్కిన వారార్జురు. ఆదిత్యునితోడ ఏడుగురు. కాఁబట్టి ఆయుగురని యిట చెప్పఁబడినది. ఒక్కొక్క గణమందును ఆదిత్యుని చెప్పుట నా మభేదమును బట్టికాని ప్రాధాన్యవివక్షచేతఁగాని, లేక విగ్రహాంతరముతో స్వాత్మభూతుఁడగు భగవంతు నుపాసించునని తెలుపుటకుఁ గాని యుండవచ్చును. వాలఖిల్యగణముతోఁ గూర్చి యేడ్గురనియుఁ జెప్పవచ్చును.

ఈ పురాణమందలి విషయానుక్రమణిక యు భాగవతమాహాత్మ్యము మొదలగునవియుం.

సూతుఁడు——సిద్ధరూపధర్మ్ముం డగు కృష్ణునకును ధర్మ్మప్రవర్త్తకుండయిన వ్యాసునకునుఁ జతుర్ముఖబ్రహ్మకును నారద శుకాదిబ్రాహ్మణులకును నవిచ్ఛిన్నమగు నుపదేశపరంపరచేఁ బ్రాప్తమయిన ధర్మ్ములను నీగ్రంథమునందు బ్రతిపాద్యము లయినవానిని సంగ్రహమునఁ జెప్పుచున్నాను. విప్రులారా! మీరు నన్నడుగఁగా మనుష్యులకు మనుష్యత్వమం దుచిత మైనదిఁయు, నద్భుత మయినదియు నగు విష్ణునిచరిత్రము మీకుఁ జెప్పఁబడినది. ఇందు సమస్తపాపహరుండును నారాయణుఁడును హృషీకేశుండును భగవంతుఁడును సాత్వతాంపతి యు నగు సాక్షోద్ధరియె కీర్తింపఁబడుచున్నాఁడు. అగ్గఁడు వేదాంతరవాస్యంబును జగత్తునకు సృష్టిసంహారకారణంబు నగు పరబ్రహ్మము. సాధువులగు మీరు నన్ను భాగవతమును నుపాఖ్యానమును, జ్ఞానవిజ్ఞానము లను భక్తియోగమును, దాని కంగమయిన వైరాగ్యమును, బరీక్షిత్తు కథయు, నారదవృత్తాంతమును, రాజర్షి యగు పరీక్షిత్తు బ్రాహ్మణశాపమునఁ బ్రాయోపవేశమొందుటయు, బ్రాహ్మణసత్తముఁ డగు శుకునకుఁ బరీక్షిత్తుతో సంవాదమును, పరీక్షిత్తు యోగధారణముచేతఁ బ్రాణములువిడుచుటయు, బ్రహ్మకును నారదునకును జరిగినసంవాదమును, అవతారములను వర్ణించుటయు, సృష్టికిఁ బూర్వము ప్రాకృతమగు మహదాదితత్త్వసృష్టియు, ఉద్ధవునకును విదురునకును సంవాదమును, విదురమైత్రేయసంవాదమును,

భాగవతపురాణప్రశ్నమును, భగవంతుఁడు ప్రలయమందుండు నునికియు, ప్రకృతిగుణక్షోభరూప మగు ప్రాకృతిక ప్రలయ మును, వైకృతికము లగు మహదహంకార భూతపంచకముల సృష్టియు, ఆవైకృతికములనుండి బ్రహ్మాండమును సృజింపఁబడు టయు దానివలన నుండి బ్రహ్మ పుట్టుటయు. పరమాణువు మొ దలుగా సంవత్సరము వఱకు స్థూల సూక్ష్మరూపమున నున్న కాలము గతియును, వ్యష్టిభూతముల యుత్పత్తియు, సము ద్రమునుండి భూమిని బయికెత్తుటయు, దానివలన హిరణ్యా క్షుని వధమును, దేవతిర్యగధోలోకముల సృష్టియు, సగము స్త్రీలు గాను, సగము పురుషులుగాను, సృష్టియుఁ జెప్పఁ బడెను. ఆ సృష్టినలన స్వాయంభువ మనువును నతని పత్నియు స్త్రీ వర్గమునందు మొట్టమొదటిదయిన రూపును నుత్తమురాలు నయినశతరూపయుఁ గలిగిరి. కర్దమ ప్రజా పతి ధర్మపత్నులసంతానమును, మహత్తుం డయినభగవం తుని కపిలుని యవతారమును, దేవహూతికి బుద్ధిమంతుఁ డగు కపిలునితోడి సంవాదమును, తొమ్మిది బ్రహ్మల యుత్పత్తి యు, దక్షయజ్ఞ వినాశమును, ధ్రువుని చరిత్రమును, పృథుని చరిత్రమును, బార్హిషదుపాఖ్యానకథయును, నారదునిసంవాదమును, ప్రియవ్రతునివృత్తాంతమును, నాభిచరితయును, ఋషభునికొడు కయిన భరతుని చరిత్రమును, ద్వీపములు సముద్రములు మొ దలగువానియు వర్షములయు నదులయు నుపవర్ణనమును, జ్యోతి శ్చక్రము నునికియు, పాతాలనరకముల స్థితియుఁ, జెప్పఁబడి యున్నవి. మఱియుఁ బ్రచేతసులవలన దక్షుండు పుట్టుటయు, నతని పుత్రికలసంస్థితియు, వారలవలన దేవతలును ననురులును

నగులును దిర్యక్కులును నాగులును ఖగములును మొదలగునవి పుట్టుటయును, వృత్రాసురుని జన్మమును మరణమును (సప్తమమున) దితిపుత్రులగు హిరణ్యాక్షహిరణ్యకశిపుల జననమరణములును, మహాత్ముండయిన దైత్యవల్లభుండగు ప్రహ్లాదునిచరిత్రమును (అష్టమమున) మన్వంతరముల చరిత్రమును, గజేంద్రునిమోక్షణమును, మన్వంతరములందు విష్ణువు హయగ్రీవాదులుగా నవతరించుటయు, ఆజగత్పతి - కూర్మావతారమును మత్స్యావతారమును నరసింహావతారమును వామనావతారమును సమృతము కొఱకు దేవతలు పాలసముద్రమును జిలుకుటయును, దేవాసురమహా యుద్ధమును, (నవమమున) రాజవంశానుకీర్తనమును, ఇక్ష్వాకుని జన్మమును, నతని వంశమందు మహాత్ముండగు నుద్యుమ్నుడు పుట్టుటయును, ఇలోపాఖ్యానమును, దారోపాఖ్యానమును, సూర్యవంశానుకథనమును, దాని వలనఁ బుట్టిన శశాదుఁడు మొదలగు రాజుల కథలును, సుకన్యావృత్తాంతమును, శర్యాతిచరిత్రయు, కకుత్థ్సునిచరితమును, ఖట్వాంగుని చరిత్రమును, మాంధాతృ వృత్తాంతమును, సౌభరిచరితమును, సగరునికథయు, క్రోసలేంద్రుండగు రామునిపాపహరంబగు చరిత్రంబును, నిమియంగముల పరిత్యాగమును, జనకులు పుట్టుటయును, భార్గవోత్తముఁడగు పరశురాముఁడు భూమియందు క్షత్రియులే లేకుండునట్లు చేయుటయు, సోమవంశమందైలుని కథయు, నహుషుని కొఱకు యయాతి చరిత్రమును, మమ్యంతుని పుత్రుఁడయిన భరతుని వృత్తాంతమును, శంతనుని యతని పుత్రునివృత్తాంతములును, యయాతిజ్యేష్ఠపుత్రుఁడయినయదువు వంశమును గీర్తింపఁబడినవి. ఆ యదువంశమున నుండి

యే జగదీశ్వరుండగు భగవంతుఁ డవతరించెను. అతఁ డందుఁ గృష్ణుం డనుపేర వసుదేవుని గృహమం దవతరించి పిదపఁ గోకులమందుఁ బెరిఁగెను. ఆయసుర ద్వేషియగు కృష్ణునియుదార కర్మములు కీర్తింపఁబడినవి. అవి యేవన ఆబిడ్డఁడుపూతనపాలును దానిప్రాణములతోఁగుడుచుటయు, శకటాసురునివిఱుచుటయుఁ, దృణావర్తుని నజ్జుగా వించుటయు, బకవత్సాదులను జంపుటయు, అఘాసురుని ప్రాణములుడీయుటయు, చతుర్ముఖునకుఁ దన మాయను జూపుటయును, బలాసురుని వానితోడఁబుట్టు వయిన ధేనుకాసురునిని వధించుటయు, ప్రలంభాసురునిఁ జంపుటయు, గోపకులను దావాగ్ని చుట్టుకొనఁగా రక్షించుటయు, కాళియమహాసర్పమును నడంచుటయు, వరుణుని వలన నుండి నందుని విడిచిపుచ్చుటయు, గోపకన్యల వ్రత చర్యయును, ఆవ్రతమందు గొల్లలు కృష్ణుని స్తుతించుటయు, యజ్ఞపత్నుల ననుగ్రహించుటయు, వారిపతులగు విప్రుల యనుతాపమును, ఇంద్రునిఁ గ్రిందుపఱచుటకై గోవులను రక్షింప గోవర్ధనమునెత్తుటయు, కృష్ణునికిఁ బూజయు నభిషేక మును, కృష్ణుండు శరద్రాత్రులందు గోపికలతోఁ గ్రీడించుటయు, దుర్బుద్ధియగు శంఖచూడుని వధమును, అరిష్టునిని కేశినిని సంహరించుటయు, అక్రూరునిరాకయు, రామకృష్ణులు మథురకుఁ బయనమగుటయు, గోపస్త్రీల విలాపమును, మథురను జూచు టయు, గజుఁడు ముష్టికుఁడు చాణూరుడు కంసుఁడు మొదల గువారిని వధించుటయు, గురువగు సాందీపని మృతపుత్రులను మరలఁదెచ్చుటయు, కృష్ణుండు మథురయందు నుద్ధవునిని బల రామునింగూడి వసించుచు యదువులకుఁ బ్రియము గావించు

టయు, జరాసంధుఁడు తెచ్చిన సైన్యములను బహుతరముగా వధించుటయు, కాలయవనునిఁ జంపుటయు, గుహస్థలీయందు నివేశించుటయు, దేవలోకమునుండి పారిజాతమును సుధర్మా సభనుగొని తెచ్చుటయు, శత్రువులను యుద్ధమునఁ గలంచి హరి రుక్మిణీదేవిని గొనిపోవుటయు, హరిబాణాసురయుద్ధమందు విజృంభించుటయు, బాణాసురుని భుజములను ద్రుంచుటయు, ప్రాగ్జ్యోతిషపతియగు నరకాసురునిఁజంపి కన్యలను దెచ్చుటయు, శిశుపాలుఁడు, పౌండ్రకుఁడు, సాల్వుఁడు, దుర్మతి యగు దంతవక్త్రుఁడు, శంబరుఁడు, ద్వివిదుఁడు, పీఠుఁడు, మురాసురుఁడు, పంచజనుఁడు మొదలగువారిల మాహాత్మ్యమును వీరినివధించుటయు, కాశిని దహించుటయు, పాండవులను నిమిత్తముగాఁ జేసికొని భూభారమును దింపుటయు, (ఏకాదశమున) బ్రాహ్మణశాపమునెపమునఁ దనకులమును సంహరించుటయు, వానుదేవునకును నుద్ధవునకును జరిగిన యద్భుత సంవాదమును, అందు వర్ణాశ్రమధర్మనిర్ణయమును గావించునాత్మవిద్యయంతయుఁ జెప్పఁబడుటయు, నంత నాత్మయోగప్రభావముచేత మర్త్యలోకమును బరిత్యజించుటయును, (ద్వాదశమునఁదు) యుగముల లక్షణములును వానియందలి వృత్తులును, కలియందు మనుష్యులకుఁ గలుగు నుపద్రవమును, ప్రాకృతికమునై నిత్తికము ఆత్యంతికము నిత్యమనెడి నాలుగు విధములయిన ప్రలయములును, ప్రాకృతికి నిత్యనై నిత్తికి యని మూఁడువిధములయిన యుత్పత్తియు, బుద్ధిమంతుఁడయిన రాజర్షి పరీక్షిత్తు దేహత్యాగమును, వేదాదిశాఖల విభాగమును మార్కండేయమహర్షి చరిత్రమును, మహాపురుషుని, యంగోపాంగముల విన్యాసమును, జగదాత్మకుం

డయిన సూర్యుని గణవిభాగమును జెప్పఁబడినవి. బ్రాహ్మణ శ్రేష్ఠులారా! మీరు నన్నేమి యడిగితిరో దానినంతయుఁ జెప్పి తిని. ఈపురాణమందు హరి లీలారూపములయిన యవతార కర్మములు సంపూర్ణముగాఁ గీర్తింపఁబడినవి. పతితుఁడుగాని, స్ఖలితుఁడుగాని, యార్తుఁడుగాని, పరవశుఁడయిననుగాని 'హర యేనమ' యనిచెప్పినను జెప్పఁగా విన్ననుసమస్తపాతకముల నుండి విముక్తుఁడగుచున్నాఁడు. భగవంతుని ప్రభావమును విని యతనిని గీర్తించుచుండినచో సూర్యుఁడు చీఁకటిని, బెనుగాడ్పు నుబ్బును దూలించునట్లు,లామనుష్యుల చిత్తమును బ్రవేశించి వారలవ్యసనమునెల్ల విదిల్చివైచును. ఆధ్రోక్షజుం డగు భగవంతుఁ డెందుఁ జెప్పఁబడఁడో యాముచ్చటలు, వట్టి పొల్లు మాటలు. అవి దోషావహములయిన యుబుసులు. భగవద్గుణము లెందుఁ బ్రకాశించుచుండునో యాకథాప్రసంగమే సత్యము. అదియే మంగళము. అదియె పుణ్యావహము. ఎచ్చట నుత్తమశ్లోకుం డయినభగవంతునియశస్సు వర్ణింపఁ బడుచున్నదో యదియె మీఁదు మిక్కిలి యింపయినది. రుచికర మయినది. అదియె మనస్సున కెప్పుడును మిక్కిలి యానందకర మయినది. అదియె మనుష్యులకు శోకసముద్రము నింకింపఁ జేయునది. ఏవాక్కునందు, అది చిత్రపదములతోఁగూడి యున్నను జగత్పవిత్రమయిన హరి యశము చెప్పఁబడకుండునో యదికాకులవంటి కామకులు రమించుచోటుగాని హంసలవంటి జ్ఞానులు గొలుచుపట్టుగాదు. ఏలనఁగా నేప్రబంధమం దచ్యుతుఁడు ప్రతిపాద్యుఁడగునో యందే నిర్మలాంతఃకరణులయిన సాధువులు రమించుచుందురు. ఏవచన ప్రయోగము ప్రతిశ్లోక

మును నబద్ధముగా నుండినను ననంతుఁడగు భగవంతుని యశస్సునకుఁ బ్రకాశకములయిన నామములు వర్ణించు చుండునో యట్టి వచనప్రయోగమే జనసమూహముల పాపము లను రూపుమాపునది. కాఁబట్టియే, సాధుప్రలట్టి వచనప్రయోగ మును నొకరు చెప్పుచుండఁగా వినుచుందురు; వినువారుం డఁగాఁ జెప్పుచుందురు; ఆ యిరువురును లేనియెడఁ దమంతటఁ బాడుచుందురు. సకల కర్మబంధములను విధ్వంసము చేయు నదై ప్రకృతి సంబంధములను దూలించుచు నిర్మలమైయున్న జ్ఞానముగూడ, నచ్యుతగుణాను శ్రవణాదుల నుద్దేశింప కుండిన యెడలఁ బ్రచ్యుతి నొందఁగూడును గాన యంతగా శోభింపదు. ఇట్టిజ్ఞానయోగమే శోభింపఁదనఁగా నిఁక నీశ్వరునియందర్పింపఁ బడినదై, కావునఁ నే యనుష్ఠింపఁబడునప్పుడు పతనశంకచే సదా భయావహమై యుండు కర్మయోగము ప్రకాశించుట యెక్క-డిది? వేయేల! ఫలాభిసంధి లేనందున సర్వోత్తమమైయున్న కర్మముగూడ నెట్లు ప్రకాశింపఁగలదు? కీర్తికొఱకును సంప దకొఱకును వర్ణాశ్రమాచారములందును దపస్సునందును సభ్య యినాదులందును నిష్ఠ గలిగియున్నను దానివలనఁ గలిగెడి యాకీర్తిసంపదలు సతములుగాక క్షీణించునవి. కాఁబట్టి యా నిష్ఠయంతయు వట్టి కష్టపడుటయె యగును; సఫలము గాదు. శ్రీధరుని గుణానువాదశ్రవణాదరాదులచేత నతని పాదపద్మ ములయందు మఱపు లేకుండినచో యా వర్ణాశ్రమాదుల యందలి నిష్ఠ సఫలమగును కృష్ణపదార విందములయందు మఱపు లేకుండుట దుఃఖనిమిత్తములయిన దురితములను క్షీణింపఁ జేయుచున్నది. రాగాద్యకలుషితం బగు శాంతిని

బెంచుచున్నది. సత్త్వము రజస్తమస్సులచేఁ గీడ్పడకుండు నట్లు శుద్ధముగావించు చున్నది. ప్రేమయుక్తంబగుటంజేసి పరమంబయిన శక్తినిని భగవంతుని స్వరూపజ్ఞానమును, నతని ప్రకారజ్ఞానమును భగవద్వ్యతిరిక్తము లయిన విషయములందు విరక్తియును గలిగించుచున్నది. బ్రాహ్మణోత్తములారా! మీరు మహాభాగ్యవంతులు. ఏలందురా ? మీరు బాహ్యవిషయములందుఁ జింతలేక. సమస్తమున కంతరాత్మభూతుండును, దన తేజంబున వెలుంగుచుండు వాఁడును, దన కారాధింపఁ దగిన మఱియొక్క దేవుఁడు లేనివాఁడును, సర్వనియంతయు నయిన నారాయణుని దదీయ గుణగ్రహణాదులచేత మనస్సునందు స్థిరముగాఁ జొనిపి భజించితిరి గదా! కనుక మీరు మహాధన్యులరు. రాజగు పరిక్షీతుని ప్రాయోపవేశమునందు సదస్సున మహాత్ములగు ఋషులు వినుచుండఁగాఁ, బరమఋషియగు శ్రీశుకుని ముఖమునుండి మున్నువిన్న యాత్మతత్త్వప్రకాశక మైన పురాణమును, మీరు మరల స్మరింపఁజేసితిరి గాన నేను గృతార్థుఁడ నయితిని. ఎవ్వనియపరిమితములయిన చేష్టితములను మీఁదు మిక్కిలి చెప్పుచుండఁదగునో యావిష్ణుని వాసుదేవుని మాహాత్మ్యమును బ్రకాశింపఁజేయునదియును గీర్తించువారల సమస్తములయిన యశుభములను వినాశము చేయునదియును నయిన యీ పురాణమును మీకుఁ జెప్పఁబడినది. ఎవ్వఁడు బుద్ధి పరాయత్తము గానీక దీనిని జాముగాని ఋణముసేపుగాని నిత్యమితరులకు వినిపించునో లేక శ్రద్ధతోడఁ దానే వినుచుండునో వాఁడు తన్నుఁ దప్పక పరిశుద్ధునిఁ జేసికొనుచున్నాఁడు. దీనిని ద్వాదశియందును

నేకాగ్రత యందును విన్నవాఁ డాయుష్మంతుఁ డగును. దీనిని బరిశుద్ధుఁడై యితరమునందు మనస్సు నుంపక పఠించువాఁడు పాతకుఁడైనను బవిత్రుఁడగును. పుష్కరమందును మథుర యందును ద్వారకయందును సమాహితచిత్తుఁడై యుపవసించి యీ పురాణసంహితను బఠించి సంసారభయమునుండి విముక్తుఁడగును. ఈ పురాణమందుఁ గీర్తింపఁబడియున్న దేవతలును మునులునుసిద్ధులును ఋషులును బితరులును రాజులును దీనిని ముచ్చటించువారికిని వినువారికినిగోరిన కామములొసంగుదురు. ఋగ్యజుస్సామములను బ్రాహ్మణుఁ డధ్యయనముచేసి పడయు నట్టి ఫలమును దేనెయుఁ బాలును నేయును వెల్లువలుగా బాఁ అన్నమిడినట్టిఫలమును దీనిని జదువఁగా సిద్ధించుచున్నది, ద్విజుఁ డీపురాణసంహితను జదివి భగవంతునకుఁ బ్రతిపాదింపఁబడిన పరమపదమును బొందుచున్నాఁడు. దీనిని బ్రాహ్మణుఁడు చదివి ప్రజ్ఞను బొందును. రాజు చదివి సముద్ర పర్యంతమైన భూమండలమును బడయును. వైశ్యుఁడుచదివి నిధులకుఁ బతియగును. శూద్రుఁడు చదివి పాతకమునుండి పరిశుద్ధుఁ డగును. కలికాలదోషసమూహములను దూలించెడి యీ యఖిలేశ్వరుండు హరి యితరములగు రాజసాధి ప్రబంధములయందు మాటి మాటికిఁ గీర్తింపఁబడుట లేదు. ఇంద న్నగో, శేషమూర్తియైన యీ భగవంతుఁడు ప్రతిపదమునందు నాయీ కథా ప్రసంగములచేతఁ బ్రతిపాదింపఁబడి యుండును. అజుండును ననంతుఁడును నాత్మతత్త్వంబగు వాఁడును జగదుదయస్థితి నాశములకు హేతువులయిన రజస్సు మొదలగు శక్తులు గలవాఁడును, దేవలోక పతులగు బ్రహ్మ

రుద్రేంద్రాదులచే నెప్పుడు నుడుగక స్తోత్రములు చేయఁబడు చుండువాఁడునునయిన యచ్యుతునకు మ్రొక్కెదను. పయిపయిని వృద్ధినొందుచున్న కాలప్రకృతి మహదహంకార పంచభూతినుు లనెడు తొమ్మిదిశక్తులచేఁ దనయందే స్థావరజంగమములను గల్పించుకొని వానికెల్ల నునికిపట్టయి కేవలజ్ఞానరూపం బగు తేజస్సే స్వరూపముగాఁ గలిగియున్న దేవతాశ్రేష్ఠునకు సనాతనునకు భగవంతునకు నమస్కరించుచున్నాను. ఎవ్వనిని బ్రహ్మయు వరుణుఁడును నింద్రుఁడును రుద్రుఁడును దక్కిన దేవతలును దివ్యస్తవములచే స్తుతించుచుందురో, సామగులు సాంగములతోను బదక్రమములతోను నుపనిషత్తులతోను గూడిన వేదములచే నెవ్వని గానము సేయుచుందురో, యెవ్వనిని యోగులు ధ్యానముచేత మనస్సును నిశ్చయముగా నందు నిలిపి యోగవిశుద్ధంబగు మనంబున దర్శింతురో, సురాసుర సమూహములును నెవ్వని మహిమకొలఁదిని నింతయని యెఱుఁగరో, యట్టిదేవునకు నమస్కారము. అనుపమైన మందరగిరి వీపునందు గిరగిరఁ దిరుగుచుండునపుడు దాని వెనుబండల మొనలు గ్రోకికొనఁగా వీపుతీట యుడిగి హాయిగాఁ గూర్చు స్నట్టికూర్మరూపుండయిన యాభగవంతుఁడూర్పులువిడిచెను. ఆ యూర్పులను వాసనావశమున గొంచె మనువర్తించుచుండుటచే సముద్రము జలము లింతవఱకును నిటునటు రాకపోకలు సముద్రక్షోభమనెడి నెపమునఁ జేయుచు నిప్పటికిని నిమ్మళము నొందకయున్నవి. అట్టి యాయూర్పులు నుమ్ము రక్షించుఁగాక.

సూతుఁడు—పురాణము లఱవంథసంఖ్యలను సమాహారమును, ఈ పురాణమునకుఁ బ్రథానమగు వాచ్యమును బ్రయోజన

మును దీనిదానమును, దానము యొక్కయుఁ బఠనాదుల యొక్కయు మాహాత్మ్యమును వినుము. బ్రాహ్మపురాణము పది వేలును, పాద్మ, మేబదియైదువేలును, వైష్ణవ మిరువదిమూఁడు వేలు. శైవ మిరువదినాలుగువేలు. శ్రీభాగవతము పదునెని మిదివేలు. నారద మిరువదియైదువేలు. మార్కండేయము తొమ్మిదివేలు. ఆగ్నేయము పదియేనువేల నన్నూఱు. భవిష్య మిరువదినాలుగువేల యే నూఱు. బ్రహ్మకైవర్తము పదివేల యెనమన్నూఱు. లైంగము పదునొకండువేలు. వారాహ మిరు వదినాలుగువేలును. స్కాందమును బదియొక్కవేయిన్నూఱు. వామనము పదివేలు. కూర్మము పదియేడు వేలు. మాత్స్యము పదునాలుగువేలు. గారుడము పందొమ్మిదివేలు. బ్రహ్మాండము పండ్రెండువేలు. ఇట్లు పురాణసమూహము నాలుగులక్షలగ్రంథ పరిమితి గలది యని యుదాహరింపఁ బడియున్నది. వాని యం దీభాగవతము పదునెనిమిదివే లని చెప్పఁబడుచున్నది. దీనిని దొల్లి భగవంతుఁడు తన నాభికమలమం దున్నబ్రహ్మ సంసారభీతుఁడై యుండఁగాఁ గారుణ్యమున నతనికి నుపదేశిం చెను. ఇం దాడమధ్యాంతములయందు నానావిధము లయిన యాఖ్యానములు కలిసియున్నను, నంతటను హరిలీలా కథా సమూహ మనెడు నమృతమె నిండి సత్పురుషులను దేవ తలును నందింపఁజేయుచుండును.సమస్తవేదాంతములసారంబై బ్రహ్మోత్తమనెడి యొకవస్తు వింపుఁ బ్రతిపాద్యమగువాచ్యము. అది యద్వితీయమైనది. కైవల్యము దానికిలోనై దానివలనఁ గలుగునది. ఆకైవల్యమే దీనికిఁ బ్రయోజనము. ఎవఁడు, తన యంతరాత్మానుసంధానము చిత్తమెల్ల నిండియుండుట

వలన భగవంతునకు వ్యతిరిక్తము లయినసంగము లెల్లను నిరసించి యజితుండగు భగవంతుని రమణీయలీలలచేతఁ జిత్తమాకర్షింపఁబడఁగా నతని స్వరూపరూపగుణవిభూతిప్రకాశకమును దత్త్వములకు దీపమువలెఁ బ్రకాశకము నయినయీపురాణమును గృపచేత రచించెనో సమస్తపాపములను దూలించునట్టియీవ్యాసపుత్రునకు శ్రీశుకునకు నమస్కరించిన వాఁడ నయితిని.

శ్రీ వేదవ్యాసాయ నమః

శ్రీ కృష్ణాయ పరబ్రహ్మణే నమః

శ్రీ రామచంద్రార్పణ మస్తు.

శ్రీమదాంధ్రవచనభాగవతము

సమాప్తము.

Printed at the Ananda Press, Madras—1924.